# TELUGU KAVAYALUGA ROOPONDINA SAMSKRUTHA NATAKALU - PARISEELANA

A Thesis submitted to the
University of Hyderabad in partial fulfillment of the
Degree of
Doctor of Philosophy
in
Telugu

By


**Satya Gayathri Janamanchi**
**Roll No. 09HTPH08**


Supervisor

**Prof. Remilla Venkata Ramakrishna Sastry**


Department of Telugu,
School of Humanities
University of Hyderabad
Hyderabad-500 046
**TELANGANA, INDIA**


June, 2018

# తెలుగు కావ్యాలుగా రూపొందిన సంస్కృత నాటకాలు - పరిశీలన

పిహెచ్.డి. పట్టాకోసం

హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధనా గ్రంథం


పరిశోధకుడు

**సత్య గాయత్రి జనమంచి**

**Roll No. 09HTPH08**

పర్యవేక్షణ

**ప్రొ. రేమిల్ల వెంకట రామకృష్ణశాస్త్రి**

**తెలుగుశాఖ**

మానవీయ శాస్త్ర విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500 046



జూన్, 2018

# DECLARATION

I, Satya Gayatri Janamanchi, hereby declare that this thesis entitled "TELUGU KAVYALUGA ROOPONDINA SAMSKRUTHA NATAKALU – PARISEELANA" submitted by me under the guidance and supervision of Prof. R.V.Rama Krishna Sastry is a bona fide research work and is free from plagiarism. I also declare that it has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodhganga/ INFLIBNET.

Date :
Place :

**Name : Satya Gayatri Janamanchi**

**Signature of Student :**

**Regd. No. : 09HTPH08**

# CERTIFICATE

This is to certify that the thesis entitled **"TELUGU KAVYALUGA ROOPONDINA SAMSKRUTHA NATAKALU - PARISEELANA"** submitted by **Satya Gayatri Janamanchi** bearing **Regd. No. 09HTPH08** in partial fulfillment of the requirements for the award of Doctor of Philosophy in Telugu is a bona fide work carried out by her under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications :**

1. Shatkarmayuktha - Chandramathi 2nd Chapter. (Bhava Veena, International Journal of Telugu Literary, Culture & Language Study, Issue No. 11 (3) November 2017, ISSN : 2456-4702 Vol.14, Rohini Towers, Brodipet, Guntur - 2).
2. Sri Sivabharatham _ Sivaji Dharmatatparata 5th Chapter, (Vyasa Ratnalu, First Edition, 2017, ISBN : 978-93- 87540-03-03, Roshan Publications, Visakhapatnam)

and

**B. Presented in the following Conferences / Seminars** (Topics Presented in the following Papers is discussed elaborately in the thesis)

1. Presentation on "Telugu Kavyamga Roopondina Samskrutha Natakam Tapathi Samvaranam" in National Seminar on "Classical Telugu Language Leterature" held at the Department of Telugu, Andhra University, Visakhapatnam on 29th and 30th April 2011.
2. Presentation on "Tallapaka Timmakka Subhadra Kalyanam - Desi" in National Seminar on "Desi in Telugu Literature - its various facets" held at the Department of Telugu, Univiersity of Hyderabad on 13th and 14th September 2012.

Further, the Student has passed the following courses towards fulfillment of the coursework requirement for Ph.D. has been exempted from doing coursework (Recommended by the Research Advisory Committe) on the basis of the following courses passed during her M.Phill Programme and the M.Phill Degree awarded to her.

Parts of this thesis have been.

| Course Code | Course Title | Credits | Pass / Fail |
|---|---|---|---|
| HT 600 | Research Methodology & Basics in Logic | 5.00 | Pass (A) |
| HT 601 | History of Telugu Research | 4.00 | Pass (A) |
| HT 602 | Studies in Specialised Area | 3.00 | Pass (A) |
| HT 603 | Broad Field | 4.00 | Pass (A) |
| HT 680 | Dissertation | 16.00 | Pass (A) |

Research Supervisor

Head of the Department,
Telugu

Dean,
School of Humanities

# విషయసూచిక

కృతజ్ఞతలు xii

సంకేతార్థసూచి xiv

ప్రవేశిక xv

**మొదటి అధ్యాయం**

**నాటక కావ్య లక్షణాలు - పరిచయం**

**1.0 నాటకము - అర్థ వివరణ** 1

1.1 నాటకం ఆవిర్భావం - వికాసాలు 1

1.2 నాటకం - నిర్వచనాలు 4

1.3 నాటకాలు - వర్గీకరణ 7

1.4 నాటక లక్షణాలు 8

1.5 నాటకం విశిష్టత 17

1.6 ప్రబంధం అర్థవివరణ 17

1.7 ప్రబంధ శబ్ద ప్రస్తావన 18

1.7.1 సంస్కృత సాహిత్యం - ప్రబంధ శబ్దం 18

1.7.2 తెలుగు సాహిత్యం - ప్రబంధశబ్దం 19

1.8 ప్రబంధ నిర్వచనాలు 21

1.8.1 ప్రబంధ కవులు నిర్వచనాలు 21

1.8.2 ఆధునిక పండిత విమర్శకుల అభిప్రాయాలు 22

1.9 ప్రబంధ లక్షణాలు 23

1.10 నాటక ప్రబంధాల్లో భేద సాదృశ్యాలు 25

1.11 తులనాత్మక విమర్శలో అనువాదాల పాత్ర 27

1.11.1. ఏక ప్రక్రియానువాదాలు 27

1.11.2 భిన్న ప్రక్రియానువాదములు 28

**2వ అధ్యాయం**

**చండకౌశికమ్ - హరిశ్చంద్రోపాఖ్యానము**

**నాటక కావ్యాల పరిశీలన**

**2.0 కవి పరిచయం** 29

2.1.0 ఇతివృత్త పరిచయం 30

2.1.1 నాటకంలో కల్పనలు 30

2.1.2 నాటకలో కల్పనల ఔచిత్యం 32
2.1.3 కావ్యంలో కల్పనలు 33
2.1.4 కావ్యంలో కల్పనల ఔచిత్యం 36
2.1.5 కావ్యనాటకాలు రెండింటిలో కల కల్పనల తేడాలు 39
**2.2 పాత్రపోషణ** 40
2.2.1 హరిశ్చంద్రుడు 40
2.2.2 చంద్రమతి 50
2.2.3 విశ్వామిత్రుడు 53
2.2.4 నక్షత్రకుడు (పాత్రచిత్రణ) 56
2.2.5 కాలకౌశికుడు (పాత్రచిత్రణ) 58
2.2.6 కలహకంఠి (పాత్రచిత్రణ)· 59
**2.3 కావ్యనాటకాలలో రస పరిశీలన** 61
2.3.1 శృంగార రసం 61
2.3.2 హాస్య రసం 64
2.3.2 కరుణరసం 66
2.3.4 రౌద్రరసం 68
2.3.5 వీరరసం 71
2.3.6 బీభత్స రసం 74
2.3.7 అద్భుతరసం 76
2.3.8 భక్తిరసం 78
2.3.9 వత్సలరసం 81
**2.4 వర్ణనలు** 82
2.4.1 కావ్యంలోని వర్ణనలు 83
2.4.1.1 అయోధ్యా నగర వర్ణన 84
2.4.1.2 సైనికుల వర్ణన 85
2.4.1.3 ఇంద్రుని సభా మండపం వర్ణన 86
2.4.1.4 మధుమాసం వర్ణన 86
2.4.1.5 సూర్యాస్తమయ వర్ణన 87
2.4.1.6 చంద్రోదయ వర్ణన 87
2.4.1.7 సూర్యోదయ వర్ణన 88
2.4.1.8 మాయలేడి వర్ణన 89

2.4.1.9 ఆశ్రమ వర్ణన 90
2.4.1.10 కొలను వర్ణన 91
2.4.1.11 మాతంగ కన్యల వర్ణన 91
2.4.1.12 దంత ఘాతకుడి వర్ణన 93
2.4.1.13 గంగానది వర్ణన 94
2.4.1.14 హరిశ్చంద్రుడి వర్ణన 95
2.4.1.15 చంద్రమతి వర్ణన 95
2.4.1.16 కాలకౌశికుడి వర్ణన 97
2.4.1.17 కలహకంఠి వర్ణన 98
2.4.1.18 వీరబాహుడి వర్ణన 99
2.4.1.19 వీరబాహుడి గృహ వర్ణన 100
2.4.1.20 శ్మశానవర్ణన 101
2.4.2 నాటకంలో వర్ణనలు 101
2.4.2.1 హరిశ్చంద్రుడి వర్ణన 101
2.4.2.2 ఆశ్రమ వర్ణన 102
2.4.2.3 నిశివర్ణన 102
2.4.2.4 కాశీపట్టణ వర్ణన 103
2.4.2.5 శ్మశాన వర్ణన 104
2.4.2.6 సూర్యాస్తమయ వర్ణన 104

## 3వ అధ్యాయం

## తపతీ సంవరణం - తపతీ సంవరణోపాఖ్యానము

## నాటక కావ్యాల పరిశీలన పరిశీలన

**3.0 కవి పరిచయం** 106
3.1.0 ఇతివృత్త పరిచయం 107
3.1.1 నాటకంలో కల్పనలు 108
3.1.2 నాటకంలో కల్పనల ఔచిత్యం 110
3.1.3 కావ్యంలో కల్పనలు 111
3.1.4 కావ్యంలో కల్పనల ఔచిత్యం 112
3.1.5 కావ్య నాటకాలు రెండింటిలో ఉన్న కల్పనలు 112

**3.2 పాత్ర పోషణ** 113

3.2.1 సంవరుణుడు 113

3.2.2 తపతి 120

3.2.3 చిలుక (పాత్రచిత్రణ) 126

3.2.4 వశిష్ఠుడు 131

3.2.5 అరుంధతి 134

3.2.6 సూర్యుడు 135

3.2.7 విదూషకుడు (పాత్రచిత్రణ) 137

3.2.8 అమాత్యుడు (పాత్రచిత్రణ) 139

**3.3 కావ్య నాటకాలలో రస పరిశీలన** 140

3.3.1 శృంగారరసం 140

3.3.2 హాస్యరసం 149

3.3.3 కరుణ రసం 150

3.3.4 వీరరసం 152

3.3.5 బీభత్సరసం 153

3.3.6 అద్భుత రసం 154

3.3.7 వత్సల రసం 155

**3.4 వర్ణనలు** 156

3.4.1 కావ్యంలో వర్ణనలు 156

3.4.1.1 నగర వర్ణన 158

3.4.1.2 చాతుర్వర్ణ వర్ణన 159

3.4.1.3 ఉద్యానవన వర్ణన 160

3.4.1.4 తపతి వర్ణన 160

3.4.1.5 సంవరుణుడి వర్ణన 163

3.4.1.6 అంధకార వర్ణన 164

3.4.1.7 చంద్రోదయ వర్ణన 165

3.4.1.8 ఋతువర్ణన 168

3.4.1.9 జలక్రీడా వర్ణన 170

3.4.1.10 తపోవర్ణన 171

3.4.1.11 వివాహ వర్ణన 172

3.4.1.12 గిరి వర్ణన 175

3.4.2 నాటకంలో వర్ణనలు 176

3.4.2.1 సూర్యోదయం వర్ణన 176

3.4.2.2. కర్ణపూరం వర్ణన 177
3.4.2.3 దేవి కోప వర్ణన 177
3.4.2.4 దేవాలయ పరిసర ప్రాంత వర్ణన 178
3.4.2.5 వామనుని వర్ణన 178
3.4.2.6 స్ఫటిక సభా మండపం వర్ణన 178
3.4.2.7 ప్రకృతి వర్ణన 179

## 4వ అధ్యాయం
## సుభద్రా ధనంజయం - సుభద్రా కల్యాణము
## నాటక కావ్యాల పరిశీలన

**4.0 కవి పరిచయం** 181
4.1.0 ఇతివృత్త పరిచయం 182
4.1.1 నాటకంలో కల్పనలు 183
4.1.2 నాటకంలో కల్పనల ఔచిత్యం 184
4.1.3 కావ్యంలో కల్పనలు 185
4.1.4 కావ్యంలో కల్పనల ఔచిత్యం 186
**4.2 పాత్ర పోషణ** 189
4.2.1 అర్జునుడు 189
4.2.2 సుభద్ర 194
4.2.3 శ్రీకృష్ణుడు 202
4.2.4 రుక్మిణి 206
4.2.5 ద్రౌపది 210
4.2.6 ధర్మరాజు 212
4.2.7 బలరాముడు 214
4.2.8 విదూషకుడు (పాత్రచిత్రణ) 215
**4.3 కావ్య నాటకాలలో రస పరిశీలన** 219
4.3.1 శృంగార రసం 219
4.3.2 హాస్య రసం 225
4.3.3 కరుణ రసం 226
4.3.4 రౌద్రరసం 227
4.3.5 వీరరసం 229

4.3.6 అద్భుతరసం 230

4.3.7 భక్తిరసం 231

4.3.8 వత్సలరసం 232

**4.4 వర్ణనలు** 234

4.4.1 కావ్యంలో వర్ణనలు 234

4.4.1.1 తినుబండారాల వర్ణన 234

4.4.1.2 ప్రయాణ వర్ణన 234

4.4.1.3 సుభద్ర వర్ణన 235

4.4.1.4 బొమ్మలపెండ్లి వర్ణన 235

4.4.1.5 పుష్పాల వర్ణన 236

4.4.1.6 ఆభరణాల వర్ణన 236

4.4.1.7 అర్జునుడి వర్ణన 237

4.4.1.8 రుక్మిణి వర్ణన 239

4.4.1.9 వధూవరుల అలంకరణ వర్ణన 239

4.4.1.10 శయ్యాగృహ వర్ణన 240

4.4.1.11 తాంబూల వర్ణన 241

4.4.2 నాటకంలో వర్ణనలు 241

4.4.2.1 అర్జునుడి వర్ణన 241

4.4.2.2 ఆశ్రమ ప్రాంగణ వర్ణన 242

4.4.2.3 సుభద్ర వర్ణన 243

4.4.2.4 సూర్యాస్తమయ వర్ణన 243

4.4.2.5 వసంత ఋతువు వర్ణన 244

4.4.2.6 ఉద్యానవన వర్ణన 244

4.4.2.7 సూర్యుడి తీవ్రత వర్ణన 245

4.4.2.8 సుభద్ర అలంకరణ వర్ణన 245

4.4.2.9 సుభద్ర సారథ్యం వర్ణన 246

4.4.2.10 పట్టణ అలంకరణ వర్ణన 247

## 5వ అధ్యాయం
## ఛత్రపతి సామ్రాజ్యమ్ - శ్రీ శివభారతము
## నాటక కావ్యాల పరిశీలన


**5.0 కవి పరిచయం** 248

5.1.0 ఇతివృత్త పరిచయం 250

5.1.1 నాటకంలో సంఘటనలు 254

5.1.2 నాటకంలో సంఘటనల ఔచిత్యం 254

5.1.3 కావ్యంలో సంఘటనలు 255

5.1.4 కావ్యంలో సంఘటనల ఔచిత్యం 256

5.1.5 కావ్య నాటకాలు రెండింటిలోనూ ఉన్న సంఘటనల తేడాలు 258

**5.2 పాత్ర పోషణ** 259

5.2.1 శివాజీ 259

5.2.2 జీజియ 265

5.2.3 దాదోజీ 268

5.2.4 సయీబాయి 271

5.2.5 బాజీ ప్రభువు 273

5.2.6 సమర్థరామదాస స్వామి 275

5.2.7 షాజీ 276

5.2.8 తానాజీ 277

**5.3 కావ్య నాటకాలలో రసపరిశీలన** 278

5.3.1 శృంగార రసం 278

5.3.2 కరుణ రసం 280

5.3.3 రౌద్రరసం 285

5.3.4 వీరరసం 286

5.3.5 బీభత్స రసం 293

5.3.6 అద్భుతరసం 294

5.3.7 శాంతరసము 295

5.3.8 వత్సల రసం 297

5.3.9 భక్తిరసం 298

**5.4 వర్ణనలు :** 300
5.4.1 కావ్యంలో వర్ణనలు 300
5.4.1.1. షాజీ అహ్మద్ నగరాన్ని విడిచి వెళ్ళేటప్పటి వర్ణన 300
5.4.1.2 షాజీ యుద్ధానికి వెళ్ళేటప్పటి వర్ణన 301
5.4.1.3 మహారాష్ట్రుల వర్ణన 302
5.4.1.4 పూనా పట్టణ వర్ణన 302
5.1.1.5 సూర్యోదయ వర్ణన 303
5.4.1.6 సంధి భవనం వర్ణన 303
5.4.1.7 శివాజీ ఖాన్‌ను వధించడానికి వెళ్ళేటప్పటి వర్ణన 304
5.4.1.8 వర్షాకాల వర్ణన 305
5.4.1.9 ఔరంగజేబు దర్బార్‌కి వెళ్ళేటప్పటి శివాజీ వర్ణన 305
5.4.2 నాటకంలో వర్ణనలు 306
5.4.2.1 శివాజీ వర్ణన 306
5.4.2.2 విశాలగడ వర్ణన 307
5.4.2.3 వర్ష ఋతు వర్ణన 307
5.4.2.4 పురంధర దుర్గ వర్ణన 308
5.4.2.5 రాజగడ దుర్గ వర్ణన 308
5.4.2.6 పట్టాభిషేక మహోత్సవం నాటి శివాజీ వర్ణన 309

**సింహావలోకనం** 310

**ఉపయుక్త గ్రంథ సూచిక** 321

# కృతజ్ఞతలు (Acknowledgements)

"తెలుగు కావ్యాలుగా రూపొందిన సంస్కృత నాటకాలు" అనే అంశంపై పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన హైదరాబాదు విశ్వవిద్యాలయ అధికారులకు,

పరిశోధనాంశానికి సంబంధించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చి ఎన్నో అంశాలను ఓర్పుతో తెలియజేసి పర్యవేక్షక బాధ్యత వహించిన ఆచార్య రేమిల్ల వెంకట రామకృష్ణశాస్త్రి గారికి,

నాకు డాక్టరల్ కమిటి మెంబర్స్‌గా వ్యవహరించిన ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి, ఆచార్య పరిమి రామనరసింహం గారికి, ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి,

తెలుగు శాఖాధ్యక్షులు మరియు డాక్టరల్ కమిటి మెంబర్స్‌గా వ్యవహరించిన ఆచార్య జి. అరుణకుమారి గారికి,

ఎం.ఏలో పాఠాలు బోధించిన ఆచార్య ఎన్.యస్. రాజుగారికి, ఆచార్య శరత్‌జ్యోత్స్నా రాణిగారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి, ఆచార్య ఎమ్. గోనానాయక్ గారికి, డా. డి. విజయలక్ష్మి గారికి, డా. పమ్మి పవన్‌కుమార్ గారికి, డా. భుజంగరెడ్డిగారికి, డా. డి. విజయకుమారి గారికి,

తెలుగు ప్రధాన అంశంగా తీసుకోమని చెప్పిన సాయిటీచర్, ప్రసాద్ గార్లకు, డిగ్రీలో పాఠాలు చెప్పి నిరంతరం ప్రోత్సహించే శ్రీమతి & శ్రీ జోశ్యుల కృష్ణబాబు గారికి,

పరిశోధనకు అవసరమైన పుస్తకాలను సేకరించుకోవడానికి సహకరించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఇందిరాగాంధీ మెమోరియల్ గ్రంథాలయ సిబ్బందికి, ఆచార్య శ్రీ నాగార్జున విశ్వవిద్యాలయ గ్రంథాలయ సిబ్బందికి, ఆంధ్రా విశ్వవిద్యాలయ గ్రంథాలయ సిబ్బందికి, ఉస్మానియా విశ్వవిద్యాలయం గ్రంథాలయ సిబ్బందికి, శ్రీ గౌతమి గ్రంథాలయ సిబ్బందికి, సిటీ సెంట్రల్ లైబ్రరీ సిబ్బందికి, స్టేట్ సెంట్రల్ లైబ్రరీ సిబ్బందికి, వేటపాలెం గ్రంథాలయ సిబ్బంది శ్రీవల్లి గారికి, సంస్కృత భాషా ప్రచార సమితి సిబ్బందికి,

పరిశోధనకు కావలసిన ఆర్థిక సహకారాన్ని అందించిన (JRF & SRF) యూనివర్సిటి గ్రాంట్స్ కమీషన్ గారికి,

నిరంతరం శ్రమించి నా ఉన్నతినే వారి ఉన్నతిగా భావించి నాకు ఈ జన్మను ప్రసాదించిన నాన్న జనమంచి వెంకట లక్ష్మీ నరసింహారావు, అమ్మ సీతారామరాజ్య సుబ్బలక్ష్మి గార్లకి, నా

పరిశోధనకు అన్ని విధాల సహకరించి నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించే నా జీవిత భాగస్వామి కోటపల్లి విష్ణుకాంత్ గారికి, తన చిరునవ్వుతో నా అలసటని పోగొట్టే మా పాప చిరంజీవి సాయి కార్తీకకి, నిరంతరం నా ఉన్నతిని కోరుకునే మావయ్యగారు కోటపల్లి సీతారామమూర్తి గారికి, అత్తగారు సత్యదుర్గాంబ గార్లకి, మరిది ఫణికాంత్‌కి తోటి కోడలు శ్రావ్యకి, వీరి కుమారుడు కృష్ణకి, నా తమ్ముడు లక్ష్మణమూర్తికి, మరిది గొల్లపల్లి సంతోష్, చెల్లెలు రామలక్ష్మికి, గార్లకి, వీరి కుమారుడు శ్రీరామ్‌కు,

తాతయ్యలు అయిన కీర్తిశేషులు చాడ లక్ష్మీనరసింహమూర్తి గారికి, అమ్మమ్మ రవణమ్మకి పెద్ద మావయ్య అయిన కీర్తిశేషులు చాడ వెంకటరమణకు, అత్త జ్యోతికి, చిన్న మావయ్య చాడ కాశీవిశ్వనాథం, అత్త శేషారత్నంకి,

తెలుగుశాఖలోని కార్యాలయ సిబ్బంది భవానీ శంకర్, వి. బాలాజీ, రాంబాబు, కిషన్, కె. సంజీవయ్య, టి. కృష్ణ, ఎమ్. రాజశేఖర్ గార్లకి,

పరిశోధనకు అవసరమైన సహాయ సహకారాలు అందించిన ప్రిస్కిల్ల, భాను పావని, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, శైలజ, రవిచంద్ర, ధర్మావతి పెద్దమ్మ, శంకర్ మొదలైన మిత్రులందరికి,

డి.టి.పి. చేసిన శ్రీ రామకృష్ణ (మాధవీ గ్రాఫిక్స్) గారికి,

ప్రత్యక్షంగా, పరోక్షంగా నా పరిశోధనకు సహకరించిన వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఇట్లు

**సత్య గాయత్రి జనమంచి**

# సంకేతార్థ సూచి (List of Abbrevations)

| | | | |
|---|---|---|---|
| 1. | సుభద్రా కళ్యాణము | – | సు.క. |
| 2. | సుభద్రా ధనంజయం | – | సు. ధ. |
| 3. | తపతీ సంవరణోపాఖ్యానము | – | త.సం.ఉపా. |
| 4. | తపతీ సంవరణం | – | త.సం. |
| 5. | శ్రీ శివ భారతము | – | శ్రీ.శి.భా. |
| 6. | ఛత్రపతి సామ్రాజ్యమ్ | – | ఛ.సా. |
| 7. | హరిశ్చంద్రోపాఖ్యానము | – | హ.ఉపా. |
| 8. | చండకౌశికమ్ | – | చం.కౌ. |
| 9. | ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణము | – | ఆం.ప్ర.య. |
| 10. | నాట్యశాస్త్రము | – | నా.శా. |
| 11. | పుట | – | పు. |
| 12. | వ్యాఖ్యానం | – | వ్యా. |
| 13. | శ్లోకం | – | శ్లో |
| 14. | ద్విపద | – | ద్వి |
| 15. | సంఖ్య | – | సం |
| 16. | ప్రథమ భాగం | – | ప్ర.భా |
| 17. | ద్వితీయ భాగం | – | ది.భా. |
| 18. | ఆశ్వాసం | – | ఆ |
| 19. | పద్యం | – | ప |
| 20. | సూత్రం | – | సూ |

# ప్రవేశిక (Preface)

**పరిచయం (Introduction) :**

'తెలుగు కావ్యాలుగా రూపొందిన సంస్కృత నాటకాలు – పరిశీలన' అనేది నా పరిశోధనాంశం. నిర్వచనం రీత్యా నాటకం కూడా కావ్యమే అయినప్పటికీ బ్రాహ్మణ వశిష్ఠ న్యాయంగా ఇక్కడ కావ్య శబ్దాన్ని శ్రవ్యకావ్యంగా భావించి కావ్య, నాటకాలు అని వేరు వేరుగా వ్యవహరించాను. సంస్కృత నాటకాలను చూసే తెలుగు కావ్యాలు రచించారు అనడానికి తగినన్ని ప్రమాణాలు లేవు. అయినప్పటికీ ఒకే కథని తీసుకొని కవులు కావ్యనాటకాలను రచించడం వల్ల ఛాయామాత్రంగా ప్రభావం ఉండి ఉండవచ్చునని భావించి ఈ అంశాన్ని తీసుకొని పరిశోధించడం జరిగింది.

ఒకే ఇతివృత్తాన్ని కావ్యంగా మలచినపుడు కవికి తాను చెప్పదలచుకున్న విషయాన్ని స్వేచ్ఛగా ప్రకటించడానికి అవకాశం ఉంటుంది. పాత్రపోషణ, రసము, వర్ణనలు మొదలైన విషయాలలో కావ్యకర్తకి స్వతంత్ర ఉంటుంది. కానీ నాటకకర్తకి ఆ స్వేచ్ఛ ఉండదు. నాటక లక్షణాలకు అనుగుణంగా ఇతివృత్తాన్ని మలచవలసి ఉంటుంది. ఒకే ఇతివృత్తంతో వచ్చిన కావ్యనాటకాలలో పాత్రపోషణ, రసపోషణ, వర్ణనలు, ఇతివృత్తంలో మార్పులు, చేర్పులు ఏ విధంగా ఉన్నాయో తెలియజేయడం ఈ పరిశోధన ముఖ్య ఉద్దేశ్యం.

**పరిశోధన లక్ష్యాలు (Aims of Research) :**

1. కావ్యనాటకాల ఇతివృత్త కల్పనలలోని తేడాలు ఏ విధంగా ఉన్నాయో చెప్పడం.
2. ఈ కల్పనలు ఔచిత్యాన్ని తెలియజేయడం.
3. పాత్రలలోని తేడాలు, పాత్రపోషణలో భేద సాదృశ్యాలను తెలియజేయడం.
4. కావ్యనాటకాలలోని ఏయే రసాలు పోషింపబడ్డాయి. వాటి భేద సాదృశ్యాలను తెలియజేయడం.
5. కావ్య నాటకాలలో వర్ణనలు ఏ విధంగా ఉన్నాయని తెలియజేయడం.

**పరిశోధనా పద్ధతి (Research Methodology) :**

ముందుగా నేను తెలుగు సాహిత్య చరిత్రలు తీసుకొని కావ్యాల జాబితా తయారు చేసుకొన్నాను. అలాగే సంస్కృత సాహిత్య చరిత్రల నుండి నాటకాల జాబితా తయారు చేశాను. ఈ రెండు జాబితాలలోంచి ఒకే ఇతివృత్త పరంగా ఉన్న కావ్య నాటకాలను ఎంపిక చేసుకున్నాను. ఎంపిక

చేసుకున్న కావ్య నాటకాలనుండి పూర్వ పరిశోధకులు చేసిన కావ్య నాటకాలను విడిచిపెట్టి తక్కిన వాటిలో నా పరిశోధనకు నాలుగు కావ్య నాటకాలను విశ్లేషణాత్మక పద్ధతిలో పరిశోధన చేశాను.

**పరిశోధనా పరిధి : (Scope of Research)**

క్రింది కావ్య నాటకాలను నేను నా పరిశోధనకు ప్రధాన ఆకరాలుగా పరిధిని నిర్ణయించుకున్నాను.

| | తెలుగు | | సంస్కృతం |
|---|---|---|---|
| 1. | సుభద్రాకల్యాణము<br>– తాళ్ళపాక తిమ్మక్క | 1. | సుభద్రాధనంజయం<br>– కులశేఖర కవి |
| 2. | తపతీ సంవరణోపాఖ్యానము<br>– అద్దంకి గంగాధరుడు | 2. | తపతీ సంవరణం<br>– కులశేఖరకవి |
| 3. | హరిశ్చంద్రోపాఖ్యానము<br>– గౌరన | 3. | చండకౌశికమ్<br>– క్షేమీశ్వరుడు |
| 4. | శ్రీ శివభారతము<br>– గడియారం వెంకట శేషశాస్త్రి | 4. | ఛత్రపతి సామ్రాజ్యమ్<br>మూలశంకర మాణిక్‌లాల్ |

**పూర్వ పరిశోధన సమీక్ష (Review of Research) :**

**"ఆంధ్రమున ప్రబంధ రూపమునొందిన సంస్కృత నాటకములు"** అనే పరిశోధనా గ్రంథాన్ని డా. సి. రాజేశ్వరిగారు బెంగుళూరు విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. పట్టా కోసం సమర్పించారు. వీరు పరిశోధించిన కావ్య నాటకాలు.

| | తెలుగు | | సంస్కృతం |
|---|---|---|---|
| 1. | కేయూరబాహు చరిత్ర | 1. | విద్ధసాల భంజిక |
| 2. | క్రీడాభిరామము | 2. | ప్రేమాభిరామము |
| 3. | శృంగార శాకుంతలము | 3. | అభిజ్ఞాన శాకుంతలము |
| 4. | ప్రబోధ చంద్రోదయము | 4. | ప్రబోధ చంద్రోదయము |

| | | | |
|---|---|---|---|
| 5. | ప్రసన్న రాఘవము | 5. | ప్రసన్న రాఘవము |
| 6. | అనర్ఘ రాఘవము | 6. | అనర్ఘ రాఘవము |

డా. పి. వారిజారాణిగారు **"తెలుగు సంస్కృత కావ్యాల్లో ప్రక్రియా భేదంతో వచ్చిన ఒకే ఇతివృత్త కావ్యాల అధ్యయనం"** అనే పరిశోధనా గ్రంథాన్ని 2003లో హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. వ్యాసాన్ని సమర్పించారు. వీరు పరిశోధించిన కావ్యనాటకాలు.

| | **తెలుగు** | | **సంస్కృతం** |
|---|---|---|---|
| 1. | ప్రభావతీ ప్రద్యుమ్నము | 1. | ప్రద్యుమ్నాభ్యుదయం |
| 2. | యయాతి చరిత్ర | 2. | యయాతి చరితమ్ |
| 3. | ఉత్తర రామాయణం | 3. | ఉత్తర రామచరితమ్ |
| 4. | వాసవదత్తావత్సరాజము | 4. | ప్రతిజ్ఞా యౌగంధరాయణం |

**ద్వితీయ ఆకరాలు (Secondary Sources) :**

నేను పరిశోధనకు తీసుకొన్న కావ్య నాటకాలపై వివిధ విశ్వవిద్యాలయాలలో వచ్చిన పరిశోధనా వ్యాసాలు.

1. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో **"ఆంధ్ర సాహిత్యములో హరిశ్చంద్రోపాఖ్యానము"** అనే అంశంపై 1978లో వాసా ప్రభావతి గారు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తమ సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.
2. **"తెలుగులో హరిశ్చంద్ర నాటకాలు తులనాత్మక పరిశీలన"** అనే అంశంపై 1995లో జె. కృష్ణబాబు తెలుగు విశ్వవిద్యాలయానికి తమ సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.
3. **"తపతీ సంవరణము - కావ్యానుశీలన"** అనే అంశంపై 1991లో టి. రాధాబాయిగారు నాగార్జున విశ్వవిద్యాలయానికి లఘు సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.
4. **"తపతీ సంవరణోపాఖ్యానం - పరిశీలన"** అనే అంశంపై 1992లో పి.వి. ఉమాశశి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి లఘు సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.
5. **"తెలుగులో హరిశ్చంద్ర కథ"** అనే అంశంపై 1997లో ఎ.వి. పద్మాకరరెడ్డి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.

6. **"శివ భారతం పరిశీలన"** అనే అంశంపై 1978లో ఎస్.పద్మావతి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి లఘు సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.

7. **"సాహిత్య తత్వము శివభారత దర్శనము"** అనే విమర్శనా గ్రంథాన్ని 1971లో సర్దేశాయి తిరుమలరావు గారు వెలువరించారు.

అయితే పై పరిశోధనా గ్రంథాలన్నీ ఆయా కావ్యాలు లేదా నాటకాల విశేషాలను వివరించాయి.

నా పరిశోధనలో తెలుగు కావ్యాలకి, సంస్కృత నాటకాలకి ఉన్న భేద సాదృశ్యాలను తెలియజేయడమే నా పరిశోధన లక్ష్యం. పరిశోధనకు తీసుకున్న నాట్యకావ్యాలను కాలాన్ని చూసినప్పుడు ముందుగా సంస్కృత నాటకాలు వచ్చాయి. ఈ నాటకాలను కాలక్రమాన్ని బట్టి చండకౌశికమ్, తపతీసంవరణం, సుభద్రా ధనంజయం, ఛత్రపతి సామ్రాజ్యమ్ నాటకాలు వరుస క్రమంలో ఉన్నాయి. అందువల్ల నా పరిశోధనలో ఈ వరుసనే పాటించి అధ్యాయాలుగా విభజించాను.

**పరిశోధన అధ్యాయాల విభజన**

నా పరిశోధనా వ్యాసాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించాను.

**మొదటి అధ్యాయం :** కావ్యనాటక లక్షణాలు – పరిచయం

**రెండవ అధ్యాయం :** చండకౌశికమ్ – హరిశ్చంద్రోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన

**మూడవ అధ్యాయం :** తపతీ సంవరణం – తపతీ సంవరణోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన.

**నాల్గవ అధ్యాయం :** సుభద్రా ధనంజయం – సుభద్రా కల్యాణము నాటక కావ్యాల పరిశీలన

**ఐదవ అధ్యాయం :** ఛత్రపతి సామ్రాజ్యమ్ – శ్రీ శివభారతము నాటక కావ్యాల పరిశీలన

నాటక కావ్య లక్షణాలు – పరిచయం అధ్యాయంలలో నాటక శబ్దానికి ఉన్న అర్థాల్ని పేర్కొన్నాను. నాటక ఆవిర్భావ వికాసాలు, నాటకానికి ఆలంకారికులు, పాశ్చాత్య విమర్శకులు ఇచ్చిన నిర్వచనాలను తెలియజేశాను. నాటకాల వర్గీకరణను తెలియజేసి పరిశోధనకు తీసుకున్న నాటకాలను ఆయా వర్గీకరణలో చేర్చాను. నాటక లక్షణాలను తెలియజేసి నాటకం కావ్యం కంటే ఎందుకు విశిష్టమైనో వివరించాను. ప్రబంధ శబ్దానికి నిఘంటువులు ఇచ్చిన అర్థాన్ని పేర్కొని ప్రబంధ శబ్దం ప్రస్తావన ఏయే కావ్యాలలో ఉందో తెలియజేశాను. ప్రబంధ నిర్వచనాలు, ప్రబంధ లక్షణాలు తెలియజేసి నాటకానికి, ప్రబంధానికి ఉన్న భేదసాదృశ్యాలను వివరించాను. తులనాత్మక విమర్శలో అనువాదాల పాత్ర, ఏక, భిన్న ప్రక్రియానువాదాల్ని పేర్కొన్నాను.

మిగిలిన నాల్గు అధ్యాయాలలో కావ్యనాటక కర్తలైన కవుల్ని పరిచయం చేశాను. క్లుప్తంగా కావ్య నాటకాలలో ప్రధానంగా ఉన్న ఇతివృత్తాన్ని పరిచయం చేశాను. ఐదవ అధ్యాయంలో మాత్రం శ్రీ శివభారతంలోని ఇతివృత్తం చారిత్రం కాబట్టి వివిధ పాత్రలను, సంఘటనలను అర్థం చేసుకోవడానికి వీలుగా ఇతివృత్తాన్ని కొంచెం వివరంగా తెలియజేశాను.

కావ్య నాటకాలలోని ఇతివృత్తాన్ని పోల్చి చూసి కేవలం నాటకంలో మాత్రమే ఉన్న కల్పనలు, కేవలం కావ్యంలో మాత్రమే కల్పనలు తెలియజేశాను. ఈ కల్పనల వల్ల నాటక, కావ్యాలకి చేకూరిన ప్రయోజనాన్ని, ఔచిత్యాన్ని తెలియజేశాను.

కావ్య నాటకాలలోని కల్పనలను మూలంతో పోల్చిచూసి మూలంలో ఈ కల్పనలు ఉన్నాయా లేదా ఉంటే ఏ విధంగా ఉన్నాయో తెలియజేశాను. మూలంలో లేని కావ్యనాటకాలు రెండింటిలోనూ ఉన్న కల్పనలలోని భేదాలను వివరించాను.

పాత్ర పోషణలో ఏ పాత్రలు కావ్యనాటకాలలో ఉన్నాయి. ఏ పాత్రలు కావ్య నాటకాలలో లేవు అనే విషయాన్ని తెలియజేశాను. ఆ పాత్ర ద్వారా కవి సాధించిన ప్రయోజనం ఏమిటి? లేకపోతే జరిగిన నష్టం ఏమిటి తెలియజేశాను. ఒక పాత్ర కావ్యంలో ఉదాత్తంగా ఉందా? నాటకంలో ఉదాత్తంగా ఉందా? అనే విషయాన్ని చర్చించాను. ఒక పాత్ర కావ్యంలో ఏ ప్రయోజనాన్ని సాధించింది. అదే పాత్ర నాటకంలో ఏ ప్రయోజనాన్ని సాధించింది అనే విషయాన్ని వివరించాను.

రసపోషణలో కావ్య నాటకాలలో రసపోషణ ఏ విధంగా ఉందో వివరించాను. ఏ సన్నివేశాలలో ఏ రసాలు పోషింపబడ్డాయి, ఏ రసాలు పోషింపబడలేదో తెలియజేశాను. ఆలంకారిక సంప్రదాయం ప్రకారం ఏ విభావ అనుభావాల వల్ల ఏ రసాలు కావ్య నాటకాలలో అభివ్యక్తమయ్యాయో తెలియజేసి వాటి ఆలంబన, ఉద్దీపన విభావాలను కూడ పేర్కొన్నాను.

కావ్య నాటకాలలో ఏ సందర్భాలలో ఏయే వర్ణనలు ఉన్నాయి. అవి రసోద్దీపనకు ఏ విధంగా సహకరించాయో తెలియజేశాను.

చివరగా సింహావలోకనంలో పరిశోధనా ఫలితాలు చెప్పి తెలుగు కావ్యం కన్నా నాటకం ఆస్వాదయోగ్యంగా ఉందా? సంస్కృత నాటకం కన్నా తెలుగు కావ్యం ఆస్వాదయోగ్యంగా ఉందా? అనే విషయాన్ని నా పరిశోధనలో అంచనా వేసే ప్రయత్నం చేశాను.

## మొదటి అధ్యాయం

# నాటక కావ్య లక్షణాలు - పరిచయం

## మొదటి అధ్యాయం

# నాటక కావ్య లక్షణాలు - పరిచయం

## 1.0 నాటకము - అర్థ వివరణ

"నాటకము : సం.వి. అ.న 1. "శృంగార వీర రసములలో నొక రసము ప్రధానముగా నుండి ప్రఖ్యాత చరిత్రమును తెలుపుచు అయిదు మొదలు పది వఱకు అంకములుండు దృశ్య ప్రబంధము". 1. నర్తనము 2. చరిత్రము 3. కపటోపాయము"[1] అనే అర్థాలున్నాయి. శబ్దరత్నాకరం ప్రకారం నాటకానికి '1. నర్తనము 2. ప్రవర్తనము'[2] అనే అర్థాలు ఉన్నాయి.

## 1.1 నాటకం ఆవిర్భావం - వికాసాలు

భారతదేశంలో వేదకాలానికి ముందే నాటకరంగం ఆవిర్భవించి, క్రమంగా పెంపొంది పరాకాష్ఠకు చేరుకొన్నదనడానికి ఆధారాలు కన్పిస్తున్నాయి. భరతముని నాట్యశాస్త్రం రచించాడని చరిత్రకారులు విశ్వసిస్తున్నా దానిని తనకు బ్రహ్మ ప్రసాదించినట్లు భరతముని చెప్పుకొన్నాడు.

### భరతముని సిద్ధాంతం

ఋగ్వేదం నుంచి వాచికం, సామవేదం నుంచి సంగీతం, యజుర్వేదం నుంచి అభినయం, అథర్వణ వేదం నుంచి రసం తీసుకొని నాలుగింటిని మేళవించి పంచమ వేదంగా నాట్యశాస్త్రాన్ని సృష్టించి బ్రహ్మ భరతమునికి ప్రసాదించాడు. భరతముని శిష్యులతో ప్రథమ నాటక బృందం ఏర్పడింది. వీరు ప్రథమంగా ప్రదర్శించిన నాటకం ఇతివృత్తం రాక్షస నాటకం. ఇదే ప్రప్రథమ సంస్కృత నాటకం.

### శారదా తనయ సిద్ధాంతం

నందికేశ్వరుడు బ్రహ్మకు నాట్యవేదం ప్రయోగ విధానంతో సహా బోధించాడని బ్రహ్మ త్రిపురదాహమనే రూపకం రచించి ప్రయోగించాడని దీనిని తిలకిస్తున్న బ్రహ్మ నాలుగు ముఖాల నుంచి నాలుగు వృత్తులు, నాలుగు ప్రధాన రసాలు పుట్టాయని శారదా తనయుడు తన భావ ప్రకాశనంలో రూపకోవృత్తి గురించి చెప్పాడు.

---

1. *సూర్యరాయాంధ్ర నిఘంటువు, పు. 529.*
2. *శబ్దరత్నాకరము, పు. 499*

## వేద సంవాద సిద్ధాంతం

క్రియాత్మక సంభాషణా రూపకమే రూపకం. కేవలం సంభాషణల ద్వారానే రూపక కథ నడుస్తుంది. రూపకాన్ని తక్కిన సాహిత్య ప్రక్రియల నుంచి వేరు చేసేది ఈ సంభాషణాత్మకమే. అంటే రూపకానికి సంభాషణ ప్రాతిపదిక.

ప్రపంచంలోనే ప్రప్రథమ గ్రంథంగా పరిగణనలో ఉన్న ఋగ్వేదంలో సంవాదాలనే పేరిట 15 సంవాద సూక్తాలున్నాయి. ఈ సంవాదాల రూపంలో సంస్కృత నాటక బీజాలు వేదాలలో విలసిల్లాయని, అవి క్రమంగా ఉద్బుద్ధమయి పెరిగి, ప్రపూర్ణమయినాయని కొందరి విమర్శకుల అభిప్రాయం.

## జాగీర్దార్ సిద్ధాంతం

ధార్వార్‌లోని కర్ణాటక కళాశాల ఆచార్యులు జాగీర్దార్ సంస్కృత రూపకోత్పత్తిని గురించిన కొత్త సిద్ధాంతాన్నొకదానిని తమ సంస్కృత సాహిత్యంలో రూపకం అనే గ్రంథంలో ప్రతిపాదించాడు. పురాణాల నుంచి సంస్కృత  నాటక సాహిత్యం ఆవిర్భవించిందనేదే ఈ కొత్త సిద్ధాంత సారాంశం. పురాణాలలోని సూతుడే సంస్కృత నాటకంలోని సూత్రధారుడుగా రూపొందాడని ఈయన అభిప్రాయం.

## తోలుబొమ్మలాట సిద్ధాంతం

తోలు బొమ్మల నాడించే వారు బొమ్మల 'దారం' పట్టుకొని ఆడిస్తారు కాబట్టి ఆ ఆడించే వ్యక్తికి సూత్రధారి అని పేరు వచ్చింది. అయితే సంస్కృత రూపకాలలో సూత్రధారుడు నాటక ప్రదర్శనను ప్రారంభిస్తున్నాడు. అందుకుని పెస్కల్ వంటి పాశ్చాత్య విమర్శకులు తోలుబొమ్మలాట నుంచి సంస్కృత రూపకం పరిణితి చెందిందని అభిప్రాయపడ్డారు.

## పురాణ కాలక్షేప సిద్ధాంతం

మనదేశంలో పురాణ కాలక్షేపం ప్రజాకళగా పరిఢవిల్లింది. పట్టణాలలో, గ్రామాలలో ఈ కాలక్షేపం రాత్రులందు జరుగుతుంటుంది. దీని ప్రధానోద్దేశం నిరక్షరాస్యులకు విజ్ఞానం కలిగించడం. ఇలా విజ్ఞానం కలిగించడం ఏదో పాఠం చెప్పినట్టుగా గాక, అర్థానికి అనుగుణమయిన హావభావ చేష్టాదులతో చతుర్విధాభినయాలతో పురాణం చెపుతూ, వ్యాఖ్యానిస్తూ శ్రోతల హృదయాలలో ఆ అర్థం హత్తుకునేటట్టు చేస్తారు. ఈ పురాణ కాలక్షేపం నుంచే నాటకం పుట్టిందని భావించవచ్చు.

ఆది కావ్యమైన వాల్మీకి రామాయణంలో నట, నర్తక ప్రసక్తేగాక నాటక బృందాలను గురించి కూడ ప్రసక్తి ఉంది. సంస్కృత నాటకం పరిణతి చెందిందని పాణిని నట సూత్రాలను బట్టి పేర్కొన్నాడు. క్రీ.పూ. 150 ప్రాంతంలో జీవించిన పతంజలి తన మహాభాష్యంలో కంసవధ, బలి బంధనం అనే రెండు నాటకాలు పేర్కొన్నాడు. చారిత్రక దృష్టి చూస్తే, మొట్టమొదటి శాస్త్రకర్తే గాక మొట్టమొదటి నాటకకర్త కూడ భరతమునే. అసుర విజయం, అమృత మథనం, త్రిపుర దాహం, లక్ష్మీపరిణయం భరతముని రచనలే కానీ ఇవి లభ్యం కావడం లేదు.

మనకు లభ్యమవుతున్న వాటిలో ప్రాచీనమైన అశ్వఘోషుని మూడు రూపకాలు. బౌద్ధ గాథలు, ఇందులో ఒకటి శారిపుత్ర ప్రకరణంగా భావించవచ్చు. రెండవది అన్యాపదేశ రూపకం, మూడవది ధర్మ ప్రబోధక రూపకం. అశ్వఘోషుని తరువాత మనకు తారసిల్లే ప్రముఖకవి భాసుడు. ఇతడు భరతముని విధించిన విధి నిషేధాలను గట్టిగా పాటించకుండా రంగస్థలం మీద మృతిని, యుద్ధాలను చూపాడు. భాసుడు మొత్తం పదమూడు రూపకాలు రచించాడు.

భాసుడు తరువాత చెప్పుకోదగ్గ నాటకకర్త శూద్రకుడు. ఇతడి 'మృచ్ఛకటిక' ప్రకరణం సర్వలక్షణ లక్షితమయి తరువాతి ప్రకరణాలకు ఆదర్శమయింది. శూద్రకుడి తరువాత ప్రసిద్ధికెక్కిన సంస్కృత నాటకకర్త కాళిదాసు. ఈయన రచించిన నాటకాలు మూడు. కాళిదాసు యుగం సంస్కృత నాటక చరిత్రలో స్వర్ణయుగం. ఇతడు రచించిన నాటకాలు మూడు. అవి మాళవికాగ్నిమిత్రం, విక్రమోర్వశీయం, అభిజ్ఞానశాకుంతలం.

పిమ్మట నాటకకర్తలుగా కీర్తిగాంచిన వారు వరుసగా విశాఖదత్తుడు, శ్రీహర్షుడు, భవభూతి. విశాఖదత్తునితో సంస్కృత సాహిత్య చరిత్రలో నూతన ఘట్టం ప్రారంభమయింది. రాజకీయ నాటకాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఇతని ముద్రారాక్షస నాటకం విశ్వవిఖ్యాతి గాంచింది. తరువాత వచ్చిన శ్రీహర్షుని రత్నావళి, ప్రియదర్శిక, నాగానందం రూపకాలు మూడు ఆణిముత్యాలు. తరువాత వచ్చిన భవభూతి ప్రపంచ ఖ్యాతి గాంచిన మహానాటకకర్త. ఇతని రచనలు మూడు. మహావీర చరిత, మాలతీ మాధవం, ఉత్తరరామ చరిత.

భవభూతి తరువాత క్షీణయుగం. ఈ యుగ ప్రధాన లక్షణం శ్రవ్య రూపక సృష్టి. ఈ యుగంలోని సంస్కృత నాటకకర్తలకు ప్రదర్శనా దృష్టిలేదు. పాండిత్య ప్రకర్షమీద, శిల్పం మీద దృష్టి ఎక్కువ. పాత్రోన్మీలనం మీద, నాటకీయత మీద దృష్టి లేదనే చెప్పాలి. రాజదర్బార్‌లో ఎక్కువగా ప్రదర్శితమవుతుండడం వల్ల, కఠినశైలి అవలంబించడం వల్ల సామాన్య ప్రజానీకానికి, నాటక రంగానికి

సంబంధం తెగిపోయింది. సంస్కృత రూపక లక్షణాలను తప్పకుండా అనుసరించాలనే మహాయత్నం ఈ నాటకాలలో గోచరిస్తుంది. మురారి 'అనర్ఘరాఘవం', జయదేవుని 'ప్రసన్న రాఘవం', రాజశేఖరుని 'బాలరామాయణం' ఈ శ్రవ్యరూపకాలకు మంచి ఉదాహరణ. వీటిలో నాటకీయత తగ్గి వర్ణనలకు, శ్లోకాలకు, కవితాశైలికి ప్రాధాన్యం హెచ్చింది. ఈ కాలంలో వెలువడిన రూపకాలు ఎక్కువగా పౌరాణికాలే. గుణం తగ్గినా, రాశి హెచ్చు. సంస్కృత నాటక సాహిత్య చరిత్రలో ఏ యుగంలోనూ లేనన్ని 600 రూపకాలు ఈ యుగంలో వచ్చాయి. ఇవి పౌరాణికాలయినా వస్తు వైవిధ్యం హెచ్చు. కృష్ణనాటకాలు, చారిత్రక నాటకాలు, కల్పితాలు ఎక్కువ.

ఈ యుగంలో వచ్చిన నాటకాలలో విశిష్టతను పొదువుకున్నవి రెండు. శక్తి భద్రుని ఆశ్చర్య చూడామణి, భట్ట నారాయణుని 'వేణీ సంహారం'. భోజుడు శృంగార రసానికి, భవభూతి కరుణరసానికి పట్టం కట్టారు. రామకథను ఆశ్చర్యచూడామణి అనే నాటకంగా రచించి నూతన రీతి నాటకాలకు ఒరవడి పెట్టాడు.

ఈ క్షీణ యుగంలో వ్యాప్తిలోకి వచ్చిన ఇంకొక రీతి నాటకాలు అన్యాపదేశ నాటకాలు. ఈ నాటకాలలోని పాత్రలు బుద్ధి, మోహం, వివేకం వంటి అరూప పాత్రలు. కృష్ణమిశ్రుని ప్రబోధ చంద్రోదయం, వేదాంత దేశికుని సంకల్ప సూర్యోదయం అన్యాపదేశ నాటకాలకు మచ్చుతునకలు. ఈ అన్యాపదేశ నాటకాలతో పాటుగ సాంఘిక రూపకాలు కూడ ఈ కాలంలో వెలువడ్డాయి. ఈ నాటకాలలో అవహేళన తీవ్రరూపంలో గోచరిస్తుంది. మహేంద్రవర్మ మత్తవిలాసం, భగవదజ్జుకం, లటకమేళం ఈ రీతి ప్రహసనాలకు మంచి ఉదాహరణలు.

అయితే పూర్వులతోనే సంస్కృత నాటకరచన ఆగిపోలేదు. సంస్కృతం రాజభాషగా స్థానం కోల్పోయినా భారతదేశంలో అనేకులు అభ్యసించి, పాండిత్యం సంపాదిస్తూనే ఉన్నారు. నేటికీ శ్రీరాఘవన్ వంటి సంస్కృత పండితులు ఏకాంకికలు, విశేషాంకికలు రచించి ప్రచురిస్తూనే ఉన్నారు.

## 1.2 నాటకం - నిర్వచనాలు :

నాటక నిర్వచనాలను ఆచార్య మొదలి నాగభూషణశర్మ తమ నాటక శిల్పంలో ఈ విధంగా పేర్కొన్నారు.

నాటకానికి భరతముని ఇచ్చిన నాటక లక్షణాలు ఈ విధంగా ఉన్నాయి.

నాట్యశాస్త్రంలోని మొదటి అధ్యాయంలోని 105-119 శ్లోకాలు నాట్యవేదాన్ని గురించి, నాటక లక్షణాలను గురించి వివరిస్తాయి. అందులో శ్లోకాలు గమనిస్తే నాట్యశాస్త్ర కారుడు నాట్యాన్ని ఏ విధంగా ఊహించాడో విదితం అవుతుంది.

"భవతాం దేవతానాం చ శుభాశుభవికల్పకః
కర్మ భావాన్వయా పేక్షీ నాట్యవేదోమయా కృతః॥[3]"

కర్మ (చేష్ట)ల, భావాల అన్వయాన్ని ఆశించే ఈ నాట్యవేదం నాకృతి. మేమే (దేవతల, దానవుల) శుభాశుభాలు రెండూ ఇందులో వ్యక్తం అవుతాయి. అంటే చేసే కార్యకలాపాల (actions)కి, ఉద్వేగాల (Œmotions) కి ఉండే పరస్పర సంబంధాన్ని చూపేది నాట్యం – అని భరతుడి భావం. అలాగే –

**"నానాభావోప సంపన్నం, నానావస్థాంతరాత్మకమ్
లోకవృత్తానుకరణం నాట్య మేతన్మయా కృతమ్"[4] ॥**

విభిన్న భావాలతో సుసంపన్నమై, వివిధ అవస్థలతో కూడినదై , లోకవృత్తాన్ని అనుకరించే నాట్యాన్ని నేనే నిర్మించాను అంటాడు నాట్యశాస్త్రకారుడు. నాట్యానికి ప్రధానమైన లక్షణం "లోకవృత్తానుకరణం". ఎటువంటి లోకవృత్తానుకరణం? నిత్య జీవితంలో జరిగే ఏ పనిని అనుకరించినా నాట్యం అవుతుందా? అంటే ఆ లోకవృత్తానుకరణం – "నానావస్థాంతరాత్మకం" అన్నాడు. అనేక అవస్థలతో కూడిన లోకవృత్తాన్ని అనుకరించాలి అన్నాడు. ఈ అవస్థలు ఎటువంటి? "నానాభావోపసంపన్నం" అనేక భావాలతో సుసంపన్నమయినవి. ఈ విధంగా భరతుడు నాట్యం (నాటకం)లో ఉండే అంతస్సూత్రాన్ని వివరించాడు. అంటే – లోకవృత్తాన్ని అనుకరిస్తూ విభిన్న భావ (సుఖదుఃఖాల) సమన్వితమై, ఆ భావాలను వెలువరించే వివిధ అవస్థలు మూలభూతంగా ఉండేది నాట్యం.

నాటక లక్షణాల నన్నింటినీ సమన్వయ పరుస్తూ భరతుడు చెప్పిన శ్లోకం నాట్యానికి (అంటే ప్రదర్శింపబడే నాటకానికి) నిర్వచనంగా మనం చెప్పుకోవచ్చు.

**"యోఽయం స్వభావో లోకస్య సుఖదుఃఖ సమన్వితః
సోఽంగాద్యభినయో పేతో నాట్యమిత్యభిధీయతే"[5] ॥**

"సుఖదుఃఖ సమన్వితమైన ఈ లోకస్వభావము అంగాద్యభినయోపేతమగుచు నాట్యమనబడును"[6]

---

*3. నాట్యశాస్త్రము, పు. 15*

*4. నాట్యశాస్త్రము, పు. 15*

*5. నాట్యశాస్త్రము, పు. 18*

*6. నాట్యశాస్త్రము, పు. 18*

నాటక లక్షణాలను ప్రయోగ లక్షణాలతో చేర్చి భరతుడు చెప్పిన ఈ శ్లోకం నాటకానికి సమగ్రమైన నిర్వచనం అని చెప్పవచ్చు. సుఖదుఃఖ సమన్వితమైన లోక స్వభావాన్ని అభినయం ద్వారా చెప్పేది నాట్యం. దానినే మరో విధంగా చెప్పవచ్చు. "లోకవృత్తంలో అవగతం అయ్యే సుఖ దుఃఖావస్థల అభినయాత్మక వ్యక్తీకరణ నాటకం"

ప్రతీవ్యక్తీ ఆయా సందర్భాలను బట్టి కొన్ని అవస్థలకు లోనవుతాడు. ఆ అవస్థలను స్థూలంగా సుఖదుఃఖాలుగా వింగడించవచ్చు. అట్టి అవస్థలను అభినయ పూర్వకంగా వ్యక్తీకరించేది నాటకం.

## పాశ్చాత్య విమర్శకుల దృష్టిలో నాటకం :

ఇదే భావాన్ని పాశ్చాత్య విమర్శకులు కూడ కొంచెం అటు ఇటుగా తమ నిర్వచనాల్లో పేర్కొన్నారని చెప్పవచ్చు. ఉదాహరణకు – పాశ్చాత్య నాటక విమర్శకి పితామహుడని పిలవబడే అరిస్టాటిల్ నాటకం "Imitation of Complete Action" అంటాడు. స్వయం సంపూర్ణమైన మానవ చేష్టానుకరణమే నాటకం. ఈ సంపూర్ణతకు ఆయనే అర్థం చెప్పాడు తరువాత. ఆ అనుకరించబడే మానవ చేష్టకు ఆది, మధ్య అంతాలు ఉండాలని, అది సహేతుకమైన పరిధిని, పరిమితిని కలిగి ఉండాలని ఆయన నిర్వచించాడు.

"Tragedy, then, is an imitation of an action that is serious, complete, and of certain magnitude, in language emblished with each kind of artistic ornament, the several kinds being in separate parts of the play, in the form of action, not of narrative, through pity and fear effecting the proper purgation of their and similar emotions."

విషాద నాటకం గంభీరమైన, సంపూర్ణమైన, నియమిత విస్తృతి కలిగిన కార్యకలాపాల అనుకరణమై, ఒక్కొక్క భాగంలో ఒక్కొక్క కళాత్మకమైన అలంకారంతో శోభాయమానమైన భాషలో, కథాకథనంగా కాక చేష్టా ప్రధానమై కరుణ, భయానక ఉద్వేగాలను తగిన రీతిలో క్షాళనం చేస్తుంది" ఇందులో అరిస్టాటిల్ పేర్కొన్న నాటక లక్షణాలు ఇలా ఉన్నాయి. (ఆయన విషాద నాటకాన్ని గురించే వివరించినా, దానిని అన్ని రకాల నాటకాలకు అన్వయింపచేశారు విమర్శకులు).

1. నాటకం అనుకరణ ప్రధానం అయివుండాలి.
2. అది చేష్ట(ల) అనుకరణ అయి వుండాలి.
3. అది స్వయం సంపూర్ణమై ఉండాలి.

4. అది సహేతుకమైన పరిమితికి (విస్తృతికి) లోబడి ఉండాలి.

తరువాత వచ్చిన చాలా మంది విమర్శకులు, నాటక కర్తలు ఇదే భావాన్ని వారి వారి పద్ధతులలో వెలిబుచ్చారు. అందులో కొన్ని –

“ప్రకృతికి పట్టే అద్దం వంటిది” ("a mirror to nature") – విలియం షేక్స్పియర్.

“మానవ ప్రకృతికి సహజమైన, జీవబద్ధమైన అనుకృతి అయి వుండాలి. (A play ought to be a just and lively image of human nature) – జాన్ డ్రైడెన్.

“నిర్దిష్టంగా వెలువరించే ఉద్వేగం మంచి నాటకానికి ప్రథమ లక్షణం. చేష్టల ద్వారా, పాత్రచిత్రణ ద్వారా, సంభాషణల ద్వారా అది వ్యక్తీకరింపబడింది. (.... accurately conveyed emotion is the great fundamental in all good drama, it is conveyed by action, characterization and dialouge) – జార్జ్ పియర్స్ బేకర్.

“రంగస్థలానికి అనువుగా జీవితాన్ని సృష్టించడం, పునః సృష్టించడం నాటకం” (…the creation and recreation of life in terms of theatre.) – ఎలిజిబెత్ డ్రూ”[7].

పాశ్చాత్య విమర్శకులు ఇచ్చిన నిర్వచనాలు పై విధంగా ఉన్నాయి.

**1.3 నాటకాలు – వర్గీకరణ :**

తెలుగు సాహిత్యంలో వచ్చిన నాటకాలను పౌరాణిక, చారిత్రక, జాతీయోద్యమ, సాంఘిక నాటకాలుగా “నాటక విజ్ఞాన సర్వస్వం” గ్రంథంలో విభజించడం జరిగింది. ఈ సిద్ధాంత వ్యాసంలో కూడ ఈ విభజననే అనుసరించడం జరిగింది.

**పౌరాణిక నాటకాలు :**

పురాణ, ఇతిహాస సంబంధమైన ఇతివృత్తాన్ని తీసుకొని రాసిన నాటకాలను పౌరాణిక నాటకాలు అనవచ్చు. ఇందులో భారతానికి, భాగవతానికి, పురాణాలకు చెందిన కథా వస్తువు ఉంటుంది. ‘తపతీ సంవరణం’, ‘సుభద్రాధనంజయం’, ‘చండకౌశికమ్’ నాటకాలు ఈ వర్గీకరణకు చెందినవే.

**చారిత్రక నాటకాలు :**

చరిత్రలో జరిగిన సంఘటనలను, యుద్ధాలను, రాజుల పరిపాలన మొదలగు వాటి ఆధారంగా చేసుకొని వాటిని యధాతథంగా చిత్రీకరిస్తూనే కావలసిన చోట కొంత కల్పనలు జోడించి

---

*7. నాటకశిల్పం, పు. 20–21*

ఆనాటి రాజరిక, చారిత్రక పరిస్థితులను, రాజులు వారి రాజ్యాలను గురించి నాటకాలు రాశారు. వీటి ద్వారా చరిత్రలో ఏమి జరిగింది, ఎలా జరిగింది, ఎందుకు జరిగింది దాని పర్యవసానాలు ఏమిటి మొదలగు ప్రశ్నలకు సమాధానాలు ఈ నాటకాల ద్వారా లభించే అవకాశం ఉన్నది. 'ఛత్రపతి సామ్రాజ్యమ్' ఈ వర్గీకరణకు చెందింది.

**జాతీయోద్యమాలు :**

ప్రజలు తమ దేశాన్ని, జాతిని సంస్కృతిని నిల్పుకుని స్వతంత్రంగా నిల్పుకుని స్వతంత్రంగా జీవించడం కోసం వాటిపై ప్రేమాభిమానాలతో ధృఢమైన పూనిక వహించడమే జాతీయోద్యమం. భారతదేశాన్ని వలసపాలన నుండి విముక్తి చేయడానికి నాయకులు, కవులు, కళాకారులు నడుంకట్టారు. విదేశీ వస్తువులను బహిష్కరించడం, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడానికి నాటకాలు ఎంతగానో కృషి చేశాయి.

**సాంఘిక నాటకాలు :**

ఆధునిక నాటకం ఉద్భవించడానికి ప్రధానకారణం సాంఘిక సమస్యలని చెప్పవచ్చు. సాంఘిక రూపకము నందలి ఇతివృత్తాలు కల్పితాలు. సమాజంలోని సమస్యలను ఎత్తి చూపిస్తూ వచ్చిన నాటకాలే సాంఘిక నాటకాలు. వీటిలో సంఘ సమస్యలైన వ్యభిచారం, జూదం, అంటరానితనం, దొంగతనం, స్త్రీల అణచివేత మొదలగు అనేక సమస్యలను ఆధారంగా చేసుకొని రచించారు.

**1.4 నాటక లక్షణాలు :**

**నాంది :**

నటులు నాటక ప్రదర్శన నిర్విఘ్నంగా కొనసాగడానికి నాటక ప్రారంభంలో చేసే కృత్య విశేషానికే పూర్వరంగమని పేరు. ఇందులో ఇరవైరెండు రంగాలు కలవు. వానిలో ముఖ్యమైనది నాంది. ఇది క్రియాపూర్వకమని, వాక్పూర్వకమని రెండు రకాలు. వాక్పూర్వకమైన నాందితోనే నాటకం ఆరంభమౌతుంది. "ఆశీర్నమస్క్రియా వస్తు నిర్దేశోవాపి తన్ముఖమ్" అనే దండి వచనాన్ని బట్టి నాటకారంభమైన నాంది శ్లోకంలో ఆశీర్వచనం, నమస్కారం, వస్తు నిర్దేశం అనే అంశాలలో అన్నీ కాని, కొన్ని కాని ఉండాలి. వస్తు నిర్దేశమనగా కథా సూచన లేదా పాత్ర సూచన. నాందీ శ్లోకం పన్నెండు కానీ పద్దెనిమిది కానీ ఇరవైరెండు కానీ పదాలతో ఉండాలని నియమం కలదు.

**ప్రస్తావన :**

సూత్రధారుడు తాను చేయబోయే నాటకాన్ని గురించి చమత్కారముగ నటీనటులతో గానీ విదూషకుడితో గానీ ప్రస్తావన చేయడాన్ని ఆముఖము అంటారు. దీనినే స్థాపన అని కూడ అంటారు.

**1. కథోద్ఘాతం :**

ప్రస్తుత కథను అనుసరించిన సూత్రధారుని వాక్యంగానీ, అర్థం గాని గ్రహించి పాత్ర రంగంపై ప్రవేశించుట.

**2. ప్రవర్తకము :**

ప్రస్తావనలో ఋతువర్ణనము అనుసరించి పాత్ర తనంతతానుగా ప్రవేశించటం.

**3. ప్రయోగాతిశయం :**

సూత్రధారుడు స్పష్టంగా సూచించిన తరువాత ఆ పాత్ర ప్రవేశించును.

ఈ విధంగా ప్రస్తావన నిర్వహించిన సూత్రధారుడు అనుచరులతో నిష్క్రమింపగా పాత్రలు రంగంపైకి వచ్చి నాటకాన్ని ప్రదర్శన చేయవలెను.

నీరసకథా భాగాల్ని విష్కంబాదుల చేత సూచిస్తారు. అసూచ్యాలు అంకంలో ప్రదర్శిస్తారు.

**అంకం :**

బహువిధ ప్రయోజనాలు కల ప్రధానరసానికి ఆధారమైన రంగప్రవేశమున ప్రత్యక్షంగా చూపబడే నాయక చరితం అంకం అంటారు. అంకంలో వస్తువు ఒక రోజుకు సంబంధించి ఉండాలి. ప్రతి అంకంలో నాయకుడు కానీ నాయికకానీ ఇద్దరు ముగ్గురు పాత్రలతో కనపడాలి. అంకాంతంలో పాత్రలన్నీ నిష్క్రమించాలి. ప్రథమాంకంలో బీజము పూర్తి అయ్యి బిందువు కొద్దిగా మొదలు కావాలి. ఈ విధంగా అంకము రసాలంబమై, మనోహరమై, సంవిధాన విశేషము కలిగి ఉండాలి. నాటకంలో ఐదు అంకముల నుంచి పది అంకములు వరకు ఉండవచ్చు.

**వస్తువు :**

వస్తువు అనగా నాటకంలో ఉండవలసిన కథాభాగము దీనినే ఇతివృత్తం అంటారు. ఈ వస్తువు "అధికారకమని" "ప్రాసంగిక"మని రెండు విధాలు.

1. అధికారిక మనగా : నాటకం ముగిసే వరకు ఉండే ప్రధాన కథ.

2. ప్రాసంగిక మనగా : ముఖ్యకథకు మధ్యలో వచ్చే కథ.

అధికార వస్తువు "ప్రఖ్యాతం", "ఉత్పాద్యం", "మిశ్రమం" అని మూడు విధాలు.

1. ప్రఖ్యాత మనగా : రామాయణ, భారత, కథాసరిత్సాగరాది సుప్రసిద్ధ గ్రంథాలనుండి గ్రహింపబడినది.

2. ఉత్పాద్యమనగా : కేవల కవి కల్పితము.

3. మిశ్రమ మనగా : ప్రసిద్ధ కథలో కొంత కవి కల్పనం కూడా కలిసి ఉంటుంది.

**నాయకుడు :**

రూపకంలో వస్తువు తరువాత నాయకుడికి అధికమైన స్థానం ఉంది. నాయకుడు వినీతుడు, మధురుడు, త్యాగి, దక్షుడు, ప్రియంవదుడు, రక్తలోకుడు, శుచిర్భూతుడు, వాగ్మి, రూఢవంశ్యుడు, స్థిరుడు, యువకుడు, బుద్ధిమంతుడు, ఉత్సాహవంతుడు, స్మృతివంతుడు, ప్రజ్ఞావంతుడు, కలాసమన్వితుడు, మానసమన్వితుడు, శూరుడు, ధృఢుడు, తేజస్వి, శాస్త్రచక్షువు, ధార్మికుడై ఉండాలి. ఇవి నాయక సామాన్య లక్షణములు. నాయకులలో ముఖ్యముగ 1. ధీరోదాత్త 2. ధీరలలిత 3. ధీరోద్ధత 4. ధీరశాంతులను నాలుగు భేదాలున్నాయి.

**1. ధీరోదాత్తుడు :**

సుఖ దుఃఖాలకి చలింపని మహాసత్వుడు. గాంభీర్య క్షమాలు కలవాడు. ఆత్మస్తుతి పరాఙ్ముఖుడు, స్థిరుడు, వినయంతో కూడిన ఆత్మ విశ్వాసం కలవాడు, కార్యదక్షుడు అయి ఉండాలి.

**2. ధీరలలితుడు :**

పరిపాలనా భారాన్ని మంత్రుల మీద ఉంచి నిర్విచారంగా గాననృత్యాది కళలలో ఆసక్తుడై, శృంగార ప్రధానంగా జీవితాన్ని గడిపే సుకుమార హృదయుడు.

**3. ధీరోద్ధతుడు :**

అమిత దర్పము, శౌర్యము, ఆత్మస్తుతి పరాయణత్వము, అసహనము, చంచలవృత్తి, అహంకారము కలవాడు.

**4. ధీరశాంతుడు :**

వినయము, దయ, సత్యము, శౌచము మొదలైన సద్గుణాలు కలిగిన విప్ర, వైశ్య, సచివాదులు ధీరశాంత నాయకులు.

**నాయిక :**

నాయిక అంటే రూపకంలోని ప్రధాన స్త్రీ పాత్ర. నాయకుని సామాన్య గుణరాశి ఈమెకూ వర్తిస్తాయి. నాయిక మూడు విధాలు. 1. స్వీయ 2. పరకీయ 3. సామాన్య.

అగ్నిసాక్షిగా వివాహమాడిన స్త్రీ స్వీయ. ఇతరుని భార్య, కన్య పరకీయలు. కళానైపుణ్యంగల వేశ్య సామాన్య.

**రసం :**

రస సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన భరతుడు తన నాట్యశాస్త్రంలో

**"నహిరసాదృతే కశ్చిదర్థః ప్రవర్తతే**
**తత్ర విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రసనిష్పత్తిః"[8]**

రసహీనమైన ఏ అర్థాన్ని ప్రవర్తించదు. అట్టి రసం విభావ – అనుభావ, వ్యభిచారి భావాల సంయోగం వలన నిష్పన్నమవుతుందని భరతుడు పేర్కొన్నాడు.

భరతుడి తరువాత రస సిద్ధాంతం మరుగునపడి పోయింది. దీనిని పునరుద్ధరించిన అలంకారికుడు ఆనందవర్ధనుడీ రసమే కావ్యానికి ఆత్మ మరేదికాదు అని ఉద్ఘాటించినవాడు. అభినవగుప్తుడు. ఇతని తన గ్రంథం లోచనంలో

**"రసేనైవ సర్వం జీవతి కావ్యమ్ – నహిరసశూన్యం కించిదస్తి**
**రస ఏవ వస్తుతః ఆత్మావస్త్వలంకారధ్వనీతు సర్వథా రసం ప్రతిపర్యవస్యేతే"**

రసం చేతనే కావ్యం సర్వం జీవిస్తుంది. రసశూన్యమగు కావ్యం ఉండదు. నిజానికి రసమే కావ్యానికి ఆత్మ. వస్త్వలంకార ధ్వనులు సర్వదా రసపర్యవసానాలే అగును.

భరతుడు తన నాట్యశాస్త్రంలో ఎనిమిది రసాలు వాటి స్థాయీ భావాలు చెప్పాడు. తరువాత తొమ్మిదవ రసంగా శాంత రసాన్ని నిర్ణయించినవాడు భట్టోద్భటుడు. ఇతడు తన కావ్యాలంకారసార సంగ్రహంలో తొమ్మిదవ రసాన్ని ఉదహరించాడు. ఇతడే నాట్యశాస్త్రానికి ఒక వ్యాఖ్యానం రాశాడు. (ఈ వ్యాఖ్యానం నేడు లభించుట లేదు).

భట్టోద్భటుడే శాంతరసాన్ని అంగీకరించి, స్థాయీ భావాన్ని నాట్యశాస్త్రంలో ప్రవేశపెట్టాడని కావ్యాలంకారసంగ్రహకర్త పేర్కొన్నాడు. భట్టోద్భటుడు నవరసాల్ని వాటి స్థాయిభావాల్ని క్రింది శ్లోకాలలో తెలియజేశాడు.

---

*8. నాట్యశాస్త్రము, పు. 196*

**"శృంగార హాస్య కరుణరౌద్ర వీర భయానకాః**
**బీభత్సాద్భుత శాంతాశ్చ నవ నాట్యే రసాఃస్మృతాః**
**రతిర్హాసశ్చ శోకశ్చక్రోధోత్సాహో భయం తథా**
**జుగుప్సావిస్మయశమాః స్థాయిభావాః ప్రకీర్తితాః"[9]**

విభావాలతోను, అనుభవాలతోనూ, సాత్విక భావాలతోను, వ్యభిచారి భావాలతోనూ ఆస్వాద్యం చేయబడిన స్థాయిభావమే రసం.

**"విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః**
**అనీయమానః స్వాదుత్వం స్థాయీభావో రసః స్మృతః"[10]**

**విభావాలు :**

'రసోత్పత్తికి కారణమైనది విభావము రతి, హాసము మొదలైన స్థాయి భావాలను విశేషంగా భావింపచేసేవి విభావాలంటారు. లోకంలో రత్యాది స్థాయి భావాలకు కారణంగా ఉన్నవే కావ్య నాట్యాలలో విభావాలని పేరు. ఈ విభావము ఆలంబన విభావం, ఉద్దీపన విభావం అని రెండు రకాలు. రత్యాది స్థాయి భావాలకు కారణాలైన నాయకా నాయకులు ఉద్దీపన విభావం. రత్యాదులకు ఆలంబనాలైన నాయికా నాయకాదుల గుణములు, చేష్టలు, అలంకారాలు, తటస్థ, ఉద్దీప విభావము.

**అనుభావాలు :**

లౌకికాలైన రత్యాదుల కార్యాలైన క్రీగంటి చూపులు మొదలైనవి అనుభవాలు. సహృదయ హృదయస్థితమైన తత్యాధిభావనలను అనుభవింపచేస్తాయి కాబట్టి ఇవి అనుభవాలు.

**"ఉక్తాః స్త్రీణామలంకారా అంగజాశ్చస్వభావజాః**
**తద్రూపాస్సాత్త్వికా భావాస్తథాచేష్టాః పరాఅపి"[11]**

అంగజములైన (మనోభావములు) భావ, హావ, హీలలు మూడు, అయర్నజములైన శోభ, కాంతి, దీప్తి, మాధుర్యం, ప్రగల్భత, ఔదార్యం, ధైర్యం, అను ఏడు స్వభావజాలైన లీల, విలాస,

---

*9. కావ్యాలంకార సంగ్రహము, పు. 301*
*10. దశరూపకము శ్లో.*
*11. కావ్యాలంకార సంగ్రహము, పు. 339*

విచ్ఛిత్తి బిబ్బోక, కిలికించిత, మోట్టాయత, కుట్టమిత, విభ్రమ, లలిత, మద విహృత, తపన, మౌగ్ధ్య, విక్షేప, కుమాహల, హసిత, చకిలి, కేళులు పదెన్మిది. మొత్తం అనుభవాలు ఇరవై ఎనిమిది అనుభావాలు.

**సాత్త్విక భావాలు :**

ఇతరుల కష్టసుఖాలను అనేకసార్లు భావించడం వలన మనకు కలిగే తన్మయత్వం సత్త్వం. దీని వలన కలిగే భావాలే సాత్విక భావాలు.

**"స్తంభఃస్వేదోఽథరోమాఞ్చః స్వరభఙ్గోఽథ వేపథుః**
**వైవర్ణ్యమశ్రు ప్రలయ ఇత్యష్టౌ సాత్త్వికాః స్మృతాః"[12]**

స్తభం (కొయ్యబారి పోవడం), స్వేదం (చెమట పట్టడం), రోమాంచం, స్వరభంగం (కంఠస్వరం మారిపోవడం), వేపథు (కంపం), వైవర్ణ్యం (ముఖ రంగు మారిపోవడం) ప్రళయం (సొమ్మసిలడం) ఇవి ఎనిమిది సాత్త్వికభావాలు.

**వ్యభిచారి భావాలు :**

రత్యాది స్థాయి భావాలలో సంచరించే నిర్వేదాది చిత్తవృత్తులను వ్యభిచారి భావాలు అంటారు.

**"నిర్వేదగ్లాని శఙ్కాఖ్యాస్తథాసూయా మదః శ్రమః**
**ఆలస్యం చైవ దైన్యం చ చిన్తా మోహః స్మృతిర్ధృతిః**
**వ్రీడా చపలతా హర్ష ఆవేగో జడతా తథా,**
**గర్వో విషాద ఔత్సుక్యం నిద్రాపస్మార ఏవ చ.**
**సుప్తం విబోధో, మర్షశ్చాప్యవహిత్థమథోగ్రతా,**
**మతిర్వ్యాధిస్తథోన్మాదస్తథా మరణమేవ చ.**
**త్రాసశ్చైవ వితర్కశ్చ విజ్ఞేయా వ్యభిచారిణః,**
**త్రవస్త్రింశదమీ భావాః సమాఖ్యాతాస్తు నామతః"[13].**

నిర్వేదం, గ్లాని, శంక, అసూయ, మదం, శ్రమ, ఆలస్యం (సోమరితనం) దైన్యం, చింత, మోహం, స్మృతి, ధృత, (ధైర్యం) వ్రీడ (సిగ్గు), చపలత్వం, హర్షం, ఆవేగం (మనస్సులో కంగారు) జడత్వం (కదలిక లేకపోవడం), గర్వం, విషాదం, ఔత్సుక్యం, నిద్ర, అపస్మారం (మూర్ఛ), సుప్తం

---

*12. నాట్యశాస్త్ర ఆంధ్రభాషా వ్యాఖ్య, పు. 212*

*13. నాట్యశాస్త్ర ఆంధ్రభాషా వ్యాఖ్య, పు. 212*

(నిద్ర), విబోధం (మేల్కొనడం) అమర్షం, అవహిత్థం (మనస్సులోని భావాలు దాచుకొనడం), ఉన్మాదం, మరణం, త్రాసం వితర్కం (ఊహ) ఈ పై ముప్పైమూడు వ్యభిచారి భావాలు.

**అర్థ ప్రకృతులు :**

కథను విస్తరించడంలో ఇతివృత్తంలో అయిదంశాలు మనకు కన్పిస్తాయి. వాటికే "అర్థప్రకృతు"లని పేరు.

1. బీజం : కథకు మూలభూతమైన ఘటనను సూచించుట.
2. బిందువు : బీజరూపమైన ఘటనను సూచించుట.
3. పతాక : కథామధ్యమంలో వచ్చే ఉపకథ.
4. ప్రకరి : ప్రాసంగికంలో వచ్చే చిన్నకథ.
5. కార్యం : కథాపరిణామం అనగా ఫలం.

**అవస్థాపంచకం :**

నాయకుని కార్యసాధన దృష్టితో ఇతివృత్తంలో ఐదు స్థితులుండును. వాటికి "అవస్థ"లని పేరు.

1. ఆరంభం : ముఖ్య కార్యసాధనములో నాయకాదులకు కలుగు ఔత్సుక్యం.
2. యత్నం : ఆటంకాలు కలుగుతుండగా వాటిని నివారించుకొంటూ కార్యసాధనంలో నాయకులు చేసే ప్రయత్నం.
3. ప్రాప్త్యాశ : సాధనోపాయాలు, ఆటంకాలు రెండూ ఉంటాయి.
4. నియతాప్తి : ఆటంకాలు నివారింపబడి ఫలప్రాప్తి నిశ్చయంగా కలుగుతుందని విశ్వాసం.
5. ఫలాగమం : ఉద్దేశించిన ఫలము సమగ్రమంగా ప్రాప్తించుట.

**సంధి పంచకం :**

పైన చెప్పిన అయిదర్థ ప్రకృతులు, అయిదవస్థలు క్రమంగా చేర్చినచో ఇతివృత్తంలో 1. ముఖ, 2. ప్రతిముఖ 3. గర్భ 4. అవమర్శ, 5. నిర్వహణ అనే పంచ సంధులు ఏర్పడతాయి.

**1. ముఖసంధి :**

దీని ఆరంభంలో కథ ఇంకా బీజరూపంలో ఉంటుంది. నాయకుడు తన కార్యాన్ని ఆరంభిస్తాడు.

**2. ప్రతిముఖ సంధి :**

దీనిలో కథ మరికొంత పెరుగుతుంది. నాయకుడు కార్యసాధనకై యత్నిస్తాడు.

**3. గర్భసంధి :**

దీనిలో కార్య ఫలము ప్రాప్తించే సూచన కనబడుతుంది.

**4. అవమర్శ సంధి :**

ఇందులో కథ గర్భ సంధి కంటే కొంత ముందుకు సాగుతుంది.

**5. నిర్వహణ సంధి :**

దీనిలో ఇంతవరకు నానా ముఖాలుగా ఉన్న కార్యము ఏకముఖమై ముగుస్తుంది.

**అర్థోపక్షేపకాలు :**

నీరసాలైన, అనుచితాలైన ఇతివృత్త భాగాలను అర్థోపక్షేపకాలచే సూచిస్తారు. దూర ప్రయాణము, హత్య, యుద్ధం, రాజ్య విప్లవం, ముట్టడి, భోజనం, స్నానం లేపనం, వస్త్రధారణం, శయనం మొదలైనవి. వీటిని నాటకంలో ప్రత్యక్షంగా చూపరాదు. నాయకుని వధ ఎక్కడా వర్ణించుట, సూచించుట జరుగరాదు. మధురములై, ఉదాత్తములై, రసభావపూర్ణాలై భాగాలు మాత్రమే నాటకంలో ప్రదర్శించాలి.

**1. విష్కంభం :**

జరిగిపోయిన కథాభాగాన్ని సంగ్రహముగ సూచిస్తుంది. దీనిలో ప్రధాన పాత్రలు ఉండవు. ఇది రెండు విధాలు శుద్ధము, మిశ్రము, మధ్యమ పాత్రలచే చేసేది శుద్ధ విష్కంభం. మధ్యమ, నీచ పాత్రలచే చేసేది మిశ్రమ విష్కంభం.

**2. చూలిక :**

పాత్రలు రంగంపై ప్రవేశింపక తెర వెనుకవుండి మాటలాడి ఏదో ఒక సంగతిని సూచించుట.

**3. అంకాస్యం :**

ఒక అంకం చివర పాత్రలు నిష్క్రమించి రాబోవు అంకం మొదట వస్తు విషయాన్ని సూచించుట.

**4. అంకావతారం :**

ఒక అంకము చివర నిష్క్రమించే పాత్రలు సూచించిన విషయము తరువాతి అంకము అదే పాత్రలతో ప్రారంభమగును.

**5. ప్రవేశకం :**

జరిగిపోయిన కథాంశం నీచ పాత్రలతోనే సూచించును. ఇది రెండంకముల మధ్యలోనే వస్తుంది. విష్కంభం లాగా నాటకం మొదట రాదు.

**వృత్తులు :**

'వృత్తులు' అనగా మాటలతో, అంగాలతో, హావభావాలతో ప్రదర్శించే చేష్టలు. ఈ వృత్తులు నాలుగు. అవి కైశికి, ఆరభటి, సాత్వతీ  వృత్తులు.

**భాష :**

నాటకంలో పాత్రలు ఉత్తమ, మధ్యమ, అధమ పాత్రలుగా విభజించారు.

1. నాయికా, నాయకులు మంత్ర పురోహితులు, హితులు, సన్నిహితులు, ప్రతినాయకుడు మొదలైనవి ఉత్తమ పాత్రలు.

2. విదూషకుడు, దాసదాసీలు, దూతలు, భటులు మొదలగు వారిని జాతి గుణ క్రియాదులను బట్టి మధ్యమ లేదా నీచ పాత్రలుగా చెప్పవచ్చు.

ఎ) నాయకులు, రాజులు, బ్రాహ్మణులు, ఇత్యాదులు సంస్కృతాన్ని మాట్లాడుతారు.

బి) స్త్రీ పాత్రలు, నీచపాత్రలు ప్రాకృత భాషని మాట్లాడుతారు.

సి) పాత్రల గుణాలను, జాతిని బట్టి మహారాష్ట్రీ ప్రాకృతము, శౌరసేనీ, మాగధీ, పైశాచీ భాషలను ఉపయోగిస్తారు.

ఈ విధంగా కొన్ని నిర్దుష్టమైన నాటక లక్షణాలను లాక్షణికులు నిర్దేశించారు.

## 1.5 నాటకం విశిష్టత :

"కావ్యేషు నాటకం రమ్యమ్" అనీ, "నాటకాంతంహి సాహిత్యం" అని మన ఆలంకారికులు చెప్పడాన్ని బట్టి కావ్య ప్రక్రియలన్నింటిలో నాటకమే రమ్యమైనదని వారు భావించారని స్పష్టం అవుతున్నది. ఇతర సాహిత్య ప్రక్రియలైన కావ్య (EPIC) ఆఖ్యానాది (Narrative) ప్రక్రియలో లక్షణాలు నాటకంలో పర్యవసించి ఉండడం వల్ల అన్ని సాహిత్య ప్రక్రియలోను నాటకమే గొప్పదని, మిగిలిన అన్నింటిలో చేయి తిరిగిన వ్యక్తీ నాటక రచనకు న్యాయం చేకూర్చగలడని వారి మతం.

నాటకాన్ని కవిత్వం, వ్యాసం, నవల, ఇలా సాహిత్య ప్రక్రియలతో పోల్చి చూసినప్పుడు నాటకం భిన్నంగా ఉంటుంది. నాటకం తప్ప మిగిలిన సాహిత్య ప్రక్రియలు అన్నింటిలోనూ రచయిత వర్ణనలతో, వివరణలతో తొంగి చూస్తాడు. నవల, కథ వంటి ప్రక్రియలు పరాశ్రయం అయినా, వాటిలో కొంత ఆత్మాశ్రయత కూడ తొంగి చూస్తూ ఉంటుంది. ఇక నాటకం ఆసాంతమూ పరాశ్రయమే. కవి ప్రమేయం ఉండదు. పాత్రలు మాత్రమే కథను ఆవిష్కృతం చేయగలవు. పాత్రల సంభాషణలు, వాటిలో ఉండే అంతరార్థమే వారి వ్యక్తిత్వాల మీద వ్యాఖ్యానం చేయగలవు. అందువల్ల నాటకం రాయడంలో రచయిత చాలా నేర్పరితనం కనబరచవలసి ఉంటుంది. అందువల్ల నాటకం మిగిలిన సాహిత్య ప్రక్రియలకంటే విలక్షణమైనది, విశిష్టమైనది. నాటకంలో సాహిత్యంతోపాటు సంగీత, నాట్య, చిత్రకళాది, ఇతర కళలకు కూడా అవకాశం ఉండటం చేత నాటకాన్ని 'సమాహారకళ'గా గుర్తించారు.

## 1.6 ప్రబంధం అర్థవివరణ :

"ప్రబంధము – సం.వి.అ.పు. – కావ్యము ప్రకృష్ట బంధము, మిక్కిలి కట్టు, అవిచ్ఛేదము, ఎడతెంపులేమి, ఎడతెగకుండుట, గ్రంథము యొక్క రచన, కావ్యము"[14]

"ప్రబంధ వి. కల్పించిన కథలున్న గ్రంథం; కావ్యం, గ్రంథ రచన, ప్రకృష్ణ బంధం, అవిచ్ఛేదం, ఎడతెగకుండా ఉండడం".[15]

---

*14. సూర్యరాయాంధ్ర నిఘంటువు, పు. 799*

*15. తెలుగు – తెలుగు నిఘంటువు, పు. 731*

### 1.7 ప్రబంధ శబ్ద ప్రస్తావన :

ప్రబంధం ఒక ప్రక్రియగా శ్రీకృష్ణదేవరాయల కాలంలో ప్రారంభం అయినప్పటికీ ప్రబంధ శబ్ద ప్రస్తావన పూర్వం నుంచి అనేక కావ్యాలలో, లక్షణ గ్రంథాలలో ఉంది.

### 1.7.1 సంస్కృత సాహిత్యం – ప్రబంధ శబ్దం :

**పాణిని :**

పాణిని అష్టాధ్యాయిలో “నా నద్య తనవత్ క్రియా ప్రబంధ సామీప్యయోః”[16] ఇక్కడ ప్రబంధ శబ్దానికి ‘సాతత్య’ అని అర్థం. ఈ అర్థాన్ని బట్టి ప్రబంధ శబ్దానికి కవి కావ్యంతో గాని, సాహిత్యంతోగాని సంబంధంలేదు. ఇది కేవలం కాల నైరంతర్యాన్ని సూచిస్తుంది. కూర్పు విషయమైన నైరంతర్యమే ప్రబంధం.

**భామహుడు**

భామహుని కావ్యాలంకారమే శ్రవ్యకావ్యాలకి మొదటి లక్షణగ్రంథము. ఇందు భావికమనే ప్రబంధగుణం కావ్యానికి ప్రత్యక్షయమానత్వాన్ని ప్రసాదిస్తుంది.

**“భావికత్వ మితిప్రాహుః ప్రబంధవిషయం గుణమ్**
**ప్రత్యక్షా ఇవ దృశ్యంతే యత్రార్థా భూతభావినః”[17]**

భామహుడు తన కావ్యాలంకారంలో పదకావ్యాన్ని ప్రబంధం అని మొట్టమొదట పేర్కొన్నాడు.

**ఆనందవర్ధనుడు :**

ఆనందవర్ధనుడు ధ్వన్యాలోకంలో

**“ప్రసిద్ధేఽపి ప్రబన్ధానాం నానారసనిబన్ధనే,**
**ఏకో రసోఽఙ్గీకర్తవ్యస్తేషాముత్కర్ష మిచ్ఛతా”॥[18]**

---

*16. అష్టాధ్యాయి 3వ అధ్యాయం, 3వ పాదం సూ. 1651*

*17. కావ్యాలంకారము పరిచ్ఛేదము, శ్లో. 53*

*18. ధ్వన్యాలోకము, పు. 698*

ఇక్కడ ప్రబంధేషు అనగా మహా కావ్యాదిషు, నాటకాదిషువా అని వృత్తి తెల్పుచున్నది. ఆనందవర్ధనుడే మరొక చోట 'యథా కాళిదాస ప్రబంధేషు' అని కాళిదాసుని కావ్యములను ప్రబంధములని పేర్కొన్నాడు.

**భోజుడు :**

భోజుడు తన చంపూ రామాయణంలో

**"గద్యానుబంధ రసమిశ్రిత పద్యసూక్తి**
**ర్హృద్యాహి వాద్యకలయా కలితేవ గీతిః**
**తస్మా ద్దధాతు కవిమార్గవిదాం సుఖాయ**
**చంపూ ప్రబంధ రచనాం రసనా మదీయా"[19]**

భోజుడు తన లక్షణ గ్రంథములందు ప్రబంధ దోష, ప్రబంధ గుణ ప్రబంధాలంకార ద్యనేక ప్రబంధ విషయాలను గురించి చర్చించాడు.

**1.7.2 తెలుగు సాహిత్యం - ప్రబంధశబ్దం :**

**నన్నయ్య :**

**"సత్యవాక్ప్రబంధశతసహస్రశ్లోక"[20]**

నన్నయ వ్యాసుడి మహాభారతాన్ని ప్రబంధమని పేర్కొన్నాడు.

**నన్నెచోడుడు :**

మొట్టమొదటగా తెలుగు సాహిత్యంలో ప్రబంధ శబ్దాన్ని ప్రయోగించినవాడు నన్నెచోడుడు.

**"విస్తరించెద ప్రబంధము సద్రసబంధురంబుగాన్"[21]**

**తిక్కన :**

తిక్కన తను రచించిన పదిహేను పర్వాల్ని ప్రబంధమండలి అని పేర్కొన్నాడు.

**"అని రచనా కౌతుకమున మన మలరఁగఁ నీ ప్రబంధ మండలి కథినా**
**ధునిఁగా నే పురుషునిఁ బేర్కొను వాఁడనొ యను తలంపు గూరిన మదితోన్"[22]**

---

*19. రామాయణ చంపువు, శ్లో. 126*

*20. శ్రీమదాంధ్ర మహాభారతము, పు. 207*

*21. కుమార సంభవం, మొదటి అధ్యాయం, పద్యం, 48*

*22. శ్రీమదాంధ్ర మహాభారతము, పు. 5*

**పాల్కురికి సోమనాథుడు :**

పాల్కురికి సోమనాథుడు తన బసవ పురాణాన్ని ప్రబంధమని వర్ణించినాడు.

**"బసవపురాణ ప్రబంధ మన్ పేర బసవపురాణ మన్ పట్టిగలాఁడ"[23]**

పండితారాధ్య చరిత్ర చివరలో

**"పండితారాధ్య ప్రబంధ నిస్తార, పండితారాధ్య ప్రబంధ విస్తార**
**పండితారాధ్య ప్రబంధ శృంగార, పండితారాధ్య ప్రబంధ ప్రపూర"[24]**

**శ్రీనాథుడు :**

**"ఆగమ జ్ఞానవిధివి తత్త్వర్థ ఖనివి**
**బహుపురాణజ్ఞుఁడవు శుభ భవ్యమతివి**
**బాలసఖుఁడవు శైవ ప్రబంధమొకటి**
**యవధరింపుము నా పేర నంకితముగ"[25]**

అని అవచి తిప్పయ్యశెట్టి శ్రీనాథుడిని అర్థించినట్లు తెలుపుతుంది.

**పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు :**

పినవీరభద్రుడు తన శృంగార శాకుంతలాన్ని మిశ్ర ప్రబంధమని పేర్కొనుటయే కాక –

**"శృంగారము ముఖ్యంబగు**
**నంగియు నంగములుఁ దలప నన్య రసములున్**
**న్సాంగ మగునేని దంకము**
**బంగారముతోడి యొర ప్రబంధము వొందున్"[26]**

**మంచన :**

మంచన కవి తన కేయూర బాహు చరిత్ర రచనా ప్రారంభంలో కృతిపతియైన నందూరి గుండయామాత్యుడు తనని గురించి ఈ విధంగా పలికినట్లు రాసుకున్నాడు.

*23. పండితారాధ్య చరిత్ర, ఉపోద్ఘాతము, పు. XX*
*24. పండితారాధ్య చరిత్ర*
*25. హరవిలాసము, పు. 16*
*26. శృంగార శాకుంతలము, పు. 7*

**"కావున నాకు నొక్క కృతి గైకొన నిష్టము, నీవు ప్రాజ్ఞసం**
**భావిత కావ్యదక్షుఁడవు భవ్యమతిం ద్విజదేవనిర్మితం**
**బై విలసిల్లు తంత్రము ప్రియంబగుఁ జూచితి నందుఁ గర్ణ సౌ**
**ఖ్యావహమై ప్రబంధరచనాశ్రయ మయ్యెడు మార్గమూతగన్"**[27]

పై ఉదహరించిన కవుల ప్రయోగాలను గమనించగా సంస్కృత లౌకిక వాఙ్మయంలో సమస్త గ్రంథాలకి రచనా భేదాన్ని పాటించక ప్రబంధ శబ్దాన్నే వ్యవహరించారు. సంస్కృతంలో ప్రబంధ శబ్దం కాళిదాసు కాలం నుండి కవులచే అక్కడక్కడ ప్రయోగింపబడిన ప్రతాపరుద్రుని యాస్థాన కవి అయిన విద్యానాథుని కాలాన్ని ఎక్కువగా ప్రబంధ శబ్దానికి ఎక్కువగా ప్రచారం కల్పించాడు. విద్యానాథుడు అవలంభించిన మార్గాన్ని అనుసరించి ఎఱ్ఱన్న మొదలైన కవులు తమ కావ్యాలలో ప్రబంధ శబ్దాన్ని విరివిగా వాడారు.

### 1.8 ప్రబంధ నిర్వచనాలు

ప్రబంధానికి ప్రాచీన కవులు, ఆధునిక విమర్శకులు ఇచ్చిన నిర్వచనాలను పల్లా దుర్గయ్య గారు ప్రబంధ వాఙ్మయ వికాసంలో క్రింది విధంగా పేర్కొన్నారు.

### 1.8.1 ప్రబంధాల కవులు నిర్వచనాలు

1. "పురాణోక్తములును గతిధ్వంసకములును నగు రససమంచిత కథలను శిరీషకుసుమపేశల సుధామయోక్తులతో విననింపుగా చెప్పిన చతుర రచనము ప్రబంధ"మని పెద్దనగారి అభిప్రాయము.

2. "నవ్య భాషా శతధాని గుంభన రసస్థిత నొప్పుదతిర్పుగా చెప్పిన కావ్యము ప్రబంధ"మని ధూరట్టి కవి నుడివెను.

3. "సకల లక్షణ లక్షితంబును నపూర్వ కథా సంవిధాన వైచిత్రీమహనీయంబును, శృంగారరస ప్రాయంబును, బుణ్యవస్తు వర్ణనాకర్ణనీయంబును" అగు కావ్య విశేషము ప్రబంధమని పింగళిసూరన పేర్కొనెను. (కళాపూర్ణోదయము పీఠిక).

4. "పురాతన పుణ్యశ్లోక రాజర్షి నాకర్ణనోత్కంఠిత సకలజన సేవ్యముగా రసోచిత చమత్క్రియా కల్పనాకల్ప భవ్యముగా నొనర్పబడిన కేవల కల్పనలుగాని మిశ్రకథలు ప్రబంధము"లని రామరాజభూషణుని నిశ్చితాభిప్రాయము. ఈ భావము కొఱవి గోపరాజు నుండి, పినవీరన

*27. కేయూరబాహు చరిత్ర, పు. 3*

శృంగార శాకుంతలమునుండి గ్రహింపబడి కాని కొత్తది కాదని పల్లా దుర్గయ్య తమ ప్రబంధ వాఙ్మయ వికాసములో పేర్కొన్నారు.

తెనాలి రామకృష్ణ కవి కూడ ఈ అభిప్రాయమే కలవాడు.

**"స్కంధపురాణ నీరనిధి కౌస్తుభమైప్రభవించు దేవకీ**
**నందను సత్కథోద్యమము నవ్యకవిత్వ కళాకలాపమున్**
**కుందనమున్ ఘటించి కడుఁ గ్రొత్తగు సొమ్మొనరించి, విష్ణు సే**
**వందులకించు న సర్వమ వైష్ణవకోటి నలంకరింపుమా!"[28]**

సంకుసాల నృసింహకవి కవి కర్ణ రసాయనమున తన అభిప్రాయాన్ని ఈ విధంగా చెప్పాడు–

**"కావ్యముత్పాద్యమైన సత్కావ్య మింక**
**సుక్తకావ్యంబయేఁ బునరుక్తిఁ దెచ్చుఁ**
**గాన కవితాభిముఖుఁడైన కవి వరునకు**
**మిశ్రకావ్యంబె కావ్యమై మెచ్చుఁ దెచ్చు"[29]**

పై పేర్కొన్న అభిప్రాయాల్నిబట్టి ప్రబంధ కవులందరూ స్థూలంగా ఇంచుమించుగా ఒకే అభిప్రాయము కలవారు. కాని సూక్ష్మంగా పరిశీలించిన ఇవి పరస్పర భిన్నత్వాన్ని ప్రకటిస్తాయి.

### 1.8.2 ఆధునిక పండిత విమర్శకుల అభిప్రాయాలు :

"ప్రబంధమున కేర్పడినవి యిరువది యొక్క వర్ణనములు. అవిలేనిచో నదిప్రబంధము కాదు" "ప్రబంధములు కథా చమత్కారముకొఱకేర్పడినవి కావు ఇవి ప్రత్యేకముగా వర్ణనా ప్రాగల్భమును జూపుటకే యేర్పడినవి". "ప్రబంధ కవిత్వమునకు వర్ణనా పాండిత్యమే ప్రధానము. అది కలిగి యుండనినాడే కృతియు ప్రబంధము కాదు". "కేవల భాషాంతరీకరణములు కాక రాజాదరణము వలన నూతన కల్పనలతో ప్రబంధ రాజములు పుట్ట నారంభమయిన యీ కాలమును ప్రబంధయుగమని చెప్పవచ్చు".

"పురాణముల నుండి కథనుగైకొని స్వకపోల కల్పనలను విశేషముగాఁ జేర్చి పెంచి చెప్పిన కేవలాంధ్రీకరణలు కాని రచనలు ప్రబంధములు"[30]

---

*28. పాండురంగ మహాత్మ్యము, ఆశ్వా. 1, ప. 26*

*29. ప్రబంధ వాఙ్మయ వికాసము, పు. 76-77*

*30. ప్రబంధ వాఙ్మయ వికాసము, పు. 79*

ఇంతవరకు తెలుపబడిన ప్రాచీనార్వాచీనాంధ్ర కవుల అభిప్రాయాలను బట్టి పెద్దనాదుల స్వరూప స్వభావాలను అనుసరించి ప్రబంధాన్ని ఈ క్రింది విధంగా పల్లా దుర్గయ్య ప్రబంధ వాఙ్మయ వికాసములో పేర్కొన్నారు.

"పురాణాదులలోని "ఏకదేశకథ" ఇతివృత్తమై దివ్యాదివ్య నాయకమై తద్గుణవంశ శంసనము ద్వారా కాంతా సమ్మితోపదేశయుజమై, సద్యః పరనిర్వృతి సాధారణ ఫలమును, మోక్షసిద్ధియు పరమ ప్రయోజనమై భక్తి శృంగారముల (వీరము)లో నొకటి ప్రధానరసమై దృశ్యాదృశ్య కావ్యలక్షణ, సమ్మిశ్రితమై, యష్టాదశవర్ణనాలంకృతముగ దత్సమ శైలిలో గాని యచ్చ తెలుగులో గాని చంపూ పద్ధతిని నాతి విస్తరముగ కూర్పబడిన మిశ్రబంధము ప్రబంధమగును".[31]

## 1.9 ప్రబంధ లక్షణాలు

### 1. వస్త్వైక్యం :

వస్తువు అంటే ఇతివృత్తం. మహాకావ్యాలల్లో ప్రఖ్యాతం, ఉత్పాద్యం, మిశ్రమం అని ఇతివృత్తం మూడు విధాలు. ప్రఖ్యాతం అంటే పురాణేతిహాసాల నుండి తీసుకొన్న ఇతివృత్తం ఉత్పాద్యం అంటే కల్పితమైన ఇతివృత్తం మిశ్రమం అంటే ప్రసిద్ధ ఇతివృత్తానికి కల్పనలు జోడిస్తే మిశ్రమం.

వస్తువు ఏదైనా రచనలో వస్త్వైక్యాన్ని తప్పక పాటించాలి. అంటే కావ్యం అంతా ఏకసూత్రంలో బంధింపబడాలి. ఒక వృత్తాంతాన్ని వర్ణించినా, పలు వృత్తాంతాలు వర్ణించినా అందులోని సంఘటనలకు ఒకదానితో మరోదానికి సంబంధం ఉండాలి. చివరకు వస్త్వైకాన్ని సాధింపగలగాలి. ఉదా : వసుచరిత్ర, పాండురంగ మహాత్మ్యము మొదలైనవి.

### 2. అష్టాదశ వర్ణనలు :

ప్రబంధాల్లో అష్టాదశ వర్ణనలకు ప్రత్యేకస్థానం ఉంది. కథ ఎంత ముఖ్యమో వర్ణనలు కూడా అంతే ముఖ్యం.

కవి తన అలంకారిక శైలిని, లోకజ్ఞతను, ప్రతిభను ప్రదర్శించడానికి వర్ణనలు దోహదపడతాయి. ఐతే వర్ణనలు అతి విస్తారంగా కాకుండ సందర్భోచితంగా ఉండాలని లాక్షణికులు చెప్పారు.

---

*31. ప్రబంధ వాఙ్మయ వికాసము*

**3. ఏకనాయకాశ్రయత్వం :**

కావ్యాల్లో, ప్రబంధాల్లో చాలావరకు కథంతా ఒకే నాయకుడి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. కానీ ప్రబంధాల్లో కొందరు ఇది పాటించినా, కొందరు పాటించలేదు. ఒకే కథలో ఒకరికన్నా ఎక్కువ నాయకులను చిత్రించారు.

ఉదా : ప్రభావతీ ప్రద్యుమ్నం, వసుచరిత్ర, పారిజాతాపహరణం మొదలైనవి. ఏకనాయకాశ్రయాలు. 'కళాపూర్ణోదయం, పాండురంగ మహత్మ్యం, మనుచరిత్ర మొదలైనవి దీనికి కట్టుబడకుండా ఒక కావ్యంలో ఒకరికన్నా ఎక్కువ నాయకులను చిత్రించారు.

**4. శృంగార రస ప్రాధాన్యం :**

కావ్యాల్లో, సందర్భానుకూలంగా శృంగారం లేదా వీరరసం ప్రధానంగా ఇతర రసాలు దానికి పోషకాలుగా ఉంటాయి. కానీ ప్రబంధాల్లో శృంగారరసానికి పెద్దపీట వేశారు.

శృంగారంలోని సంభోగ, వియోగ శృంగారాలు, విప్రలంభ శృంగారం, శృంగార రసాభాసాలను కూడా పోషించి శృంగార రసానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు.

**5. అలంకారికశైలి :**

ప్రబంధాల్లో శైలికి అత్యంత ప్రాముఖ్యతను ఇచ్చారు. పద్య రచనను ఒక కళగా భావించి, ఒక్కొక్క పద్యాన్ని ఒక్కొక్క ఆణిముత్యంగా తీర్చిదిద్దుతూ ఒకదాని కన్నా ఒకటి ప్రౌఢ ప్రబంధంగా రచించారు. ప్రబంధాల్లో శబ్ద, అర్థాలంకారాలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారు. ఒక్కో కావ్యం విభిన్నమైన ఆలంకారిక శైలులతో అందంగా రచించబడ్డాయి.

**6. పాత్రచిత్రణ :**

ప్రబంధయుగంలో సజీవ పాత్రచిత్రణ జరిగింది. ప్రబంధ కవులు పాత్రల చేష్టలు, హావభావాలు సజీవంగా చిత్రించారు. నాటకాల్లో కనిపించే సంభాషణలు వారి మనోప్రవృత్తులు, మాట్లాడే పద్ధతి కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

ప్రబంధయుగంలో వచ్చిన అపూర్వ అద్భుత పాత్రలు మరే యుగ రచనల్లోనూ కనిపించవు. సత్యభామ, వరూధినీ–ప్రవరులు, శుక్తిమతీ – కోలాహలుడు, శుచిముఖి, గిరికా–వసురాజు ఇత్యాది

అపూర్వ పాత్రలను సృష్టించి ప్రబంధ కవులు "నభూతో నభవిష్యతి" అన్న విధంగా పాత్ర కల్పన చేశారు.

**7. నాటకీయత :**

ప్రబంధ లక్షణాల్లో 'నాటకీయత' మరో ముఖ్య లక్షణం. తెలుగులో నాటకాలు అప్పటి వరకు రానప్పటికీ నాటకంలోని అంక విభజన పద్ధతిలో ఆశ్వాసాలను విభజించడం, పాత్రోచిత సంభాషణలను కల్పించటం, సన్నివేశాలకు అనుగుణంగా పాత్రలను ప్రవేశపెట్టడం కథానుగుణంగా పాత్రలను సృష్టించడం, నాట్యశాస్త్ర మర్యాదలను పాటిస్తూ సంగీతం మొదలైన లలిత కళలను ప్రదర్శిస్తూ, నాటక లక్షణాలను పాటిస్తూ నాటకీయతను ప్రదర్శించడం.

**8. జాతి వార్తా చమత్కారాలు :**

జాతి అనగా సమాజంలోని వాస్తవ ప్రతిబింబ చిత్రణం. ప్రబంధయుగ రచనల్లో ఆనాటి సమాజంలోని జీవన విధానం ప్రస్ఫుటంగా ప్రబిబింబించే విధంగా రచనలు చేశారు.

ఈ విధంగా కావ్య యుగానంతరం విభిన్న శైలులతో, వర్ణనలతో, వైవిధ్యమైన కథా కల్పనలతో ప్రబంధం విలసిల్లింది. అందువల్లనే ప్రబంధ యుగాన్ని స్వర్ణయుగంగా అభివర్ణించారు.

**1.10 నాటక ప్రబంధాల్లో భేద సాదృశ్యాలు :**

**భేదాలు**

| నాటకము | ప్రబంధము |
|---|---|
| 1. అంక విభజన ఉంటుంది | ఆశ్వాసాలుగా విభజిస్తారు. |
| 2. ఉదాత్తమైన ఇతివృత్తం | చదువుటకు, వినుటకు యోగ్యంగా ఉండి వినడం ద్వారానే రసానందం అనుకూలంగా ఉండాలి. |
| 3. కథ సంభాషణా పద్ధతిలో సాగుతుంది | కథాకథన పద్ధతిలో నడుస్తుంది. |
| 4. రచయిత నేరుగా కథని నడిపించడానికి వీలులేనందువలన సంభాషణల ద్వారా కథ చెప్పడానికి ఎక్కువ పాత్రలు ప్రవేశ పెట్టాలి. | కవి నేరుగా కావ్యాన్ని చెప్పేవీలు ఉండడం చేత కావ్యంలో తక్కువ పాత్రలను ప్రవేశపెడితే చాలు. |

| | |
|---|---|
| 5. వర్ణనలకు అవకాశం తక్కువ | వర్ణనాత్మకమైనది. అష్టాదశ వర్ణనలుంటాయి. |
| 6. సులభమైన, సంభాషణా రూపమైన శైలి, వైదర్భీరీతిలో కూడి ఉంటుంది. | అలంకారికమైన, ప్రౌఢ సమాసాలతో కూడిన శైలి ఉంటుంది. |
| 7. నాటకము ప్రారంభంలో నాందీ, ప్రస్తావనలు చివరిలో భరతవాక్యం ఉంటుంది. | ఇష్టదేవతా స్తుతి, కుకవినింద, సుకవి ప్రశంస, కృతిపతి వంశ వర్ణన, షష్ఠ్యంతాలు ప్రారంభంలో ఉండి, మంగళాశాసనములు చివర ఉంటాయి. |
| 8. నాటకంలో పాత్రోచితమైన భాష ఉంటుంది. | ప్రబంధమంతటా ఒకే విధమైన శైలిలో ఒకే భాష ఉంటుంది. |

ఈ విధంగా నాటక ప్రబంధాల్లో భేదాలుంటాయి. ఇక ఇందులోని సమానాంశాలను పరిశీలిస్తాను.

**సాదృశ్యాలు**

1. ప్రబంధ – నాటకాల్లో ప్రఖ్యాత ఇతివృత్తాన్ని గ్రహించి ప్రక్రియానుగుణమైన మార్పులు చేస్తారు.
2. ఉదాత్త ప్రకృతి గల నాయికా, నాయకులుంటారు.
3. ప్రబంధ నాటకాల్లో రసపోషణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు.
4. ప్రబంధ నాటకాల్లో వస్త్వైక్యం తప్పనిసరిగా పాటింపబడాలి.
5. నాటకంలో పంచ సంధులుంటాయి. ప్రబంధంలో అవి లేకపోయినా సంఘటనానుకూలంగా కథను విభజిస్తారు.
6. నాటకం – ప్రబంధం ఈ రెండింటి ప్రయోజనం కాంతా సమ్మితమైన ఉపదేశంతో పాటుగా, రసానందాన్ని కలుగజేయడం.
7. ప్రబంధ నాటకాలు రెండింటిలోనూ గద్య పద్యాలుంటాయి.

ఈ విధంగా ప్రబంధ నాటకాల్లో కొన్ని భేదాలున్నప్పటికీ కొన్ని సమాన లక్షణాలుండటం వలననే, ఆనాటికి తెలుగులో నాటకాలు అవతరించకపోవడం వలన పినవీరనాది కవులు సంస్కృత నాటకాలను తెలుగులో కావ్య ప్రబంధాలుగా అనువాదం చేశారు.

## 1.11 తులనాత్మక విమర్శలో అనువాదాల పాత్ర :

తులనాత్మక అధ్యయనంలో అనువాదం ప్రధానమైన పాత్ర వహిస్తుంది. భారతదేశం బహు భాషలకు పుట్టినిల్లు. మనదేశంలో ఎన్ని భాషలున్నాయో, దాదాపు అన్ని భాషల్లోనూ సాహిత్యం ఆవిర్భవించింది. అయితే ఒక భాషకు చెందిన పాఠకుడు తన మాతృభాషలోని సాహిత్యాన్ని మాత్రమే చదవగలుగుతాడు. మరో భాషలోని సాహిత్యాన్ని చదవాలంటే మనకు భాషలో ప్రావీణ్యం లేకపోయినా మనం వివిధ భాషల సాహిత్యాలను చదువగలిగిన అవకాశాన్ని మన కవులు, పండితులు మనకు కల్పించారు. ఒక భాషకన్నా ఎక్కువ భాషల్లో ప్రావీణ్యం గల రచయితలు అనువాదానికి పూనుకున్నప్పుడు పాఠకులు బహుభాషా సాహిత్యాలను చదువుకోవడానికి వీలవుతుంది.

ఆది కవియైన నన్నయ సంస్కృతంలో వ్యాసుడు రచించిన మహాభారతాన్ని తెలుగులో రచించడం వల్లనే తెలుగు జాతి భారతాన్ని చదువుకొని ఆనందించగలిగింది. ఈ యుగంలో సంస్కృతం నుండి అనువదింపబడిన కావ్యాలే ఎక్కువగా ఉండుటవలన ఈ యుగాన్ని భాషాంతీకరణ యుగమని కూడా అన్నారు. ఈ అనువాదము శ్రీనాథ, ప్రబంధ యుగానికి కూడ విస్తరించింది. అయితే ఈ అనుకరణ విధానాన్ని కొర్లపాటి శ్రీరామమూర్తి గారు క్రింది విధంగా వివరించారు.

“ఈ ఆంధ్రీకరణం త్రివిధం. అది 1. స్వతంత్రాంధ్రీకరణము, 2. అస్వతంత్రాంధ్రీకరణము 3. స్వతంత్రాస్వతంత్రాంధ్రీ కరణము. మూలాతనాయికమైన ఆంధ్రీకరణము స్వతంత్ర పద్ధతి. యథా మూలకమైన ఆంధ్రీకరణము అస్వతంత్ర పద్ధతి. మూలాతి నాయికత, యధా మూలకత కల మాతృకానుసారమైన ఆంధ్రీకరణము స్వతంత్రా స్వతంత్ర పద్ధతి”.[32]

ఈ ఆంధ్రీకరణ విధానాన్ని డి. రాజేశ్వరిగారు కథానువాదాలు, భావానువాదాలు పదానువాదాలు అని మూడు విధాలుగా విభజించారు.

ఈ అనువాదాలను మరో రకంగా కూడ చేయవచ్చు. 1. ఏక ప్రక్రియాను వాదాలు. 2. భిన్న ప్రక్రియాను వాదాలు.

### 1.11.1. ఏక ప్రక్రియానువాదాలు :

తెలుగు సాహిత్యం ఆరంభం నుండి పరిశీలిస్తే మహాభారత ఇతిహాసాన్ని ఇతిహాస కావ్యంగా మలిచారు. సంస్కృతములోని పురాణాలను తెలుగులో మారన మార్కండేయ పురాణంగా రచించాడు. హర్ష నైషధాన్ని శ్రీనాథుడు శృంగార నైషధం కావ్యంగా రచించాడు. వాల్మీకి రామాయణాన్ని ఆధారంగా

---

*32. తెలుగు సాహిత్య చరిత్ర, పు. 33*

చేసుకొని రంగనాథ, మొల్ల, భాస్కర రామాయణాలు వెలువడినాయి. ఈ విధంగా సంస్కృతంలోని ఒక సాహిత్య ప్రక్రియను తెలుగులో కూడ అదే సాహిత్య ప్రక్రియలోకి అనువదించినపుడు అవి ఏక ప్రక్రియాను వాదములు.

### 1.11.2 భిన్న ప్రక్రియానువాదములు :

ఇందులో సంస్కృత సాహిత్యంలోని నాటకాది ప్రక్రియలను తెలుగు సాహిత్యంలో కావ్య, ప్రబంధాది విభిన్న ప్రక్రియలుగా అనువదించుట జరిగింది. అంటే సంస్కృత సాహిత్యానికి చెందిన ఒక ప్రక్రియను ఆ ప్రక్రియలో కాకుండ మరో సాహిత్య ప్రక్రియగా అనువదించడం. ఉదాహరణలుగా కేయూరబాహు చరిత్ర, ప్రబోధ చంద్రోదయము, శృంగార శాకుంతలములను చూడవచ్చు. ఈ రచనలన్నీ సంస్కృత నాటకములను తెలుగున కావ్య, ప్రబంధాలుగా మలిచారు. దశకుమార చరిత్ర, విక్రమార్క చరిత్ర, సింహాసనద్వాత్రింశిక, భోజరాజీయము మొదలైన సంస్కృతంలో రచించిన ఈ కథాకావ్యాలను గద్యకావ్య ప్రక్రియలుగా రచించగా, తెలుగులో ఈ గ్రంథాలు చంపూకావ్య పద్ధతిలో రచింపబడ్డాయి. ఈ విధంగా వచ్చిన రచనలను భిన్న ప్రక్రియాను వాదములుగా విభజింపవచ్చు.

అయితే మూలం నుండి ఒకే ఇతివృత్తాన్ని గ్రహించి ఇద్దరు రచయితలు విభిన్న ప్రక్రియల్లో రచన చేసినపుడు ఆ రెండు రచనల తారతమ్య పరిశీలన చేస్తూ ప్రక్రియా దృక్కోణంలో పరిశీలించడం వలన ఆయా ప్రక్రియల్లోని భేదసాదృశ్యాలను నిర్ణయింపవచ్చు. రెండు రచనల వైశిష్ట్యాన్ని, గుణదోషాల తారతమ్యాన్ని గుర్తించి, వారి వారి కావ్య రచనా ధోరణులను ప్రకటించడం వలన పాఠకులు ఒక రచనను గురించి ఎక్కువ అంశాలు తెలుగుకోగలుగుతారు. కావున సాహిత్య విమర్శలో ప్రక్రియా దృక్కోణ, తులనాత్మక పరిశీలనా ధోరణి సాహిత్య వికాసానికి ఎంతగానో దోహదం చేస్తాయి.

## 2వ అధ్యాయం

# చండకౌశికమ్ - హరిశ్చంద్రోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన

## 2వ అధ్యాయం

# చండకౌశికమ్ - హరిశ్చంద్రోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన

## 2.0 కవి పరిచయం

### క్షేమీశ్వరుడు

చండకౌశికము నాటకకర్త క్షేమీశ్వరుడు. ఇతడు రాజశేఖరునికి ఆశ్రయదాత అయిన కనౌజురాజు మహీపాలుని ఆస్థానకవి. ఇతడు రాజశేఖరునికి సమకాలికుడైన వయసులో అతని కన్న చిన్నవాడు. ఇతని కాలం క్రీ.శ. 900 ప్రాంతం. ఈ కవి మహీపాలుని ప్రీతి కొరకు చండకౌశికమనే నాటకాన్ని రాసాడు. మార్కండేయ పురాణంలోని హరిశ్చంద్రుని కథ ఆధారంగా ఈ నాటకం రచించాడు. దీనిలో ఐదు అంకాలున్నాయి. ఈ నాటకంలో కవి భయంకరమైన శ్మశాన భూమిని చిత్రించాడు. అక్కడక్కడ భవభూతి భయంకర వర్ణనలను పోలిన వర్ణనలు దీనిలో ఉన్నాయి. క్షేమీశ్వరుని రెండవ నాటకం నైషధానందం. దీనిలో ఏడు అంకాలున్నవి. క్షేమీశ్వరుని శైలి ప్రసాదగుణ భరితమైంది.

### గౌరన

హరిశ్చంద్రోపాఖ్యానం కావ్యకర్త గౌరన. ఇతని పెదతండ్రి పేరు పోతన. ఈయన గొప్ప మంత్రి. క్రీ.శ. 1361-1384 దాకా దేవరకొండను పాలించిన మాదానాయకుని దగ్గర ఉండేవాడు. గౌరన తండ్రి కూడ మంత్రే. ఈయన పేరు అయ్యలు మంత్రి. తల్లి పోచాంబ. గౌరన తనకి తాను కవిత్వసుమహిత సామ్రాజ్యసుఖపరాయణునిగా చెప్పుకొన్నాడు. ఇతడికి చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి, ప్రతివాది మదగజ పంచాననుడు అనే బిరుదులు ఉన్నాయి. ఇతడు లక్షణదీపిక అనే ప్రామాణిక లక్షణగ్రంథం రాశాడు. గౌరన హరిశ్చంద్రోపాఖ్యానంతో పాటు నవనాధచరిత్ర అనే మరో గ్రంథాన్ని కూడ రాశాడు.

గౌరన తరువాత హరిశ్చంద్రోపాఖ్యానాన్ని శంకర, శరభ కవులు ప్రబంధంగా రచించారు. తరువాత రామరాజ భూషణుడు ద్వ్యర్థి కావ్యంగా రాశాడు. తరువాత హరిశ్చంద్రుని కథపై కావ్యాలు, నాటకాలు కోకొల్లలుగా వచ్చాయి. చండకౌశికమ్ నాటకం, హరిశ్చంద్రోపాఖ్యానము కావ్యం రెండూ మిశ్రమాలే. ఈ రెండూ పురాణ కథని తీసుకొని రచయితలు కావ్యనాటకాలకు తగిన కల్పనలు చేసి రసవత్తరంగా రచించారు.

## 2.1.0 ఇతివృత్త పరిచయం

విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడుని దానం అడుగుతాడు. హరిశ్చంద్రుడు తనకున్న సమస్తాన్ని దానంగా ఇస్తాడు. విశ్వామిత్రుడు దానం చేసేటప్పుడు దక్షిణగా మరికొంత ధనాన్ని అడుగుతాడు. హరిశ్చంద్రుడు కాశీ పట్టణంలో తన భార్యని, కుమారుడిని విక్రయించి తానూ అమ్ముడు పోతాడు. హరిశ్చంద్రుడి భార్య చంద్రమతి దాసిగా సేవలు చేస్తుంది. హరిశ్చంద్రుడు వీరబాహుడి దగ్గర కాటి కాపరిగా ఉంటాడు. కుమారుడు లోహితుడు పాము కాటుచేత మరణిస్తాడు. చంద్రమతి మరణించిన పిల్లాడిని తీసుకొని శ్మశానానికి వెళ్తుంది. శ్మశానంలో చెల్లించవలసిన పైకాన్ని ఇవ్వమని హరిశ్చంద్రుడు చంద్రమతిని అడుగుతాడు. ఒకరికొకరు చంద్రమతి, హరిశ్చంద్రులుగా తెలుసుకొని ఎంతో బాధపడతారు. అప్పుడు పరమేశ్వరుడు ప్రత్యక్షమై వారిని కాపాడతాడు. స్థూలంగా కథ ఇది. అయితే నాటకంలోనూ, కావ్యంలోనూ అనేక మార్పులు, చేర్పులూ ఉన్నాయి. వాటిని క్రింద వివరించాను.

హరిశ్చంద్రుని భార్య, కొడుకుల పాత్రలకు కావ్యనాటకాలలో వేరు వేరు పేర్లు ఉన్నాయి. కావ్యంలో హరిశ్చంద్రుని భార్య పేరు చంద్రమతి. నాటకంలో హరిశ్చంద్రుని భార్య పేరు శైబ్య. అదే విధంగా హరిశ్చంద్రుని కుమారుడి పేరు కావ్యంలో లోహితాస్యుడు, నాటకంలో రోహితాశ్యుడుగా ఉంది. నేను ఈ పరిశోధనలో కావ్య నాటకాలలో ఉన్న ఆయా పేర్లతోనే వ్యవహరించాను.

## 2.1.1 నాటకంలో కల్పనలు

1. హరిశ్చంద్రుడు కులపతి ఆదేశానుసారం నిశాప్రజాగరవ్రతంలో ఉంటాడు. శైబ్య హరిశ్చంద్రుడి కోసం ఎదురు చూసి భర్తపై అలగడం, హరిశ్చంద్రుడు ఆమెను సముదాయించడం.
2. కులపతి శాంతి ఉదకాన్ని హరిశ్చంద్రుడికి తాపసుడి ద్వారా పంపడం. తాపసుడికి అనేక దుశ్శకునాలు కన్పించడం.
3. హరిశ్చంద్రుడు నిశాప్రజాగరవ్రతంలో ఉండడం వల్లనే తన దగ్గరకు రాలేదని, రాజుని తప్పుగా అర్థం చేసుకున్నానని శైబ్య పశ్చాత్తాప పడడం.
4. వరాహం అడవిలో చెట్లకు హాని కలిగిస్తోందని వనచరుడు హరిశ్చంద్రుడికి చెప్పడం.
5. హరిశ్చంద్రుడు వరాహాన్ని వేటాడుతూ విశ్వామిత్రుడి ఆశ్రమానికి వెళ్ళడం.
6. ఆశ్రమానికి వెళ్ళిన హరిశ్చంద్రుడు అక్కడ విద్యాత్రయాన్ని రక్షిస్తాడు.

7. క్షణకాలంలో స్వాధీన పడుతున్న విద్యలు హరిశ్చంద్రుడి కారణంగా చేజారిపోయాయని విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడిపై క్రోధం వహిస్తాడు.

8. హరిశ్చంద్రుడు తన తప్పు తెలుసుకొని విశ్వామిత్రుడిని శరణు వేడతాడు.

9. ప్రసంగ వచనమున హరిశ్చంద్రుడు పలికిన 'రాజు సద్విజులకు దానం చెయ్యాలనే మాటను' విశ్వామిత్రుడు పట్టుకుంటాడు.

10. విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడిని నాకు కూడ కొంత దానం ఇవ్వమని అడుగుతాడు.

11. సర్వం దానం యిచ్చిన హరిశ్చంద్రుడిని విశ్వామిత్రుడు దక్షిణ కూడ ఇవ్వమంటాడు.

12. హరిశ్చంద్రుడు లక్షహేమాలు దానంగా ఇస్తాను ఒక నెల గడువు ఇవ్వమంటాడు.

13. కౌశికుడే నేరుగా హరిశ్చంద్రుడి ధనాన్ని వసూలు చేసుకుంటాడు.

14. అమ్ముడు పోయే వ్యక్తి అందుకు సూచనగా తలమీద తృణాన్ని ఉంచుకోవడం.

15. శైబ్య పరపురుష సాంగత్యం, పరోచ్ఛిష్టభోజనం చెయ్యనని నియమాన్ని పెట్టడం. హరిశ్చంద్రుడు కూడా చండాలుడిని తాకకుండా స్వయంపాకం చేసుకొని సేవ చేస్తానని నియమాన్ని పెడతాడు.

16. ఉపాధ్యాయుడు హరిశ్చంద్రుడికి కావల్సిన ధనాన్ని ఇస్తానంటే హరిశ్చంద్రుడు నిరాకరించడం.

17. శైబ్యను ఉపాధ్యాయుడు దాసిగా కొనుక్కోవడం.

18. చండాలుడు తనను కొనటానికి సిద్ధపడగా హరిశ్చంద్రుడు కౌశికుడితో స్వామీ ! నేను మీ సేవ చేసి ఋణం తీర్చుకుంటాను కానీ చండాలుడికి అమ్ముడుపోనని మొరపెట్టుకుంటాడు.

19. హరిశ్చంద్రుడు శ్మశాన సంచారం చేస్తుండగా ధర్ముడు కాపాలికా వేషంలో వచ్చి నేను సిద్ధ రసాన్ని సాధించాలనుకుంటున్నాను. విఘ్నాలు రాకుండ కాపాడమని హరిశ్చంద్రుడిని కోరితే హరిశ్చంద్రుడు అంగీకరిస్తాడు.

20. హరిశ్చంద్రుడి చేత రక్షింపబడిన విద్యలు హరిశ్చంద్రునికి వశమవుతాయని అడగడం. హరిశ్చంద్రుడు మీరు విశ్వామిత్రమహర్షికి వశం కమ్మని చెప్పడం.

21. కాపాలికుడు సిద్ధరసాన్ని హరిశ్చంద్రుడికి సమర్పిస్తూ ఉండగా హరిశ్చంద్రుడు నిరాకరిస్తాడు. సిద్ధరసాన్ని తీసుకుంటే స్వామిద్రోహమని భావిస్తాడు.

22. కుమారుడి శవాన్ని శైబ్య శ్మశానానికి తీసుకొని వెళ్ళి ఎంతో విలపించి తన దుస్థితికి నిస్పృహచెంది శరీరాన్ని విడిచిపెట్టాలనుకోవడం.

23. హరిశ్చంద్రుడు శైబ్య మాటలవల్ల ఆమె శైబ్య అని తెలుసుకొని ఆమెను రక్షించడానికి పరాధీనతలో ఉన్నవాళ్ళు అస్వతంత్రులు వాళ్ళు స్వతంత్రంగా మరణించే హక్కు లేదని శైబ్య వినేట్టు బిగ్గరగా చెప్తాడు. శైబ్య వెంటనే ఆత్మహత్యా ప్రయత్నాన్ని విరమించడం.

24. హరిశ్చంద్రుడు శైబ్యని మృత కంబలం ఇవ్వమని కోరడం రోహితుడి బట్టతీసి ఇవ్వబోతువుండగా శైబ్య హరిశ్చంద్రుని హస్తాన్ని గుర్తుపట్టి విలపిస్తుండగా హరిశ్చంద్రుడు మృత కంబలాన్ని తెమ్మని చెబుతాడు అప్పుడు ఆకాశం నుండి పుష్పవర్షము కురుస్తుంది.

### 2.1.2 నాటకలో కల్పనల ఔచిత్యం

క్షేమేశ్వరుడు 'చండకౌశికమ్' నాటకానికి మూలాన్ని మార్కండేయ పురాణం నుండి గ్రహించాడు. 'చండకౌశిక' అనే శబ్దానికి మిక్కిలి కోపంకల విశ్వామిత్రుడని అర్థం. హరిశ్చంద్రుడి కారణంగా కౌశికుడు ప్రచండతను వహించిన కథ ఇందులో వర్ణించడంచేత దీనికి చండకౌశికమ్ అనే పేరు పెట్టినట్టు కవి పీఠికలో చెప్పుకున్నాడు. కేవలం వశిష్ఠుడిపై ద్వేషంతో తపోధనుడైన విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడిని బాధలు పెట్టడం ఔచిత్యంగా లేదని మార్కండేయ పురాణ గాధని తీసుకొని ఈ చండకౌశికమ్ నాటకాన్ని రాసినట్లు వడ్డాది సుబ్బరాయకవి తమ చండకౌశికమ్ అనువాద పీఠికలో పేర్కొన్నారు.

కౌశికుడి వంటి ముని అకారణంగా హరిశ్చంద్రుడిపై కోపించడం తగదని విశ్వామిత్రుడికి వశం కావల్సిన విద్యలు హరిశ్చంద్రుడి కారణంగా చేజారిపోయాయని కౌశికుడు ఆ కోపంతో హరిశ్చంద్రుడి మీద పగబట్టడం ఔచిత్యవంతంగా ఉంది.

హరిశ్చంద్రుడు కులపతి ఆదేశానుసారం నిశాప్రజాగరవ్రతాన్ని చేపట్టడం, విశ్వామిత్రుడు దానం అడిగిన వెంటనే ఇస్తాననడం వంటి కల్పనలు హరిశ్చంద్రుడికి గల ఋషి భక్తిని తెలియజేస్తున్నాయి.

విద్యాత్రయాన్ని రక్షించడం పంట పొలాలకు హానిచేస్తున్న వరాహాన్ని సంహరించాలనుకోవడంలో హరిశ్చంద్రుడి వీరత్వం వెల్లడౌతోంది.

శ్మశానంలో కాటికాపరిగా ఉన్న హరిశ్చంద్రుడి దగ్గరికి విద్యాత్రయం వచ్చి హరిశ్చంద్రుడికి వశమౌతామంటే మీరు విశ్వామిత్రుడికి వశం కమ్మని చెప్తాడు. ధర్మదేవత కాపాలికుడి రూపంలో వచ్చి సిద్ధరసాన్ని తీసుకోమంటే హరిశ్చంద్రుడు తాను వీరబాహుడి దగ్గర దాసుడిగా ఉన్నప్పుడు సిద్ధరసాన్ని తీసుకుంటే స్వామి ద్రోహమని భావించి తీసుకోడు. శైబ్యని దాసిగా కొనుక్కున ఉపాధ్యాయుడు హరిశ్చంద్రుడికి ధన సహాయం చేస్తానంటే నిరాకరిస్తాడు. ఈ కల్పనలు హరిశ్చంద్రుడి నిస్వార్థతని, ధర్మ చింతనని ఋజువు చేస్తున్నాయి.

శైబ్య తను దాసిగా ఉన్నప్పటికి పరపురుష సాంగత్యం, పరోచ్ఛిష్ట భోజనం చెయ్యనని చెపుతుంది. కుమారుడి మరణానికి చింతించి తాను కూడ మరణించాలనుకుంటుంది. ఈ కల్పనలు చంద్రమతి పాతివ్రత్యాన్ని పుత్రప్రేమనీ తెలియజేస్తాయి. ఈ విధంగా క్షేమీశ్వరుడి కల్పనలు కౌశిక, హరిశ్చంద్ర, శైబ్యల పాత్రలను ఉదాత్తంగా చిత్రించడానికి ఉపకరించాయి.

### 2.1.3 కావ్యంలో కల్పనలు

1. హరిశ్చంద్రుడి సత్యనిష్ఠ గురించి వశిష్ఠ విశ్వామిత్రుల వాదించుకోవడం, ప్రతిజ్ఞలు చేయటం.
2. హరిశ్చంద్రుడి చేత ఏ విధంగానైనా మాట తప్పించాలని విశ్వామిత్రుడు తను యాగం చేస్తున్నానని దానికి ధనం కావాలని హరిశ్చంద్రుడిని అడుగుతాడు. హరిశ్చంద్రుడు ఇస్తాను తీసుకోమంటాడు. విశ్వామిత్రుడు వెంటనే తీసుకోకుండ తరువాత తీసుకుంటానని వెళ్ళిపోతాడు.
3. హరిశ్చంద్రుడు రాజ్యాన్ని వినాశనం చేస్తున్న భయంకరమైన పక్షులను, మృగాలను సంహరించడానికి సతీసమేతుడై అడవికి బయలుదేరడం.
4. వశిష్ఠుడు హరిశ్చంద్రుడిని చూసి కారడవిలో భార్యతో సంచరించరాదని విశ్వామిత్రుడి ఆశ్రమానికి వెళ్ళవద్దని హెచ్చరించడం.
5. స్వగృహానికి పయనమైన హరిశ్చంద్రుడు మాయలేడికి ముగ్ధుడై దానిని వెంబడించడం. ఈ మాయలేడి విశ్వామిత్రుడి ఆశ్రమానికి దగ్గరగా వచ్చి అదృశ్యమవ్వడం.
6. ఆశ్రమంలో ఉన్న హరిశ్చంద్రుడికి పెద్ద కొలువు కూటమిలో తను ఉండగా కోపంగా ఉన్న విప్రుడు తన కిరీటం నేలపై పడే విధంగా తన్నినట్టు దుస్వప్నం వచ్చిందని చంద్రమతికి చెప్తాడు. చంద్రమతి హరిశ్చంద్రుడికి రక్షగా రత్నకంకణాన్ని కట్టడం.

7. ఆశ్రమంలో విశ్రమిస్తున్న హరిశ్చంద్రుడి దగ్గరకి మాతంగ కన్యలు వచ్చి గాన ప్రదర్శన చేసి హరిశ్చంద్రుడి పొందు కోరుకోవడం.

8. హరిశ్చంద్రుడు మాతంగకన్యలను వారించి వారిని శిక్షించడం. మాతంగ కన్యలు విశ్వామిత్రుడిని శరణు వేడితే విశ్వామిత్రుడు మాతంగ కన్యలను వివాహం చేసుకోమనడం. హరిశ్చంద్రుడు రాజ్యమైనా వదలుకుంటాను కానీ కులాన్ని వదులుకోనని చెప్పడం.

9. వెంటనే విశ్వామిత్రుడు రాజ్యాన్ని దానంగా పుచ్చుకుంటాడు. తాను ఇదివరకు ఇస్తానన్న ధనాన్ని కూడ అడుగుతాడు.

10. హరిశ్చంద్రుడి దగ్గర ధనాన్ని వసూలు చెయ్యడానికి తన శిష్యులలో క్రూరుడైన నక్షత్రకుడిని హరిశ్చంద్రుని వెంట పంపుతాడు.

11. నక్షత్రకుడు హరిశ్చంద్రుడి వెంట నడవలేక చతికిలపడిపోతాడు. చంద్రమతి హరిశ్చంద్రుడిని నీరుతెచ్చి నక్షత్రకుడి చేత తాగించమంటుంది.

12. హరిశ్చంద్రుడు వృద్ధతాపస వేషంలో ఉన్న దంతఘాతకుడనే రాక్షసుడిని నీళ్ళు అడుగుతాడు. ఇతడు హరిశ్చంద్రుడిని ఆ రాత్రికి బేతాళవృక్షం క్రింద విశ్రమించేటట్టు చేస్తాడు.

13. మాయా రాక్షసుడు వశిష్ఠముని రూపంలో హరిశ్చంద్రుడి దగ్గరకు వచ్చి విశ్వామిత్రుని కపట సృష్టిని భస్మం చేసి తిరిగి నీ రాజ్యాన్ని నీకు ఇప్పిస్తానని చెప్తాడు. హరిశ్చంద్రుడు దీనికి అంగీకరించడు. చంద్రమతి వచ్చినది వశిష్ఠుడు కాదని గ్రహించి సంహరించమని భర్తకి చెబుతుంది.

14. కపటముని అదృశ్యుడై తన మాయ చేత వృశ్చిక పన్నాగాలను సృష్టించి చంద్రమతి, హరిశ్చంద్రులకి అనేక కష్టాలు కలిగిస్తాడు.

15. దంతఘాతకుడు అనే రాక్షసుడు ముని వేషం ధరించి హరిశ్చంద్రుడిని బేతాళ వటవృక్షం దగ్గర విశ్రమించేటట్టు చేస్తాడు.

16. హరిశ్చంద్రుడు దగ్గరలో ఉన్న వటవృక్షం చేరగా ఆ వృక్షాన్ని ఆశ్రయించిన దయ్యాలు, పిశాచాలు కిలకిల స్వరాలు చేస్తాయి. వాటిని వధించడమే మంచిదని రాజు వాటి ముక్కులు, చెవులను నరుకుతాడు.

17. హరిశ్చంద్రుడు ఉన్న వనంలో మంటలు వ్యాపించగా చంద్రమతి వెళ్ళి ఆహుతి కాబోతుండగా చంద్రమతి పతిభక్తి వలన అగ్ని చల్లారిపోతుంది.

18. హరిశ్చంద్రుడు చంద్రమతి కలిసి ఉండగా వాళ్ళని ఏమి చెయ్యలేమని నక్షత్రకుడు వాళ్ళని విడదీయడానికి తొందరగా ఋణం చెల్లించకపోతే విశ్వామిత్రుడు ఉగ్రుడౌతాడని హెచ్చరించాడు.

19. చంద్రమతి తనని విక్రయించగా వచ్చిన ధనంతో అప్పు తీర్చమని ముందుగా తాను కాలకౌశికుడికి అమ్ముడుపోతుంది. పిమ్మట కాలకౌశికుడి ఆకారం, స్వభావం వర్ణింపబడింది. కాలకౌశికుడు సుకుమారి అయిన చంద్రమతి చేత మోయలేనన్ని బరువులు మోయిస్తాడు. అనేక బాధలు పెడతాడు. కాశీ ప్రజలు కాలకౌశికుడిని అనేక తిట్లు తిడతారు.

20. చంద్రమతిని అమ్మగా వచ్చిన ధనాన్ని నక్షత్రకుడు దారి బత్తెంగా తీసుకుంటాడు. హరిశ్చంద్రుడు వీరబాహుడికి అమ్ముడుపోయి విశ్వామిత్రుడికి ఇవ్వవలసిన ధనాన్ని చెల్లిస్తాడు.

21. హరిశ్చంద్రుడు వీరబాహుడి దగ్గర వీరదాసుడిగా ఉన్నంతకాలం హరిశ్చంద్రుడికి ఆకలి లేకుండ దేవతలు వరాన్ని ఇస్తారు.

22. కాలకౌశికుడి భార్య కలహకంఠికూడ చంద్రమతిని అనేక బాధలు పెడుతుంది. కలహకంఠి భర్తతో తగువుపడుతూ ఉంటుంది. చంద్రమతి కలహకంఠికి పతివ్రతా ధర్మాలు ఉపదేశిస్తుంది.

23. కాలకౌశికుడు లోహితుడిని దర్భలకోసం అడవికి పంపిస్తాడు. చంద్రమతి కుమారుడికి రక్ష కడుతుంది. విశ్వామిత్రుడు తక్షకుడిని ప్రేరేపించి లోహితుడిని కాటువేయమని చెబుతాడు. లోహితుడి పాము కాటువలన మరణిస్తాడు.

24. లోహితుడిని పాము కాటువేసిందని తెలుసుకొన్న చంద్రమతిని కలహకంఠి వెంటనే లోహితుడుని చూడడానికి పంపదు. పని అంతా అయ్యాక చీకటి పడ్డాక వెళ్ళమని ఆదేశిస్తుంది.

25. లోహితుడి శవాన్ని తీసుకొని శ్మశానానికి వెళ్ళి దహనం చేద్దామనుకుంటుండగా కాటికాపరి రూపంలో ఉన్న హరిశ్చంద్రుడు మాడను తెమ్మంటే చంద్రమతి తన నిస్సహాయతను తెలియజేస్తుంది. మెడలో ఉన్న తాళిబొట్టుతీసి ఇవ్వమన్నప్పుడు కాటికాపరే హరిశ్చంద్రుడని గ్రహించిన చంద్రమతి బాధపడుతుంది.

26. తన కుమారుడే చనిపోయాడని తెలిసినా కూడ హరిశ్చంద్రుడు చంద్రమతిని మాడ తెమ్మని పంపిస్తాడు.

27. విశ్వామిత్రుడు చంద్రమతిని హరిశ్చంద్రుడి చేత చంపించాలని చోరుడిని సృష్టిస్తాడు. చోరుడిచేత కాశీరాజు కుమారుడిని చంపించి ఆ నేరం చంద్రమతి మీద మోపుతాడు. రాజు చంద్రమతిని నేరస్థురాలిగా భావించి మరణశిక్షను విధిస్తాడు. శిరశ్ఛేదం చేయమని శ్మశానంలో ఉన్న కాటికాపరిని ఆజ్ఞాపిస్తాడు. హరిశ్చంద్రుడు ఆమె శిరస్సుని ఖండించడానికి ఎత్తిన ఖడ్గం హరిశ్చంద్రుడి మెడలో పూల హారంగా మారుతుంది.

28. చంద్రమతి, హరిశ్చంద్రుల ధర్మనిష్ఠకు మెచ్చి పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నప్పుడు చంద్రమతి కాశీరాజు కుమారుడిని రక్షించి తనమీద పడ్డ నిందను తొలగించమంటుంది.

29. హరిశ్చంద్రుడిని చేత ఏ విధంగానైనా సరే అబద్ధం చెప్పించాలనుకొన్న విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని సత్యసంధతకు, ధర్మనిష్ఠకు ఆశ్చర్యపడి ప్రశంసించి రాజ్యాన్ని తిరిగి అప్పగిస్తాడు.

### 2.1.4 కావ్యంలో కల్పనల ఔచిత్యం

గౌరన హరిశ్చంద్రోపాఖ్యానానికి మూలం స్కాంద పురాణం. ప్రధాన కథను స్కాంద పురాణం నుండి గ్రహించినా గౌరన కావ్య రచన చేయడానికి మార్కండేయ పురాణం, దేవి భాగవతం, భాగవత పురాణం వంటి పెక్కు మూలాలు పరిశీలించి హరిశ్చంద్రోపాఖ్యాన్ని రచించాడు. హరిశ్చంద్రోపాఖ్యానాన్ని కావ్యంగా మలచిన మొట్టమొదటి కవి గౌరన. తరువాత వచ్చిన హరిశ్చంద్రోపాఖ్యాన కావ్యాలన్ని గౌరన కావ్యానుసరణలే. గౌరన అనేక నూతన కల్పనలతో హరిశ్చంద్రోపాఖ్యానాన్ని రచించాడు.

విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడి సత్యనిష్ఠని పరిక్షించాలని భీకరమైన పక్షుల్ని, మృగాల్ని సృష్టించి హరిశ్చంద్రుని రాజ్యంపై వదిలిపెడతాడు. రాజు వాటిని వధించడానికి భార్యా పుత్రులలో అరణ్యానికి వెళ్తాడు. అక్కడ వశిష్ఠముని కనపడి క్రూరమృగాలతో నిండిన అడవిలో కులకాంతతో సంచరించరాదని, విశ్వామిత్రుడి ఆశ్రమానికి వెళ్ళవద్దని అతనికి ముక్కు మీద కోపం ఉంటుందని హెచ్చరిస్తాడు. ఈ విధంగా వశిష్ఠుడు చెప్పడం అంతకముందు ఇంద్రసభలో వశిష్ఠ విశ్వామిత్రుల వాదోపవాదాలకి బలం కలిగిస్తోంది. ఈ కల్పన విశ్వామిత్రుడి వలన హరిశ్చంద్రుడికి ముప్పు ఉందని హరిశ్చంద్రుడిని సూచించడానికి ఉపయోగపడింది.

వశిష్టాదేశానుసారం హరిశ్చంద్రుడు వేట నుండి గృహోన్ముఖుడై వెళ్లుతూవుండగా అతడిని తన ఆశ్రమానికి రప్పించడానికి విశ్వామిత్రుడు లోకంలో లేని తళుకు, బెళుకులుగల బంగారు లేడిని సృష్టించి పంపిస్తాడు. ఈ మృగసౌందర్యానికి ఆశపడిన రాజు దానిని పట్టుకోవాలని తరిమితే అది విశ్వామిత్రుడి ఆశ్రమాన్ని సమీపించి అదృశ్యమౌతుంది. ధీరుడైన రాజుని ఆకర్షించడానికి మాయలేడి కల్పన చేయడం మిక్కిలి సహజంగా, అద్భుతంగా ఉంది. ఈ మాయ లేడి కల్పన రామాయణంలో మాయలేడి కల్పనలా ఉంది.

హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడి ఆశ్రమంలో ఉన్న సమయంలో విశ్వామిత్రుడు మాతంగ కన్యలను సృష్టిస్తాడు. ఈ మాతంగ కన్యలు తమ అందచందాలతో హరిశ్చంద్రుడిని మెప్పిస్తారు. హరిశ్చంద్రుడు వారికి కానుకలు ఇచ్చి పొమ్మంటాడు. వారు రాజు పొందు కోరుకుంటారు. హరిశ్చంద్రుడు రాజ్యాన్ని వదులుకుంటాను కానీ కులాన్ని వదలుకోనని ప్రతిజ్ఞ చేస్తాడు. హరిశ్చంద్రుడు మాతంగ కన్యలను వివాహం చేసుకోనందువల్ల విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడి రాజ్యాన్ని స్వీకరిస్తాడు. హరిశ్చంద్రుడి రాజ్యాన్ని విశ్వామిత్రుడు తీసుకోవడానికి, హరిశ్చంద్రుడి ఏకపత్నీవ్రతాన్ని, కులధర్మాన్ని తెలియజేయడానికి ఈ మాతంగ కన్యల కల్పన ఉపయోగపడింది.

రాజ్యాన్ని దానం చేసిన హరిశ్చంద్రుడిని విశ్వామిత్రుడు అంతకుముందు యాగదక్షిణకై జరిగిన వాగ్దానం ప్రకారం ధనాన్ని ఇవ్వమని వేధిస్తాడు. హరిశ్చంద్రుడు దీనికి నెల గడువు అడుగుతాడు. దీనికి సమ్మతించిన విశ్వామిత్రుడు తన శిష్యులలో మూర్ఖుడైన నక్షత్రకుడిని హరిశ్చంద్రుడి వెంట పంపిస్తాడు. నక్షత్రకుడు అడుగడుగునా హరిశ్చంద్రుడిని బాధిస్తాడు. భార్యాపుత్రులను అమ్మిన ధనాన్ని తన దారిబత్తెంగా తీసుకొని హరిశ్చంద్రుడిని కాటికాపరికి అమ్ముతాడు. హరిశ్చంద్రుడు అరణ్యంలో అనేక కష్టాలు పడడానికి నక్షత్రకుడు కారణం అవుతాడు.

హరిశ్చంద్రుడు అడవిలో వెళ్ళుతూవుండగా విశ్వామిత్రుడు వృశ్చిక, పన్నగాలను, బేతాళాలను సృష్టిస్తాడు. గాలిని స్తంభింపజేస్తాడు. రాజు భుజించే పదార్థాలు చేదుగా చేస్తాడు. రాజుకు విపరీతమైన దప్పికను కలుగజేస్తాడు. విశ్వామిత్రుడు ఎన్ని కష్టాలు పెట్టినా హరిశ్చంద్రుడు ధర్మాన్ని వీడడు. హరిశ్చంద్రుడి ధర్మనిష్ఠను చాటడానికి ఈ కల్పనలు బాగా ఉపయోగపడ్డాయి.

నక్షత్రకుడి దాహం తీర్చడానికి హరిశ్చంద్రుడు నీటికోసం వెతకడానికి బయలుదేరతాడు. అదృశ్యరూపంలో వెంట వస్తున్న విశ్వామిత్రుడు దంతఘాతకుడనే రాక్షసుడిని సృష్టించి రాజు ఆ

రాత్రి బేతాళవటవృక్షం దగ్గరే విశ్రమించే ఏర్పాటు చేస్తాడు. కౌశికుడి ఆదేశానుసారం ఆ రాక్షసుడు ముని వేషం దాల్చి జపం చేస్తూవుంటాడు. రాజు మునికి నమస్కరించి నీటిని అడుగుతాడు. ముని రాజుకు నమ్మకం కలిగించి బేతాళవటవృక్షం దగ్గర ఆ రాత్రి ఉండమని చెబుతాడు. హరిశ్చంద్రుడు బేతాళవృక్షం దగ్గర నిద్రించడానికి గౌరన ఈ కల్పన చేశాడు. బ్రాహ్మణ, ముని భక్తుడైన హరిశ్చంద్రుని మాయ చేయడానికి కపటముని కల్పన ఎంతో సహజంగా ఉంది.

హరిశ్చంద్రుడిని ఎలాగైనా సరే మాట తప్పించాలని విశ్వామిత్రుడి ప్రేరితుడైన మాయా రాక్షసుడు వశిష్ఠముని రూపంలో వచ్చి విశ్వామిత్రుడి కపట సృష్టిని భస్మం చేసి తిరిగి రాజ్య ప్రాప్తి కలుగజేస్తానని చెబుతాడు. దీనికి రాజు అంగీరించడు. తన ఆశ్రమానికి వచ్చి సుఖించమని కోరతాడు. రాజు మనస్సు మార్చుకోడు. చంద్రమతి వచ్చినది మాయా వశిష్ఠుడని గ్రహించి వెంటనే వధించమని సలహా ఇస్తుంది. ఈ కల్పన హరిశ్చంద్రుడి ధృఢ నిశ్చయాన్ని, చంద్రమతి గ్రహణశక్తిని తెలియజేస్తుంది. పైగా హరిశ్చంద్రుడి మేలుకోరే వశిష్ఠుడు వచ్చి చెబితే హరిశ్చంద్రుడు నమ్ముతాడని మాయా వశిష్ఠుడి కల్పన చేయడం ఔచిత్యవంతంగా ఉంది.

హరిశ్చంద్రుడు అడవిలో కొరవిదయ్యంలాగ ఉన్న బేతాళవృక్షాన్ని చేరగా ఆ వృక్షాన్ని ఆశ్రయించిన దయ్యాలు, పిశాచాలు దిగి వస్తాయి. రాజు వాటి ముక్కు చెవులు కోసి వధిస్తాడు. బేతాళరాజుని కూడ సంహరిస్తాడు. ఈ కల్పనలు హరిశ్చంద్రుడిని వేధించడానికి కల్పించినా ఇవి అతని ధైర్య సాహసాలని ప్రదర్శించడానికి ఉపయోగపడ్డాయి.

విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడు ఉన్న వనంలో భీకరమైన మహాగ్నిని సృష్టిస్తాడు. పరమ పతివ్రత అయిన చంద్రమతి ప్రవేశించగానే అగ్ని చల్లారిపోతుంది. ఈ కల్పన చంద్రమతి పాతివ్రత్యాన్ని లోకానికి చాటుతుంది.

చంద్రమతి హరిశ్చంద్రులు కలసి ఉండగా వాళ్ళని ఏమీ చెయ్యలేమని భావించిన విశ్వామిత్రుడు వాళ్ళిద్దరిని విడదియ్యమని నక్షత్రకుడికి చెప్తాడు. నక్షత్రకుడు విశ్వామిత్రుడి అప్పు తీర్చకపోతే ఉగ్రరూపం దాల్చుతాడని హెచ్చరిస్తాడు. చంద్రమతిని కాలకౌశికుడికి విక్రయిస్తాడు. మహాపతివ్రత అయిన చంద్రమతి తన భర్త తప్పక సత్యవ్రతాన్ని పాటిస్తూ తిరిగి సప్త ద్వీపాల్ని ఏలగలడని నిశ్చయంగా చెబుతుంది. వెంటనే అశరీరవాణి ఇది నిశ్చయం అని పలుకుతుంది. ఈ కల్పనలు చంద్రమతి హరిశ్చంద్రులు విడిపోవడానికి, హరిశ్చంద్రుడు సత్యవ్రతం మీద చంద్రమతికి కల నమ్మకాన్ని తెలియజేస్తాయి.

పూర్వ కావ్యాలలో మాయా బ్రాహ్మణుడు చంద్రమతి లోహితుల్ని ధనం యిచ్చి ఇంటికి తీసుకుపోయాడని మాత్రమే ఉంది. గౌరన కావ్యంలో చంద్రమతి, లోహితుడిని చూసిన జనుల మనోభావాలు వెల్లడించే సమయంలో అనేక సంఘటనలు కల్పించాడు. కాశీ ప్రజలు కాలకౌశికుడిని పరిపరి విధాల నిందించి చావబాదినట్లు గౌరన కల్పించాడు. కాలకౌశికుడి శిష్యుడు వటువు కలహాన్ని కల్పించాలని కాలకౌశికుడి భార్య కలహకంఠితో నీవు వికృతంగా ఉన్నావు కాబట్టి అందమైన స్త్రీని వివాహం చేసుకోవాలని నీ భర్త ధనం ఇచ్చి కొనుక్కొని ఒక రాకుమారిని తీసుకువస్తున్నాడని చెబుతాడు. కలహకంఠి సహజంగా గయ్యాళి. ఆపైన వటువు అగ్నికి ఆజ్యం పోశాడు. కలహకంఠి కోపంతో భర్తని కొడుతుంది. చంద్రమతిని అనేక కష్టాలు పెడుతుంది. లోహితుడు మరణిస్తే చూడడానికి కూడ చంద్రమతిని పంపదు. ఈ కల్పనలు చంద్రమతిని అనేక కష్టాలు పడడానికి కారణం అయ్యి కావ్యం కరుణ రసాత్మకంగా సాగడానికి తోడ్పడ్డాయి.

విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడికి భార్యా వియోగంతో పాటు పుత్రశోకాన్ని కూడ కలిగించడానికి పూనుకొని దర్భలు తేవడానికి అడవికి వెళ్ళిన లోహితుడిని కాటువేయమని తక్షకుడిని ప్రేరేపిస్తాడు. లోహితుడు పాము కాటు వలన మరిణిస్తే చంద్రమతి విలపిస్తూ శవాన్ని తీసుకొని స్మశానానికి వెళుతుంది. కాటి కాపరిగా ఉన్న హరిశ్చంద్రుడు చంద్రమతిని మాడ తీసుకురమ్మన్ని చెబుతాడు. మాడ తేవడానికి వెళ్లిన చంద్రమతి మీద విశ్వామిత్రుడు హత్యానేరం మోపుతాడు. కాశీరాజు చంద్రమతి శిరస్సును ఖండించమని ఆజ్ఞ జారీ చేస్తాడు. శిక్ష అమలు జరిపే బాధ్యత వీరదాసుడి రూపంలో ఉన్న హరిశ్చంద్రుడిది. హరిశ్చంద్రుడు ఖడ్గం ఎత్తగానే అది పూలదండలా మారిపోతుంది. పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమౌతారు. హరిశ్చంద్రుడు సత్యం కోసం రాజ్యాన్ని, సౌఖ్యాన్ని, భార్యని, పుత్రుడిని పణంగా పెట్టాడు. అందుకే పార్వతీపరమేశ్వరులను మెప్పించగలిగాడు. ఈ కల్పనలు హరిశ్చంద్రుడి ధర్మనిష్ఠని, సత్యవాక్పరిపాలనని విశ్వవ్యాప్తం చేశాయి. ఈ విధంగా గౌరన కల్పనలు, పాత్రపోషణ, రసపోషణకు సహకరించి సహజ సుందరాలై అలరారుతున్నాయి.

### 2.1.5 కావ్యనాటకాలు రెండింటిలో కల కల్పనల తేడాలు

1. ఉపాధ్యాయుడు శైబ్యని దాసిగా కొనుక్కున్నప్పుడు పరోచ్ఛిష్ట భోజనం, పరపురుష సాంగత్యం అంగీకరించనని నియమం పెడుతుంది. హరిశ్చంద్రుడు కూడా చండాలుడిని తాకకుండా స్వయం పాకం చేసుకొని సేవ చేస్తానని నియమాన్ని పెడతాడు. కావ్యంలో హరిశ్చంద్రుడు వీరబాహుడి దగ్గర ఉన్నంతకాలం హరిశ్చంద్రుడికి ఆకలి లేకుండ దేవతలు వరాన్ని ఇస్తారు.

2. నాటకంలో శాంతి ఉదకాన్ని తీసుకువస్తున్న తాపసుడికి దుశ్శకునాలు కన్పిస్తాయి. కావ్యంలో విశ్వామిత్రుడి ఆశ్రమ సమీపంలో నిద్రిస్తున్న హరిశ్చంద్రుడికి దుస్వప్నం వస్తుంది.

3. నాటకంలో చంద్రమతిని ఉపాధ్యాయుడు దాసిగా కొనుక్కుంటాడు. ఇతడు జాలి కలిగినవాడు. హరిశ్చంద్రుడికి కావాలంటే ధన సహాయం చేస్తానంటాడు. కావ్యంలో చంద్రమతిని కాలకౌశికుడు దాసిగా కొనుక్కుంటాడు. ఇతడు పరమలోభి. ఇతడి భార్య కలహకంఠి గయ్యాళి. చంద్రమతిని అనేక కష్టాలు పెడుతుంది.

**2.2 పాత్ర పోషణ**

కవి స్వతంత్రంగా ఒక పాత్రను సృష్టించి దాని స్వభావంలో జీవలక్షణాన్ని నిర్దేశించడం పాత్ర చిత్రణ. ఇదివరకే ఏర్పడిన జీవలక్షణాలనే సమయానుకూలంగా పాటించడం పాత్ర పోషణ. ఈ పరిశోధన మూలంలో లేని పాత్రని కావ్య రచయిత కాని, నాటక రచయిత కాని స్వతంత్రంగా చిత్రిస్తే ఆ పాత్ర పక్కన పాత్ర చిత్రణ అనే పదాన్ని చేర్చాను.

ప్రత్యక్ష పద్ధతి, పరోక్ష పద్ధతి అని పాత్ర చిత్రణ పద్ధతులు రెండు విధాలు.

కవి తానై తన మాటగా పాత్ర స్వభావాన్ని వాచ్యం చేయడం ప్రత్యక్ష పద్ధతి.

ఒక పాత్రయొక్క స్వభావం ఆ పాత్రయొక్క సంభాషణల ద్వారా కాని, లేదా ఆ పాత్ర ఇతర పాత్రలతో సంభాషించుట వలన కాని, ఆ పాత్రకు ఇతర పాత్రలతో వున్న సంబంధం వలన కాని లేదా పాత్రను గూర్చి ఇతర పాత్రలు అనుకొన్న మాటల వలన కాని లేదా ఇతర పాత్రలు ఆ పాత్ర వలన పొందిన ప్రతి స్పందన వలనకాని తెలిస్తే అది పరోక్ష పాత్ర పోషణ పద్ధతి.

పరోక్ష పద్ధతిలో పాత్ర చిత్రణ కాని, లేదా పాత్ర పోషణ కాని చేయడం ఉన్నతమైన పద్ధతి. అది నాటక ఫక్కి.

**2.2.1 హరిశ్చంద్రుడు :**

**కులీనత :**

"మహాకులీనతా నామ కులే మహతి సంభవః"[1] గొప్ప కులంలో జన్మించటం మహాకులీనత అని ప్రతాపరుద్రీయ లక్షణం. గొప్పకులంలో జన్మించుట మహాకులీనత. ఆడినమాటతప్పని రాజు ఉన్నాడా అని ప్రశ్నించిన ఇంద్రుడికి సమాధానంగా వశిష్ఠుడు హరిశ్చంద్రుడి గుణగణాలను గురించి తెలియజేస్తూ ఈ విధంగా పలుకుతాడు.

---

*1. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణము, పు. 51*

**"కులము, మహోభాగ్యము, ను**
**జ్జ్వలత, యుదారత, మహావిశాలత, ధర్మా**
**కలనము, వైదగ్ధియు నన**
**నిలనాయకగుణము లమురు నివి యేర్పఱతున్"** [2]

మహాకులీనత, ఔజ్జల్యం, మహాభాగ్యం, ఔదార్యం, మహా విశాలత, ధార్మికత్వం, వైదగ్ధ్యం మొదలైనవి నాయక గుణాలని ఆంధ్రప్రతాపరుద్ర యశోభూషణం పేర్కొంది. ధీరోదాత్తాది నాయక చతుష్టయంలో ధీరగుణం సామాన్యలక్షణమైంది.

కావ్యనాటకాలు రెండింటిలోనూ హరిశ్చంద్రుడు నాయకుడు. త్రిశంకు కుమారుడు. సూర్యవంశపురాజు. సత్యమే వ్రతంగా కలవాడు.

**వినుతి కెక్కినమహావిక్రమోన్నతుఁడు**
**తనరుషోడశమహాదానవినోది**
**వినయభూషణుఁడు వివేక సంపన్నుఁ**
**డతులసత్కీర్తి మహాభాగ్యశాలి**
**వితతధనుర్వేదవిద్యాధికుండు**
**కరుణాపయోనిధి గాంభీర్యఘనుఁడు**
**దురితదూరుఁడు బుధస్తోత్రపాత్రుండు**
**సర్వశాస్త్రార్థవిచారకోవిదుఁడు**
**గర్వితవుగజకంఠీరవుండు**
**వరుస నార్వుచక్రవర్తులలోనఁ**
**దరమడి మున్నెన్నఁదగు చక్రవర్తి**
**నిత్యప్రసన్నుండు నీతిపాలకుడు**
**సత్యసంధుడు త్రిశంకునందనుఁడు**
**నిరుపమవిజ్ఞాననిధి భానువంశ**
**శరధిచంద్రుడు హరిశ్చంద్రుఁడన్ రాజు**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 136-150, పు. 17,18)

---

2. *ఆంధ్ర ప్రతాపరుద్రీయ, 3వ సంపుటి, పు. 7*

హరిశ్చంద్రుడు పరాక్రమంలో అధికుడు. పదహారు రకాలైన దానాలు చేయటంలో గొప్పవాడు. అణకువ గలవాడు, సాటిలేని యశస్సు గలవాడు, ధనుర్విద్యలో సాటిలేనివాడు, దయగలవాడు, పాపం చేయనివాడు, పండితుడు, శత్రువులపట్ల సింహం వంటివాడు, నీతిపాలకుడు, ఎప్పుడూ సత్యాన్ని మాట్లాడేవాడు. త్రిశంకు కుమారుడు, సూర్యవంశంలో జన్మించినవాడని వశిష్ఠుడు హరిశ్చంద్రుడి గుణగణాలను, వంశవివరాలను ఏకరువు పెడతాడు.

**ఉజ్జ్వలత :**

"రూపసంపన్నదేహత్వ మౌజ్జ్వల్యం పరికీర్త్యతే"[3] స్ఫురద్రూపం కలిగి ఉండటం యౌజ్జ్వల్యం. కాశీపుర ప్రజలు హరిశ్చంద్రుడిని చూసి వర్ణించిన తీరిది.

**రమణి నమ్ముటకునై రాజమార్గమునఁ**
**జనుదెంచు నప్పు డాజానుబాహువులును**
**బెను పొందుమూఁ పులుఁ బీనవక్షంబు**
**నురుతరస్కంధంబు నొఱ పగుమేను**
**నరనుతసింహాసనస్థితుభంగి**
**నరుదార తెప్ప లల్లార్పక చూచి**

**..................................**

**నీచంద మీమంద మీరాజసంబు**
**నీచూపు నీయేపు నిట్టితేజంబు**
**నీపెంపు నీసొంపు నీ ప్రతాపంబు**
**నెందు నెవ్వరియందుఁ నెన్నఁడు గాన**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 304-316, పు.174)

హరిశ్చంద్రుడు ఆజానబాహుడు. అతని భుజాల మూపులు, వక్షస్థలం మానవులచే కొనియాడబడుతున్నాయి. కాశీ ప్రజలందరూ కన్నురెప్ప వాల్చకుండా అతని అందాన్ని వీక్షిస్తున్నారు. అతని ప్రతాపాన్ని, తేజాన్ని ఇంతకుముందు ఎవ్వరి దగ్గర వారు చూడలేదట.

---

*3. ప్రతాపరుద్రీయ, 3వ సంపుటి, పు.8*

**ధార్మికత్వం :**

"ధర్మై కాయత్తచిత్తత్వం ధార్మికత్వ ముదీర్యతే"[4] ధర్మాభినివేశం గల మనస్సు కలిగి ఉండటం ధార్మికత్వం.

హరిశ్చంద్రుడు ధర్మాన్ని ఎప్పుడు విడిచిపెట్టలేదు. అందుకే ఇంద్రసభలో హరిశ్చంద్రుడిని ఉద్దేశించి వశిష్ఠుడు పలికిన పలుకులివి.

**యలరెండువేలజిహ్వలవాని కైనఁ**
**గొలఁదె హరిశ్చంద్రగుణములు వొగడఁ**
**దను వెల్ల సత్యంబు తలపల్లఁ గరుణ**
**పనులెల్ల ధర్మంబు పలు కెల్లఁ బ్రియము**
**బొంకు నాలుకకుఁ జేర్చుట కానివావి**
**యింక నిన్నియుఁ జెప్ప నేమికారణము**
**వారిజగర్భునివ్రాఁతఁ దప్పినను**
**వారిజాప్తుఁడు దూర్పువంకఁ గ్రుంకినను**
**మేరువు గ్రుంగిన మిన్ను వ్రాలినను**
**ధారుణీచక్రంబు తలక్రిందు వడిన**
**వారిధు లింకిన వజ్రాయుధంబు**
**ధార దప్పిన మాట తప్పఁడారాజు**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 231–242, పు.23–24)

రెండు వేల నాలుకలు కల వాడికైన హరిశ్చంద్రుని గుణగణాలు పొగడడం కాదు. అతని శరీరమంతా సత్యం. అతను చేసే పనులన్నీ ధర్మమే. అతని పలుకులన్నీ ప్రియమే. బ్రహ్మ రాత తప్పినా, సూర్యుడు తూర్పున అస్తమించిన, పర్వతాలు కూలిపోయినా, సముద్రాలు ఎండినా, వజ్రాయుధం దారి తప్పిన ఆడిన మాట తప్పడు హరిశ్చంద్రుడు.

మాతంగ కన్యలు హరిశ్చంద్రుడి పొందు కోరుకుంటే నిరాకరిస్తాడు. విశ్వామిత్రుడికి ఇచ్చిన మాటకోసం రాజ్యాన్ని వదలుకుంటాడు. భార్యను, కుమారుడిని అమ్ముకుంటాడు. చివరికి తానే అమ్ముడుపోతాడు. వీరబాహుడి దగ్గర వీరదాసుడిగా చేరి అతని దగ్గర శుశ్రూష చేస్తూ అతడు

---

4. *ప్రతాపరుద్రీయ, 3వ సంపుటి, పు.8*

చెప్పిన నియమం ప్రకారం మాడను తేస్తేనే కుమారుడిని దహనం చెయ్యడం కుదురుతుందని చంద్రమతితో చెబుతాడు. తన విధిని నిర్వహించడం కోసం తన భార్యను చంపడానికి కూడ వెనుకాడడు. ధర్మాన్ని అనుసరించి రాగద్వేషాలకు అతీతంగా ప్రవర్తిస్తాడు.

**మహాభాగ్యం :**

"విశ్వంభరాధిపత్యం యత్తన్మహాభాగ్య ముచ్యతే"[5] భూమండలాధిపత్యమే మహాభాగ్యం. హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడికి రాజ్యాన్ని అప్పగించి వెళ్ళుతున్నప్పుడు విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడికి అనేక ఇక్కట్లు కలిగిస్తాడు. భయంకరమైన సర్పాలను, వృశ్చికాలను సృష్టిస్తాడు. పిశాచాల్ని, దయ్యాల్ని పురిగొల్పుతాడు. హరిశ్చంద్రుడు ఎంతో ధైర్యంతో వాటిని ఎదుర్కొంటాడు.

**బఱపి భూపాలుఁ డాబడుగుదయ్యములఁ**
**బట్టి వధించుటేఁ పౌరుషం బనుచు**
**నెట్టన మొల నున్న నెఱిగత్తిఁ దివిచి**
**కొన్నింటిముక్కులుఁ గొన్నింటి చెవులుఁ**
**గొన్నింటి చెక్కులుఁ గోఁతలు వెట్టి**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి. సం.) 1934-1935చ పుట. 126)

హరిశ్చంద్రుడు దయ్యాలను పౌరుషంతో ఎదుర్కొంటాడు. కొన్నింటికి ముక్కులు కోస్తాడు. కొన్నింటి చెవులు, కోస్తాడు. విశ్వామిత్రుడు పిడుగులతో కూడిన వడగండ్ల వాన సృష్టిస్తాడు. విశ్వామిత్రుడు పెట్టిన కష్టాలను తట్టుకొని హరిశ్చంద్రుడు నిలబడతాడు.

**నాఱనిదేజంబు నతులధైర్యంబు**
**నగలనిసత్యంబు నతులసాహసము**
**తెగనిరాజసము నై దిననాథకులుఁడు**
**వానఁ దొప్పనదోఁగి వఱదపెన్నీట**
**వాని యంగంబులు నరములు నొవ్వ**
**విడువక రువ్వెడువిషమవాయువున**
**వడఁకునింతిని బుత్రు వడుగును దిగిచి**

---

5. *ప్రతాపరుద్రీయ, 3వ సంపుటి, పు.8*

**యనునయం బెసఁగ నిజాంకపీఠమున**

**ననువొంద నునిచి దైన్యము నొందకున్న**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 2052-60, పు.132)

పట్టువదలని ధైర్యం, తేజం, సాహసం, రాజసాలతో హరిశ్చంద్రుడు భీకరమైన వర్షానికి తట్టుకొని నిలబడతాడు. విశ్వామిత్రుడు పెట్టిన అనేక పరీక్షలను తట్టుకొని హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడినే ఆశ్చర్యపరుస్తాడు. సాక్షాత్తు పార్వతీపరమేశ్వరులను మెప్పిస్తాడు.

**ఔదార్యం :**

"యద్విశ్రాణనతాచ్ఛేల్య మౌదార్యం తన్నిగద్యతే"[6] దానశీలము కలిగి ఉండటయే ఔదార్యం. విశ్వామిత్రుడు వచ్చి దానం అడిగినప్పుడు హరిశ్చంద్రుడు వెనుకముందు ఆలోచించకుండ దానం ఇస్తాడు.

**ధనము రాసిగఁ బోసి దాన మిచ్చినను**

**జననాథ కొద లేక సాఁగు నాయజ్ఞ**

**మనినఁ గృతార్థుండ నైతి నీయిష్ట**

**ధనమిత్తుఁ గొమ్మన్నఁ దల యూఁచి యప్పు**

**డొడుపు దప్పినయట్టియురగంబ పోలెఁ**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 367-71, పు.31)

విశ్వామిత్రుడికి ధనాన్ని ఇవ్వడంవల్ల తాను కృతార్థత పొందానని భావిస్తాడు. తరువాత మాతంగ కన్యలను వివాహం చేసుకొనమన్నప్పుడు రాజ్యమైనా వదులుకుంటాను కానీ కులాన్ని వదలుకోనని అనగానే విశ్వామిత్రుడు తథాస్తు అంటాడు. హరిశ్చంద్రుడు సంతోషంగా రాజ్యాన్ని దానం చేస్తాడు.

**"... దేవభూదేవ మాన్యములు**

**దప్ప సప్తద్వీవధరణి సమస్త**

**మష్టభోగైశ్వర్య మది మీకుఁ గలుగు**

**నిష్ట మేర్పడ దాన మిచ్చితి ననుచు**

---

*6. ప్రతాపరుద్రీయ, 3వ సంపుటి, పు.8*

**ధారుణీపతి గాధితనయుహస్తమున**
**దారవోసిన జలధారకు".**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 1335-41, పు.92)

దేవ, భూదేవ మాన్యాలు తప్ప సమస్తాన్ని హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడికి దానంగా ఇస్తాడు.

విశ్వామిత్రుడు ఎన్ని బాధలు పెట్టిన హరిశ్చంద్రుడు భరిస్తాడు. తన ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటాడు. హరిశ్చంద్రుడు రాజ్యాన్ని దానంగా ఇచ్చిన తరువాత ప్రజలు మేము కూడ మీ వెంటే వస్తామంటారు. హరిశ్చంద్రుడు వారిని వారించి కౌశికుడి మీద దుర్భాషలు ఆడడం మానేసి స్థిర బుద్ధితో అతడిని సేవించమని చెబుతాడు.

నక్షత్రకుడు కూడ అడుగడుగునా హరిశ్చంద్రుడిని విసిగిస్తాడు. భార్యా, భర్తలను విడదీయాలని చూస్తాడు. కానీ హరిశ్చంద్రుడు నక్షత్రకుడి మీద కోపం లేకుండ ఎంతో ప్రేమతో భిక్షను నక్షత్రకుడికి సంపూర్ణంగా ఇచ్చిన తరువాతనే మిగిలినది హరిశ్చంద్రుడు, చంద్రమతి, లోహితుడు తీసుకుంటారు.

హరిశ్చంద్రుడికి భార్య అంటే ఎంతో ప్రేమ. తనతో తన భార్య కూడ కష్టాలు పడుతోందని చింతిస్తాడు.

**'ముసు సౌధసోపానముల నెక్కలేని**
**వనజాక్షి యెట్లెక్కె వరుస శైలములు**
**పటికంపురాకట్టుపై నెక్క వలయు**
**కుటిలకుంతలి యెట్టు గుట్టలు గడచె**
**............................................**
**నానిమిత్తంబున నారీలలామ**
**కీనీచదుర్దశ నిటు వేఁగ వలసె'**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 1589-1608, పు.106-107)

అంతఃపురంలో సుకుమారంగా ఉండి భవన సోపానాలు కూడ ఎక్కలేని చంద్రమతి పర్వతాలను ఎలా ఎక్కుతుందో? తన మూలంగానే చంద్రమతికి ఇటువంటి దుస్థితి కలిగిందని బాధపడతాడు.

భార్యను అమ్ముకోవలసి వచ్చినందుకు ఎంతో చింతిస్తాడు.

**గఱగఱ దఱిగెడికటికవాఁడైన**
**దయ లేక తనకళత్రము నమ్ము కొనునె**

**నయ మేది దీనికి నామది సొరదు**

**ధనమునకై పత్ని దాసిగా నమ్మి**

**చనునె భర్తకుఁ గూడు చవి యని కుడవ**

**మరణంబు మేలు నెమ్మది దీనికంటెఁ**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 230-36, పు.170)

కుత్తుకలు ఖండించే కటికవాడైన భార్యను అమ్ముకోడు. భార్యను అమ్ముకోవడం కంటే మరణించడంమేలని భావిస్తాడు. ఎంతగా భార్యను ప్రేమించిన తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వహించడానికి భార్యను తెగనరకడానికి సిద్ధపడతాడు.

**నాటకంలో హరిశ్చంద్రుడు :**

**"వృషస్కన్ధం మత్తద్వి రదకరపీనాయతభుజం**

**వపుర్వ్యూఢో రస్కం నను భువనరక్షాక్షమ మిదమ్ ।**

**తృణం మౌలౌ చూడామణి సముచితే కిం త్వదమహో**

**నరం వామారమ్భః కమివ న విధాతా ప్రహరతి॥"** (చం.కౌ.పు.66)

నాటకంలో హరిశ్చంద్రుడికి ఋషులపట్ల గౌరవం ఎక్కువ. కులపతుల ఆదేశం మేరకు నిశా ప్రజాగవ్రతాన్ని చేస్తాడు. శైబ్యను కూడ కులగురువుల ఆదేశం మేరకు సమారాధన జరపమని ఆదేశిస్తాడు.

రాజుగా తన కర్తవ్య నిర్వహణకు ఏ మాత్రం వెనుకాడడు. జనులను బాధపెట్టే వరాహాన్ని శిక్షించడానికి అడవికి వెళ్తాడు. విశ్వామిత్రుడి ఆశ్రమం దగ్గరకు రాగానే స్త్రీల ఆర్తనాదాలు వినబడగానే రక్షించాలనుకుంటాడు.

కౌశికుడు తనకు వశం కావల్సిన విద్యలు హరిశ్చంద్రుడి కారణంగా దక్కలేదని కోపంతో హరిశ్చంద్రుడిని కష్టాలు పాలు చెయ్యడానికి రాజ్యాన్ని దానం తీసుకుంటాడు. దాన దక్షిణగా కూడ ధనాన్ని ఇవ్వమంటాడు. అప్పుడు హరిశ్చంద్రుడు రాజ్యాన్ని సమస్తాన్ని దానం చెయ్యడమే కాక ఆభరణాలను కూడ కౌశికుడికి సమర్పించి పెద్ద బరువు తీరినట్లుగా భావిస్తాడే కాని కొంచెం కూడ బాధపడడు. సమస్తాన్ని దానం ఇవ్వడంవల్ల కౌశికుడి అనుగ్రహం పొందగలిగానని సంతోషిస్తాడు.

కౌశికుడికి దాన దక్షిణను సమర్పించడం కోసం శైబ్యను అమ్ముకోవలసి వచ్చినందుకు చాలా బాధపడతాడు.

**"మమ విధినిహతస్య మన్ద బుద్ధే**

**ర్ధ్రువమధునా సుతిదారావిక్రయేణ ।**

**నిజకులపరివాదలగ్నమూర్తే -**

**రపి సవితుర్మ లి నీకృతా ముఖశ్రీః॥"**

(చం.కౌ.పు.70)

పట్టమహిషిగా ఉండవలసిన పరమసాధ్వి దాసిగా వేరొకరి ఇంటికి పంపిస్తున్నానని చింతిస్తాడు. పుత్రశోకంతో బాధపడుతున్న శైబ్యకు ఇంకా దుఃఖం కలిగించడం ఇష్టంలేక కాటికాపరిగా ఉన్న తను హరిశ్చంద్రుడేనన్న విషయాన్ని చెప్పడు. భర్తగా తన భార్యపట్ల ప్రేమను చాటుకుంటాడు.

చండాలుడి దగ్గర కాటికాపరిగా పనిచేసిన హరిశ్చంద్రుడు చండాలుడిని తాకకుండ స్వయం పాకం చేసుకుంటానని నియమం పెడతాడు. హరిశ్చంద్రుడు గతంలో రక్షించిన విద్యలు విమాన చారిణులయి వచ్చి హరిశ్చంద్రుడికి వశమౌతామని అడిగితే తల్లులారా మీరు నన్ను నిజంగా అనుగ్రహిస్తే కౌశికుడికి వశపడమని కోరతాడు. కాపాలికా వేషధారియైన ధర్ముడు సిద్ధరసాన్ని తెచ్చి హరిశ్చంద్రుడికి ఇవ్వగా స్వీకరించడం దాస భావానికి విరుద్ధమని తిరస్కరిస్తాడు.

శైబ్యను దాసిగా కొనుక్కొన్న ఉపాధ్యాయుడు హరిశ్చంద్రుడికి కావాల్సిన ధనాన్ని ఇస్తానంటే హరిశ్చంద్రుడు స్వీకరించడు.

**రాజా : "భోః సాధో ప్రథమవర్ణ వృత్తిరియం ప్రతిషిద్ధాస్మద్విధానామ్. తద్యది మామనుకంప నీయం మన్యసే తన్మూల్యసంబన్ధేన దాతుమర్హసి"** (చం.కౌ.పు. 68)

ఒకరి దగ్గర చెయ్యి చాపి తీసుకోవడం అనేది ప్రథమవృత్తి మాలాంటి వాళ్ళకు అది నిషిద్ధమని ధనాన్ని తిరస్కరిస్తాడు.

చండాలుడి దగ్గర కాటికాపరిగా ఉండడం ఇష్టం లేకపోయినా, తన ఉద్యోగ ధర్మాన్ని మాత్రం తప్పడు. చనిపోయినది తన కుమారుడే అని రూఢి అయినా కాటికాపరికి ఇవ్వవలసిన మృతకంబం తీసుకువస్తేగానీ కుమారుడిని దహనం చెయ్యడం వీలుపడదని ఖచ్చితంగా చెప్తాడు.

శైబ్య కుమారుడి మృతికి విరక్తి చెంది తను కూడా శరీరాన్ని పరిత్యజించాలనుకున్న సమయంలో కాటికాపరి వేషంలో ఉన్న హరిశ్చంద్రుడు మృతివలన స్వతంత్రులు తాము పడే బాధల నుండి నివృత్తి పొందుతారు. కానీ మరొకరికి విక్రయింపబడిన వారికి చావడానికి కూడ అధికారం లేదని చెప్పి పరోక్షంగా చంద్రమతి ప్రాణాలను రక్షిస్తాడు.

హరిశ్చంద్రుడి సత్యనిష్ఠకు మెచ్చి ధర్మదేవత ప్రత్యక్షమై ఇంకా ఏమి కావాలో కోరుకో మన్నప్పుడు-

**"భగవాన్ అతః పరమపి ప్రియమస్తి । తధా హి**
**విద్యాలాభాన్మునిరపి మయి త్యక్తమిధ్యాభ్యసూయో**
**లబ్ధ్వా ప్రాణానయమపి శిశుశ్చక్ర వర్తిత్వ మాప్తః -**
**దృష్టః సాక్షాత్వమపి భగవ న్బ్రహ్మ సాలోక్యమాప్తం**
**కిం వా త్ స్యాద్యదపరమతో యత్ప్రియం ప్రార్ధయిష్యే॥".**

(చం.కౌ.పు. 140)

విశ్వామిత్రుడికి నా మీద కోపం పోయింది. మీ దయ వల్ల చక్రవర్తిని అయ్యాను. నీ దర్శనం కలిగింది. బ్రహ్మలోకాన్ని పొందగలిగాను. ఇంతకన్నా కోరికలు లేవని సంతృప్తి చెందుతాడు.

హరిశ్చంద్రుడు రాజుగా, భర్త, సేవకుడిగా, శిష్యుడిగా కృతకృత్యుడెయ్యాడు. ఎట్టి పరిస్థితులలో ధర్మాన్ని విడిచిపెట్టడు. ఎటువంటి పరిస్థితులలోనైనా సరే నిత్య సంతృప్తుడిగా జీవిస్తాడు.

కావ్య నాటకాలలో హరిశ్చంద్రుడి పాత్రను పరిశీలించగా నాటకంలో కన్నా కావ్యంలో హరిశ్చంద్రుడు ఎక్కువ ఒడిదుడుకులను అనుభవిస్తాడు. కావ్యంలో హరిశ్చంద్రుడులో వీరరసం ప్రధానంగా కన్పిస్తుంది. సర్పాలు, వృశ్చికాలు, వేడి, చలి, అగ్ని మొదలైన వాటినుండి అనేక బాధలు ఎదుర్కొంటాడు. ముఖ్యంగా నక్షత్రకుడు అడుగడుగునా విసిగిస్తాడు. ఇవన్నీ తట్టుకుంటూ విశ్వామిత్రుడికి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాడు. కావ్యంలో హరిశ్చంద్రుడు ధర్మం కోసం భార్యను నరకడానికి కూడ సిద్ధపడతాడు. నాటకంలో అదే ధర్మం కోసం భార్య ప్రాణత్యాగం చెయ్యబోతూ ఉంటే రక్షిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ తను నమ్మిన సత్యవ్రతాన్ని నిష్ఠగా చేసి దైవ సాన్నిధ్యాన్ని పొందుతాడు.

**2.2.2 చంద్రమతి :**

చంద్రమతి హరిశ్చంద్రుడి భార్య. తెలివితేటలలో, ముందుచూపులలో హరిశ్చంద్రుడిని మించినది. భర్తపట్ల అమితమైన గౌరవం కలది. పతివ్రతల పక్కన నిలబెట్టగల పాతివ్రత్య మహిమ గలది. భూదేవి ఓర్పు చంద్రమతి సొంతం. చంద్రమతి ఆలోచన శక్తి అమోఘం.

విశ్వామిత్రుడి ఆశ్రమంలో విశ్రమిస్తున్నప్పుడు రాజుకి కలిగిన దుస్వప్నానికి చింతిస్తుండగా, చంద్రమతి రక్ష కడుతుంది. మాతంగ కన్యలను చూసి ఆశ్చర్యపోతున్న సందర్భంలో చంద్రమతి ఈ మాతంగ కన్యలను నమ్మరాదు. ఇవి కౌశికుడి మాయలని చెబుతుంది. మాయా వశిష్ఠుడిని చూసి కౌశికుడే పంపాడని రాజుని హెచ్చరిస్తుంది. అగ్ని దహించి అందర్ని కాల్చి వేయడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ముందు చంద్రమతి అగ్ని ఆహుతి కాదలచుకుంటుంది. చంద్రమతి పాతివ్రత్య మహిమ వల్ల అగ్నిదేవుడు శాంతిస్తాడు. సాక్షాత్తు విశ్వామిత్రుడు తన తపోబలం కంటే చంద్రమతి పతిభక్తి గొప్పదని మెచ్చుకుంటాడు. నక్షత్రకుడు తనతో రమ్మన్నప్పుడు చంద్రమతి నిరాకరిస్తుంది.

మాటి మాటికి నక్షత్రకుడు హరిశ్చంద్రుడిని ధనం కోసం వేధిస్తున్నప్పుడు హరిశ్చంద్రుడు బాగా కృంగిపోతాడు. అప్పుడు చంద్రమతి హరిశ్చంద్రుడికి ధైర్యం చెబుతుంది.

**'భూచక్రమెల్ల నేర్పున నేలినట్టి**
**రాచవేల్పవు నీవు ప్రాకృతు నట్లు**
**పాయనిచింత విభ్రాంతి గ్రుందెదవు**
**దాయంబుతల నిట్టిదైన్యంబు దగునె'**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 185-189, పు.167-168)

భూమిని ఏలినట్టి రాజు ఇలా చింతిస్తూ వుంటే ఏలాగ? ఏదో ఒక మార్గాన్ని అన్వేషించాలని చెబుతుంది. పతి సత్య నిష్ఠకోసం అంగట్లో అమ్ముడుపోతుంది. కాలకౌశికుడి చేత తిట్లు, దెబ్బలు తింటుంది.

చంద్రమతి తను నమ్మిన సత్యాన్ని పాటిస్తుంది. చంద్రమతి పాతివ్రత్యం రాశిపోసిన నిలువెత్తు రూపం. అందువల్లనే కలహకంఠికి పతిభక్తి గురించి హితబోధ చేస్తుంది. పాము కాటువల్ల మరణించాడని తెలియగానే కొడుకు దగ్గరకు వెళ్ళడానికి కలహకంఠి అనుమతిని ఇవ్వదు. నానాహింస పెట్టి పని పూర్తిచేసిన తరువాత వెళ్లమని చెబుతుంది.

కుమారుడు పాము కాటు వలన మరణించడం వల్ల చంద్రమతి బాధపడిన తీరిది.

**‘జాలఁగీ లెడలినజంత్రంపుబొమ్మ**
**పోలిక మూర్ఛిల్లి పుత్రుపై వ్రాలి**
**క్రమ్మఱఁ దెలివొంది కన్నీరు దొరుఁగ**
**నమ్మదిరాక్షి యిట్లని యేడ్వఁ దొడఁగె**
**‘హా లోహితాస్య వంశైక విస్తార**
**లాలితసౌభాగ్య లక్షణాకార**
**హా నిర్వికార మహాగుణాధార**
**భూనుతఘనమణిభూషణోధార**
**హా సుకుమార కల్యాణ విహార**
**..................................**
**వే మాదు నింక నెట్లేమందు విధిని**
**నేమందు వెట్టిన నెసగుఁ బ్రాణమ్ము’**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 1982–2018, పు. 270–271)

చంద్రమతి పుత్ర శోకం తట్టుకోలేక మూర్ఛిల్లి కుమారుడిపై పడి కన్నీరు మున్నీరుగా ఏడుస్తుంది. కుమారుడి గుణగణాలను గుర్తుకు తెచ్చుకొని వంశాన్ని విస్తరించేవాడు, సౌభాగ్య లక్షణాలతో ప్రకాశించేవాడు, గొప్ప పేరున్న, చక్రవర్తి కుమారుడని ఏడుస్తూ విధి ఎంత దురవస్థ తెచ్చిందని విలపిస్తుంది.

కుమారుడికి అంతిమ సంస్కారాలు చేయడానికి శ్మశానం దగ్గరికి వెళ్ళేటప్పటికి కాటికాపరిగా ఉన్న హరిశ్చంద్రుడిని చూసి నివ్వెరపోతుంది. కాటికాపరికి ఇవ్వవలసిన మాడ చంద్రమతి దగ్గరలేదు. తీసుకురావడానికి వెళ్ళిన చంద్రమతి మీద హత్యాయత్నం మోపబడుతుంది. హరిశ్చంద్రుడే తన భార్యను నరకడానికి సిద్ధపడతాడు. ఆ సమయంలో చంద్రమతి పలికిన పలుకులు చంద్రమతిని పతివ్రతల పక్కన కూర్చోబెట్టాయి.

**“తక్కిననీచవర్తనులచేఁ జావ**
**కిక్కడ నాజీవితేశుఁడ వైన**
**నీ చరణంబులు నెమ్మితోఁ గొల్చి**

**నీ చేత మృతిఁ బొంది నీ పొందు మీఁద**
**నే పొందఁగాఁ గంటి నెట్టిసౌఖ్యంబు**
**లీపొందు రావింక నెడ సేయనేల"**

(హ.ఉపా.ద్వి.ప్ర.భా.ద్వి.సం. 2484–2489, పు.297)

హరిశ్చంద్రుడి చేతిలో మరణించడం తన అదృష్టంగా భావిస్తుంది. సాక్షాత్తు పార్వతిదేవి ప్రత్యక్షమై చంద్రమతిని కొనియాడిన తీరిది.

**"రా చంద్రమతి పతివ్రత వౌదు నీవు**
**నీ చరిత్రంబు వర్ణింప నచ్చెరువు**
**సుదతి నీ మంగళసూత్రంబు గాదె**
**పదివేలబాములఁ బాపె నీపతికి**
**సౌభాగ్యవతివి గా సకలసామ్రాజ్య**
**వైభవంబుల మించి వసుధ నేలుచును**
**బెద్దగాలమునకుఁ బ్రియుఁడును నీవు**
**నొద్దికవచ్చి మా యొద్దనే యుండు"**

(హ.ఉపా.ద్వి.భా.భా.ద్వి.సం. 2714–2721, పు.310)

చంద్రమతి పతిభక్తికి పార్వతిదేవి ఆశ్చర్యపోతుంది. నీ పతిభక్తి వల్లనే హరిశ్చంద్రుడి అనేక పాపాలు పోయాయని అనేక సంవత్సరాలు భూమిని పాలించి చివరదశలో భర్తతో పాటు కైలాసంలో ఉండమని వరం ఇస్తుంది.

**నాటకంలో శైబ్య :**

శైబ్య హరిశ్చంద్రుడు తనతో గడపడానికి రాలేదని అలుగుతుంది. అయితే హరిశ్చంద్రుడు నిశాప్రజాగరవ్రతంలో ఉండడం వల్ల రాలేకపోయాడని అర్థం చేసుకుని భర్తను క్షమాపణ వేడుతుంది.

భర్త కౌశికుడికి ఇవ్వవలసిన సొమ్ము కోసం ముందుగా తానే అమ్ముడుపోతుంది. భర్తకి సహాయం చెయ్యడం కోసం తాను విక్రయింపబడి కృతార్థురాలైయ్యానని భావిస్తుంది. ఉపాధ్యాయుడు శైబ్యని ధనం యిచ్చి కొనుక్కొని తీసుకొని వెళ్తుండగా భర్తని మరొక్కసారి తన కన్నులతో చూడాలనుకుంటుంది. నాటకం మొదట్లో భర్త నిశాప్రజాగర వ్రతంలో ఉండడం తనకు కలిగిన ఎడబాటు తట్టుకోలేని చంద్రమతి భర్తమాట నిలబెట్టడానికి వేరొకరికి అమ్ముడుపోయి భర్తకి దూరం

అవుతుంది. అంతదుఃఖంలోనూ భర్తకి ధర్మోపదేశాన్ని చేస్తుంది. నా గురించి ఆలోచించి దుఃఖపడుతూ ఉండక, విశ్వామిత్రుడికి ఇచ్చిన మాటని నెరవేర్చమంటుంది.

భర్త ఎడబాటు సహించలేక, పుత్రుడు మరణించినందుకు దుఃఖిస్తూ శరీరాన్ని పరిత్యజించాలనుకుంటుంది. కానీ తాను పరాధీనంలో ఉన్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకొని ఆ ప్రయత్నాన్ని విరమిస్తుంది. కాటికాపరే తన భర్తని తెలిసి మిక్కిలి బాధపడుతుంది.

కావ్య, నాటకాలలోని శైబ్య పాత్రల్ని పరిశీలించగా నాటకంలో కంటే కావ్యంలో చంద్రమతి మిక్కిలి తెలివైనది. సమస్యలు వస్తే ఎలా స్పందించాలో గౌరన శైబ్యకి బాగా తెలుసు. నిజానిజాలను నిగ్గుతేల్చగల ధీరవనిత గౌరన శైబ్య.

మాతంగ కన్యలు మాయా కన్యలని వారిని చూసి మోసపోవద్దని చెబుతుంది. కపట వశిష్ఠుడిని చూసి పసిగట్టి మాయావశిష్ఠుడని చెబుతుంది. నక్షత్రకుడు దాహంతో నడవలేనప్పుడు ముందు నక్షత్రకుడిని రక్షించమని సలహాయిస్తుంది. నక్షత్రకుడు లోహితుడిని రాజుని చేస్తానని తనతో రమ్మని చెప్పినప్పుడు భర్తతోనే ఉంటుంది. భర్త మాట కోసం అమ్ముడుపోతుంది. కాలకౌశికుడు, కలహకంఠి ఎన్ని బాధలు పెట్టినా ఓర్చుకుంటుంది. పుత్ర శోకానికి విలపిస్తుంది. నాటకంలో శైబ్య పుత్రశోకాన్ని తట్టుకోలేక దేహ పరిత్యాగం చెయ్యాలనుకొంటుంది. కానీ కావ్యంలో తనపై మోపిన అభియోగానికి చింతించక భర్త చేతిలో మరణించడం తన సుకృతంగా భావిస్తుంది.

**2.2.3 విశ్వామిత్రుడు :**

గాధి కుమారుడు విశ్వామిత్రుడు రాజర్షి. కుశుని కుటుంబంలో జన్మించడంవల్ల విశ్వామిత్రుడిని కౌశికుడని కూడ పిలుస్తారు. తన మాట చెల్లించుకునే మనస్తత్వం కలవాడు. ఇంద్రుడి సభలో వశిష్ఠుడు హరిశ్చంద్రుడి సత్య నిష్ఠ గురించి చెబితే విశ్వామిత్రుడు ఒప్పుకోడు. గర్జిస్తాడు. రాజులు భోగులు సత్యమంటే వాళ్ళకి పడదని వాదిస్తాడు. ఏ విధంగానైనా హరిశ్చంద్రుడి చేత మాట తప్పిస్తానని శపథం చేస్తాడు. విశ్వామిత్రుడు ఓడిపోతే తన తపశ్శక్తిని హరిశ్చంద్రుడికి ధారపోసి అతనిని ఇంద్రుని సింహాసనంపై కూర్చో బెడతానని వాగ్ధానం చేశాడు.

విశ్వామిత్రుడు తన పంతాన్ని నెగ్గించుకోవాలని హరిశ్చంద్రుడి చేత ఎలాగైనా ఆడినమాట తప్పించాలని హరిశ్చంద్రుడిని దానం ఇవ్వమని అడుగుతాడు. హరిశ్చంద్రుడు దానం ఇస్తానని మాట ఇస్తాడు. విశ్వామిత్రుడు చిత్రమైన మృగాలను సృష్టించి పంటపొలాల్ని నాశనం చేయిస్తాడు. మాయలేడిని సృష్టించి హరిశ్చంద్రుడిని విశ్వామిత్రుడి ఆశ్రమానికి రప్పిస్తాడు. హరిశ్చంద్రుడు రాజ్యమైనా

విడుస్తాను కానీ కులహాని చెయ్యనని మాతంగ కన్యలను తిరస్కరిస్తాడు. విశ్వామిత్రుడు వెంటనే రాజ్యాన్ని దానంగా పుచ్చుకొంటాడు. రాజ్యాన్ని దానంగా తీసుకొని ముందు తనకు ఇస్తానన్న ధనాన్ని కూడ ఇవ్వ మంటాడు. హరిశ్చంద్రుడు ధనాన్ని సంపాదించడానికి ఒక నెల గడువు అడుగుతాడు.

**'యవని కింతకు రాజునై యున్ననాకు**
**నవిరళగతిఁ బూన నర్హంబు గాక**
**మకర కుండల హార మంజీర వలయ**
**మకుటాంగదమ్ములు మఱి నీకు 'దగునె**
**తెమ్ము మా కవి యని దేవిమై నున్న**
**సొమ్ములన్నియు మోముఁ జూడక యొలిచి**
**విచ్చేయు'................** (హ.ఉపా. ప్ర.భా. ద్వి. సం. 1423-1429 పు.97)

విశ్వామిత్రుడు నేను రాజుగా ఉండగా, రాజు వేసుకోవడానికి అర్హమైన హారాలు, మంజీరాలు నీకు ఎందుకు అవన్నీ తీసి ఇవ్వమంటాడు. చంద్రమతి నగలుకూడ తీసుకుంటాడు.

విశ్వామిత్రుడు తనకు హరిశ్చంద్రుడు ఇవ్వవలసిన ధనాన్ని వసూలు చేసి తీసుకురమ్మని తన శిష్యులలో మిక్కిలి మూర్ఖుడైన నక్షత్రకుడిని హరిశ్చంద్రుడి వెంట పంపుతాడు. హరిశ్చంద్రుడు అడవిలో వెళ్తుండగా విపరీతమైన ఎండలు సృష్టిస్తాడు. తాగడానికి కొంచెం నీళ్ళుకూడ దొరకనివ్వడు. గాలిని స్తంభింపచేస్తాడు. రాజు స్వీకరించే పదార్థాలను చేదుగా చేస్తాడు.

దాహాన్ని తీర్చుకోవడానికి హరిశ్చంద్రుడు నీటికోసం అన్వేషిస్తూ దంతఘాతకుడిని ఆశ్రయిస్తాడు. దంతఘాతకుడు హరిశ్చంద్రుడిని ఆ రాత్రికి బేతాళవృక్షం దగ్గర ఉండమంటాడు. అక్కడ సర్పాలు, భూతాలు దాడి చేయగా హరిశ్చంద్రుడు వాటిని ఎదుర్కొంటాడు.

విశ్వామిత్రుడు మాయా వశిష్ఠుడిని సృష్టించి హరిశ్చంద్రుడి దగ్గరకు పంపుతాడు. మాయా వశిష్ఠుడు విశ్వామిత్రుడి కపట సృష్టిని భస్మం చేసి నీకు నీ రాజ్యం ప్రాప్తించేలా చేస్తానంటాడు. హరిశ్చంద్రుడు దీనికి ఒప్పుకోడు. ఇంతలో భయంకరమైన తేళ్ళు, పాములను ఎదుర్కొని వాటిని సంహరిస్తాడు. ఎంతకీ హరిశ్చంద్రుడు లొంగటం లేదని విశ్వామిత్రుడు అగ్నిదేవుడిని ఆవాహన చేసి భార్యతో సహా హరిశ్చంద్రుడిని దహించమని చెబుతాడు. చంద్రమతి తన పాతివ్రత్యంతో అగ్నిని చల్లార్చుతుంది.

చంద్రమతి, హరిశ్చంద్రుడు కలసి ఉంటే వాళ్ళని ఏమీ చెయ్యలేమని వాళ్ళను విడదీయమని నక్షత్రకుడిని ప్రేరేపిస్తాడు. భార్యాభర్తలను విడదీసి వారిని కష్టాలపాలు చేస్తాడు. చంద్రమతిని పరమలోభి అయిన కాలకౌశికుడి దాసిగా కొనుక్కుంటాడు. అతడి భార్య కాలకంఠి చంద్రమతిని ఎన్నో బాధలు పెడుతుంది.

కౌశికుడు తక్షకుడిని ప్రేరేపించి లోహితుడిని కాటువేయమని ఆజ్ఞాపిస్తాడు. పుత్రశోకాన్ని కూడ చంద్రమతికి కలిగిస్తాడు. కాలకంఠి చంద్రమతిని మరణించిన పుత్రుడిని చూడడానికి కూడ వెంటనే పంపదు.

మృత కంబం తీసుకురావడానికి వెళ్ళిన చంద్రమతి మీద కౌశికుడు హత్యానేరం మోపి హరిశ్చంద్రుడే చంద్రమతిని వధించేలా చేస్తాడు. హరిశ్చంద్రుడి సత్యనిష్ఠ చేత చంద్రమతి మరణించదు.

**నాటకంలో విశ్వామిత్రుడు :**

నాటకంలో కౌశికుడికి వశం కావల్సిన విద్యలు హరిశ్చంద్రుడి కారణంగా చేజారిపోయాయని కౌశికుడు కోపిస్తాడు. హరిశ్చంద్రుడు మాటల మధ్యలో సద్విజులకు దానం ఇవ్వాలన్న సందర్భంలో నాకు కొంత దానం ఇవ్వమని కౌశికుడు కోరతాడు. హరిశ్చంద్రుడు తనకున్న సమస్తాన్ని దానంగా ఇస్తాడు. తరువాత దాన దక్షిణగా కొంత ధనం ఇవ్వమంటాడు. హరిశ్చంద్రుడు నెల రోజులు గడువు అడుగుతాడు. కౌశికుడు హరిశ్చంద్రుడి ఆత్మాభిమానాన్ని పరీక్షించాలనుకుంటాడు.

**"పూర్ణేఽవధావసి దదాపి న దక్షిణాం మే**
**వాగ్భిస్తు శుష్కమధురాభిరుపస్థితోఽ సి ।**
**దత్తా ప్రదానకుపితేన మయా విముక్తః**
**శాపానలస్త్వయి పతత్వయమద్య ఘోరః॥"**

(చం.కౌ.పు. 58)

ఇంకా తనకు ఇవ్వవలసిన ధనం ఇవ్వలేదని హరిశ్చంద్రుడిని దుర్భాషలు ఆడుతూ నిందిస్తాడు.

భార్యను అమ్మగా వచ్చిన ధనం తీసుకోమంటే మొత్తం అంతా ఇస్తేగానీ పైకం ముట్టుకోడు. హరిశ్చంద్రుడు కాటికాపరి దగ్గర పని చెయ్యడం ఇష్టంలేక కౌశికుడి దగ్గరే ఉండి సేవ చేస్తానంటే ఒప్పుకోడు. హరిశ్చంద్రుడు తనని తాను అమ్ముకోగా వచ్చిన ధనాన్ని ఇస్తే కౌశికుడు సంతోషంగా స్వీకరిస్తాడు.

నాటకంలో కన్నా కావ్యంలో కౌశికుడి పాత్రకు నిడివి ఎక్కువ. నాటకంలో విశ్వామిత్రుడికి హరిశ్చంద్రుడి మీద కోపం రావడానికి అతడికి వ్యక్తిగతంగా హరిశ్చంద్రుడి వల్ల నష్టం జరుగుతుంది. కానీ కావ్యంలో కేవలం వశిష్ఠుడు హరిశ్చంద్రుడి సత్య నిష్ఠను తెలియజేయడంవల్ల విశ్వామిత్రుడు వశిష్ఠుడి మీద కోపంతో ఏ విధంగానైనా సరే హరిశ్చంద్రుడి చేత ఆడిన మాట తప్పించడానికి అనేక ప్రయత్నాలు చేస్తాడు. మాయలేడి, మాతంగ కన్యలు, దంతఘాతకుడు, విషసర్పాలు, భేతాళుడు వాటిని సృష్టించి హరిశ్చంద్రుడిని అనేక కష్టాలు పెడతాడు. నక్షత్రకుడి ద్వారా హరిశ్చంద్రుడికి ప్రశాంతత లేకుండ చేస్తాడు. మిక్కిలి పిసినారి అయిన కాలకౌశికుడు చంద్రమతిని కొనేలా చేస్తాడు. తక్షకుడిని ప్రేరేపించి లోహితుడు మరణించడానికి కారణమౌతాడు. కుమారుడు మరణించిన దుఃఖంలో ఉన్న చంద్రమతిపై హత్యానేరం మోపి హరిశ్చంద్రుడి చేతనే చంద్రమతిని చంపే ప్రయత్నం చేస్తాడు. నాటకంలో కన్నా కావ్యంలో కౌశికుడు మిక్కిలి క్రూరంగా ఉంటాడు. నాటకంలో కౌశికుడి లక్ష్యం కేవలం తనకు ఇస్తానన్న ధనం తీసుకోవడమే. కానీ కావ్యంలో కౌశికుడి లక్ష్యం హరిశ్చంద్రుడి చేత ఎలాగైనా సరే అబద్ధం చెప్పించడం. ఇందుకు ఎంతకైనా తెగిస్తాడు. తను ఒక ముని అని మర్చిపోయి ప్రవర్తిస్తాడు.

**2.2.4 నక్షత్రకుడు (పాత్ర చిత్రణ) :**

విశ్వామిత్రుడు శిష్యుడు. హరిశ్చంద్రుడి దగ్గర ధనం వసూలు చెయ్యడానికి విశ్వామిత్రుడి చేత నియమింపబడతాడు. కేవలం కావ్యంలో మాత్రమే ఉన్న పాత్ర. ఇప్పటికి ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయిన పాత్ర నక్షత్రకుడు. ఎవరైనా వదలకుండ వెంటపడుతూ ఉంటే నక్షత్రకుడిలాగా విసిగిస్తున్నాడు అంటారు.

కవి నక్షత్రకుడిని పరిచయం చేసే సందర్భంలో విశ్వామిత్రుడి శిష్యులలో మూర్ఖుడైన, అత్యంత మోసగాడు, క్రూరుడు నక్షత్రకుడని చెప్తాడు. విశ్వామిత్రుడు కూడ నక్షత్రకుడి గురించి హరిశ్చంద్రుడితో 'ఇతడు శ్రమచెయ్యలేడు, సుకుమారుడు, నా ప్రతినిధిగా భావించి అలసిపోయినా, నడవలేకున్నా చూసుకోవలసిన బాధ్యత నీదేనని' అప్పగిస్తాడు.

దారిలో విశ్వామిత్రుడు విపరీతమైన ఎండలను సృష్టించి త్రాగడానికి నీళ్ళుకూడ దొరకనివ్వడు. మహారాజైన హరిశ్చంద్రుడు, రాణి అయిన చంద్రమతి కూడ పడరాని పాట్లు పడతారు. సరిగ్గా సమయం చూసుకొని కపటుడైన నక్షత్రకుడు సొమ్మసిల్లిపోయినట్లు నటిస్తాడు. ఇక నడవడం తనవల్ల కాదంటాడు.

చంద్రమతి తన పాతివ్రత్య మహిమతో అగ్నిని శాంతపరిచినప్పుడు నక్షత్రకుడు ఆమె పాతివ్రత్య మహిమను పొగడుతాడు. హరిశ్చంద్రుడు, చంద్రమతి కలిసి ఉంటే ఏమీ చెయ్యలేమని కౌశికుడు వీళ్ళిద్దర్ని వేరు చేయమని నక్షత్రకుడిని ఆదేశిస్తాడు. గురువు ఆజ్ఞమేరకు నక్షత్రకుడు చంద్రమతితో "కౌశికుడిని వేడితే రాజ్యాన్ని నీకిప్పిచ్చి లోహితుడిని రాజు చేస్తాడు" అంటాడు. గడువుకు రెండు రోజులు ముందే అప్పుతీర్చమని చెప్తాడు.

**పేద నేనని నోరఁ బ్రేవులుఁ జూపఁ**

**బోదురే ఋణముఁ దెంపునఁ గొనువారు**

(హ.ఉపా.ద్వి.భా. ద్వి. సం. 201–202 పు.168)

పేదవాడినని పేగులు చూపించి బతిమాలుకొంటే ఋణం తీసుకోవలసిన వెళ్ళిపోతారా అని ప్రశ్నిస్తాడు. హరిశ్చంద్రుడు చంద్రమతిని అమ్మగా వచ్చిన ధనాన్ని దారి బత్తెంగా తీసుకుంటాడు.

**"భూవర నీ వెంటఁబుత్తెంచు నపుడు**

**నీచేత బత్తెంబు నిచ్చులు గొనఁగ**

**నా చెవిలోఁ జెప్పినాడు మద్గురుఁడు**

**నీకొడఁబడ నేల నినువేఁడ నేల"**

**నీవు లేదన నేల నినుఁ బ్రభాతమున**

**దీవింప వచ్చిన దీనవిప్రుడనె**

**చావ నొవ్వఁగఁ బూని సాహసం బొదవ**

**నెడపక గిరు లెక్కి యేళులు దాఁటి**

**కడు భయంకరమహాగహనముల్ గడచి**

**కాలు గాలినపిల్లి కరణి నీవెంట**

**నేల నీ బంటనై యెల్లందుఁ దిరిగి"**

(హ.ఉపా.ద్వి. భా.ద్వి.సం. 1234–1244, పు.229)

మొదటే నా గురువు నీ వెంట వస్తున్నప్పుడు బత్తెం పుచ్చుకొమ్మని నా చెవిలో చెప్పాడు. కాలు కాలిన పిల్లిలాగా నీ వెంట తిరిగాను. దానికి ప్రతిఫలంగా నాకు బత్తెం కావాలంటాడు. చివరికి ప్రాణమైనా విడుస్తాను కానీ ధనాన్ని మాత్రం విడవనంటాడు.

హరిశ్చంద్రుని విక్రయించే సందర్భంలో భూమి మీద గొప్ప వంశంలో పుట్టిన, బొందితో దేవలోకానికి వెళ్ళిన త్రిశంకుభూపాలుడి కొడుకు, మూడులోకాలలో విజయ స్తంభం నిలిపిన

హరిశ్చంద్రుని కొనరయ్య మీరు అంటాడు. హరిశ్చంద్రుడు ఆ పరిస్థితిలో విపరీతమైన దుఃఖంలో ఉంటాడు. అతడిని ఇంకా బాధించడానికి పూర్వపు ప్రాభవాన్ని గుర్తు చేస్తాడు.

విశ్వామిత్రుడు నక్షత్రకుడిని ఉపయోగించుకొని హరిశ్చంద్రుడిని, చంద్రమతిని మానసికంగా, శారీరకంగా కష్టాలు పెడతాడు. గౌరన కల్పనలలో హరిశ్చంద్రుని కల్పన నిత్యనూతనమైనది, విశిష్ఠమైనది.

కావ్యంలో మాత్రమే నక్షత్రకుడి పాత్ర ఉంది. నాటకంలో నక్షత్రకుడి పాత్ర లేదు.

**2.2.5 కాలకౌశికుడు (పాత్ర చిత్రణ) :**

కాశీ పట్టణంలోని ఓ బ్రాహ్మణుడు. చంద్రమతిని ధనం ఇచ్చి దాసిగా కొనుక్కుంటాడు. ఇతడు పిసినారి. యాయవారం చేసుకుంటూ బతుకుతాడు. కాలకౌశికుడి స్వభావాన్ని కవి కింది పద్యంలో వర్ణించాడు.

**కోరిన ధనములు 'గొండు కొం' డనుచు**
**నక్కఱదండఁడై యప్పు టప్పటికి**
**వెక్కసంబున నూర్లు వేలు నప్పిచ్చి**
**ముట్టఁ జిక్కిన వేళ ముట్టి చేపట్టి**
**రట్టడై తిరిగి పత్రంబులు గొనుచుఁ**
**బెట్ట వచ్చిన కల్లపెనుపులు వెనఁచి**
**తిట్టి వారును దానుఁదిరిదీపులాడు**
**మటుమాయలాఁడు కంబళపురీషంబు**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 476-483, పు.185)

ప్రజలకు డబ్బు అవసరమైనప్పుడు ఎక్కువ వడ్డీకి డబ్బులు ఇచ్చి వారు తిరిగి చెల్లించే సమయంలో దొంగవడ్డీలతో వాళ్ళదగ్గర పత్రాలు తీసుకుంటాడు. మోసకారి. పిల్లికన్నులతో, పీచు మీసముతో, ఉల్లిపాయ వంటి గడ్డంతో కాలకౌశికుడు వస్తుంటే దుర్గంధం వస్తుంది. జనులు పక్కకు తప్పుకొని తుప్పున ఉమ్మేస్తారు. కాలకౌశికుడి వర్ణన మనకు జుగుప్సను కలగిస్తుంది. అంత వికృతంగా వర్ణించాడు గౌరన. కాలకౌశికుడు చంద్రమతిని అనేక విధాలు బాధిస్తాడు.

**"పెడమూట లన్నియుఁ బెనుమోపుగాఁగ**
**మడఁబెట్టి యా చంద్రమతి నెత్తికెత్తి**
**'మురిపెంపుఁ బని లేదు ముందఱ నింక**
**సరగున నింటికి జరుగులె'మ్మనుచుఁ"**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 902-905, పు.210-211)

చంద్రమతి మోయలేని బరువులన్ని ఆమె మీద పెట్టి తొందరగా నడు అంటూ ఆమెను గదమాయిస్తాయి. కాలకౌశికుడు చంద్రమతిని పెడుతున్న బాధలు చూడగానే ప్రజలు బ్రాహ్మణ రూపంలో ఉన్న తేలని, కొంచెం కాలి కొంచెం కాలకుండ ఉన్న కట్టెని, బందిపోటు చిహ్నాలుగల వాడని విప్ర భల్లూకమని కాలకౌశికుడిని తిడతారు.

కాలకౌశికుడు వికృత రూపం, పిసినారి స్వభావం, అతని దుష్టచేష్టలు చంద్రమతిని మిక్కిలి బాధించి కావ్యం కరుణ రసాత్మకంగా సాగడానికి ఉపకరించాయి.

### 2.2.6 కలహకంఠి (పాత్ర చిత్రణ) :

కలహకంఠి కాలకౌశికుడి భార్య. కాలకౌశికుడికి తగినదే అతని భార్య కూడ. గయ్యాళి స్వభావం కలది. కాలకౌశికుడు చంద్రమతిని కొన్నాడని విని -

**'యీ ప్రొద్దు వానిఁ గుయ్యిడ శిఖఁ బట్టి**
**వీఁపుతీటంతయు విడిపించి యెదుట**
**దక్కించి పోయినధనమెల్ల మగుడఁ**
**గ్రక్కింప కున్న నీ కలహకంఠికనె'**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 1065-1069, పు.220)

భర్త శిఖపట్టుకొని వీపు మీద కొట్టి 'పోయిన ధనం తిరిగి తీసుకోకపోతే నేను కలహకంఠిని కాదు' అని ప్రతిజ్ఞ చేస్తుంది. బుర్రముక్కు, లొట్టపోయిన కన్ను, వెర్రిచూపు, వేలాడే చెవులు, నల్లని మేను, దయ్యాన్ని మరిపిస్తోంది కలహకంఠి రూపు. కలహకంఠి పెట్టే బాధలకు తట్టుకోలేక కాల కౌశికుడే -

**దినదినంబును మొత్త దీనిచేఁ జుత్తు**
**హర హరా యిటువలె నడలుట కన్న**
**మరణ మైనను నొక్క మాటైన లెస్స**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 1117-1119, పు.223)

ప్రతీరోజూ చనిపోతూ బతికేకంటే ఒక్కసారే మరణించడం మేలు అనుకుంటాడు. కలహకంఠి ఎంత దుష్ట స్వభావం కలది అంటే ఒక స్త్రీ అయ్యి ఉండి కూడ సాటి స్త్రీ అయిన చంద్రమతి కొడుకు మరణించాడని తెలిసినా చూడడానికి వెళ్ళనివ్వదు.

**కొడుకు నెక్కడ దాఁగ గుఱుతుగా నంపి**
**కడునుగ్ర భుజగంబు గఱచిన దనుచు**
**వెడయేడ్పు లేడ్చుచు వెదకుచు సందు**
**వెడలిపోఁ జూచెదో వేసాలు వన్ని**
**లోకంబులో లేని లొట తాటకత్తె**
**నీ కువాదమ్ము లన్నియుఁ దెల్సు మాకుఁ**
**గైకొని మేఁకలఁ గాచి రా పొమ్ము**
**నీకంటె మిక్కిలి నెఱజాణ నేను**

(హ. ఉపా. ద్వి. భా. ద్వి. సం. 1897-1904, పు. 265)

కావాలనే నీ కుమారుని ఎక్కడకో పంపి పాము కరిచిందని ఏడుస్తున్నావు. కొడుకును వెదకాలనే వంకతో పనినుండి వెళ్ళిపోవాలని చూస్తున్నావు. జిత్తులమారిదానవు, నీ కపట వర్తనాలన్ని తెలుసు మాకు. నీ కంటే మిక్కిలి నెరజాణ నేనని చంద్రమతితో అంటుంది.

చంద్రమతి ఎంతో బ్రతిమిలాడుతుంది. కొనప్రాణాలతో ఉంటే వెళ్ళి వైద్యం చేయించి బతికించుకుంటాను నామీద దయ చూపుమని అర్థిస్తుంది. కలహకంఠి జాలిలేని కఠినాత్మురాలు. స్త్రీ లక్షణాలు ఇసుమంత కూడ లేవు. మేము మందులు ఇప్పించలేం. వైద్యుడికి చూపించలేం. పని అంతా చేసిన తరువాత ప్రొద్దు పోయిన తరువాత వెళ్ళమని ఆజ్ఞాపిస్తుంది.

చంద్రమతి రాజ్యం పోయినా, భర్త తనను విక్రయించినా, భర్తకు దూరం అయినా ఎక్కువ బాధపడదు. కానీ తన కడుపున పుట్టిన బిడ్డ కారడవిలో ప్రాణాలతో ఉన్నాడో, లేదో తెలియదు, వెంటనే వెళ్ళి చూడడానికి కూడ అవకాశం లేక ఎంతో బాధపడుతుంది. అందుకే గౌరన చంద్రమతి గురించి చెబుతూ "చిత్తంబులో శోకశిఖి మండుచుండ" అనే పదాన్ని వాడాడు. చంద్రమతికి ఇంత దుఃఖాన్ని కలిగించినది కలహకంఠి. గౌరన కలహకంఠి పాత్ర ద్వారా హరిశ్చంద్రోపాఖ్యానంలో కరుణ రసానికి మరింత పుష్టిని చేకూర్చాడు.

## 2.3 కావ్యనాటకాలలో రస పరిశీలన :

కావ్య నాటకాలలో వీర రసం ప్రధాన రసంగా ఉన్నది. ఈ వీరం కూడ సత్య వీరం. వీరరసానికి ఆలంబనం హరిశ్చంద్రుడు. ఉద్దీపనం విశ్వామిత్రుడు. వీరానికి ఉత్సాహం స్థాయీ భావం. సత్యవీరం ప్రధాన రసంగా ఉన్న ఈ కావ్యానికి హరిశ్చంద్రుడు ధీరోదాత్తుడు. ఈ కావ్యం వీరరసంతోపాటు కరుణ, బీభత్స, రౌద్ర, అద్భుత రసాలతో నిండి పరిపుష్టిని పొందింది. "తెలుగున మొదటి కావ్యముగా గౌరన వెలయించిన హరిశ్చంద్రోపాఖ్యాన కావ్యములో వర్ణనలతో పాటుగను, పాత్రపోషణతో పాటుగను, రసపోషణము కూడ జరిగి యది పరిపూర్ణ కావ్యముగా తీర్చిదిద్దబడెను. అనేకములగు సన్నివేశములను, సందర్భములను, సంభాషణములును వర్ణనలును పాత్రలను కూడ నీ రసపోషణ కుపకరించినవి"[7].

"అనురాగ మేకంత నిష్ఠమ్ యున్నప్పుడు నాయకుఁడుగాని నాయిక గాని పొందు విప్రలంభము విప్రలంభా భాసము"[8] మాతంగ కన్యలకి హరిశ్చంద్రుడిని పొందాలని కోరిక ఉంది. కానీ హరిశ్చంద్రుడికి మాతంగ కన్యల పట్ల విముఖత ఉండడం వలన ఇది విప్రలంభాభాసం.

### 2.3.1 శృంగార రసం

**"తత్ర శృఙ్గారో నామ రతిస్థాయిభావప్రభవః ఉజ్జ్వలవేషాత్మకః యత్కించిల్లోకే శుచి, మేధ్యమ్, ఉజ్జ్వలం, దర్శనీయం వా తత్ శృఙ్గారేణోపమీయతే. యస్తావదుజ్జ్వలవేషః స శృఙ్గారవానిత్యుచ్యతే. యథా చ గోత్రకులాచారోత్పన్నాని, ఆప్తోపదేశసిద్ధాని పుంసాం నామాని భవన్తి తథైవేషాం రసానాం భావానాం చ నాట్యాశ్రితానాం చార్థానామ్ ఆచారోత్పన్నాని ఆప్తోపదేశసిద్ధాని నామాని. ఏవమేష ఆచారసిద్ధో హృద్యోజ్జ్వలవేషాత్మకత్వాత్ శృఙ్గారో రసః. స చ స్త్రీపురుషహేతుక ఉత్తమయువ ప్రకృతిః"[9]**

శృంగారం రతి అనే స్థాయి భావం నుండి పుడుతుంది. ఆకర్షణమైన వేష స్వరూపమైనది. లోకంలో శుభ్రం, పవిత్రం, చూడముచ్చట గొల్పేది ఏ వస్తువు అయినా దానిని శృంగారంతో పోలుస్తారు. ఉజ్జ్వలమైన వేషం ధరించిన వాడిని శృంగారవంతుడంటారు. ఉజ్జ్వలవేష స్వరూపమైన రసం కావున

---

*7. ఆంధ్ర సాహిత్యములో హరిశ్చంద్రోపాఖ్యానము, పు. 179*

*8. సాహిత్య సోపానములు, పు. 90*

*9. నాట్యశాస్త్రమ్ ఆంధ్రభాషావ్యాఖ్య, పు. 220*

దీనికి శృంగారమని పేరు. దీనికి స్త్రీ పురుషులు హేతువు ఉత్తమ ప్రకృతి కల యువతీ యువకులు దీనికి కారణం.

శృంగార రసానికి సంభోగం, విప్రలంభం అని రెండు అవస్థలు. వీటిలో సంభోగ శృంగారం, ఋతువులు, పుష్పమాలలు, సుగంధద్రవ్యలేపనాలు, అలంకారాలు, ఇష్టుడు (ప్రియుడు లేదా ప్రియురాలు) భోగ్యవస్తువులు, శ్రేష్ఠమైన భవనము, వాటి భోగం, ఉద్యానగమనం, అక్కడ అనుభవించడం ప్రియుడు లేదా ప్రియురాలి గురించి శ్రవణం, దర్శనం, క్రీడా విలాసాలు మొదలైన విభావాలచేత పుడుతుంది.

నేత్రాల నేర్పు, కనుబొమ్మల విరుపు, క్రీకంటి చూపులు, నడక లలితములు మధురములైన అంగహారాలు, మాటలు మొదలైన అనుభవాలతో సంభోగ శృంగారాభినయం చెయ్యాలి. దీనిలో ఆలస్యం, ఉగ్రత్వం, జుగుప్స అనే వ్యభిచారి భావాల ప్రయోగం ఉండకూడదు.

విప్రలంభ శృంగారాన్ని నిర్వేదము, గ్లాని, శంక, అసూయ, శ్రమము, చింత, ఔత్సుక్యం, స్వప్నం మేల్కొనడం, వ్యాధి, ఉన్మాదం, అపస్మారం, జడత్వం, మోహం, మరణం మొదలైన అనుభావాలతో అభినయించాలి.

భోజుడు "శృంగార ఏవ ఏకో రసః" శృంగార మొక్కటే రసం అని సిద్ధాంతీకరించెను. ఈ శృంగారానికే అభిమాన రసం, అహంకార రసం అని నామాంతరాలు. లోకంలో ఒకానొక నాయికను గాంచినపుడీ ఒక నాయకుడికి రతి కలుగును. అలాగే ఒకానొక నాయకుడిని చూసినపుడు నాయికకు రతి కలుగును. ఈ విధంగా కలగడానికి కారణం ఏమిటంటే తమ తమ రతికి ఉద్భోధకాలైన చేష్టలు వారిలో కనబడుటయే కారణం.

హరిశ్చంద్రుడి చేత ఏ విధంగానైనా సరే అబద్ధం ఆడించాలని విశ్వామిత్రుడు మాతంగ కన్యలను సృష్టించి హరిశ్చంద్రుడి దగ్గరకు పంపిస్తాడు. మాతంగ కన్యలు వీణాగానం చేసి హరిశ్చంద్రుడి దృష్టిని ఆకర్షిస్తారు. మాతంగ కన్యలు మన్మథతాపంతో హరిశ్చంద్రుడిని పొందాలని ప్రయత్నం చేస్తారు.

**మరునిపూఁదూపుల మర్మముల్ గాఁడి**
**విరవిరఁ బోవుచు విరహాగ్ని గ్రుంరు**
**కరిగమనలకు నీకౌఁగిటిపొందు**
**గళకలరవగతి గతులకు విందు**

**బలియుతాపము డిందుపడ నదే మందు**

**నృపవర సూనృతనియతి బెం పొందు**

**నెపమున మముఁ బొందు నీ కిదె సందు"**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 930-937, పు.68)

తమకు కలిగిన మన్మథతాపాన్ని హరిశ్చంద్రుడే తీర్చాలని మాతంగ కన్యలు కోరుకుంటారు. వారికి హరిశ్చంద్రుడు తగిన విధంగా సమాధానం ఇస్తాడు.

**"మిముఁ జూడఁగా రాదు మిము ముట్టరాదు**

**మిముఁ బొందు మననెట్లు మీకు నోరాడె"**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 941-942, పు. 68)

మిమ్మల్ని చూడకూడదు, ముట్టుకోకూడదు. మిమ్మల్ని పొందమనడానికి మీకు నోరెలా వచ్చిందని వాళ్ళని తిట్టి పంపిస్తాడు. ఇది శృంగార రసాభాసాగా చెప్పుకోవచ్చు. మాతంగ కన్యలు హరిశ్చంద్రుడిని కోరుకున్నారు. కానీ హరిశ్చంద్రుడు వాళ్ళను తిరస్కరిస్తాడు. ఈ సంఘటన మనుచరిత్రలోని వరూధుని ప్రవరాఖ్యుల వృత్తాంతాన్ని మనకు జ్ఞప్తికి తెస్తోంది.

"మార్కండేయ పురాణ దేవీ భాగవతముల యందు నీ మాతంగ కన్యల సృష్టి కానరాదు. స్కాంద పురాణ తీర్థఖండస్థమని పేర్కొనబడిన హరిశ్చంద్రోపాఖ్యాన కావ్యమునందే ప్రసక్తి కలదు. కాని యింతటి విపులవర్ణనమందు కానరాదు. రసపోషణమునకై గౌరన కావించిన అపూర్వమైన కావ్య వర్ణనమిది".[10]

**తాంబూలరాగోఽధరలోలుపో య -**

**యద్యదంజనం లోచన చుంబనోత్కమ్ ।**

**హారశ్చ కంఠగ్రహలాల సోయ -**

**త్స్వార్థం స తేషాం నతు భూషణం తే॥** (చం. కౌ. పు.11)

చంద్రమతి జిగిమోవికి ఆశపడి తాంబూలం, వక్షస్థలాన్ని ఆశ్రయించి హారాలు స్వార్థంతో ఆమెని ఆశ్రయించాయని కవి వర్ణించాడు. చంద్రమతి యవ్వన, భూషణాలు హరిశ్చంద్రుడికి సహజోద్దీపనాలు.

---

*10. ఆంధ్రసాహిత్యములో హరిశ్చంద్రోపాఖ్యానము, పు.180*

**నాటకంలో శృంగార రసం :**

నాటకంలో శృంగార రసం పోషింపబడింది. హరిశ్చంద్రుడు నిశాప్రజాగ్రవ్రతంలో ఉండడం వల్ల శైబ్యతో గడపడానికి రాడు. ఈ విషయం తెలియని శైబ్య హరిశ్చంద్రుడి మీద కోపం వహిస్తుంది. రాజు ఆమె ప్రణయ కోపాన్ని పోగొట్టడానికి ఆమెను అనునయించిన తీరిది.

> **"చణ్డి ప్రసీద పరితామ్యసి కిం ముధైవ**
> **నాహం తథా నను యథా వరిశంకసే మామ్ ।**
> **దణ్డం వరాజ్ఞి మయి ధారయ యత్క్షమం తే**
> **మన్నిర్ణయే కులపతిర్భగవాన్ప్రమాణమ్ ॥"**

(చం.కౌ.పు.16)

దేవీ ! ప్రసన్నురాలివికా ఎందుకు అనవసరంగా నా మీద కోపం తెచ్చుకుంటావు. నన్ను దండించు. నన్ను నిందించే ముందు మహనీయుల మాటలు ప్రమాణం తీసుకో అంటాడు.

ఇక్కడ రాణి ప్రణయ కోపాన్ని చూపటం రాజు ఆమెను సముదాయించడంలో శృంగారరసం ఆవిష్కృతమైంది.

కావ్యంలో విప్రలంభా భాసం కన్పించగా, నాటకంలో శృంగారరసం కన్పిస్తోంది. కావ్యంలో సత్యవంతుడైన హరిశ్చంద్రుడి యందు శృంగార రసాభాస చెప్పడం ఔచిత్యవంతంగా ఉంది.

**2.3.2 హాస్య రసం :**

**"అధ్య హాస్యో నామ హాసస్థాయిభావాత్మకః స చ వికృతపరవేషాలంకార - ధార్ష్ట్య లౌల్య-కుహకాసత్ప్రలాప - వ్యఙ్గదర్శన - దోషాదాహరణాదిభిః విభావైః ఉత్పద్యతే. తస్య ఓష్ఠ - నాసా - కపోలస్పన్దన - దృష్టివ్యాకోశ - ఆకుఞ్చన - స్వేద - ఆస్యరాగ - పార్శ్వగ్రహణాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః. వ్యభిచారిణశ్చాస్య అవహిత్థా - ఆలస్య - తన్ద్రా - నిద్రా - స్వప్న - ప్రబోధ- అసూయాదయః"**[11]

హాసం స్థాయీ భావంగా గలది హాస్యరసం. ఇతరుల వికృత వేషం, అలంకారం, ధార్ష్ట్యం (పొగరు), చపలత్వం, కుహకం, చెడ్డ ప్రేలాపన, అంగవికారం మొదలైన వాటిని చూడడం, ఏవైన దోషాలు (నత్తి మొదలైనవి) గురించి చెప్పడం మొదలైన విభావాల చేత హాస్యరసం పుడుతుంది.

---

*11. నాట్యశాస్త్రమ్ ఆంధ్రభాషావ్యాఖ్య, పు. 223*

పెదవులు, ముక్కు, చెక్కిళ్ళు మొదలైన వాటి స్పందం (కదలడం) కళ్లు పెద్దవి చేయడం, చిన్నవి చేయడం, చెమట, ముఖం ఎర్రబడడం. పక్కలు చేతులతో పట్టుకోవడం మొదలైన అనుభవాలచేత అభినయించి హాస్యరసాన్ని ప్రయోగించాలి. అవహిత్థ, అలసత్వం, తంత్ర (బద్ధకం) నిద్ర, స్వప్నం మేల్కొనడం, అసూయ మొదలైనవి హాస్యానికి వ్యభిచారిభావాలు.

హరిశ్చంద్రుడు నాయకుడుగాగల కావ్యంలో హాస్యరసం అంతగా కన్పించదు. అయినా కావ్యాన్ని నిశితంగా పరిశీలించిన తరువాత అక్కడక్కడ కొన్ని ఘట్టాలు హాస్య రసాన్ని కలిగిస్తాయి. కాల కౌశకుడిని వర్ణించే సందర్భంలో అతడి వికృతరూపం, జనులు అతనిని ఆసహ్యించుకోవడంలో హాస్యరసం స్ఫురిస్తుంది. కలహకంఠికి వటువు చంద్రమతి గురించి చెప్పే సందర్భంలో కలహకంఠి, కాలకౌశికుడికి మధ్య తగువు సృష్టించేలా ప్రవర్తిస్తాడు.

**విరసంబు పుట్టించి వీనికి వీని**
**తరుణికి నొకమరి తలపట్లు చేసి**
**మొగములు వగులంగ మొత్తు లాడించి**
**నగుచుఁ జూచెదగాక నాకేమి యనుచుఁ**
**గపట మేర్పడఁగ 'నౌఁగా' కనిపోయి**
**చపలాత్ముఁడా యొజ్జ సానికిట్లనియెఁ**

**........................................**

**నిదె నేఁడు సౌందర్య మెల్లను బ్రహ్మ**
**చిదిమి చక్కనిరూపు సేసిన యట్టి**
**రాచకూఁతురు గొని రవ్వగా కుండ**
**దాఁచిన మీ మూలధన మెల్లఁ బెట్టి**
**గోఁచికాఁడై దానిఁ గొనుచు నేతెంచి'**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 1024-1050, పు. 217-219)

కాలకౌశికుడి శిష్యుడు వటువు చపలత్వంతో కాలకౌశికుడికి, కలహకంఠికి గొడవ పెడతాడు. చపలత్వం అనే విభావం వలన కావ్యంలో హాస్య రసం అభివ్యక్తమయింది.

అందమైన స్త్రీని వివాహం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో కాల కౌశికుడు చంద్రమతిని తీసుకువస్తున్నాడని కలహకంఠికి చెప్పి భార్యాభర్తల మధ్య వివాదం వస్తే చూస్తూ వటువు కూర్చుంటాడు.

కావ్యంలో మాత్రమే హాస్యరసం ఉంది. నాటకంలో హాస్యరసం లేదు.

### 2.3.3 కరుణరసం :

**"అథ కరుణో నామ శోకస్థాయిభావ ప్రభవః స చ శాప – క్లేశ వినిపతితేష్టజన – విప్రయోగ– – విభవనాశ – వధ – బన్ధ – విద్రవ – ఉపఘాత – వ్యసన సంయోగాదిభిః విభావైః సముపజాయతే. తస్య అశ్రుపాత – పరిదేవన – ముఖశోషణ – వైవర్ణ్య – స్రస్తగాత్రతా నిఃశ్వాస – స్మృతిలోపాదిభిః – అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః – వ్యభిచారిణశ్చాస్య నిర్వేదగ్లాని – చిన్తా – ఔత్సుక్య – ఆవేగ – భ్రమ – మోహ – శ్రమ – భయ – విషాద – దైన్య – వ్యాధి – జడతా – ఉన్మాద – అపస్మార – త్రాస – ఆలస్య – స్మరణ – స్తమ్భ – వేపథు – వైవర్ణ్య – అశ్రు – స్వరభేదావయః".**[12]

కరుణరసం శోకం అనే స్థాయి భావం నుండి పుడుతుంది. కష్టాలలో చిక్కుకొన్న ఇష్టజనుల వియోగం, వైభవనాశం, వధ, బంధము, లోకోపద్రవం, తలచినదానికి ఎదురుదెబ్బలు తగలడం లేదా ఆకస్మికంగా శరీరానికి దెబ్బల తగలడం, వ్యవసనంతో సంబంధం (వ్యసనం కలగడం) మొదలైన విభావాలచేత కలుగుతుంది. కన్నీళ్ళు, విలపించడం, ముఖం ఎండిపోవడం, ముఖం రంగు మారిపోవడం, అవమానాలు జారి పోవడం, నిట్టూర్పు, మరపు మొదలైన అనుభవాలచేత దీని అభినయం చెయ్యాలి. దీనికి నిర్వేదము, గ్లాని, చింత, ఔత్సుక్యం, ఆవేగం, భ్రమ, భయం, విషాదం, దైనం (దిగులు) వ్యాధి, జడత్వం ఉన్మాదం, మూర్ఛ, త్రాసం, కన్నీళ్ళు, కంఠస్వరంలో వికారం మొదలైనవి వ్యభిచారీ భావాలు'.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వీరం తరువాత ద్వితీయ స్థానం అందుకొన్న రసం కరుణం. అందునా హరిశ్చంద్రోపాఖ్యానం కావ్యంలో అడుగడుగునా కరుణరసం కన్పిస్తోంది. హరిశ్చంద్రుడు కారడవిలో భయంకరమైన వర్షం, విపరీతమైన ఎండ, భీకర అగ్ని, పిశాచాలు, పాములు, వృశ్చికాలు మొదలైన వాటితో బాధలు పడడం. భార్య, కుమారుడిని విక్రయించడం, కుమారుడు మరణించడం, భార్యను తానే చంపవలసి రావడం మొదలైన ఘట్టాలలో కరుణరసం కన్పిస్తోంది. ముఖ్యంగా కుమారుడు మరణించినప్పుడు చంద్రమతి హాహాకారాలతో కరుణ రసం తారాస్థాయిని అందుకుంది.

**జాలఁగీ లెడలినజంత్రంపు బొమ్మ**
**పోలిక మూర్ఛిల్లి పుత్రుపై వ్రాలి**
**క్రమ్మఱఁ దెలివెంది కన్నీరుఁ దొరుఁగ**

---

12. *నాట్యశాస్త్రమ్ ఆంధ్రభాషావ్యాఖ్య, పు. 226*

నమ్మదిరాక్షి యిట్లని యేడ్వఁ దొడఁగె
'హా లోహితాస్య వంశైక విస్తార
లాలిత సౌభాగ్య లక్షణాకార
హా నిర్వికార మహాగుణాధార
..................................
బడి నక్కలఱవ నిర్భయమున నడవి
నుడుగక నిద్దుర నొంది యున్నాఁడ
వే మందు నింక నెట్లేమందు విధిని
నేమందు వెట్టిన నెసగుఁ బ్రాణము'.

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 1981–2018, పు. 269)

చంద్రమతి కొడుకును చూసి మూర్ఛిల్లి తరువాత నెమ్మదిగా తేరుకొని కన్నీరు కారుస్తూ, ఏడుస్తూ లోహితుడిని చూసి పూర్వవైభవాన్ని గుర్తుకు తెచ్చుకుంటుంది. కుమారుడికి వైద్యం చేయించే పరిస్థితి కూడ లేదు. భర్త దగ్గర లేదు. సహాయం చేసేవారు కూడ ఎవ్వరూ లేరు. తనకు కలిగిన ఆపదకు చింతించి విధిని ఏమనాలో తెలియక బాధపడుతుంది.

**నాటకంలో కరుణరసం :**

నాటకంలో కూడ కరుణరసం అనేక సన్నివేశాలలో కన్పిస్తుంది. రాజు తనను ఎవ్వరూ కొనుక్కోలేదని చింతించుట, భార్యను, కుమారుడిని అమ్ముకోవడం, చండాలుడి దగ్గర కాటికాపరిగా ఉన్నానని బాధపడడం వంటి సన్నివేశాలలో కరుణరసం అభివ్యక్తమయింది.

హరిశ్చంద్రుడు భార్య, కుమారుడ్ని విక్రయించిన పిదప వాళ్ళని తలచుకొని బాధపడతాడు.

త్వరయతి గురోర్భక్త్యా తస్మి న్ద్విజన్మని రోషణే
రుదతి చ తదాక్షిప్తే బాలే పటాన్త నిరోధిని ।
విధృతవిధృతైర్బాష్పోత్పీడైర్జడీ కృతతారకా
కథమపి తయా క్రూరే దృష్టిశ్చిరాన్మయి సంహృతా ॥

(చం.కౌ.పు. 87)

ఒక పక్క పదపద అని వటువు తురుముతుంటే కుమారుడు నడవలేక పడిపోతూ ఏడుస్తూ శైబ్య కొంగులాగుతూ ఉంటే బలవంతంగా చంద్రమతి కూడ నడుస్తుంటుంది. భార్యకి, కడుపున బిడ్డకి ఎంతకష్టం వచ్చిందని హరిశ్చంద్రుడు బాధపడతాడు.

లోహితుడు పాముకాటు వలన మరణించాడని విని చంద్రమతి విపరీతంగా బాధపడుతుంది.

**హ జాద కహిం సి. దేహి మీ పడివఅణం. (ఇతిస్తమ్భం నాటయిత్వా సంజ్ఞాం లబ్ధ్వా) హో జాద ణ జుత్తం దాణిం పిదుణా విదే జధా పరిచ్ఛత్తా తధా తు మం పి మం మన్దభా ఇణిం పరిచ్ఛఅసి. (ఇతి మోహం నాటయతి) (చం.కౌ.పు. 114)**

అయ్యో కొడుకా! అయ్యో నాకన్న తండ్రి మాట్లాడవేంటి? హా పుత్ర. నీ తండ్రి నన్ను విడిచి పెట్టినట్టే అదృష్టహీనురాలైన నన్నూ నువ్వు విడిచి పెట్టావు. ఇది నీకు న్యాయమేనా అని బోరుబోరున విలపిస్తుంది.

కావ్య నాటకాలు రెండింటిలో లోహితుడు మరణించడం రసానికి విభావం. శైబ్య కన్నీళ్ళతో హాపుత్రా అంటూ నిట్టూర్చాడం రౌద్రరసాభినయాలు. ఈ విభావ, కరుణ రసాభినయాల వలన నాటకంలో కరుణ రసం అభివ్యక్తమయింది.

నాటకంలో కంటే కావ్యంలో కరుణ ఎక్కువగా పోషింపబడింది. నాయకుడైన హరిశ్చంద్రుడు అడుగడుగునా కష్టాలు పడడం, కాలకౌశికుడు, కలహకంఠి, నక్షత్రకుల పాత్రల వల్ల కావ్యంలో హరిశ్చంద్రుడు, చంద్రమతి తీవ్ర వేదనను అనుభవిస్తారు. కౌశికుడు చంద్రమతి హరిశ్చంద్రులను వేరు చేసి హరిశ్చంద్రుడి చేతనే చంద్రమతిని చంపించే పన్నాగం పన్నుతాడు. అందువల్ల నాటకంలో కంటే కావ్యంలో కరుణరసం తారాస్థాయిని అందుకుంది.

### 2.3.4 రౌద్రరసం :

**"అథరౌద్రో నామ క్రోధస్థాయీభావాత్మకః రక్షోదానవోద్ధతమనుష్య ప్రకృతః సంగ్రామ హేతుకః. స చ క్రోధ - ఆఘర్షణ - అధిక్షేప - అనృతవచన - ఉపఘాత - వాక్పారుష్య - అభిద్రోహ - మాత్సర్యాదిభిః విభావైః ఉత్పద్యతే. తస్య చ తాడన - పాటన - పీడన - ఛేదన - భేదన - ప్రహరణాహరణ - శస్త్రసంపాత - సంప్రహార - రుధిరాకర్షాద్యాని కర్మాణి. పునశ్చచ రక్తనయన - భృకుటీకరణ - దన్తోష్ఠపీడన - గణ్డస్ఫురణ - హస్తాగ్రనిష్పేషాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః."**[13]

రౌద్రరసానికి స్థాయీ భావం క్రోధం. దీనికి ప్రకృతి (ఆశ్రయం) రాక్షసులు, దానవులు, ఉద్ధతమనుష్యులు (తీవ్ర స్వభావం గల భీమసేనాదులు) యుద్ధం దీనికి హేతువు. క్రోధంతో లాగడం,

---

*13. నాట్యశాస్త్రమ్ ఆంధ్రభాషావ్యాఖ్య, పు. 227*

నిందించడం, అసత్యవచనం, దెబ్బతగలడం, పరుషవాక్కులు, ద్రోహము, మాత్సర్యం మొదలైన విభావాలవల్ల పుడుతుంది. కొట్టడం, చీల్చడం, పీడించడం, ఛేదించడం, బద్దలు కొట్టడం, ఆయుధాలు ప్రయోగించడం, ఆయుధాలతో కొట్టడం, రక్తం లాగడం మొదలైన పనులు దీనివల్ల జరుగుతాయి. ఎఱ్ఱని నేత్రాలు, కనుబొమ్మలు విరవడం, దంతాలు పెదవులు బిగించడం, చెక్కిళ్లు కదలడం, అరిచేతులు పిండడం మొదలైన అనుభవాల చేత రౌద్రరసాభినయం చెయ్యాలి.

కావ్య నాటకాలు రెండింటిలోనూ విశ్వామిత్రుడి పాత్రను రౌద్రరసానికి ఉదాహరణగా చెప్పవచ్చు. కావ్యంలో ఇంద్రసభలో వశిష్ఠుడు హరిశ్చంద్రుడి గొప్పతనం చెప్పగానే విశ్వామిత్రుడికి ఎక్కడలేని కోపం వస్తుంది. హరిశ్చంద్రుడిని సత్యవంతుడిగా అంగీకరించడు. హరిశ్చంద్రుడి చేత ఆడినమాట తప్పించకపోతే –

**సిద్ధాశ్రమంబున శివుని నేఁ గూర్చి**
**గాలి యాహారంబు గాఁ గ్రోలి యొక్క**
**కాలూఁది యూర్ధ్వ ముఖంబు గా నిలిచి**
**రెండు చేతులు నెత్తి ఱెప్పలు విచ్చి**
**.......................................**
**మఱి చతుర్దశ మహామన్వంతరమున**
**నింద్రునిసరిగద్దె నీస్వర్గమందుఁ**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 296–307, పు. 26)

చేసిన తపస్సు సగం ఇచ్చి ఇంద్రపదవి మీద కూర్చో బెడతానంటాడు. హరిశ్చంద్రుడు మాతంగ కన్యలను తిరస్కరించి వాళ్ళను శిక్షించినప్పుడు విశ్వామిత్రుడు ఉగ్రరూపం దాల్చుతాడు.

**వలచేతిజపమాల వసుధపై వైచి**
**ముఱముఱ మని బొమల్ ముడిపాటు గదురఁ**
**జుఱచుఱ నిప్పు లక్షుల నుప్పతిల్ల**
**పొటపొట చెమట మైఁ బొడమ నాసికముఁ**
**బుటపుట గటములుఁ బొరిఁ బొరి నదర**
**మొగమున జేవురుమురువు నటింప**
**భుగభుగ నిగుడునూర్పులపొగ లెగయఁ**

.......................................

**మూఁడగ్నులును మునిమూర్తియైనట్లు**
**వాఁడితేజముతోడ వచ్చు కౌశికునిఁ**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 1054-1074, పు. 75)

మాతంగకన్యలను హరిశ్చంద్రుడు అవమాన పరిచిన సంగతి వినగానే విశ్వామిత్రుడి హావభావాలలో కలిగిన మార్పుని వర్ణించాడు.

మాతంగ కన్యలు నీవే గతి అని నీ దగ్గరకు వచ్చామనగానే విశ్వామిత్రుడు తన చేతిలో ఉన్న జపమాలను నేలపై పడేస్తాడు. కనుబొమ్మలు ముడివేస్తాడు. చేతిలో దండాన్ని తిప్పుతూ, లయకారుడిలాగ కోపిస్తాడు.

విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడిని ఏ విధంగానైనా భయపెట్టి, ఆడినమాట తప్పించాలనే ప్రయత్నంతో మిగుల కోపిస్తాడు. విశ్వామిత్రుడి కోపం విభావం. కనుబొమ్మలు ముడివేయడం, చెక్కులు ఎరుపెక్కడం, కింది పెదవిని కొరకడం మొదలైనవి రౌద్రరసాభినయాలు. ఈ విభావ, అనుభావాల వలన రౌద్రరసం అభివ్యక్తమయింది.

**నాటకంలో రౌద్రరసం :**

నాటకంలో కూడ రౌద్రరసానికి ఉదాహరణగా కౌశికుడి కోపాన్ని చెప్పుకోవచ్చు. హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడికి స్వాధీనం కాబోయే విద్యలను అడ్డుకోవడం వలన కౌశికుడికి కోపం వస్తుంది.

**కామం హరిర్భవ విమూఢ భవా థ చంద్ర**
**శ్చన్ద్రార్ధమౌలిరథ వా హర ఏవ భూయాః ।**
**విద్యా ప్రణాశ పరివర్ధిత ఘోరదీప్తేః**
**క్రోథానలస్య మమ నేన్ధనతాం ప్రయాసి ॥**

(చ.కౌ.పు.40)

**కాన్తాకేలిమయోఽపి భూత కరుణాశాన్తోఽప్యసౌ సంయమీ**
**క్రీడారూఢ సమాధిభఙ్గ వికటంభ్రూ భఙ్గ భీమాననః ।**
**దృష్టాకృష్టశరాసనం యదకరోత్క్రుద్ధః పినాకీస్మరం**
**త్వామప్యద్య దృశా తదేవ కురుతే క్రోధాదయం కౌశికః ॥**

(చం.కౌ.పు.41)

శ్రీహరి అయినా, చంద్రుడు అయినా, ఆ చంద్రుడిని తలమీద పెట్టుకున్న శివుడైనా సరే. తనకు వశం కావాల్సిన విద్యలకు ఆటంకమైన వాడు తన కోపానికి ఆహుతి అవుతాడని ప్రతిజ్ఞ చేస్తాడు.

కౌశికుడు క్రోధ విభావం. శివుడు మన్మథుడిని మూడవ కన్ను తెరిచి సంహరించినట్టుగా కౌశికుడు హరిశ్చంద్రుడిని సంహరిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. కౌశికుడు ఆవేశం రౌద్రరసానికి సాత్త్విక భావం. ఈ విభావ సాత్త్విక భావాల వలన నాటకంలో రౌద్రరసం పుట్టింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడిపై క్రోధం వహిస్తాడు. అయితే నాటకంలో విశ్వామిత్రుడికి హరిశ్చంద్రుడు ఇవ్వవలసిన ధనాన్ని ఇచ్చేసాక విశ్వామిత్రుడి పాత్ర ప్రవేశం లేదు. కానీ కావ్యంలో విశ్వామిత్రుడికి హరిశ్చంద్రుడు ఇవ్వవలసిన మొత్తం ఇచ్చాక కూడ అనేక కష్టాలు కలుగజేస్తాడు. నాటకంలో విశ్వామిత్రుడి లక్ష్యం కేవలం హరిశ్చంద్రుడి దగ్గర ద్రవ్యాన్ని వసూలు చెయ్యడం మాత్రమే కానీ కావ్యంలో చివరివరకు విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడి చేత మాట తప్పించాలని ప్రయత్నం చేస్తాడు. నాటకంలో కన్నా కావ్యంలో విశ్వామిత్రుడి యందు రౌద్ర రసం ఎక్కువగా పోషింపబడింది.

### 2.3.5 వీరరసం

**"అథ వీరో నామ ఉత్తమప్రకృతిః ఉత్సాహాత్మకః స చ అసంమోహ – అధ్యవసాయ – నయ – వినయ – బల – పరాక్రమ –శక్తి – ప్రతాప – ప్రభావాదిభిః విభావైరుత్పద్యతే. తస్య – స్థైర్య – ధైర్య – శౌర్య – త్యాగ – వైశారద్యాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః భావాశ్చాస్య ధృతి – మతి – గర్వ – ఆవేగ – ఔగ్ర్య – అమర్ష – స్మృతి – రోమాఞ్చాదయః.**[14]

వీరరసం ఉత్తమ ప్రకృతి కలది. ఉత్సాహస్వరూపమైనది. సంమోహం (ఏమి చెయ్యాలో తెలియని స్థితి లేక పోవడం), నిశ్చితమైన ఆలోచన నీతి, వినయం, బలం, పరాక్రమం, శక్తి ప్రతాపం, ప్రభావం ఈ విభావాలవల్ల పుడుతుంది. స్థైర్యం, ధైర్యం, శౌర్యం, త్యాగం, నేర్పు మొదలైన అనుభవాలతో దీని అభినయం చేయాలి. ధృతి, మతి, గర్వం, ఆవేశం, అమర్షం (కోపం), స్మృతి, రోమాంచం మొదలైనవి దీని భావాలు (వ్యభిచారి – సాత్త్విక భావాలు)

హరిశ్చంద్రుడు నాయకుడైన కావ్య నాటకాలలో ప్రధాన రసం వీరం. అందునా సత్యవీరం. నాయకుడైన హరిశ్చంద్రుడు సత్యవ్రతాన్ని పాటించడంలో వశిష్ఠాదులచే ప్రశంసలు పొందుతాడు.

---

*14. నాట్యశాస్త్రమ్ ఆంధ్రభాషావ్యాఖ్య, పు. 229*

సత్యమే తన ఊపిరిగా బ్రతికేవాడు. అందుకే హరిశ్చంద్రుడికి సత్యహరిశ్చంద్ర అని పేరు స్థిరపడిపోయింది. లోకంలో ఎవరైనా ఆడినమాట తప్పని వాళ్ళని సత్యహరిశ్చంద్రుడితో పోల్చడం పరిపాటి. రాజు వీరత్వంలో ఎన్ని యుద్ధాలైన చేయవచ్చుకాని అడుగడుగునా అనేక కష్టాలను ఎదుర్కొంటూ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం చాలాకష్టం.

హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడికి యాగం కొరకు కొంత ధనం ఇస్తానని మాట ఇస్తాడు. తరువాత మాతంగ కన్యలను తిరస్కరించినపుడు రాజ్యమైన వదులుకుంటాను కానీ కులం వదులుకోను అంటాడు. విశ్వామిత్రుడు దానిని ఆసరాగా తీసుకొని రాజ్యాన్ని దానంగా పుచ్చుకుంటాడు. రాజ్యాన్ని దానం తీసుకొని నాకు ఇదివరకు ఇస్తానన్న ధనం కూడ ఇవ్వమని విశ్వామిత్రుడు అడిగినపుడు హరిశ్చంద్రుడు దానికి కూడ ఒక నెల గడువు అడుగుతాడు.

పరాక్రమంతో సర్పాలు, వృశ్చికాలు, భూతాలనుండి బయటపడడం ఒక ఎత్తు అయితే భార్యా కుమారులను అమ్ముకోవడం ఒక ఎత్తు. కొడుకు తనని విడిచిపెట్టి తల్లితో వెళ్ళిపోతుంటే కన్నీరు మున్నీరై విలపిస్తాడు.

కుమారుడు మృతుడై దహన సంస్కారాల కోసం భార్య వచ్చినప్పుడు ధర్మానికి కట్టుబడి భార్యను మాడ అడుగుతాడు.

**'జెలువ యీ బాలునిఁ జిచ్చునఁ ద్రోయ**
**వలసిన, నేలినవానిలాభంబుఁ**
**దప్పించి సత్యంబుదప్పి మోమాట**
**నిప్పని కియ్యకో నేరీతిఁ బొసఁగుఁ?**

**బొసఁగ వీపలుకులు, వోయి ని న్నేలు**
**వసుధామరునిఁ గాంచి, వదలక వేఁడి,**
**వలయుమాడయు మఱి వాతిపాతకయు**
**వలనొప్పఁ గొని రమ్ము వడి నిట' కనినఁ**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 2253–2260, పు. 285)

కౌశికుడు హరిశ్చంద్రుడి మీద ప్రతీకారంతో చోరుడిని సృష్టిస్తాడు. చోరుడు కాశీ రాజు ధనాన్ని అపహరించి రాజకుమారుడిని వధిస్తాడు. ఆ నేరాన్ని చంద్రమతి మీద వేస్తాడు. కాశీరాజు చంద్రమతికి శిరచ్ఛేదన శిక్ష విధించి అమలుపరచమని వీరదాసుడి రూపంలో ఉన్న హరిశ్చంద్రుడిని ఆజ్ఞాపిస్తాడు.

**వెఱఁగంది క్రందుగా వీక్షించుచుండ;**
**నెఱ దెంపుమై ధారుణీతలేశ్వరుఁడు**
**ఖిదురంబుకంటెను బెడిద మై చదల**
**నదరులు సెదర భయంకర లీల**
**వాలువా లెత్తి యా వామాక్షికంఠ**
**నాళంబు తెగ వ్రేయ నది కఱుక్కనఁగఁ**
**దాఁకిన వ్రేటు పూ దండయై చన్నుఁ**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 2594-260, పు. 303)

భార్య నిజాయితీ హరిశ్చంద్రుడికి తెలిసినా కేవలం కాశీరాజు ఆదేశించాడని భార్యను నరకడానికి ఉద్యుక్తుడౌతాడు. కుమారుడు మరణించినా, భార్యను వధించాల్సి వచ్చినా హరిశ్చంద్రుడు ధర్మాన్ని తప్పడు.

ఈ సందర్భంలో హరిశ్చంద్రుడి ధర్మ వీరానికి ప్రతీక. సామాన్య మానవులు చిన్న కష్టం రాగానే అంతకుముందు తీసుకొన్న నిర్ణయం ఎంత గొప్పదైన వదలి పెడతారు. హరిశ్చంద్రుడి గుండె నిబ్బరానికి విశ్వామిత్రుడే ఆశ్చర్యపోతాడు. దేవతలు ప్రశంసిస్తారు. హరిశ్చంద్రుడు సత్యవ్రతాన్ని కొనసాగించడానికి వీలుగా వీరబాహుడి దగ్గర ఉన్నంతకాలం హరిశ్చంద్రుడికి దేవతలే ఆహారాన్ని సమకూర్చుతారు. హరిశ్చంద్రుడి సత్యవీరం క్రూరుడైన విశ్వామిత్రుడిని, నక్షత్రకుడ్ని, దేవతల్ని కదలించింది.

**నాటకంలో వీరరసం :**

నాటకంలో హరిశ్చంద్రుడి వీరమే ప్రధాన రసంగా కన్పిస్తోంది. నాటకంలో హరిశ్చంద్రుడు స్త్రీల ఆర్తనాదం వినబడగానే భయహర్తలకు అభయం అంటూ స్త్రీలను రక్షించే ప్రయత్నం చేస్తాడు. కాపాలికుడు తపస్సు చేసుకుంటూ ఉంటే విఘ్నాలు రాకుండ నివారిస్తాడు.

**పరిత్తా అధ అజ్జా పరిత్తా అధ (ఏదాఓ అణవరాధ మాణాఓ అణాధాఓ అసరణాఓ హృదవహే పరిక్ఖివి ఆమో మన్దభా ఇణీఓ. తా పరిత్తాఅధ అజ్జా పరిత్తా అధ.**

**రాజా : శృతిమభినీయ (సంసం భ్రయమ్) అహహ ఇతో నాతిదూరే యోషితామివార్తః ప్రలాపః శ్రూయతే (సాశ్చర్యమ్) అయే తపోవనమిదం క్వ పునర త్రేదృశానామ వినీతానాం సంభవః భవతు ఉపసర్పామిఁ తథా కరోతి)**

**(నేపథ్యే తథైవ పఠ్యతే)**

**(శ్రుత్వా సావష్టమ్భమ్) అభయ మభయం భయార్తానామ్ (సక్రోధమ్) । ఆః**

**కో౽యం తపోవన విరుద్ధమనాత్మనీనం**

**క్రూరో నృశంసమను తిష్ఠతి కర్మ ఘోరమ్ ।**

**తస్యైష బాణ పరిలూన శిరోధరస్య**

**ప్రత్యఙ్గముద్ధతశిఖే జ్వలనే జుహోమి ॥** (చం.కౌ.పు.38)

భయంకరమైన శ్మశానంలో భూత, ప్రేతాల మధ్య నివాసం చేస్తాడు. కులగురువుల ఆదేశం ప్రకారం నిశాప్రజాగ్రవ్రతాన్ని చేపట్టి రాజులకు ఆదర్శవంతం అవుతాడు. జనులకు బాధ కల్గించే వరాహాన్ని సంహరించడానికి వెళ్ళి తన వీరత్వాన్ని చాటుకుంటాడు.

హరిశ్చంద్రుడు కావ్యంలో వృశ్చిక, పన్నగ, భూతాలను ఎదుర్కొనడం, నాటకంలో విద్యాత్రయాన్ని రక్షించడం, శ్మశానంలో భూత, ప్రేతాల మధ్య నివాసం చెయ్యడం హరిశ్చంద్రుడి ప్రతాప పరాక్రమాలకి గుర్తు. ఈ ప్రతాప పరాక్రమాలనే విభావాల వలన కావ్యంలో వీరరసం అభివ్యక్తమయింది. హరిశ్చంద్రుని స్థైర్య, ధైర్య, త్యాగాలు వీరరసానికి అనుభవాలు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ హరిశ్చంద్రుడు వీర రసంలో సత్య వీరానికి ప్రతీకగా నిలుస్తాడు.

**2.3.6 బీభత్స రసం :**

**"అథ బీభత్సో నామ జుగుప్సాస్థాయిభావాత్మకః, స చ అహృద్య - అప్రియ - అరోష్య - అనిష్టశ్రవణదర్శనకీర్తనాదిభిః విభావైరుత్పద్యతే. తస్య సర్వాఙ్గ సంహార ముఖవికూణన - ఉల్లేఖన - నిష్ఠీవన - ఉద్వేజనాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః. భావాశ్చాస్య అపస్మారోద్వేగ మోహవ్యాధిమరణాదయః.**[15]

బీభత్సానికి స్థాయీ భావం జుగుప్స. ఇంపైనవి కానివి, అప్రియాలు, తిన తగనివి, అనిష్టములైనవి చూడడం, వాటిని గూర్చి వినడం, వాటిని గూర్చి చెప్పుకోవడం మొదలైన విభావాలవల్ల బీభత్సరసం పుడుతుంది. అన్ని అవయవాలు ముడుచుకోవడం, ముఖం వంకరగా తిప్పడం, కాండ్రించడం, ఉమ్మివేయడం, ఉద్వేజనం (అసహ్యించుకోవడం) మొదలైన అనుభావాలు చేత దేనిని అభినయించాలి. అపస్మారం, ఉద్వేగం, అవేగం, మోహం, వ్యాధి మరణం మొదలైనవి దీని భావాలు.

*15. నాట్యశాస్త్రమ్ ఆంధ్రభాషావ్యాఖ్య, పు. 232*

బీభత్సానికి స్థాయీ భావం జుగుప్స. నాటకంలో వీరబాహుడు నివసించే మాలవాడ వర్ణన, శ్మశాన వర్ణనలు జుగుప్సను కలిగిస్తున్నాయి.

**"బడి యున్న ముడుసులు పసరంపుఁ దలలు**
**బడికి వ్రేయఁగ నెండఁ బఱిచినతోళ్లుఁ**
**గఱచి కుక్కలు పీఁకఁగా బెను కొమ్ము**
**లొఱగఁ దీసినరీతి నున్న డొక్కలును**
**వఱదలై నెత్తురు వడియు కుత్తుకలు**
**తఱిఁగిన గోవులు తఱు చైనపచ్చి**
**మురియలు సెదరినముఱికి నంజుళ్ళు**
**నఱచుకాకులుఁ గలమామాలవాడ"**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 1571-1577, పు. 247-248)

చిందరవందరగా పడివున్న మాంసపు ముక్కలను, కుక్కలు ఎముకలను పీకివేయగా మిగిలిన చర్మం నిండిన మాలవాడ ఏవగింపును కలిగిస్తోంది. ఇక్కడ గౌరన మాలవాడను దృశ్యరూపంలో మన కళ్ళఎదుట సాక్షాత్కరించేలా వర్ణించాడు.

**నాటకంలో బీభత్సరసం :**

నాటకంలో కూడ బీభత్సరసం కన్పిస్తోంది. హరిశ్చంద్రుడు నివసించే శ్మశానం జుగుప్సను కలిగిస్తుంది.

**ఇమా మూర్ఛన్తః ప్రతిరవభృతః కర్ణకటవః**
**శివాః క్రూరాక్రన్దైరశివపటహాడమ్బర శివాః ।**
**జ్వలన్త్యేతే తాప స్ఫుటిత నృకరోటీపుటదరీ**
**లసన్మస్తిష్కాక్తా స్తిమితజటిలాగ్రా హుత భుజః ॥**

(చం.కౌ.పు.89)

చెట్టుతొఱ్ఱలో నిక్కి పీనుగలను కాళ్ళతో తొక్కి, ప్రేగుల ముక్కలను వేరుచేసి, డొక్కలను పూర్తిగా తిని, శవాలను నావి నావి అనుకుంటూ తినే రాపులుంగులుని వర్ణించాడు కవి. శ్మశాన వర్ణనలో జుగుప్స కన్పిస్తోంది. కావ్యనాటకాలు రెండింటిలోనూ జుగుప్స కలిగించే ఇంపుకాని పీనుగులను, మాంసపు ముక్కలను వర్ణించడం బీభత్స రసానికి విభావాలు.

**సమీక్ష :**

కావ్య నాటకాలు రెండింటిలోనూ జుగుప్స కలిగించే, ఇంపుకాని పీనుగులను, మాంసపు ముక్కలను వర్ణించడంవల్ల బీభత్సరసం.

**2.3.7 అద్భుతరసం :**

**"అథ అద్భుతో నామ విస్మయస్థాయిభావాత్మకః స చ దివ్యజనదర్శన – ఈప్సిత మనోరథాప్తి– ఉపవనదేవకులాదిగమన – సభా – విమాన – మాయా – ఇన్ద్రజాల సంభావనాదిభిః విభావైః ఉత్పద్యతే. తస్య నయనవిస్తార – అనిమిషప్రేక్షణ – రోమాఞ్చ అశ్రు – స్వేద – హర్ష – సాధువాద – దానప్రబన్ధ – హాహాకార – బాహువదనచేలాఙ్గులి భ్రమణాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః. భావాశ్చాస్య స్తమ్భ – అశ్రు – స్వేద –గద్గద – రోమాఞ్చ – ఆవేగ – సంభ్రమ – జడతా – ప్రలయాదయః"[16]**

"అద్భుతానికి స్థాయిభావం విస్మయం. దివ్యజనుల దర్శనం, అనుకొన్న కోరికలు తీరడం, ఉద్యాన – దేవాలయాలకు వెళ్లడం, సభ – విమానం (అందమైన భవనము), మాయ – ఇంద్రజాలం, ఆదరంతో చేసిన సత్కారం మొదలైన విభావాలచేత అద్భుతరసం ఉత్పన్నం అవుతుంది. కళ్లు పెద్దవిగా చేయడం, రెప్పపాటు లేకుండా చూడడం, రోమాంచం, కన్నీళ్ళు, స్వేదం, సంతోషం, 'బాగు బాగు' అనడం, ధనం ఇవ్వడం, నిరంతరంగా ఆహా ఆహా అని బిగ్గరగా అనడం, చేతులు, ముఖం, చేతిలోని వస్త్రం వేళ్లు తిప్పడం మొదలైన అనుభవాలతో అద్భుతరసాభినయం చేయాలి. స్తంభం, కన్నీరు, గద్గదస్వరం, రోమాంచం, ఆవేగం, సంభ్రమం, జడత్వం, ప్రలయం (సంజ్ఞ లేకపోవడం) మొదలైనవి దీని భావాలు".

చంద్రమతి, హరిశ్చంద్రుడి జీవితాలలో అద్భుతాలు జరగడానికి కారణం వారి ధర్మనిష్ఠ, సత్యవ్రతమే. అరణ్యంలో కారుచిచ్చు దహిస్తున్నప్పుడు చంద్రమతి ముందుగా వెళ్ళి అగ్నికి ఆహుతి అవుతుండగా అగ్ని చల్లారి తగ్గుముఖం పట్టడంతో అద్భుతరసం వ్యక్తమైంది. అలాగే హరిశ్చంద్రుడు చంద్రమతిని ఖండిస్తే ఖడ్గం దండగా మారి హరిశ్చంద్రుడి మెడలో పడుతుంది. ఈశ్వరుడు సకల దేవతలతో ప్రత్యక్షమవ్వడం వంటి సన్నివేశాలు అద్భుతరసానికి ఉదాహరణలుగా చెప్పవచ్చు.

**వాలువా లెత్తి యా వామాక్షికంఠ**
**నాళంబు తెగ వేయు నది కఱుక్కనఁగఁ**

---

*16. నాట్యశాస్త్రమ్ ఆంధ్రభాషావ్యాఖ్య, పు. 232*

దాఁకినవ్రేటు పూదండయై చెన్నుఁ
గైకొని పూఁబోఁడిగళమున నున్నఁ
దల యూచి సతిఁ జూచి తన కేలునెత్తి
ధళధళ మనుఖడ్గధార వీక్షించి
దాటి దప్పెనో కాక ధవళాక్షి కిప్పు
డీరితి కౌశికునింద్ర జాలంబొ
వా తప్పితినొ చేతివడి దప్పిచనెనొ
చూత మీతోయ మీ చోద్య మీలీల
.................................
పరమ యోగీంద్రులు భావంబునందుఁ
బరికించి కాననిపరమాత్మమూర్తి
యావేళఁ దనకుఁ బ్రత్యక్షమై సైచు

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 2598-2642, పు. 303-306)

చంద్రమతి శిరస్సును ఖండించడానికి ఎత్తిన ఖడ్గం పూలదండగా మారడంతో హరిశ్చంద్రుడు ఆశ్చర్యానికి గురౌతాడు. హరిశ్చంద్రుడి సత్యనిష్ఠ వలన ఈశ్వరుని ప్రభావం వలన అద్భుతరసం అభివ్యక్తమయింది. ఈశ్వరుని మహిమ లేదా మాయ, ఈశ్వరుని ప్రత్యక్ష దర్శనం అద్భుతరసానికి ఆలంబన విభావాలు.

అలాగే హరిశ్చంద్రుడు అర్థరాత్రి శ్మశానంలో చంద్రమతి చేసిన హాహాకారాలు విని విస్మయానికి గరౌతాడు.

కుఱు ప్రోఁగుగా నిడి కొడుకు నం దునిచి
కొఱవి నొక్కటఁ దలకొఱవి విడఁ బూని
చేతు లాడక మోము చీరతో నొత్తి
యాతురంబున నేడ్వ నా యార్త రవము
విని హరిశ్చంద్రుడు విస్మయం బంది

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 2054-2069, పు. 274)

**నాటకంలో అద్భుతరసం :**

నాటకంలో కూడ అద్భుతరసం పోషింపబడింది. సాక్షాత్తు ధర్ముడే చండాలుడిగా రావడం, ఈ ధర్మదేవతే రాజుని పరిక్షించాలని కాపాలికుడిగా రావడంలో అద్భుతరసం కన్పిస్తోంది. నాటకంలో ప్రతినాయకుడైన కౌశికుడే నాయకుడైన హరిశ్చంద్రుడి సత్యనిష్ఠను, ఆత్మాభిమానాన్ని చూసి ఆశ్చర్యపోతాడు.

**కౌశికః : (సాశ్చర్యమాత్మగతమ్) ఆహో దురాత్మనః స్థైర్యం మహానుభావతా చ. దురాత్మన్ అచిరద్రాక్ష్యామి తే శౌణ్డీర్యమ్. తథాహి.** (చం.కౌ.పు.47)

**దుర్మాతన్ కిం నామావిజానతో మే క్షన్తుమర్హసి ! అరే రే క్షుద్ర నకిల నామ భవతోఽహం విదితః**

**జాతిస్వయం గ్రహణదుర్లలితైకవిప్రం**
**దృష్యద్వసిష్ఠసుతకానన ధూమకేతుమ్ ।**
**సర్గాన్త రాహరణ భీత జగత్కృతాన్తం**
**చండాలయాజినమవైషి న కౌశికం మామ్ ॥**

(చం.కౌ.పు.42)

కౌశికుడు ఆహా ! ఎంతటి మనస్థైర్యం ఈ హరిశ్చంద్రుడికి, ఏమి మహానుభావత్వం, అంటూ ఆశ్చర్యపోతాడు. కౌశికుడు ఆహా ! ఆహా అంటూ ఆశ్చర్యపోవడం అద్భుతరసాభినయం.

"విశ్వామిత్రుడు విద్యాత్రయాన్ని వంశం చేసికొనే ప్రయత్నంలోను, విశ్వదేవుల్ని శపించిన ఘట్టంలోను, ధర్ముని ప్రత్యక్షంలోను అద్భుతరసం పోషింపబడింది. అలాగే నాటకాంతంలో ధర్ముడు దివ్య విమానాన్ని రప్పించి హరిశ్చంద్రుణ్ణి దానిలో కూర్చోమని అలా కూర్చుంటే, అసలు ఇదంతా ఎందుకు జరిగిందో తెలుస్తుందని చెప్పడం, హరిశ్చంద్రుడు అందులో కూర్చుని తనను కొన్నది చండాలుడు కాదని ధర్ముడని, తన భార్యను కొన్నది ఈశానుడని విద్యలు విశ్వామిత్రుడిని చేరుకొన్నాయని గ్రహించడంలో కూడ అద్భుతరసం చోటు చేసికొంది"[17].

**2.3.8 భక్తిరసం :**

భక్తిని ఒక రసంగా అంగీకరించినవారు రూపగోస్వామి, మధుసూదన సరస్వతి. మధుసూదన సరస్వతీ తన భగవద్భక్తి రసాయనమనే గ్రంథంలో ప్రతిపాదించిన భక్తి సంపూర్ణమైనది. ఇతడు ప్రమాణ, ప్రమేయోపన్యాస పూర్వకంగా భక్తిని, రసత్వాన్ని స్థాపించాడు.

---

*17. తెలుగులో హరిశ్చంద్ర నాటకాలు తులనాత్మక పరిశీలన, పు. 124*

**"కాంతాదివిషయంవా యే రసాద్యాస్తత్ర నేదృశం**

**రసత్వం పుష్యతే పూర్ణసుధాస్పర్శిత్వ కారణాత్**

**పరిపూర్ణరసా క్షుద్రరసేభ్యో భగవద్రతిః**

**ఖద్యో తేభ్య ఇవాదిత్య ప్రభేవ బలవత్తరా"**[18]

కాంతాది విషయాలైన ఏ రసములందు భగవద్రతి వలె పూర్ణసుఖం లేక ఆనందం కలుగదు. భగవద్రతి పూర్ణ రసం. అది మిణుగురు పురుగుల కంటె సూర్యకాంతి ఏ విధంగా బలమైనదో ఆ విధంగా మిగిలిన రసములు శ్రేష్ఠతరాలు. బలవత్తరమని చెప్పాడు. ఈ భక్తి రసానికి ఆలంబన విభావము భగవంతుడు. తచ్చరిత్రలు విభావాలు. భగవదాకార చిత్తవృత్తియే స్థాయి భావం. అదే భగవద్రతి. నేత్రాది వికారాలు అనుభవాలు. నిర్వేద, శంక, హర్షాదులు వ్యభిచారీ భావాల వలన భక్తి రసంగా పరిణమిస్తుంది.

హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడికి ఇవ్వవలసిన ధనాన్ని సంపాదించడానికి కాశీ పట్టణానికి వెళ్తాడు. అక్కడ ఈశ్వరుడిని దర్శించుకొని తన ఋణం తీరే మార్గం చూపమని ప్రార్థిస్తాడు.

**'నగణితకనకకుంభారామంబు**

**నగు విశ్వనాథమహాదేవునగరుఁ**

**జేరి యాదేవునిశ్రీలింగమూర్తిఁ**

**గోరి సద్భక్తి నెక్కొనఁగ దర్శించి**

**జయ మేరుకోదండ జయ విష్ణుకాండ**

**జయ నిర్జితానంగ శశిధవళాంగ**

**..................................**

**గౌరీమనోల్లాస కాశీనివాస**

**యీకౌశికునిఋణం బీకాశీలోన**

**దీకొని తీర్పఁగా దెరువు గల్పింపు'**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 106-120, పు. 163)

---

*18. కావ్యాలంకార సంగ్రహము, పు. 316*

భక్తులకు కల్పవృక్షం వంటి వాడా? సత్పురుషులను ఉద్ధరించే వాడా, మేరు పర్వతమే విల్లుగా కలవాడా అంటూ ఈశ్వరుడిని స్తుతిస్తాడు. భగవంతుడైన ఈశ్వరుడు ఆలంబన విభావము. హరిశ్చంద్రుడు సర్వేశ్వరుడిని స్తుతించడం విభావం. ఈ అలంభన, విభావాల వల్ల కావ్యంలో భక్తి రసం అభివ్యక్తమయింది.

**నాటకంలో భక్తి రసం :**

నాటకంలో కూడ భక్తిరసం కన్పిస్తోంది. హరిశ్చంద్రుడు నివసించే శ్మశానాన్ని వర్ణించే సందర్భంలో అక్కడే కొలువుతీరిన చండికను భక్తితో కొలుస్తాడు. చండాలుడు అతని శిష్యుడు హరిశ్చంద్రుడు పెద్దచెట్టు తొఱ్ఱలో ఉన్న అమ్మవారిని చండికమ్మగా తలచి నమస్కరిస్తారు.

**చండాలః : (అగ్రతోవలోక్య) అలే పణవేమ్హ ఏదం తుజ్జతలు కుహలవాశిణిం భ అవదిం చడ్డకచ్చాయిణిం**

**అపరః : ఏవం కలేమ్హ. (ఇతితథా కురుతః)**

**ణిమ్మహి అలులి చణ్డమస్తి ఏ**

**మహిశమహాశుల భిణ్ణగస్తి ఏ ।**

**కచ్చా ఇణి గజచమ్మవస్తిఏ**

**లస్కశు మం చలశూలహస్తి ఏ ॥**

(చం.కౌ.పు. 91)

**రాజా ! (సర్వతోఽవలోక్య సవిస్మయమ్) అహో బీభత్సోపచార ప్రియత్వం కాత్యాయన్యాః. తధాహి**

**జరన్నిర్మాల్యాధ్యామృతమహిషగోకణ్ఠలులితాః**

**ప్రలమ్బన్తే ఘణ్టాః శ్రవణ కటుటంకార పటవః**

**తరుస్తమ్భే దేవ్యాః కృత రుధిర పఙ్కాఙ్గులితలే**

**రటన్త్యేతే యస్మిన్ప్రకృతిబలిలోలా బలి భుజః** (చం.కౌ.పు. 92)

నాటకంలో చండికమ్మ ఆలంబన విభావం. చండాలుడు ఆమెను స్తుతించడం విభావం. ఈ ఆలంబన విభావాల వల్ల భక్తిరసం అభివ్యక్తమయింది.

**2.3.9 వత్సలరసం :**

భరతుడు దీనిని ఎనిమిది రసాలలో చెప్పలేదు. సాహిత్య దర్పణకారుడు "కథ మునేంద్ర సమ్మతో వత్సలో రసః" అని ప్రారంభించి –

**"స్ఫుటం చమత్కారితయావత్సలంచ రసం విదుః**
**స్థాయీ వత్సలతా స్నేహః పుత్రాద్యాలంబనం మతం**
**ఉద్దీపనాని తచ్చేష్టా విద్యా శౌర్యోదయాదయః**
**ఆలింగనాంగ సంస్పర్శ శిరశ్చుంబన మీక్షణం**
**పులకానందబాష్పాద్యా అనుభవావాః ప్రకీర్తితాః**
**సంచారిణోఽ నిష్టశంకా హర్ష గర్వాదయో మతాః"**[19]

మిక్కిలి చమత్కారంగా ఉండడం వల్ల వత్సలమును కూడా రసంగా తలుస్తాం. దీనికి స్థాయి ప్రేమయుక్తమైన రతి. దీనికి పుత్ర భాత్రాదులు ఆలంభనం. వారి చేష్టలు, విద్యా శౌర్యోదయాదులు ఉద్దీపనాలు. ఆలింగనం, గాత్ర సంస్పర్శం, శిరశ్చుంబనం మొదలైనవి అనుభావాలు. హర్షం, గర్వం వ్యభిచారి భావాలు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వాత్సల్యరసం పోషింపబడింది. వాత్సల్యరసానికి ఆలంబనం లోహితుడు. ఉద్దీపములు హరిశ్చంద్ర, చంద్రమతిల పుత్ర ప్రేమ. చంద్రమతి కాలాగ్నికి తనను తాను అర్పించుకున్నప్పుడు చంద్రమతి పతిభక్తి చేత అగ్నిదేవుడు చల్లారి చంద్రమతిని కాల్చకుండ విడిచి పెడతాడు. ప్రమాదం నుండి భయపడిన చంద్రమతి తన కుమారుడిని చూసి ఆనందిస్తుంది.

**"యెలనవ్వు సిగురొత్త నెప్పటి యట్టు**
**లలవడఁ జేతు లల్లార్చుచు నెదుర**
**నలరి యానందనృత్యముఁ జూపుచున్న**
**యాలోహితాస్యుని నక్కునఁ జేర్చి**
**పాలు చన్నులఁ జేపి పయ్యెద దడియ**
**జడిగొని హర్షాశ్రుజలముల మేనిఁ**
**దడిపి ముద్దాడుచు ధవునకు నర్థి"**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 2288–2294, పు. 146)

---

*19. కావ్యాలంకార సంగ్రహము, పు. 312–313*

తిరిగి బతికానని దగ్గరకు తీసుకొని స్థన్యం ఇస్తుంది. ఆనంద భాష్పాలతో కుమారుడి శరీరాన్ని తడిపి ముద్దాడుతుంది. కాలకంఠుడు దర్భలు తెమ్మని లోహితుడిని అడవికి పంపినప్పుడు కూడ చంద్రమతి ఎంతో చింతిస్తుంది. రాకుమారుడివైన నువ్వు కట్టెలు తేవాలా? అడవిలో లోహితుడికి ఏమి ఆపద కలుగుతుందోనని అతడికి రక్ష కట్టి తన కుమారుడి మీద వాత్సల్యాన్ని చాటుకుంటుంది.

**నాటకంలో వత్సల రసం :**

నాటకంలో శైబ్యను ఉపాధ్యాయుడు దాసిగా కొనుక్కొన్నప్పుడు శైబ్య ఉపాధ్యాయుడితో వెళ్ళిపోతుండగా బాలుడైన లోహితుడు కూడ వెంటపడతాడు. ఉపాధ్యాయుడి దగ్గర శిష్యుడిగా ఉన్న వటువు లోహితుడిని గెంటివేసి క్రిందకి తోసేస్తాడు. అక్కడ ఉన్న రాజు లోహితుడిని లేవనెత్తి కౌగిలించుకొని దుఃఖంతో –

**రాజా : "భో మహాబ్రాహ్మణ అనవరాద్ధం కిలశైశవమ్ తన్నార్హస్యేవం కర్తుమ్ (బాలకముత్థాయ శిరస్యా ఘ్రాయాలిజ్య చ సవైక్లబ్యమ్)**

**కి వత్స మన్యుభర విస్ఫురితాధరోష్ఠః**<br>**పాపస్య పశ్యసి ముఖం మమ నిర్ఘృణస్య ।**<br>**యేషాం ప్రియా న శిశవః పిశితాశనానాం**<br>**తేషామపి ప్రియతమా వనితా తిరశ్చామ్॥"**

(చం.కౌ.పు. 72)

హరిశ్చంద్రుడు తాను ఎంతో పాపాత్ముడని, దయలేని వాడినని భార్యను అమ్ముకుంటున్నానని బాధపడతాడు. హరిశ్చంద్రుడు లోహితుడి శిరచ్ఛేదన చేయబోవడం వత్సల రసానికి అనుభావం.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వాత్సల రసం పోషింపబడింది.

**2.4 వర్ణనలు**

**"లోకోత్తర వర్ణనా నిపుణః కవిః" అని మమ్మటుడు, కవనీయం కావ్యం (వర్ణింపదగిన కావ్యం) అని లోచనకారుడు చెప్పాడు. 'కవయ తీతి కవిః తస్య కర్మ కావ్యం' అని విద్యాధరుడు నిర్వహించాడు. వర్ణయ తీతి కవిః (వర్ణించువాడు కవి) పై నిర్వచనాలని బట్టి చూస్తే వర్ణించటంలో నేర్పు కలవాడే కవి అని అర్థం.**

వర్ణన అనేది కావ్యసౌధానికి ప్రాంగణరంగవల్లిక. రసోత్పత్తికి ప్రధాన కారణమైనది వర్ణన. వర్ణన రసోత్పత్తికి ఉద్దీపన కలిగిస్తుంది. లోకోత్తరమైన కవి ఊహకు అసాధారణమైన ప్రతిభా పాండిత్యాలను ప్రదర్శించడానికి వాహకమైనది వర్ణన. కావ్య లక్షణాలలో అష్టాదశ వర్ణనలు ఒక లక్షణంగా ఆలంకారికులు చెప్పారు. అష్టాదశ శబ్దాన్ని మొదటగా వాడిన తెలుగువాడు నన్నెచోడుడు. ఇతను తన కుమార సంభవం అవతారికలో అష్టాదశ వర్ణనలను గురించి కింది విధంగా పేర్కొన్నాడు.

> **"వన, జల, కేళీ, రవి, శశి**
> **తనయోదయ, మంత్ర, గతి రత, క్షితిప, రణాం**
> **బునిధి, మధు, ఋతు, పు రో ద్వా**
> **హ నగ, విరహ, దూత్య, వర్ణనాష్టాదశమున్"[20]**

## 2.4.1 కావ్యంలోని వర్ణనలు :

హరిశ్చంద్రోపాఖ్యానంలోని వర్ణనలు సహజ సుందరంగా ఉన్నాయి. ఎక్కడా కథకు అంతరాయాలైన వర్ణనలు లేవు. గౌరన మొదటి సారిగా మార్కండేయ పురాణంలోని హరిశ్చంద్ర కథకు అనేక కల్పనలు, వర్ణనలు చేర్చి తరువాత ప్రబంధాలకు మార్గదర్శకుడైనాడు. కొత్త విషయాన్ని గానీ, పాత్రని గాని ప్రవేశపెడుతున్నప్పుడు మనకు సులువుగా దాని స్వభావాన్ని అంచనా వేసేటట్టు గౌరన వర్ణించాడు.

గౌరన మహారాజు నుండి కాటికాపరిదాకా ఎవరెవర్ని ఎలా వర్ణించాలో గౌరనకు బాగా తెలుసు. "తన కాలంనాటి సంఘంలో సామ్రాజ్యాన్ని ఏలే మహారాజు దగ్గరనుండి శ్మశానాన్ని గుత్తకు పాడి కటివాడి దాకా ఎవరెవరు ఎలా మాట్లాడేవారో, ఎలా ప్రవర్తించేవారో, వాళ్ళ కట్టూ, హావ భావ చేష్టలూ ఎలా ఉండేవో సునిశితంగా పరిశీలించి సూక్ష్మ విషయాలు కూడ గుర్తించి పాత్రలను సూటిగా చిత్రించిన మహాకవి గౌరన".[21]

"గౌరన ద్వైతవన వర్ణనముతో కథా ప్రారంభము చేసినాడు. గౌరన వర్ణనములు సహజములై వస్తు వర్ణనమును, పాత్ర పోషణమును, రసపోషణమును గూడ గావించుట యొక విశేషము. ప్రతీ విషయమును వర్ణనము తోడనే ప్రవేశపెట్టుట అతని ప్రత్యేకత".[22]

---

20. *కుమార సంభవము, పు.* XXX
21. *సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మొదటి సంపుటి, పు. 815*
22. *ఆంధ్రసాహిత్యములో హరిశ్చంద్రోపాఖ్యానము, పు. 135*

**2.4.1.1 అయోధ్యా నగర వర్ణన :**

గౌరన ముందుగా పుర వర్ణన చేశాడు. హరిశ్చంద్రుడు నివసించే అయోధ్యా నగరాన్ని వర్ణించాడు.

**శివుని కెంజడలలోఁ జెలఁగు జాహ్నవికి**
**సవతు సేయఁగ దగుసరయు పొంత**
**ధరణిదేవికి ముఖ దర్పణం బనగఁ**
**బరుల కసాధ్యమై పరుఁగునయోధ్య**
**చెలువొందు నందుల చిగురు మావులును**
**గలయఁ బెంపెసఁగుచెంగల్వబావులును**
**సోమరిగాలిచే సుడియు తావులును**
**బ్రేమఁ గాముకులు చరించుతావులును**
**దరుణప్రవాళలతావితానములు**
**బరిఖాంబుసారసబాహువిలాసములుఁ**
**జెన్ను మించినమంచిచెఱకుఁదోటలును**
**గమనీయవజ్రసంగతకవాటములు**
**గౌమరారుముత్యాలకొలువుకూటములు**
**రాజితంబగు గృహరాజిమేడలును**
**.........................................**
**బహువిధదేవతాప్రసాదములను**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 1-21, పు. 1-2)

భూదేవి అందచందాలు ప్రతిఫలించేటట్లుగా అయోధ్యానగరం ఉంది. చిగుళ్ళలను వికసింప చేసే బావులు, కాముకులు చరించే ప్రదేశాలు, లేత చిగుళ్లు, తీగెల సమూహాలు, తామర పువ్వుల అనేక విలాసాలు, చెరకు తోటలు, వజ్రాలు పొదగబడిన తలుపులు, ఆకాశాన్ని అంటే మేడలు, ముత్యాల కొలువు కూటములు, ప్రకాశించే గృహాల, మేడల వరుస, మొదలైనవి అయోధ్యా నగరంలో ఉన్నాయి.

గౌరనను అనుసరించి శంకరకవి తన హరిశ్చంద్రోపాఖ్యానము కావ్యంలో అయోధ్య నగరాన్ని వర్ణించాడు. శివుని కంజడలలోఁ జెలగు జాహ్నవికి....అని అంటూ గౌరన అయోధ్యనగర వర్ణన ఉనికిని వర్ణిస్తే శంకరకవి –

**"ముక్తిదములైన పురములు మూడు నాల్గు**
**వానిలో నగ్రగణ్యయై వసుధ మీద**
**బఁరగు ధనదుని పుత్రికను బ్రాసమగుచు**
**నఖిల సిద్ధజనారాధ్యయగు నయోధ్య**

అని అయోధ్యా ప్రాధాన్యమును చెప్పినాడు. ఇట్టి ఘటములలో గౌరన ద్విపదము కంటె శంకరకవి పద్యములలో వర్ణన మధికమై పద్యముల సంఖ్య పెరిగినదని చెప్పవచ్చును".[23]

**2.4.1.2 సైనికుల వర్ణన :**

హరిశ్చంద్రుడి సైనికుల, దండనాయకుల ప్రతాపాన్ని వర్ణించిన తీరిది.

**లవిరళ మదగంధు లగువారణములు**
**బ్రవిమలరత్నదర్పణతోరణములుఁ**
**దివిరి కేలెత్తినఁ దెంపుజోదులును**
**రవళించి దాఁటుసాంబ్రాణి తేజీలుఁ**
**బగఱతూపులంగండ్ల బలుగాయ లొడలఁ**
**దగుభూషణము లైనదండనాయకులుఁ**
**దెగువ మత్తేభముఁ దెమలించి తుండ**
**.....................................**
**వడిగొని యడిదాన వైచి కందానఁ**
**దుడుచు రౌతులుఁ గత్తి డొంకెనఁ బొడిచి**
**పోటుగండ్లనె తూఱి పోవు సద్భటులు**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 29-41, పు. 10-11)

దట్టమైన మదజలంచే ప్రకాశించే ఏనుగులు, శత్రువుల బాణాల వలన తగిలిన గాయాలు కలిగిన దేహాలు కల దండనాయకులు, సాహసంతో మదపుటేనుగును కదిల్చి తొండాన్ని నరికి మరల నడిపించగల ఏనుగును ఎక్కే బంటులు, పరాక్రమమైన బంటులను వర్ణించాడు కవి.

---

*23. ఆంధ్రసాహిత్యములో హరిశ్చంద్రోపాఖ్యానము, పు. 221*

**2.4.1.3 ఇంద్రుని సభా మండపం వర్ణన :**

ఇంద్రుడు, మునులు, కొలువు తీరిన సభా మండపాన్ని వర్ణించాడు.

**నీలాలకంబాలు నిర్మలస్ఫటిక**
**సాలభంజికలుఁ బచ్చులగవాక్షులును**
**బగడంపువాచూర్లుఁ బద్మరాగముల**
**మొగడులు వైఢూర్యములమందిరములు**
**సలలితశశికాంతచంద్రశాలలును**
**వెలఁదిముత్యంబుల వెలయువాకిళ్లు**
**నవపుష్పరాగరత్నములకుడ్యములుఁ**
**బ్రవిమలవజ్రసోపానమార్గములుఁ**
**గలిగి నానాధూపగంధ బంధురముఁ**
**బొలుపొంద యవనికాభోగ భాసురముఁ**
**గర్పూర చందన కాశ్మీర మిళిత**
**దర్పసారాంబుసి క్త ప్రదేశంబు**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 79–80, పు. 14)

ఛాయలు ప్రతిఫలించే నేల రత్నాల స్తంభాలు, పటికపు రాళ్ళతో చేయబడిన బొమ్మలు. చంద్రకాంత శిలలతో చేయబడిన గోడలు, వజ్రాలతో చేయబడిన మెట్లదారి నానా విధాలైన ధూపాలచే, వాసనలచే అలరారు తెరలతోనూ, కర్పూర చందనంతోనూ, కుంకుమతోనూ కప్పబడిన కస్తూరిచేత శ్రేష్ఠమైన జలాలచేత తడుపబడిన ప్రదేశం కలది. దిక్కుల సమూహమందు సాటిలేని కాంతులచే ప్రకాశించునది అని ఇంద్రుని సభా మండపాన్ని వర్ణించాడు.

**2.4.1.4 మధుమాసం వర్ణన :**

వశిష్ఠ, విశ్వామిత్రుల ప్రతిజ్ఞలనంతరం గౌరన మధుమాసాన్ని వర్ణించాడు.

**దొలఁగె హిమంబు చంద్రుడు మెఱుఁ గెక్కి**
**వెలిఁగె దియ్యనివిల్లు వెస నెక్కు వెట్టి**
**మెలఁగెఁ గంతుఁడు నుబ్బు మీఱి నల్గడలఁ**
**జెలరేఁగి కోవెలల్ చెలఁగె ఝు మ్మనుచు**

**మ్రోసెఁ దుమ్మెదలు గుంపులు గట్టిఝంతుఁ**

**జేసె రాచిలుకలు చెలు వగ్గలముగఁ**

**గ్రాలె జక్కవలు చెంగల్వదీర్ఘి కల**

**వ్రాలె నంచలు ముద్దువగఁ గ్రొత్తననలు**

**దోఁచెఁ బొన్నలఁ దటితో నటమున్నె**

**పూచె మోదుగువృక్షములు విఱ్ఱవీఁగఁ**

**గాచెఁ జూతంబులం కమ్మనై మలసి**

**వీచె సోమరిగాలి విరహులు బెదరఁ**

**బొలుచు నమ్మధుమాసమున నొక్క క్రతువు**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 239-41, పు. 29)

మంచు అంతా పోయి చంద్రుడు ప్రకాశవంతంగా వెలుగుతున్నాడు. మన్మథుడు తన తియ్యని విల్లును ఎక్కుపెడుతున్నాడు. తుమ్మెదల ఝుమ్మనే శబ్దం చేస్తున్నాయి. మోదుగ వృక్షాలు విరబూశాయి. వీచే గాలుల వల్ల విరహులు బెదురుతున్నారని మధుమాసాన్ని వర్ణించాడు గౌరన.

**2.4.1.5 సూర్యాస్తమయ వర్ణన :**

గౌరన సూర్యాస్తమయాన్ని వర్ణించిన తీరిది.

**భవచండతాండవభ్రమణవేగమున**

**దివి నుండి పడినయందియనఁ బోలి**

**కిరణజాలంబుల కెంపు సొం పసఁగ**

**నరుణబింబము పశ్చిమాంబుధి గ్రుంకెఁ**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 437-440, పు. 35-36)

శివుడు తాండవం చేసే సందర్భంలో ఈశ్వరుడి గజ్జెలనుండి జారిపడిన మువ్వ అన్నట్లు సూర్య బింబం పశ్చిమ సముద్రంలో పడినదని గౌరన వర్ణించాడు.

**2.4.1.6 చంద్రోదయ వర్ణన :**

గౌరన చంద్రోదయాన్ని వర్ణించిన తీరిది.

**సురుచిరలీలయై సురరాజుదేవి**

**ధరియించుకర్పూరతాటంకమనఁగ**

**మెల్లనె ననలొత్తు మించులఁ బొదలి**
**చల్లనై వ(్రువ చం(ద్రుఁడు వొడిచె**
**మనసిజం దనియెడుమటుమాయదొంగ**
**జనులపై మం(త్రించి చల్లిన యట్టి**
**మోహనభస్మంబుమురువున విరహి**
**దాహక మై పర్వెఁ దళ్కు వెన్నెలలు**

(హ.ఉపా.(ప్ర.భా.ద్వి.సం. 442-50, పు. 35)

సురరాజుదేవి ధరించిన కర్పూర తటాంకం అనేటట్లు చం(ద్రుడు ఉదయించాడు. మన్మథుడైన మాయదొంగ జనులపై మం(త్రించిన మహాభస్మం వలె విరహదాయకమై తళ్కు వెన్నెలలు వ్యాపించాయని వర్ణించాడు. ఈ వర్ణనలలో ఉ(త్ప్రేక్ష, అతిశయోక్తి అలంకారాలు ఉన్నాయి.

**2.4.1.7 సూర్యోదయ వర్ణన :**

గౌరన సూర్యోదయాన్ని వర్ణించిన తీరిది.

**పదపడి యుడురాజుపై దిననాథఁ**
**దడె వచ్చెనని చెప్ప నరుదెంచురీతి**
**వేగువాఁడునుబోలె వేగురుఁ జుక్క**
**బాగుగాఁ బొడిచిన బలబల వేగె**
**నలిఁదమం బనెడుదానవుమోఁద నలిగి**
**జలశాయి (వేసినచ(క్రమో యనగఁ**
**గలువలు మూయ నక్ష(త్రముల్ మాయ**
**జలజముల్ వికసింప జను లుత్సహింపఁ**
**దఱచు మెఱుంగులు తళతళ మనఁగ**

(హ.ఉపా.(ప్ర.భా.ద్వి.సం. 451-459, పు. 36)

చీకటి అనే రాక్షసుడిపైకి సము(ద్రంలో పవళించే విష్ణువు వేసిన చ(క్రాయుధంవలె సూర్యుడు తూర్పు దిక్కున పైకి పొడుచునట్లు కనబడుతున్నాడు. కలువలు ముడుచుకున్నాయి. నక్ష(త్రాలు మాయమైయ్యాయి. తామరలు వికసించాయి. జనులు ఉత్సాహంగా లేచారు. సూర్యకిరణాలు తళతళమెరుస్తూ ఉండగా తూర్పు కొండపై ఆదిత్యుడు ఉదయించాడు.

**2.4.1.8 మాయలేడి వర్ణన :**

హరిశ్చంద్రుడిని ఏ విధంగానైనా విశ్వామిత్రుడి ఆశ్రమానికి తీసుకొని రావడానికి లక్ష్యం. విశ్వామిత్రుడు అందమైన లేడిని సృష్టిస్తాడు. దాన్ని తురుముతూ రాజు వస్తాడు. అప్పుడు లేడిని కవి వర్ణించిన తీరిది.

**ముత్తెంపుజిప్పల మురశించుమోముఁ**
**గ్రొత్తనీలపురంగు గులుకుకన్దోయి**
**పగడంబు నునుఁగెంపుఁ బచరించు చెవులు**
**ధగధగ మనుపైఁడి తళుకులమేను**
**దళుచువజ్రములతోఁ దడఁబడుతొడలు**
**మెఱుఁగుఁబచ్చలడాలు మీఱుగొర్సెలును**
**నాఱపు వెన్నెలఁ గాయునుదరంబు గలిగి**
**వెఱచినగతి దిశల్ వీక్షించి కొనఁగఁ**
**..........................................**
**మురువును బరువును ముదమును మదము**
**మురిపంబునొఱపును ముద్దును వింత**
**ఖచరంబు నచరంబు గబ్బును గుబ్బుఁ**
**బచరింప వన్నెలపైఁడి మృగంబు**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 571-586, పు. 44)

కొత్తదైన నీలపురంగు కల కన్నులు, పగడంలాగ ఎర్రగావున్న చెవులు, ధగధగ మెరిసే తళుకుల మేను, వజ్రాలలాగా భ్రాంతి కలిగించే తొడలు, చక్కని వెన్నెల కాసే తెల్లని కాంతిని కలిగి చెదరగొట్టే అందం, మేలైన రత్నాల కాంతితో పరుగెత్తే లేడిని హరిశ్చంద్రుడు చూశాడు.

“హరిశ్చంద్రుడు ధీరోదాత్తుడు గావున నాతని నాకట్టుకొను మృగము అసామాన్యమై యొప్పవలెను. లేనిచో అతని మనంబు నాకట్టుకొన జాలదు. ఇందలి పదములు సంద్రము నందలి తరగలవలె నాట్యము చేసినవి. పైడి మృగము తళుకు, బెళుకు చూపులకు పరిగి నెంచి పదజాలమును ప్రయోగించుట కవి చాతుర్యమును, కళా నైపుణ్యమును చాటుచున్నవి. అంతియేగాక బలము,

జలము, తళుకు, బెళుకు మొదలగు జంట పదము అప్రయత్న కృతముగ అర్థవంతముగా కుదురుకొనినవి".[24]

### 2.4.1.9 ఆశ్రమ వర్ణన :

హరిశ్చంద్రుడు వేటాడుతూ, మాయా మృగాన్ని తరుముకొస్తూ విశ్వామిత్రుని ఆశ్రమానికి వచ్చిన సందర్భంలో గౌరన ఆశ్రమాన్ని వర్ణించాడు.

**సురుగుల మారేళ్లఁ జూతపోతములఁ**
**గురవకంబుల గేదఁగుల నశోకములఁ**
**బొగడలఁ బొన్నలఁ బోఁక ప్రాకులను**
**బొగ దొందుఖర్జూరములఁ జందనములఁ**
**బుల్లమామిళ్లఁ గర్పూరభూజముల**
**నల్లనియరఁటుల నారికేళములఁ**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 631-36, పు. 47)

భగవంతుడికి అర్పించే తాంబూలములో వేసే జాజి, మిరియాలు, తమలపాకులు, ఏలకులు, లవంగాలు వంటి సుగంధద్రవ్యాల చెట్లు, ఉన్నాయి. విశ్వామిత్రుని తపస్సు ప్రభావం చేత జాతివైరాన్ని విడిచిపెట్టిన జంతువులు ఉన్నాయి. కొదమ సింహాలు, ఏనుగులతోటి, పులులు, లేళ్ళతోటి, ముంగీసలు, పాములతోటి ఆడుకుంటున్నాయి. పాములకు నీడగా వున్న నెమళ్ళు, నెమళ్ళమీదకు వచ్చే పిల్లులు, వాటి పక్కన కూర్చునే ఎలుకలు, చెవులకు వినసొంపుగా సామవేదం జదివే చిలకలు, కమ్మని నేతి వాసనలు, హోమధూపాలతో విశ్వామిత్రుని ఆశ్రమం ఉంది. ఆశ్రమ ప్రాంతంలోకి ప్రవేశించి ఆహ్లాదకరంగా ఉన్న చెట్లను చూడగానే కళ్ళకు నేత్రానందం కలుగుతుంది. చెవులకు మంచి ఉచ్చారణతో సామవేదం వినపడుతుంది. నాశికకు సువాసనలు తాకుతాయి. పంచేంద్రియాలలో మూడు ఇంద్రియాలు తృప్తి పడగానే మనస్సు ప్రశాంతమౌతుంది. మానవ ప్రయత్నం లేకుండానే తపస్సు సులభమౌతుందని ఆశ్రమ వాతావరణాన్ని దృశ్యరూపంలో మన కళ్లఎదుట సాక్షాత్కరింప చేశాడు గౌరన.

---

*24. ఆంధ్రసాహిత్యములో హరిశ్చంద్రోపాఖ్యానము, పు. 145*

**2.4.1.10 కొలను వర్ణన :**

హరిశ్చంద్రుడు కౌశికుడి ఆశ్రమ ప్రాంతంలో విశ్రమించినప్పుడు గౌరన ఆశ్రమంలోగల కొలనును వర్ణించాడు.

**వలనొప్పc జొచ్చి యావనమధ్యమునను**
**గమనీయవిలసిత మలకల్హార**
**కుముదనీలోత్పలకుసుమసుగంధ**
**మధుకరమిథునసమ్మదర్తరమృదుల**
**మధుతరసంగీతమహితతరంగ**
**లలితడోలా కేళిలాలసచక్ర**
**కలహంస బక బసకంఠికా క్రౌంచ**
**....................................**
**సౌరభవాసితసలిల మై చైత్ర**
**దర్పితవనదేవతాకరస్ఫటిక**
**దర్పణంబునుబోలెc దనరారుచున్న**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 663-75, పు. 49-50)

హరిశ్చంద్రుడు వన మధ్యంలో మనోజ్ఞంగా ఉన్న తామరలు, కొంచెం ఎరుపు, కొంచెం తెలుపు కలిగిన కలువలు, నల్ల కలువలు, పువ్వుల మంచి వాసనచే ఆకర్షింపబడిన తుమ్మెదల దంపతులు, చక్రవాక పక్షులు, రాజహంసలు, కొంగలు, పెంటి కొక్కెరలు, లకుములు మొదలైన క్రౌంచ పక్షులతో కొలను నిండి ఉంది. ఈ కొలను వనదేవత కరతలస్ఫటిక దర్పణం వలె ఉందని వర్ణించాడు.

**2.4.1.11 మాతంగ కన్యల వర్ణన :**

హరిశ్చంద్రుడిచేత ఏ విధంగా నైనా సరే మాట తప్పించాలనే ఉద్దేశ్యంతో విశ్వామిత్రుడు మాతంగ కన్యలను సృష్టిస్తాడు. ఆ మాతంగ కన్యల వర్ణన ఈ విధంగా ఉంది.

**నెఱి నంద మై నల్పు నెఱసినకురులు**
**గొఱనెలయొఱపు గైకొన్న ఫాలములు**
**జెఱకుసింగిణి విండ్లc జెనకెదుబొమలు**

**బేడిసతళుకులబెడఁగుఁగ్రన్నులును**

**దాడిమీ బీజసుందరదంతములును**

**నిరుపమతిలపుష్పనిభనాసికలును**

**సురుచిరబింబవిస్ఫురితాధరములు**

**మించుటద్దములతో మెఱయు చెక్కిళ్లు**

**మంచివెన్నెలవంటిమందహాసములు**

**సలలితశ్రీకారసదృశకర్ణములు**

**నలరుశంఖముల బాగలవడు మెడలు**

**బిసకాండములఁ దలఁపించుబాహువులు**

**కిసలయంబుల పెంపు గెలుచు హస్తములు**

**................................................**

**మురువునఁ ద్రైలోక్య మోహినులైన**

**తరళలోచనల మతంగకన్యకల**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 786–809, పు. 58)

మాతంగ కన్యల కురులు, కనుబొమ్మలు, కన్నులు, దంతాలు, నాసికలు, అధరాలు, చెక్కిళ్లు, మందహాసాలు, కర్ణాలు, హస్తాలు, బాహువులను గురించి చెప్పి కవి ప్రబంధ కవులకు దీటుగా మాతంగ కన్యల అంగాంగ వర్ణన చేశాడు.

"గయ్యాళించు దొడలు అని ప్రయోగించుటలో అతిశక్తి కలదు. అరటి కంబముల ధిక్కరించు అనుటకు గయ్యాళించు అనే పదము క్రొత్త ప్రయోగమే కాక అర్థవంతమై వున్నదని అర్థవంతము కూడదై యొప్పుచున్నది".[25]

గౌరన మాతంగ కన్యల కల్పనను శరభ కవి తన హరిశ్చంద్రోపాఖ్యానము కావ్యంలో ప్రవేశపెట్టి వర్ణనలో నూతనత్వాన్ని చూపించాడు.

**"కరమొప్పు కురులందు కౌటిల్య భావంబువారక బొమలందు వక్రతయు**

**తెలియ నాపల్యంబు దెగడు గన్నులయందు మునుఘనరాగంబు మోవులందు**

*25. ఆంధ్రసాహిత్యములో హరిశ్చంద్రోపాఖ్యానము, పు. 148*

**వరుసకౌటిల్యంబు వక్షోజముల యదు వెలుచ నెన్నడు మందు బీద తనము**

**పటుసమున్నత గర్వభావంబు కటియందు మానితగతి యందు మందగుణము"**

**దక్క మేనెల్ల నొచ్చె మింతయును లేక**

**మహి జగన్మోహనాకార మహిమతోడ**

**నలరు విలుకాని జిగి మావులను మతంగ**

**కన్యలిరువుర బుట్టించె గాధిసుతుడు.**

ఇందు వారి అందముతో బాటు వారిలోని కుటిల వక్రతను కూడ వర్ణించినాడు. కురులలో కౌటిల్యమనగా వంకర కురులు కలిగియుండుట, కనుబొమలలో వక్రత వారి అందమునే తెలుపుచున్నను, వాటి కౌటిల్యము కురులయందు వారి వక్ర బుద్ధి కనుబొమల యందును వర్ణించి వారి కపటతనము నెత్తి చంపినాడు". [26]

**2.4.1.12 దంతఘాతకుడి వర్ణన :**

విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడికి అనేక కష్టాల్ని కలిగించాలనే ఉద్దేశ్యంతో దంతఘాతకుడనే మాయామునిని సృష్టిస్తాడు. దంతఘాతకుడి వర్ణన తీరిది.

**తల వడంకెడువృద్ధతాపసవేష**

**మలవడ ధరియించి యామాయలాఁడు**

**మొదచి తెల్లనిభూతి మే నిండ నలఁది**

**పెదపెదరు ద్రాక్ష పేగులు వేసి**

**వింతగా జడలెల్ల వ్రేలాడ విడిచి**

**దొంతిబుఙ్జలకాయ దొడలపై నునిచి**

**ఘనక మండలువుఁ జెంగట నట్టు వెట్టి**

**తనరారుదండంబు తరువునఁ జేర్చి**

**నలువారుకృష్ణాజినంబుపై నడుము**

**నలి నిక్కఁ బద్మాసనమునఁ గూర్చుండి**

---

*26. ఆంధ్రసాహిత్యములో హరిశ్చంద్రోపాఖ్యానము, పు.256*

**కొనముక్కుమీఁదఁ జూడ్కులు సక్క నిలిపి**

**మునుకొని జపమాల పూస లెన్నుచును**

**నురునిష్ఠ నున్నట్టు....................**

(హ.ఉపా.ప్ర.భా.ద్వి.సం. 1662–75, పు. 110–111)

దంతఘాతకుడు శరీరం నిండా విబూది పూసుకొని, రుద్రాక్షలు వేలాడదీసి, ఆనపకాయ బుఱ్ర తొడపై పెట్టుకుని, కమండలం ధరించి, దండాన్ని చేతితో పట్టుకొని, జింక చర్మంపై కూర్చుని నడుమును నిటారుగా నిలబెట్టి పద్మాసనంలో ధ్యానం చేస్తున్నట్టు గౌరన వర్ణించాడు.

**2.4.1.13 గంగానది వర్ణన :**

హరిశ్చంద్రుడు ధనం సంపాదించడానికి కాశీక్షేత్రం వెళ్ళిన సందర్భంలో అక్కడ గంగానది వర్ణించిన తీరిది.

**అరుణారవిందంబు లడుగులు గాఁగ**

**దరుల గ్రుమ్మరువనదంతావళముల**

**యురుతర తుండంబు లూరులు గాఁగ**

**సరససైకత సీమ జఘనంబు గాఁగ**

**సరుచిరం బగుమేటిసుడి నాభి గాఁగ**

**........................................**

**బెనుపొంద నెరసిన ఫేనంబు దెలుపు**

**దనరారు చున్న చందనచర్చ గాఁగఁ**

**గులావనీరుహకుసుమపరాగ**

**జాలంబుచిత్రవస్త్రంబుగా మెఱయ**

**జనలోక పావని జాహ్నవి గంగ.**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 19–40, పు. 157)

ఎర్రతామరలే అడులుగా, గట్టుదగ్గర విహరించే అడవి ఏనుగు తొండములే తొడలుగా, ఇసుకదిబ్బే జఘనంగా, చిన్న చిన్న తరంగాలు నడుం మీద మడతలుగా, చేపలు కన్నులుగా, నీటిబొట్లు అనేక వరుసలు గల ముత్యాల హారంగా, తెల్లని నురుగు చందనంగా కేవలం గంగానదినే

కాక పరిసర ప్రాంతాలలో ఉన్న ఏనుగులతో కూడా గంగానదికి స్త్రీ తత్త్వాన్ని ఆపాదించాడు. 'గాగ' అనే అంత్యానుప్రాసతో అద్భుతంగా సాగింది ఈ వర్ణన.

**2.4.1.14 హరిశ్చంద్రుడి వర్ణన :**

కాశీ ప్రజలు హరిశ్చంద్రుడిని చూసి వర్ణించిన తీరిది.

**నీచంద మీయంద మీరాజసంబు**
**నీచూపు నీయేపు నిట్టితేజంబు**
**నీపెంపు నీసొంపు నీప్రతాపంబు**
**నీపోఁడి మీవాఁడి మీ భుజాబలము**
**నెందు నెవ్వరియందుఁ నెన్నఁడు గాన**
**మిందుకళాధరుం డితఁడగు నేని**
**నందివాహనము పినాకంబు నేది**
**కటితోలు ఫణులకంకణహారములును**
**జూటుకుఁగన్నును వాఁడిశూలంబు నెవ్వి**
**.......................................**
**మఱి పద్దనిప్పుకమాడ్కి నున్నాఁడు**
**పరఁగ నీవిభుపదపంక్తి జాడలను**
**బరికింపుఁ డివె సార్వభౌమచిహ్నములు**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 311-35, పు. 175-176)

కాశీ ప్రజలు హరిశ్చంద్రుని రూపు రేఖలను చూసి ఆశ్చర్యపోతారు. హరిశ్చంద్రుని అంద చందాలు, రాజసం, రూపం, తేజం, సొంపు, ప్రతాపం, భుజ బలం ఎవ్వరిలోనూ కన్పించవు. ఇతడి శివుడు అని అనుకుందామా అంటే నంది కానీ, త్రిశూలం కాని లేవు. విష్ణువు అనుకుందామా అంటే గరుత్మంతుడు కానీ, శంఖ చక్రాలు కానీ లేవు. మానవమాత్రులకు అతీతమైన లక్షణాలు ఉండడం వల్ల దేవతలతో పోలుస్తారు. చివరకి కాలిగుర్తులు చూడగానే చక్రవర్తిగా భావిస్తారు.

**2.4.1.15 చంద్రమతి వర్ణన :**

కాశీ పట్టణంలో నక్షత్రకుడు చంద్రమతిని విక్రయించే సమయంలో కాశీ ప్రజలు చంద్రమతిని చూసి ఈ విధంగా అనుకుంటారు.

'మరి చూడరమ్మ యీ మానినీమణిని
దెర వుచ్చు నద్దంబుఁ దెగడెదు మోము
జాతినీలపురంగు జడిపించుకురులు
లేఁత చందురుఁ చిసాశించునెన్నుదురు
మదచకోరములతో మలయునేత్రములుఁ
గొదమలేళ్లకు సిగ్గుగొలిపెడి చూపు
.......................................
.......................................
చిలుక గా దిది వికసించుచెంగల్వ
గలువ గా దిది చంద్రకళ వంటి చెలువ
చెలువ యీ గతి విలసిల్లఁగా వలయు
వలయుఁ గాంతల కిటువలెఁ బుట్టు గలుగ.

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 337-68, పు. 177-178)

జాతి నీలపురంగును అతిశయింప జేసే కురులు చంద్రమతి సొంతం. అమావాస్య తరువాత వచ్చే లేత చంద్రుడు వంటి నుదురు భాగము, చకోరాలకు సమానమైన కళ్ళు, లేళ్లుకూడ సిగ్గుపడే ఆమె చూపు. పూలవిండ్ల వలె ఉన్న కనుబొమ్మలు. మేలైన సంపగ మొగ్గలాగవున్న ముక్కు, తెల్లని మొగ్గలాగా ఉన్న పళ్ళు వరుస. ఈ విధంగా కవి ముప్పైఒక ద్విపద పాదాలలో చంద్రమతిని వర్ణించాడు.

రామరాజ భూషణుడు కూడ తన హరిశ్చంద్రోపాఖ్యానము కావ్యంలో చంద్రమతిని, దమయంతిని కింది పద్యాలలో వర్ణించాడు.

"పురము పురంధ్రులయ్యెడ నపూర్వము గాఁ గని సన్నుతించిరా
కరి వరయాన గంబునిభకందరఁ గందరవీణఁ గంజజి
తర్కఁగనకాంగిఁ గంతు శర కషు కటాక్ష గలేశ లేశధి
క్కర మనేయ ఫాలతలఁ గైతిక కాంతి కపోల పాలికన్.

**కలికి క్రొవ్వెద తృణ గ్రాములఁ గృపఁ జూచు**
**గోఁఱ రాజుఁగైకొను కొమ్మ నుదురు**
**తరుణి చూపులు నెల త్రావ డంబులఁ బ్రోచు**
**నివురు ఛాయల నెన్న దింతి మోవి**
**ముదిత గుబ్బలు నీరు మోపరుల గణింప**
**పప్పు బుట్టువు గాచు నతివ కేలు**
**చెలి రోమలత పుట్ట చేర్పుల మన్నించు**
**వాపుల గరుణించు వనిత నాభి**
**సరకు సేయదు తిరుగండ్లఁజామపిఱుదు**
**జడ తరుల బాటిగొన చన్ను తొడలు మనుచు**
**మొగ పిఱికి గాంత గాంత ప్రప్రదముల్ దగుల బోవు**
**జాతి మొగ విప్పుదళములా సతి నఖములు.**

ఇందు దూరము నుంచి చూచు పుర స్త్రీలు చేసిన వర్ణనమిది, నుదురును, మోవిని, రోమలతను, వనిత నాభిని కూడ వర్ణించి గౌరన కావ్యము ననుసరించి యిది యిచ్చట ప్రవేశపెట్టినది. కాని గౌరన వర్ణనములో ఉపమానములే ఉత్తములై, ప్రౌఢములై, గాంభీర్యములై, అర్ధవంతములై యున్నవి". రామరాజ భూషణుడు వానిని అనుకరించి అంత ప్రౌఢముగా వర్ణించలేకపోయెనని చెప్పవచ్చును. గౌరన ద్విపద కావ్యంలో

'మరి చూడరమ్మ యీ మానినే మణిని' అని తమలో తాము సంభాషించు కొనుట సహజసుందరమై యొప్పినది.

ఈ విధముగా పూర్వకవుల కావ్యరీతుల ననుసరించి కథావస్తువునందు, వర్ణనములందు, శిల్పమునందు, నూతనత్వము కానరాక పోవుట చేతను గౌరన ద్విపద కావ్యమునకు కలిగిన ఘనత రామరాజ భూషణుని హరిశ్చంద్రోపాఖ్యానమునకు కలుగలేదనియే చెప్పవచ్చును".[27]

### 2.4.1.16 కాలకౌశికుడి వర్ణన :

చంద్రమతిని కాలకౌశికుడు ధనం ఇచ్చి కొనుక్కొన్న సందర్భంలో గౌరన కాలకౌశికుడిని వర్ణించిన తీరిది.

---

27. *ఆంధ్రసాహిత్యములో హరిశ్చంద్రోపాఖ్యానము, పు. 272*

**యాయవారము లెత్తి యతిదైన్యవృత్తి**
**నడిగినధాన్యంబు లవి వేఱువేఱు**
**ముడిచినబట్టలు మూఁపుపై వ్రేలఁ**
**దోలు నస్థులుఁ జిక్కి తూఁగాడు మేనుఁ**
**బేలు రాలెడుసిగ పడతలఁ గణితి**
**పిల్లికన్నులుఁ గుఱుపీఁచు మీసములు**
**నుల్లిగడ్డంబు నత్యుఁగదృష్టియును**
**దళ మైనపట్టెవర్ధనములు వ్రేళ్ళ**
**నులిచినదర్భలు నుదుటిపై బొరుసు**
**.........................................**
**'నదె వచ్చె నడ పీనుఁ' గనుచు నంతంత**
**గదియుచు మై పొస్తుకంపున కెడసి**
**తొలఁగుచు బురజనుల్ తుప్పున నుమియఁ**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 492-509, పు. 185-186)

కౌశికుడు యాయవారంతో ధాన్యాన్ని తెచ్చుకొని వేరువేరుగా మూటలు కట్టుకొని ముడి వేసుకొని వస్త్రంతో మూపుపై వ్రేలాడసుకొన్నాడు. తలలోంచి పేలు రాలుతున్నాయి. తలంతా కణితులతో ఉంది. పిల్లి కన్నులు, పీచులాంటి మీసాలు మొదలైన జుగుప్సాకరమైన వర్ణన చేశాడు గౌరన. కాలకౌశికుడిని చూసి జనులందరూ అదిగో పీనుగు వస్తోందని ఉమ్మి వేస్తున్నారని కాలకౌశికుడి రూపు వర్ణించాడు గౌరన.

### 2.4.1.17 కలహకంఠి వర్ణన :

చంద్రమతిని కాలకౌశికుడు దాసిగా కొని ఇంటికి తీసుకువచ్చినప్పుడు కలహకంఠి రూపురేఖలను వర్ణించిన తీరిది.

**చిత్తంబు జల్లనఁ జిడిముడిఁ బడుచు**
**మెదుక పట్టినతల యెద గండమాల**
**నుదుటి మీఁదటిసుడి నులిగొన్న బొమలు**
**బుఱ్ఱ ముక్కును లొట్ట పోయినగన్ను**

**వెఱ్ఱిచూపును దెగి వ్రేలాడుచెవులు**
**మిడిపండ్లు చెక్కిలి మీఁదిపుల్పిరియుఁ**
**రోటు పోయినచెయ్యి తొమ్మకంపరము**
**వాటుఁ గాలును తోలువలె నున్న నడుము**
**బద్దపిక్కలు నంట బలసినతొడలు**
**మొద్దుపాదంబులు ముడిఁగినవ్రేళ్ళు**
**గఱుకునల్లనిమేను గలిగి దయ్యంబు**
**మఱపింపఁ దగు నుచ్చమల్లిచందమున**
**గనుఁగాన రోఁతైనకాలకౌశికుని**
**వనిత.........................**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం. 1079–93, పు. 220–221)

బుర్రముక్కు, లొట్టపోయిన కన్ను, వెర్రిచూపు, తెగివ్రేలాడబడిన చెవులు, చెక్కిలి మీద పుల్పిరి, వ్రేలాడే చన్నులు, బడబాకిన నోరుతో వికృతంగా కలహకంఠిని కవి వర్ణించాడు.

**2.4.1.18 వీరబాహుడి వర్ణన :**

హరిశ్చంద్రుడిని దాసుడిగా కొనుక్కొన్న వీరబాహుడి వర్ణన ఇది.

**కుఱువెంద్రుకల కోరకొప్పిడి కావి**
**యఱవుడు తలనిట్టు నట్టును జుట్టి**
**జేగరుబొ ట్టిడి చెవి సంకుఁగొడుపు**
**లాగుగా వ్రేలఁ దెల్లని ముద్దునిల్పి**
**తోలులు వోయిన ప్రాత తోలును గప్పి**
**బలుగుత్తి మొల నచ్చుపడ నమరించి**
**కదుమైల పేలికఁ గాసించి నడుము**
**బడికి వేసిన యరపట్టె బిగించి**
**యెడమచేఁ బశుమాంస మేర్చినగుడియఁ**
**గడమచే నినుపయుంగరములగుదియ**
**............................................**

**యోరువ రాక బిట్టొకిలి తొదువ**

**నోరు మద్యముకంపు నూల్కొనఁ బలికె**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం.1373–1400, పు. 236)

కురచగా ఉన్న వెంట్రుకలను కొప్పుగా పెట్టుకొని, దానిని చింపులుగా ఉన్న కావిగుడ్డలచే కట్టుకొని, తెల్లని ఎముకని ముడి వూడకుండ పెట్టుకున్నాడు. కత్తిని నడుము దగ్గర పెట్టుకొని అది జారిపోకుండ మాసిపోయిన వస్త్రాన్ని కట్టుకొన్నాడు. ఎడమచేతిలో పశుమాంసం ఉన్న కుండ పట్టుకొని సగం తాగిన కల్లుకుండ చంకలో పెట్టుకొని తూలిపోతూ హరిశ్చంద్రుడిని సమీపించాడు. శ్మశానంలో దొరికే వస్తువులనే తీసుకొని వీరబాహుడికి అలంకరణగా చేసి వర్ణించాడు గౌరన.

### 2.4.1.19 వీరబాహుడి గృహ వర్ణన :

వీరబాహుడి గృహవర్ణన ఈ విధంగా ఉంది.

**పడి యున్న ముదుసులు పసరంపుఁ దలలు**

**బడికి వ్రేయఁగ నెండఁ బఱచినతోళ్లుఁ**

**గఱచి కుక్కలు పీఁకఁగాఁ బెను కొమ్ము**

**లొఱగఁ దీసినరీతి నున్న డొక్కలును**

**వఱదలై నెత్తురు వడియు కుత్తుకలు**

**తఱిఁగిన గోవులు తఱు చైనపచ్చి**

**మురియలు సెదరినముఱికి నంజుళ్లు**

**నఱచు కాకులుఁ గలయామాలవాడ**

**వడిఁ జొచ్చి వ్రేవులు వాతి కేతేర**

**నడరుదుర్గంధంబు కఱు మాత్ర మైనఁ**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం.1571–1580, పు. 247)

వీరబాహుడి గృహం తోళ్ళతో, కుక్కలు ఎముకలను బయటికి తీసిన డొక్కలతో, వరదగావున్న నెత్తురులో పడిన మెడలతో, ముక్కముక్కలుగా తెగిన గోవులతో ఉంది, కాకులు ఆ మాంసం కోసం ఇంటి చుట్టు తిరుగుతూ అరుస్తున్నాయి. చిందర వందరగా ఉన్న ప్రేగులు వాటినుంచి వచ్చే దుర్గంధంతో వీరబాహుడి ఇల్లు నిండిపోయింది.

**2.4.1.20 శ్మశానవర్ణన :**

హరిశ్చంద్రుడు శ్మశానానికి కాటికాపరిగా ఉన్న సమయంలో శ్మశానాన్ని కవి వర్ణించాడు.

**యత్తఱిఁ గమురూకం పండరి దిక్కులను**
**మొత్తమై నిగుడుక్రొంబొగలు నంతంత**
**మండు నొల్కులుఁ జేరి మానవమాంస**
**ఖండంబు లొండొండఁ గసికిలఁ గ్రుచ్చి**
**కమ్మగాఁ గాల్చి చంకటఁ బెట్టి మెసఁగి**
**నెమ్మది నృత్యంబు నెఱపుభూతములు**
**సగము గాలుచు నున్న శవములఁ బట్టి**
**తగిచి గుంపులు గూడి తినుపిశాచములు**
**నెడనెడ బొక్కల నిడినబాలకుల**
**వెడలించి భక్షించుబేతాళతతులుఁ**
**దలకాయలకు మూఁగి తమతమ వనుచుఁ**
**గలహించు డాకినీగణములు..............**

(హ.ఉపా.ద్వి.భా.ద్వి.సం.1619–1630, పు. 250)

కమ్మగా కాలిన మాంసం ముక్కల్ని చంకన పెట్టుకొని నృత్యం చేసే భూతాలు, సగం కాలుతున్న శవాల చుట్టూ తిరిగే పిశాచాలు, గుంతలలో పాతిపెట్టిన బాలకుల శవాల్ని బయటకుతీసి తినే బేతాళాలు, తలకాయలకు చుట్టూ మూగి అవి తమవేనని చెప్పే శాకినీ గణములు మొదలైన దృశ్యాలను హరిశ్చంద్రుడు శ్మశానంలోకి ప్రవేశించగానే చూశాడు. అప్రియాలైన వాటిని వర్ణించడంచేత ఈ వర్ణనలో బీభత్సరసం అభివ్యక్తమయింది.

ఇంకా బేతాళవృక్షం, యుద్ధం, వేట, మహాగ్ని, మొదలైన వర్ణనలు గౌరన వర్ణనా పటిమకి, లోకపరిజ్ఞానానికి సంనిశిత దృష్టికి తార్కాణాలుగా నిలిచాయి.

**2.4.2 నాటకంలో వర్ణనలు :**

**2.4.2.1 హరిశ్చంద్రుడి వర్ణన :**

హరిశ్చంద్రుడు నిశాప్రజాగ్రవ్రతంలో ఉన్నప్పుడు నిద్రలేమి చేత అతడికి కలిగిన బడలికను వర్ణించాడు కవి.

**నిద్రావిధేయారుణమన్థరాక్షః**
**ప్రజాగరక్షామముఖామ్బుజశ్రీః ।**
**సద్యోవియోగవ్యథితో దినాన్తే**
**భ్రష్టః స్వయూథాదుషసీవ నాగః ॥**

(చం.కౌ.పు.5)

భారమైన నిద్రతూగుచేత అలసిన కళ్లతో ప్రజలను రక్షించాలనే సంకల్పంతో హరిశ్చంద్రుడు ఉన్నాడు అని కవి వర్ణించాడు.

**2.4.2.2 ఆశ్రమ వర్ణన :**

హరిశ్చంద్రుడు వరాహాన్ని తరుముకుంటూ విశ్వామిత్రుడి ఆశ్రమానికి వస్తాడు. ఆశ్రమంలోని ప్రశాంత వాతావరణాన్ని చూసిన సందర్భంలోనిది వర్ణన

**ఆ మూలం క్వచిదుధృతా క్వచిదపి ఛిన్నాస్థలీ వర్హిషా –**
**మానమ్రాకుసుమోచ్చయాచ్చ, సదయా కృష్టాగ్రశాఖాలతా ।**
**ఏతే పూర్వ విలూనవల్కలతయా రూఢవ్రణాః శాఖినః**
**సద్యశ్ఛేదమమీ వదన్తి సమిధాం ప్రస్యందినః పాదపాః ॥**

**నేపస్కన్ధే కుహరిణి శుకాః స్వాగతం వ్యాహరన్తి**
**ఘ్రాణగ్రాహీ హరతి హృదయం హవ్యగన్ధః సమీరః ।**
**ఏతా మృగ్యః సలిల పులినోపాన్త సంసక్తదర్భం**
**పశ్యన్త్యోఽ స్మాన్సచకితదృశో నిర్ఝరామ్భః పిబన్తి ॥**

(చం.కౌ.పు.35)

చేతులతో కోసిన దర్భలు, పువ్వులు కొయ్యడానికి వీలుగా వంగిన చెట్ల కొమ్మలు, స్వాగతం చెప్పే చిలుకలు, హోమం చెయ్యడం వలన వచ్చేవాసన మొదలైన లక్షణాలతో ఆశ్రమ ప్రాంతం ఉంది.

**2.4.2.3 నిశివర్ణన :**

ధర్మదేవత కాపాలికుడి వేషంలో వచ్చి సిద్ధరసం పొందడానికి తపస్సు చేసే సందర్భంలో చీకటిని వర్ణించాడు కవి.

చిమ్మ చీకటి కమ్ముకొంది. వస్తువులు దృష్టికి కన్పించనంతగా చీకటి కమ్ముకొంది.

**అకృత్వా మత్పరిజ్ఞానమదత్వా మృతకమ్బలమ్**
**ప్రవర్తనీయాః కేనాపి న శ్మశానోచితాః క్రియాః**

(చం.కౌ.పు. 98)

**ఇయమపి పునశ్ఛాయా దీనాం దశాం సముపాశ్రితా**
**హతవిధి వశాద్దేవీవాధో నిషీదతి భూరుహామ్**

(చం.కౌ.పు.55)

ఆదిత్యుడు తీవ్రమైన కౌశికునిలాగా తపిస్తున్నాడు. అలాగే నా మది ఏ విధంగా మండిపోతోందో ఆ విధంగా ఆదిత్యుడు మండిపోతున్నాడు. అలాగే ఎండకు మాడి కృశించిన శైబ్యలాగా భూమి కూడ కృశించి నీడ నెమ్మది నెమ్మదిగా క్రిందకి వస్తోంది.

**2.4.2.4 కాశీపట్టణ వర్ణన :**

హరిశ్చంద్రుడు ధనాన్ని సంపాదించడం కోసం కాశీ వెళ్ళినప్పుడు కాశీ పట్టణాన్ని వర్ణించిన సందర్భంలోనిది ఈ వర్ణన.

**యదాద్వాంఛన్తి క్షపితతమసో బ్రహ్మచర్యైస్తపోభిః**
**ప్రవ్రజ్యాభిః శ్రుత శమదమానా శకైర్బ్రహ్మనిష్ఠాః ।**
**తద్దేహాన్తే కథయతి హరస్తారకం జ్ఞానమస్మి-**
**న్ప్రాణత్యాగాద్భవతి నపునర్జన్మనే యేన జన్తుః ॥**

**విముచ్యన్తే జన్తోరిహ నివిడ సంసార నిగడాః**
**శిరస్తద్వైరిఞ్చం న్యపతదిహ హస్తాత్పశుపతేః ।**
**విముక్తస్తత్పా పాదభవదవిముక్తః స భగవా -**
**న్న ముక్తం తేనైతత్సహ దయితయా క్షేత్రమసమమ్ ॥**

(చం.కౌ.పు. 54)

తపస్సు చేసే బ్రహ్మనిష్టులకు, సన్యాసులకు, శివుడే ఆశ్రయం. అటువంటి శివుడి నివాసం అయిన కాశీ పట్టణం పునర్జన్మ లేకుండ చేస్తుంది. చావు పుట్టుకలనేవి ఇక ఉండవు. శివుడు ఎప్పుడూ కాశీ పట్టణంలోనే ఉంటాడు. ఇంతటి క్షేత్రం మరొకటి లేదని రచయిత వర్ణించాడు.

**2.4.2.5 శ్మశాన వర్ణన :**

హరిశ్చంద్రుడు చండాలుడి దగ్గర కాటికాపరిగా చేరినప్పుడు హరిశ్చంద్రు ఎంతటి దుర్భర స్థితిని అనుభవిస్తున్నాడో తెలుపుతుంది ఈ శ్మశానవర్ణన.

**భినత్త్యక్ష్ణోర్ముద్రాం శిరసి చరణౌ న్యస్య కరటః**
**శివా సృక్కోపాన్తే గ్రసతి, రసనాగ్రం విలుఠితమ్ ।**
**ఛినత్తి శ్వామేఢ్రం ప్రథయతి చ గృధ్రోఽస్త్ర వివరం**
**యథేష్ట వ్యాపారాస్త్వయి కుణప యచ్ఛ్వా పదగణాః ॥**

(చం.కౌ.పు. 90)

పీనుగుల కన్నులను, ముక్కులను, నోటిని విప్పి ముక్కుతో మాంసాన్ని పీకి, వేలాడే నాలుకలను పీకి, ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నాయి గ్రద్ధలు. ఈ శ్మశాన వర్ణన జుగుప్సను కలిగిస్తూ బీభత్స రసాన్ని అభివ్యక్తం చేస్తోంది.

**2.4.2.6 సూర్యాస్తమయ వర్ణన :**

హరిశ్చంద్రుడు శ్మశానంలో ఉన్నప్పుడు సూర్యాస్తమయం అయ్యింది. ఆ సందర్భంలో కవి సూర్యాస్తమయాన్ని వర్ణించాడు.

**సంధ్యావధ్యాస్రశోణం తనుదహన చితాఙ్గారమన్దార్క బిమ్బం**
**తారానారాస్థికీర్ణం విశదనకరజ్కాయమాణోజ్జ్వలేన్దు ।**
**హృష్యన్నక్తం చరౌఘం ఘనతిమిరమహాధూమధూమ్రానుకారం**
**జాతం లీలా శ్మశానం జగదఖిల మహాకాలకాపాలికస్య ॥**

(చం.కౌ.పు.93)

సాయంకాలంలో కాలమనే కాపాలికుని శ్మశానంలా ఈ జగత్తు అంతా ఉంది. సంధ్యా సమయంలోని ఎర్రని కాంతి సంధ్యావధ వల్ల కల్గిన రక్తంలా ఉంది. అస్తమించే సూర్యుడు చితాగ్నిలో మండుతున్న బొగ్గులా ఉన్నాడు. నక్షత్రాలన్నీ ఎముకల్లా ఉన్నాయి. ప్రకాశించే చంద్రుడు పుర్రెలా ఉన్నాడు. దట్టమైన చీకటి వ్యాపించిన పొగలా ఉంది. రాత్రి సంచరించే రాక్షసులకు ఆనందంగా ఉంది. ఈ విధంగా సాయంకాలం ఈ జగత్తు అంతా శ్మశానంలా ఉంది. ఈ సూర్యాస్తమయ వర్ణనలో బీభత్సరసం అభివ్యక్తమయింది.

**ముగింపు :**

చండకౌశికమ్ నాటకం మార్కండేయ పురాణం ఆధారంగా క్షేమీశ్వరుడు రచించాడు. హరిశ్చంద్రోపాఖ్యానాన్ని గౌరన స్కాందపురాణం ఆధారంగా రచించాడు. నాటకంలో కంటే కావ్యంలో హరిశ్చంద్రుడు అమిత పరాక్రమవంతుడు. నాటకంలో కన్నా కావ్యంలో చంద్రమతి పాత్ర ఉదాత్తంగా పోషింపబడింది. నాటకంలో కంటే కావ్యంలో విశ్వామిత్రుడు మిక్కిలి క్రోధవంతుడు. కావ్యంలో నక్షత్రకుడు, కాలకౌశికుడు, కలహకంఠి వంటి పాత్రలు చంద్రమతి, హరిశ్చంద్రులకు అనేక కష్టాలు కలిగించి కావ్యం కరుణరసాత్మకంగా సాగడానికి ఉపయోగపడ్డాయి. నాటకంలో ఈ పాత్రలు లేవు. నాటకంలో శృంగారరసం చంద్రమతి హరిశ్చంద్రుల మధ్య పోషింపబడింది. కావ్యంలో శృంగార రసాభాస హరిశ్చంద్రుడు, మాతంగ కన్యల మధ్య అభివ్యక్తమయింది. కావ్యనాటకాలు రెండింటిలోనూ కరుణ, రౌద్ర, వీర, బీభత్స, భక్తి, వత్సల రసాలు ఉన్నాయి.

3వ అధ్యాయం

# తపతీ సంవరణం - తపతీ సంవరణోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన

### 3వ అధ్యాయం

# తపతీ సంవరణం - తపతీ సంవరణోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన

## 3.0 కవి పరిచయం :

### అద్దంకి గంగాధరుడు

తపతీ సంవరణం ప్రబంధ కర్త అద్దంకి గంగాధర కవి. ఇతని తండ్రి వీరయా మాత్యుడు. గురువు కేదారశ్రీ. ఇతడు తన తపతీ సంవరణ కావ్యాన్ని మల్కిభరాముడికి అంకితం ఇచ్చాడు. మహమ్మదీయ ప్రభువులకు కావ్యాలను అంకితం ఇచ్చిన వాళ్ళలో మొదటివాడని ప్రతీతి. ఈ కావ్యం 1565 ప్రాంతంలో రచింపబడింది.

తపతీ సంవరణోపాఖ్యానాన్ని ఆంధ్ర మహాభారతం ఆదిపర్వంలో నన్నయగారు సప్తమాశ్వాసంలో 68 నుండి 90 వరకు 23 గద్య పద్యాలలో రాశారు. దీనినే గంగాధరుడు పెంచి, అష్టాదశ వర్ణనలతో ఐదాశ్వాసాల కావ్యంగా రాశాడు. అద్దంకి అనే ఇంటిపేరు బట్టి ఈ కవి పూర్వీకులు నెల్లూరు జిల్లాలోని అద్దంకిలో ఉండేవారని చెప్పవచ్చు.

“సంవరణ చరిత్రను తెలుగులో ఇంకొక కవి కూడా రచించాడు. చదలవాడ మల్లన్నచేత విప్రనారాయణ చరిత్రను అంకితం పుచ్చుకొన్న మాకరాజు తిమ్మరాజుకు లక్ష్మీపతి రాజు అనే తమ్ముడున్నాడు. అతణ్ణి గురించి మల్లన ఇలా చెప్పాడు.

పెక్కుమారులు పార్వతీప్రియరమాధి-పులకు జేయించె నవలక్షపూజసములు వరుస జెప్పించుకొనియె సంవరణ చరిత-మెలమి మాకలయలక్ష్మిపతీశ్వరుడు.

మాకరాజు లక్ష్మీపతి చెప్పించుకొన్న ‘సంవరణ చరిత్ర’ను బహుశా చదలువాడ మల్లన్నే రచించి ఉంటాడని కొందరు పరిశోధకులు భావిస్తున్నారు”.[1]

తపతీ సంవరణోపాఖ్యానాన్ని శ్రీ పాడి వేంకట నారాయణగారు పరిష్కరించి కాకినాడలో 1898 జూన్ 15వ తేదీన ప్రకటించారు. నారాయణగారు ఈ గ్రంథానికి తపతీ సంవరణోపాఖ్యానమనే పేరు పెట్టారు కానీ గ్రంథస్థాలైన ఆధారాలను బట్టి ‘తపతీ సంవరణ’మనే నామాన్నీ గంగాధరకవి ఈ కావ్యానికి పెట్టినట్టుగా తెలుస్తోంది. ఆశ్వాసాంత గద్యలలో ‘తపతీ సంవరణంబను శృంగార

---

1. *సమగ్ర ఆంధ్ర సాహిత్యం, రెండవ సంపుటి, పు. 282*

కావ్యంబు నందు' అని ప్రథమాశ్వాసంలో 'నే రచయింపబూనిన తపతీ సంవరణ ప్రబంధమునకు' అని గంగాధరకవి పేర్కొన్నాడు. తపతీ సంవరణోపాఖ్యానమనే నామమే మిక్కిలి ప్రాచుర్యం పొందడం వల్ల, సంస్కృత నాటకానికి కూడ తపతీసంవరణమనే నామం ఉండడంవల్ల కావ్య నాటకాలకి వ్యత్యాసం తెలియజేయడానికి కావ్యాన్ని తపతీసంవరణోపాఖ్యానమనే ఈ పరిశోధనలో నేను వ్యవహరించాను.

**కులశేఖరవర్మ :**

"సుభద్రా ధనంజయం" నాటక కర్త కులశేఖరవర్మ. ఇతడు కేరళదేశాన్ని పాలించిన మహారాజు. ఇతని రాజధాని మహోదయపురం. ఇతడు రచించిన సంస్కృత కృతులలో మొదటిది 'తపతీ సంవరణం' రెండవది 'సుభద్రా ధనంజయం'. ఇవి నాటకాలు. మూడోది 'ఆశ్చర్య మంజరి' అనే గద్య కావ్యం. ముకుందమాల ఇతడు రచించిన స్తోత్ర గ్రంథము. ఇతడు కేరళ దేశాన్ని పాలించి విరక్తుడై శ్రీరంగం చేరి 'పెరుమాళ్ తిరుమెళి' అనే దివ్య ప్రబంధ రచన చేసి పన్నెండు మంది ఆళ్వారులలో ఒకడుగా గుర్తింపు పొందాడు. ఇతడు రచించిన రచనలను బట్టి ఇతడు కవి, శాస్త్రజ్ఞుడు, లోకజ్ఞుడు, సత్త్వ సంపన్నుడు, పరమభాగవతుడని తెలుస్తోంది. ఇతడు క్రీ.శ. 1159 (ఎ.డి.) కాలానికి చెందిన యదువంశీయుడు.

**3.1.0 ఇతివృత్త పరిచయం :**

'తపతీ సంవరణోపాఖ్యానము' కావ్యం, 'తపతీ సంవరణం' నాటకం రెండూ మిశ్రమాలే. ఈ రెండింటికి భారతమే మూలం. రచయితలు భారతం నుండి ఇతివృత్తాన్ని స్వీకరించినా కావ్యనాటకాలకు తగిన కల్పనలు చేసి రసవత్తరంగా రచించారు.

సూర్యుడికి సావిత్రి, తపతి అనే ఇద్దరు పుత్రికలు ఉన్నారు. తపతికి యుక్తవయస్సు రాగానే ఆమెకి తగిన వరుడు ఎవరని సూర్యుడు ఆలోచిస్తాడు. ఆ సమయంలోనే సంవరణుడు సూర్యుని గురించి తపస్సు చేస్తుంటాడు. సూర్యుడు తపతికి తగిన వరుడు సంవరుణుడే అని నిశ్చయానికి వస్తాడు.

ఒక రోజు సంవరుణుడు వేటాడుతూ వనంలోకి ప్రవేశిస్తాడు. అలసిపోయి ఒక పర్వత ప్రదేశానికి చేరతాడు. అక్కడ ఒక కన్యను చూసి ఆమె సౌందర్యానికి పరవశుడై మన్మథబాధకి గురై ఆమెను నువ్వు ఎవరని ప్రశ్నిస్తాడు. ఆమె సమాధానం చెప్పలేక అదృశ్యం అవుతుంది. సంవరుణుడు ఆమె కన్పించకపోవడంతో నేలమీద పడి విలపిస్తాడు. విరహ అవస్థలో ఉన్న సంవరుణుడిని చూసి

ఆమె కూడ మదనతాపానికి గురిచెంది ప్రత్యక్షమై అతడి గురించి తెలుసుకొనే ప్రయత్నం చేస్తుంది. సంవరుణుడు తన వృత్తాంతమంతా చెప్పి తనను గాంధర్వ వివాహం చేసుకోమని కోరతాడు. తపతి తను అస్వతంత్రురాలు అవడం వల్ల తన తండ్రిని ఆరాధించి తనను పొందమని చెప్పి సూర్యమండలానికి వెళుతుంది. సంవరుణుడు తపతి వెళ్ళడం తట్టుకోలేక మూర్ఛపోతాడు. విదూషకుడు శీతలోపచారాలు చేస్తాడు. తేరుకొన్నరాజు సూర్యుడిని ఆరాధిస్తూ తన పురోహితుడైన వశిష్ఠుడిని స్మరిస్తాడు. పన్నెండవ రోజున వశిష్ఠుడు వచ్చి కృశించి ఉన్న రాజును చూసి అతడు సూర్య పుత్రిక తపతి కోసం తపిస్తున్నాడని తెలుసుకొని వెంటనే సూర్యలోకానికి వెళ్ళి సూర్యుడిని స్తుతించి తపతిని సంవరుణుడికి ఇవ్వమని అడుగుతాడు. సూర్యుడు సంతోషించి తపతిని వశిష్ఠుని వెంట పంపుతాడు. వశిష్ఠుడు సూర్య రథంలో తపతిని భూలోకానికి తీసుకువచ్చి సంవరుణుడికిచ్చి వివాహం చేస్తాడు. సంవరుణుడు పన్నెండు సంవత్సరాలు భోగభాగ్యాలు అనుభవిస్తూ పర్వత, అరణ్యాలలో గడుపుతాడు. అందువల్ల నిర్లక్ష్యం చేయడంవల్ల రాజ్యంలో అనావృష్టి సంభవిస్తుంది. వశిష్ఠుడు సంవరుణుడిని రాజ్యానికి తీసుకువస్తాడు. సంవరుణుడు రాజ్యాన్ని మళ్ళీ సస్యశ్యామలం చేస్తాడు. తపతి సంవరణులకు కురువు జన్మిస్తాడు.

### 3.1.1 నాటకంలో కల్పనలు

నాటకంలో కథని నడిపించడానికి రచయితకి అనేక పాత్రలు, సన్నివేశాలు అవసరమౌతాయి. కావ్యంలో లేని కల్పనలను నాటకంలో చొప్పించి నాటకాన్ని రంజింప చేయాలి. తపతీ సంవరణం నాటకంలో రచయిత వివిధ కల్పనల ద్వారా నాటకాన్ని ప్రదర్శనాయోగ్యం చేశాడు. ఈ కల్పనలు కావ్యంలో కాని నన్నయ భారతంలో కాని కన్పించవు.

1. సంవరుణుడు దేవిని భార్యగా కలిగివున్నా ఆమెకు సంతానం లేకపోవడం.
2. స్వప్నంలో సూర్యుడు కన్పించి నీ దేవి గొడ్రాలు. వేరొకరిని పెళ్ళిచేసుకుంటే ఆమె వలన సంతానం కలుగుతుందని చెప్పడం.
3. సూర్యుడు తపతికి తగిన వరుడు సంవరుణుడని నారదుడి నుంచి తెలుసుకోవడం.
4. సంవరణ, విదూషకులకు ఆకాశం నుండి రాలిపడిన కర్ణపూరము, నేల మీద లత్తుక పూయబడిన అడుగుజాడలు కన్పించడం.
5. సంవరుణుడు దేవతా స్త్రీ పట్ల అశక్తుడవడంవల్ల దేవి కోపగించుకోవడం.

6. కర్ణపూరము మీద మన్మథసందేశాన్ని తెలిపే పద్యాక్షరాలు లిఖించబడి ఉండడం, సంవరుణుడు ఆ పద్యాన్ని పూరించి తపతి పట్ల అనురక్తుడవడం.

7. మహర్షులను బాధిస్తున్న రాక్షసులను సంవరుణుడు సంహరించడం.

8. సంవరుణుడు విరహాన్ని తట్టుకోలేక మరణించడానికి సిద్ధంగా ఉన్నప్పుడు తపతి రక్షించడానికి అతడి హృదయంపై తన హస్తాన్ని ఉంచుతుంది. నాయిక కర స్పర్శ సంవరుణుడికి జీవం పోసింది. ఈ సందర్భంలో భవభూతి ఉత్తరరామ చరితంలో సీత కరస్పర్శ రామునికి జీవం పోసిన సన్నివేశం జ్ఞప్తికి వస్తుంది.

9. సంవరుణుడు తపతితోనే ఉండడంవల్ల రాజ్యాన్ని క్షామం పీడిస్తోందని తెలిసి సూర్యుడు నిద్రిస్తున్న తపతిని సావిత్రి వద్దకు చేర్చడం.

10. సంవరుణుడు రాజ్యానికి వెంటనే చేరడానికి దివ్యరథాన్ని, సారథిని సూర్యుడు పంపడం.

11. యుద్ధంలో తన వందమంది పుత్రులను పోగొట్టుకొన్న రాక్షసి మారువేషం ధరించి తన చెలికత్తె గగనమాల అనే గంధర్వకన్య సంవరణుడిని చూడాలని ఆకాంక్షిస్తోందని చెప్పడం.

12. తపతికి కలిగిన కుమారుడిని తపతికి తెలియకుండా వేరు చేసి రాక్షసులను సంహరించడానికి దేహదారుఢ్యానికి అవసరమైన దివ్య ఆహారాలతో తపతి పుత్రుడిని సూర్యుడు పోషించడం.

13. తన ఆజ్ఞ లేనిదే భర్తకి నిజరూపంలో కన్పించకూడదని తపతిని సూర్యుడు శాసించడం.

14. తపతి తన భర్తను చూడాలని మేనక రూపం ధరించి సంవరుణుడి వద్దకు రావడం.

15. రాక్షసి రంభ రూపం ధరించి సంవరుణుడి దగ్గరకు వచ్చి తపతి తండ్రి ఆజ్ఞ జవదాటలేక, విరహాన్ని భరించలేక ఆత్మహత్యకు సిద్ధమైందని సంవరుణుడికి చెప్పడం.

16. రాక్షసి రంభ రూపంలో వచ్చి తపతికి సంవరుణుడు మరణించాడని చెప్పడం, తపతి కూడా మరణానికి సిద్ధపడడం.

17. రాక్షసి జంబూనది రూపంలో రంభ, మేనకల వద్దకు వచ్చి మహారాజు ప్రాయోపవేశము చేశాడని చెప్పి వారు కూడా మరణించడానికి సిద్ధపడేటట్లు చేయడం.

18. కురుపుత్రుడు రాక్షసిని సంహరించడానికి పూనుకోగా, రాక్షసి రక్షించమని సంవరుణుడిని శరణువేడుకొని తన వృత్తాంతాన్ని విన్నవించడం.

19. వశిష్ఠుడు కురుపుత్రుని తపతీ సంవరుణులకు అప్పగించడం.

**3.1.2 నాటకంలో కల్పనల ఔచిత్యం :**

సంవరుణుడు దేవిని ప్రథమ పత్నిగా కలిగివున్నా మళ్ళీ తపతిని వివాహం చేసుకోవడం వల్ల వచ్చిన దోషాన్ని పరిహరించడానికి సంవరుణుడిని ఉదాత్త పురుషుడిగా చిత్రించడానికి దేవికి సంతానం లేకపోవడమే కారణంగా చెప్పాడు రచయిత. సంవరుణుడు సంతానం కోసం ప్రార్థిస్తుంటే అశరీరవాణి తపతిని వివాహం చేసుకొంటే సంతానం కలుగుతుందని చెబుతుంది. అందువల్ల సంవరుణుడు కేవలం సంతానార్థం తపతిని ద్వితీయ వివాహం చేసుకోవడం ఔచిత్యవంతంగా చెప్పాడు రచయిత.

సూర్యుడు తపతి వింటూండగా నారదుడిని తపతికి తగిన వరుడెవరని ప్రశ్నించగా తపతికి తగిన వరుడు సంవరుణుడే అని నారదుడు బదులు చెప్పాడు. అప్పటి నుంచి తపతి సంవరుడినే ప్రేమించటం మొదలుపెడుతుంది. తపతి నారదుడి ద్వారా సంవరుణుడి గుణగణాలు వినడం వల్ల సంవరుణుడి పట్ల అనురాగాన్ని పెంచుకొని అతడు ఉండే కార్తికేయ మందిరానికి వెళ్తుంది. ఈ విధంగా నాటకంలో అభిలాష విప్రలంభానికి తావు ఏర్పడి శృంగారరసానికి బీజం పడింది.

కార్తికేయ మందిర సమీపంలో లత్తుక పూయబడిన తపతి పాదాల గుర్తులు, తపతి కర్ణపూరం మీద మన్మథ సందేశాన్ని తెలిపే పద్యాక్షరాలు ఉండడం వల్ల నాయకుడు దానిని పూరిస్తాడు. అదృశ్యరూపంలో అక్కడే వున్న సంవరుణుడిని వీక్షించడం వలన రతి ఫలపుష్ప సమన్వితవ్వడానికి రచయిత చేసిన పై కల్పనలు దోహదం చేశాయి.

వివాహానంతరం తపతీ సంవరుణులు సుఖిస్తూ కాలం గడుపుతూ వుండగా సంవరుణుడి రాజ్యాన్ని అనావృష్టి పీడిస్తుంది. తపతీ సంవరుణులకి కొంతకాలం ఎడబాటు కలిగిస్తేనే సంవరుణుడు మళ్ళీ రాజ్యం బాగోగులు చూస్తాడనే ఉద్దేశ్యంతో సూర్యుడు మేల్కొని ఉన్నప్పుడు తపతీ సంవరుణులను విడదీయడం కుదరదని నిద్రిస్తున్న తపతిని సోదరి అయిన సావిత్రి దగ్గరకు చేర్చుతాడు. సంవరుణుడు వెంటనే రాజ్యానికి వెళ్ళడానికి వీలుగా దివ్యరథాన్ని, సారథిని ఏర్పాటు చేస్తాడు. ఈ సందర్భంలో సూర్యుడు తన కూతురు సుఖం కంటే రాజ్యక్షేమమే రాజుకి ముఖ్యమని తపతీ సంవరుణులను విడదీయడం ఔచిత్యవంతంగా ఉంది.

తపతి కన్పించకపోయేసరికి సంవరుణుడు అన్ని చోట్లా వెతుకుతాడు. విరహవేదనను అనుభవిస్తాడు. సూర్యుడు తన అనుమతి లేకుండ నిజరూపంలో సంవరుణుడికి కన్పించవద్దని తపతికి చెబుతాడు. తపతికూడ సంవరుణుడిని చూడాలనుకుంటుంది. కానీ తండ్రి అనుమతి లేనందున మేనక రూపం ధరించి సంవరుణుడి దగ్గరకు వస్తుంది. నాయికా నాయకులకు ఎడబాటు కలగడం వలన విరహ విప్రలంభం సిద్ధించింది. ఈ విరహ విప్రలంభమే తపతీ సంవరుణుల అనురాగం మరింత బలపడడానికి ఉపయోగపడింది.

తపతి గర్భం దాల్చి కురుకుమారుడిని కంటుంది. దేవతలకి కూడ సాధ్యం కాని అసురుల్ని చంపడానికి సూర్యుడు కురుకుమారుడిని తపతికి తెలియకుండ పురిటిలోనే తీసుకువెళ్ళి దివ్యమైన ఆహారాలతో పోషిస్తాడు. తపతికి పుత్ర వియోగ దుఃఖం తెలియకుండ సూర్యుడు తన ప్రభావం చేత తపతిని మోహపెడతాడు. తపతి కూడ తను అమిత పరాక్రముడైన కుమారుడికి జన్మినిచ్చినట్టు కల కంటుంది. తపతికి పుత్ర వియోగ దుఃఖం కలుగకుండ కురు పుత్రుడిని తీసుకువెళ్ళి లోకకల్యాణానికి ఉపయోగించడం ఔచిత్యవంతంగా ఉంది.

మోహానిక అనే రాక్షసి సంవరుణుడి వలన తన వందమంది కుమారులను కోల్పోవడంవల్ల సంవరుణుడిపై ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటుంది. ఈ రాక్షసి ప్రతీకారంతో రంభరూపం ధరించి సంవరుణుడు, తపతి, తపతి చెలికత్తెలైన రంభ, మేనకలను కూడ దేహ త్యాగానికి సిద్ధపడేటట్టు చేస్తుంది. వీరు ఒకరికొకరు మరణించాలనుకోవడంతో కరుణరసం ఆవిష్కరించబడింది. రాక్షసి రంభ రూపంలో, తపతి మేనక రూపంలో రావడంలో అద్భుతరసం అభివ్యక్తమయింది. ఈ కల్పనలు నాటకం రసాత్మకంగా సాగడానికి, చూసే ప్రేక్షకుడికి ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించే విధంగా ఉన్నాయి.

కురుపుత్రుడిని రాక్షసి సంహరించాలనుకుంటుండగా రాక్షసిని కురుపుత్రుడు ధైర్యంగా ఎదుర్కొంటాడు. కురుపుత్రుడి దాటికి తట్టుకోలేక రాక్షసి సంవరుణుడిని శరణు వేడుతుంది. రాక్షసి కుటిల పన్నాగాలు, తపతి సంవరుణుల మీద పనిచేశాయి కానీ కురుపుత్రుడి మీద పనిచెయ్యలేదు. కురువంశానికి మూలపురుషుడైన కురుపుత్రుడు దేవతలకు కూడ సాధ్యంకాని అసురులను చంపడం, రాక్షసిని ధైర్యంగా ఎదుర్కొనడం వంటి పరాక్రమ విషయాలను చెప్పడం ఔచిత్యవంతంగా ఉంది.

### 3.1.3 కావ్యంలో కల్పనలు

1. కావ్యంలో గంగాధరకవి తపతీ సంవరుణులు ఒకరి గురించి ఒకరు తెలుసుకోవడానికి, వారి మధ్య రాయబారాన్ని నడపడానికి చిలుక పాత్రను ప్రవేశపెట్టాడు.

2. భారతంలో కానీ, నాటకంలో కానీ అరుంధతి పాత్ర లేదు. కావ్యంలో వశిష్ఠుడితో పాటు అరుంధతి పాత్ర కూడ ఉంది. తపతిని సంవరుణుడికి ఇవ్వమని అడగడానికి ఈమె కూడ సూర్యమండలానికి వెళ్తుంది. వివాహానికి ముందు సంవరుణుడికి కర్పూర నీరాజనం ఇచ్చి సంవరుణుడిని పెళ్ళి కుమారుడిని చేస్తుంది.

### 3.1.4 కావ్యంలో కల్పనల ఔచిత్యం :

గంగాధర కవి భారతం నుండి ఇతివృత్తాన్ని గ్రహించినా కొన్ని కల్పనలు జోడించి కావ్యాన్ని రసవత్తరంగా రచించాడు.

సంవరుణుడు హస్తినాపురాన్ని పరిపాలిస్తూ ఉండగా ఒక రోజు చంద్రకాంత శిలాతలంపై కూర్చున్న సమయంలో చిలుక అతని మణిబంధంపై వాలి తపతి అందచందాలు, గుణగణాలు ఏకరువుపెట్టి తపతికి తగిన వరుడు సంవరుణుడే అని చెబుతుంది. తపతి సంవరుణుడినే వరిస్తుందని అతనికి ఆత్మవిశ్వాసాన్ని నూరిపోస్తుంది. తిరిగి మళ్ళీ తపతి దగ్గరకు వెళ్ళి సంవరుణుడి రూపలావణ్యాల గురించి చెప్పి తపతి కూడ సంవరుణుడిని ప్రేమించేటట్టు చేస్తుంది. నాయకి నాయకుల మధ్య రాయబారాన్ని నడిపి వారికి అభిలాష విప్రలంభాన్ని కలిగించడానికి చిలుక కల్పన చాలా ఉపయోగపడింది.

సంవరుణుడు సూర్యుడి గురించి తపస్సు చేయగా వశిష్టుడితో పాటు అరుంధతి కూడ సూర్యుని దగ్గరకు వెళ్ళి తపతిని సంవరుణుడికి ఇవ్వమని అడుగుతుంది. నన్నయ భారతంలో కేవలం వశిష్ఠుడే సూర్యుని దగ్గరకు వెళ్తాడు. వివాహ సమయంలో కూడ అరుంధతి పెద్ద ముత్తైదువుగా దగ్గర ఉండి వివాహం జరిపించడం ఔచిత్యవంతంగా ఉంది.

ఈ విధంగా గంగాధర కవి భారతం నుంచి ఇతివృత్తాన్ని తీసుకొని పెక్కువర్ణనలు కల్పనలతో, తెలుగు నుడికారాలతో కావ్యంగా మలిచాడు.

### 3.1.5 కావ్య నాటకాలు రెండింటిలో ఉన్న కల్పనలు

తపతి చెలికత్తెలు నన్నయ భారతంలో కన్పించరు. కావ్య నాటకాలు రెండింటిలోనూ మేనక, రంభలు తపతి చెలికత్తెలుగా ఉంటారు. ఈ మేనక, రంభలు తపతి అన్ని విషయాలలోనూ చేదోడు వాదోడుగా ఉంటారు. కావ్యంలో తపతి విరహవేదనను అనుభవిస్తున్నప్పుడు చెలికత్తెలు ఆమెకు శైత్యోపచారాలు చేస్తారు. నాటకంలో తపతి కోసం ప్రాణాలు కూడ ఇవ్వడానికి సిద్ధపడతారు.

**3.2 పాత్ర పోషణ**

**3.2.1 సంవరుణుడు**

**కులీనత**

కులీనత అంటే సత్కులంలో జన్మించడమని అర్థం. ప్రబంధనాయకుడు ఉత్తమ కులజుడై ఉండాలి. సంవరుణుడు అజామిళునకు, ఋక్షకు జన్మించినాడు. నహుష, పూరు, భరతాది మహామహులు జన్మించిన చంద్రవంశంలో జన్మించిన సద్గుణశీలి. తపతికి భర్త, కురుపుత్రుడికి తండ్రి తమ తమ పరిపాలనా కాలాలలో సాటిలేని వారిగా కీర్తిగడించిన పూర్వీకుల అడుగుజాడలలో జీవనయాత్ర సాగించి వంశయశస్సును నిలబెట్టి ధర్మపాలకునిగా ప్రసిద్ధిపొందాడు.

**మర్త్య పాతాళ (త్రిదశ ధామముల లేదు**
**మహిమ నినుc బోలు తేcడు, సో)మకులరాజ !**

(త.సం.ఉపా.పు.3)

త్రిలోకాలలో తనకు సాటి, పోటి లేనట్లుగా ఖ్యాతిపొంది వంశంలో ఉన్నతుడుగా నిలిచి ఉత్తమ నాయకుడు కాగలిగాడు.

**మహాభాగ్యం**

భూమండలాధిపత్యమే మహాభాగ్యం సంవరుణుడు ధీరోదాత్తుడు. "ధీరశ్చ అసౌ ఉదాత్తః ధీరోదాత్తః"[2] ధీరత్వం, ఉదారత్వం గలవాడు ధీరోదాత్తుడు. ధీరోదాత్తుడు శృంగార వీర రసములందు నాయకుడు. గంగాధర కవి సంవరుణుడి ధీరత్వాన్ని క్రింది పద్యంలో వర్ణించాడు.

**"సంగర రంగభూములను సంవరణ క్షితిపాలు సద్భుజా**
**సంగత ఖడ్గరాహువు విశంకట టంక నిరంక శౌర్య ని**
**ర్భంగ విరోధి యూధముల పాండుర కీర్తి మృగాంకుc బర్వ సం**
**ధిం గబళింప శోణతటినిం దగc గ్రుంకును భూతసంఘముల్"**

(త.సం.ఉపా. 16)

వీర విహారం చేసి వైరిగణాన్ని జయించి, ధీరనాయకుడైనాడు. ధనుజుల్ని భజించి, భూమిని నిష్కంటకం చేశాడు. వనగిరి దుర్గాలనాక్రమించిన శత్రురాజులను పాదాక్రాంతం చేసుకొని, ప్రజలను రక్షించి వీరధీర శిఖామణిగా వెలుగొందాడు.

---

*2. కావ్యాలంకార సంగ్రహము, పు. 67*

తపతీ సంవరణ కర్త తన శృంగార ప్రబంధ నాయకుని అనురాగమూర్తిగానే కాక, అరివీర భయంకరునిగా కూడా ప్రతిష్ఠించి శృంగార వీర స్వరూపునిగా తీర్చిదిద్దాడు.

**ఉజ్జ్వలత :**

స్ఫురద్రూపం కలిగి ఉండటం యౌజ్జ్వల్యం. చిలుక సంవరణుని సౌందర్యాన్ని వర్ణిస్తుంది. అంతవరకు ధరామండలంలో తపతికి తగిన వరుడు దొరకక అలసిపోయిన చిలుకకు అందివచ్చిన అమృతఫలంలా దర్శనమిచ్చాడు సంవరుణుడు. అంకపు జింకలేని ఆ అమృతాంశుని చూసీ చూడగానే తపతికి సరిజోడని తెలుస్తుంది. దేవకాంతల్ని తలదన్నే సౌందర్యం తపతిది. ఆమెకు పతి కాదగినవాడు అంతటి అందగాడే కావాలని చిలుక కోరిక. అతిలోక సౌందర్యవంతుడైన సంవరుణుడిని తపతికి తగిన వరుడిగా చిలుక గుర్తించి అతడి అందచందాల్ని ఈ విధంగా వర్ణిస్తుంది –

**ఆ సంవరణురూప మరసి జయంతుండు**
**నివ్వెఱఁగంది నిర్నిమిషుఁడయ్యె;**
**నా రాకుమారుని యాకార మీక్షించి**
**వెలవెల బాఱె నా కలువతేఁడు;**
**అక్కుంభినీజాని చక్కందనముఁ జూచి**
**విగ్రహంబుడిగెఁ బూవింటివాడు;**
**ఆ వార్ధిగంభీరు లావణ్యమును గాంచి**
**నలకూబరుఁడు చాల నలుకఁ బూనె;**

**నహహ! యీరేడులోకంబులందుఁ గలుగు**
**సకలలావణ్య రసమెల్ల సంగ్రహించి**
**గరిమ నారాజుఁ గావింపఁ గరువుగట్టి**
**చేసెఁ గాఁబోలు నేర్పుతో సృష్టికర్త !** (త.సం.ఉపా. పుట. 50)

జయంతుడు దేవత కనుక అతడికి సహజంగానే కనురెప్పవాల్చడం అనేది ఉండదు. పద్యంలో సంవరుణుడిని చూడడం చేత అతడు నిర్నిమిషుడు అయినట్లు వర్ణించాడు. మన్మథుడికి శరీరం ఉండదు కానీ సంవరుణుడి చక్కదనాన్ని చూసి మన్మథుడు శరీరాన్ని కోల్పోయాడు అని వర్ణించాడు కవి. కారణం లేకుండానే కార్యోత్పత్తి జరిగినట్లు చెప్పడంవల్ల ఇది విభవనాలకారం.[3]

---

3. *చంద్రాలోకము, పు.61*

సంవరణుడి సౌందర్య వర్ణనలో  తపతి మనసు చలిస్తుంది. దేవతలను తిరస్కరించే రూపసంపన్నుడు, దేవకాంతలను ముగ్ధుల్ని చేసే మనోహరుడు సంవరణుడు. అందుకే వేరొక కన్య అతనిని వరించకుండా చిలకతో సంవరణుడి దగ్గర తన గురించి చెప్పమని ప్రాధేయ పడుతుంది తపతి.

**ధార్మికత్వం :**

ధర్మాన్ని పాటించాలని మనసు కలిగి ఉండడమే ధర్మ తత్పరత. ఆ ధార్మిక గుణాన్ని ఆచరణలో కనబరిచేవాడే ధార్మికుడు. అలాగని ఎప్పుడో ఒకప్పుడు ధర్మాన్ని ఆచరించేవాడు ధార్మికుడు కాలేడు. మనోవాక్కాయ కర్మలలో ఎప్పుడూ ధర్మాచరణ చేసేవాడే నిజమైన ధార్మికుడనిపించుకుంటాడు.

**"ఇల భరియింప నృపాలుఁడు**
**తల యెత్తిననాఁడు మొదలు ధైర్యముతోడ**
**న్దలలెత్తిరి ఫణివల్లభ**
**కులశైల దిగంత దంతి కూర్మ కిటీంద్రుల్"**

(త.సం.ఉపా. పుట. 18)

సంవరణుడు తన ధర్మపాలన భూలోకానికి కొత్తవెలుగు ప్రసాదించాడు. అధర్మం వృద్ధి పొందినప్పుడు భూభారాన్ని తగ్గించవలసిన బాధ్యత సత్ప్రవర్తకుడైన భూపాలకుడిది. సత్వాలక లక్షణాలను, సద్ధర్మ గుణాలను సంతరించుకున్న నరేంద్రుడు సంవరణుడు. అందుకే అనంతాదులు సగర్వంగా తలలెత్తుకున్నారని అభివర్ణిస్తున్నాడు గంగాధరుడు.

శరణన్న శత్రువుని రక్షించడంలోనే కాక, జయించిన రాజ్యాలను తిరిగి వారికే అప్పగించడంలోనూ సంవరణుడి ధర్మ గుణం కన్పిస్తుంది.

ఉత్తమ నాయకుడికి ఉండవలసినది కేవలం ధైర్య సాహసాదులే కాదు కారుణ్య ఔదార్యాలు కూడా. కారుణ్య భావం కలిగినపుడే ఔదార్యగుణం ప్రకటితమౌతుంది. ఈ ఔదార్య గుణం సంవరణునిలో అడుగడుగునా కన్పిస్తుంది. వీరాతిశయంతో వైరివీరుల్ని పరాజితులను చేసినా, ఆ శత్రువలే శరణువేడితే కరుణతో కరిగిపోయే దయార్ద్ర హృదయుడు సంవరణుడు.

**"శరణని కోరివచ్చి తను సాగిలి మ్రొక్కిన వైరికోటులన్**
**గరుణను జూచి, మార్మలయు గబ్బి మహీశుల గీటడంచి, భా**

**స్వర భుజవిక్రమావృతకు, సంవరణుండయి, సంతతంబు సం**
**వరణుఁడు తత్పురీవర మవారణనేలె నతిఁప్రతాపుడై”**

(త.సం.ఉపా. పుట. 16)

అటు వీరలక్షణం, ఇటు ఔదార్యగుణం సమపాళ్లలో చోటుచేసుకున్నాయి సంవరణుడిలో వీరత్వాన్ని అహితులమీద ప్రదర్శిస్తే, ఉదారతని హితులపై ప్రకటించేవాడు సంవరణుడు.

**“కరుణారసపుఁజూపు నరుణాభమగు తూపుఁ**
**దగ హితాహితులపైఁ దగులఁ జేసి,**
**నిశితతేజస్స్ఫూర్తి విశదరాజత్కీర్తి**
**పుష్పవంతులతోడఁ బోరఁ జేసి,**
**యుచిత శిక్షారూఢి రచిత రక్షాప్రౌఢి,**
**దుష్టశిష్టులమీదఁ దొడరఁ జేసి,**
**ధీరతామహిమ యుదారతా గరిమయు**
**సురసగంబులఁ గిన్కఁ బరగఁ జేసి,**

**ధరణిఁ బాలించెఁ గీర్తి దీప్త ప్రతాప**
**భయవశాంఘ్రి సరోరుహద్వయ సమీప**
**వినమదజరఠ రవిబింబ వితతరూప**
**పరకిరీటాఢ్యరిపుఁడు సంవరణ నృపుఁడు**

(త.సం.ఉపా. పుట. 17)

వీర కరుణరసాల కలయిక కన్పిస్తోంది. సంవరుణు కరుణనను హితులమీది, తీక్షణమైన చూపు శత్రువుల మీద చూపిస్తాడు. దుష్టులను శిక్షిస్తాడు, మంచివారిని రక్షిస్తాడు అంటూ సంవరుణుడి లక్షణాల్ని కీర్తించాడు కవి ఈ పద్యంలో. ఇక్కడ భాగవతంలో నరకాసుర వధ ఘట్టంలో పోతన సత్యభామ మోముని వర్ణించిన సందర్భం గుర్తుకు వస్తుంది.

**“రాకేందు బింబమై రవిబింబమై యొప్పు నీరజాలేక్షణ నెమ్మొగంబు,**
**కందర్పకేతువై ఘనధూమ కేతువై యలరుఁ బూఁబోడి చేలాంచలంబు,**

**భావజు పరిధియై ప్రళయార్కు పరిధియై మెఱయు నాకృష్ణమై మెలంత చాప,**
**మమృత ప్రవాహమై యనలసందోహమై తనరారు నింతిసందర్శనంబు,**
**హర్షదాయియై మహారోషదాయియై, పరంగు ముద్దరాలి బాణవృష్టి,**
**హరికి నరికిం జూడ నందంద శృంగార, వీరరసము లోలి విస్తరిల్ల"[4]**

పై పద్యంలో సత్యభామ ముఖం నందనందనునికి చంద్రబింబంగానూ, నరకాసురుడికి సూర్యబింబంగానూ కన్పించింది. ఆమె ధరించిన చీర మురారికి మన్మథ జెండాగానూ, సురారికి ధూమకేతువులాగానూ కన్పించదని కవి వర్ణించాడు. ఈ పద్యం శృంగార, వీర రసాల కలయిక కన్పిస్తోంది.

**వినయ విధేయతలు**

సంవరణుడిలో వినయ విధేయతలు ప్రస్ఫుటంగా కనబడతాయి. సంవరణుడికి, ఋషులన్నా, దేవతలన్నా ఎంతో మక్కువ. రాజై రాజ్యాన్ని పాలించినా, తపతిని తలుచుకుంటూ విరహ వేదనను అనుభవిస్తూ ఉన్నా తాను నిత్యం చేసుకునే అనుష్ఠానానికి ఎప్పుడూ భంగం కల్గించలేదు. సంవరణుడికి తపతి వలన కల్గిన మోహాన్ని జయించడానికి కల్యాణ వామనమనే పురుషోత్తముని ఆలయానికి వెళ్ళినపుడు అక్కడ ఉన్న దేవతా విగ్రహాలను స్తుతిస్తాడు. భగవానుడి పాదాలు వందనీయాలని పలుకుతాడు.

**"తర్హి వన్దనీయం చరాచరగురోః పాదకమలమ్. గచ్ఛాగ్రతః"**

(త.సం. పుట. 86)

**"సమ్మూర్ఛన్మహిషాక్ష ధూపకలికాధూమ్రాః పయోరేణుభిః**
**శుభ్రాః కుఙ్కుమకేసరారుణరుచః కర్పూర చూర్ణ స్పృశః ।**
**ఆఘ్రాతా మదమఞ్జు లైరలికులైరస్మాక మధ్వక్లమం**
**లుంపన్తః శిశిరా వనాన్తమరుతో లింపన్తి నాసాపుటమ్ ॥"**

(త.సం. పుట. 87)

తపతిని చూస్తూ ఆనందిస్తున్నపుడు కూడా మహర్షులు బిగ్గరగా ఘోషిస్తున్నారని వారిని రక్షించడానికి పూనుకొంటాడు.

---

*4. భాగవతము ఐదవ సంపుటి, పు. 38*

విదూషకుడు : **అత్రాతి నికటే తపోవనే ఋషిభిరుద్ఘోషితమ్**

**అభ్యర్థితోఽహం రాక్షస భీరుణా కులపతినా తవ వయస్యోఽత్ర సన్నిహితః కర్తవ్య ఇతి. తత్ తత్రైవ గచ్ఛావః**

రాజు : **బాఢమ్. ప్రథమః కల్పః.**

(త.సం.పు. పుట. 96)

రాజుకి తన సౌఖ్యం కన్నా దేశ క్షేమమే ముఖ్యం. సంవరణుడు మహర్షులను రక్షించడమే ప్రధమ కర్తవ్యంగా భావించి వారిని ఆదుకుంటాడు.

తపతిని వివాహం చేసుకోవడానికి సూర్యారాధన చేయడం, సూర్యుడిని మెప్పించి సూర్య సుతను వివాహమాడడం, వివాహానంతరం రాజ్య భారం విడిచిపెట్టి విహరిస్తూ ఉన్న సందర్భంలో వశిష్ఠుడి ఆజ్ఞను శిరసావహించి రాజ్యానికి తరలి వెళ్ళడంలోనూ సంవరణుడికి, పెద్దల పట్ల, దేవతలపట్ల వినయ విధేయతలు తేటతెల్లమౌతాయి.

**ప్రేమమూర్తి**

కావ్య నాటకాల రెండింటిలోనూ సంవరణుడికి తపతి అంటే ఎంతో ప్రేమ. చిలుక ద్వారా తపతి గురించి తెలుసుకొన్న సంవరణుడు తపతిని మోహించి తపతి లేనిదే తానులేను అనే పరిస్థితికి వస్తాడు. తపతి రూపాన్నే పదే పదే తలుచుకుంటూ కాలం గడుపుతూవుంటాడు.

**"హా రామాతిలకంబ ! హా మదవతీ ! హా పూర్ణచచంద్రాననా!**
**హా రాజీవదళాక్షి ! హా కరటికుంభాభోగ జృంభస్తనీ?**
**హా రంజద్గుణమంజరీ ! యనుచు హాహాకారశబ్దంబుతో**
**నా రాజన్యుఁడు ధాత్రిపైఁ బొరలు నత్యంతాను తాపంబులన్"**

(త.సం.ఉపా. పు. 83)

అంటూ తీవ్రమైన విరహ వేదనను అనుభవిస్తాడు. నాటకంలో తపతి విరహ వేదనను అనుభవిస్తూ ఉండగా చూసిన సంవరణుడు ఈ విధంగా అనుకుంటాడు.

**"యన్నిమిత్తోఽ యమస్యాశ్చిత్త వికారః స చేదత్ర సన్నిహితః**
**స్యాజ్జన్మినాం ప్రాగ్రేసరః కుతః"** (త.సం.పు. 92)

తపతి విరహానికి కారణమైనవాడు ఆ పరిసర ప్రాంతాలలో వుంటే అతడే అదృష్టవంతుడని

భావిస్తాడు. అంతటి అదృష్టం తనకు దక్కలేదని బాధపడతాడు. తరువాత తపతి తననే మనసా, వాచా, కర్మణా ప్రేమిస్తోందని తెలుసుకొని మిక్కిలి ఆనందిస్తాడు.

**"శ్రుతాని శ్రోతవ్యాని. హృదయ ! నిరర్గల మిదానీమస్మిన్ జనే ప్రథమ ప్రణయ ప్రవృత్తిమ్"**

(త.సం.పు. 94)

రాక్షసి సుమనావతి అనే పేరుగల స్త్రీ రూపం ధరించి తన చెలికత్తె 'గగనమాల అనే కన్య సంవరణుడిని వరించిందని సంవరణుడు ఆమెను చేపట్టకపోతే ఆమె మరణిస్తుందని చెప్పుతుంది'. సంవరణుడు తపతిని వరించిన నేను మరొక స్త్రీని చేపడతానని చెప్పి తపతి మీద తనకున్న ప్రేమానురాగాలను వెల్లడి చేస్తాడు.

తపతి కన్పించకపోయేసరికి హిమాచలాన్ని నిందించి, తన ప్రథమ భార్య దేవి తపతిని మట్టుపెట్టిందేమోనని శంకిస్తాడు. తపతిని సూర్య భగవానుడే దాచాడని తెలుసుకొని మేనకతో ఇక క్షణకాలం కూడా తపతిని విడిచి ఉండలేనని వాపోతాడు.

**"ఇదానీం నష్టః సన్దేహః. సఖి ! మేనకే ! అహం క్షణమపి తాం వినా స్థాతు ముత్సహే. తదభ్యుపగమయ్య దేవమానీయతాం తవ సఖీ."** (త.సం.పు. 137)

తపతి ఎడబాటును సంవరణుడు క్షణకాలం కూడా భరించలేడు. తపతి కూడా అంతే. ఇద్దరిది అన్యోన్య దాంపత్యం. ఒకరిని విడిచి మరొకరు బతుకలేరు. తపతి విరహాన్ని తట్టుకోలేక మరణిస్తోందని తెలిసి సంవరణుడు కూడా మరణించడానికి సిద్ధపడతాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ తపతీ సంవరణులిద్దరూ వివాహానికి ముందు ఒకరి గురించి ఒకరు తెలుసుకొని చూసుకొని అభిలాష విప్రలంభానికి గురౌతారు. నాటకంలో తపతీ సంవరణులకు వివాహం అయ్యాక కూడా ఎడబాటు కలుగుతుంది. సూర్యుడు రాజ్య సంక్షేమం కోసం వారిద్దర్ని వేరు చేస్తాడు. ఎప్పుడైతే దూరం పెరిగిందో అప్పుడు అనురాగం మరింత పెరుగుతుంది. ఇది జగమెరిగిన సత్యం. తపతీ సంవరణులకు కలిగిన ఈ ఎడబాటే వారిని మానసికంగా మరింత దగ్గర చేసింది. ఒకరి కోసం ఒకరు తపించిపోయారు. చివరికి ఒకరి గురించి మరొకరు మరణించాలనుకొన్నారు. కావ్యంతో తపతీ సంవరణుల ప్రేమ కన్నా నాటకంలో తపతీ సంవరణుల ప్రేమ గొప్పది. అజరామరమైనది.

### 3.2.2 తపతి

కావ్య నాటకాలలో ప్రధాన నాయిక తపతి. తపతి సూర్యునికి, ఛాయకి జన్మించింది. (సూర్యుని భార్య సంజ్ఞ, సంజ్ఞ పరిచారిక ఛాయ) సూర్యుని గారాలపట్టి తపతి. సంవరుణుడి భార్య. కురుపుత్రుడి తల్లి. అపురూప సౌందర్యవతి. అతిలోక సౌందర్యం ఆమె సొంతం. భాస్కరుని తేజస్సుని పుణికి పుచ్చుకొని తపతి పుట్టింది. ప్రేమమూర్తి తపతి. తను వలచిన సంవరణుడు అంటే తపతికి ఎంతో ఇష్టం. తపతి దేవకాంత అయినా తన సఖులైన రంభ, మేనకలంటే తపతికి మక్కువ ఎక్కువ. తండ్రి పట్ల గౌరవాభిమానం కలది. దైవభక్తి తపతికి మెండు. వేదవేదాంగాలు చదువుకున్న పండితురాలు తపతి.

**సౌందర్యం**

తపతి సౌందర్యరాశి. జయంతుడు, నలకుబేరుడిని తలదన్నే సంవరుణినిచే వరించబడిన అసమాస రూపలావణ్యవతి తపతి. జగదేకసుందరి. త్రిభువనలక్ష్మి. గంగాధర కవి తపతి సౌందర్యాన్ని నఖశిఖ పర్యంతం వర్ణించి మన కళ్లముందు సాక్ష్యాత్కరింపజేశాడు. తపతిని చూసిన సంవరణుడు ఈ విధంగా వర్ణించాడు.

**హరినీలములు చాలు, నలిజాలములు డాలు**
**కడు డీలుపడఁ గప్పుఁ బడతీ కొప్పు;**
**పగడంబుల మెఱుంగు జిగికెంపుల హొరంగు**
**గెలువం బరగు ఠీవి చెలువమోవి**
**యరవిందముల యంద మలచందురుని చంద**
**మిల క్రిందఁ బడ నోము నింతిమోము**
**నెలవెన్నెలల సంచు బలుచెన్ను గల మంచు**
**నిరసించుటకుఁ గ్రొవ్వు నెలఁతనవ్వు**
**చిలుకపలుకుల నమృతంబు చిలుకుఁ బలుకు**
**మరలు తలఁపులు మరునికి మరులుకొలుపు**
**చలి వెలుఁగు కళలను మాపు వెలఁదిరూపు**
**ఘుగఘుగని వాసనల నేను పొలఁతి మేను**

(త.సం.ఉపా.పు. 79)

తపతిని చూసిన సంవరణుడు మోహపరవశానికి గురయ్యేలా తపతి కొప్పుని, మోముని, మేనుని, నవ్వుని, పలుకుని కవి వర్ణించాడు.

**అనురాగమూర్తి (లేదా) ప్రేమమూర్తి**

తపతికి సంవరణుడు అంటే ఎంతో ఇష్టం. నారదుడు తపతికి తగిన వరుడు సంవరణుడే అని చెప్పిన తర్వాత తపతి సంవరణుడిని ప్రేమించడం మొదలు పెడుతుంది. ఆకాశ మార్గంలో వెళుతూ సంవరణుడి రాజ్యమైన హస్తినాపురం రాగానే సంవరణుడిని చూడాలనే ఆశతో కిందికి చూస్తూ ఉంటుంది. సంవరుణుడే తనకు భర్తగా రావాలని తేనెటీగలు స్వీకరించని తేనెను రతీదేవికి అర్ఘ్యముగా ఇస్తానని మొక్కుకుంటుంది.

**"శృణోతు మహారాజః. మహారాజ సంగమాత్ పూర్వమేతయా భగవత్యై రతీదేవ్యై ఉపయాచితం యదార్య పుత్రేణాహం సంగంస్యే మధుకరానుచ్ఛిష్టైః కుసుమాసవైరర్ఘ్యం తే దాస్యామీతి...."**

(త.సం.పు. 116)

వివాహానికి పూర్వం సంవరణుడు విరహాన్ని తట్టుకోలేక తననే తల్చుకుంటూ మరణిస్తున్నాడని తెలిసి తపతి కూడా మరణించడానికి సిద్ధపడుతుంది.

**"హా మామేవాలప్య కథం గత ఆర్యపుత్రః ! ఆర్యపుత్ర!**
**క్షణం మాం ప్రతిపాలయ ఏషా స్మాగతా!"**

(త.సం.పు. 108)

వివాహం జరిగిన తరువాత సంవరణుడు పరలోకగతుడయ్యాడని విని తపతి కూడా మరణించాలని నిర్ణయించుకుంటుంది.

సూర్యుడు నిద్రమత్తులో ఉన్న తపతిని సంవరణుడికి తెలియకుండా తీసుకువెళ్తాడు. తన అనుమతి లేకుండా సంవరణుడికి ఎదురుపడవద్దని ఆజ్ఞాపిస్తే తపతి సంవరణుడిని ఏ విధంగానైనా సరే చూడాలని మేనక రూపం ధరించి సంవరణుడి ఎదుటికి వస్తుంది.

**"అహం హి సఖీ రూపేణార్యపుత్రం దృష్ట్వాశ్వ సిమీతి సఖ్యౌ వఞ్చయిత్వాగతాస్మి. ఇయతాపి తాతశాసనం న లఙ్ఘితం భవతి. తదార్యపుత్ర దర్శనోత్సవమనుభవిష్యామి. ఏష స వయస్యేన సహ ప్రాసాదాగ్రభూమ్యాం నిషణ్ణః తదవతిరిష్యామి తావత్"** (త.సం.పు. 135)

చిలుక ద్వారా సంవరుణుడి రూపలావణ్యం గురించి తెలుసుకున్న తపతి సంవరణుడి పట్ల వున్న అనురాగంచేత చిలుకను గురుదక్షిణగా, సంవరణుని వరదక్షిణగా ఇవ్వమని అడుగుతుంది.

**గురుదక్షిణ భావంబున**

**గురుదక్షిణ మున్నెయీయఁ గోరితి; విపు డా**

**వరదక్షిణ యిమ్మదియే**

**వరదక్షిణ మాకు మదన వాహవతంసా!**

(త.సం. ఉపా.పు.52)

సంవరుణుని అంతగా ప్రేమించింది కాబట్టే సంవరణుడు తనను ఇష్టపడటం లేదేమోనని వ్యాకులత చెందుతుంది. అతడు తన భార్య దేవి విరహంలో ఉన్నాడనుకొని వ్యధ చెందుతుంది.

**"మన్మథ ! అహో తే అవివేకః, యదప్రార్థిత మప్యేతేన మమ హృదయ మాచ్ఛిద్య దత్తమ్. చిర ప్రార్థితమ ప్యేతస్య హృదయం మమాభిముఖం కర్తుం న పారయసి. ఏష తావద్ దేవీవిరహోత్కంఠితః పరిదేవితుం ప్రవృత్తః. తత్ కిమత్రాస్మాకం ప్రయోజనమ్."**

(త.సం.పు. 104)

ప్రేమ ఎక్కడైతే ఉంటుందో అక్కడే అసూయ కూడా ఉంటుంది. రాక్షసి మారు రూపం ధరించి తన సఖి గగనమాల సంవరణుడిని ఇష్టపడుతోందని చెబితే సంవరణుడు ఆమె పట్ల ఎక్కడ అనురక్తుడు అవుతాడేమోనని తపతి చింతిస్తుంది.

తపతి సంవరణుడి పట్ల ఎంత అనురక్తురాలిగా ఉందనే విషయం సూర్యుడికి కూడా బాగా తెలుసు. అందుకే తపతి మేల్కొని వుండగా సంవరణుడిని విడిచిరాదని నిద్రిస్తున్న తపతిని సావిత్రి వద్దకు చేర్చమని సారథిని ఆజ్ఞాపిస్తాడు సూర్యభగవానుడు.

తపతి దేవతా స్త్రీ అయినా ఇసుమంత గర్వం కూడా లేకుండా భర్తను అనుసరించి మరణించడానికి కూడా సిద్ధపడిన పరమ పతివ్రత. నారీ మణులందరికీ ఆదర్శవంతం.

**స్నేహశీలి**

తపతికి తన సఖులైన రంభ, మేనకలంటే ఎంతో ప్రీతి. తన సఖులతో తన సుఖదుః ఖాలను పంచుకుంటుంది. సంవరణుడిని ప్రేమించిన సంగతి తపతి తన స్నేహితురాళ్ళైన రంభ, మేనకలతో మొదట చెబుతుంది. తపతి తను మరణించడానికి సిద్ధపడుతూ కూడా తన సఖులైన రంభ, మేనకల చివరి ఆలింగన సౌఖ్యం పొందకుండానే చనిపోతున్నానని అనుకుంటుంది.

**"తస్మిన్నేవైతద్ దుఃఖైక భాజనం శారీరహతక ముపహారం కరిష్యామి. హో అనాథాహం సఖ్యా మేనకాయా రంభాయాశ్చ పశ్చిమాలింగన సుఖమనాసాదయన్తీ విపద్యే !"**

(త.సం.పు. 92)

సఖులు మరణించడానికి సిద్ధపడుతున్నారని తెలిసి సంవరణుడిని రక్షించమని కోరుతుంది. వారు బ్రతికే వున్నారని తెలిసి వారిని దగ్గర తీసుకుని ఆనందిస్తుంది.

నాయికా : **హాధికీ సఖ్యౌ విపద్యేతే! త్వరతాం త్వరతా మార్యపుత్రః**

రాజా : **(సంభ్ర మముపసర్పన్) మా సాహసం కురుతయత్ర భవత్యౌ ఏతావావాం ధియావహే! (నిష్క్రమ్య తాభ్యాంసహ ప్రవిశ్య) ప్రియే ఏతే తే కుశలిన్యౌ సఖ్యౌ.**

నాయికా : **సఖ్యాం దృఢం మాం పరిష్వజేథామ్"** (త.సం. పు. 140)

తపతి మహారాణి అయినా తన సఖులైన రంభ, మేనకలను తన సొంత తోబుట్టువుల వలె చూసుకుంటుంది. వారికి ఆపద కలిగితే తనకే ఆపద కలిగినట్టు భావిస్తుంది.

**పాండిత్యం**

చిలుక తపతిని సకల కళా వైచిత్రినిగా పేర్కొంది తపతి దగ్గరే చిలుక వేదవేదాంగాలు నేర్చుకొంది. తను నేర్చుకొన్న విద్యలను ఆకళింపు చేసుకొని చిలుక చాకచక్యంతో వ్యవహరించి తపతీ సంవరణుల మధ్య అనురాగాన్ని నెలకొల్పింది. తపతికి వేదాలు, వేదాంగాలు, భాష్యాలు, మీమాంసలు కరతలామలకం. చిలుక తపతి వైదుష్యాన్ని, తను నేర్చిన విద్యలను సంవరణుడికి ఏకరువు పెట్టి ఈ విధంగా అంటుంది.

**వాచా వధూ విడంబిని**
**యాచారు కటీరథాంగ యా సకలకళా**

వైచిత్రిని గావున నా
కాచార్యత్వము వహించె నయ్య మహీంద్రా !

అఱంగములతోఁడ బారంగతంబుగా
  నిగమముల్ నరహస్యముగను జదివి,
కావ్యజాలము లలంకార మిశ్రంబుగాఁ
  గరతలామలకంబుగా నొనర్చి,
భాషఫక్కిన పార పాతంజల జలంబు
  లాలాజలంబుగా లీలఁ గ్రోలి
మీమాంస లేకుండ మీమాంసయుఁ బఠించి
  బ్రహ్మ సాక్షాత్కార భావమంది

పేరు బలమునఁ దత్వవిచార గరిమ
శుకమహాద్విజ ముఖ్యుతో సూడువట్టి
యున్న నాకిఁక నితరాంధ్రయుక్తి యెంత?
హస్తిపదమున నడఁగవే యడుగు లెల్ల !"

(త.సం.ఉపా.పు. 31)

ఈ విధంగా చిలుక తను నేర్చిన విద్యలన్నీ తపతి దగ్గరే నేర్చుకున్నానని చెబుతుంది. గురువు గొప్పదనం శిష్యుడి ప్రతిభను బట్టి తెలుస్తుంది. చిలుక ప్రతిభను బట్టి తపతి పాండిత్యం మనకు అర్థమౌతుంది. రూపలావణ్యాలలోనే కాదు, పాండిత్యంలో కూడా తపతి మేటైన ధీటైన స్త్రీ.

**సచ్ఛీలత**

కావ్య నాటకాలలో తపతి తాను ఎంతగా సంవరుణుడిని ప్రేమించినప్పటికీ తండ్రి అనుమతి లేకుండా సంవరణుడిని వివాహం చేసుకోలేదు. సంవరణుడు గాంధర్వ వివాహం చేసుకుందామన్నప్పుడు సంవరుణుడుతో ఇలా చెబుతుంది.

అనుడుఁ దపతి పలికె నర్కుండు మా తండ్రి;
యతని యాజ్ఞ మీఱ నడుగెఁడైన;
నాకుమఱుఁగు పిందెనైన నాకేరీతి
నిను వరింపనగును నిర్మలాత్మ?

(త.సం.ఉపా.పు. 85)

తన తండ్రి అర్కుని ఆజ్ఞ లేకుండా వివాహం చేసుకోలేను అంటుంది. తపతి విరహ వేదనను అనుభవిస్తున్న సమయంలో కూడా సూర్యోపాసనకు సమయమైనపుడు సూర్యారాధన మానదు.

**("సహ సఖీభ్యాం నిష్క్రాన్తా) కథమీదృశమవ స్థాన్తరం తాతస్య దర్శయామి కథం వానంగ శారపీతసారై రంగైర్గస్తుం పారయామి"** (త.సం.పు. 95)

సూర్యుడి అనుమతి లేకుండా తపతి తన భర్తకు నిజరూపంలో కనపడరాదని నియమం. కానీ తపతి తన భర్త మీద ప్రేమవల్ల నిజరూపంలో కన్పిస్తుంది. తిరిగి తండి ఆజ్ఞ గుర్తుకు వచ్చి భర్తను వదలి వెళ్లడానికి కూడా సిద్ధపడుతుంది. తపతికి తండ్రి పట్ల ఎంతో భక్తి శ్రద్ధలున్నాయి.

తపతి ధర్మ వర్తనురాలు. ప్రణయంలోనే కాక ప్రజారక్షణలోను పతికి తనవంతు సహకారాన్ని అందించింది. సంవరణుడిని కర్తవ్యోన్ముఖుడిని చెయ్యడానికి వశిష్ఠ, సూర్య ఆజ్ఞలను శిరసా వహించింది. ధర్మాచరణలో పతిని అనుసరించి ప్రజారక్షణ భారాన్ని వహించి సామ్రాజ్ఞిగా చిరకీర్తిని ఆర్జించింది. వంశాన్ని నిలబెట్టడానికి సత్పుత్రుడికి జన్మను ఇచ్చింది. కౌరవ వంశానికి మూలపురుషుడైన కురువును కన్న పవిత్రమూర్తులు కావడంవల్ల తపతీ సంవరణుల గాథ మహాభారతంలో ఉపాఖ్యానంగానూ, తెలుగు సాహిత్యంలో ఉత్తమ ప్రబంధంగాను వెలిసింది.

కావ్యనాటకాలలో తపతి పాత్రను పరిశీలించినట్లయితే కావ్యంలో కన్నా నాటకంలో తపతి పాత్ర ఉదాత్తంగా చిత్రింపబడింది. కావ్యంలో తపతి చిలుక మాటల ద్వారా సంవరణుడి రూపరేఖలను, శౌర్య ధైర్య పరాక్రమాల గురించి తెలుసుకొని అతడి పట్ల ఆకర్షితురాలౌతుంది. కానీ నాటకంలో సంవరణుడే తపతికి తగిన వరుడు అని నారద మహర్షి చెప్పగానే తపతి సంవరణుడిని ఇష్టపడడం మొదలుపడుతుంది. ఆ క్షణంలో తపతి అతడి అందచందాలను గురించి కానీ, పరాక్రమం గురించి కానీ ఆలోచించదు. నాటకంలో తపతి సంవరణుడి గురించి మరణించడానికి కూడా సిద్ధపడుతుంది. మరణంలో కూడా సంవరణుడిని విడిచిపెట్టదు.

కావ్య నాటకాలలో తపతి తండ్రి ఆజ్ఞతోనే వివాహం చేసుకుంటుంది. కానీ నాటకంలో తండ్రి ఆజ్ఞ, రాజ్యక్షేమం కోసం సంవరణుడికి దూరంగా ఉండి తన కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది. నాటకంలో తపతి సఖుల కోసం కూడా మరణించడానికి సిద్ధపడుతుంది. కావ్యంలో తపతి అతిలోక సౌందర్యంతోనూ, పాండితీ ప్రకర్షతోనూ ఉంటే నాటకంలో భర్త, తండ్రి, సఖుల పట్ల అత్యంత ప్రేమాభిమానాలు గల వ్యక్తిగా ఉండి, రాజ్యక్షేమం కోసం, తండ్రి ఆజ్ఞను అనుసరించి కొంతకాలం భర్తతో వియోగాన్ని కూడా భరిస్తుంది.

**3.2.3 చిలుక (పాత్ర చిత్రణ) :**

చిలుక తపతి పెంపుడు చిలుక. గంగాధర కవి స్వకల్పన. గంగాధరుడు నైషధ కథకు ప్రభావితుడై తన ప్రబంధంలో చిలుక పాత్రకు అంకురార్పణ చేశాడు. దీనికి ఉదాహరణగా

**"ఆయవనీశుఁడీకరణి నంగభవానలబాధ్యమానుఁడై**
**హాయని వెచ్చ నూర్చు, నకటా ! యని దైవము దూఱుఁ బచ్చపు**
**ల్గాయెద నడ్డమైనఁ దనయర్మిలిదూత యటంచుఁ గాయొపం**
**డోమని కార్యపద్ధతుల నొయ్యన వేడును భ్రాంతచిత్తుఁడై"**

(త.సం.ఉపా.పు.43)

**"నలదమయంతు లిద్దఱు మనఃప్రభవానల బాధ్యమానులై**
**సలిపిరి దీర్ఘవాసర నిశల్ విలసన్నవనందనంబులన్**
**నలినదళంబులన్ మృదుమృణాళములన్ ఘనసారపాంసులం**
**దలిరుల శయ్యలన్ సలిలధారలఁ జందనచారుచర్చలన్".**[5]

"గంగాధరుడు ప్రణయ దౌత్యమునకు బ్రహ్మావాహనమైన హంసకంటె మదన వాహనమైన చిలుకయే యోగ్యమని నిర్ణయించుకొనెను. తపతీ సంవరణుల సంయోగమును తానైపూని సాధించుటకు ఈ చిలుకకు ఎంతో నైపుణ్యము అవసరము. గంగాధరుడట్టి నైపుణ్యమును చిలుకయందు నిక్షేపించినాడు"[6].

ప్రభావతీ ప్రద్యుమ్నములో చిలుక ఒట్టి బేల. శుచిముఖి అనే బిరుదు వహించిన హంస రాజకీయములలో రాణించినంతగా ప్రణయ దౌత్యమున రాణించలేదు గంగాధరుని చిలుక అచ్చంగా ప్రణయదూత. ఒంటరిగా కార్యమును సాధించిన మేటి. నైషధహంసకంటే శుచిముఖికిది పై చేయియే కాని గంగాధరుని చిలుకముందు అది నిలువలేదు. కార్యాన్ని సాధించడానికి ఇంద్రాదులు దానికి సహకరించారు. విశేషించి అది బ్రహ్మకు వాహనమైన సారంగధరుడనే హంస యొక్క కూతురు. స్వయంగా భారతీదేవిచే పెంచబడినది. ఆమె దగ్గర విద్యనేర్చి బిరుదు పొందింది. గంగాధరుని చిలుకకు ఈ ప్రత్యేకతలు లేవు. ఈ చిలుక ముందుగా పుట్టినదైనా శుచిముఖియే ముందుగా తెలుగువారికి యెఱుకకువచ్చి వారిని మురిపించి యీ చిలుకను మరపించినది. ఇప్పుడే చిలుక

---

5. *శ్రీమదాంధ్ర మహాభారతము, పు. 176*
6. *తపతీ సంవరణోపాఖ్యానము, పీఠిక. పు.* XLIII

వెలుగులోనికి వచ్చినది. నిపుణంగా తిలకించండని పాటిబండ మాధవశర్మ గారు తపతీ సంవరణము పీఠికలో పేర్కొన్నారు.

చిలుక నాయికా, నాయకుల మధ్య ప్రణయ రాయబారం నడిపి వారికి పరస్పరం అనురాగం చేకూర్చి వారి వివాహానికి కారణమౌతుంది.

గంగాధరుని చిలుక సామాన్యమైనది కాదు వేద వేదాంగాలు, పెక్కు కావ్యాలు, వివిధ భాష్యాలు, మీమాంసలు నేర్చిన పలుకుల జాణ. చిలుకను చూసి సంవరణుడు ముచ్చటపడి ఈ విధంగా మెచ్చుకున్నాడు –

**కలిగెఁబో మన కేలికసకపంజర శారి**
**కలకెల్లఁ జదివింపఁ గడఁగు నొజ్జ;**
**యబ్బెబో మన రాజహంస మండలి కెల్లఁ**
**గవనముల్ వినిపించు కవివరుండు;**
**చేరెఁబో మన ప్రోఢి చిలుక బోదియలకు**
**గానవైఖరి నేర్పు గాయకుండు;**
**దొరకెఁబో మన గృహాంతర మయూరములకు**
**నాట్యంబు శిక్షించు నట విభుండు;**
**మన భవన నర్మవిపిన సీమంబులందు**
**వితత మధుర ఫలంబుల విట్టవీఁగి**
**చాల సంపన్న గార్హస్థ్య లీల నున్న**
**యాప్రమ సాలాది తరువుల కమరె నతిథి**

(త.సం.ఉపా.పు. 26)

**కార్యదక్షత**

చిలుక తన గురువైన తపతికి వివాహం చేయడానికి తగిన వరుడికోసం అనేక దేశాలు తిరిగింది. భూమినంతా గాలించింది. సంవరుణుడే తపతికి తగిన వరుడని నిర్ణయించుకుంటుంది.

నవ్వుని, రూపుని, పలుకుని తలచుకొని తపతిని వరించినప్పుడే సంవరణ నామధేయం సఫలమౌతుందనుకుంటాడు. సకల లావణ్య గుణాలతో బ్రహ్మ తపతిని సృష్టించాడు. మరొక స్త్రీని సృష్టించాలంటే బ్రహ్మ వల్ల కాలేదంటాడు గంగాధరకవి.

చిలుక తపతిని కమల ముఖిగా, కలకంఠకంఠిగా వర్ణించి తపతిని వివాహం చేసుకోమని సంవరణుడిని ప్రేరేపిస్తుంది. తపతి గుణగణాలు విన్న సంవరుణుడు తపతిని నన్ను వరిస్తుందా అని సందేహిస్తూ ఈ విధంగా అంటాడు.

**మనసారఁ గలిగి యా ఘనసార వాసన**

**యధరామృతము గ్రోల నబ్బునొక్కొ !**

**చేతులారంగ నా శీతాంశుముఖి గబ్బి**

**గుబ్బలు గబళింపఁ గూడునొక్కొ !**

**కన్నులారంగ నా కలకంఠి సౌందర్య**

**గరిమంబు వీక్షింప దొరకునొక్కొ !**

**వీనులారంగ నా వికచతామరసాక్షి**

**పలుకు లాలింపంగఁ గలుగునొక్కొ !**

**యకట యేరీతి నాదు కోరిక ఫలించు?**

**నెట్లు దరియింతు సతిలజ్జ నేమిసేతు?**

**నెవ్విధంబున నిర్జింతు నించువిలుతుఁ?**

**బల్లవాధరి చూపుల ప్రాపులేక.**

(త.సం.ఉపా.పు. 34)

సంవరణుడు తపతిని ఒక సారి చూడాలని, ఆమెతో మాట్లాడాలని పరితపిస్తాడు. తపతి లేకపోతే తాను ఏ విధంగా బతకాలని ఆలోచిస్తాడు.

**కేరళ కొంకణ ద్రవిడ కేకయ కోసల లాట చోళ గాం**

**ధార కళింగముఖ్య జననాథ వరేణ్యుల నెల్లఁ జూచి యా**

**వారిధి మేదినీతల మవారణమైఁ బరికించి వచ్చియుం**

**గోరిక పారమందక వికుంఠిత చిత్తుఁడనైతి భూవరా !**

(త.సం.ఉపా.పు.32)

తను చేసే పనిలో అలు పెరుగక నిరంతరం శ్రమించి చిలుక ఒక తండ్రి తన కూతురికి ఎటువంటి సంబంధాన్ని తీసుకువస్తాడో ఆ విధంగా చిలుక కూడా తపతికి అటువంటి సంబంధాన్నే తీసుకువచ్చింది.

**రాయబార దక్షత**

చిలుక రాజు మణి బంధంపై వాలి తన అందచందాలతో రాజుని ఆకర్షిస్తుంది. రాజుని దర్శించడం తన పూర్వజన్మ సుకృతం అంటుంది. మీరు అనుమతిస్తే నా వృత్తాంతం మీకు వినిపిస్తానని తపతి తండ్రి సూర్య భగవానుడి ప్రాభవాన్ని విశదపరుస్తుంది. తపతిని నఖశిఖ పర్యంతం వర్ణించి తపతి సౌందర్యాన్ని కొనియాడుతుంది.

**"సారస సంభవుండఖిల సర్గనిమిత్తము గూర్చియున్న శృం**
**గార రసంబు నెల్లనిడి కౌతుక మెప్పుఁగ నీ తలోదరిం**
**గా రచియించి యొండొక సుగంధి సృజింపఁగలేమిఁ జుట్టుఁ జే**
**బారలు వెట్టుఁ బిమ్మటను బశ్చిమ బుద్ధులుగారె బ్రాహ్మణుల్"**

(త.సం.ఉపా.పు.27)

బ్రహ్మ సృష్టికోసం సేకరించిన శృంగారమంతా ఉపయోగించి బ్రహ్మ తపతిని సృష్టించాడు. వేరొక సుందరిని సృష్టించలేక చేతులు చాపుకొన్నాడని చిలుక సంవరణుడితో చెబుతుంది. బ్రాహ్మణులు పశ్చిమ బుద్ధులు. బ్రహ్మ బ్రాహ్మణుడే కదా? అందుకే చేతకాని వాడైనాడని సమర్థిస్తున్నాడు గంగా ధరుడు. "సామాన్య విషయంతో విశేష విషయంగాని, విశేష విషయంలో సామాన్య విషయంగాని సమర్థించబడితే అది అర్థాంతరన్యాసం".[7] లోకంలో తపతి వంటి సౌందర్యవతి లేదనే విషయాన్ని అర్థాంతరన్యాసాలంకారంలో చెప్పాడు కవి. చక్కదనంలో తపతికి సాటైన స్త్రీ లేదని, సౌందర్యంలోనే కాదు సకల కళలలోనూ ఆరితేరిన వనిత తపతి అని నాకు భాష్యాలు, మీమాంసలు, కావ్యాలు, వేదాలు, వేదాంగాలు నేర్పిన గురువు తపతి అని తపతి వైదుష్యాన్ని వివరిస్తుంది. చిలుక తపతి గుణగణాలు సంవరణుని దగ్గర చెప్పి అతనిని విరహానికి గురిచేస్తుంది. సంవరణుడికి తపతి మీద మోహం కలిగి తపతినే తలుచుకుంటూ ఉంటాడు.

**"ఆ మోహనాంగి పరిరం**
**భామృత పానైక సౌఖ్య మబ్బక యున్నన్,**
**గామించి కన్నులారం**
**గోమలి లావణ్యరసము గ్రోలిన జాలున్".**

(త.సం.ఉపా.పు.36)

---

*7. చంద్రాలోకము, పు.93*

అంటూ విరహాన్ని అనుభవిస్తాడు. అంత అద్భుత సౌందర్యవతి, దేవతా స్త్రీ అయిన తపతి తనకు దక్కుతుందో లేదోనని బాధ పడుతూ వుంటే సంవరణుడిని చిలుక ఓదారుస్తుంది.

**"అమరకన్యక పొందు మర్త్యుల కబ్బనేర్చునె యంచుఁ జి**
**త్తమున నెంతయు సంశయింపకు; దైవయోగమె కారణం**
**బమలరూపగుణాఢ్య; యల్లదె యంతరిక్షము మీఁది చం**
**ద్రమునకున్ భువిఁ గల్వ కెంతటి దవ్వు చూడు మహీపతీ!"**

(త.సం.ఉపా.పు.37)

దేవకన్య అయిన తపతి నిన్ను వివాహం చేసుకుంటుందా అని సందేహించకు ఎక్కడో అంతరిక్షంలో వున్న చంద్రుడికి భూమిపై ఉన్న కలువకు ఎలా స్నేహం కుదిరిందో అలాగే నువ్వుకూడా ఆమెను వివాహం చేసుకోవడానికి అర్హుడవే అని సంవరుణుడికి ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తుంది.

**"పూవును దావియుఁ గూడిన**
**కైవడి నప్పువ్వుఁబోఁడి కౌఁగిఁటిలోనన్**
**నీవున్న నజుని సృజన**
**ప్రావీణ్య మగణ్యమగు ధరాతలనాథా!"**

(త.సం.ఉపా.పు.38)

పువ్వు తొడిమను కూడిన విధంగా నువ్వు తపతిని కూడి ఉన్నప్పుడే బ్రహ్మదేవుడి సృష్టికి అర్థమంటూ ఏర్పడుతుంది అంటుంది. చిలుక తపతికి తగిన వరుడు సంవరుణుడే అనే నమ్మకాన్ని సంవరుణుడికి కలిగించి నాయికా నాయికలకు వివాహం చేసే పనిలో కొంత వరకూ కృతకృత్యురాలైంది.

చిలుక తపతి దగ్గరికి కూడా వెళ్ళి ఎన్నో దేశాలు పట్టణాలు తిరిగి సంవరణుడు అనే రాకుమారుడిని చూశానని అతని రూపురేఖలను తపతి దగ్గర ఈ విధంగా వర్ణిస్తుంది.

**"ఆ చతురత, యా చెవువం**
**బాచల్లదనంబు, నాఘునౌదర్యకళా**
**వైచిత్రియు ధరణింగల**
**రాచకుమారులకుఁ గలదె రాకేందుముఖీ !"**

(త.సం.ఉపా.పు. 51)

సంవరణుడికి గల చతురత, ధైర్యం, ఔదార్యం, కళావైచిత్రి తక్కిన రాజులకు లేవు. సంవరణుడే నీకు అన్ని విధాలా తగిన వరుడని నిశ్చయంగా చెబుతుంది.

తపతి కూడా సంవరణుడిని ప్రేమించడం మొదలుపెట్టి మరి నా గురించి సంవరణుడికి చెప్పావా అని అడుగుతుంది. నీకు విద్య నేర్పిన కారణంగా ఇస్తానన్న గురుదక్షిణ, వరదక్షిణ రూపంలో ఇవ్వని అడుగుతుంది. తపతి కూడా విరహానికి గురి అవుతుంది. ఈ విధంగా చిలుక నాయికా నాయకుల మధ్య అనురాగాన్ని నెలకొల్పి వారి వివాహానికి నాంది పలికింది.

**3.2.4 వశిష్ఠుడు :**

వశిష్ఠ మహర్షి బ్రహ్మపుత్రుడు, అరుంధతి భర్త, సంవరుణుడి పురోహితుడు. చిలుక నాయికా నాయకులకు పరస్పర అనురాగాన్ని నెలకొల్పింది. కానీ వారి వివాహానికి కారకుడు వశిష్ఠుడు. తపతికోసం సంవరణుడు చేస్తున్న తపస్సునుండి అతనిని మరల్చి ఉపశమనం కలిగించాడు వశిష్ఠుడు. వశిష్ఠుడిని సంవరుణుడు సహాయం అడగకుండానే వెళ్ళి ఆదుకున్నాడు. బాధ్యత అంతా తన మీద వేసుకుని తపతీ సంవరణుల వివాహాన్ని దగ్గరుండి జరిపించాడు.

**"నెమ్మదిఁ గుంద నేమిటికి? నెమ్మది నుండుము వత్స! యిట్టి కా**
**ర్యమ్ములు సంఘటించుట మహాగహనంబులె మాకు? మ్రానిపూఁ**
**గొమ్మను దెచ్చి యిచ్చుగతిఁ గోమలయౌవన మోహనాంగినిం**
**గమ్మని పువ్వుఁబోఁడి రవికన్యకఁ దెచ్చెద నీకు నిచ్చెదన్"**

(త.సం.ఉపా.పు.90)

అనవసరంగా బాధపడతావెందుకు? ప్రశాంతంగా ఉండు. ఇలాంటి పనులు మాకు చాలా సులభం. చాలా సునాయాసంగా రవి పుత్రికను తెచ్చి నీకిస్తానని ధైర్యం చెప్తాడు. సంవరణుడిని వశిష్ఠుడు వత్స అని సంబోధించడంవల్ల వశిష్ఠుడికి సంవరణుడిపై గల ప్రేమాభిమానం వ్యక్తమౌతోంది.

**"అనుడు నృపవరేణ్య ! యా సకలంబు నీ**
**మనసులోని మమత మాకుఁ దెలిసె;**
**నింతమాత్రమునకు నీ తపం బేటికి?**
**గోటనైన పనికి గొడ్డ లేల?"**

(త.సం.ఉపా.పు.90)

గోటితో అయ్యేపనికి గొడ్డలి ఎందుకు? ఇంత మాత్రానికే తపస్సు ఎందుకు చేశావు? నేను వెళ్ళి నీ వివాహం నిశ్చయం చేసుకు వస్తానని భరోసా ఇస్తాడు. వశిష్ఠుడు తపతిని అడగడానికి వెళ్ళినప్పుడు ఆదిత్యుని దగ్గర అతిథి మర్యాదలన్నీ పొంది గౌరవింపబడతాడు.

**"సేమమే మునినాథ మీకును? సీమలోక నవిఘ్నుమై**
**నేమమెంతయుఁ జాఁగివచ్చునె నిచ్చలున్? భవదాగమ**
**శ్రీమహత్త్వము నన్నుఁ బావనుఁ జేయనో ! మఱియాత్మలోఁ**
**గామితం బొకఁ డెద్దియేనియుఁ గల్గెనో! యెఱిఁగింపవే"**

(త.సం.ఉపా.పు. 91)

అర్కుడు వశిష్ఠుడికి అతిథి మర్యాదలతో పాటుగా గజతురగాది, వాహన వస్తు సముదాయాలతో పాటు తన కుమార్తెను వశిష్ఠుడికి అప్పగిస్తాడు. తపతిని తీసుకువచ్చి సంవరణుడికి ఇచ్చి అత్యంత వైభవంగా వివాహం జరిపించాడు వశిష్ఠుడు.

బ్రహ్మముడి వేయడంతోనే తన పని అయిపోయిందని వశిష్ఠుడు చేతులు దులుపుకోలేదు సంవరణుడు తపతితో కాలం గడుపుతూ రాజ్యాన్ని, ప్రజలను విస్మరించినప్పుడు తగిన హితబోధ చేస్తాడు.

**"అనుచు నవ్విధమున నబ్జాక్షితోఁ గూడి**
**నృపతి యామలయాచలేంద్ర మందు**
**విషయాభిలాషుఁడై పెక్కు వర్షములుండి**
**ధారుణి పాలింపఁ దలంపఁడయ్యె;**
**నది కారణంబుగా నఖిలలోకములకుఁ**
**దొడరె ననావృష్టి దోషమంత**
**నట్లతిబాధచే హాహాస్వనంబుతో**
**భువనసంక్షోభంబు పుట్టెమిగుల;**
**బంటలును బాఁడితోడ లేబరములయ్యె;**
**నపు డరుంధతి వల్లభుఁ డరుగుదెంచి**
**రాజునకు బుద్ధిచెప్పి సామ్రాజ్యవహన**
**సహనుగాఁ జేసి కావించె శాంత విదులు"**

(త.సం.ఉపా.పు. 102-103)

రాజుకి కర్తవ్యబోధ చేసి రాజ్యానికి శ్రేయస్సుని చేకూర్చాడు వశిష్ఠుడు. తను అన్నమాట నిలబెట్టుకొని తపతిని తీసుకువచ్చి సంబరణుడికిచ్చి వివాహం చేయడమే కాకుండా సంవరణుడు రాజ్యాన్ని విస్మరించినపుడు ఒక తండ్రిగా అతడికి కర్తవ్యాన్ని గుర్తు చేస్తాడు.

**"పురైషా తపనవనే గర్భ భరణానన్తర మాత్మ ప్రభా వాదాత్మజ మిమం ప్రసూతవతీ."**

(త.సం.పు. 146)

**"తతః సురైరవధ్యా నామసురణాం నిగ్రహోర్థమస్య తేజోబల శరీర వర్ధనైరభౌమైరాహారైః పోషణార్ధం చానాధిగత పుత్ర విరహవేదనయో రేవ యువయోః సూర్యశాసనాత్ ప్రసవసమయ ఏవ విమోహ్యైనాం రమ్భయా గూఢమేవ సావిత్రీ సకాశం నీతః. తదే వానయా స్వప్న దర్శన మివానుభూతమ్."**

**"అవసిత సురకార్య మిమద్యాత్మ సమేపే వర్తమానం మయా సహ ప్రహిత వానహిమ భానుః."** (త.సం.పు. 146)

దేవతలకు కూడా వధించడం సాధ్యం కాని రాక్షసులను చంపడానికి కావలసిన శరీరాన్ని దివ్య ఆహారాలతో పోషించడానికి, పుత్ర వియోగ దుఃఖం తపతీ సంవరణులకు కలుగకుండా చేయడానికి, సూర్యుని ఆజ్ఞను అనుసరించి ప్రసూతి సమయంలో తపతిని మోహపెట్టి రహస్యంగా రంభ కురుపుత్రుణ్ణి సావిత్రి వద్దకు తీసుకువెళ్ళిందని తపతీ సంవరుణులకు కుమారుడు కలిగిన వృత్తాంతాన్ని వశిష్ఠుడు తపతీ సంవరుణులకి తెలియజేశాడు. దేవతల కార్యం సఫలమైనందున నీ కుమారుడిని నాతో నీ దగ్గరకు పంపించారని సంవరుణుడికి పుత్రుడిని అప్పగిస్తాడు. కావ్యంలో సంవరుణుడి రాజ్యంలో క్షామం సంభవించినప్పుడు సంవరుణుడిని వశిష్ఠుడు రాజ్యానికి తీసుకువస్తాడు. నాటకంలో అమాత్యుడు సంవరుణుడిని రాజ్యానికి తీసుకువస్తాడు.

వివాహం చేసి, కర్తవ్యాన్ని తెలిపి, పుత్ర సౌఖ్యం కల్గించి సంవరణుడ్ని ఋణగ్రస్తుడిని చేశాడు వశిష్ఠుడు.

కావ్యంలో కంటే నాటకంలో వశిష్ఠుడి పాత్రకు నిడివి ఎక్కువ. నాటక రచయిత వశిష్ఠుడికి మరొక పనిని కూడా అప్పగించాడు. తపతీ సంవరణులకు తమకొక పుత్రుడున్నాడన్న విషయం వశిష్ఠుడు చెప్పేవరకు వాళ్ళకు కూడా తెలియదు. వశిష్ఠుడే సంవరుణుడి కుమాడైన కురుపుత్రుణ్ని సంవరణుడికి అప్పగించాడు.

### 3.2.5 అరుంధతి

భారతకథలో లేని అరుంధతి పాత్ర ప్రబంధంలో కన్పడుతుంది. భారతంలో తపతిని అడగడానికి వశిష్ఠుడొక్కడే సూర్యలోకం వెళ్తాడు. గంగాధర కవికి ఇది సమంజసంగా కనబడలేదు కాబోలు అందుకే అరుంధతిని తోడుగా పంపాడు. వివాహాది శుభకార్యాలను భార్య పక్కన ఉండగానే చెయ్యాలి. పైగా ఆడవాళ్ళు మాట్లాడినంత చాకచక్యంగా పురుషులు మాట్లాడలేరు.

**"జామాసమేతుఁడగు న**
**మ్మాయాతీతునకుఁ గృతనమస్కారుండై**
**ఛాయాపతి తత్కృతనిర**
**పాయాశీర్వచన ధన్యుఁడై యిట్లనియెన్"** (త.సం.ఉపా.పు.91)

సతీ సమేతుడైన వశిష్ఠునికి నమస్కరించి, ఆశీర్వాదాలందుకున్నాడు ఆదిత్యుడు. పతితో అరుణమండలం చేరిన అరుంధతిదేవి అక్కడ ఏమీ మాట్లాడకపోయినా ఆమె రాక సూర్యునికి కొండంత బలాన్ని ఇచ్చింది. తపతికి తల్లిదండ్రులు మీరేనని తపతిని వారికి అప్పగిస్తాడు. సూర్యుని మాట అరుంధతి వశిష్ఠులు వమ్ము చెయ్యలేదు. తపతి తమకి కూతురు అయితే సంవరణుని అల్లునిగా భావించారు. వశిష్ఠుడు తన అల్లునికి అరణాలు ఇచ్చి తన బాధ్యత నెరవేర్చుకున్నాడు. కానీ అరుంధతి తనకు అప్పగించిన బాధ్యతని అంత తేలికగా తీసుకోలేకపోయింది. అందుకే తల్లిలా దగ్గరుండి తపతిని అలంకరించింది.

**"మూర్త భవనాది దేవతామూర్తి వోలె**
**సతి యరుంధతి బహుపతివ్రతలతోడ**
**నవ్య కర్పూర నీరాజనము లొసఁగె**
**నల్లనల్లన గారాపుటల్లునకును".** (త.సం.ఉపా.పు.97)

ఈ విధంగా అరుంధతి అల్లుడి దగ్గర వుండి నీరాజనాలు ఇచ్చి కల్యాణానికి తీసుకువచ్చింది. వారి వివాహం దగ్గరుండి నిర్విఘ్నంగా జరిపింది.

వివాహానంతరం వధూవరులు అరుంధతీ నక్షత్రం దర్శించడం సంప్రదాయం. కానీ గంగాధరుడు తపతీ సంవరుణులకు అరుంధతి చేతనే కళ్యాణం జరిపించి, ప్రత్యక్షంగా ఆ సాధ్వీచేత ఆశీర్వచనాలను ఇప్పించాడు. ఇక వారి దాంపత్యానికి ఆటంకమే లేదని కవి సూచించాడు.

నాటకంలో అరుంధతి పాత్ర లేదు. కావ్యంలో అరుంధతి పాత్ర ఉదాత్తంగా చిత్రించబడింది. తపతీ సంవరణుల వివాహానికి పెద్ద ముత్తైదువ అయ్యింది అరుంధతి.

### 3.2.6 సూర్యుడు

సూర్యుడు కశ్యప ప్రజాపతికి, అదితిలకి జన్మించాడు. తపతికి తండ్రి. సంవరుణుడికి పిల్లనిచ్చిన మామ.

**"బంగారు మయమైన బ్రహ్మాండ భాండంబు**
**మెఱుఁగిడు నెవ్వాని మేనిఛాయ,**
**ఘర్మభూధర శృంగభాగంబు నొరవెట్టు**
**బ్రతిదినం బెవ్వాని రథపథంబు,**
**ముకుళితాంబుజ బద్ధముఖరాశి మోక్ష జా**
**తోత్సవం బెవ్వాని యుదయవేళ,**
**గ్రహచిత్రితాకాశరంగవల్లికఁ ద్రొక్కు**
**సివ సత్తులెవ్వాని శితకరములు.**

**రజని దినములు మేర లేర్పఱుప సమతఁ**
**గడుఁగు నెవ్వాని సూతుఁ, డగ్గనమణికిఁ**
**దపతి యనఁగల యువతి రత్నము జనించె**
**రత్నమునఁ బుట్టు నొండొక రత్నమనఁగ"** (త.సం.ఉపా.పు.27)

బ్రహ్మాండమంతా ఎవరి వెలుగు ప్రసరిస్తుందో, రాత్రి పగలు ఏర్పడడానికి కారణమైనవాడు, గ్రహాలలో ఒక్కడైన వాడు అని సూర్యుని గొప్పతనాన్ని చిలుక ద్వారా చెప్పించాడు గంగాధరుడు. ఎంత గొప్పవాడైనా తన కూతురికి తండ్రే. తండ్రిగా తన బాధ్యత నెరవేర్చుకోవలసి వుంటుంది. అందుకే తపతి చిన్నప్పుడే తపనుడు తన తనయకు తగిన వరుడెవ్వరని నారద మహర్షిని అడుగుతాడు.

**"సఖి ! పూర్వం కదాచిత్ ప్రియ సఖాం తపతీ ముత్సఙ్గె కృత్వోపవిష్టేన కోఽస్యానురూపో వర ఇతి నారద మహర్షిణా పర్యనుక్తేన భగవతా భానుమాలినా భణితం కోహ్యద్య త్రైలోక్యే రాజర్షిం సంవరణం ముక్త్వాస్యా అనురూపోఽన్య ఇతి."** (త.సం.పు.81)

తపతి యుక్త వయస్సు వచ్చిన తరువాత వశిష్ఠుడు సూర్యుని దగ్గరకు వచ్చి సంవరణుడి

కొరకు తపతిని ఇవ్వమని అడిగినప్పుడు వివిధ వస్తు వాహనాది సంపదలతో అరుంధతీ వశిష్ఠులకి తపతిని అప్పగిస్తూ దేవతాలోకం ఎక్కడ? భూలోకం ఎక్కడ? తపతి చాలా చిన్న పిల్ల ఇక్కడ నుంచి తపతికి తల్లి తండ్రి అన్నీ మీరే అని వారికి అప్పగిస్తాడు.

**"ఉన్నూరు విడిచి పడcతుకc**
**బొన్నూరికి నియ్యలేక పొగిలెడిచో, నే**
**దన్నరలోకం బెక్కడ?**
**నున్నత సురలోక మేడ యురవందుటకున్**

**బాల మిక్కిలి గోల; యీ పాలపాప**
**చెక్కుమీటిన వసవల్చు సెలవులందుc;**
**గన్నియకుc జూడ నొవ్వక కనినయట్టి**
**తల్లిదండ్రులు సుం దరుంధతియు మీరు"**

(త.సం.ఉపా.పు.92)

సంవరుణుడు తపతిని గాంధర్వ వివాహం చేసుకోవడానికి సిద్ధపడగా తపతి గాంధర్వ వివాహానికి అంగీకరించలేదు. తండ్రి ఆజ్ఞ లేకుండా నేను వివాహానికి అంగీకరించలేనని ఖచ్చితంగా చెబుతుంది.

**అనుడుc దపతి పలికె నర్కుండు మా తండ్రీ;**
**యతని యాజ్ఞ మీఱ నడుగెcడైన;**
**నాకుమఱుcగు పిందెనైన నాకేరీతి**
**నిను వరింపనగును నిర్మలాత్మ?**

(త.సం.ఉపా.పు. 85)

తపతి తాను ఎంతగా సంవరణుడి వలచి, విరహవేదన చెందినప్పటికీ తండ్రి మాట జవదాట లేదంటే సూర్యుడి తపతిని పద్ధతి ప్రకారం పెంచి పలువురికి ఆదర్శప్రాయుడైయ్యాడు.

**"ఆదిష్టోఽహమరుణ సారథినా భగవతా. యథా "హయసేన ! మమ జామాతు రసన్నిధా నాదమ్బుగర్భా అపి తజ్జన పదే వర్షితు మక్షమా నాద్యః. తేన స దుః క్షామ పీడితః సముత్పన్న ప్రాయో వర్తతేః. సంవరణోపి తపతీ సంగమసుఖ విస్మృత కృత్యః – హైమవతాని స్వర్గోపవనసమాని వనాని సముత్సృజ్య న ప్రయాతుం వాఞ్ఛతి. తేన చ కశ్చిత్ కాలం విఘటనీయమేతన్మిథునమ్. సా**

**చ పతి దేవతా న జాగ్రతీ శృణోతి కథామపి విప్రవాసస్య. తన్నిద్రాయమాణే భర్తరి స్వపతీం తపతీం సపరిజనాం ప్రాపయ సావిత్రీ సకాశమితి."**

**ద్వితీయః పునర యామాదేశో దేవస్య 'యదసౌ సంవరణః స్వరాష్ట్రగమనాయ సచివేవ సఞ్చోదిత స్త్వరిత గమనోపాయమా జానానస్తిష్ఠతి. తదమునాస్యన్దనేన పూరణీయస్త స్యాభిలాష' ఇతి తద్ యావదవ తరామి."** (త.సం.పు.132)

అల్లుడి బాగోగుల గురించి ముందుగానే ఆలోచించి రాజ్యం క్షామంతో పీడింపబడడం వల్ల సంవరణుడి దృష్టిని రాజ్యం మీద మళ్ళించడానికి రహస్యంగా తపతిని సంవరణుదు నుంచి వేరుచేసి సావిత్రి వద్దకు చేర్చుతాడు. సంవరణుడు రాజ్యానికి అతి త్వరగా చేరుకోవడానికి రథాన్ని కూడా ఏర్పాటు చేస్తాడు.

అసురులను హతమార్చడానికి కావల్సిన దివ్య ఆహారాలను మనవడికి అందిస్తాడు. పుత్ర వియోగం కలుగకుండా తపతిని మోహపెట్టి సావిత్రి దగ్గరకు పంపిస్తాడు. మనవడు దేవతల కార్యం నిర్వహించిన తరువాత తల్లిదండ్రుల వద్దకు చేర్చుతాడు.

కావ్యంలో సంవరుణుడి తీవ్రమైన తపస్సుకు వశిష్ఠ మహర్షియే సూర్యమండలానికి వెళ్ళి తపతిని సంవరుణుడికి యివ్వమని అడిగితే వశిష్ఠుడి వెంట తపతిని పంపిస్తాడు. తరువాత మళ్ళీ సూర్యుడు ఎక్కడా కావ్యంలో కన్పించడు. కావ్యంలో కన్నా నాటకంలో సూర్యుడి పాత్రను ఔచిత్యవంతంగా తీర్చిదిద్దాడు రచయిత. తపతి కోరిన వరుడుని ఇచ్చి వివాహం చేసి తండ్రిగా తన కర్తవ్యాన్ని నిర్వహించాడు. అల్లుడి యోగక్షేమాలు విచారించి అతనికి తగిన సహాయం చేసి తన బాధ్యతను నెరవేర్చాడు. మనుమడిని ప్రయోజకుడిని చేసి దేవతలకు ఉపకారం చేశాడు. తండ్రిగా, తాతగా, మామగా భాస్కరుడు కృతకృత్యుడైయ్యాడు.

### 3.2.7 విదూషకుడు (పాత్రచిత్రణ)

సంవరుణుడి స్నేహితుడు. నాయకి చెలికత్తెలవలె నాయకుడికి సహాయ సహకారాలు అందించడానికి విదూషకుడుంటాడు. విదూషకుడు మొదటి నుంచి చివరిదాకా రాజు వెంటే ఉండి నాటకంలో ముఖ్యపాత్ర పోషించాడు.

విదూషకుడు సంవరుణుడి హృదయాన్ని అర్థం చేసుకోగల నేర్పు గలవాడు. పాద విన్యాసం చూసినప్పటి నుండి రాజులో మన్మథుడు ప్రవేశించాడేమోనని సందేహిస్తాడు.

**"భో ఆఖురివ త్వమ్ సఖల్వల్పమపి ఛ్చిద్రమతిమాత్రం విస్తారయతి. త్వయాపి పఞ్చషైరక్షరైర్మహాన్ గ్రన్థసన్దర్భో రచితః. అక్తమేతేన, అన్యత్ కిమపి రహస్యం ప్రక్ష్యామి. పదదర్శనా దారభ్యాన్యాదృశ ఇవ తే ఆకారః. ఆస్తి వా మన్మథస్యా ష్యత్రావసరః"** (త.సం.పు.78)

రాజు హృదయాన్ని గ్రహించి అందుకు అనుగుణంగా మెలగుతాడు. తపతీ సంవరణులను కలపడానికి వారి వివాహానికి దోహదపడతాడు. రాజు విరహాన్ని భరించలేక దాని నుండి బయటపడగల ప్రదేశానికి విదూషకుడిని తీసుకువెళ్ళమన్న సందర్భంలో తపనుడు పురుషోత్తముడి ఆరాధించిన ప్రదేశం, వామనుడు తన పాద విన్యాసంతో భువన త్రయాన్ని ఆక్రమించిన సందర్భంలో అతని హస్త తలం నుండి జారిపడిన కరతలోదకమనే సరస్సు దగ్గరికి సంవరణుడ్ని తీసుకువెళ్ళి విరహ బాధను తగ్గించే ప్రయత్నం చేశాడు.

తపతిలో తలో తాను నాకు నేనుగా ఆ పురుషుడిని వరించాను అని అనుకున్నప్పుడు దీనిని విన్న సంవరణుడు తపతి వేరొక పురుషుడిని వలచిందని తప్పుగా అర్థం చేసుకొని అక్కడ నుంచి వెళ్ళిపోతున్న సందర్భంలో ఏ విషయాన్నైనా పూర్తిగా వినాలి సగం సగం విని తప్పుగా అర్థం చేసుకోకూడదని సంవరుణుడికి సలహా ఇస్తాడు.

**"భో ! ఏకదేశనిగమనేన ప్రజాపతేరపి న శక్యం పరమార్థం జ్ఞాతుమ్. నైషాకృతర్నిన్దనీయం కర్మ కర్తుం పారయతి. తత్ పునరపి కిఞ్చిత్ శ్రుత్వా గచ్ఛావః"** (త.సం.పు.91)

సంవరణుడు విదూషకుడు చెప్పిన సలహాను పాటించి తపతి చెప్పినది తన గురించేనని విని ఆనందిస్తాడు. విదూషకుడు గొప్ప అనుభవశాలి. అందుకే బ్రహ్మకైన ఎదుటివారు పూర్తిగా చెప్పేది వినకుండా అందులో విషయాన్ని గ్రహించడం అసాధ్యం అని నాయకుడికి తన అనుభవాన్ని తెలియజేస్తాడు.

విదూషకుడు తను ఎంతగా రాజ సేవలో నిమగ్నమైనా, తన నిత్యపూజను మానలేదు. యజ్ఞోపవీతాన్ని కోతులు ఎత్తుకు పోయినా మానసికంగా యజ్ఞోపవీతాన్ని ధరించి నిత్యానుష్టానాన్ని పూర్తి చేస్తాడు. సంవరణుడు దేవతా మూర్తులను స్తోత్రాలతో ఆరాధిస్తే, నిరక్షరాస్యుడైన విదూషకుడు పువ్వులు తెచ్చి దేవుడిని ఆరాధిస్తాడు. లేని యజ్ఞోపవీతాన్ని ఉందని భావించి అనుష్ఠానం చెయ్యడమనేది యోగలకు, సన్యాసులకు మాత్రమే సాధ్యమయ్యేపని.

సంవరణుడు విరహం తట్టుకోలేక మరణావస్థకు చేరుకొన్నప్పుడు విదూషకుడు ఎంతగానో ఊరడించి చివరకు విదూషకుడు కూడా ఆత్మహత్యకు సిద్ధపడతాడు.

**"సమాశ్వసితు సమాశ్వసితు వయస్యః. కథం గత ఏవాన్తం వయస్యః. హా వయస్య! హా సకలధరా మణ్డలైకనాథ ! హా మయ్య కారణబద్ధస్నేహ ! కస్మాన్మా మనన్యశరణం సర్వకాల సహచరం బాలమిత్రం దయితం పరిత్యజ్య గచ్ఛసి. దీర్ఘాయుషం వంశకరం పుత్రం లభమానో భవేదితి సిద్ధాదేశికానాం వచనమప్యలీకం సఞ్జాతమ్. అథవా కిం మమ పరిదేవిత్తైః. భృగుపతనే నానుసరామి ప్రియ వయస్యమ్."** (త.సం.పు.108)

సంవరణుడు బ్రతికేవున్నాడని తెలుసుకొని ఆనందించి అతనిని ఆలింగనం చేసుకోవడం గొప్ప వరంగా భావిస్తాడు. విదూషకుడు రాజు మీద ఇంతటి ప్రేమానురాగాలు చూపించాడు కనుకనే రాజు విదూషకుడికి ఇవ్వవలసిన గౌరవాన్ని ఇచ్చాడు. సంవరణుడికి విదూషకుడు అత్యంత సన్నిహితుడు అవ్వడంవల్ల స్వప్నంలో సూర్య భగవానుడు కన్పించి మరొక వివాహం చేసుకోమన్న విషయాన్ని మొదట సంవరణుడు విదూషకుడికే చెప్తాడు. తన పుత్రుడికి విదూషకుడ్ని చూపి నమస్కరించమంటాడు. సంవరణ, విదూషకుల అనుబంధం గొప్పది.

విదూషకుడి పాత్ర కేవలం నాటకంలోనే ఉంది. కావ్యంలో లేదు.

### 3.2.8 అమాత్యుడు (పాత్రచిత్రణ)

సంవరుణుడి మంత్రి, రాజు తరువాత రాజు అంతటి వాడు మంత్రి. రాజు రాజ్యంలో లేనప్పుడు కార్య భారం వహించవలసినవాడు మంత్రి. రాజు వివిధ కార్యాలలో నిమగ్నమై ఉంటాడు. ప్రభువుకి ఏ నిమిషంలో ఏ వార్త చెప్పాలో అర్థం చేసుకొని వ్యవహరిస్తాడు అమాత్యుడు. సంవరణుడి మంత్రి మిక్కిలి తెలివైనవాడు రాజ్యంలో అనావృష్టి సంభవించినందువల్ల, శత్రురాజులు దండెత్తి వచ్చినందువల్ల, సంవరణుడుని తీసుకు వెళ్ళడానికి వస్తాడు మంత్రి.

**"అహో చిరాదావాప్త జన్మఫలే మమ చక్షుషీ ! దేవస్య పాద సరోరుహయో రేవేదం ప్రతిబిమ్బమ్"**

(త.సం.పు.127)

అమాత్యుడు సంవరణుడి పాదాల గుర్తుల బట్టి రాజు ఆ మార్గంలో వెళ్ళి ఉంటాడనుకొని రాజును అన్వేషించడానికి బయలుదేరతాడు. సంవరణుడు హిమాచలం మీద కోపంగా ఉన్నాడని తెలుసుకొని తను ఆ సమయంలో రాజుకు ఎదురుపడకూడదని జాగ్రత్తపడి దాగి ఉంటాడు.

**"అయే అయం స్వామీ సోన్మాద ఇవ హిమాచలాపహృతాం దేవీం మన్యమానస్తమభిక్రుధ్యన్నిత ఏవాభివర్తతే. తన్నాయమవసరః ప్రకాశయితుమాత్మానమ్. తదవసరే సముపసర్పావః."**

(త.సం.పు.127)

సంవరణుడు కోపం నుంచి కొంచెం తేరుకున్నాక శత్రురాజు దండెత్తి వచ్చారని మీ బలపరాక్రమాలు చవి చూడాలని ఆశపడుతున్నారని అంటాడు.

**"దేవ ! సత్యమశఙ్కనీయ పరాక్రమాః కేవలం పఞ్చాలాః. కింతు బహ్మశో భవద్బాహుబల నిర్జితైః సకల రాజన్య చక్రైః సమ్భూయైతే సముల్లఙ్ఘ్య మమ మతి బలం ప్రతీక్షన్తే దేవస్య పరాక్రమమ్. తదనతి విలమ్బితం తేషామభిలాషం పూరయతు స్వామీ"** (త.సం.పు.131)

అమాత్యుడు సంవరణుడిని పరోక్షంగా పొగుడుతాడు. మీ చేతిలో శత్రు రాజులు ఓడిపోతారు. వారికి బల పరాక్రమాలను రుచి చూపించండి అని రాజు వేడుకొంటాడు. రాజు చెప్పకుండా ముందే అమాత్యుడు శత్రువులపై దాడి చేయడానికి కావలసిన వాహనాలను, పరివారాన్ని తీసుకువస్తాడు. సంవరణుడు ఆకాశయానంలో బయలుదేరి వెళ్ళగా అమాత్యుడు కూడా వాహనాన్ని అధిరోహించి సేనాపతితో ఎటువంటి ఆపదలు లేకుండా పరివారాన్ని తీసుకురమ్మని చెబుతాడు. ఈ విధంగా అమాత్యుడు రాజు రాజ్యంలో లేనప్పుడు రాజ్య భారం వహించి రాజు మనసుకు తగ్గట్టు నడుచుకొని ఇటు రాజ్యానికి, ఇటు రాజు వారధిగా నిలిచాడు.

కేవలం నాటకంలో మాత్రమే అమాత్య పాత్ర కలదు. కావ్యంలో ఈ పాత్ర లేదు. కావ్యంలో వశిష్ఠుడు అనావృష్టి సమయంలో సంవరుణుడిని రాజ్యానికి తీసుకువస్తే నాటకంలో ఆ బాధ్యతని అమాత్యుడు నెరవేర్చాడు.

### 3.3 కావ్య నాటకాలలో రస పరిశీలన

### 3.3.1 శృంగారరసం

కావ్య నాటకాలు రెండింటిలోనూ శృంగారరసం అంగరసం. కావ్యంలో నాయకుడైన సంవరుణుడు ఉద్యానవన దర్శనంతో కావ్యం ప్రారంభమౌతుంది. వసంతఋతువు వర్ణన, చంద్ర, మన్మథ దూషణలు, నాయకా నాయకుల విరహవేదన మొదలైన వర్ణనవల్ల కావ్యంలో శృంగారరసం ప్రధానంగా ఉంది. నాటకంలో కూడ పక్షుల సంసార ప్రవృత్తి, నాయికా నాయకుల విరహ వర్ణనల వల్ల శృంగార రసమే ప్రధాన రసంగా అలరారుతోంది.

శృంగారరసం విప్రలంభ, సంభోగాలని రెండు విధాలు. గంగాధర కవి తన కావ్యంలో ఈ రెండు శృంగారాలను వర్ణించాడు. విరహార్తులైన నాయికా నాయకుల మధ్య విప్రలంభ శృంగారం వివరించబడితే, వారి వివాహానంతరం సంభోగ శృంగారం వర్ణించబడింది.

సంవరణునిలో రతి భావోదయానికి నాయిక అయిన తపతి ఆలంబనమైతే, చిలుక వివరించినది ఆమె గుణగణాలు ఉద్దీపనాలు. "గంగాధరుడు తపతీ సంవరుణుల శృంగారమునకు పూర్వానురాగరూపమైన వినుకలి వలపును కల్పించెను. అందుకు సాధనము చిలుక రాయబారము.

**"యత్రేమ సంగమాత్పూర్వం**
**దర్శన శ్రవణోద్భవం**
**పూర్వానురాగ స్సవిజ్ఞేయః**
**శ్రవణం తద్గుణ శ్రుతిః**
**ప్రత్యక్ష స్వప్న చిత్రాదౌ**
**దర్శనం దర్శనం స్మృతం"**

అను అలంకారిక వచనమునుబట్టి గుణశ్రవణ, స్వప్నాది దర్శనములవలన నాయికా నాయకులకు జనించు ప్రేమ పూర్వానురాగము. అది సంగమమునకు పూర్వము జనించి వర్ధిల్లును. దీనిని కల్పించి, ప్రయోజనవంతముగా నిర్వహించుటయందు గంగాధరకవి ప్రశంసనీయమైన మెలకువ ప్రదర్శించెను".[8]

గంగాధరకవి చేసిన చిలుక కల్పన కావ్యానికి ప్రధానరసమైన శృంగార రసాన్ని నాయికా నాయకుల మధ్య కలిగించడానికి దోహదం చేసింది.

చిలుక తపతి అందాన్ని సంవరణుని దగ్గర, సంవరణుని సౌందర్యాన్ని తపతి దగ్గర చెప్పి వారిద్దరూ ఒకరికి ఒకరు సరిజోడు అని చెపుతుంది. నాయిక రూప గుణవర్ణనలతో ధీరుడైన నాయకుడి మనస్సు మన్మధుని బాణాలకు గురికాక తప్పలేదు.

విరహబాధలో తపతి సౌందర్యాన్ని మరి మరి తలుచుకొని మధనపడతాడు. తనని వరిస్తుందో లేదోనని సంశయిస్తాడు. చల్లగాలికి కలతపడతాడు. చంద్రకాంతకి కుమిలిపోతాడు.

---

8. *తపతీ సంవరణోపాఖ్యానము, పీఠిక, పు.* xvi

**"వినుకలి విరాలిం దల్లడిల్ల జాతిcగొని మాలేథ విరహ దావానల దందహ్యమాన మానసాంభోజుcడై యారాజ బిడౌజుండు బట్టబయటc బడిన మీనుకైవడిc బొరలుచు, నిదాఘ సమయ జాజ్వల్యమాన మార్తాండ చండకిరణ మండలే సంతాపిత కుండలేంద్రంబు తేవ నుస్సురనుచు"**

(త.సం.ఉపా.పు. 43)

విరహబాధ తట్టుకోలేక సంవరణుడు నేటి నుండి బయటపడిన చేపవలె బాధపడుతున్నాడని వర్ణిస్తున్నాడు కవి. తపతి తలుచుకొని విరహంతో బాధపడే సంవరణునిలో "తొమ్మిదవస్థల మన్మథ జ్వరం పొడసూపింది" ఈ విరహం తపతి దర్శనంతోనే, ఆ తరుణి పరిష్వంగంతోనే తగ్గుతుందని కవే చెప్తున్నాడు.

**"ఆ మోహనాంగి పరిరం**
**భామృత పానైక సౌఖ్య మబ్బక యున్నన్**
**గామించి కన్నులారం**
**గోమలి లావణ్యరసము గ్రోలిన జాలున్"**

(త.సం.ఉపా.పు. 36)

సంవరణుడు స్థితిని వర్ణిస్తున్నాడు పై పద్యంలో కవి ఆమెతో సౌఖ్యం కలగకపోయినా కనీసం కన్నులతో ఆ లావణ్యాన్ని చూసినా చాలు సంతృప్తి చెందుతానంటున్నాడు సంవరణుడు. కానీ ఆ క్షణంలో తపతి అతని చెంతలేదు. అందుకే సంవరణుడి పరివారం అతనికి శిశిరోపచారాలు చేశారు.

**"వెలcది నవ్వులచాయ వెలcది వెన్నెలగాయc**
**గపురంపు ధూళి పైc గప్పెనొకcడు**
**చెలువ కౌcగిలిపాటి చెలువైన పన్నీట**
**నొకcడు సర్వాంగంబు లోలలార్చెc;**
**బద్మాక్షి ముఖసామ్య పద్మజాలంబుల**
**నురమున నిండార నునిచె నొకcడు;**
**పల్లవాధర హస్త పల్లవంబులc బోలు**
**పల్లవంబు లొకండు పాన్పుపఱచె;**
**సాత్త్వికోదయవేళ నా సతికి నొడలc**
**దోడ వెడజారు చెమరు బిందువలవంటి**

**లలిత మకరంద బిందువుల్ చిలికె నొక్కఁ**
**దంగనా మన్మథునకుఁ బ్రత్యంగకముల"**

(త.సం.ఉపా.పు. 44)

కర్పూరం, పన్నీరు, పద్మాలు, పల్లవాలతో సంవరణుడి విరహబాధ కొంత ఉపశమించిన తరువాత తపతిని వివాహం చేసుకోవడానికి సూర్యోపాసన ప్రారంభిస్తాడు.

తపతి గురించి సంవరణుడి తెలిపి అతనిని విరహానికి గురి చేసి తన కార్యాన్ని నెరవేర్చుకొన్న చిలుక తపతి దగ్గరకు వచ్చి సంవరణుడి గుణగణాలను ఏకరవు పెడుతుంది.

**పలుకులు వేయునేమిటికిఁ? బంకరుహాయతచారునేత్ర ! యిం**
**పులను, జగద్వశీకరణ మోహన దోహలరూపరేఖలన్**
**వలనుగ నీకు నేదనఁగ వచ్చును భారతవంశరత్నమున్;**
**జలజనిభాస్య ! యాతనికి సాటిదలంపఁగ నీవ చూడఁగన్.**

(త.సం.ఉపా. పు. 51)

సంవరణునితో తనను ఈడు పెట్టిన చిలుక మాటకు తపతి వశమై పోయింది. ఆ రాకుమారుని పట్ల అనురాగ భావం పొంగి పొరలింది.

**"మంతనంపుం బలుకులుం గలవనిన నలికతలమునఁ జెమట దొలుకరింపఁ, జనుంగవ కెలంకులఁ బులకలెగయఁ దలంపున నను రాగంబు పల్లవింప"** (త.సం.ఉపా.పు. 51)

అని వర్ణించి శృంగార రసాన్ని ఉన్నత స్థాయికి తీసుకుపోయాడు కవి.

**"శుకమా ! కోకనదచ్ఛవి చ్ఛురిత చంచుశ్రీ పరాభూత కిం**
**శుకమా ! నీకును రాకొమారునకు నెచ్చో నందె సందర్శనం?**
**బకలంకాత్ముఁ దతండు నీచరితమేమైనన్ విమర్శింప మా**
**మకవృత్తాంత మెఱుంగఁ జెప్పవుగదా మన్నించుచో నచ్చటన్"**

(త.సం.ఉపా.పు. 51)

నాయకుని రూపగుణ వర్ణనతో నాయికలో కోరిక జనించింది. దానితో తన మనస్సులో భావనని చిలుక ముందుంచింది. నా గురించి వివరించలేదు కదా సంవరణుడి దగ్గర అని తపతి చిలుకను అడిగింది. చెప్పవుగదా అనే కాకువులో చెబితే బాగుండు అన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది.

**"అనెడు చిలుక పలుకు లాలించి యాలించి,**
**ధరణిపాలురూపుఁ దలచి తలఁచి,**
**పంచబాణ బాణ పంచకం బెదనాటఁ**
**దపతి యగుచు నపుడు దపతి పలికె"**

(త.సం.ఉపా.పు. 52)

తపతి సంవరణుడిని పదే పదే తలుచుకుంటూ మన్మథుని పంచ బాణాలకు గురై మదన వేదనతో తపిస్తుంది.

**"వెడ వెడనార్చె మన్మథుడు బిట్టుగఁ జక్కెరవింటి దండమున్**
**గడుసువడంగఁ జేసి, విరి క్రొవ్విరి తూఁ పుల తేఁటి శింజినిన్**
**బొడముచుఁ బింజపింజఁగను మొల్ల సుగంధిపయిం ద మంతనే**
**కడువడి నాటి నట్లమరెఁ; గంతుని కౌశలమేమి చెప్పఁగన్?"**

(త.సం.ఉపా.పు.53)

తపతి స్థితి రతిపతికి అనుకూలించింది. బాణ ప్రయోగానికి అదను దొరికింది. తన చక్కెర వింటిని సారించి విరితూపులు విసిరాడు. అతడు నాటిన బాణాలు ప్రయోగించబడినవిగా కాక తమకు తామే తాకినట్లు అనిపించాయట తపతికి.

విరహవేదనలో వేగే చెలిస్థితి చూడలేని చెలికత్తెలు తపతిని వినోదార్థం భూలోకం తీసుకువచ్చారు. వసంతకాలం ప్రకృతి వసంతుని స్పర్శతో పులకిస్తుంటే, తపనసుతలో తాపం అధికమయ్యింది. చెలికత్తెలతో పుష్పాపచయం, జలకేళి, మదనపూజ చేసింది. కుసుమ సౌరభంతో, జలకేళితో మనస్సు చల్లనవ్వాలని, మదనపూజతో ఆ మదనదేవుడు ప్రసన్నుడై తాపోపశమనం చేసి, వర ప్రదాత కావాలనేది తపతి చెలికత్తెల కోరిక.

**"పలుకుల నమృతము చిలుకన్,**
**జలజల కెమ్మోవి వలనఁ జక్కెర యొలకన్,**
**దళతళ మెయిజిగి, బెళుకన్**
**నెలకొను శృంగారరసము నిలువునఁ గులుకన్"**

(త.సం.ఉపా.పు. 78)

అమృతపు పలుకులతో, మైదీగ మెరుపులతో శృంగార రసం నిలువునా నెలకొన్నట్లున్నదట తపతికి. ఆమెను చూసిన సంవరణుడు చిలుక వర్ణించిన వనితారత్నంగా గుర్తిస్తాడు. తపతి రూపాన్ని చిలుక వర్ణనతో ముందే హృదయంలో ప్రతిష్ఠించుకున్నాడు. అది చెరిపినా చెరిగిపోని రూపం. అదే రూపం కళ్లముందు నిలిచినా గుర్తించడానికి కొంత సమయం పట్టింది ఆ జగదేక సుందరిని తన మనోహరిణిగా గుర్తించి –

**"కనుసన్న గావించి కలికి రమ్మందునో**
**రాకున్న సిగ్గుచే రట్టుగాదె?**
**నెలఁత దగ్గరనేఁగి నిలిచి వీక్షింతునో**
**వడి నదృశ్యంబైన వగపుగాదె?"**

(త.సం.ఉపా.పు. 81)

కనుసైగలతో పిలిస్తే రాకపోతే పరువుపోదా? దగ్గరికి వెళ్ళి చూస్తే అదృశ్యం అవుతుందేమోనని సందేహిస్తాడు. సంవరణుడు అనుకున్నంతా అయ్యింది. ధైర్యం చేసి ముందు నిలిస్తే, ఆ ముగ్ధకాంత పరపురుష సందర్శనంతో కలవరపడి చెలులతో సహా అదృశ్యమయ్యింది. తపతి కూడ సంవరుణుడి పట్ల గాఢమైన అనురాగం ఉండడం వలన అదృశ్యరూపంలో అక్కడే ఉండి ఆ రాకుమారుని వీక్షించసాగింది. సంవరుణుడు తపతిని గుర్తించలేదు. తపతి కన్పించకపోయేసరికి సంవరణుడి బాధ వర్ణనాతీతం.

**"కాననాంతరంబుఁ గలయుఁ దిమ్మరుచుండె**
**నావఁ ద్రావినట్లు భూవరుండు"**

(త.సం.ఉపా.పు. 83)

ఇంకా సంవరుణుడిలో తిరిగి ఉన్మాదాది భావాలు పొడసూపాయి.

**"హా రామాతిలకంబ! హా మదవతీ ! హా పూర్ణాచంద్రాననా!**
**హా రాజీవదళాక్షి ! హా కరటికుంభాభోగ జృంభ స్తనీ**
**హా రంజద్గుణమంజరీ! యనుచు హాహాకార శబ్దంబుతో**
**నా రాజన్యుఁడు ధాత్రిపైఁ బొరలు నత్యంతానుతాపంబులన్"**

(త.సం.ఉపా.పు. 83)

దైన్యం, ఆర్తి, విషాదం, ఉన్మాదం మొదలైన సంచారీ భావాలు సంవరణునిలో చోటు చేసుకున్నాయి. దానితో ఆ సింధు గంభీరుడు బేల హృదయుడయ్యాడు. తానేం చేస్తున్నాడో తనకే తెలియని ఉన్మాదస్థితికి చేరుకొని, విరహ విప్రలంభంలో రసస్థాయికి చేరువయ్యాడు. సంవరణుని దీనస్థితికి కరిగిపోయిన తపతి తిరిగి సాక్షాత్కరించింది. సూర్యదేవుని ప్రసన్నం చేసుకొని తనను చేపట్టమంటుంది.

చిలుక వాక్కులతో తపతీ సంవరణులు పరస్పరానురాగం పొందడం, ఒకరికొకరు విరహవేదన చెందడం, తిరిగి వనంలో కలుసుకొని ఒకరి మనసులొకరు తెలుసుకోవడం వరకు వర్ణించబడింది. విప్రలంభ శృంగారం. విప్రలంభం అంటే విరహమని అర్థం. నాయికా నాయకులు పరస్పర సౌందర్య గుణ శ్రవణంతో విరహమనుభవించడమే విప్రలంభ శృంగారం. ఇది అభిలాషం, ఈర్ష్య, విరహం, ప్రవాసం అనే నాలుగు విధాలుగా ఉంటుంది. తపతీ సంవరణులది అభిభాషా విప్రలంభ శృంగారం అంటే నాయికా నాయకులకు తాము కలవడానికి ముందు మనస్సులో కలుగు కోరిక.

**సంభోగ శృంగారం**

సంభోగ శృంగారంలో నాయికా నాయకుల దర్శన, భాషణ, ఆలింగనాదులు చోటు చేసుకున్నాయి. తపతీ సంవరణుల వివాహానంతరం సంభోగ శృంగారం వర్ణించబడింది. తపతి సౌందర్య నిధి. కోరివలచిన సతి ఎదుట నిలిచింది. సంవరణుని మనసు వశం తప్పింది. రతి భావోదయం అయింది. తపతి ముగ్ధనాయిక. సిగ్గుతో భయంతో సంవరణుని చేరక నిలిచిపోయింది. అది గమనించిన సంవరణుడు ఆమె వస్త్రాన్ని అందిపుచ్చుకొన్నాడు. దానితో తపతి పరిస్థితి ఇరుకున పడింది.

**"పోయెదనంచుఁ జూచుఁ, గరముం గబళించినఁ బోవరామికిం**
**బ్రాయపుఁ జెల్మికత్తియలఁ బల్మఱుదూఱు, మనోవిభుండు దా**
**రాయిడిఁ బెట్టునోయని పరాఙ్ముఖమందుచు నిట్లగమ్యల**
**క్ష్మీయుతమైన నాఁతి కిలికించిత మంచితమయ్యె ఁతేనికిన్"**

(త.సం.ఉపా.పు. 100)

"ప్రియ సంగమము వలనఁ గలిగిన హర్షముచేఁ గలిగిన స్మిత, శుష్కరుదిత, హసితత్రాస, క్రోధ, శమాదుల సాంకర్యము కిలికించితము".[9] "స్మిత, శుష్క, రుదిత, హసిత, త్రాస, క్రోధ భావాలు

9. *కావ్యాలంకార సంగ్రహము, పు. 382*

ఏకకాలంలో ప్రదర్శించే భావమే కిలికించితము” ఇది రతి భావాలలో ఒకటి. ఎటూపోలేని, ఏమీ చేయలేని అసందిగ్ధ స్థితి. అదే ఏర్పడింది తపతికి. అంటే ఆమెలోనూ రతి భావం పొడచూపిందన్న మాట. ఇరువురి హృదయాలలో అంకురించిన ఆ రతి రసంగా పరిణమించింది.

**కబరికాబంధంబ కబళించు, గబళించి**
**నెమ్మేనికంపంబు నిలువరించు;**
**బింబాధరదళంబు చుంటించుఁ, జుంబించి**
**ఘనమైన ముడి విముక్తంబు చేయుఁ,**
**బాలిండ్లు కౌఁగిటఁ గీలించుఁ, గీలించి**
**డెందంబులో భీతి డిందుపఱచుఁ;**
**దుది నీవిబంధంబు వదలించు, వదలించి**
**చిట్టాడు సిగ్గు వాకట్టు గట్టు;**
**కంతుఁ జిట్టమిడిచి, కలకల నవ్వించి,**
**వంతులకుఁ బెనంగ వలనుచేసి,**
**మగువఁ బెక్కువగల మిగులఁగఁ గరగించి**
**విభుఁడు మదనకేళి వివశఁ జేసె.** (త.సం.ఉపా. పు.101)

పై పద్యంలో సంపూర్ణ సంభోగ శృంగారం వర్ణించబడింది. తపతిలో కలిగిన భయాన్ని తన అనునయ చేష్టలతో పోగొట్టి ప్రణయాంబుధిలో తేలించాడు. వారి మనస్సులు అభీష్టసిద్ధితో ఆనందించాయి. ప్రేమ సాఫల్యంతో పెనవేసుకొన్నాయి. నాయికా నాయకులు పరస్పర చేష్టలు ద్వారానే తమ ఊహలు పంచుకున్నారు. తలపులు తెలుపుకొన్నారు.

తపతీ సంవరణులు ఒకరికొకరు కోరి మనస్ఫూర్తిగా వరించారు. ఒకరి కోసం ఒకరు పరితపించారు. ఒకరు లేనిదే ఇంకొకరు జీవించలేని విషయం వివరించారు. వారి అకళంక అనురాగమే వారిరువురినీ దగ్గర చేసింది. దానికి దైవానుగ్రహం పెద్దల అనుమతి తోడయినాయి. ఏ ఆటంకాలు లేని జీవితం లభించింది. అందుకే సర్వం మరచి ఆనందంలో ఓలలాడారు. ఈ సందర్భంలోనే వారిని మన్మథారాధకులని సంభోధించాడు కవి.

**నాటకంలో శృంగార రసం :**

శృంగార రసాధిదేవుని ఆరాధన జీవితాన్ని సుఖమయం చేసుకున్న ప్రణయస్వరూపులుగా దర్శనమిస్తారు తపతీ సంవరుణులు.

నాటకంలో కూడా సంభోగ శృంగారం, విప్రలంభ శృంగారం వర్ణింపబడింది. నారద మహర్షి తపతికి తగిన వరుడు సంవరుణుడే అని సూర్యుడితో చెప్పగా విన్న తపతికి సంవరుణుడినే తన భర్తగా ఊహించుకుంటుంది. సంవరుణుడిని చూడాలనే కుతూహలంతో తపతి ఆకాశమార్గాన వెళ్తూ హస్తినాపురం రాగానే క్రిందకి చూడడం మొదలు పెడుతుంది. నారద మహర్షి తన మాటల ద్వారా తపతికి సంవరుణుడి మీద మోహాన్ని కలుగజేశాడు. తపతికి శృంగార రసానికి స్థాయి భావమైన రతికి బీజంపడింది  ఈ సన్నివేశంలోనే.

సంవరుణుడు పుత్రులు లేక తపిస్తూ ఉంటే అశరీరవాణి మరొక వివాహం చేసుకుంటే ఆమె వలన నీకు సంతానం కలుగుతుందని చెబుతాడు. అప్పటి వరకు సంవరుణుడికి మరొక స్త్రీని వివాహం చేసుకోవాలనే కోరిక లేదు. సంవరుణుడి లత్తుక పూయబడిన పాదాల అడుగుజాడలు, కర్ణపూరం, అకర్ణపూరం మీద మన్మథుడి సందేశాన్ని తెలిపే పద్యాక్షరాలు చూసి సంవరణుడు ప్రణయానికి లోనౌతాడు. కర్ణపూరము, అడుగుజాడలు తటస్థోద్దీపనాలు.

సంవరుణుడు దేవతలు విహరించే స్ఫుటికమణిసభా మండపానికి వెళ్ళడం,  అక్కడే వున్న తపతి మన్మధుడితో చెబుతున్న మాటలివి.

**హృదయ కుత్రవా హృదయం ఆతేనైవ సుకుమారేణ ముషితం భగవన్ కుసుమాయుధత్వం కిమపి ప్రహర్తు మాగతోసి తవ శరణం లక్ష్యభూతం మమహృదయం సకల భువనైక నాథస్య హస్తే పతితం యది సమర్థోసి తత్రైవపరాక్రమస్య. (తపతీ సంవరణం, పు.91)**

నా హృదయం నా దగ్గర లేదు. అపహరింపబడినది. దానిని సకల భవనైక నాథుడి చేతిలో ఉన్నది. నీకు శక్తి ఉంటే అతడి దగ్గరకి వెళ్ళి నీ ప్రభావాన్ని చూపించమంటుంది. సంవరుణుడి తపతి తననే ఇష్టపడుతోందని తెలిసి ఆనందిస్తాడు. తపతి సూర్యారాధనకోసం వెళ్ళిపోతుంది. సంవరుణుడి విరహం  అతిశయిస్తుంది. నాటకంలో తాపసకుమారుడిచే పక్షుల సంసార ప్రవృత్తి వర్ణించబడింది. ఈ వర్ణన తపతీ సంవరుణుల సంభోగ శృంగారాన్ని సూచన మాత్రంగా తెలియజేసింది. సంవరుణుడికి తాపం ఎక్కువవడం విదూషకుడు శిశిరోపచారాలు చెయ్యడం తపతి ప్రత్యక్షమవ్వడం వశిష్ఠాదులు తపతీ సంవరుణుల వివాహం జరిపిస్తాడు.

వివాహానంతరం సూర్యుడు తపతిని సావిత్రి వద్ద ఉంచుతాడు. సంవరుణుడు విరహంతో తపించిపోతూ విదూషకుడికి తన వ్యధను వినిపిస్తాడు.

ఇంతకాలం నేను రాజ్యాన్ని రక్షించడంలో ఉండడంవలన విరహబాధ నన్ను బాధించలేదు. ఇప్పుడు విరహం విజృంభిస్తోంది. విరహాలపాలిట అతిభయంకరమైన కాలం ఇప్పుడు దాపరించిందంటాడు.

**అలం పరిహాసేన పఞ్చాలకోపస్తమ్భితప్రసరో వియోగహుతవహో విశృంఖల మధునా విజృంభితుం ప్రక్రమతే । ప్రవృత్తశ్చాయం విరహిణామతిభయఙ్కరః కాలః పశ్య –**

**నిశ్శేషం వనమల్లికాసుమనసాం శేషః సముచ్ఛిద్యతే**
**వృన్తేభ్యః పథికోపరోధపరుషైః పౌరస్త్యవాతైరయమ్ ।**
**ప్రాశూకృత్య పిబన్త్యమీ సహచరైః కంఠ ప్రణాలేరిమా**
**శ్చాతక్యో హిమశర్క రాశకలినీమారర్భధారావలిమ్ ॥** (త.సం.పు. 135)

తపతికి కూడా సంవరుణుడిని చూడాలనే కోరికతో మేనకరూపంలో వచ్చి సంవరుణుడిని చూసి వెళ్తుంది. ఇద్దరికి ఎడబాటు కలిగి వారిరువురు ఒకరికొకరు చూడాలనుకుంటాడు. ఇక్కడ కవి విరహ విప్రలంబాన్ని వర్ణించాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ సంభోగ శృంగారం, విప్రలంభ శృంగారం వర్ణించబడింది.

**3.3.2 హాస్యరసం :**

నాటకంలో విదూషకుడి ఆకారం చేష్టల వలన హాస్య రసం పోషింపబడింది. ప్రథమాంకంలో విదూషకుడి పాత్ర ప్రవేశంతోనే నాటకం మొదలౌతుంది. విదూషకుడు అవయవాలు ఒత్తుకొంటూ నిట్టూర్చుతూ పాత్ర ప్రవేశం చేస్తాడు. విదూషకుడు గుర్రం మీద వస్తూ వుంటే పడిపోతాడు. అతడికి గాయాలు అవ్వడం వలన అతడు వంకర తిరిగిన అవయవాలతో నడుస్తూవుంటే హస్తినాపుర వాసులందరూ నవ్వలేక నవ్వుతూ ఉంటారు.

**(అఙ్గాని సంవాహయన్ శూత్కృత్య) అహో మమ ప్రభావో యత్సర్వం ఏవ హస్తినపురవాస్తవ్యో జనః అశ్వః పారాశర్య ఇత్యస్ఫుటమాలపన్ హాసనిరోధదుష్ప్రేక్షముఖో హసితుమహాసితుం చాపారయన్ పర్యాకులా భవతి. ఏష వయస్యః పరి సమాపిత ప్రతికర్మా విధాన ఇత ఏవాగచ్ఛతి. తత్ కిమర్థమాత్మానం ఖేదయిష్యామి అత్రైవ స్థాస్యామి ! (త.సం.పు.69)**

వానరుల బారిన పడిన విదూషకుడు భయపడడంవలన విదూషకుడి మీద సంవరుణుడి చలోక్తులు విసురుతాడు.

**(సస్మితమ్) అభిజ్ఞోస్మి భవత్పరాక్రమస్య. మన్యే స్వయూథ్య బుధ్యా సమాగతైః పడితోఽసి వానరైరితి. ఆస్తామేతిల్. క్వ వతంసకః (త.సం.పు.85)**

విదూషకుడు వికృతంగా నడవడం, వానరులను చూసి అనవసరంగా భయపడడం హస్తినాపురవాసులు నవ్వడమనే విభావాలచేత హాస్య రసం అభివ్యక్తమయింది.

కావ్యంలో హాస్య రసంలేదు. కేవలం నాటకంలో మాత్రమే కన్పిస్తోంది.

**3.3.3 కరుణ రసం**

కరుణ రసానికి స్థాయీ భావం శోకం. సంవరణుని శోకస్థితిని వర్ణించడంలో కరుణరసం అభివ్యక్తమయింది. వరించిన వనిత కళ్ల ఎదుట సాక్షాత్కరించింది. అప్పటి వరకు పడిన విరహబాధ క్షణంలో మరచిపోయాడు. తపతి సౌందర్యానికి క్షణకాలం మైమరచిపోయాడు. ఆ క్షణంలోనే అదృశ్యమైపోయింది. ఆ దేవకాంత తపతి మాయం కావడంలో, అతని విరహబాధ తిరిగి ప్రారంభమయ్యింది. జలధి గంభీరుడు అమల పరాక్రముడైన ఆ రాకుమారుడు అతిధీనుడైనాడు. క్రిందపడి రోధిస్తాడు. తపతి సందర్శనంతో తప్ప ఆ శోకం ఆగదు. అది తెలుసుకొన్న తపతి అతని కళ్లముందు నిలిచి అతని దుఃఖం తృటిలో పోగొట్టింది.

సంవరుణుడి విరహబాధను క్రింది విధంగా వర్ణించాడు కవి.

**"హా రామాతలకంబ ! హా మదవతీ ! హా పూర్ణచంద్రాననా!**
**హా రాజీవదళాక్షి ! హా కరకుంభాభోగ జృంభత్స్తనీ**
**హా రంజద్గుణమంజరీ ! యనుచు హాహాకారశబ్దంబుతో**
**నా రాజన్యుఁడు ధాత్రిపైఁ బొరలు నత్యంతానుతాపంబులన్"** (త.సం.ఉపా.పు.83)

గంగాధరుడు సంవరుణుడి శోకస్థితిని కళ్లకు కట్టినట్లు వివరించి కరుణ రస నిర్వహణ సమర్థవంతంగా సాగించాడు. సంవరుణుడికి తన ప్రియసఖి తపతీ వియోగం కలగడం అనే అనుభావం వలన కరుణరసం వ్యక్తమవుతోంది.

**నాటకంలో కరుణ రసం :**

నాటకంలో సంవరుణుడికి సంతానం లేదని మిక్కిలి తపిస్తాడు. తనకి ఎంత ఐశ్వర్యం

ఉన్నప్పటికి సంతానం లేకపోవడం విచారకరమని సంతానం లేకపోవడంవల్ల పిత్రుఋణం తీరదని ఆవేదన వ్యక్తం చేస్తాడు.

**భగవతి ! పునతీభ్యస్తావకీభ్యస్త్రిలోకీం**
**ప్రణతి ముపగతోహం స్వర్గనిశ్రేణికాభ్యః ।**
**మదకల కలహంస శ్రేణిపారిప్లవాభ్యః**
**శశికరవిశదాభ్యో వీచికామాలికాభ్యః ॥** (త.సం.పు.73)

కుమారులను కలిగిఉండటమే తనకు ప్రియమని వేరేమికాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తాడు..

తపతి నారదుడి మాటలు విని సంవరణుడిని ఇష్టపడడం మొదలు పెడుతుంది. ఆకాశంలో వెళ్తూ తపనవనం రాగానే క్రిందకి చూస్తుంది. తపతి విరహబాధ తట్టుకోలేక మరణించడానికి సిద్ధపడుతూ ఈ విధంగా అంటుంది.

**తస్మిన్నేవైత దుఃఖైక భాజనం శరీరహతక మపహారం కరిష్యామి. హా అనాథాహం సఖ్యా మేనకాయా రంభాయాశ్చ పశ్చిమాలిజ్గన సుఖమనాసాదయన్తీ విపద్యే. (త.సం.పు.92)**

తపతి సంవరుణుడు తననే గాఢంగా ప్రేమిస్తున్నాడని తెలిసి తపతి తట్టుకోలేక మూర్ఛిల్లుతుంది. తపతి మూర్ఛిల్లినదని తెలిసిన సంవరుణుడు కూడా మూర్ఛిల్లుతాడు. విదూషకుడు కూడా సంవరుణుడిని మేల్కొలిపే ప్రయత్నం చేస్తాడు. కానీ సంవరుణుడు తేరుకోకపోయేటప్పటికి అతడు మరణించడానికి సిద్ధపడతాడు. తపతిని సఖులు మేల్కొలుపుతారు. తపతి తన హస్తాన్ని సంవరుణుడి హృదయంపై తట్టగానే సంవరుణుడికి తెలివివస్తుంది. ఈ సన్నివేశాన్ని కరుణరసాత్మకంగా రచించాడు కవి.

వివాహానంతరం రాక్షసి రంభ రూపంలో తపతి దగ్గరకు వెళ్ళి సంవరుణుడు మరణిస్తున్నాడని చెప్పగానే తపతి మరణానికి సిద్ధపడుతుంది. తపతి ఆత్మ త్యాగం చేస్తోందని తెలుసుకున్న రంభా మేనకలు కూడా తపతి లేక జీవించలేక వారుకూడా శరీరాల్ని విడిచిపెట్టడానికి సిద్ధపడతారు. సంవరుణుడు వారిని రక్షిస్తాడు. తపతి మేనక రంభలు ఈ సన్నివేశంలో ఒకరినొకరు కౌగిలించుకొని కన్నీళ్ళ పర్యంతమౌతారు. ఈ సందర్భంలో కరుణరసం శోకమనే స్థాయిభావాన్ని పొందింది.

కావ్య నాటకాలలో రెండింటిలోనూ కరుణరసం కన్పిస్తోంది. అయితే నాటకంలో సంవరుణుడు తపతితో వివాహం కోసమే కాకుండా కొడుకులు లేరని బాధపడడం కూడా కన్పిస్తుంది.

### 3. 3.4 వీరరసం

ప్రబంధ నాయకుడైన సంవరణుడు శృంగార నాయకునిగానే కాక వీర నాయకుడిగా కూడా దర్శనమిస్తాడు. ఆ భరతకుల తిలకుని వీరత్వం శత్రువులను సంహరించడంలో కన్పిస్తుంది.

**"సంగర రంగ భూములను సంవరణక్షితిపాలు సద్భుజా**
**సంగత ఖడ్గరాహువు విశంకట టంక నిరంక శౌర్య ని**
**ర్భంగ విరోధి యూధముల పాండుర కీర్తి మృగాంకుఁ బర్వసం**
**ధిం గబళింప శోణతటినిం దగఁగుంకును భూతసంఘముల్"**

(త.సం.ఉపా.పు. 16)

సంగర రంగంలో వీర విహారం చేసి ప్రతాపుడై విరోధులను నిర్జించి హస్తినను పాలించాడు సంవరణుడు. వనగిరి దుర్గాలలోని జన కంటకుల్ని రూపుమాపి ప్రజల్ని నిర్భీతుల్ని చేయడం అతనిలోని వీరత్వాన్ని సూచిస్తోంది.

**నాటకంలో వీరరసం :**

నాటకంలో తపతి అపహరింపబడిందనుకొని సంవరణుడు హిమగిరిపై అలిగి తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తాడు.

**ఆః దురాత్మన్నచలాధమ ! అతి చిరాన్విష్టోపి న మే ప్రాణేశ్వరీం ప్రకాశయసి. విశ్వవిజయ సమనన్తరవిరమదైక్ష్వాక క్షోణీధరకార్ముకోద్వహనకర్మకర. కచ్చిదనభిజ్ఞోభవాన్ అధ్యాపి. జనితబహుజన్యపౌర వరాజన్య చాప క్రపరాక్రమాణామ్. భవతు తావదధునైన బోధయిష్యతి సంవరణః. (త.సం.పు.127)**

ఓ దురాత్మా, పర్వతాపశదా నువ్వు నాఁ ప్రాణేశ్వరిని దాచి ఎంతసేపు వెతికినా బయట పెట్టడం లేదు. యుద్ధంలో ప్రదర్శించిన నా పరాక్రమ విజృంభణం నీకు తెలియదు. దానిని నీకు ఇప్పుడే తెలియజేస్తానంటాడు.

అమాత్యుడుకూడా సంవరుణుడి ప్రతాపాన్ని చూసి ఆశ్చర్యపోతూ-

**(సోద్వేగమ్ ఆః దురాత్మన్నచలాధమేతి పూర్వోక్తమేవ పఠిత్వా)**

**ప్రయాహి దుహితుః సుతం శరణమద్య శర్వాత్మజం**
**పురఁత్రయహరం హరం స్వయముపేహి జామాతరమ్ ।**

**తథాప్యసుర వాహినీరుధిరపూరగణ్డూషణ-**

**ప్రమోద భరదుర్మదైర్మమ శరైర్న మోముచ్యసే ॥**

**(సవిస్మయమ్) అహోతుఖల్వతిశయితశక్ర ప్రభావేయం దేవస్య ప్రభుశక్తిః యదయమపి నామ వర్షాచలో గౌరీగురురస్యోన్మాద కోపకలుషీకృతః కమ్పతే (త.సం.పు. 128)**

సంవరుణుడి ప్రతాపాన్ని చూసి హిమాద్రి కూడా కలవడి గజగజలాడుతోందని మహేంద్రుని ప్రభావం కంటే ఈ ప్రభుశక్తి గొప్పదనుకుంటాడు.

కావ్యనాటకాలు రెండింటిలోనూ వీరరసం వర్ణించబడింది. అయితే కావ్యంలో సంవరుణుడిని వర్ణిస్తూ వీరత్వం ప్రస్తావించబడింది. నాటకంలో వీరరస ప్రధానంగా వున్న సన్నివేశాన్ని కల్పించాడు రచయిత.

### 3.3.5 బీభత్సరసం

వివాహానంతరం తపతీ సంవరుణులు తపనవనంలోనే కాలం గడుపుతుండగా సంవరుణుడి రాజ్యంలో అత్యంత భయంకరమైన క్షామం ప్రజల్ని పీల్చిపిప్పి చేస్తున్న సందర్భంలో బీభత్స రసం మనకు కన్పిస్తుంది.

**"అనుచు నవ్విధమున నబ్జాక్షితోఁ గూడి**
**నృపతి యామలయాచలేంద్రమందు**
**విషయాభిలాషుఁడై పెక్కు వర్షములుండి**
**ధారుణి పాలింపఁ దలంపఁడయ్యె;**
**నది కారణంబుగా నఖిలలోకములకుఁ**
**దొడరె ననావృష్టి దోషమంత**
**నట్లతి బాధచే హాహాస్వనంబుతో**
**భువనసంక్షోభంబు పుట్టెమిగుల;**
**బంటలును బాఁడితోడ లేబరములయ్యె;**
**నపు డరుంధతి వల్లభుఁ డరగుదెంచి**
**రాజునకు బుద్ధిచెప్పి సామ్రాజ్యవహన**
**సహనుగాఁ జేసి కావించె శాంతి విధులు"** (త.సం.ఉపా. పు.102-103)

సంవరుణుడి రాజ్యంలో క్షామం సంభవించడం వలన లోకానికి సంక్షోభం వాటిల్లిందని, పంటలకి, పశువులకి ఆపద వాటిల్లిందని కవి వర్ణించాడు. సంక్షోభం, జనులు హాహాకారాలు చెయ్యడం బీభత్సరసానికి అనుభావాలు.

**నాటకంలో బీభత్సరసం**

> **ఉద్యుక్తా వాగురాద్యై రహరహరుచితై ర్మత్స్యబన్ధప్రకారై**
> **ర్మర్త్యా నిర్మత్స్యగఙ్గా హ్రదగత శఫరీశేషమగ్నా వశిష్టాః ।**
> **ఆసన్నారూఢ కంఠైరపచితతనవః ప్రాయశః ప్రాణశేషైః**
> **సజ్జధ్యద్ధ్రుచఞ్చుప్రజకుటిల శిరః కర్మకర్మాన్త భూమిః ॥** (త.సం.పు.126)

నాటకంలో దుర్భిక్షమైన క్షామం వలన ప్రజలు ఆకలి బాధ భరించలేక అస్థిపంజరాలు తయారవడమనే విభావం వలన బీభత్సరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ సంవరుణుడి రాజ్యంలో అనావృష్టి సంభవించినపుడు బీభత్సరసం కన్పిస్తోంది.

### 3.3.6 అద్భుత రసం

మలయగిరి వర్ణనలో అద్భుతరస వివరణ కనబడుతుంది. తపతీ సంవరుణులు విహార సమయంలో మలయగిరి ప్రాంతం చేరుతారు. ఆ గిరి సౌందర్యానికి అబ్బురపడతారు. అందులోని వింతలకు, విశేషాలకు విస్మితులవుతారు. విస్మయమే అద్భుతరసానికి స్థాయీ భావం. నాయికా నాయకులలో కలిగిన విస్మయమే అద్భుత రసానికి దారితీసింది. “ఈ చందనాగంబు చందంబులాశ్చర్య కందంబు” లనడంలో వారి మనోభావం వ్యక్తీకరిస్తున్నాడు కవి.

**“చపల నయన ! యీ చందనాగంబు చందంబు లాశ్చర్య కందంబు.... ఆదండ నుద్దండ వేదండ రాట్కర్ణ తాళంబులన్ వాలెమై పాఁపలేఁ బూపతండంబు పాలిచ్చి పెల్లుగ్గగాఁ ద్రావ నుద్యద్భుజంగంబులే కాహుతి గ్రోల... గంధర్వు లంభోజ పత్రేక్షణల్తారు నంభోదయానాళిపైనెక్కి యే తత్కుభృత్కూట కోటి న్విహారాపన స్మత్ప్రకారమ్ముననన్ వచ్చికున్నారు....”**

(త.సం.ఉపా.పు. 102)

సామాన్యంగా పర్వత సానువులలో గోచరించే విషయాలే కాక, ఆ మలయానికి మరి కొన్ని విశేషాలూ ఉన్నాయి. గంధర్వ, కిన్నెర, కింపురుషాదులు అందు విహరిస్తున్నారట. మలయమారుత మంద మంద మాధురులు మానవులతో పాటు దేవతలను అలరిస్తున్నాయి.

మలయపర్వతంలోని వింతలు వర్ణించడంలో, అద్భుత రసాన్ని ప్రవేశపెట్టడమే కాక, ఆ శైల సౌందర్యానికి మైమరచి రాజ ధర్మాన్ని విస్మరించిన సంవరణుని కథలో దానికి ఒక ప్రాముఖ్యాన్ని కలగజేసి, సార్థక్యం సాధించాడు కవి.

నాటకంలో సంవరుణుడు తపతి అడుగు జాడలు, కర్ణపూరం చూసి మన్మథ బాణాలకు గురి చెంది ఆమెను వెతుక్కుంటూ స్ఫటికమణి సభా మండపానికి వస్తాడు. స్ఫటిక మణి మండపాన్ని చూడగానే ఆశ్చర్యానికి లోనౌతాడు.

**ఆమ్లానామహిమోపరోధకలు షామమ్భోరుహాణాం శ్రియం**
**దీప్రాం దీపశిఖామకజ్జలతమోలేశామనుష్ణార్చిషమ్ ।**
**స్త్రీసర్గ ప్రథమాంజ్కురాకృతి మిమామధ్య క్షయన్నాత్మనో**
**నిష్పత్రాకురుతే చిరాయః హృదయం మన్యే స పుష్పాయుధః ॥** (త.సం.పు.90)

సూర్యుడు తపతిని మోహింపజేసి ఆమెను తన దగ్గర వుంచుకొని బిడ్డకు జన్మను ఇచ్చాక సంవరుణుడి వద్దకు చేర్చి, మనమడిని దివ్యమైన ఆహారాలతో పోషించి దేవతలకు సహాయంగా యుద్ధం చేయడానికి సంసిద్ధుడిని చేయడం మొదలైన సన్నివేశాలన్నీ అద్భుత రస ప్రధానమైనవే. కావ్యంలో తపతీ సంవరుణులు ఇద్దరూ విహారార్థం మలయగిరికి వెళ్ళి దాని అందాన్ని చూసి ఆశ్చర్యపోవడమనే విభావం వలన అద్భుతరసం అభివ్యక్తమయింది. నాటకంలో తపతి అడుగుజాడలు, కర్ణపూరం మీద స్వేద బిందువులు ఉండడం, తపతీ సంవరుణులకి కురుపుత్రుడిని వశిష్ఠుడు అప్పగించినప్పుడు సంవరణుడు గద్గదస్వరంతో ఆనందభాష్పాలు రాల్చడం వంటి అనుభవాల వలన అద్భుతరసం అభివ్యక్తమయింది.

### 3.3.7 వత్సల రసం :

నాటకంలో సంవరుణుడికి సంతానం లేదు. అందువల్ల అతడు సంతానం పొందాలనే ఉత్సుకతతో ఉంటాడు. తపతిని వివాహం చేసుకొని ఆమె ద్వారా సంతానాన్ని పొందాలనుకుంటాడు. అయితే సూర్యుడు వివాహానంతరం తపతీ సంవరుణులిద్దరూ ఆనందంగా గడుపుతూ సంవరుణుడు రాజ్యభారాన్ని మరచినపుడు సూర్యుడు తపతిని మోహపెట్టి ఆమెను సావిత్రి వద్ద ఉంచుతాడు. అక్కడే తపతి కుమారుడికి జన్మని ఇస్తుంది. అయితే తపతీ సంవరుణులకి ఈ విషయం తెలియదు. సూర్యుడు తన మనుమడిని దివ్య ఆహారాలతో పోషించి రాక్షసులను సంహరించడానికి దేవతలకు సహాయంగా పంపిస్తాడు.

రంభరూపంలో వచ్చిన తపతీ సంవరుణులకు కష్టం కల్గించిన రాక్షసిని కురుపుత్రుడు నిరోధిస్తాడు. అప్పుడు రాక్షసి సంవరుణుడితో నీ సుతుడు నన్ను బాణాలతో నిరోధించాడు. నా అపరాధాల్ని క్షమించు అని ప్రార్థిస్తుంది.

సంవరుణుడికి ఇదంతా ఆశ్చర్యంగా ఉంటుంది. కొడుకులు లేరని బాధపడుతూవుంటే అతడికి కొడుకు ఉండడం, అతడు ప్రయోజకుడైన తండ్రిని మించిన కుమారుడైన రాక్షసి ఎదురించడం, దేవదానవుల యుద్ధంలో సహాయం చేయడం వంటి కార్యాలు సాధించిన కొడుకును చూసి సంవరుణుడు పొంగిపోతాడు. వశిష్ఠుడు చెబుతూవుంటే ఎంతో ఆసక్తితో తన కుమారుడి జన్మ వృత్తాంతాన్ని తెలుసుకుంటాడు.

**రాజా : (సబాష్పగద్గదం) ఏహి వత్స ! (పరిష్వజ్య మూర్ధ్ని పాఘాయాఙ్కమారోపయతి.**

**నాయికా : (తస్యోత్సఙ్గాద్ బలాదాకృష్యా లిఙ్గన్తీ స్తన్యమిశ్రై రానన్దాశ్రుభి రభిషిఞ్చతి) ఆర్యపుత్ర అహో తే ఆత్మచ్చరితా (త.సం.పు.147)**

ఆనంద భాష్పాలతో గద్గదస్వరంలో వత్సా, రా అంటూ ఆలింగనం చేసుకొని తొడమీద కూర్చో పెట్టుకుంటాడు. ఇక్కడ వత్సల స్థాయీ భావాన్ని పొందింది. కుమారుడి శౌర్యం, ప్రతాపాలు ఉద్దీపములు. ఆలింగనం, అనుభావం. తపతీ సంవరుణులు ఇద్దరూ తమ పుత్రుడిని చూసి ఆనందంతో కౌగిలించుకొని తమ తొడపై కూర్చుండ బెట్టుకుంటారు. కౌగిలించుకోవడమనే అనుభావం వలన వత్సల రసం అభివ్యక్తమయింది.

కావ్యంలో సంవరుణుడు బ్రహ్మచారి. కానీ నాటకంలో సంవరుణుడి ముందే వివాహం అయ్యింది. కాని అతడికి సంతానం లేదు. సంవరుణుడు సంతానం కోసం దేవుడిని ప్రార్థిస్తాడు. తద్వారా తపతి వలన సంతానం కలగడం వలన ఎంతో ఆనందిస్తాడు. కురుపుత్రుడి వలన పుత్రోత్సాహాన్ని పొందడం వలన నాటకంలో వత్సలరసం అభివ్యక్తమయింది. కావ్యంలో వత్సల రసం లేదు.

**4 వర్ణనలు**

**3.4.1 కావ్యంలో వర్ణనలు**

మూలకథను మహా ప్రబంధంగా రూపొందుటకు గంగాధరుడు ప్రబంధోచితమైన వర్ణనలు పెక్కు కల్పించాడు.

1. నగరవర్ణన – దీనికి అంగాలుగా దుర్గం, హర్మ్యం, చాతుర్వర్ణ్యం రథగజ తురగ భటాదులు, వేట వేశ్యా పుష్పలావికాదుల వర్ణనలు. 2. శైలవర్ణన రత్నకూటం, మలయగిరి వర్ణన 3. ఉద్యానవన వర్ణన 4. వసంత ఋతు వర్ణన 5. వన విహారం 6. జలక్రీడ 7. వేట 8. సూర్యాస్తమయం 9. అంధకారం 10. చంద్రోదయం 11. మలయానిలం 12. సూర్యోదయం 13. వివాహ వర్ణన 14. గర్భ వర్ణన 15. పుత్రోదయం 16. తపో వర్ణన 17. విరహ వర్ణన – దీనికి అంగములో మదన మలయానిల చంద్రకోకిలాదుల దూషణ, శీతలోపచారాలు. 18. మదనపూజ 19. నాయికా వర్ణన 20. నాయక వర్ణన 21. శుక వర్ణన 22. వశిష్ఠ వర్ణన 23. సూర్య వర్ణన.

ప్రబంధాలలో ఇష్టదేవతా స్తుతి, గురు నమస్కృతి ముందుగా చేయబడి, వంశాదికం, కావ్యకర్తృత్వం, కవి సంగ్రహంగా వివరించడం కనబడుతుంది. మిశ్రమ కావ్యాలలో పురవర్ణనను నాందిగా గ్రహించి కథా విషయాన్ని ప్రారంభించడం జరుగుతుంది. ఈ నియమాలన్నింటిని గంగాధర కవి యధావిధిగా పాటించాడు. త్రిమూర్తులను, విఘ్నేశ్వరుని, లక్ష్మి, సరస్వతులను మనసారా ప్రార్థించి ఇష్టదేవతా ప్రార్థన చేశాడు.

**"కలుగులే లాయముల్గాఁ బ్రవర్తించు సా**
**ద్రాణి నధిష్ఠించు రౌతు తేఁడు,**
**వీనులగాడ్పుచే మేని సొమ్ముల తూక**
**మగ్గలింపఁగఁ జేయు నర్థికాఁడు,**
**శిరసుపై జాబిల్లి చెందుదండలరీతి**
**మణిజాలముల నించు మన్నె కాఁడు,**
**తనుఁగొల్చు భక్త సంతతుల పాతక జాత**
**మపహరించుక పోవు నటమటీఁడు**

**పదియు నార్వన్నె బంగరుఁ బ్రతిఘటించు**
**మేని చాయలు గల మంచి మెచ్చులాఁడు,**
**ద్విరదవదనుండు, తన దంత విధుమరీచి**
**మత్ప్రబంధాంతరాయ తమంబు నడుఁచు** (త.సం.ఉపా.ప. 1)

తన ప్రబంధ రచనకు ఆటంకాలేవీ కలగ కుండా ఉండాలని విఘ్నేశ్వర స్తుతి చేశాడు గంగాధరుడు. ఆది పూజలందుకునే గణనాయకుడిని పూజించి ఆపై గురుదేవతాస్తుతి చేశాడు.

తరువాత కృతిపతిని ప్రస్తుతించి, దానికి తోడుగా సత్కవి ప్రశంస, కుకవి నిందవంటి ప్రబంధోచిత పద్ధతులన్నింటినీ పరిపూర్ణంగా పాటించి కథా ప్రారంభం చేశాడు.

### 3.4.1.1 నగర వర్ణన :

గంగాధర కవి మొట్టమొదటగా నగర వర్ణన చేశాడు.

**"శ్రీభావిశేష మిశ్రీభావి భవనంబు,**
**సారస కలిత కాసార సమితి**
**ప్రాకారవజ్ర దీప్రాకార హర్మ్యంబు,**
**కుంజరంజిత భద్రకుంజరంబు,**
**రమణీయతావాస రమణీయుత విలాసి,**
**కాంచన సౌధాదికాంచనంబు,**
**రాజహంసకులీన రాజహంసకులంబు,**
**బంధురమ్య గృహస్థ బంధురంబు,**
**కల్పకానల్ప శోభనాకల్పకంబు,**
**గోపుర ద్వార చుంబిత గోపురంబు,**
**సింధుజన్మాశ్వ దేశీయ సింధుజంబు,**
**గజపురం బొప్పు జితమరుద్గజపురంబు"**

(త.సం.ఉపా.పు. 11)

ఒక వైపు రమ్యమైన హర్మ్యాలు మరొకవైపు స్వర్ణమయ సౌధాలు ఎటు చూసినా అందమే. అందానికి అలంకారం తోడైతే ఆ అందం ఇనుమడిస్తుంది. ఈ విషయం తెలిసిన కవి నగరశోభని యమకంలో అలంకరించాడు. గంగాధరునికి శబ్దాలంకార ప్రీతి ఎక్కువ.

**"చుట్టి మిన్నందికొని కోట సొంపుమీఱ**
**నడిమి మణిసౌధ వీధి నింపదర వీడు**
**పెట్టిఁ బెట్టిన పడగల పద్దఁ ద్రాఁచు**
**పైకిఁ దేలిన విధమయ్యెఁ బరిఖమీఁద"**

(త.సం.ఉ.పా.పు. 11)

గగనాన్ని చుంబించే కోట. దాని నడుమ అంతకన్నా ఎత్తైన మణి సౌధ సమూహం. ఈ దృశ్యం పెట్టెలో పెట్టిన పెనుత్రాచు పడగలు విప్పి తల ఎత్తినట్లున్నదని కవి ఉత్ప్రేక్షాలంకారంలో కోటను వర్ణించాడు.

నగరంలో ఉండేది కేవలం గోపురాలు, కోటగోడలే కాదు. పుడమినంతా పరచుకొనే ప్రకృతి కాంతులు, అది చూసి పరవశించే పడుచు హృదయాలు, చల్లని వెన్నెలలు కురిపిస్తూ ఉండే హిమకరుడు, ఆ వెన్నెల వెలుగులో ఆడుకునే కన్యలు. ఇంకా నగర వర్ణనలో చతుర్వర్ణన, రథగజ తురగాదుల వర్ణన, పుష్పలావికల వర్ణనలు, వారవధూటుల వర్ణనలున్నాయి.

### 3.4.1.2 చాతుర్వర్ణ వర్ణన

సంవరణుడి రాజ్యంలో చాతుర్వర్ణాలు ఏ విధంగా పరిపుష్టిని పొందాయో వర్ణించాడు కవి.

**"వేదసమూహంబు విగ్రహవంతమై**
**విలసిల్లె నన మించు విప్రచయము,**
**కీర్తి ప్రపంచముల్ మూ ర్తీభవించిన**
**చందంబు నొందు రాజన్యకంబు,**
**నవవిధానంబులు నవ యవులై నట్ల**
**వర్తిల్లు నేప్రొద్దు వైశ్య సమితి,**
**యారంభసంభార మాకారము ధరించి**
**చూపట్టు గతిఁ బొల్చు శూద్రగణము,**

**చైత్రరథనందనంబులు శుభం మిత్ర**
**జంభ శత్రుపురద్వయీ సవిధ వసతి**
**యుజ్జగించి, ధరాస్థలి నున్నరీతి**
**కరిపురంబునఁ దనరె శృంగారవనులు"**
(త.సం.ఉపా.పు. 14)

వేదాలను ఔపోసన పట్టిన బ్రాహ్మణులు, కీర్తి ప్రపంచంలో మూర్తీభవించిన రాజులు, నవ నిధులకు ఆటపట్టులైన వైశ్యులు, ఆయుధాలను ధరించి శూద్రులు ఉన్నారని వర్ణించాడు కవి. ఈ వర్ణన వలన ఆనాటి సమాజంలో చాతుర్వర్ణ వ్యవస్థ ఏ విధంగా ఉందో తెలుస్తుంది.

### 3.4.1.3 ఉద్యానవన వర్ణన

ధీర లలిత నాయకులు సంగీతాది కళల పట్ల ఆసక్తితో పాటు, ప్రకృతి సౌందర్యారాధనను కలిగి ఉంటారు. ప్రబంధ నాయకుడైన సంవరణుడు ధీరలలితుడు. అందుకే అతనికి వనవిహారమంటే మక్కువ ఎక్కువ –

**మాకందమందార మల్లికా మాలూర**
**మాతులుంగ మధూక మండితంబు,**
**కర్పూరకదళికా కరవీర కౌశిక**
**కందరాళ కదంబకాంతిదంబు,**
**వాసంతికావల్లి వకుళ వంజులదివ్య**
**వరవర్ణినీ వార వైభవంబు,**
**రాజవృక్షరసాల రాజాదన స్థల**
**రాజీవరాజీ విరాజితంబు,**

**నై న యా కేళివనవీథికాంతరంబుఁ**
**జొచ్చి కిసలిత ముకుళిత సుమిత ఫలిత**
**తరులతా విభ్రమంబుల నరయ నిలిచి,**
**చాలఁ జూపట్టె నవ్యవసంతుఁడనఁగ**

(త.సం.ఉపా.పు. 20)

"మా రంద మందాన మల్లికా మాలూర మాతులుంగ మధూక మండితంబు" అంటూ వృత్త్యానుప్రాసలో వనశోభను వర్ణించాడు గంగాధర కవి. నాయకుని మనస్సుకు ఆహ్లాదాన్ని అందిస్తూ వెల్లివిరిసింది వనలక్ష్మి. ఆ ప్రకృతి సౌందర్యాన్ని చూసి పులకించి పోయాడు సంవరణుడు. విరజాజి నవ్వులకు పరవశించాడు. మొల్ల పల్లవముల గిలిగింతలకి ముచ్చట పడ్డాడు. కిందపడ్డ దానిమ్మ గింజలను చూసి ఎర్రనీళ్ళతో వనలక్ష్మి హారతి  ఇచ్చిందని భావించి ఆనందించాడు.

### 3.4.1.4 తపతి వర్ణన

సూర్యపుత్రిక అయిన తపతిని చూడడానికి వెయ్యికన్నులవాడికైన, వెయ్యి నోళ్ళుగల ఆదిశేషుడికైనా వర్ణించడానికి సాధ్యం కాదని గంగాధరకవి వర్ణించాడు.

**"వే యుగరముల విభుపుత్రి విమలగాత్రి**
**నలవియే చూడ వేయు గన్నులయతనికి?**
**వేయునేటికి నేటికి వేయునోళ్ల**
**వానికైనను వర్ణింప వశముగాదు"**

(త.సం.ఉపా.పు.38)

చిలుక తపతి సౌందర్యాన్ని రాజు దగ్గర పూస గుచ్చినట్లు చెబుతుంది. తపతి ముఖసౌందర్యం చూసిన కమలం ముడుచుకుంటే, శశాంకుడు సిగ్గు పడతాడని వర్ణిస్తుంది. గంగాధర కవి తపతి నుదుటిని, చెవులని వర్ణించిన తీరిది.

**చకఁదనమున నా సరోజాతగాంధి**
**పాటి కలకంఠిలేదని పద్మభవుఁడు**
**వ్రాయు లిపి కాస్పదం బదే వనిత నుదురు**
**వేఱె యదుగంగ నేల తద్విభవలీల**

**లోకేశుఁడు నిర్మించుచు**
**నా కామిని ఫాలఫలకము దక్షరముల్**
**రేకలుగ వ్రాసి యిరుగడ**
**శ్రీకారము లిడిన యట్లు చెలువగు వీనుల్.**

(త.సం.ఉపా.పు.27-28)

విశాలమైన నుదురు, నుదుటికి ఇరువైపులా శ్రీకారాలవంటి చెలువైన వీనులు, వీరుని చేతిలో వింటివంటి కనుబొమ్మలు, తపతి కన్నులకు గండుమీనులుగానీ, మరుని శరాలుగానీ, కలువకన్నెలుగానీ సరిపోవట.

పై పద్యంలోని భావాన్ని రామరాజభూషణుడు కూడ క్రింది విధంగా చెప్పాడు.

**"త్రిజగతీ సుదతీరూప విజయకీర్తి**
**గలుగునని యింతి ఫాలభాగము వ్రాసి**
**నలువ యాశుభవాచకంబులకు శ్రీల**
**మొదలుఁ దుది నిల్పెననఁ గర్ణములు దనర్చు".[10]**

---

*10. వసుచరిత్ర, పు.86*

"రామరాజభూషణుని వర్ణనయందు ఫాలమునకు రూపకము లేమి దోషము ఫాలమునకే వ్రాసెననుటకు సంగతి యుండదు. 'శ్రీల... నిల్పె' ననుటకంటె 'శ్రీ కారములిడె' ననుట మేలైన నుడికారము. 'కర్ణములు తనర్చు' ననుట కంటె "చెలువగు వీనుల్" అనుట గుణవత్తరమైన పలుకుబడి"[11]

**ఇంతి కన్నుల తోడ నీడనవచ్చునే**
**గందు మీ లవి నీరు గారుచుండు;**
**నతివ చూపులకును బ్రతియనవచ్చునే**
**మరుని బాణములకు నెరసు దఱుచు;**
**తరుణి దృష్టులతోడ సరియనవచ్చునే**
**కలువ పట్టపగలు గానలేదు;**
**పడఁతి చూడ్కులతోడ బాటనవచ్చునే**
**రేచీకులైన నీరేరుహములు;**

**నీరు గ్రమ్మక యెచ్చోట నెరసు లేక**
**చూడఁ గలిగెల్లప్రొద్దును సొంపుపూని**
**కొలఁదివెట్టినఁ దరగ వక్కోమలికిని**
**జేరలంతలు గన్నులు ధారుణీశ !"**

(త.సం.ఉపా.పు. 28)

చిలుక పలుకులను పోలిన మధురవాక్కు కోకిల స్వరాన్ని పోలిన మధుర గాత్రం తపతి సొంతమని చిలుక చెబుతుంది. తపతి పలువరుస దానిమ్మ పండు గింజలులాగా వున్నాయట. ఆమె చేతులను చూసి ఎరుపెక్కిన పల్లవములు అనుకొని కోయిలలు తినడానికి మక్కువ చూపిస్తాయట. నడుము చాలా చిన్నదిగా ఉండి అసలు కన్పించదట. తపతి అందంలోనే కాదు కళలలో కూడా ఆరితేరిందంటూ వర్ణిస్తుంది.

సంవరుణుడు చిలుక చెప్పిన తపతి సౌందర్యాన్ని తలచుకుంటూ తన ఎదుట నిలబడిన తలోదరిని తపతిగా గుర్తిస్తాడు. వంకలు పట్టలేని వన్నెలు చూసి తన్మయుడవుతాడు. వంకరలేని

---

*11. తపతీ సంవరణోపాఖ్యానము, పీఠిక, పు.* XLVI

చంద్రకళ, వాసనగల పసిడి బొమ్మ తపతి. అందులో దేవకన్య. తాను ఒక్కసారిగా ఎదురుపడితే ఆదృశ్యమౌతుందేమోనని సంశయిస్తాడు. ఆ అతిలోక సౌందర్యాన్ని ప్రశంసించకుండా ఉండలేడు.

**"తొలుకాఱు మెఱుపులో, యెలదీఁగె తఱుపులో,**
**తెఱవ మే యెఱుపులో తెలియరాదు;**
**పవడంపుఁ దీవయో, చివురాకు తీవియో,**
**యెలనాగ మోవియో యెఱుఁగరాదు;**
**నలుపు మానికములో, యలికిశోరకములో,**
**కలికి పెన్నెఱకలో కానరాదు;**
**మరువింటి తూపులో, మచ్చంపు రూపులో,**
**తరలాక్షి చూపులో యరయరాదు;**

**ఖచరకన్యయొ కిన్నరాంగనయొ కాక**
**నీ చకోరాక్షి నేరీతి నెఱుఁగఁ బోలు?**
**కలదె యిటువంటి సొబగు భూకాంతలకును?**
**నేగతిఁ దరింతు సందేహ సాగరంబు?"**

(త.సం.ఉపా.పు.78)

పై పద్యంలో వృత్యానుప్రాసలో తపతి అంద చందాలను వర్ణించాడు గంగాధర కవి.

### 3.4.1.5 సంవరుణుడి వర్ణన

**"ఆ చతురత, యా చెలువం**
**బాచల్లదనంబు, నాఘనౌదార్యకళా**
**వైచిత్రియు, ధరణింగల**
**రాచకుమారులకుఁ గలదె రాకేందుముఖీ!"** (త.సం.ఉపా.పు. 51)

భూమి మీద మరే రాకుమారునకూ లేని చాతుర్యం, సౌందర్యం, కారుణ్యం, ఔదార్యం సంవరుణునిలో చోటు చేసుకున్నాయని చిలుక తపతికి వివరిస్తుంది. ఆ చెలువకు ముచ్చటపడి కన్యకామణులందరూ అతని చిత్తరువు చిత్రించాలని ప్రయత్నించారు కూడా. కానీ వాటిలో ఏ ఒక్కటీ సంవరుణుని సౌందర్యంలో వెయ్యింట ఒక్కవంతుకూడా లేదట.

ఇంకా సంవరణుని అందాన్ని గురించి చెబుతూ జయంతుడు, నల కుబేరుడు, చంద్రుడు, మన్మథుడు సరిరారు సంవరణుడి అందం ముందు అని సంవరణుని అందాన్ని వర్ణిస్తుంది.

చిలుక చెప్పిన సంవరుణుడి వర్ణన వినడం వల్ల తపతి సంవరుణుడి పట్ల అనురాగాన్ని పెంచుకుంటుంది. విప్రలంభ శృంగారానికి బీజం పడడానికి చిలుక చెప్పిన సంవరుణుడి వర్ణనే కారణం. ఇక్కడ సంవరుణుడి రూపం, ఆకారం, చక్కదనం, లావణ్యం తపతికి సహజోద్దీపన విభావాలు.

ఈ విధంగా తపతికి ఏ మాత్రం తీసపోని విధంగా సంవరణుడిని చిత్రించాడు గంగాధరుడు.

### 3.4.1.6 అంధకార వర్ణన

సూర్యాస్తమయం అయిన తరువాత చంద్రోదయానికి ముందు గంగాధరకవి అంధకార వర్ణన చేశాడు. అంధకారంలో అలంకార ద్రవ్యాల్ని తయారుచేసుకోవాలని స్త్రీలు ముచ్చటపడతారని గంగాధరకవి వర్ణించాడు.

**దీనిఁ డిప్పలఁ చెట్టు తెఱఁ గెఱుంగముగాక**
**వసనంబులకు నీలరసముగాదె?**
**దీనిఁ గరాటాంఁ బూన నేరముగాక**
**తలఁచఁ గన్నులకుఁ గజ్జలముగాదె?**
**దీని గుచ్చములుగా దీర్పనేరముగాక**
**నవరాలు గావె కైశ్యంబులకును?**
**దీనిఁ దైలంబునఁ దివియ నోపముగాక**
**రతి రేఖలకు మషీరసము గాదె?**

(త.సు.ఉపా.పు.58)

సంకుసాల నృసింహకవి కవికర్ణరసాయనములో ఈ క్రింది పద్య భావాన్ని అనుకరించాడు.

**కరఁచి చిప్పలఁ బట్టుకత లెఱుంగముగాక,**
**వ్రాయంగ నిది మషీరసముగాదె?**
**బరి గుణంబులు సేయునిర లెఱుంగముగాక,**
**నీలాలసరులు గావింపరాదె?**
**కరవటంబులఁ చెట్టు వెఱ వెఱుంగము గాక,**
**వనితల కిది నవాంజనము గాదె?**

**కడవలఁగొని మంచుగతి యెఱుంగముగాక,**

**బేలల కిది మంచినేలి గాదె?[12]**

### 3.4.1.7 చంద్రోదయ వర్ణన

**అంధకారంబను గంధవారణముపై**

**గుప్పించు సింగంపుఁ గొదమ యనగ,**

**శచికిఁ గైసేసిన శయ్యా గృహంబుపై**

**నెలవుకొల్పిన సుధాకలశ మనఁగ,**

**లాచి పాంథుల మీఁద లావఱనేసిన**

**యలరువిల్తుని సంకుటరిగె యనఁగఁ,**

**ప్రాచీ దిశాకాంత వతికిఁ గానుకఁ గాగఁ**

**బన్నిన కపురంపు గిన్నె యనఁగ,**

**గగన గంగాతరంగిణీ కమలషండ**

**మందు విహరింపఁ బోవు రాయంచ యనఁగ,**

**మహిత నవషోడశకళాసమఁగుఁడగుచుఁ**

**దూర్పు గుబ్బలిపైఁ దోఁచె దుహినకరుఁడు.**

(త.సం.ఉపా.పు. 59)

గంగాధరుని చేతిలో చంద్రోదయ వర్ణన వింత అందాలను సంతరించుకొంది. శశాంకుడు సౌందర్యమూర్తి. వెన్నెల వెలుగులతో జగతిని ఆనంద పారవశ్యంలో ముంచి ఓలలాడిస్తాడు. ఆ చంద్రోదయం ఎంత మనోహరమైందో వీక్షించి ఆనందించవలసిందే. షోడశ కళలతో ప్రకాశిస్తున్నాడు శశాంకుడు. తూరుపు దిక్కున దివ్యకాంతులతో శోభించే తారాప్రియుడు అంధకార గజంపైకి లంఘించే మృగరాజువలె ఇంద్రసతి సచీదేవి శయ్యా మందిరంలో నిలిపిన అమృత భాండంవలె, పాంథులపై గురి చూసి విసిరిన మదన బాణంవలె, మందాకినీ తరంగిణిలో విహరింపబోవు రాజహంసవలె కాంతులీనుతున్నాడట. అంటే మృగరాజులోని గాంభీర్యం, అమృతజలంలోని మాధుర్యం, కుసుమ బాణంలోని సౌకుమార్యం, రాజహంసలోని నైర్మల్యం ఆ చంద్రుడిలో పొందుపరచబడ్డాయి.

---

*12. కవికర్ణ రసాయనము, పు. 91*

నిజకాంతితో తమస్సమూహాన్ని పటాపంచలు చేసి వెలుగురేఖలు నింపుతున్నాడు నిండు చందురుడు. ఇందులో ఒక విశేషం దాగి ఉంది. చంద్రునికి రాజన్న నామాంతరం ఉన్నది. లోకపు చీకటి పారద్రోలి, వెలుగు వెన్నెల ప్రసరింపచేయడంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి తన రాజధర్మాన్ని నెరవేర్చాడు చంద్రుడు.

చంద్రోదయ వర్ణనతో పాటు చంద్ర దూషణకు కూడా ప్రబంధ కవులు సముచిత స్థానాన్ని కల్పించారు. విరహవేదన పడే తపతి ఆ విరహాన్ని మరింత అధికం చేసే చంద్రుని ఆగడాన్ని సహించలేకపోతుంది. లోకానికి వెన్నెల వెలుగుల్ని అందించే ఆ జాబిల్లి ఆమెకు బాధ కలిగిస్తున్నాడు.

**"అమృతమయ స్వరూపుఁ దనయంబును సత్పథవర్తి, చంద్ర శ**
**బ్దము నన్వృతంబు జేయఁ దొకపట్టున నంచు జనుల్ నుతింప నో**
**హిమకర! యా ప్రశంస మఱి యెన్నక మిన్నక వీటఁ బుచ్చి యీ**
**క్రమమునఁ బాంథసంఘములఁ గాఁకల నేఁచఁగ నీకుఁ బాడియే"**

(త.సం.ఉపా.పు 61)

విరహార్తులను తన కిరణాలతో నొప్పించడంవల్లే చంద్రుడు తన రూపానికి, నామాన్ని కూడా కళంకం తెచ్చుకొన్నాడనీ నిందిస్తుంది.

**కడఁకతో రాహువు కబళించి పట్టుచో**
**నీ పౌరుషం బప్డు చూపవలదె?**
**వీరభద్రుఁడు నిన్నుఁ బెనవెట్టి మట్టుచో**
**నీలావులప్పుడే మూలకొదిగె !**
**ఘనకుహుదాసి నీ కళలెల్ల మ్రింగుచో**
**నిర్మూల మయ్యెనే నీ బలంబు?**
**కోపించి దక్షుండు శాపం బొసంగుచో**
**నీ శక్తి యప్పుడే నీటఁ గలసె?**

**చలువ ఱేఁడని పూత్కార సమితి చేత**
**శమన గావించు మముఁ బోటి జనులమీద**
**నిబ్బరంబుగ వేడి వెన్నెలలు గాసి**
**గాసి చేయంగ నీటికిఁ గమలవైరి !**

(త.సం.ఉపా.పు.62)

తపతి చలి వెలుగుని హాలహల సోదరునిగా అభివర్ణించడంలో ఆమె విరహవేదన ఎంత పరాకాష్టకు చేరుకున్నదో తెలుస్తుంది. రాహువు కబళించేటప్పుడు, వీరభద్రుడు చంపదలచినప్పుడు, దక్షుడు శాపమిచ్చునప్పుడు భయపడి విడిచిపెట్టిన పౌరుషం విరహిణుల పట్ల ప్రదర్శిస్తావని అధిక్షేపిస్తుంది. అదే సందర్భంలో "కమలవైరి" అని ప్రయోగించడం కవి చాతుర్యానికి నిదర్శనం. చంద్రోదయం అయితే కమలాలు ముకుళించుకుంటాయి. అందుకే అతడు కమలవైరి అయ్యాడు. కమలం వంటి సుకుమార శరీరం అయిన తపతికి కూడా శత్రువుగా పరిణమించాడు. ఇటువంటి సందర్భోచిత శబ్దాలు ప్రయోగించడం గంగాధరునికి పరిపాటి.

తపతి చేత చంద్రదూషణతో పాటుగా మన్మథ దూషణ కూడా చేయించాడు కవి –

**చిగురాకుఁగైదువుఁ జేరి భక్షించుచోఁ**
**గోయిలలను, నేల కోయవైతి?**
**తూట సింగిణి విల్లు దొరకొని మెసఁగుచోఁ**
**జిలుక ముక్కుల నేల చీరవైతి?**
**పూవుఁ తూపులమీఁది పూఁదేనెఁ గ్రోలుచో**
**నేల తేఁటులఁ బడనేయవైతి?**
**మొగలిరేకు కటారి మొనతావి గబళించు**
**తెమ్మెర నీవేల చిమ్మవైతి?**

**అయ్య జియ్యలు వెట్టి నిన్న నుదినంబు**
**నేము సేవింపఁ గరుణింప వింతయైన;**
**వెఱచి పఱచిన నశరీరి వెంటనంటు**
**ననెడువార్త నిజంబయ్యె నంగసూతి!"** (త.సం.ఉపా.పు. 63)

కోయిలలు, చిలుకలు ఎన్ని అల్లర్లు చేసినా, తుమ్మెదలు, తెమ్మెరలు ఎన్ని ఆగడాలు చేసినా నోరు మెదపని మన్మథుడు విరహార్తుల్ని వదలక వేధిస్తాడన్నది తపతి ఆరోపణ. వలరాజు వాడితూపులేకాక, అతని పరివారంలోని తుమ్మెదల ఝుంకారాలు కూడా మదిలో మదనవేదన కలిగిస్తున్నాయని మథనపడుతుంది. ప్రీతితో పూజలు చేసినా కనికరించడంటుంది. కాలగళుని కంటి మంటతో బూడిదైన అశరీరుడైన సంగతి ముందు తెలియక పూజలు చేశానని బాధపడుతుంది. అంతేకాక బూడిదగా మారిన రతీనాథునికి చేసిన పూజలన్నీ ఆ బూడిదలో పోసిన పన్నీరుగా

వ్యర్థమైపోయాయని వ్యధ చెందుతుంది. తనని ఇంత మనోవేదనకు గురిచేసిన మన్మథుని మీద కోపాన్ని ప్రదర్శించింది తపతి.

చంద్ర, మన్మథ దూషణాదులు విరహవర్ణనలో భాగమైనప్పటికీ గంగాధరుడు వాటిని వేరుగా వర్ణించి ప్రత్యేక ప్రతిపత్తిని కలుగజేశాడు. శృంగార రసాన్ని పరిపుష్టం చెయ్యడానికి కవి తపతి చేత చంద్ర, మన్మథ దూషణ చేయించాడు. చంద్ర, మన్మథ దూషణ శృంగారరసంలో తటస్థోద్దీపనము.

### 3.4.1.8 ఋతువర్ణన

ఈ కావ్యం శృంగార రస ప్రధానమైన కావ్యం కనుక వసంత ఋతువు వర్ణ చేశాడు గంగాధర కవి.

**"అంత వసుంధరంగల వనావళిఁ దోరణగట్టె భగ్న హే**
**మంతము, సుప్రసాదరుచిమంతము, సంతత పాంథలోక హృ**
**చ్చింతము, మానినీజన విశేషదురంతము, దర్పితాఖిల**
**స్వాంతము, దీప్తిమంతము, వసంతము, గంధతరంగ వంతమై"**

(త.సం.ఉపా.పు. 66)

వినడానికి యింపైన శబ్దాలంకారంతో వసంత ఋతువును వర్ణించాడు రచయిత. రుచి మంతం, దీప్తి మంతం అయినది వసంత కాలం. మలయమారుతం నుండి వచ్చే గాలులు, విరబూసిన వనతరులు, మన్మథుని రాకను మృదువుగా తెలియజేస్తున్నాయి. ఆ వనంలోని వృక్షాలు పుష్పాలలోని తేనెతో, తుమ్మెదలు ఝుంకారం అనే మంత్రాల సాక్షిగా మదనుడికి పట్టాభిషేకం చేస్తున్నాయని వర్ణించాడు.

**"మరుదంకురములు వొలసిన**
**సొరిదిం జలియించు చిగురు జొంపము లమరెన్**
**విరహుల గుండియ లవియం**
**బరువడి ఝళిపించు మరుని పట్టెములనఁగన్"**

(త.సం.ఉపా.పు.67)

'గుండియ లవియ' ఎంత చక్కని తెలుగు నుడికారం. విరహంతో ఉండే వారి గుండె అలసి పోయేటట్లుగా మన్మథుడు తన కరవాలం ఝళిపిస్తాడట. వసంత శోభను తిలకిస్తూ ఆనందిస్తున్న, మన్మథుని బాణాలకు గురైన ప్రేమికులు క్షణకాలం కూడా ఎడబాటును కూడా భరించలేరట.

మానవులచే కాక దేవతలు కూడా ఆ వసంత శోభను చూసి, వసంతమాడాలని ఆరాటపడుతున్నారు. కుసుమ పరాగాన్ని ఒకరిపై ఒకరు చల్లుకొని ఆ ప్రదేశాన్ని మరింత శోభాయమానం చేస్తున్నారు.

కిన్నెరలు బంగారమయమైన వీణలు ధరించి హిందోళ రాగాన్ని మేళవించి మన్మథుని దిగ్విజయ గీతాలను పాడారు.

ఈ వసంత ఋతు వర్ణనలో నాయిక చేత పుష్పాపచయం చేయించాడు గంగాధర కవి. ఈ పుష్పాపచయ వర్ణన కూడా ఋతువర్ణనలో భాగంగా చెప్పబడింది. నాయిక తన చెలికత్తెలతో కలసి భూలోకానికి వస్తుంది. భువికి వచ్చిన దేవకాంతలు అక్కడి తరుశోభను, పూల సొబగును చూసి ముగ్ధులై పుష్పాపచయానికి పూనుకుంటారు. పూలు, స్త్రీలు సౌందర్యానికి, సుకుమారానికి ప్రతీకలు. పూలకు, స్త్రీలకు ఉన్న అనుబంధం అలాంటిది. పువ్వుల అందానికి పులకించని స్త్రీలు ఉండరు. ఎదురుగా వికసించి, విరబూసిన విరికన్నెలను చూసిన ఏ కన్య అయినా ఊరికే ఎలా ఉండగలదు? కోయాలనిపిస్తుంది. కోసి ధరించాలనిపిస్తుంది. తపతికి కూడా అలాగే అన్పించింది.

**"కలహంస లేలకో యెలదోఁట కరుదెంచెఁ?**
**గావవి మందంపు గతులు గాని;**
**తిమిరంబు లేలకో దివమందె పొదకట్టెఁ?**
**గావవి కేశపక్షములు గాని,**
**యచలంబు లేలకో యల్లలాడ దొడండెఁ?**
**గావవి మెఱుఁగుఁ జన్గవలు గాని;**
**క్రొమ్మించు లేలకో కొమరారె మధువేళఁ?**
**గావవి శితకటాక్షములు గాని;**

**యెలమి నెలదీఁగ లేలకో మెలఁగ దొడఁగెఁ**
**గావవి సురాంగనా జనాంగములు గాని;**
**యనుచు నితరులు తముఁ గొనియాడ సతులు**
**మిగులఁ గుసుమాపచయకేలిఁ దగిలి రపుడు"**

(త.సం.ఉపా.పు. 68)

కలహంస గమనలు అయిన ఆ రమణీమణుల అందానికి అక్కడి జనులు ఆశ్చర్య చకితులవుతున్నారు. వారి విభ్రమ విలాసాదులకు విచకితులవుతున్నారు. కలహంసలను కాలదన్నే

గమన సౌందర్యం, తిమిరతతిని తిరస్కరించే కురుల సొగసు, పర్వతాలను పరిహసించే వక్షోజసంపద, మెరపు తీగలను మించె కన్నుల కాంతి వీటినన్నింటినీ మించి లతల లావణ్యంతో పోటీపడి మేని సొబగు. ఇవిచాలు చూచేవారి కళ్ళు మిరుమిట్లు గొలిపి, మంత్ర ముగ్ధుల్ని చేయడానికి.

పుష్పాపచయ వర్ణనలో కవి "అమ్మక చెల్ల ! ప్రాణసఖులారడిఁ బెట్టెద రిట్టు చూచిన" అని సఖులు తపతిని అల్లరి పెట్టడం వర్ణిస్తాడు. అమ్మకచెల్ల, అరడిపట్టులాంటి పదబంధాలు గంగాధర కవి వాడి కావ్యాన్ని తెలుగు నుడికారంతో రచించాడు.

చెలులతో కూడా పూదోటలో విహరిస్తున్న తపతి మనసు మనుస్సులో లేదు. చిత్తము అన్యాక్రాంతమైంది.

**"తోడిలతలెల్ల విరులచేఁ దొంగిలింప**
**నొక్క జాజియె ఖిన్నయై యున్నయట్లు**
**తోడిచెలువెల్ల యుపవన క్రీడ సలుపఁ**
**దపతి చింత వహించి సంతాప మందె"**

(త.సం.ఉపా.పు. 70)

తపతి మనఃస్థితి ఉపమాలంకారంలో వివరించబడింది. తక్కిన లతలు విరులతో విరబూస్తుంటే తపతి జాజి తీగెలాగ కృశించె చెలులలో ఒంటరితనాన్ని అనుభవిస్తోందని వర్ణించాడు గంగాధర కవి.

వసంత ఋతువును వర్ణించడం, నాయిక చేత పుష్పాపచయం చేయించడం వల్ల తపతీ సంవరణోపాఖ్యానము శృంగార రసం ప్రధానంగా గల కావ్యమని తెలుస్తోంది.

### 3.4.1.9 జలక్రీడా వర్ణన

నాయిక జలకేళి మొత్తం ఒకే ఒక్క వచనంలో వర్ణించబడింది. తమ అలసటను పోగొట్టుకోవడానికి చెలులు, తన విరహబాధను ఉపశమింప చేసుకోవడానికి తపతి జలకేళికి ఉపక్రమిస్తారు.

**"విహారవిలాసినీ జనులు నిబిడముఖమారుత ప్రేరితంబులైన పయోధరంబులు పెంజెమట సోనవానలు గురియ, వాహినులై నవరోమ రాజి ముక్తాలతా కపట కళిందనందనీ సురధునీ ప్రవాహమార్గంబుల నాభీ సముద్రగామినులైన జలవిహార శారదారంభంబున నింకింపం దలంచి**

**వికచకమల కల్హార ప్రచయ నిష్యంద మకరంద బిందు ధారాళ ధారాలహరీ కూలంకషంబైన కొలనుఁ ప్రవేశించి రొమ్ములబంటి నీటనిల్చి యచ్చెలున విరహ సముద్ర లంఘనంబునకుఁ గట్టిన సేతు బంధంబనఁ జను గొండలు పోలికం జాలు గట్టుకొని చూపట్టు... శిలాతల ప్రదేశంబున.** (త.సం.ఉపా.పు. 70–71)

ఒకరిపై ఒకరు పుప్పొళ్ళు చల్లుకోవడం, చేపలతో తుళ్ళి ఆడడం వర్ణితమయినాయి. "వరంబు వదయుటకు మారు కావరంబు వడసి" వంటి శబ్ద చమత్కారాలను ప్రయోగించి జలక్రీడను వర్ణించాడు కవి.

### 3.4.1.10 తపోవర్ణన

సంవరణుడు చిలుక చెప్పిన తపతి గుణాలనే స్మరిస్తూ ఆమెను ఏ విధంగానైనా పొందాలని ఆదిత్యుడిని ప్రసన్నం చేసుకోవడానికి తపస్సు చెయ్యడానికి పూనుకొంటాడు.

**అటఁజని కాంచె నా జనవరాగ్రణి యంబరచుంబికూటమున్;**
**జటిల మునీశ్వరప్రకర చారుతపోవనపుణ్య వాటమున్,**
**స్ఫుటతర పద్మకైరవ విశోభిత కీలినరః కృపీటమున్,**
**గటుతరదుష్క్రియా దురవగాహ కవాటము, రత్నకూటమున్.**

(త.సం.ఉ.పు.86)

సంవరుణుడు మునివేషం ధరించి రత్నకూటంలో తపస్సు చేయడం ఆరంభిస్తాడు. పై పద్యంలో గంగాధరకవి పెద్దనగారి

**అటఁజని కాంచె భూమిసురుఁ దంబర చుంబిశరస్సరఝ్ఝరీ**
**పటలముహుర్ముహుర్లుఠదభంగతరంగ మృదంగనిస్స్వన**
**స్ఫుటనటనానుకూలపరిపుల్లకలాపకలాపిజాలమున్**
**గటకచరత్కరేణు కరకంపిత సాలము శీతశైలమున్**[13]

పద్యాన్ని అనుకరించి సంవరుణుడు తపస్సుకు పూనుకొన్న విధానాన్ని వర్ణించాడు. ఇంకా సంవరుణుడు తపతిని పొందడానికి సూర్యోదయానికి ముందే నిద్ర లేచి నదిలో స్నానం చేసి కాషాయ వస్త్రం ధరించి నుదుటిమీద విబూది, మెడలో రుద్రాక్షలు ధరించి సంధ్యావందనం చేస్తాడు. దేవదారు వృక్షం క్రింద ఎవ్వరికి కన్పించని ప్రదేశంలో ఒంటరిగా సమాధి స్థితి పొందుతాడు. గాయత్రీ మంత్రాన్ని విడిచిపెట్టకుండా ఆ అర్కుడికి పూజలు చేస్తాడు.

---

*13. మనుచరిత్ర, పు. 83*

**"ఆవాహన మొనర్చె నరుణున, కాసనం**

**బిచ్చె హేళికిఁ, బాద్య మిడియె రవికిఁ**

**దరణి కర్ఘ్యము లిచ్చెఁ, దపనున కొసఁగె నా**

**చమనీయ, మాదిత్యు జలకమార్చె,**

**బటవంతుఁ జేసె రుక్పతి, నర్కు నుపవీతుఁ**

**గావించె, ద్యుమణికి గంధ మలఁదె,**

**బూషు కక్షతలిడెఁ, బువ్వులఁ బూజించె**

**భాను, మిత్రునకు ధూపము ఘటించె,**

**దీపమొనరించె మందేహ తాపసునకుఁ,**

**గలిత నైవేద్య మర్పించె గగన మణికి;**

**నమరఁ గల్పించె దాంబూల మర్యమునకు,**

**నల్లనిగ గూర్పుమని వేడె నబ్జసఖుని"** (త.సం.ఉపా.పు. 48)

సూర్యుడిని ఆవాహన చేసి, ఆసనం, అర్ఘ్యం, పాద్యం, యజ్ఞోపవీతం, గంధం, అక్షింతలు, పువ్వులు, ధూపదీపాలు, నైవేద్యం, తాంబూలం మొదలైన షోడషోపచారాలు సూర్యునికి సమర్పించి తన భక్తిని చాటుకున్నాడు సంవరణుడు. తపతిని ఎంతో గాఢంగా ప్రేమించడం వల్లనే ఎలాగైనా సరే ఆమెనే వివాహం చేసుకోవాలనే సంకల్పంతో సంవరుణుడు తపస్సుకు పూనుకొన్నాడు.

### 3.4.1.11 వివాహ వర్ణన

వివాహమనేది స్త్రీ పురుషుల జీవితంలో మధుర ఘట్టం. ఆ మాధుర్యాన్ని వారి జీవితాలలో మిగల్చడానికి వివాహవేళలో అనేక అంశాలను ఏర్పరుచుకున్నారు. తెలుగు వారు వాటిలో ఏ ఒక్కటీ మరచిపోకుండా తెలుగువారి సంప్రదాయం ప్రకారం తపతీ సంవరణులకు వివాహం జరిపించాడు గంగాధరుడు.

జరుగుతున్న దేశాన్ని ఏలే రాజు పెళ్ళి. వివాహంలో కల్యాణ మండపానికి అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. మరి రాజు వివాహానికి రాజ్యమంతా పందిళ్ళేవేశారు.

**"ఒక్కొక్కవాడకన్న మఱి యొండొక వాడ విలాసవంతమై,**

**యొక్కొక మేడకన్న మఱొయొండొక మేడ విచిత్ర వర్ణమై,**

**యొక్కక యింటికన్న మఱి యొండొకయిల్లు వినోదయు క్తమై,**

**యెక్కడఁ జూచిన న్నగర మింపదరం గయిసేసి రెంతయున్"**

(త.సం.ఉపా.పు. 93)

ఒక్కొక్క వాడ కన్నా మరొకవాడ, ఒక్కొక మేడకన్నా మరొక మేడ, ఒక్కొక్క యింటిని మించి మరొక ఇల్లు పోటీపడి అందంగా తీర్చిదిద్దారు. ఈ విధంగా నగరమంతా అలంకరించబడింది.

వధూవరులను అలంకరించడం పెళ్ళిలో అతిముఖ్యమై అంశం. ముఖ్యంగా వధువును అలంకరించడం ఇంక చెప్పనక్కర్లేదు. స్త్రీలందరూ తపతిని అలంకరించడం మొదలు పెట్టారు.

**"కరకంకణంబులు ఘల్లుఘల్లన నోర్తు**

**పడఁతికి నంటె సంపంగి నూనె;**

**క్రొవ్వాఁడి నఖములఁ గురులు దిద్ది యొకర్తు**

**భామకు నిడియె గంధామలకము;**

**జలకమార్చె నొకర్తు జలజాయతాక్షికిఁ**

**జల్లని తేట గొజ్జంగి నీటఁ;**

**దడియొత్తె నొకతె కాంతాలలామకు మంచి**

**వలిపంపు పట్టు దువ్వలువ చేతఁ;**

**కాంత కొసఁగె నొకతె చంద్ర కావిచేల;**

**నబ్జగంధికి వేణి యల్లార్చె నొకతె;**

**వెలఁది కొక్కతె తురుమున విరులు దురిమెఁ;**

**దొడవు లన్నియుఁ బడఁతికిఁ దొడిగె నొకతె"** (త.సం.ఉపా.పు. 95-96)

"తపతికి సంపంగి నూనెపెట్టి అభ్యంగన మంగళస్నానం చేయించారు. పట్టు వస్త్రాలు ధరింపజేశారు. కురుల ఆరబెట్టి విరులు తురిమారు.

**కరిపురీశుండును జతుర్విధాలంకార మనోహరాకారుండై వధూభవన గమనోన్ముఖుండగుచు మౌహూర్తిక కృత స్వస్తి వచనంబులు గైకొని నిజసదనంబు వెడలి కక్ష్యాంతంబులు గడచి భూసురాశీర్వాద నాద సమ్మోద మేదురహృదయారవిందుఁడై మనోవేగంబున మెలంగెడు పుష్పరథంబు**

**నారోహణం బొనరించి.... సకల బంధు సమాజంబుతో నెదుర్కొని రథావతీర్ణుండైన యనుంగుఁ బెండ్లికొడుకు పురోభాగంబునం జనుచు సమ విషయోన్నతస్థలలు వక్కాణించుచుండ నల్లన మందిరంబు డాయం జనునప్పుడు".** (త.సం.ఉపా.పు.96)

సంవరుణు చతుర్విధాలంకారాలతో కూడి మనోహరాకారుడై ప్రకాశిస్తున్నాడు. ధరాపతులు ఇరువైపులా పరివేష్ఠించిరాగా, భూసురులు స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలు చేస్తుండగా, భేరీ నాదాలు భువనమంతా వినిపిస్తుండగా వధువు గృహాన్ని చేరాడు సంవరుణుడు. ఈ విధంగా గంగాధరకవి సంవరుణుడు వనత గృహాన్ని చేరడం వచనంలో వర్ణించాడు. పద్యంలో వర్ణించడం గంగాధరకవి సరిపోక పదివరుసల వచనంలో వర్ణించి సంవరణుడి మీద మమకారాన్ని చాటుకున్నాడు.

సూర్యుడు తన కుమార్తెను వశిష్ఠదంపతులకు అప్పగిస్తూ ఇక తపతికి తల్లిదండ్రులు మీరే అని వారి మీద పూర్తి బాధ్యత వేస్తాడు. ఆ క్షణం నుండి తపతికి వారు సొంత పుత్రికగానే భావిస్తారు. అందుకే ఆమె కల్యాణాన్ని దగ్గరుండి వైభవంగా జరుపుతారు. అరుంధతీదేవి పెళ్ళికుమారుడిని గారాబు అల్లుడిగా గౌరవించి, కర్పూర నీరాజనాలిచ్చి దగ్గరుండి వివాహవేదికను తీసుకువస్తుంది. అరుంధతి బంగారు బిందెతో నీరందించగా, వశిష్ఠుడు సంవరణుని పాదాలు కడిగి, కన్యాదానం చేస్తాడు.

**"గౌరీ కల్యాణంబట**
**నారీమణు లెల్లఁబాడ నవపుణ్యకళా**
**పారీణుఁడై వసిష్ఠుం**
**దూరీకృతనియతి ధారవోసెం దపతిన్"**

(త.సం.ఉపా.పు. 97)

ఈ విధంగా తపతీ సంవరుణుల వివాహం ఎంతో వైభవంగా జరిగింది. వధూవరుల మధ్య తెలగించబడింది. తెర ఎత్తగానే వారి మదిలో కోరికలు తెరలెత్తాయట.

**"అంగుళములు చలియింపఁగ,**
**బొంగుచు సర్వాంగములను బులకలు మొలువన్**
**శృంగార నాయకుం డొగి**
**మంగళసూత్రంబుఁ గట్టె ముదవతి యఋంతన్"**

(త.సం.ఉపా.పు.98)

శృంగార నాయకుడైన సంవరణుడు తపతి మెడలో మంగళ సూత్రం ముడివేశాడు. జీవితంలో మరవలేని మధురఘట్టం ఇది. ఆ తరుణంలో కలిగే తీయని భావనలను మనస్సుకి హత్తుకునేటట్లు వివరించడానికీ "అంగుళములు చలియింపగ పొంగుచు సర్వాంగములను పులకలు మొలువన్". అని తెలియజేశాడు. కవి మాటల్లో వెలిబుచ్చలేని భావం శరీరంగాల ద్వారా వ్యక్తం చేసినట్టు వర్ణించాడు.

అల్లుడైన సంవరణుడు సామాన్య మానవుడు కాదు. అందుకే వశిష్ఠుడు అసామాన్యమైన అరణాలను అల్లుడికి యిచ్చాడు.

**"బంగారు రథములు పదునాలు వేలును,**
**నినుమడి యైన గంధేభఘటలు**
**సొంమాణి తేజీలు షష్ఠి సహస్రంబు**
**లందఱే పరిచారికాంగనలును**
**నవరత్న కీలిత నానావిభూషణ**
**వ్యూహ మంజూషిక లొక్కలక్ష**
**చీనిచీనాంబర శ్రేణుల మేల్తర**
**మైన పెట్టియలు కోటానకోట్లు**
**గంధకర్పూర కస్తూరికా హిమాంబు**
**సంకుమద గంధసార ప్రశస్త వస్తు**
**వరసమాజంబు మునివరుం దరణముగను**
**బెండ్లి కొడుకున కిచ్చె సంప్రీతి తోడ"**

(త.సం.ఉపా.పు. 99)

బంగారు రథాలు, పరిచారికాంగనలు, చీనిచీనాంబురాలు, గంధ, కర్పూర, కస్తూరికాది సుగంధ ద్రవ్యాలు అల్లుడికి కట్నంగా ఇచ్చాడు వశిష్ఠుడు.

### 3.4.1.12 గిరి వర్ణన

గంగాధర కవి నగర వర్ణనకు ఇచ్చినంత ప్రాముఖ్యాన్ని గిరి వర్ణనకూ ఇచ్చి మలయగిరిని వర్ణించాడు. నాయికా నాయకులు వివాహానంతరం విహారార్థం మలయాచలం చేరి, ఆ పర్వత సానువులపై విహరిస్తారు. ఈ సందర్భంలో నాయకుని చేత మలయాచల ప్రశంస చేయించటంలో ఎంతో ఔచిత్యం కనబడుతుంది.

**"ఈ చందనాగంబు చందంబు లాశ్చర్యకందంబు, గందంపుఁ జెట్టై యధః కంధరాసీమలన్ వేమరున్ వేమిళద్గంధ సంబంధం బంధం బులై యుండ, నాదండ నుద్దండ వేదండ రాట్కర్ణ తాళంబులన్ బాలెమై పాఁపలేఁ బూపతండంబు పాలిచ్చి పెల్లుగ్గుగా ద్రావ నుద్యద్భుజంగంబు లేకాగ్రహుతిం గ్రోలఁ దద్భూరి పూత్కార వాతాద్గమక్ష్వేల కీలాహతిం గ్రాఁగియో నీదు బింబాధరస్యంది ధారామృత స్పర్శ సంబంధి శైత్యంబునం బొంది మందానిలాంకూరముల్ గందపుంజేరులై, చందనామంద గంధంబులన్ దిక్కులం బెక్కు చందంబులొందం బచారింపఁగాఁ జూచితే మేచకాంభోరుహాక్షీ ! మహాక్షీణతాహేతు సూనాది వాస్వాది సంజావ చేతోముదంబంది పైభూములం గిన్నరీ కిన్నర ద్వంద్వముల్ కిన్నెరుల్ పూని తారస్వరంబెత్తి తాళక్రియల్హత్తి గీతప్రబంధంబులన్ మోహ బంధంబుగాఁ బాడుచో మెచ్చి మమ్మాయనంబోలు గొమ్మాభ్రమే తద్వరం బెచ్చెనో మచ్చకంటీ కనుంగొంటి... సల్పందగున్"**
(త.సం.ఉపా.పు. 103)

ఈ విధంగా గంగాధర కవి మలయగిరి వర్ణనను దండకంలో పొందుపరిచాడు. మలయాచలం చందనశైలం గంధ భరితం, శీతలయుక్తమై, పరిమళ సంయుక్తమై ఉన్నది. మనోహరమైన మలయాచలాన్ని అనుప్రాసతో వర్ణించాడు గంగాధరుడు. గరుడు, గంధర్వ, కిన్నెర, కింపురుషాదులు ఇక్కడ విహరించడం వల్ల దీని కీర్తి భూలోకానికే పరిమితం కాలేదు. స్వర్గలోకానికి కూడా పాకింది. దేవతలను కూడా ఆకర్షించడం వల్లే తపతీ సంవరణులు ముగ్ధులై ఎంతకాలమైనా మలయాచలాన్ని విడిచి రాలేదు.

### 3.4.2 నాటకంలో వర్ణనలు

#### 3.4.2.1 సూర్యోదయం వర్ణన

నాటకంలో ప్రథమాంకంలో సంవరణుడు తనకు కల్గిన స్వప్న వృత్తాంతాన్ని విదూషకుడికి తెలియజేయడానికి విదూషకుడి కోసం చూస్తున్న సందర్భంలో అప్పుడే ఉదయించడానికి సిద్ధంగా ఉన్న సూర్యుడిని వర్ణిస్తున్నాడు.

**శాలీనాం పరిపచ్యమాన కణిశశ్రేణీశిఖా పాటలై**
**ర ప్రౌఢిరతిమాత్ర మర్కమహసామ గ్రైర నాలీఢయా ।**
**సంకోచాదధిపశ్చిమాశ మపరిధ్యస్తావకాశం దృశా**
**మద్యాపి స్థితమంబురశిలహరీతన్వ్యా తమోమాత్రయా ॥**

(త.సం.పు.70)

### 3.4.2.2. కర్ణపూరం వర్ణన

సంవరణుడికి పాదాల గుర్తులు కర్ణపూరము కన్పించిన తరువాత అవి ధరించిన స్త్రీ మీదికి మనస్సు వెళుతుంది. ఆమె ధరించిన కర్ణపూరాన్ని వర్ణిస్తున్నాడు కవి.

**క్రమైః కైశ్చిన్మృదు మణిదలైర్గండ సంసర్గలాభా**
**ద్ధన్యైః స్వేద ప్రకరసు భగైశ్చిత్రితైః పత్రభంగైః ।**
**సోయం శుభ్రైః శబలిత తనుః షట్పద క్షోభలగ్నైః**
**సాన్ద్రామోదై రలకసుమనోరేణుభిః కర్ణపూరః ॥**

(త.సం.పు.75)

ఆ కర్ణాభరణము కన్యక తలలో ధరించిన పూల ధూళిచేత, ఆమె పత్రభంగము యొక్క రంగుచేత, ఆమె స్వేద బిందువులచేత అలంకరింపబడి ఉందని వర్ణిస్తున్నాడు కవి. కర్ణపూరము తపతి పాదధూళి, పత్రభంగము, స్వేదబిందువులచేత అలంకరింపబడి ఉండడం వల్ల ఇది చూసిన నాయకుడి మనస్సులో రతీ భావాన్ని కలిగించింది. నాయిక కర్ణపూరము నాయకుడికి సహజోద్దీపన విభావము

### 3.4.2.3 దేవి కోప వర్ణన

రాజు తపతి పట్ల అనురక్తుడవడం వల్ల సంవరణుడి భార్య దేవికి కోపం వస్తుంది. ఆ సందర్భంలో దేవి కోపాన్ని వర్ణిస్తున్నాడు కవి.

**"అకుటిల విషమాభ్యాం భ్రూలతాభ్యామిదానీ -**
**ముపహితకుచకంపై రశ్రు సంరోధ యత్నైః ।**
**ప్రణయకుపిత గర్భైరుమ్ధహాసైర్మ దీయం**
**చకితయసి ముధైవ త్వం చకోరాక్షి ! చేతః ॥"**

(త.సం.పు.79)

ఓ చకోరాక్షీ ! కౌటిల్యంలేని వంకరగా ఉన్న నీ కనుబొమలతో, వక్షజాల కంపనలతో, కన్నీటిని ఆపుకొనే ప్రయత్నంతో ప్రణయకోపంతో కూడిన అందమైన చిరునవ్వులతో నీవు నా హృదయాన్ని కదిలిస్తున్నావు. ఈ వర్ణనలో శృంగారరసం అభివ్యక్తమయింది.

**3.4.2.4 దేవాలయ పరిసర ప్రాంత వర్ణన**

సంవరణుడి విరహ బాధను ఉపశమింపజేయడానికి విదూషకుడు కల్యాణవామనమనే పురుషోత్తముని దేవాలయానికి సంవరణుడిని తీసుకు వెళ్తాడు. ఆ దేవాలయ పరిసర ప్రాంతాన్ని వర్ణిస్తున్నాడు కవి.

**సంమూర్ఛన్మహిషాక్ష ధూపకలికాధూమ్రాః పయోరేణుభిః**
**శుభ్రాః కుంకుమ కేసరారుణరుచః కర్పూరచూర్ణస్పృశః ।**
**ఆఘ్రాతామద మంజులై రలికులై రస్మాక మధ్యక్లమం**
**లుంపన్తః శిశిరా వనాన్తమరుతో లింపన్తి నాసా పుటమ్ ॥** (త.సం.పు.87)

దేవాలయము మీదుగా వీచే పవనాలు చల్లటి నీటి జల్లులను, కుంకుమ రేణువులను, కర్పూర రేణువులతో కలసి వాయువులను పీలుస్తుంటే అప్పటి వరకూ చేసిన ప్రయాణపు బడలిక తీరిపోయిందని వర్ణిస్తున్నాడు కవి.

**3.4.2.5 వామనుని వర్ణన :**

అక్కడ దేవాలయంలోని వామనుడిని వర్ణిస్తూ రాసిన శ్లోకమిది.

**"ధృతాషాఢం శశచ్ఛుచి శబల కృష్ణాజినధరం**
**శిఖాబద్ధ గ్రంధి క్రమవరనుతి వ్యాపృత ముఖమ్ ।**
**దధద్ బ్రాహ్మం సూత్రం కటితటలుఠ న్మౌంజిరశనం**
**హ్రీసీయో వందేహం వనజనయనం వామనవపుః ॥"** (త.సం.పు.87)

ఆ దేవాలయంలో కొలువైన వామనుడు పద్మవంటి నేత్రాలతో, జింక చర్మం ధరించి, శిరస్సున ఈక ధరించి, బ్రహ్మసూత్రాన్ని వేసుకొని, ముంజా గడ్డిని వస్త్రంగా చేసుకొని ఉన్నాడు. అటువంటి వామనుడిని రాజు స్తుతిస్తున్నాడు.

**3.4.2.6 స్ఫటిక సభా మండపం వర్ణన**

విదూషకుడు, రాజు విహరిస్తుండగా అక్కడ స్ఫటిక మణి సభా మండపము వారికి కన్పించింది. రాజు స్ఫటిక మణి సభా మండపాన్ని వర్ణించిన శ్లోకమిది.

**“అమ్లానామహిమోపరోధ కలుషామంభోరుహాణాం శ్రియం**
**దీప్రాం దీపశిఖామకజ్జలతమోలేశామనుష్ణార్చిషమ్ ।**
**స్త్రీ సర్గ ప్రథమాంకు రాకృతి మిమామధ్యక్ష యన్నాత్మనో**
**నిష్పాత్రాకురుతే చిరాయ హృదయం మన్యే స పుష్పాయుధః ॥”**

(త.సం.పు.90)

మంచుకప్పిన స్ఫటి మణిమందిరము మూయుటకానీ, వాడుట కానీ లేకుండా చీకటి కొంచెం కూడా చేరకుండా వెలిగిపోతుంది. బ్రహ్మ స్త్రీని ఏ విధంగా సృష్టించాడో ఆ విధంగా ఉంది. ఈ స్ఫటిక మండపం. మన్మథుడు నా మీద మోహనాస్త్రాన్ని ప్రయోగించాడా అన్నట్టుగా ఉంది. చూస్తున్న కొలది వింత సోయగాలు కన్పిస్తున్నాయి. అని స్ఫటిక మణి సభామండపాన్ని వర్ణించాడు కవి.

**నాయిక లేని స్ఫటిక సభా మండపాన్ని వర్ణిస్తున్నాడు కవి**

**“విహీనం పార్వత్యా భసితసితమంగం పశుపతే**
**ర్వినా భాగీరథ్యా తుహినధవలం దూర్జటిగురుమ్ ।**
**శ్రీయాదుగ్ధాంభోధిం విగతమివ చ ప్రాణ సమయా**
**తయా శూన్యం మన్యే శుచిమణి గృహం శోచ్య మధునా ॥”** (త.సం.పు.99)

ప్రాణసమానమైన తపతిలేని సభామండపము భస్మములేని ఈశ్వరుని శరీరంలాగా, గంగానది లేని భవుదులాగా, లక్ష్మీదేవి లేని పాలసముద్రంవలె ఉందని వర్ణించాడు కవి. విరహ బాధలో వున్న సంవరుణుడికి స్ఫటిక సభామండపాన్ని చూసినా కూడా ఆనందం కలుగలేదు పైగా ఆ విరహం మరికాస్త ఎక్కువైయ్యింది. విరహ అవస్థలో చంద్రమలయానిల దూషణలాగా సంవరుణుడు స్ఫటిక సభామండపాన్ని నిందించాడు.

### 3.4.2.7 ప్రకృతి వర్ణన

తాపస కుమారుడు బిల్వదళాలు, సమిధలు, దర్భలు, తెల్లతామరపూలు ఆశ్రమానికి తీసుకువస్తూ ప్రకృతిని గమనిస్తూ పక్షులు, తుమ్మెదల చేష్టలను కవి చెప్పిన శ్లోకమిది.

**అర్థాభ్యుద్గత పత్రకం పరిలుఠత్ పత్రేషు పంకేరుహం**
**ప్రాయః పోతక జాతకం కురరికాః పక్షైః సమూహన్త్యమూః ।)**
**అన్తః సుప్తమధువ్రతాం శిశయిషుః శీతాంశు సంకోచితాం**
**భృంగీ దత్తదలార్గలాం కమలినీం పర్యేతి పర్యుత్సుకా ॥** (త.సం.పు.97)

చంద్రోదయం అవడంవల్ల పద్మాలు ముడుచుకుపోయాయి. అప్పటి వరకు తేనెను సేవించిన మగ తుమ్మెద పద్మంలో చిక్కుకొని పోవడంవల్ల ఆడ తుమ్మెద మగ తుమ్మెదను కలవాలనే కోరికతో దాని చుట్టూ తిరుగుతూ వుంది. పక్షులు వాటి పిల్లలను రెక్కల క్రింద దాచుకుంటున్నాయి. తాపస కుమారుడు ఈ దృశ్యాలను చూసి పక్షులకు కూడా గడు తుచ్ఛమైన ప్రవృత్తి అనుకుంటాడు. పక్షుల సంసారాన్ని కవి వర్ణించడంవల్ల ముందు ముందు సంవరుణుడు కూడా భార్యతో సుఖంగా జీవిస్తాడని పిల్లలపట్ల మమకారాన్ని కలిగివుంటాడని కవి ప్రతీకగా చెప్పాడు.

**ముగింపు :**

నాటకంలో కర్ణపూరం, తపతి పాదవిన్యాసం, సంవరుణుడు మన్మథ సందేశాన్ని తెలిపే పద్యాక్షరాల్ని పూరించడం మొదలైన కల్పనలు ఉన్నాయి. కావ్యంలో చిలుక కల్పన ఉంది. కావ్యంలో సంవరుణుడు అనుకూల నాయకుడు. నాటకంలో సంవరుణుడు దక్షిణ నాయకుడు. కావ్యంలో తపతీ సంవరుణుల ప్రేమ కన్నా నాటకంలో తపతీ సంవరుణుల ప్రేమ గొప్పది. కావ్యంలో కంటే నాటకంలో తపతి పాత్ర ఉదాత్తంగా చిత్రింపబడింది. నాటకంలో తపతికి వివాహం చెయ్యాలని సూర్యుడు వరాన్వేషణ చేస్తే, కావ్యంలో చిలుక తపతికి వరాన్వేషణ చేస్తుంది. కావ్యంలో కంటే నాటకంలో సూర్యుడి పాత్ర ఉదాత్తంగా పోషింపబడింది. కావ్యంలో వశిష్ఠుడు సంరుణుడికి కర్తవ్య బోధచేస్తే నాటకంలో అమాత్యుడు చేస్తాడు. కావ్యంలో వశిష్ఠుడితో పాటు అరుంధతి కూడ తపతీ సంవరుణులకి వివాహం చెయ్యడం ఔచిత్యవంతంగా ఉంది. నాటకంలో విదూషకుడు సంవరుణుడికి చేదోడు వాదోడుగా ఉండి తపతీ సంవరుణుల వివాహానికి దోహద పడతాడు. కావ్య నాటకాలు రెండింటిలోనూ అభిలాష విప్రలంభం, సంభోగశృంగారం పోషింపబడ్డాయి. నాటకంలో విరహ విప్రలంభం కూడ పోషింపబడింది. కావ్య నాటకాలు రెండింటిలోనూ శృంగారరసమే ప్రదానంగా ఉండి వీర, అద్భుత, బీభత్సరసాలు అంగరసాలుగా ఉన్నాయి. కేవలం నాటకంలో మాత్రమే హాస్య, వత్సల, కరుణ రసాలు ఉన్నాయి.

4వ అధ్యాయం

# సుభద్రా ధనంజయం - సుభద్రా కల్యాణము నాటక కావ్యాల పరిశీలన

4వ అధ్యాయం

# సుభద్రా ధనంజయం - సుభద్రా కల్యాణము నాటక కావ్యాల పరిశీలన

## 4.0 పరిచయం

**తాళ్ళపాక తిమ్మక్క :**

'సుభద్రా కల్యాణము' కావ్యాన్ని రాసింది తాళ్ళపాక తిమ్మక్క. తొలి తెలుగు కవయిత్రి. ఈమె పదకవితా పితామహుడైన తాళ్ళపాక అన్నమాచార్యుని ప్రథమపత్ని. అన్నమాచార్యుడు 1424-1503లోని వాడుగా శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు నిరూపించారు. అందువల్ల తిమ్మక్క కూడా ఈ కాలానికి చెందినదే. ఈమెనే తిరుమలాంబ అని, తిమ్మాంబ అని వ్యవహరిస్తారు. ఈమె సుభద్రా కల్యాణాన్ని మంజరీ ద్విపదలో రచించింది.

"తిమ్మక్కగారి సుభద్రా కల్యాణానికి ఆధారం నన్నయగారి భారతమే. వారు ఆదిపర్వం అష్టమాశ్వాసంలో 135 గద్యపద్యాలలో 'విజయ విలాసం' రచించారు. (ఆది. 8-89 నుండి 223 దాకా). వారు చూపిన త్రోవలోనే తిమ్మక్క 1163 పాదాల ద్విపదకావ్యం వ్రాసింది. ఈమె తన రచనను కావ్యం అనే పెద్ద మాటలతో పిలువలేదు. ఇది పాట అని మాత్రమే చెప్పుకుంది. అయితే 'కడుమంచి తేట పలుకుల'తో చెప్పినట్టు తెలియజేసింది. కొన్ని కొన్ని ఘట్టాలలో నన్నయగారు మూలాతి క్రమణ చేసినట్లే ఈమె కూడా స్వతంత్రించి పాటకు జీవం పోసింది".

ఈ సుభద్ర వివాహ గాథనే అనేక మంది కవులు తరువాత ప్రబంధంగా, నాటకంగా రచించారు. ప్రాచీనులలో చేమకూర వేంకటకవి, కూచిమంచి జగ్గకవి, ఆధునికులలో శ్రీ వావికొలను సుబ్బారావు, శ్రీ ముదిగొండ నాగ వీరయ్యశాస్త్రి ముఖ్యులు. కానీ ఈ కథను ప్రత్యేక గ్రంథంగా రూపొందించిన ఆద్యురాలు తిమ్మక్క.

సుభద్రా కల్యాణ కావ్యం, సుభద్రా ధనంజయం నాటకం రెండూ మిశ్రమాలే. ఈ రెండూ భారతకథను తీసుకొని కవి లేదా రచయితలు కావ్య, నాటకాలకు తగిన కల్పనలు చేసి రసవత్తరంగా రచించారు.

---

*1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం మొదటి సంపుటి, పు.1010*

**కులశేఖరవర్మ :**

తపతీ సంవరణం నాటక కర్త కూడా కులశేఖర వర్మయే. ఈ రచయిత గురించి ముందు అధ్యాయంలో తెలియజేశాను.

**4.1.0 ఇతివృత్త పరిచయం :**

పాండవులు ద్రౌపదిని వివాహం చేసుకొని ఇంద్రప్రస్థంలో నివాసం ఉంటున్న సందర్భంలో నారదుడు వచ్చి సుందోపసుందులు అన్నదములు అయినా స్త్రీ కోసమే వారిరువురు శరీరాలు విడిచిపెట్టారు. కావున మీరు ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్కరి దగ్గర ద్రౌపది ఉండేలా నియమం ఏర్పాటు చేసుకోండని సలహా యిస్తాడు.

నారదుడి సలహా ప్రకారం ద్రౌపది ఒక్కరి దగ్గర ఉండగా వేరొకరు ఆ సమీప ప్రదేశంలోకి రాకూడదని నియమం. ఈ నియమాన్ని అతిక్రమించిన వారు ఒక సంవత్సరం తీర్థయాత్రలు చేసిరావాలి. అయితే ద్రౌపది ధర్మరాజు దగ్గర ఉండగా ఒక విప్రుడు తన గోవులను రక్షించమని అర్జునుడిని వేడుకోవడంవల్ల అర్జునుడు ఆయుధాలకోసం ధర్మజుడి గృహానికి వెళ్తాడు. అర్జునుడు నియమాన్ని అతిక్రమించడం వల్ల ఒక సంవత్సరం తీర్థయాత్రకు బయలుదేరతాడు. దారిలో ఉలూచి, చిత్రాంగదలను వివాహం చేసుకొని ద్వారకకు వెళ్ళి కృష్ణుడిని కలుసుకొని శ్రీకృష్ణుడి సహాయంతో కపట యతి వేషంలో సుభద్రతో సేవలు చేయించుకుంటూ ఉంటాడు. సుభద్ర కపట యతి చేష్టలకు ఆశ్చర్యపడి శ్రీకృష్ణుడికి తెలియజేయగా, కృష్ణుడు నర్మగర్భంగా అతడు అర్జునుడేనని సూచిస్తాడు. వచ్చినవాడు అర్జునుడే అని గ్రహించిన సుభద్ర తాను అలంకరించుకొని యతిని అర్జునుడి గురించి ప్రశ్నిస్తుంది. యతి తానే కిరీటినని తెలియజేసి ఆమెను గాంధర్వ వివాహం చేసుకుంటానంటాడు. సుభద్ర అతనిని వారించి సిగ్గుతో అంతఃపురంలోకి వెళ్ళి విరహవేదన అనుభవిస్తుంది. రుక్మిణి ఈ విషయాన్ని శ్రీకృష్ణుడికి తెలియజేస్తుంది. శ్రీకృష్ణుడు వీరికి వివాహం జరిపిస్తాడు. సుభద్రార్జునులు అందరి దగ్గర ఆశీర్వచనాలు తీసుకొని ఇంద్రప్రస్థానానికి పయనమౌతారు. బలరాముడికి ఈ కల్యాణం ఇష్టం ఉండదు. అందువల్ల యాదవసైన్యం సుభద్రను అర్జునుడు అపహరించుకుపోతున్నాడేమో అని భావించి అర్జునుడిపైకి బాణప్రయోగం చేస్తారు. అర్జునుడు వారిని ఎదిరించి సుభద్రను తీసుకొని స్వస్థలానికి చేరుకుంటాడు. అక్కడ వీరు అందరి ఆశీస్సులు పొందాక ధర్మరాజు సుభద్రార్జునులకు ద్రౌపదితో తమ్ముడి శోభనానికి ఏర్పాట్లు చేయమని ఆజ్ఞాపిస్తాడు. సుభద్రార్జునులు దాంపత్య జీవనాన్ని సాగిస్తూ ఉంటారు.

**4.1.1 నాటకంలో కల్పనలు :**

1. దుర్యోధనుడు సుభద్రను వివాహం చేసుకోవాలని అలంబసుడనే రాక్షసుడిని పంపించి సుభద్రను అపహరించడం ఆమెను అర్జునుడు రక్షించడం.
2. సుభద్ర గాత్రిక జారిపడడం దాని మీద అర్జునుడి పదిపేర్లు లిఖించబడి ఉండడం.
3. గాత్రిక వృత్తాంతమే పలుమార్లు పునరావృతం కావడం, గాత్రికను చూడగానే అర్జునుడు విరహవేదన నుండి ఉపశమనం పొందడం.
4. సుభద్ర తనను రాక్షసబారి నుండి రక్షించిన పురుషుడి మీద, తన చేత సేవలు చేయించుకుంటున్న పరివ్రాజకుడి మీద, తన మేనత్త కొడుకైన అర్జునుడి మీద ప్రేమ కలగడంవల్ల పురుషత్రయాన్ని ప్రేమించానని తలచి శరీర త్యాగానికి సిద్ధపడడం.
5. సుభద్ర అస్వస్థురాలైనందువల్ల యతికి సుభద్ర చేయవలసిన సేవలు రుక్మిణి చెయ్యడం.
6. తన సేవకు సుభద్రరాలేదని అర్జునుడు విలపించడం.
7. విదూషకుడు అర్జునుడితో పారిజాతవృక్షం దగ్గరకు వెళ్ళి సుభద్రను అడగమని సలహా ఇవ్వగా అర్జునుడు దానిని ఖండించడం.
8. సుభద్ర సఖులు రహస్యంగా విదూషక, అర్జునుల మాటలు విని సన్యాసి నీ కోసమే తపిస్తున్నాడని సుభద్రకు తెలియ జేయడం.
9. పురుషత్రయాన్ని ప్రేమించానన్న సుభద్ర శరీరత్యాగానికి సిద్ధపడగా అర్జునుడు ఆమెను రక్షించి గాంధర్వ వివాహం చేసుకోవడం.
10. సుభద్ర తను ప్రేమించిన ముగ్గురు పురుషులు ఒక్కరే అని, అతడు అర్జునుడే అని తెలిసి ఆనందించడం.
11. తీర్థయాత్రా సమయం ఒక్క సంవత్సరం గడిచిపోయినా అర్జునుడు తిరిగిరాకపోవడం వల్ల కారణం తెలుసుకోమని ధర్మరాజు దీర్ఘధ్వగుడిని పంపించడం.
12. సుభద్రా ధనంజయులు వివాహం చేసుకొని వస్తున్నారని తెలిసి పట్టణాన్ని అలంకరించమని ధర్మరాజు ప్రతీహారకుడిని ఆజ్ఞాపించడం.

13. ద్రౌపదికి సపత్నీమత్సరం కలుగకుండా సుభద్ర గోపాలికా వేషంలో వస్తోందని తెలిసి ద్రౌపది బాధపడి అలా రావడం ఆమెకు ఇష్టమోకాదో తెలుసుకొని రమ్మని చేటిని ఆజ్ఞాపించడం.

14. సుభద్ర అలంబసుడనే రాక్షసుడిచే తిరిగి అపహరింపబడడం అర్జునుడు మూర్ఛిల్లి శరీరాన్ని విడిచిపెట్టడానికి సిద్ధపడడం.

15. విదూషకుడు అర్జునుడికి ధైర్యవచనాలు నూరిపోసి కర్తవ్యోన్ముఖుడిని చేయడం.

16. అపహరింపబడిన సుభద్రను కాత్యాయనీ దేవి రక్షించి అర్జునుడికి అప్పగించడం.

17. కాత్యాయని దేవిచే రక్షింపబడ్డ సుభద్ర ద్రౌపది రూపంలో కన్పించడం.

18. నిజ ద్రౌపది ఎవరో తెలుసుకోలేక అర్జునాదులు ఆందోళన చెందడం.

19. నిజ ద్రౌపది తన భాగ్య శేషమే సుభద్రను క్షేమంగా తీసుకువచ్చిందని ఆనందించడం.

20. అర్జునుడు తీర్థయాత్రలకు వెళ్ళడం తనకు బాధ కలిగించినా శ్రీకృష్ణుడితో సంబంధ బాంధవ్యాలు పెట్టుకోవడం తనకి ఎంతో ఆనందాన్ని కలిగించిందని ధర్మరాజు తెలియజేయడం.

### 4.1.2 నాటకంలో కల్పనల ఔచిత్యం :

సుభద్రను వివాహం చేసుకోవడానికి అర్జునుడు యతి వేషం ధరించడం వ్యాస భారతంలో లేదు. ఇది ఆంధ్ర మహాభారతం, భాగవతములోనే ఉంది. దీనిని కులశేఖరవర్మ గ్రహించి నాటంలో ప్రవేశపెట్టాడు. ద్రౌపది ప్రీతికోసం సుభద్ర గోపాలికా వేషాన్ని ధరించడం సంస్కృత భారతంలో ఉంది. బలరాముడు సుభద్రను అర్జునుడి సేవకు నియమించడం, సుభద్ర అంతఃపురంలో అర్జునుడికి నివాసం ఏర్పాటు చెయ్యడం, సుభద్రకు బదులుగా యతి పరిచర్యకు రుర్మిణిని నియమించడం, రైవతకోత్సవానికి బలరామాదులు వెళ్ళిన సమయంలో రహస్యంగా శ్రీకృష్ణుడు ఇంద్రాదులతో కలసి సుభద్రార్జునుల వివాహం జరిపించడం వంటి విషయాలు ఆంధ్ర మహాభారతంలో ఉన్నాయి. వీటిని కూడ గ్రహించి కులశేఖరవర్మ తన నాటకంలో ప్రవేశపెట్టాడు.

సుభద్రాధనంజయం నాటంలో కులశేఖరవర్మ కల్పించిన కల్పనలు నాలుగు. అవి.

1. అలంబసుడనే రాక్షసుడు సుభద్రను అపహరించడం వలన అర్జునుడు ఆమెను రక్షిస్తాడు. ఆ సమయంలో సుభద్రార్జునులు ఒకరికొకరు చూసుకోవడం వలన

వారిలో ఉద్దీపన విభావం కలిగి శృంగారరసానికి బీజం పడుతుంది. సుభద్రార్జునులకు అనురాగం ఏర్పడడానికి రాక్షసుడి కల్పన ఉపయోగపడింది.

2. సుభద్ర గాత్రిక అర్జునుడికి దొరకడం, దాని మీద అర్జునుడి పదిపేర్లు ఉండడం అనే కల్పనలు అర్జునుడిలో బీజరూపంలో ఉన్న రతిని పరిపుష్టం చేయడానికి ఉపయోగపడింది. అర్జునుడు విరహవేదనని అనుభవిస్తున్న సమయంలో ఈ గాత్రికి అర్జునుడికి ఉపశాంతి కలిగిందిచింది.

3. సుభద్ర తనను రాక్షసబారి నుండి రక్షించిన పురుషుడిని, యతిని, అర్జునుడిని ముగ్గురు పురుషుల్ని ఒకేసారి ప్రేమించానని బాధపడి మరణించడానికి సిద్ధపడుతుంది. ఈ కల్పన సుభద్ర సచ్ఛీలతని తెలియజేసి సుభద్ర పాత్రకి మరింత గౌరవాన్ని తెచ్చింది.

4. పంచమాంకంలో కూడ సుభద్రను రాక్షసుడు అపహరించడం వల్ల సుభద్రార్జునులకు వియోగం కలిగి విరహ విప్రలంభం పోషింపబడింది. అర్జునుడు రాక్షసుడిని ఎదుర్కొనడంలో వీరరసం, కాత్యాయనికి సుభద్రను రక్షించి ద్రౌపదిరూపంలో కన్పించడం వలన అద్భుతరసం అభివ్యక్తమయింది. ఈ విధంగా నాటకంలోని కల్పనలు సుభద్రార్జునుల పాత్రలకి వన్నెతెచ్చి నాటకం రసాత్మకంగా సాగడానికి ఉపకరించాయి.

### 4.1.3 కావ్యంలో కల్పనలు:

1. నారదుడు ఇంద్రప్రస్థానానికి వచ్చి ధర్మాదులతో సుందోపసుందులను గురించి చెప్పి ద్రౌపది విషయంలో అన్నదమ్ముల్ని ఒక నియమాన్ని ఏర్పాటు చేసుకోమని చెప్పడం.
2. అర్జునుడి ఉలూచి, చిత్రాంగదలను వివాహం చేసుకోవడం, పంచకన్యలను శాపవిమోచనం కలిగించడం.
3. కపటయతి వేషంలో ఉన్న అర్జునుడు సుభద్రను ఆటపట్టించడం.
4. సుభద్ర యతి చేష్టలకు తట్టుకోలేక కృష్ణుడికి ఫిర్యాదు చేయడం.
5. శ్రీకృష్ణుడు అర్జునుడిని మందలించి, సుభద్రను స్వాంతన పరచడం.
6. కృష్ణుడు అర్జునుడి గొప్పతనాన్ని చెప్పి కపట యతియే అర్జునుడని చెప్పకనే చెప్పడం.

7. శ్రీ కృష్ణుడి మాటలవల్ల యతివేషంలో వచ్చినవాడు అర్జునుడే అని తెలుసుకున్న సుభద్ర ముందు తాను అర్జునుడితో మాట్లాడలేక తాను పెంచిన చిలుక సహాయం తీసుకొని దానిచే మాట్లాడించడం.

8. తరువాత సుభద్ర అర్జునుడి క్షేమ సమాచారాలను కపటి యతిని అడగటం.

9. కపటయతి రూపంలో ఉన్న అర్జునుడు బయటపడి సుభద్రను గాంధర్వ వివాహం చేసుకుంటాననడం. సుభద్ర అర్జునుడిని వారించి అంతఃపురంలోకి వెళ్ళడం.

10. వివాహానంతరం అత్తవారింట ఏ విధంగా ఉండాలో రుక్మిణి సుభద్రకు సూచనలివ్వడం.

11. ధర్మరాజు ఆదేశం మేరకు ద్రౌపది సుభద్రా ధనజంయులకు శోభనం ఏర్పాటు చెయ్యడం.

12. అర్జునుడిని సుభద్రతో పంచుకుంటున్నందుకు ద్రౌపదికి బాధ కలగడం.

**4.1.4 కావ్యంలో కల్పనల ఔచిత్యం :**

తిమ్మక్క ఆంధ్ర మహాభారతం నుండి సుభద్రా కల్యాణ కథను గ్రహించినా మూలానికి అనేక మెరుగులు పెట్టి సుభద్రా కల్యాణాన్ని రచించింది. సుందోపసుందులు తపస్సు చేసిన తీరు, బ్రహ్మదేవుడు వీరికి వరాలు ఇవ్వడం, సుందోపసుందులు మారు రూపాలు ధరించి రాజులను, ఋషులను కిన్నెరలను బాధించడం వారు ఆ బాధలను తట్టుకోలేక బ్రహ్మకు విన్నవించడం, బ్రహ్మ ఆజ్ఞచేత విశ్వకర్మ సుందోపసుందులను సంహరించడానికి తిలోత్తమను సృష్టించడం. సుందోపసుందులు తిలోత్తమకోసం మరణించడం వంటి విషయాలను నారదుడు ధర్మరాజాదులతో చెప్పినట్టు నన్నయ భారతంలో ఉంది. తిమ్మక్క సుందోపసుందుల గురించి విస్తృతంగా చెప్పకుండ సంగ్రహించి –

**సుదతికై సుందోప – సుందుల చరిత**
**విదితముగ జెప్పెదను – వినుడంచు బలికె**
**సుందరి కొఱకునై – సూడు పుట్టంగ**
**సుందోపసుందులు – గ్రమంది మన్నెరి**

(సు.క.పు. 1)

అని చెప్పింది. సుభద్రా కల్యాణ కథకి సుందోపసుందుల వృత్తాంతం ఆటంకంగా మారకూడదని భావించి సంక్షిప్త పరచడం ఔచిత్యవంతంగా ఉంది.

నన్నయ భారతంలో నియమాన్ని అతిక్రమించిన అర్జునుడు తీర్థయాత్రలకి బయలుదేరుతున్న సమయంలో ధర్మరాజు దొంగలను చంపి బ్రాహ్మణుడికి మేలు చేసినందువల్ల నియమాన్ని అతిక్రమించినట్టు కాదు ప్రాయశ్చిత్తం చేసుకోవడం ఎందుకంటాడు. తిమ్మక్క ధర్మరాజు అర్జునుడితో–

**నినువిడిచి యొక ఘడియ – నే నుండ లేను**

**నను విడిచి యే రీతి – చనెదవోయన్న**

(సు.క.పు. 3)

అంటూ అర్జునుడిని ఆపే ప్రయత్నం చేస్తాడు. నువ్వు లేకపోతే నేను ఒక్క క్షణం కూడ ఉండలేను అనడంలో ధర్మరాజు సోదర ప్రేమను తిమ్మక్క చక్కగా వ్యక్తం చేసింది.

నన్నయ భారతంలో సుభద్ర యతి ఆకారసౌష్ఠవాన్ని చూసి వచ్చినది అర్జునుడేమోనని అనుకుంటుంది. సుభద్రాకల్యాణములో యతిరూపంలో ఉన్న అర్జునుడు కావాలని కల్పించుకొని –

**ఇందు పురోహితం – దెవ్వరె నీకు**

**అందమైనట్టి ఘడి – యారమ్మ నేదె**

**అన్నియు నేలనీ – యాశ్రితుడ నీనె**

(సు.క.పు. 18)

అంటూ నర్మగర్భంగా సుభద్రతో సరసాలు ఆడతాడు. ఈ విషయాన్ని సుభద్ర శ్రీకృష్ణుడికి తెలియజేస్తే కృష్ణుడు యతిరూపంలో ఉన్నది అర్జునుడేనని స్ఫురించేటట్టు మాట్లాడతాడు. కపట యతి రూపంలో ఉన్నది అర్జునుడేనని నిర్ధారించుకున్న సుభద్ర అలంకరించుకొని కపటయతిని అర్జునుడి గురించి అడుగుతుంది. కపటయతి సుభద్రతో చనువుగా ప్రవర్తించడం, సుభద్ర అలంకరించుకోవడం వంటి కల్పనలు సుభద్రార్జునుల మధ్య అనురాగాన్ని మరింత పెంచి శృంగార రసాన్ని పరిపుష్టం చేశాయి.

ముగ్ధ అయిన సుభద్ర అర్జునుడితో మాట్లాడడానికి సిగ్గుపడవచ్చని భావించిన తిమ్మక్క చిలుక చేత రాయబారాన్ని నడిపించింది. సుభద్ర పెంపుడు చిలుక అర్జునుడి భుజంపైవాలి –

**"బావ లేలెమ్మని - బడలికల్ తెలిపి**
**మోవి గంటిని చేసి - ముద్దులు వెట్టె"**
(సు.క.పు.32)

అంటూ సుభద్రకు ఉన్న సిగ్గు అనే తెరదించే ప్రయత్నం చేసింది. చిలుక సుభద్రార్జునుల మధ్య ప్రణయ రాయబారాన్ని నడిపి సుభద్ర బెరుకును పోగొట్టడం ఔచిత్యవంతంగా ఉంది. చేమకూర వెంకటకవి కూడ విజయవిలాస ప్రబంధంలో తిమ్మక్కను అనుసరించి సుభద్రార్జునుల మధ్య చిలుక రాయబారాన్ని నడిపాడు.

నన్నయ భారతంలో సుభద్రతో అర్జునుడు గాంధర్వ వివాహం చేసుకుందామంటే మనకు పెద్దవాళ్ళే వివాహం చేస్తారని సుభద్ర అంతఃపురంలోకి వెళ్ళిపోతుంది. వెంటనే శ్రీకృష్ణుడు ఏర్పాట్లు చేసి వివాహం జరిపిస్తాడు. సుభద్రా కల్యాణములో అంతఃపురంలోకి వెళ్ళిపోయిన సుభద్ర పట్ల అర్జునుడు విరహవేదనని అనుభవిస్తూ -

**ఇంతికి నాపేర - దేల చెప్పితిని**
**కాంతయులోనికి - గ్రక్కునబోయె**
(సు.క.పు.35)

అంటూ విలపిస్తాడు. సుభద్ర కూడ అర్జునుడి వలన విరహాన్ని అనుభవిస్తుంది. పరస్పరం ఇరువురు మన్మథ బాణాలకు గురౌవడం వలన శృంగారరసం అభివ్యక్తమయింది.

నన్నయ భారతంలో "అయ్యిరువుర యన్యోన్య ప్రణయంబులు దన దివ్య జ్ఞానంబునం జేసి"[2] అనడంతో సుభద్రార్జునుల పరస్పర అనురాగాన్ని శ్రీకృష్ణుడు దివ్యజ్ఞానంతో తెలుసుకున్నాడు. కానీ సుభద్రా కల్యాణములో విరహవేదనని అనుభవిస్తూ ముసుగు పెట్టిన సుభద్రను రుక్మిణి చూసి శ్రీకృష్ణుడికి చెబుతుంది. శ్రీకృష్ణుడిని దివ్యపురుషుడి కాక సామాన్య మానవుడిగా తిమ్మక్క చిత్రించింది. కృష్ణుడిని దివ్యపురుషుడు కాక ఒక సాధారణ సోదరుడిగా చిత్రించడం వల్ల చదివే పాఠకుడు కూడ శ్రీకృష్ణుడితో సహానుభూతి చెందుతాడు. రుక్మిణి సుభద్రను ఆటపట్టించడంలో వదినా మరదళ్ల అనుబంధాన్ని తిమ్మక్క నేర్పుగా చెప్పింది.

వివాహానంతరం రుక్మిణి సుభద్ర అత్తవారింట ఏ విధంగా మెలగాలో రుక్మిణి తెలియజేయడం, ద్రౌపది సుభద్ర పట్ల అసూయ చెందడం వంటి విషయాలలో తిమ్మక్క స్త్రీల మనస్తత్వాన్ని చక్కగా చిత్రించింది.

---

*2. శ్రీమదాంధ్ర మహాభారతము, పు.843*

ఈ విధంగా తిమ్మక్క బావ బావమరదుల వేళాకోళాలు, బావామరదళ్ళ సరసాలు, వదినా మరదళ్ళ ఆటపట్టింపులు, సవతుల మధ్య సంఘర్షణ వంటి కల్పనలను కథలో చొప్పించి, తెలుగు నుడికారాలతో, సుభద్రా కల్యాణము కావ్యాన్ని రచించి ఆంధ్రసాహిత్యంలో తొలి తెలుగు కవయిత్రిగా తిమ్మక్క శాశ్వత స్థానాన్ని సంపాదించుకుంది.

### 4.2 పాత్రపోషణ

#### 4.2.1 అర్జునుడు

శృంగార నాయకులలో అర్జునుడు దక్షిణుడు. అనేక నాయకలపట్ల సమానమైన అనురాగం కలవాడు దక్షిణుడు. అర్జునుడు కావ్యంలో ద్రౌపది, ఉలూచి, చిత్రాంగద, సుభద్రలను వివాహం చేసుకొన్నాడు.

**కులీనత :**

అర్జునుడు కౌరవ వంశంలో జన్మించాడు. ఇంద్రుడికి పుత్రుడు. ద్రోణుడికి శిష్యుడు. సుభద్రా కల్యాణం కావ్యంలో అర్జునుడు సుభద్రతో గాంధర్వ వివాహం చేసుకుంటానన్నప్పుడు సుభద్ర తల్లిదండ్రులు, అన్నలు ఉన్నారు వారి ఆజ్ఞతో వివాహం చేసుకుందామని చెప్పి అర్జునుడిని విడిచి వచ్చేస్తుంది. సుభద్ర అర్జునుడిని విడిచిపెట్టి వచ్చినందుకు అతడు ఎంతగానో తపిస్తున్నాడో అనుకుంటూ ఈ విధంగా పలుకుతుంది.

**యింద్ర నందనుడు మ -హేంద్రస్తుతుండు**
**చేరి వినయమ్మున - చెట్ట బట్టినను**
**విడిపించుకొని మఱి - వేగ బోయితిని**

(సు.క.పు. 37)

అని అర్జునుడు ఇంద్రుడు కుమారుడని పేర్కొంటుంది.

**ఉజ్జ్వలత :**

స్ఫురద్రూపము కలిగి ఉండటం యౌజ్జ్వల్యం  కపట యతిని చూసి సుభద్ర అర్జునుడి రూపాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్న సందర్భంలో తిమ్మక్క అర్జునుడిని వర్ణించిన తీరిది.

**విజయుని రూపవి - వేక సంపదలు**

**గజరాజవరదుచే - గరిమ నే విందు**

**తెగవాలు కన్నులు - దీర్ఘ బాహువులు**

**పగడంపు వన్నెగల - పాదపద్మములు**

(సు.క. పుట. 26)

అర్జునుడు కుంతికి ఇంద్రుని అనుగ్రహం వలన జన్మించాడు. పాండురాజు కొడుకు. ధర్మరాజు తమ్ముడు. ద్రౌపది, ఉలూచి, చిత్రాంగి, సుభద్రలకు భర్త. విలువిద్యలో తిరుగులేనివాడు. రూప సౌందర్యవంతుడు. సుభద్ర అర్జునుడి వాలుకన్నులు, దీర్ఘబాహువులు, పగడపు రంగు కలిగిన పాదపద్మములు గలవాడని అతని రూపురేఖలు ఈ యతిలో స్పష్టంగా కన్పిస్తున్నాయి అనుకొంటుంది.

**ధర్మాకలనం :**

కావ్యంలో అర్జునుడు నియమాన్ని అతిక్రమించి ఒక సంవత్సర కాలం పాటు తీర్థయాత్రలకు వెళుతున్న అర్జునుడిని వారిస్తున్న ధర్మరాజుతో అర్జునుడు పలికిన పలుకులివి.

**"మనము గావించిన - మర్యాద లన్ని**

**మనమె చేయకయున్న - మఱి ధర్మమేది?**

**అనుచు ధర్మజచేత - ననిపించు కొనియె**

**యన్న పాదములకు - నతిభక్తి మ్రొక్కి**

**వాయునందనునకు - వందనం బొసగి**

**కవలు మ్రొక్కినవారి - గౌగిట జేర్చి**

**ఆయతిథి చేతను - అనిపించుకొనియు"**

(సు.క.పు. 3 - 4)

ధర్మరాజు నియమాన్ని పక్కనబెట్టి తీర్థయాత్రకు వెళ్ళవద్దన్నా అర్జునుడు మనం ఏర్పరుచుకున్న పద్ధతుల్ని మనమే అతిక్రమిస్తే ఎలాగా అంటూ ధర్మజుడికి ధర్మాన్ని ఉపదేశిస్తాడు.

తీర్థయాత్రలో నాగకన్య ఉలూచి అర్జునుడిని కామించి మాయచేసి నాగలోకానికి తీసుకు వెళుతుంది. అక్కడ ఆమెతో అతడు నారదుడి ఆజ్ఞ మేరకు నేను తీర్థయాత్రలు చేస్తున్నాను. నీ మనోభీష్టాన్ని ఎలా నెరవేర్చగలను అని అంటే ఉలూచి దానికి -

**"ధర్మమేదియు ప్రాణ - దానముతోను**
**తల దూగదని మహా - త్ములు పలుకుదురు**
**చేకొని తన్ను ర - క్షించిన మీకు**
**పాకశాసని! వ్రత - భంగ మెక్కడిది**
**పరగ ధర్మ స్థితి - పాంచాలి కడను**
**సరగ మీ చేసిన - సమయమ్ము కాద"**

(సు.క.పు. 5)

పాంచాలిని మీ పాండవులు ఐదుగురు వివాహం చేసుకోలేదా? నన్ను కూడా వివాహం చేసుకొని రక్షించు అన్న ఉలూచి మాటలలోని ధర్మస్థితి అవగాహన చేసుకొని ఆమెను చేపట్టి పుత్రుడిని పొందుతాడు. ఈ సందర్భంలో అర్జునుడికి గల ధర్మపరతర్పత అవగతమౌతుంది.

**మహాభాగ్యం :**

సుభద్రార్జునులకు శ్రీకృష్ణుడు దేవతల సమక్షంలో వివాహం జరిపిస్తాడు. వివాహానంతరం సుభద్రను తీసుకువెళుతున్న అర్జునుడిపై యాదవ సైన్యం దాడి చేస్తే వీరోచితంగా ఎదుర్కొంటాడు.

**"బలభద్రునితో నిట్లు - పలికె శ్రీకృష్ణు**
**డనఘుడు ధర్మజ్ఞ - డతినీతిపరుడు**
**తన మేనమరదలి - తాను గొంపోయె**
**వలదని యెవరికి - వారింప వశము**
**బలవంతు డాతడు - బహుశస్త్రవేది**
**అటుగాక ద్రోణుల - కనుగు శిష్యుండు**
**కదనములో వాని - కదియంగ దరమ**
**యెదిగిన కన్య మన - యింటిలో నున్న**
**మనము చేయకయున్న - మగువ బెండ్లాడె"**

(సు.క.పు. 47)

శ్రీకృష్ణుడు, అర్జునుడు సుభద్రను తీసుకు వెళ్ళడం సమంజసమే అని అర్జునుడు చేసిన పనిని సమర్థిస్తూ అర్జునుడు బలవంతుడు, అదీగాక ద్రోణుడు వంటి గురువుకు ప్రియమైన శిష్యుడు. యుద్ధ రంగంలో అర్జునుడిని ఎదురించడం కష్టం అంటూ అర్జునుడి వీరత్వాన్ని కొనియాడతాడు.

**నాటకంలో అర్జునుడు :**

అర్జునుడు తీర్థయాత్రలు చేస్తూ సుభద్రను వివాహం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ద్వారకకు బయలుదేరతాడు. దారిలో అలంబసుడనే రాక్షసి చేత అపహరింపబడిన కన్యకు (సుభద్ర)ను రక్షిస్తాడు. కన్యక కటాక్ష చూపులను, విలాసాలకు ఆమెపట్ల ముగ్ధుడై ఆమె గురించే ఆలోచిస్తాడు. అర్జునుడి పది పేర్లు ఉన్న కన్యక గాత్రిక అర్జునుడికి దొరకుతుంది. ఈ గాత్రిక అర్జునుడికి కన్యకను పదే పదే గుర్తుచేస్తుంది.

**కోను ఖల్వేనం వ్యామోహయతి (ఉపసృత్య పశ్యన్) మూర్ఖ ! మాభైషీః కాచిదియం ప్రవరమణి ప్రత్యుప్త మధ్య మండలా జామ్బూనదమయీ గాత్రికా మన్యేతస్యా ఏవం కన్యకాయాః ప్రమథ ప్రక్షోభే ప్రచ్యుతయానయా భవితవ్యమ్. (సాదరమాదాయ హృదయే నిక్షిపన్) అయి ప్రక్షీణ పుణ్యాసంచయే (సు.ధ.పు.83)**

అర్జునుడు ముందు సుభద్రను వివాహం చేసుకోవాలనే కోరికతో ఉండడం వలన, తరువాత కన్యక కటాక్షవీక్షణాలకు ఆకర్షితుడవ్వడం వలన ఇద్దరి స్త్రీలను వివాహం చేసుకోవాలనుకుంటాడు.

అర్జునుడు సుభద్రను వివాహం చేసుకోవడానికి యతివేషం ధరించిన సమయంలో విదూషకుడు అర్జునుడితో సుభద్రను వివాహం చేసుకుంటే బలరాముడు మొదలైన యాదవ వీరులు ఒప్పుకుంటారా అంటూ సందేహాన్ని వెలిబుచ్చుతాడు. ఈ సందర్భంలో అర్జునుడు–

**"మదధీన సకల జన్మఫలే సతి చరాచరగురావపరే సంగచ్ఛన్తాం సాత్వతాః సుయోధనేన" (సు.ధ.పు.83)**

అశేష జనులకు గురువైన వాసుదేవుడు నాకు అనుకూలంగా ఉండగా ఇతర యాదవులు, ఆ సుయోధనుడి వలన నాకు భయంలేదని తెలియజేస్తాడు.

అర్జునుడు ద్వారకకు వెళ్ళి యతివేషం ధరించి సుభద్ర చేత సేవలు పొందుతూ ఉంటాడు. సుభద్ర తనను రాక్షస బారి నుండి రక్షించిన పురుషుడిని కోరుకుంటోందని తెలుసుకొని కన్యక, సుభద్ర ఒక్కరే అని గ్రహిస్తాడు.

**(సహర్షమ్) దిష్ట్యాస్మో యమేవ కిలైకో జనః పురుషద్వయ భ్రమహేతురస్యాః మమఖలు.**

**ఇమౌకర్ణౌకర్ణౌ శృతిసుఖనివిష్టేదృశగిరా –**

**వమూదృష్టీదృష్టీసపది పరిపీతాకృతిసుధే ।**

**అమూన్యంగాన్యంగాన్య వశమపతద్ యేషుగగనా -**
**దిదం చిత్తం చిత్తం వహతి యదిమాం వామనయనామ్ ॥**

(సు.ధ.పు.91)

కన్యక, సుభద్ర ఒక్కరేనని తెలిసి సంతోషిస్తాడు. ఆకాశం నుండి జారిపడినప్పుడు సుభద్రను పట్టుకొన్న చేతులు ఎంతో గొప్పవని భావిస్తాడు.

సుభద్ర ఒకేసారి ముగ్గురు పురుషుల్ని ప్రేమించానని భావించి బాధపడుతూ యతి సేవ చెయ్యడానికి రాదు. సుభద్ర రాకపోయేసరికి అర్జునుడు విరహవేదనని అనుభవిస్తూ సుభద్ర సౌందర్యాన్ని పదే పదే గుర్తు చేసుకుంటాడు.

సుభద్ర చెలికత్తెలతో మాట్లాడుతూ ఉండగా అర్జునుడు చాటుగా వారి మాటలు వింటాడు. సుభద్ర పురుషత్రయాన్ని ప్రేమించానని ప్రాణాలను విడిచి పెట్టే సమయంలో అర్జునుడు సుభద్రను రక్షిస్తాడు. అర్జునుడు గాంధర్వ వివాహం చేసుకుందామంటే సుభద్ర అందుకు తన అన్నయ్య కృష్ణుడి అనుమతి లేదని దుఃఖిస్తుంది.

ఇంద్రుడు, శచీదేవి, శ్రీకృష్ణుడు, రుక్మిణి మొదలైనవారు సుభద్రార్జునులకు వివాహం జరిపిస్తాడు. సుభద్రను తీసుకొని ఇంద్రప్రస్థానానికి వెళ్లుతూవుండగా యాదవ వీరులు అడ్డగిస్తే వారితో యుద్ధం చేసి యాదవ సైన్యాన్ని చెల్లాచెదురు చేస్తాడు. సుభద్ర వలన ద్రౌపదికి సపత్నీ మత్సరం కలుగుతుందని భావిస్తాడు.

వివాహానంతరం కూడ సుభద్ర అపహరింపబడడం వలన మిక్కిలి దుఃఖించి ప్రాణత్యాగానికి సిద్ధపడతాడు.

**"వయస్య ! పరిత్యక్త జౌదిలోక సుఖస్య జనస్యకా నా బన్ధుష్వపేక్షా (సకరుణమ్) మాతః కున్తిభోజతనయే ! అద్య పభృత్యర్జునగత పత్య వాత్సల్యమనేషు చతుషు పుత్రేషుసంలి భజస్వ - అపిచ" (సు.ధ.పు.123)**

ఓ కుంతీ మాతా నేటినుంచి నువ్వు అర్జునుడి పట్ల చూపే పుత్రవాత్సల్యాన్ని తక్కిన నలుగురి కొడుకుల పట్ల చూపించమని తాను ఆత్మహత్యకు సిద్ధపడతాడు. విదూషకుడు అర్జునుడికి ధైర్యాన్ని నూరిపోసి కర్తవ్యాన్ని ఉపదేశిస్తాడు.

రాక్షసుడిచే అపహరింపబడిన సుభద్రను కాత్యాయని దేవి రక్షించిందని తెలుసుకొని ఆమెను కృతజ్ఞతాపూర్వకంగా స్తుతిస్తాడు. కాత్యాయని దేవి ద్రౌపది రూపంలో అర్జునుడి దగ్గరకి వస్తుంది. కాత్యాయని ద్రౌపది రూపంలో రావడం కళాపూర్ణోదయం ఆరంభ వృత్తాంతాన్ని గుర్తుకు తెస్తుంది.

కావ్య నాటకాలలో అర్జునుడి పాత్రను పరిశీలించినట్లయితే కావ్యంలో అర్జునుడు, ఉలూచి, చిత్రాంగద, సుభద్రలను వివాహం చేసుకుంటాడు. కానీ నాటకంలో ఉలూచి, చిత్రాంగదల ప్రస్థావన లేదు. కావ్యంలో అర్జునుడు వీరత్వాన్ని కృష్ణుడు సూచన ప్రాయంగానే తెలియజేశాడు. నాటకంలో అర్జునుడి వీరత్వం కళ్ళకు కట్టినట్లు కనపడుతుంది. నాటకంలో సుభద్ర అపహరించబడిందని తెలిసి అర్జునుడు కూడా శరీరత్యాగానికి సిద్ధపడతాడు. నాటకంలో సుభద్రను ముందు కన్యగా తెలుసుకొని చివరకు ఆమె సుభద్ర అని తెలుసుకుంటాడు. కావ్యంలో సుభద్రను అర్జునుడు ఆటపట్టించి ఆమెకు తనపై గల ప్రేమను బయటికి వ్యక్తపరిచేటట్లు చేస్తాడు.

నాటకంలో ద్రౌపదికి సుభద్ర వలన సపత్నీ మత్సరం కలుగుతుందేమోనని చింతిస్తాడు. కానీ ద్రౌపది సుభద్రను సొంత తోబుట్టువు కన్నా ఎక్కువగా చూసుకుంటోందని తెలిసి ఆనందిస్తాడు.

దేహాన్ని త్యాగం చేస్తున్న సుభద్రను రక్షించడం, సుభద్రకోసం ప్రాణాలు వదలడానికి సిద్ధపడడం, ద్రౌపదికి బాధకలుగకుండా చూడాలనుకోవడం, యాదవ వీరులతో యుద్ధం చేయడం, అలంబసుడనే రాక్షసుడిని సుభద్రను రక్షించడం మొదలైన కార్యాలవల్ల కావ్యంలో కన్నా నాటకంలో అర్జునుడి పాత్ర మరింత పరిపుష్టతను సంతరించుకొని ఉదాత్తంగా చిత్రించబడింది.

### 4.2.2 సుభద్ర :

సుభద్ర దేవకి, వసుదేవుల కుమార్తె. శ్రీకృష్ణుని చెల్లెలు. అర్జునుడి భార్య అపురూప సౌందర్యవతి. సౌందర్యానికి ముగ్ధుడైన అర్జునుడు వివాహం చేసుకోవాలని సన్యాసి వేషం ధరిస్తాడు. సుభద్ర చూసిన అర్జునుడు ఆమె రూప లావణ్యాన్ని కొనియాడిన విధం.

**"ఇంతిమోముకు చంద్రు - డీయైన నేమి**
**కుంతలాలాకలిమి - కొదమతుమ్మెదలు**
**బాలకనుబొమ్మలకు - ప్రతియౌనువిల్లు**
**పాలించు ముత్యముల - పణతిచిర్నగవు**
**సతినాస తిలపుష్ప - సమమైన దేమి**
**అతివ మ -ధ్యమ్ము సింహమునకు సరియె"**

(సు.క.పు.16)

సుభద్ర మోము చంద్రుడితో సమానమైనదనీ, ఆమె కనుబొమ్మలు విల్లులాగా ఒంపు తిరిగి ఉన్నాయని, ఆమె నడుము సన్నగా నాజూకుగా ఉందని ఆమె అందాన్ని అర్జునుడు వర్ణిస్తాడు.

నాటకంలో కూడా సుభద్ర సౌందర్యాన్ని రచయిత అర్జునుడి చేత వర్ణింపచేశాడు. సుభద్రను రాక్షసుడు అపహరించుకొని పోతూవుండగా అర్జునుడు ఆమెను రక్షిస్తాడు. ఆమెను చూసిన అర్జునుడు సుభద్ర అందాన్ని వర్ణించిన తీరిది.

**"సౌన్దర్యం సుకుమారతా మధురతా కాన్తిర్మనోహారితా**
**శ్రీమత్తా మహిమేతి సర్గవిభవాన్ నిశ్శేషనారీ గుణాన్ ।**
**ఏతస్యాముపయుజ్య దుర్విధతయా దీనః పరామాత్మభూః**
**స్రష్టుం వాఞ్ఛతి చేత్ కరోతు పునరత్రైవ భిక్షాటనమ్ ॥**

(సు.ధ.పు.81)

మాధుర్యం, చక్కటి రంగు, గొప్పదనం, కోమలత్వం, ఆకర్షణశక్తి, అందం, లాలిత్యం, చక్కటి లక్ష్మీకళ ఉన్న వర్చస్సు మొదలైన సకల సృష్టికి అనుకూలమైన స్త్రీ గుణాలన్నింటిని పూర్తిగా తెచ్చి ఒక చోటపోసి సుభద్రను తయారు చేయడానికి ఉపయోగించాడు బ్రహ్మ. వేరొక స్త్రీని తయారు చేయాలంటే కావాల్సిన గుణాలు బ్రహ్మ దగ్గర లేవు. బ్రహ్మ ఈమె దగ్గరికి వచ్చి "దేహి భిక్షాః భవతి" అని యాచించక తప్పదని సుభద్ర కవి వర్ణించాడు.

నాటకంలో సుభద్ర అలంబసుడనే రాక్షసుడిచే అపహరింపబడి అతడి నుండి తప్పించుకొనే ప్రయత్నంలో కిందకి పడుతున్న సమయంలో అర్జునుడు ఆమెను పట్టుకొని రాక్షసబారి నుండి రక్షిస్తాడు. ఆమెను రక్షించిన వాడు అర్జునుడని ఆమెకి తెలియదు. కానీ తనను రక్షించిన పురుషుడి మీద సుభద్రకు ప్రేమ కలుగుతుంది.

కపటి యతిని కూడా సుభద్ర ఇష్టపడుతుంది.

**"అమ్మో నైష పరమహంసః మన్యే మనసిజః మాం పీడయితుముపస్థితః అన్యచ్చ దృష్టమాత్రేణైవ పరవశీకృతాని మేంగాని కథమేతస్యోపచారం ప్రతిపత్స్యే భగవన్ వన్దే."** (సు.ధ.పు.94)

వచ్చినవాడు పరమహంస కాదు. నన్ను బాధించడానికై వచ్చిన మన్మథుడు వేరొక రూపం ధరించి ఇలా వచ్చాడు. ఇతడిని చూసిన వెంటనే నా అవయవాలన్నీ పారవశ్యం చెందుతున్నాయి. నేను ఇతడికి ఏ విధంగా సేవ చేయగలనని ఆలోచిస్తుంది. కానీ వచ్చిన యతి అర్జునుడే అని గ్రహించదు.

సుభద్రకు ఊహ తెలిసినప్పటి నుండి అర్జునుడి గురించి విని అతడినే మదిలో తలచుకుంటూ అతడినే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంది. సుభద్ర ప్రేమకు గుర్తుగా అర్జునుడి పది పేర్లు లిఖించబడి ఉన్న గాత్రికను ధరిస్తుంది.

సుభద్ర రాక్షసబారి నుండి తనను రక్షించిన పురుషుడిని, యతి రూపంలో ఉన్న అర్జునుడి (యతిని) పాండురాజు కుమారుడైన అర్జునుడిని ప్రేమిస్తుంది. ఈ ముగ్గురూ ఒక్కరే అని ఆమె గ్రహించక ముగ్గురు పురుషుల్ని ప్రేమించాననుకుంటుంది.

యతి రూపంలో వున్న అర్జునుడు సుభద్రను అభీష్ట వల్లభ ప్రాప్తిరస్తు అని దీవిస్తాడు. దానికి సుభద్ర తనలో తాను –

**"మమతావత్ మన్దభాగాయా వల్లభత్రయ మభిమతమ్. న కులస్త్రీణామేష సముదాచారః తదేతస్మిన్ జన్మని న సమ్భావనీయైషాశాః."** (సు.ధ.పు.94)

ముగ్గుర్ని ప్రేమించడం అనేది కుల స్త్రీకి తగదు. మరి సన్యాసులవారి ఆశీర్వాదం ఫలించడం అనేది అసంభవం అనుకుంటుంది. సుభద్ర ముగ్గురు పురుషులను ప్రేమించినందుకు తీవ్ర ఆవేదన చెంది సమాధాన పడిన తీరిది.

**"కిం మన్యధ్వే, న త్వయా భిన్నచారి త్రయా సహ వసామ ఇతి. కా నామ త్రైలోక్యైక ధనుర్ధరే మహేన్ద్రతనయే మహేన్ద్రానుజమిత్రే రూపవిహసిత. మన్మథేర్జునేనురాగస్య వచనీయతా. భూత హస్తాద్ యుష్మాకం పరిరక్షకే తస్మిన్ మహానుభావే యుష్మాభిర్న దూషణీయః స్నేహః. యః పునరయోగ్యే అగస్తుకే ప్రవ్రజితే దృఢబద్ధమూలో ప్రతీకారోభిలాషః, తత్రానుత్తరాస్మి తన్నిమిత్తం యథేష్టం గచ్ఛత."**

(సు.ధ.పు.103)

త్రిలోకైకధనుర్ధరుడు మన్మథుడిని కూడా ధిక్కరించినవాడు, దేవతా సార్వభౌముడి కుమారుడు అయిన అర్జునుడి మీద నాకు అనురాగం ఏర్పడింది. ఇది ఏ విధంగా తప్పు? ఇంక రాక్షస బారి నుండి నన్ను రక్షించిన ఆ మహానుభావుడి పట్ల ఎవరైనా స్నేహం భావం వహించకుండ ఉండగలరా, ఇక ప్రేమించకూడని పరివ్రాజకునిపై ఈ అభిలాష ఏమిటి అని మీరు ప్రశ్నిస్తే నేను మీకు ఎటువంటి సమాధానాన్ని యివ్వలేను అని తన సఖులతో చెప్పుకొని సమాధానపడుతుంది.

ముగ్గురు పురుషుల వలన కామోన్మాదాన్ని భరించలేక సుభద్ర ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధపడుతూ తల్లిదండ్రులను, తోబుట్టువులను, అర్జునుడిని గుర్తు చేసుకుంటుంది.

**"దిష్ట్యా నిర్మానుషో౽యం ప్రదేశః. నేతః పరం కామోన్మాదే బంధకీత్వే దోలాయిష్యే. తదేతస్య బాలసహకారస్య శాఖావలమ్బితయాతి ముక్త లతయా యథా సమీహితం కరిష్యామి. హా అమ్బ ! హ తాత ! హా ఆర్య బలభద్ర ! హా అమ్బ యశోదే ! హా తాత నన్దగోప ! ఏషాహమధేవ యుష్మాకం దర్శన సుఖస్యాత్యన్త గోచరాం పశ్చిమాం దశాం ప్రతిపద్యే. ఆ అర్జున మనోరథదయిత! జన్మాన్తరే ష్యనన్య సాధారణానురాగా తవ పాదశుశ్రూషికా భవేయమ్."**

(సు.ధ.పు.106)

సుభద్ర తనవారినందరిని గుర్తు చేసుకొని మరణించడానికి సిద్ధపడుతూ అర్జునుడి మీద గల ప్రేమాతిశయం చేత అనన్య సాధారణమైన అనురాగబంధంతో జన్మాంతరంలో అర్జునుడి పాదదాసిగా పుడతాను అనుకొని లతాపాశాన్ని కంఠానికి తగిలించుకొంటుంది. ఆమె మాటలు వింటూవున్న అర్జునుడు ఆమెను రక్షిస్తాడు. ఆత్మహత్య చేసుకొంటున్న యువతిని జీమూతవాహనుడు నాగానందంలో రక్షించినట్టే నాయకుడు ధనంజయుడు మరణం నుండి సుభద్రను కాపాడతాడు.

కావ్యంలో సుభద్రను బలరామకృష్ణులు యతి సేవకు నియోగించినప్పుడు సుభద్ర అత్యంత భక్తితో కపటయతికి –

**"ఏ వేళ కా మౌని – యిష్టమ్ము లెఱిగి**
**ఆ వేళ కావించు – నఖిల వస్తువులు"**

(సు.క.పు. 18)

సుభద్ర ఏపూటకాపూట యతి ఇష్టానుసారం వంటలు సిద్ధం చేసి వడ్డించేది. సుభద్ర అత్యంత భక్తితో పరిచర్యలు చేయగా ఆ యతి సరసాలాడి భావగర్భితంగా మర్మాలు పలుకుతూ ఉంటే నివ్వెరపోయి తన అన్న కృష్ణునితో మనవి చేసుకుంటుంది.

**"ఎక్కడి యతివరుం – డితడు వోయన్న**
**చూడ సంయమి గాని – చూఱకా డితడు**
**ఆడెడి మాట లి – ట్లని పల్కరాదు**
**సరసమాడగ వచ్చు – సారె నాతోను**

**సొంపు నొయ్యారంపు - చూపులే తఱచు**

**ఇత్తఱినే భిక్ష - మిడి నంత దాను**

**పొత్తున భుజియింపు - పొలతి రమ్మనెను**

**ఎంత జేసితిరి మీ - రిటువంటి వారి**

**నంతఃపురమ్ములో - నర్హమా యుంచ**

**అన్న యీ సన్యాసి - ననుపుమా వేగ"**

(సు.క.పు. 20)

అన్నా ! ఇతడు అసలు యతేనా ఇతడి ప్రవర్తన చూస్తే యతిగా కన్పించడం లేదు. ఇతడు ఆడే మాటలు ఇవి అని చెప్పడానికి వీల్లేదు. నాతో సరసాలు ఆడుతున్నాడు. ఎంతపని చేశారు మీరు. ఇటువంటి సన్యాసిని అంతఃపురంలో ఉంచడం తగునా మీకు? వెంటనే పంపించేయండి అని యతి మీద కృష్ణుడికి ఫిర్యాదు చేస్తుంది. శ్రీకృష్ణుడు ఆమెను సముదాయించి యతి ప్రాభవాన్ని చెల్లెలతో చెప్తాడు.

**"కార్యాని కోసమే - కడు చిక్కు పడెను**

**కార్యము చేసి గ్ర - క్కన నంపవలెను**

**సుదతి యీతని జూడ - సురపతి సుతుడె**

**మనసులో నీ కను - మానమ్ము వద్దు**

**కన్య నీచేతి భిక్ష - క్షమె కాని యతడు**

**అన్యులచే భిక్ష - అందుకోబోడు**

**దానిచే నీకు నిం - తగ జెప్పవలసె**

**యెప్పటి వలెనెనీ - వీ యతీశ్వరునికి**

**తప్పక పూజించు - తరుణి పొమ్మనిన"**

(సు.క.పు. 25)

శ్రీ కృష్ణుని మాటలు విన్న సుభద్ర తన పట్ల యతి ప్రవర్తించిన తీరును చెప్పినా శ్రీకృష్ణుడు ఆ యతి సేవనే చెయ్యమనడం ఈ యతి సురపతి సుతుడని చెప్పడం వల్ల సుభద్ర -

**"ఈ చూపులీతమక - మీ విలాసములు**

**యేతాపసుల యందు - నెఱుగ మెన్నడును**

విజయుని రూప వి - వేక సంపదలు
గజరాజవరదుచే - గరిమ నే విందు
తెగవాలు కన్నులు - దీర్ఘ బాహువులు
పగడంపు వెన్నెగల - పాదపద్మములు
చూడగా నీతండు - క్రీడియే కాని
వాలాయముగ యతీ - శ్వరుడు గా - బోడు"

(సు.క.పు. 26)

ఇలాంటి రూపు రేఖలు యతులకు ఉండడం ఎప్పుడూ చూడలేదు. అర్జునునికి గల దీర్ఘ బాహువులు, పాదాలు ఈ యతికి ఉండడం వల్ల ఇతడు అర్జునుడే కానీ యతీశ్వరుడు కాదన్న నిశ్చయానికి వచ్చి సుభద్ర చక్కగా అలంకరించుకొని కపట యతి నుండి నిజాన్ని రాబడుతుంది.

"అయ్య మీరేదేశ - మరసి చూచితిరొ
యెయ్యది మీనామ - మెచట నుండుదురొ
పరగ నింద్రప్రస్థ - పట్టణమ్మునను
బహుళ సంపదలతో - బరగు చున్నార
ధీరమానసులు కుం - తీసుతుల్ వారు
అరయ గడు సుఖు - లై యున్నవార
కోరి మా మేనత్త - కొడుకు లైదుగురు
వారికి కుశలమా - వరముని చంద్ర
ఆ రాజవరులలో - నర్జునుం డెలమి
ధారణి తీర్థముల్ - దరిసింప నేగె
తీర్థముల్ క్షేత్రముల్ - తిరుగుచో మీరు
ఇంద్రనందను నెందు - నే జూడలేదా
జగతి నంతట మీరు - చరియింతుమీరనగ
అరసి మి మ్మిప్పుడు - అడుగంగ వలసె"

(సు.క.పు. 32)

మీరు ఏయే దేశాలు చూశారో? మీ నామం ఏమిటో? ఇంద్రప్రస్థ పట్టణంలో కుంతీపుత్రులు వున్నారు. వారిలో అర్జునుడు తీర్థ క్షేత్రాలన్నీ దర్శించడానికి వెళ్ళాడు. మీరు అర్జునుడిని ఎక్కడైనా

చూశారా? లేదా? అని అడిగి అర్జునుడిని కవ్వించి అర్జునుడి నుంచి నిజాన్ని రాబడుతుంది. కపటయతి నేను అర్జునుడి నని చెప్పి గంధర్వ వివాహం చేసుకుందాం అంటే సుభద్ర సిగ్గుతో –

**"తల్లియు దండ్రియు – తగిన బాంధవులు**
**బల్లిదు లన్నలు – పాయ కున్నారు**
**వారి యనుజ్ఞ చే – వర్తించు మిచట**
**నీలాగు పనులైన – యిందఱు నగర**
**హరి నీకు నిచ్చునట – అనుమాన మేల**
**తెరలి యేనుగునెక్కి – దిద్దు దూరెదరె"**

(సు.క.పు. 35)

తల్లిదండ్రులు, అన్నలు అందరూ ఉన్నారు. వారి అనుమతి తీసుకొని వివాహం చేసుకొందాం. పైగా కృష్ణుడు నీతోనే నా వివాహం చేస్తాడు. అందులో ఎటువంటి అనుమానం లేదు. అని అతనిని వారించి లోపలికి వెళ్లిపోతుంది. లోపలికి వెళ్ళిపోయిందే కానీ సుభద్ర మనస్సున మనస్సులో లేదు. అర్జునుడి గురించే ఆలోచిస్తుంది.

**"ఇంద్రనందనుడు మ – హీంద్ర స్తుతుండు**
**చేరి వినయమ్మున – చెట్ట బట్టినను**
**విడిపించుకొని మఱి – వేగ బోయితిని**
**ఎలమి నాతని మన – సెట్లుండె నొక్కొ**
**కాక దా నొడ బడితే – కడుచుల్క దనము"**

(సు.క.పు. 37)

ఇంద్ర నందనుడైన అర్జునుడుని విడిపించుకొని వచ్చేశాను అతడు ఏమనుకున్నాడో ఏమో? అతని మనస్సు ఏ విధంగా ఉందో అని అర్జునుడిని తలచుకొని విరహాన్ని పొందుతుంది. రుక్మిణి సుభద్రార్జునుల ప్రేమ విషయాన్ని శ్రీకృష్ణుడికి తెలియజేస్తే శ్రీ కృష్ణుడు వారిద్దరికి వివాహం జరిపిస్తాడు.

వివాహానంతరం ఇంద్రప్రస్థానికి వెళ్ళే సందర్భంలో యాదవ సైన్యంతో అర్జునుడు యుద్ధం చేస్తూ ఉంటే సుభద్ర రథ సారథ్యం వహించి అర్జునుడిచే ప్రశంసలు పొందుతుంది. సుభద్ర అలంకరించుకోవడం, యతిని పూజించి, సేవించడంతో పాటుగా రథాన్ని నడిపే కౌశల్యం కూడా ఆమె సొంతం.

నాటకంలో అర్జునుడుని ఎదుర్కొంటున్న సందర్భంలో సుభద్ర అర్జునుడితో బలరాముడిని రక్షించమని ప్రార్థిస్తుంది.

**"ఆర్యపుత్ర ! శైశవాదారభ్య తవ చరణకమలగతం యే అనురాగమవేక్ష్య యథాహం కులవినాశకారిణితి న లోకపరివాదానాం భాజనం భవామి, తథా విధేహి".** (సు.ధ.పు. 115)

ఆర్యపుత్రా ! బాల్యం నుండి నేను మీ పాదాల ఆరాధనకే అంకితమైనాను. ఆనురాగ బంధాన్ని తలుచుకొని నన్ను అనుగ్రహించు. సుభద్ర కులవినాశకారిణి అనే లోకోపవాదానికి నేను గురికాకుండా చూడు. మా అన్నయ్య అయిన బలరాముడిని రక్షించు అని వేడుకొంటుంది.

బలరాముడు సుభద్రార్జునుల వివాహాన్ని వ్యతిరేకించినా, అర్జునుడితో యుద్ధం చేస్తూ వున్నా సుభద్రకు బలరాముడి పట్ల ఉన్న గౌరవాభిమానాల చేత బలరాముడిని రక్షించమని అర్జునుడిని అడుగుతుంది.

కావ్య నాటకాలలో సుభద్ర పాత్ర చిత్రణను పరిశీలించినట్లైతే నాటకంలో కన్నా కావ్యంలో సుభద్ర తెలివైనది, మాటకారి. కావ్యంలో శ్రీకృష్ణుడు యతి గురించి చెప్పిన తరువాత సుభద్ర కపట సన్యాసి అర్జునుడే అని గ్రహించి ఆ విషయాన్ని అర్జునుడితోనే చెప్పిస్తుంది. రుక్మిణి అత్తవారింటి దగ్గర ఎలా మెలగాలో ముఖ్యంగా ద్రౌపదితో ఎలా మసలుకోవాలో చెప్పిన మాటల్ని బాగా ఆకళింపు చేసుకొని ద్రౌపదికి సపత్నీ మత్సరం కలుగకుండా గోపాల సతులలో ఇంద్రప్రస్థానికి తనని పంపించమంటుంది. శయ్యాగృహంలో పాదాలు ఒత్తుతున్న సుభద్రతో అర్జునుడు "మా పాదములు నొత్త మగువ నీకేల" అంటే యంతటి వాడైన యా గజేంద్రుడు మావటినికి కింద్ర మణిగుండ లేదు" అంటూ అర్జునుడికి సమాధానం చెబుతుంది. తను కృష్ణుడి చెల్లెలైనా భర్తతో ఎలా మెలగాలో, భర్తను ఏ విధంగా చూసుకోవాలో సుభద్రకు తెలుసు. కానీ నాటకంలో సుభద్ర ఒట్టి బేల. యతి రూపంలో వచ్చినవాడు అర్జునుడు అని కులశేఖర వర్మ సుభద్ర గ్రహించలేదు. ముగ్గురు పురుషుల మీద ప్రేమ కలగడం కుల స్త్రీకి తగదని మరణించడానికి నిర్ణయించుకుంటుంది. అర్జునుడు గాంధర్వ వివాహ చేసుకుందాం అన్నప్పుడు అతడికి ఎటువంటి సమాధానం చెప్పక, ధనంజయుడిని చూస్తూ నిట్టూరుస్తూ, కన్నీళ్ళు కారుస్తూ ఉంటుంది. గాంధర్వ వివాహం చేసుకోవడానికి ఒప్పుకోవడం కానీ తిరస్కరించడం కాని చేయదు. అర్జునుడే నువ్వు బాధపడకు నా తండ్రి మన విషయాన్ని మీ అన్న శ్రీకృష్ణునికి తెలియజేసి నాకు నిన్ను ఇచ్చి వివాహం చేయమని అడుగుతాడని అర్జునుడు సుభద్రకు ధైర్యం చెబుతాడు.

పై సన్నివేశాల్ని బట్టి చూసినప్పుడు తిమ్మక్క తీర్చిదిద్దిన సుభద్ర మంచి నేర్పుగల నెరజాణ. పరిస్థితులకు అనుగుణంగా ఎలా నడుచుకోవాలో, ఎవరితో ఎలా ఉండాలో తెలుసు. సమయస్ఫూర్తి, మాటకారి తనం, వ్యవహారదక్షత సుభద్ర తిమ్మక్కకు సొంతం. కులశేఖరవర్మ సుభద్ర భయస్థురాలు, తత్తరపాటు తనం ఎక్కువ.

### 4.2.3 శ్రీకృష్ణుడు

శ్రీ మహావిష్ణువు తొమ్మిదో అవతారం. ఇతడు యాదవవంశంలో దేవకీ వసుదేవులకి జన్మించాడు. శ్రీకృష్ణుడు సుభద్రకు అన్నయ్య. బలరాముడికి తమ్ముడు. సుభద్రా ధనంజయుల కల్యాణానికి మూల కారకుడు శ్రీకృష్ణుడు. సుభద్రను అర్జునుడికి ఇవ్వాలని శ్రీకృష్ణుడి కోరిక. బలరాముడికేమో సుభద్రను దుర్యోధనుడికి ఇవ్వాలని వాంఛ. ఏదో ఒక విధంగా బలరాముడి కన్ను కప్పి సుభద్రార్జునుల వివాహం జరిపించడం శ్రీకృష్ణుని సంకల్పం.

ఏమి తెలియని వాడిలాగా యతి వేషంలో వచ్చిన అర్జునుడిని చూసి వాసుభద్రుడు బలరాముడితో –

**"(అపవార్య) ఆర్య ! క్వను వివిక్తే యోగసిద్ధయే వస్తవ్యమిహ భగవద్భిః"**

(సు.ధ.పు. 87)

శ్రీకృష్ణుడు  ఈ మహానుభావులు యోగసిద్ధికై నివసింపదగిన ఏకాంత భూమి ఎక్కడ నిర్ణయించారని బలరాముడిని ప్రశ్నిస్తాడు. బలరాముడు కన్యాంతఃపురమే వీరికి సరైన ప్రదేశమని నిర్ణయిస్తాడు. శ్రీకృష్ణుడు బలరాముడి నోటితోనే  అర్జునుడిని సుభద్ర అంతఃపురంలో ఉండమని చెప్పిస్తాడు.

ఉలూచి, చిత్రాంగదలను అర్జునుడు వివాహం చేసుకొని బభ్రువాహనుడుని కుమారుడిగా పొంది యతి వేషంలో వచ్చిన అర్జునుడిని చూసి శ్రీకృష్ణుడు.

**"నిన్ననే సుతుల గని – నెఱతనమ్మునను**
**యింతలొ సన్యాసి – వెట్లయితి వయ్య**
**యెరుగుదుము మీ విద్య – లెల్లను మేము**
**గరిమ వేసా లల్ల – గ్రాసాలకొఱకె"**

(సు.క.పు.13)

అర్జునుడిని ఆట పట్టించి, సన్యాసి రూపంలో వచ్చిన అర్జునుడికి సుభద్ర సేవల చేయడం కోసం శ్రీకృష్ణుడు సుభద్రతో –

**"రావె యమ్మ సుభద్ర – రమణిరో నీవు**
**మదిరాయతాక్షి నా – మనవి చేకొనవె**
**కన్యచే భిక్షయె – కాని యాతండు**
**అన్యులచే భిక్ష – నంద నొల్లండు**
**కన్యాగృహంబున – కన్యకామణివి**
**సన్యాసి నునిచి పూ – జావిధి చేయు**
**మనుచు చెల్లికి స – న్యాసి నొప్పించి**
**ఆ పద్మనాభుండు – అపు దూరకుండె"**

(సు.క.పు. 17)

సుభద్రకి ఏ మాత్రం అనుమానం రాకుండా సుభద్రను సన్యాసి వేషంలో ఉన్న అర్జునుడి సేవకు నియోగించాడు.

అర్జునుడు తన పరిచర్యలు చేయడానికి వచ్చిన సుభద్రతో సరసాలు ఆడగా సుభద్ర వెళ్ళి శ్రీకృష్ణుడితో –

**"ఎక్కడి యతివరుం – డితడు వోయన్న**
**చూడ సంయమి గాని – చూఱకాడితడు**
**ఆడెడి మాట లి – ట్లని పల్కరాదు**
**సరసమాడగవచ్చె – సారె నా తోను"**

(సు.క.పు.20)

యతి నాతో సరసాలు ఆడుతున్నాడని ఇతడు సన్యాసి కాదని సుభద్ర శ్రీకృష్ణుడితో చెప్పినప్పుడు అర్జునుడిని మందలించిన తీరిది –

**"అనిన నవ్వుచు గృష్ణు – డా యతీశ్వరుని**
**వినయమ్ముతో బిల్చి – వేడ్క నిట్లనెను**
**అయ్య మీ పనులన్ని – ఆగడా లాయె**
**తొయ్యలి నాతోన – దూఱుగా జెప్పె**

పెద్దలు మీరింత - బుద్ధి దప్పినను
ముద్దుల నందఱు - చులుకగా నగరె
కాక నా చెల్లెలు - కదు ముద్దరాలు
లీలగా దుర్భాష - లేల పలికితిరి
కోరిన కోర్కిచే - కూరినదాక
ఏరీతినే నూర - కే యుండరాద?
ఇచ్చట చెప్పిన - యింతి సుభద్ర
వచ్చట రాముతో - నలిగి చెప్పినను
యీ ద్వారకాపురి - యిం దుండబోదు"

(సు.క.పు. 21)

సన్యాసి వేషానికి తగ్గట్టు ప్రవర్తించి నీ మర్యాద నిలుపుకుంటే చాలు. నా చెల్లెలు కదు ముద్దరాలు. సుభద్రను వివాహం చేసుకొనే వరకైనా కొంత కాలం జాగ్రత్తగా ఉండు. ఈ విషయం సుభద్ర నాతో చెప్పింది కాబట్టి సరిపోయింది. బలరాముడితో చెప్పినట్లయితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని శ్రీకృష్ణుడు అర్జునుడిని హెచ్చరిస్తాడు.

అర్జునుడి చేష్టలకు చిన్న బుచ్చుకొన్న సుభద్రను శ్రీకృష్ణుడు సముదాయించిన తీరిది.

తోయజాక్షుడు - తొడపైన నునిచె
నీలాలవంటి వా - నెలత నెఱికురులు
.......................................
శిరసు తాబైకెత్తి - చెల్లెలిని చూచి
చిఱునవ్వుతో బలికె - శ్రీకృష్ణు డెలమి
యే మనె సన్యాసి - యిపుడు నిన్నేన
నాతోను జెప్పిన - నాతి నే బోయి
మందలించెద నమ్మ - మరియాదగాను
ముద్దరా లోర్చునా - మొప్పె మాటలకు
అని మట్టుపెట్టి యిపు - డాడి వచ్చితిని
రమణి నీ జోలికి - రా వెఱచు నింక
..........................................

**కార్యాని కోసమే - కదు చిక్కు పడెను**
**కార్యము చేసిగ్ర - క్కన నంపవలెను**
**సుదతి యీతని జాడ - సురపతి సుతుడె**
**మనసులో నీ కను - మానమ్ము వద్దు**
**కన్యనీ చేతి భి - క్షమె కాని యతడు**
**అన్యులచే భిక్ష - అందుకో బోదు**
**దానిచే నీకు నిం - తగ జెప్పవలసె**
**యెప్పటివలెనె నే - వీ యతీశ్వరుని**
**తప్పక పూజించు - తరుణి పొమ్మనిన"**

(సు.క.పు. 23-25)

ఈ సన్యాసిని నేను మందలిస్తాను. ఇంక అతడు నీ జోలికి రాడు. సురపతి సుతుడే అని చెప్పడంతో వచ్చిన సన్యాసి సాక్షాత్తూ ఇంద్రకుమారుడైన అర్జునుడే అన్న విషయాన్ని శ్రీకృష్ణుడు చెప్పకనే చెప్పాడని గ్రహించి వచ్చినవాడు అర్జునుడే అని తెలుసుకొని ఆనందంతో అలంకరించుకొని అర్జునుడికి సేవలు చేయడానికి వెళ్తుంది.

**నాటకంలో శ్రీకృష్ణుడు :**

సుభద్రా ధనంజయుల వివాహానంతరం శ్రీకృష్ణుడు బలరాముడిని ప్రశాంత పరచడంలో కూడా మిక్కిలి నేర్పుని ప్రదర్శిస్తాడు. శ్రీకృష్ణుడు, అర్జునుడితో సుభద్రను తీసుకువెళ్ళమన్నాడని తెలిసిన బలరాముడు కోపోద్రిక్తుడైన సందర్భంలో శ్రీకృష్ణుడు బలరాముడితో -

**"కస్యాయమపరాధః. యదన్వార్య ఏవ తావత్ తం మస్కరివేష ప్రతిచ్ఛన్నం కుమారీపురే వినివేశ్య సాంప్రతం కస్మై క్రుధ్యతి."** (సు.ధ.పు.117)

**ఆర్య ! అలముత్తరోత్తరరకథాభిః. పితుర్నః స్వస్రీయతాం పృథాయాః పుత్రతాం మిత్రతాంచ మమ సమాకలయ్య సురపతి సూనావపనీతామర్షసన్తమసేన సాంప్రతమను గ్రహణీయోఽహమార్యేణ.**

(సు.ధ.పు.118)

మీరే కదా పరహంస వేషంలో ఉన్న అర్జునుడికి కన్యాంతఃపురంలో నివాసం ఏర్పరిచారు. మనకు ఆత్మీయులై వారిపట్ల ఎందుకు ఇంత క్రోధం. అర్జునుడు మనకి బావేకదా పైగా నాకు ప్రాణసఖుడు. కోపాన్ని తగ్గించుకొని నన్ను మీరు అనుగ్రహించండి. ఇదే నా ప్రార్థన అని వేడుకుంటాడు.

బలరాముడిని శాంత పరచడానికి శ్రీకృష్ణుడు సంబంధ బాంధవ్యాలను గుర్తుచేసి సుభద్రకు స్త్రీ ధనం ఇవ్వడానికి అంగీకరింపజేస్తాడు. శ్రీకృష్ణుడు భగవంతుడైనప్పటికి కూడా తన అన్నయ్య అయిన బలరాముడి పట్ల ఎంతో వినయంతో మెలగుతాడు. బలరాముడితో మాట్లాడేటప్పుడు ఇది ప్రార్థన అన్నాడే గానీ, నా ఆజ్ఞ అని లేదు. అది శ్రీకృష్ణుడి గొప్పదనం.

కావ్య నాటకాలు రెండింటిలో కూడా శ్రీకృష్ణుడు సుభద్రా ధనంజయుల వివాహం జరగడానికి ప్రధాన పాత్ర పోషించాడు. అర్జునుడిని సన్యాసి వేషంలో సుభద్ర అంతఃపురంలో నివసించే ఏర్పాటు చేయడం, వివాహానంతరం బలరాముడిని శాంతపరచడం కావ్య నాటకాల రెండింటిలోనూ ఉన్నదే. సన్యాసి వేషంలో ఉన్న అర్జునుడి ఆగడాలను వారించడం, సుభద్రను సన్యాసి సేవకు నియోగించడం. సుభద్ర యతిపై ఫిర్యాదు చేయగా ఆమెను సాంత్వన పరచడం కావ్యంలో శ్రీకృష్ణుడు చేసిన అదనపు కార్యాలు.

### 4.2.4 రుక్మిణి :

రుక్మిణి లక్ష్మీదేవి అవతారం. శ్రీకృష్ణుని పట్టపురాణి. సుభద్రకు ఒదిన. నాటకంలో పాత్రగా ప్రవేశం లేదు. కావ్యంలో అర్జునుడు కపట యతి వేషం విడిచి సుభద్రను దగ్గరికి తీసుకోగా ఆమె విడిపించుకొని అర్జునుడినే తలచుకుంటూ ముసుగు పెట్టిన సుభద్రను చూసి రుక్మిణి –

**"కనులేల మూసేవే – కలహంసగమన**
**శిరసేల వంచేవె – సింహేంద్ర మధ్య**
**వాలుకన్నుల నీరు – రాల నేమిటికె**
**వనిత సన్యాసిని – వలపించు కొంటి**
**రామావతారాన – రమణిరో నీవు**
**శాంతయను పేరుతో – సహజాతవైతి**
**అల ఋశ్యశృంగుని – అటులోను జేసి**
**వలవేసి కొంటివే – వనితరోనీవు**
**దేవేంద్ర సుతుదృష్టి – తెగువతో తాకె**
**దృష్టి తీయింతుమే – తెలివి రా నీకు**
**తెగవాలు కన్నుల – దృష్టించి చూడ**
**అతనిచేతనె కాని – అది మానదనెను"**

(సు.క.పు. 37–38)

మరదలిని చూసిన రుక్మిణి కనులు మూసుకొని, శిరస్సు వంచుకొని కన్నీరు కారుస్తూ ఎందుకువున్నావని సుభద్రను ప్రశ్నిస్తుంది. రామావతారంలో రాముడికి చెల్లెలైన నీవు ఋశ్యశృంగుని వలలో వేసుకొన్నావు. ఇప్పుడు కృష్ణావతారంలో ఈ అర్జునుడి చేత వలపింపబడ్డావు. అర్జునుడి దృష్టి నిన్ను తాకింది మేము నీకు దిష్టి తియ్యలేము. అతని దృష్టితోటే అది పోతుంది అని రుక్మిణి నర్మగర్భంగా పలికింది. ఈ పరాచికాలకి సుభద్రకు కోపం వచ్చింది. గాజులు గల్లుమనేట్టు రుక్మిణిని అవతలికి తోసింది. రుక్మిణి సుభద్రను ఆటపట్టించడం వల్ల వాళ్ళిద్దరి మధ్యగల స్నేహభావం తెలుస్తోంది. ఇప్పటి వరకూ సుభద్రతో స్నేహితురాలుగా వ్యవహరించిన రుక్మిణి తరువాత తల్లివలె బుజ్జగించి లాలిస్తుంది.

**"జలక మాడుదు లేవె - చెలియ సుభద్ర**
**చలువ గట్టుదువు లే - చందనగంధి**
**భుజియించుదువు లేవె - పుత్తడి బొమ్మ**
**వెలది నీకునుపెండ్లి - వేగ జేయుదుము"**

(సు.క.పు. 38)

మన ఇళ్ళలో పిల్లలు అన్నం తినకుండా మారాం చేస్తుంటే మన అమ్మో, నాన్నో వచ్చి బుజ్జగించి అన్నం తినిపిస్తారు. రుక్మిణి కూడా సుభద్రను లేచి స్నానం చేసి భోజనం చెయ్యమని బతిమాలుతోంది. నీ విచారానికి కారణమైన అర్జునుడితో పెళ్లి తొందరగా చేస్తాము అని భరోసా ఇస్తుంది.

అరుంధతి, శచీదేవి, సత్యభామలను కలుపుకొని రుక్మిణి సుభద్రార్జునులకు వివాహం జరిపిస్తుంది. వివాహానంతరం ఆశీస్సులు తీసుకోవడానికి వచ్చిన సుభద్రను కౌగిలించుకొని, అక్కున చేర్చుకొని ఆమెకు కలిగిన బెంగను పోగొడుతుంది.

**"అడల నేమిటికె మా - యమ్మ సుభద్ర**
**అత్తయు నీకు మే - నత్తయు గాన**
**వింతవారెవ్వరు - వీరిలోపలను**
**బావమఱదులు చాల - భక్తి గలవారు**
**నిను విడిచి మీయన్న - నిమిష మేనియును**
**నిలువ రిప్పుడె నిన్ను - బిలిచి తెచ్చెదరు"**

(సు.క.పు. 43)

నువ్వు అనవసరంగా కంగారు పడనక్కర్లేదు. అత్తవారి ఇంట్లో వాళ్ళందరూ నీకు కొత్తవారేమీ కాదు. మేనత్తే నీకు అత్తగారయ్యింది. బావలు, మరుదులు నిన్ను బాగా చూసుకుంటారు. పైగా మీ అన్న శ్రీకృష్ణుడు నిన్ను చూడకుండా క్షణం కూడా ఉండలేడు. నిన్ను ఎప్పుడు కావాలంటే అప్పుడు పుట్టింటికి తీసుకువస్తారు అని ధైర్యం చెబుతుంది.

రుక్మిణి సుభద్రకు అత్తవారింట ఏ విధంగా మెలగాలో, భర్తతో ఏ విధంగా మసులుకోవాలో చెప్పిన తీరిది –

**చనవిచ్చినాడని – సకియరో నీవు**
**పలుమాటలకు నెట్లు – పాలుపడవద్దు**
**పొలతి నమ్మరాదు – పురుషుల నెపుడు**
**పలురీతి గృష్ణ స – ర్పమ్ములై యుంద్రు**
**కొంచక కృష్ణకు – కూర్మితో నుండు**
**వంచన సేయకు – వనిత యెప్పుడును**

(సు.క.పు. 44)

అర్జునుడు నీకు చనువిచ్చాడని వాడుకోవద్దు. పురుషులను అన్ని వేళలా నమ్మడానికి వీల్లేదు. నీ సవితి అయిన ద్రౌపది పట్ల స్నేహభావంతో ఉండు. ఆమెనెప్పుడు మోసగించవద్దని రుక్మిణి తన అనుభవాన్ని జోడించి సుభద్రకు జాగ్రత్తలు చెబుతుంది.

రుక్మిణి సుభద్రకు వరుసకి వదిన అయినప్పటికి తల్లి వలె ఆమె మంచి చెడ్డలను విచారించి అర్జునుడితో వివాహం జరిపించి, కూతుర్ని, అత్తవారింటికి పంపినట్టుగా ఆమెను సాగనంపుతుంది. అందుకే రుక్మిణి దీవెనలను అందుకోవడానికి వచ్చిన అర్జునుడు ఆమెను స్తుతిస్తూ పలికిన పలుకులివి.

**నీరజాక్షునిరాణి – నిత్యకల్యాణి**
**దారిద్ర్యనాశిని – దయగల తల్లి**
**పాండునందనులకు – ప్రాపవై యెపుడు**
**కృప జూచి రక్షించు – కువలయనేత్రి**
**మన్మథుని గన్నట్టి – మరువంపు మొలక**
**మమ్ము కటాక్షించు – మాధవు రాణి**

(సు.క.పు. 43)

శ్రీకృష్ణునికి రాణివి, మన్మథుడిని కన్న తల్లివి, సాక్షాత్తు లక్ష్మిదేవి అయిన నీవు మమ్ము కటాక్షించి చల్లగా చూడు అని అర్జునుడిని రుక్మిణి దీవించిన విధమిది.

**మకుటమ్ము వట్టి క - వ్వడి లేవనెత్తె**
**సత్యకృపాచార్య - సత్యసంపన్న**
**సత్యము దప్పని - సర్వజ్ఞ నరుడ**
**చెలువతో సద్భక్తి - శ్రీ కృష్ణసేవ**
**కలిగుండు నీవెల్ల - కాలంబునందు**

(సు.క.పు.44)

అని దీవించింది. రుక్మిణి అర్జునుడిని నువ్వు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లు అని దీవించలేదు. దేవాతి దేవుడు మునిజన వంద్యుడు అయిన శ్రీకృష్ణుడి సేవ చేసుకుంటూ ఉండు అని దీవించింది. ఎవరి సేవ వలన సకల సృష్టి తరిస్తుందో అటువంటి వాడిని సేవించమని చెప్పింది.

**నాటకంలో రుక్మిణి :**

నాటకంలో రుక్మిణికి స్వయంగా పాత్ర ప్రవేశం లేదు. కానీ ద్వితీయాంకం అనంతరం ప్రవేశకంలో రుక్మిణి చెలికత్తె లవంగిక మాటలలో రుక్మిణి ప్రస్తావన వస్తుంది. సుభద్రకు అస్వస్థతగా ఉండడం వల్ల సుభద్ర యతికి చేయవలసిన ఉపచారాలన్నీ రుక్మిణి చేస్తానని దీనికోసం సుభద్రను శ్రమ పడవద్దు అని సుభద్రకు చెప్పమని రుక్మిణి లవంగికను ఆదేశించినట్టుగా మనకు చేటి, లవంగిక సంభాషణ ద్వారా తెలుస్తుంది.

మరొక సందర్భంలో అర్జునుడి మాటలలో రుక్మిణి ప్రస్తావన వస్తుంది. అర్జునుడికి సుభద్ర చేయవలసిన సేవలన్నీ, రుక్మిణి చేయడం వలన సుభద్రను తాను చూసే భాగ్యం లేకపోయిందని అర్జునుడు బాధపడతాడు.

కావ్య నాటకాలలో రుక్మిణి పాత్రను పరిశీలించినట్లయితే కావ్యంలో రుక్మిణి పాత్రకు ఉన్న నిడివి ఎక్కువ. సుభద్ర అర్జునుడిని వలచిందని తెలుసుకోవడం, ఆ విషయాన్ని శ్రీ కృష్ణుడికి చేరవేయడం, సుభద్రా ధనంజయుల వివాహం జరిపించడం. మొదలైన కార్యాలను రుక్మిణి సమర్థవంతంగా నిర్వహించింది.

### 4.2.5 ద్రౌపది

ద్రుపదుని కూతురు. పాండవుల భార్య. సుభద్ర అర్జునుడిని వివాహం చేసుకొని అత్తవారింటికి వచ్చి ద్రౌపదికి నమస్కరించినపుడు ద్రౌపది సుభద్రను దీవించిన తీరిది.

**"సంతసం బలర పాం - చాలి యిట్లనెను**
**వనిత నీపతి వేర - వరుడయ్యేనేని**
**ఘనవీరుపుత్రుని - గాంతు వీ వనెను**
**అంత దీవన లిచ్చి - యపుడు పాంచాలి"**

(సు.క.పు. 3)

వీర పుత్రులను పొందమని దీవించింది. అప్పటికి ఇంకా ద్రౌపదికి సుభద్ర పట్ల అసూయ కలుగలేదు. కుశల ప్రశ్నలు ముగిసిన పిమ్మట ధర్మరాజు పార్థుడికి, సుభద్రకు శోభనం ఏర్పాటు చేయవలసిందిగా ద్రౌపదిని ఆజ్ఞాపిస్తాడు. ఆమె ఉత్సాహంతో వేవేల యత్నాలు చేస్తుంది. శయ్యాగృహాన్ని సాంబ్రాణి ధూపాలతో, కప్పురపు వాసనలతో అలంకరిస్తుంది. వధూవరులు ఆరగించడానికి కావల్సిన అనేక వంటకాలు సిద్ధం చేసింది. సుభద్రను వివిధ ఆభరణాలతో సింగారిస్తుంది.

సుభద్ర పడకగదిలోకి వెళ్ళడానికి సిగ్గుపడుతూ ఉంటే ద్రౌపది -

**కూరిమి గలవాడు - కొమరాల నీకు**
**మేలిమి గలవాడు - మేనత్త కొడుకు**
**నాల్గునెలలు భిక్ష - మేల్గల్గ బెట్టి**
**యిప్పు డిటువలె సిగ్గు - లేటికే సుదతి**

(సు.క.పు. 53)

నీకు అర్జునుడు మేనత్త కొడుకే కదా. పైగా అతనికి నువ్వు నాలుగు నెలలు భిక్ష ఇచ్చావు. ఇంత పరిచయం ఉండగా ఇంకా సిగ్గు పడతావు ఎందుకని ప్రశ్నిస్తూ సుభద్ర బిడియాన్ని పోగొట్టే ప్రయత్నం చేస్తుంది.

సుభద్రను అర్జునుడి దగ్గరకు పంపించిన తరువాత ద్రౌపదిలో సహజమైన స్త్రీ ప్రవృత్తి మేల్కొంటుంది.

**తలపోసె మనసులో -తాళంగ లేక**

**యేమి వస్తువులైన - నియవచ్చు గాని**
**ప్రాణేశు నిచ్చి మతి - బ్రతుకంగ రాదు**

(సు.క.పు. 54)

సుభద్రతో తన పతిని పంచుకుంటున్నందుకు ఆవేదన చెందుతుంది. ఇటువంటి భావాన్ని తెలియజేసే పద్యాన్నే రాధికాస్వాంత్వనములో ముద్దుపళని రాసింది. ఇళా మాధవులకి వివాహం చేసిన తరువాత రాధ సపత్నీ మత్సరానికి దుఃఖించిన విధం ఇది.

**సొమ్ము లియ్యవచ్చు సొమ్మందియవచ్చు**
**నియ్యరాని ప్రాణమియ్యవచ్చు**
**దనదు విభుని వేఱుతరుణి చేతికినిచ్చి**
**తాళవశమె యెట్టి దానికైన?**[3]

స్త్రీ రచయితలు రచించటం వలన ఈ రెండు రచనలలో స్త్రీ స్వభావం చిత్రీకరణ చేయబడింది.

ద్రౌపది సుభద్ర విషయంలో తనకి తానే సమాధానం చెప్పుకుంటుంది.

**అఖిలాండ కోటి బ్ర - హ్మాండనాయకుని**
**చెల్లెలు గనకనే - నొల్ల ననరాదు**
**అదిగాక సభలోన - ఆ కౌరవులకు**
**మానభంగము గల్గు - హీనకాలమున**
**మానధన మొసగిన - మాహాత్మ్యశాలి**
**అటువంటి శ్రీకృష్ణు - కనుగు చెల్లెలట**
**అని మతి తలపోసి - అతివ మోదించె**

(సు.క.పు. 54)

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీకృష్ణుని చెల్లెలు కాబట్టి నేను ఏమి అనడానికి లేదు. పైగా కౌరవసభలో తనకు మానదానం చేసిన శ్రీకృష్ణునిపై కృతజ్ఞత కలిగివుండాలని సమాధానపడి తన హృదయ భారాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తుంది. అయితే "ఇచట గూడ కొంత యనౌచిత్యమున్నదనిపించును. సుభద్ర వివాహము నాటికి ద్రౌపదికి మానభంగము కలిగియుండదు.

---

3. *రాధికా సాంత్వనము, పు.164*

భగవంతుడైన శ్రీకృష్ణుని కనుగు చెల్లెలు గనకనే సుభద్రను సవితిగా అంగీకరించినది. కవయిత్రి యిది కల్పించుటలోని యుద్దేశము ద్రౌపది తన నాపదయందు కాపాడిన వ్యక్తి చెల్లెలును కృతజ్ఞతతో సవితిగా స్వీకరించుట. పరిస్థితుల ప్రాబల్యము వలన ఆమె సాపత్న్యమును అంగీకరించియుండును".[4]

**నాటకంలో ద్రౌపది :**

నాటకంలో సుభద్ర అర్జునుడికి వివాహం చేసుకొని గోపాలికా వేషంలో వస్తోందని తెలిసి ద్రౌపది తన చెలికత్తె నందనికతో సుభద్ర గోపాలికా వేషంలో వస్తోందని తెలుసుకొని ద్రౌపది బాధపడి సుభద్రకు ఆ వేషం ఇష్టమో లేదో కనుక్కోమని నందనికతో చెబుతుంది. తన వల్ల సుభద్రకు ఏ ఇబ్బంది కలగకూడదని ద్రౌపది భావిస్తుంది. సుభద్ర మరణించిందని తెలిసి ద్రౌపది కూడా మరణానికి సిద్ధపడుతుంది.

**"సఖి నన్దినికే? తస్యాం వాసుభద్ర భగిన్యాం మమ చిత్తారాధనార్థం ప్రతిపన్న గోపాలికా వేషాయాం పశ్చిమాం దశాం ప్రపన్నాయాం న క్షణమపి జీవితం ధారయిష్యామి యది ధరతి సాంప్రతం నాథః, తం దృష్ట్వా కృతార్థా మరిష్యామి ! తదాదేశయ నగర బాహ్యోద్యానస్య మార్గమ్"** (సు.ధ.పు. 126)

ద్రౌపది సుభద్రను తన సొంత చెల్లెలు కంటే ఎక్కువగా భావించి సుభద్ర కోసం తన ప్రాణాలను కూడా విడిచిపెట్టాలనుకుంటుంది. సుభద్ర జీవించి ఉన్నదని తెలిసిన తరువాత –

**నాథ। మాఖల్వేవం, మమ భాగ్య శేషైరెషానీతా. నాథ ఇదానేమేవ కిల యాదవా ఆగచ్ఛన్తి, తేషాం సమ్మానార్థం మయా గన్తవ్యమ్ ।** (సు.ధ.పు. 128, 129)

ద్రౌపది తన భాగ్య విశేషమే ఆమెను తీసుకు వచ్చిందని ఆనందిస్తుంది. కావ్యంలో ద్రౌపది సుభద్ర తనకు సవితిగా వచ్చిందని అసూయ చెందుతుంది. కాని నాటకంలో ద్రౌపది అసూయ చెందకపోగా, సుభద్రకోసం మరణించడానికి సిద్ధపడుతుంది. కులశేఖరవర్మ ద్రౌపది త్యాగశీలి, ఉదాత్త భావాలు కలది. ద్రౌపది క్షేమమే తన క్షేమంగా భావిస్తుంది. కానీ తిమ్మక్క తన ద్రౌపదిని సహజంగా స్త్రీ కుండే భావాలతో సుభద్రతో అర్జునుడిని పంచుకుంటున్నందుకు బాధపడుతుంది.

**4.2.6 ధర్మరాజు :**

కుంతికి యమధర్మరాజు అనుగ్రహం వలన ధర్మరాజు జన్మిస్తాడు. పాండురాజు ప్రథమ పుత్రుడు. అర్జునుడికి పెద్ద అన్నయ్య. ద్రౌపది పాండవులలో ఒకరి ఇంటనుండగా తక్కిన వారు

---

4. *సుభద్రాకల్యాణము, ప్ర : పి. రమేష్ నారాయణ, పు. 45*

అక్కడికి రాకూడదని నియమం. ఈ నియమాన్ని ఉల్లంఘించిన వారు ఒక సంవత్సరం తీర్థయాత్ర చేయాలని షరతు. ద్రౌపది ధర్మరాజు ఇంటవుండగా అర్జునుడు ధేనువుల రక్షణార్థం ఆయుధాల కోసం ధర్మరాజు నివాసానికి వెళ్తాడు. నియమాన్ని ఉల్లంఘించిన అర్జునుడు తీర్థయాత్రకు బయలుదేరుతూ ఉండగా ధర్మరాజు వారిస్తాడు.

**"నిను విడిచి యొక ఘడియ - నేనుండ లేను**
**నను విడిచి యేరీతి - చనెదవోయన్న**
**కొమరొప్ప వచ్చితివి - గోవులకొఱకు**
**సమయభంగములేదు - చనవల దనెను"**

(సు.క.పు. 3)

తమ్ముడు నిన్ను విడిచి ఒక్క క్షణం కూడా నేను ఉండలేను నన్ను విడిచి ఎలా వెళ్ళిపోతావు? గోవుల రక్షణార్థం వచ్చావు కాబట్టి నియమాన్ని అతిక్రమించలేదు. తీర్థయాత్రలకు వెళ్ళవద్దని వారిస్తాడు. ధర్మరాజులో ఈ సందర్భంలో ధర్మం మీద కన్నా తమ్ముడి మీద ప్రేమాభిమానాలు ఎక్కువగా కనబడతాయి.

**నాటకంలో ధర్మరాజు :**

నాటకంలో సుభద్రా ధనంజయుల వివాహానంతరం ధర్మరాజు ద్రౌపదితో వాళ్ళిద్దరికి శోభనం ఏర్పాటు చేయమని చెప్పి అర్జునుడిని ప్రేమతో అలంకరిస్తాడు.

నాటకంలో కూడా ధర్మరాజు అర్జునుడి పట్ల అత్యంత ప్రేమను చూపిస్తాడు. అర్జునుడు తీర్థయాత్రకు వెళ్ళి సంవత్సరం దాటిపోయినా ఇంకా తిరిగి రాకపోయేసరికి అర్జునుడి సమాచారం తెలుసుకొని రమ్మని దీర్ఘాధ్వగుడు అనే చారుడిని పంపిస్తాడు.

సుభద్రా ధనంజయులు వివాహం చేసుకొని శ్రీకృష్ణునితో సహా ఇంద్ర ప్రస్థానికి వస్తున్నారని తెలుసుకొన్న ధర్మరాజు నగరాన్ని అలంకరించమని ప్రతీహారకుడిని ఆజ్ఞాపిస్తాడు.

అర్జునుడు సుభద్రను వివాహం చేసుకున్నందుకు ఆనందిస్తూ ధర్మరాజు

**"వత్స ! ధనఞ్జయ! అపినామ విప్రవాసక్లేశమలీమసః సమతిక్రాన్తస్తవ సంవత్సరావధి స్తీర్థయాత్రా వ్యతికరః. సోఽయమమునా సకలలోక గురుణా సఙ్కర్షణాను జన్మనా సమ్బన్ధ హేతురితి నః కల్యాణకరః సంవృత్తః.** (సు.ధ.పు.130)

ధనంజయుడు సంవత్సరకాలం పాటు తీర్థయాత్రలకు వెళ్ళడం వలన ధర్మరాజుకి మిక్కిలి దుఃఖాన్ని కలిగించినప్పటికి శ్రీకృష్ణునితో సబంధ బాంధవ్యాల్ని కలుపుకోవడం అతడికి ఆనందాన్ని కలిగించిందన్న విషయాన్ని తెలియజేసి ధర్మరాజు ఇటు అర్జునుడి మీద, అటు కృష్ణుడి మీద ఉన్న ప్రేమను తెలియజేశాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ ధర్మరాజు అర్జునుడి పట్ల వాత్సల్యాన్ని చూపిస్తూ సుభద్రార్జునుల వివాహానికి ఎంతో ఆనందిస్తాడు.

### 4.2.7 బలరాముడు

బలరాముడు రోహిణి, వసుదేవులకి జన్మించాడు. శ్రీకృష్ణుడికి, సుభద్రలకు అన్నయ్య. సుభద్రార్జునులకు వివాహం జరగడం సుతరామూ ఇష్టం లేనివాడు బలరాముడు. బలరాముడికి సన్యాసుల పట్ల గౌరవం మెండు. అందుకని శ్రీకృష్ణుడు అర్జునుడికి యతి వేషంలో రైవతకాచలానికి రప్పిస్తాడు. బలరాముడి చేతనే సుభద్ర మందిరంలో అర్జునుడికి నివాసం ఏర్పాటు చేసి సుభద్రను ధనంజయుడి సేవలో నియోగిస్తాడు.

కావ్యంలో సుభద్రను అర్జునుడు వివాహం చేసుకొని సుభద్రను ఇంద్రప్రస్థానికి తీసుకు వెళ్ళుతున్నాడన్న విషయాన్ని చారులు ద్వారా విన్న బలరాముడు సుభద్రార్జునులు పట్టి తెమ్మని చారులను ఆజ్ఞాపించగా శ్రీకృష్ణుడు కలుగజేసుకొని అర్జునుడి ధైర్యపరాక్రమాలను ఏకరువు పెట్టి సుభద్రను అర్జునుడు వివాహం చేసుకోవడం సమంజసమేనని చెప్పి సేనలను పంపే ప్రయత్నాన్ని విరమింపజేస్తాడు.

నాటకంలో బలరాముడు యాదవసైన్యంతో అర్జునుడు యుద్ధం చేయడం, బలరాముడు మిక్కిలి ఆగ్రహావేశాలతో ప్రతిజ్ఞలు చేయడం కన్పిస్తుంది. శ్రీకృష్ణుడు ఎంత వారిస్తున్నా వినకుండా హలాయుధుడు శ్రీకృష్ణుడుతో పలికిన తీరిది –

**"వాసుభద్ర ! పరవఞ్చనాపటీయసాం పాపీయసామశక్యావబోధాని ఖలు దుశ్చేష్టితాని. అత ఏవ విస్రబ్ధవఞ్చయితా వధ్యః . ఉపేక్షతాంచ భవానాకస్మిక పక్షపాత పరవశః పాపినః పాణ్డుతనయాన్"**

(సు.ధ.పు. 117)

కపట సన్యాసి వేషం వేసుకొని నమ్మించి మోసం చేసే ద్రోహులను వధించుట మన తక్షణ కర్తవ్యం. పాండవులంటే నీకు ఇష్టం కాబట్టి నువ్వు వారిని ఉపేక్షించినా నేను ఉపేక్షించను. పాండవుల

మీద పగ చల్లారక అది కౌరవుల మీదకి కూడా పాకి వారిని కూడ దండిస్తానంటాడు.

**"తేఽపి తావదాసతామవజ్ఞాత సకలక్షత్రమణ్డలాః కౌరవపశవః, యత్పితృవ్యతనయాః పాణ్డుదాయాదాః. అపిచ మన్త్రోక్రోధహుతభుజి రిపు జీవితలిహి దేదీప్యమానే."**

(సు.ధ.పు. 116)

ఆ పాండవులకు పెద్దతండ్రి కొడుకులైన కౌరవులు కూడా మనకు దండనీయులే అవుతారు. అని ప్రతీకారవాంఛతో రగిలిపోతాడు. ఇంకా పాండవులపై మనం ప్రతీకారం తీర్చుకోనట్లైతే మనల్ని అసమర్థులుగానే లోకం తలుస్తుందని పేర్కొంటాడు.

వాసుదేవుడు బలరాముడిని శాంతపరిచి తల్లిదండ్రులు, తగిన బంధువులు, బల్లిదులైన అన్నలు ఇందరు ఉండగా సుభద్ర ఒక పేదరాలి లాగా ఆదరణ లేకుండా అత్తవారింటికి వెళ్ళవలసిందేనా అని శ్రీకృష్ణుడు బలరాముడిని అడుగుతాడు. బల్లిదులైన అన్నలు అనడంలో నువ్వు, నేను ఉండగా సుభద్రకు ఇవ్వవలసిన అరణాలు ఇవ్వాలికదా అనే అర్థం స్ఫురించేటట్టు శ్రీకృష్ణుడు మాట్లాడతాడు. బలరామకృష్ణులు లక్ష గుఱ్ఱాలు, లక్ష ఏనుగులు, రమ్యకాంచన మణిరథ సహస్రాలు మొదలైన అరణాలను సుభద్రా ధనంజయులకు ఇచ్చారు. అరణాలు అందుకొని కొత్తదంపతులు బలరామకృష్ణులకు నమస్కరించారు.

మొదట బలరాముడు సుభద్రార్జునుల వివాహానికి అనుకూలంగా లేనప్పటికీ శ్రీకృష్ణుడు అతనిని ఒప్పించి సుభద్రకు అరణాలు ఇప్పిస్తాడు.

కావ్యంలో కన్నా నాటకంలో బలరాముడు మిక్కిలి క్రోధవంతుడిగా చిత్రింపబడ్డాడు.

### 4.2.8 విదూషకుడు (పాత్ర చిత్రణ) :

సుభద్రాధనంజయం నాటకంలో విదూషకుడు అర్జునుడికి చెలికాడు. కేవలం నాటకంలో కన్పిస్తాడు. కావ్యంలో కన్పించడు. నాటకం ప్రారంభం నుండి నాటకాంతం వరకు అర్జునుడికి సహాయంగా విదూషకుడు ఉంటాడు. విదూషకుడి గురించి ఆలంకారికులు యిచ్చిన నిర్వచనాలు "భరతాచార్యులవారు విదూషకుడు సమయోచితమైన బుద్ధి విశేషం కలవాడు, మోసాన్ని ఛేదించేవాడు, మనోజ్ఞ సంభాషణ నిపుణుడు అని ఇలా సెలవిచ్చారు.

**"ప్రత్యుత్పన్న ప్రతిభః నర్మకృత్ నర్మగర్భదుర్భేద్యః**
**యస్తు విభూషితవచనః విదూషకో నామ విజ్ఞేయః"**

విశ్వనాథుడు సాహిత్య దర్పణంలో విటచేట విదూషకుల సామాన్య లక్షణాన్ని ఇలా చెప్పాడు. “శృంగారేఽస్యే సహాయాః విటచేట విదూషకాద్యాః స్యుః భక్తాః నర్మసు నిపుణాః కుపిత వధూమాన భంజనాః శుద్ధాః” దీన్ని బట్టి విదూషకుడు శృంగార విషయంలో నాయకునికి సహాయుడూ, నాయకానురక్తుడూ, పరిహాసనిపుణుడూ, కోపన నాయికల అభిమాన భంజనుడూ, పరదారాగమనాది దోషవర్జితుడూ అని తెలుస్తోంది”. [5]

అర్జునుడు ఆకాశం నుండి జారిపడిన స్త్రీ గురించే ఆలోచించి వ్యధ చెందుతూ ఉంటే విదూషకుడు అర్జునుడిని సముదాయించిన తీరిది.

**“ఏతస్యాకాశవాసస్య నావసరం దాస్యామి. ఏవం తావద్ భణిష్యామి. భో వయస్య. నతావత్ సా కిన్నామధేయా కీదృశగోత్రా, కుత ఆగతా, క్వ వాగతేతి జ్ఞాయతే. కేవలమదృష్టమూలేన భ్రమేణ పర్యాకులో భవసి. కా నామాత్రోపాయచిన్తా”** (సు.ధ.పు.82)

ఆకాశం నుండి జారిపడిన స్త్రీ గురించే ఆలోచించి ఎందుకు అనవసరంగా బాధ పడుతున్నావు. ఆమె పేరుకానీ, ఆమె ఎక్కడి నుండి వచ్చిందో ఎక్కడికి వెళ్లిందో మనకి తెలియదు. అలాంటి స్త్రీ గురించి వ్యాకులత చెందకు అని అర్జునుడిని ఊరడిస్తాడు.

తదుపరి ఆకాశం నుండి జారిపడిన స్త్రీ సుభద్రే అని తెలుసుకొని అర్జునుడికి సుభద్ర పట్ల ప్రేమ కలగడం సమంజసమే అనుకుంటాడు.

అర్జునుడికి రోజూ భిక్ష ఇచ్చే సుభద్ర అస్వస్థతకు గురి అవడం వలన అర్జునుడికి భిక్ష ఇవ్వడానికి ఆమె రాకపోయేసరికి అర్జునుడి విరహం రెట్టింపు అవుతుంది. అదే సమయంలో విదూషకుడు –

**“యే నాద్య ప్రభాత ఏవ తత్ర భవత్యాః సుభద్రాయా వచనేనైకో వృద్ధకాంచుకీయో మమ పాద ప్రక్షాలనం కృత్వా ప్రతి గృహ్ణైతం హారమితి మాం లమ్భయిత్వా గతః. అహం పునరేతస్యాన్దతా విలాస ఏష భూషణవిపర్యాస ఇతి చిన్తయిత్వా, భవతు, ఏతయా వయస్యం వినోదయిష్యామీతి గృహీత్వాగతః”** (సు.ధ.పు. 99)

అర్జునుడి విరహాన్ని పొగొట్టే సుభద్ర హారాన్ని విదూషకుడు దానంగా స్వీకరించి అర్జునుడికి అందజేసి అర్జునుడి విరహారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తాడు. ధనంజయుడు ఆ హారాన్ని సంతోషంతో

---

*5. సుబ్రహ్మణ్య భారతి వ్యాసం, పు.107*

అందుకొని హృదయానికి హత్తుకొని సంతోషంతో సఖా ! విదూషకా నీవు చేసిన ఈ కార్యం చాలా గొప్పది అని ప్రశంసించి ఆనందిస్తాడు.

సుభద్ర తనని వరిస్తుందో లేదోనని శంకిస్తున్న కిరీటిని విదూషకుడు ధైర్య వచనాలతో సాంత్వన పరిచిన విధమిది.

**"భోః తిష్ఠతు తావదనఙ్గః. యస్తదా ప్రథమ దర్శనే ప్రతిష్ఠమానయా తత్ర భవత్యా సుభద్రయా త్వయి నిక్షిప్తః, స ఏవాపాఙ్గ ప్రజాపతిస్తయా త్వాం ఘటయిష్యతీతి తర్కయామి."** (సు.ధ.పు.100)

సుభద్ర నీకు పరిచర్య చేసి వెళ్ళేటప్పుడు ఆమె నిన్ను క్రీగంటి చూపులతో చూసింది, ఆమెకు నీపై అనురాగం ఉంది కాబట్టి నిన్నే ఆమె వరిస్తుందనే నేను అనుకుంటున్నానని అర్జునుడికి విదూషకుడు నమ్మకాన్ని కలిగిస్తాడు.

ధనంజయుడు మన్మథ బాణాలను తట్టుకోలేక మిక్కిలి బాధపడుతున్నప్పుడు అతడికి ధైర్యాన్ని నూరి పోస్తూ –

**"భోః వయస్య, కా నామేయమధీరతా యస్య తే యజ్ఞసేనీ స్వయంవర సమయ సంక్షోభితానాం క్షత్రియాణాం నైక్కోప్యపరాఙ్ముఖ ఆసీత్, తస్యకిల తే ఏతైరతిసుకుమారై ర్మనసి జపరాక్రమైర్విధురం భవతి హృదయమ్."** (సు.ధ.పు. 100–101)

ద్రౌపది స్వయంవర సమయంలో పరాక్రమం చూపిన నిన్నేనా ఈ మన్మథ బాణాలు హృదయాన్ని బాధించటం అని ప్రశ్నిస్తాడు. నువ్వు ఎంత పరాక్రమశాలివి. ఎంత ధైర్యవంతుడివి. ఈ మన్మథ బాణాలను తట్టుకోలేవా అని ధైర్యాన్ని నూరిపోస్తాడు.

ఇంకా అర్జునుడు విరహోత్కంఠుడు అవడం చూసి విదూషకుడు అర్జునుడికి ఈ విధంగా బోధిస్తాడు –

**"పశ్చిమావస్థాం ప్రతిపత్తు కామ ఇవైష ప్రలపతి. అన్యచ్చేదృశ ఏతస్య సమ్మోహః, యదక్రాన్తామపి సంధ్యాం న ప్రతపద్యతే. కిం మయా కర్తవ్యమ్. ఏవం తావద్ భణిష్యామి. భోః కస్మాదకారణ ఆత్మనమాయాసయసి, యద్ వాసుదేవేన సుభద్రా దత్తేతి స్వయమేవ కథయసి. సాపి సానురగా త్వయీతి జనాస్త్యేవ. అప్రత్యనీకం చ తే బాహుబలం ప్రత్యేషి. క ఇవైష సమ్మోహః. తద్ మా సన్తప. ఇదానీం పునః కాంచనకమల వాణికానీరగతం సహకారలతా మండపం గచ్ఛావః తత్ర గతస్య తే మృణాలలతికాతరంగానిలాదిభిః సుఖకరః శిశిరోపచారః, తత్ తత్రైవ గచ్ఛావః."**

(సు.ధ.పు. 102)

నిష్కారణంగా ఎందుకు కలవరపడతావు? వాసుదేవుడు సుభద్రను నీకే ఇస్తాడని చెప్పావు, సుభద్ర కూడా నిన్ను గాఢంగా ప్రేమించింది. ఆ విషయం నీకూ తెలిసిందే నీ భుజబల పరాక్రమము సాటిలేనిదని అని నీకు తెలుసుకదా ! ఎందుకు నువ్విలా పరితపిస్తావు. ఇంక ఆందోళన చెందకు. మనం వెంటనే బంగారు  దమ్మి పువ్వులుగల దిగుడు బావి దగ్గరకి వెళ్తే తామర తీగెలు నీకు శిశిరోపచారాలు చేస్తాయి. అక్కడ నీకు సుఖంగా ఉంటుందని అర్జునుడిని తీసుకువెళ్తాడు.

ఎంత గొప్ప పరాక్రమవంతుడైనా దుఃఖంలో ఉన్నప్పుడు తన బలాన్ని మర్చిపోయి బాధపడడం సహజమే. అప్పుడే ఓదార్చి ధైర్యం చెప్పి మన బలాన్ని మనకి గుర్తుచేసే వ్యక్తి అవసరం. ఆ వ్యక్తే విదూషకుడు. అర్జునుడు మిక్కిలి పరితాపాన్ని అనుభవిస్తున్నప్పుడు అతనికి చేదోడువాదోడుగా విదూషకుడు ఉంటాడు.

సుభద్ర రాక్షసుడిచే అపహరింపబడినదని విని అర్జునుడు మరణించడానికి సిద్ధపడితే విదూషకుడు సుభద్ర గాత్రిక  వల్ల అర్జునుడి దుఃఖం పోతుందని, ఒకవేళ ఈ గాత్రిక వల్ల కూడా ప్రయోజనం కలగపోయినట్లైతే నేను కూడా మరణిస్తాననుకుంటాడు విదూషకుడు.

ఇంకా విదూషకుడు అర్జునుడికి ఈ విధంగా ప్రబోధిస్తాడు.

**"దిష్ట్యా మమ భాగధేయశేషేణైవ ప్రతిబుద్ధః యద్యథా న పునరపి మోహం ప్రతిపద్యే, తథో పక్రమిష్యే, భో వయస్య ! కస్తే వ్యవసాయః, యత్ తవ బాహుబలాయత్త సర్వ పురుషార్థం జ్యేష్ఠం తే  యుధిష్ఠరం జననీమత్రం చ భ్రాతృవర్గమనపేక్ష్య జీవిత నిరపేక్ష ముపక్రమసే."**

(సు.ధ.పు.  123)

ఆత్మత్యాగం చేసుకోవడానికి సిద్ధపడుతూ ఉన్న అర్జునుడిని చూసి విదూషకుడు ఒకసారి పెద్ద అన్న అయిన ధర్మరాజు గురించి ఆలోచించు, నీ తల్లిని తలచుకో, నీ తమ్ములను గురించి ఆలోచించకుండా ఎందుకు అనవసరంగా జీవితాన్ని విడిచి పెట్టాలని ఆలోచిస్తావు? ఇహపర సుఖాలకి ఆత్మ పరిత్యాగం అంతరాయం అని నీకు తెలియదా అని జ్ఞానాన్ని బోధిస్తాడు.

సుభద్ర అపహరింపబడిందని దుఃఖాన్ని అనుభవిస్తున్న అర్జునుడికి కర్తవ్యాన్ని ప్రభోదిస్తూ విదూషకుడు.

**"న తావదేష బన్ధుజన స్నేహేన వాన్యేన వా కేనాపి సాంప్రతం ప్రకృతం నేతవ్యో భవేత్. న పునరేతాదృశా రిపుజనతరస్కారక్షమిణో భవన్తి. తదేతస్య మనసి మనాక్ సంరభమవతారయిష్యామి.**

**భో వయస్య, న ఖల్వ త్రైలోక్యే శోక - పారవశ్యాదలజ్జనీయోఽ న్యోస్తి భావః, యేన పరవశీకృతస్త్వమపి నామ దయితా, ప్రాణాపహార పరుషస్య పాపరాక్షసస్య ప్రతికారమనాచరన్, పరిదేవయితుం ప్రవృత్తః."** (సు.ధ.పు.124)

ప్రేయసీ ప్రాణాలను అపహరించిన కర్కశుడైన దుష్ట దానవుని మీద ప్రతీకారం తీర్చుకోకుండా బోరుమని ఏడ్వడం వలన ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తాడు. ఈ సమయంలో అర్జునుడికి విదూషకుడు చేసిన బోధ కురుక్షేత్రంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన గీతను తలపిస్తుంది.

విదూషకుడు ధైర్య వచనాలు విన్న అర్జునుడు ఓరి రాక్షసాధమా నా ప్రాణేశ్వరిని అపహరించిన నీవు నా బాణాల నుండి తప్పించుకోగలవా అని కోపోద్రిక్తుడౌతాడు. విదూషకుడు వల్ల దుఃఖం నుండి తేరుకొని కర్తవ్యోన్ముఖుడు అవుతాడు.

అర్జునుడికి అవసరమైన సలహాలు ఇచ్చి అతడి కర్తవ్యోన్ముఖుడిని చెయ్యడం, అతడు అవసాన దశలో అతడికి గాత్రికను ఇచ్చి అతడు తిరిగి మేల్కొనేటట్టు చేయడం, నాయకా, నాయకులు కలవడానికి దోహదపడడం మొదలైన కార్యాలలో విదూషకు నాటకంలో మిక్కిలి ప్రముఖమైన పాత్ర పోషించాడు.

విదూషకుడి పాత్ర సుభద్రా ధనంజయం నాటకంలో చాలా సముచిత స్థానం అందుకొంది. నర్మసచివ కృత్యంలో ఇతడు అనితరసాధ్యమైన నైపుణ్యాన్ని చూపి కృతకృత్యుడైయ్యాడు.

### 4.3 కావ్య నాటకాలలో రస పరిశీలన :

కావ్యనాటకంలో ప్రధానంగా శృంగార, వీర రసాలు అంగిరసాలు గానూ, మిగిలిన రసాలు అంగ రసాలుగా వుంటాయి. "సుభద్రా ధనంజయము", "సుభద్రా కల్యాణ" నాటక కావ్యాలు రెండూ శృంగారరస ప్రధానమైనవి. తక్కినవి అంగరసాలుగా ఉన్నాయి.

#### 4.3.1 శృంగార రసం :

రైవత పర్వతానికి నమస్కరించడానికి వచ్చిన సుభద్రను చూసి అర్జునుడు -

**దండ లావణ్య మెం - తయు రూపుతోను**
**వుండునో యనుచు - ని -ట్లాగి కొంతసేపు**
**యింతిమోముకు చంద్రు - డీడైన నేమి**
**కుంతలాకలిమి - కొదమతుమ్మెదలు**

**బాలకనుబొమ్మలకు - ప్రతియౌనువిల్లు**
**పాలించు ముత్యముల - పణతిచిర్నగవు**
**సతినాస తిలపుష్ప - సమమైన దేమి**
**అతిమ మ - ధ్యమ్ము సింహమునకు సరియె**

(సు.క.పు.16)

అని సుభద్ర మోమును, చంద్రుడితోటి పోల్చి అర్జునుడు ఆలంభన విభావానికి గురౌతాడు.

"ఆలంబనం నాయకాదిష్ట మాలంబ్య రసోద్గమాత్"[6] నాయకా నాయకులు ఆలంబన విభావములు. అర్జునుడు సుభద్ర మోముని, కనుబొమ్మల్ని, చిర్నగవునీ చూసి ఆలంభన విభావానికి లోనవ్వడం వలన ఇది సహజోద్దీపనము.

**"తెరయొద్ద నిలుచుండి - దేవేంద్రసుతుడు**
**సరసిజవదనతో - సరసమ్ము లాడు**
**భావగర్భితముగా - పలుకు మర్మములు**
**భావించి సతిజూతి - పరగ తమకించు**
**చెలియ లక్షణములు - చెప్పెద ననుచు**
**కలికి నొయ్యేన లేమ - కరము చేబట్టి**

**..........................................**

**నాల్గవ దినమున - నాగ వల్లికిని**
**శోభనం బగు గదే - సుదతి యిద్దఱకు**
**పానుపుటింటికి - పరగ బొమ్మలను**
**కదువేగ సంపుదమ - కమలాయతాక్షి"**

(సు.క.పు. 19)

తనను సేవించడానికి వచ్చిన సుభద్రతో అర్జునుడు నర్మగర్భంగా సరసాలాడి ఆమె చెయ్యి పట్టుకొని తనకు కలిగిన శృంగార భావాన్ని సుభద్రకు కూడా కలగజేయడానికి ప్రయత్నిస్తాడు. కానీ సుభద్ర ఆశ్చర్యపోయి తన అన్నకు ఫిర్యాదు చేస్తుంది. శ్రీకృష్ణుడి మాటలు విన్న సుభద్ర వచ్చిన యతి అర్జునుడే అని నిశ్చయానికి వచ్చి యతి సేవకు వెళ్ళేటప్పుడు ఈ విధంగా అలంకరించుకొని వెళ్తుంది.

---

*6. సాహిత్య సోపానములు, పు. 64.*

**"జాతి గొజ్జగి నీట - జలకమ్ము లాడి**
**రీతిగా నొకవింత - రేఖ చూపట్టి**
**....................................**
**జవ్వాజి పదనిచ్చి - చంద్రకాంతముల**
**దువ్వెన నెరగోర - దువ్విన కురులు**
**పాపట నొసపరి - బాగుగా దీర్చి**
**.....................................**
**మల్లెలు మొల్లలు - మందారములును**
**చల్లని జాజులు - సంపంగి విరులు**
**పారిజాతమ్ములు - బాగుగా తీర్చి**
**....................................**
**యిన్ని సొమ్ములకును - వన్నె బెట్టినటు**
**మూడువేల్ వెలసేయు - ముక్కఱ బెట్టె"**

(సు.క.పు. 26, 27)

సుభద్ర అర్జునుడి కోసం చెంగావి రంగు చీరను ధరించి జవ్వాది వంటి సుగంధ ద్రవ్యాలు పూసుకొని, మల్లెలు, మందారాలు, పారిజాతాలు, సంపంగి విరులు ధరించి చివరగా ముక్కెర పెట్టుకుంది. సుగంధ ద్రవ్య లేపనాలు, అలంకారాలు, పుష్పాలు ధరించడం శృంగార రసానికి విభావాలు.

**కోరి మా మేనత్త - కొడుకు లైదుగురు**
**వారికి కుశలమా - వరముని చంద్ర**
**ఆరాజవరులలో - నర్జునుం డెలిమి**
**ధారుణి తీర్థముల్ - దరినింప నేగె**
**తీర్థముల్ క్షేత్రముల్ - తరుగుచో మీరు**
**ఇంద్రనందను నెందు - నే జూడలేదా**

(సు.క.పు.29)

సుభద్ర సంపెంగలను అలంకరించుకోవడం ఆభరణాలు ధరించడం, సుభద్ర అర్జునుడి గురించి తెలుసుకోవడంలో శృంగార రసం అభివ్యక్తమౌతుంది.

అర్జునుడు గాంధర్వ వివాహం చేసుకుంటానన్నప్పుడు ఆమె అతనిని వారించి తన మందిరంలోకి వెళ్ళిపోతుంది. అర్జునుడు విరహ వేదనకు గురౌతాడు.

**ఇంతకి నా పేర - దేల చెప్పితిని**
**కాంతయు లోనికి - గ్రక్కున బోయె**
**మరుని పుత్తడిబొమ్మ - మరలె నా చేతి**
**పరిచర్య లొనరించ - భాషించ దొక్కొ**
**సుందరి పాదాల - యందియల మ్రోత**
**విందునో వీనుల - వెరగందు నొక్కొ**
**తెలిసోగ కన్నుల - తెలియగ లేమ**
**సొలయక తా జూడ్కి - చూచునో లేదొ**
**కొమ్మలతో గూడ - గుజ్జన గూళ్లు**
**....................................**
**మామ కావలెనని - మన్నించి రాద**
**కాముడు దన్నువే - కారించ దగున**

(సు.క.పు. 35)

అంటూ తపిస్తాడు. సుభద్ర అంతఃపురములోకి వెళ్ళిపోయిన తరువాత అర్జునుడు సుభద్రకు తన పేరు ఎందుకు చెప్పానని బాధపడతాడు. మళ్ళీ ఒక్కసారి సుభద్ర తనతో ఉంటే బావుంటుందని విరహవేదన అనుభవిస్తాడు. ఈ సందర్భంలో అర్జునుడు నాయికను చూడాలనుకోవడం వల్ల అభిలాష విప్రలంభం వ్యక్తమైంది. ఇంకా వివాహానంతరం శయ్యాగృహంలో -

**కొనలు నిక్కగ వేయు - కుసుమాస్త్రములన**
**బొమలు నిక్కగ వల - పుల చూపుచూచె**
**అల మోహనాంగుడు - న్నటుఁ జూచె దెలిసి**
**లజ్జించి దిగ్గన - రమణి శోషించె**
**నిబ్బరితనమున - నెలత చెయివట్టి**
**అబ్బురమ్మున కౌగి - టదుముకొని తెచ్చె**

..........................................

**బంగారు సురటి చే - పట్టి కిరీటి**

**అంగనకు విసిరె - నతిముదమ్మునకు**

..........................................

**పానకంబులు త్రాగి - పం డ్లారగించి**

**కర్పూర విడెములు - కడు నర్థి జేసి**

**అటు మేను లుప్పొంగె - ఆ దంపతులకు**

**తలపులు పులకించె - నెలతకుంబతికి**

**ఆసుభద్రా దేవి - ఆయర్జునుండు**

**సంతోషమున నుండి - సర్వకాలమ్ము**

(సు.క.పు. 53,54)

సుభద్రార్జునులు వివాహనంతరం శయ్యాగృహంలో పరస్పర ఆలింగన చుంబనాల వలన సంభోగ శృంగారం అభివ్యక్తమైంది.

**నాటకంలో శృంగారరసం :**

నాటకంలో సుభద్రను అర్జునుడు రాక్షసుడి నుంచి రక్షించిన తరువాత వారివురికి అభిలాష విప్రలంభం కలుగుతుంది. తనను రక్షించిన అర్జునుడంటే సుభద్రకు ఎంతో ప్రీతి. సుభద్ర సౌందర్యం అర్జునుడిని ఆకర్షింపజేస్తుంది.

**క్షిప్తక్షౌమో ప్రకంపాదురసిజకలశావుచ్ఛ్వసత్పత్రభంగౌ**

**మీలన్నీలాంబుజ శ్రీరనతిముకులితో ముగ్ధపాతః కటాక్షః ।**

**రోహ ద్రోమాఞ్చ భాజః శ్రమ జలకణికాభ్యుద్గతిర్గణ్డసీమ్నో -**

**ర్భీత్యా కిం వా కియత్యామపి మదనదశాయామముష్యాః ప్రవేశాత్ ॥**

(సు.ధ.పు.80)

సుభద్ర శరీరమంతా ఘర్మజల బిందువులు ఉన్నాయి. ఆమెకు భయం కలిగిందో లేక మన్మథుడు ప్రయోగించిన బాణాలవల్ల ఆమె కామావస్థను పొందిందోనని అర్జునుడు అనుకుంటాడు.

**(ససంభ్రమముత్తిష్ఠన్తీ స్వగతమ్) అమ్మో నైషపరమహంసః మన్యేమనసిజః మాం పీడయితు**

**ముపస్థితః అన్యచ్చ దృష్టమాంత్రేణైవ పరవశీకృతాని మేఽఙ్గాని కథమేత స్యోపచారం ప్రతిపత్స్యే భగవన్ వన్దే.** (సు.ధ.పు.94)

సుభద్ర కూడ కపటయతి ఆకార సౌష్ఠవాన్ని, ప్రతాపాన్ని చూసి పారవశ్యం చెందుతుంది. సుభద్ర పురుష త్రయాన్ని వలచానని భ్రమపడి అస్వస్థత చెంది యతిసేవకు వెళ్ళదు. అర్జునుడు సుభద్రను దర్శించడం విభావం. సుభద్ర కటాక్ష వీక్షణాలు ఆమె ఘర్మజల బిందువులను చూసి సుభద్ర కామావస్థ పొందిందేమోనని శంకించడం అనుభావాలు. సుభద్ర రాక్షసుడిచే అపహరింపబడడంవలన ఆమెను కలిగిన స్వేదం సాత్త్వికభావం. ఈ విభావ అనుభవాల వలన శృంగారరసం అభివ్యక్తమైంది. సుభద్ర రాకపోయేసరికి అర్జునుడు విరహబాధ తట్టుకోలేక విలపిస్తాడు. మన్మథుడి మీద అనేక ప్రశ్నలను సంధిస్తాడు.

**(దీర్ఘం నిఃశ్వస్య) అయిభోః కుసుమధన్వన్ ! అపహృత హృదయలక్షే మయి మా నీనశః కుసుమ శరాన్. అవిమృశ్యకారిణశ్చతే ముధాధనుర్ధరమ్మన్యస్య కిఞ్చిదుపదిశామి పశ్య**

**నేత్రే కర్ణాంత యాత్రా వ్యసనిని కుటిలే కున్తలీ మంజరీణాం;**
**జాలే మాలేయ పఙ్కప్రణయిని కుచయోర్మండలే పాంణ్డు బింబే ।**
**ఫుల్లామ్భోజ భ్రమాద్వా భ్రమదలికుల యోః పాదయోరఙ్గజన్మ**
**న్నఙ్గేత్వం పక్ష్మలాక్ష్యాః పులకిని మనసః క్వాపి మార్గస్వ మార్గమ్. ॥**

**(విచిన్త్య) కష్టం బత ప్రేయసీరూపామృత పానవిచ్ఛేద విపులీకృత మహిమ్నో వాసరస్యాస్య యాపన సాధనం తత్పమోధర భారపీడన సుభగా గాత్రికా సఖా చ మే కౌండిన్య ఇతి ద్వయమపి దుర్లభదర్శన మభూత్. (సు.ధ.పు.98)**

నీ పుష్ప బాణాలకి లక్ష్యమైన హృదయం నా దగ్గర లేదు. అపహరించబడింది. ఎందుకు వృధాగా పుష్పబాణాలను నాశనం చేసుకుంటావని మన్మథుడిని అడుగుతాడు.

సుభద్రా ధనంజయులు ఒకరినొకరు చూసుకోవడంవల్ల వారిలో బీజ రూపంలో ఉన్న రసం రతి, వారికి ఎడబాటు కలగడం వల్ల పుష్పఫల సమన్వితమైంది.

ద్వితీయాంకంలో వసంత ఋతువును వర్ణించడం, వీణాగానం చేయడంవలన నాయకుడు కన్పించకుండ, నాయిక చెలులో చెప్పే విషయాలు వినడం వలన, నాటకంలో సంభోగ శృంగారం వ్యక్తమయింది.

"నాయకుడు మరుగునపడి నాయిక చెలులతో నాడు మధురాలాపం విని ఆనందించుట అనేది శాకుంతలమందును ఇందును సమానమని".

వివాహానంతరం అర్జునుడు సుభద్రను తీసుకొని ఇంద్రప్రస్థానికి వెళ్ళి అందరి ఆశీర్వచనాలు పొందాక సుభద్ర మళ్ళీ రాక్షసుడిచే అపహరింపబడుతుంది. నాయికా నాయకులకు వియోగం కలుగుతుంది. సుభద్ర అపహరింపబడినదని తెలిసిన అర్జునుడి ఆవేదనకు అంతం ఉండదు. అర్జునుడు ఆత్మ త్యాగానికి సిద్ధపడతాడు. ఈ సన్నివేశంలో విరహ విప్రలంభం కన్పిస్తోంది.

కావ్య నాటకాలలో రెండింటిలోనూ శృంగారరసమే ప్రధానంగా ఉన్నా కావ్యంలో సంభోగ శృంగారం, నాటకంలో విప్రలంభ శృంగారం అందులోనూ విరహ విప్రలంభం అభివ్యక్తమైయింది.

**4.3.2 హాస్య రసం :**

కావ్యంలో అర్జునుడు ఉలూచి, చిత్రాంగదలను వివాహం చేసుకొని సన్యాసి వేషం ధరించి సుభద్రను వివాహం చేసుకోవలసి వచ్చినప్పుడు శ్రీ కృష్ణుడు అర్జునుడిని ఆటపట్టించే సందర్భంలో హాస్య రసం కన్పిస్తోంది.

**"హరియు నవ్వుచుఁ బల్కె - నర్జును జూచి**
**నిన్ననే సుతుల గని - నెఱతనమ్మునను**
**యింతలో సన్యాసి - వెట్లయితి వయ్య**
**యెరుగుదుము మీవిద్య - లెల్లను మేము**
**గరిమ వేసా లల్ల - గ్రాసాలకొఱకె"**

(సు.క. పు.13)

అని ఎగతాళి చేస్తాడు. ఈ సందర్భంలో బావమరదుల హాస్యాన్ని చమత్కారముగా చెప్పింది తిమ్మక్క.

**నాటకంలో హాస్యరసం :**

వివాహ సమయంలో శచీదేవి మొదలైన ముత్తైదువులందరు సుభద్రార్జునులను అలంకరించే సందర్భంలో అర్జునుడికి సహచరుడైన విదూషకుడు కూడా అలంకరించుకునే సందర్భంలో హాస్యరసం కన్పిస్తుంది.

**("గాత్రికాం కంఠే సమర్పయతి) యద్యేవం మమాపి వరవయస్యస్య మణ్డనేన భవితవ్యమ్. తత్ ప్రతిగ్రహ గృహీత యానాయా గాత్రికయాత్మానమ్ మణ్డయిష్యామి."** (సు.ధ.పు.108)

హాస్యం మళ్ళీ 2 రకాలు. ఆత్మస్థం, పరస్థం. తాను నవ్వినపుడు అది ఆత్మస్థం. పరులను నవ్వించినపుడు పరస్థం.

విదూషకుడు నవ్వుతూ తన వయస్యుడు అలంకరించుకోవడం వలన అతడు కూడా అలంకరించు కోవాలనుకుంటాడు. అయితే స్త్రీలు ధరించే గాత్రికను విదూషకుడు ధరించడం వలన హాస్యరసం స్ఫురించింది. విదూషకుడే నవ్వుతూ ఉండడం వలన హాస్యం ఆత్మస్థం. స్త్రీలు ధరించే గాత్రికను పురుషుడైన విదూషకుడు ధరించుట వికృత వేషం. ఈ వికృత వేషం హాస్య రసానికి విభావం. విదూషకుడు నవ్వుతూ ఉండడం అనుభావం.

కావ్యనాటకాలు రెండింటిలోనూ హాస్యరసం కన్పిస్తోంది. నాటకంలో హాస్యరసానికి విదూషకుడి పాత్ర ఉపయోగపడింది. కానీ కావ్యంలో తిమ్మక్క బావ బావమరదుల వేళాకోళాలలో హస్యరసాన్ని చొప్పించింది.

**4.3.3 కరుణ రసం :**

నాటకంలో సుభద్రా ధనంజయుల వివాహానికి బలరామాదులు అంగీకారం తెలిపి చెల్లెలికి అరణాలు పంపి, ద్రౌపది సుభద్రను సపత్నిగా స్వీకరించి అందరూ ఆనందంగా ఉన్న సమయంలో అలంబసుడనే రాక్షసుడు సుభద్రను అపహరించినపుడు అర్జునుడు అనుభవించిన బాధ వర్ణనాతీతం. తన అర్ధాంగి అపహరింపబడినదని తెలిసి మూర్ఛిల్లుతాడు. విదూషకుడు సుభద్ర దేహ స్పర్శతో ధన్యమైన గాత్రికను అర్జునుడి హృదయంపై పెట్టి అతడికి స్పృహలోకి తెస్తాడు. స్పృహలోకి వచ్చిన అర్జునుడు పరిపరి విధాల పరితపిస్తాడు.

**వయస్య ! పరిత్యక్త జీవలోకసుఖస్య జనస్య కా నామ బంధుష్వపేక్షా. (సకరుణమ్) మాతః. కుంతి భోజతనయే ! అద్యప్రభృత్యర్జునగతమపత్యవాత్సల్యమన్యేషు చతుర్షు పుత్రేషు సంవిభజస్వ అపిచ – (సు.ధ.పు.123)**

కుంతీమాతా నేటి నుంచి నువ్వు అర్జునుడి పట్ల చూపించే పుత్రవాత్సల్యాన్ని మిగిలిన నలుగురి పట్ల చూపించు అంటూ దుఃఖిస్తాడు.

అర్జునుడు సుభద్ర లేకపోతే శరీరత్యాగానికి సిద్ధపడడం, తీవ్రంగా విలపించడంవల్ల కరుణరసం శోకమనే స్థాయి భావాన్ని చేరి సహృదయులందరి మనస్సులను కదిలిస్తుంది. అర్జునుడికి కలిగిన సుభద్ర వియోగమనే విభావం వలన కరుణరసం అభివ్యక్తమయింది. సుభద్ర వియోగం వల్ల అర్జునుడు కూడ మరణించాలనుకుంటాడు. ఈ నిర్వేదం కరుణరసానికి వ్యభిచారి భావం. అర్జునుడు విలపించడమనే కరుణరసాభినయం చేశాడు.

నాటకంలో సుభద్ర అపహరించబడిన సందర్భంలో వలన కరుణరసం అభివ్యక్తమయింది. కానీ కావ్యంలో కరుణరస ప్రసక్తే లేదు.

### 4.3.4 రౌద్రరసం :

అర్జునుడు సుభద్రను తీసుకొని ఇంద్రప్రస్థానికి పయనమైనపుడు యాదవవీరులు అడ్డగించగా వారితో యుద్ధం చేస్తాడు. ఆ సందర్భంలో కావ్యంలో రౌద్రరసం కన్పిస్తుంది.

**"పోయేటి వేళలో - పురి గాచియున్న**
**ఆయుధవాహకు - లారీతి వైరి**
**ప్రవరసేనుడు కృత - వర్మ యాదిగను**
**శౌర్యమున నాసవ్య - సాచి నడంప**
**నోరోరి పాండవ - యుద్దండ వృత్తి**
**మారామకృష్ణులే - మతి లేమి జూచి**
**యీ లేమ తోడ్కొని - యెందు బోయెదవు**
**తాలాంకు శౌర్యము - తలపవే మదిని**
**పొలతి నీవెత్తుకొని - పోయితి వేని**
**బలనారసమ్ముల - బడవేతు మనిరి**
**ఘనగిరితటుల నం - దనవనంబునను**
**కినిసి బాణమ్ములు - క్రిక్కిరి యనేసె**
**రమణి సుభద్ర సా - రథ్యంబు సేయ**
**అమరేంద్రనందను - డాసమయమున**

**కడు కోపమున దన - కాండముల చేత**

**చెనకి వారల నెల్ల - చీకాకు జేసె"**

(సు.క.పు.45)

అర్జునుడు మిక్కిలి క్రోధంతో బాణాలు ప్రయోగించి యాదవసైన్యాన్ని చెల్లాచెదురు చేస్తాడు. ఆయుధాలు ప్రయోగించడం ద్వారా అర్జునుడు యాదవసైన్యాన్ని నిలువరించాడు. అర్జునుడు క్రోధంతో ఆయుధాలను ప్రయోగించడమనే విభావంవల్ల రౌద్రరసం అభివ్యక్తమయింది.

**నాటకంలో రౌద్రరసం :**

నాటకంలో కూడా అర్జునుడు యాదవ వీరులతో వీరోచితంగా యుద్ధం చేస్తాడు.

**"అరే పశ్య పశ్య, అనుసరత్ శత్రు బలం ప్రేక్ష్య ధనఞ్జయేన ప్రతినివర్తితో రథః. అన్యచ్చ ఆశ్చర్యం పశ్య. ఏతస్య శలభైరివ శరసమూహైర్విదలితధ్వజ కుథకకఙ్కటశిర స్త్రచ్ఛత్ర ప్రముఖైః పతిద్భిర్నరథతురగ సిన్దురాణాం నైకోఽపి విదలితః. తథాపి వరాఙ్ముముఖా యాదవయోధాః..."**

(సు.ధ. పు.112)

అర్జునుడు ప్రయోగించిన శరపరంపర ధాటికి యాదవసైన్యం కవచాలు, ధ్వజాలు, శిరస్త్రాణాలు నాశనమౌతున్నాయి. అర్జునుడిని ఎదుర్కొనలేక వారు పలాయనం చిత్తగించారు.

నాటకంలో అర్జునుడు సుభద్రను వివాహం చేసుకొని తీసుకువెళ్ళిపోతున్నాడని తెలియనే బలరాముడు విపరీతమైన క్రోధావేశాలను లోనౌతాడు.

సభాపాలుడు (యుద్ధభేరి మ్రోగించే రాజసేవకుడు) హలాయుధుడ్ని వర్ణించిన తీరిది.

**(సత్రాసమ్) అసౌ సమరసంరమ్భపినద్ధవర్మణా కృతవర్మణానుగమ్యమానః కృతాన్త ఇవ కృద్ధో హలాయుధః. అహోతుఖల్వముష్యక్రోధానలదీప్తేన మహుర్ముహుః పరివర్తమానేన నేత్రయుగలేన పరివర్తిత ఇవ సకలో జీవలోకః**

**(తతః ప్రవిశత్యపటాక్షేపేణ కృతవర్మణానుగమ్యమానో యథానిర్దిష్టః కృద్ధో హలాయుధః)**

(సు.ధ.పు.115)

హలాయుధుడు యుద్ధం చేయాలనే కోరికతో మృత్యు దేవత ఆకారం ధరించి భయంకరంగా కన్పిస్తున్నాడు. క్రోధంతో మండే ఎర్రని నేత్రాలు మాటిమాటికి కిందకి మీదకి చూస్తున్నాయి. ఈ వర్ణనలో బలరాముడి నేత్రాలు రౌద్రరసాభినయం చేస్తున్నాయి. క్రోధంతో అర్జునుడు యాదవ వీరుల

కవచాలు, శిరస్త్రాణాలు నాశనం అయ్యేటట్టు యుద్ధంచెమడమనే విభావం వల్ల రౌద్రరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ రౌద్రరసం కన్పిస్తోంది. కావ్యంలో బలరాముడు నేరుగా అర్జునుడితో తలపడినట్లు కన్పించదు. కానీ నాటకంలో బలరాముడు మిక్కిలి క్రోధంతో అర్జునుడితో యుద్ధం చేస్తాడు.

**4.3.5 వీరరసం :**

సుభద్ర యతి చేష్టలకు ఆశ్చర్యపోయి శ్రీకృష్ణుడికి ఫిర్యాదు చేసినప్పుడు శ్రీకృష్ణుడు యతి గొప్పతనాన్ని వివరించిన తీరిది.

**ఏమని వర్ణింతు – నితని మహత్త్వ**
**మేమని వర్ణింతు – నితని పౌరుషము**
**ప్రమథగుణముతోను – పార్వతీశ్వరుడు**
**నవతాడ వచ్చితా – చాలంగ నొచ్చె**
**ఆకాలకంఠుడు – నటు లోటిపోయె**
**నీతని గెలువగా – నెవ్వరి వశము**
**ఈయతీశ్వరుని పే – రెవరు తలచినను**
**వైరుల గుండెలు – వ్రక్కలైపోను.**

(సు.క.పు. 24)

అర్జునుడి పరాక్రమాన్ని వర్ణించలేము. సాక్షాత్తు ఈశ్వరుడు కూడ అర్జునుడు ముందు నిలువలేడు. అర్జునుడు పేరు తలచిన వెంటనే శత్రువుల గుండెలు ముక్కలౌతాయని శ్రీకృష్ణుడు అర్జునుడి గొప్పతనాన్ని చెప్తాడు. అర్జునుడి పరాక్రమం, ప్రతాపం అనే విభావాల వలన వీరరసం అభివ్యక్తమయింది.

**నాటకంలో వీరరసం :**

నాటకంలో అర్జునుడు సుభద్ర అపహరించబడిందని తెలసి మూర్ఛిల్లుతాడు. విదూషకుడు అతడికి ధైర్య వచనాలు నూరిపోస్తాడు. ఉత్సాహాన్ని నింపుతాడు. అర్జునుడి ప్రతాపాన్ని శక్తిని కీర్తిస్తాడు.

**“హా కృతాంతహతక ఏతస్య మహీంద్రనందనస్య భువనైకధనుర్ధరస్య వాసుభద్రమిత్రస్య ధర్మానుజస్యాప్రతీకారం వినిపాతం దర్శయన్ అధృత్వమీశ్వరః సంవృత్తః....’**

(సు.ధ.పు. 122)

అర్జునుడిని భువనైక ధనుర్ధరుడు, మహేంద్ర నందనుడు, శ్రీకృష్ణుడికి మిత్రుడు అని కొని ఆడతాడు.

విదూషకుడి ధైర్య వచనాలకి మేల్కొన్న అర్జునుడు తన ప్రతీకారాన్ని తీర్చుకోవడానికి ఉత్సాహంతో బయలు దేరతాడు.

**(ససంభ్రమ ముత్తిష్ఠన్) ఆః కిం నామ కృతాగస్వ రిష్వ ప్రతి కుర్వాన్నాస్తే ధనంజయః (ఊర్ధ్వమవలోక్య) భోభోః పిశితాశనాపసద మత్ప్రాణ వల్లభా ప్రాణాపహారిన్ క్వగత్వా మద్బాణపాతం పరిహరసి. (సు.ధ.పు. 124)**

అర్జునుడు తన ప్రాణేశ్వరి అపహరించిన రాక్షసుడిని యముడి దగ్గరకు పంపిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. విదూసకుడు అర్జునుడి ప్రతాపాన్ని కీర్తించడం వల్ల వీరరసం వ్యక్తం అయింది. అర్జునుడు ధైర్యంతో రాక్షసుడి మీద బాణాలను ప్రయోగిస్తానంటాడు. ఈ ధైర్యం వీరరసానికి అనుభావం.

కావ్య నాటకాలు రెండింటిలోనూ అర్జునుడు శత్రువులను వీరోచితంగా ఎదుర్కోవడంవల్ల వీరరసం పోషింపబడింది.

**4.3.6 అద్భుతరసం :**

**నాటకంలో అద్భుతరసం :**

నాటకంలో యతివేషంలో ఉన్న అర్జునుడిని కలవడానికి బలరాముడు, శ్రీకృష్ణుడు కాంచన ఉద్యాన వనానికి వస్తారు. ఈ కాంచన ఉద్యానవనాన్ని చూసి బలరాముడు విస్మయం చెందుతూ ఈ విధంగా పలుకుతాడు.

**(ఆత్మగతం) నూనమినిచ్ఛతోఽపిచ్ఛద్మాన్యసత్యే కర్మణ్యవతారయన్త్యతిగురూణి మిత్ర కార్యాణి తథాహి**

**వేషం దోషానుషఙ్గక్షయవిశదధియామాశ్రయన్ ముక్తి భాజాం**
**పార్థః ప్రధ్వస్త ధైర్యే మనసి కృతపదాం మాధవీం ధ్యాయతీతి**
**ప్రోద్భిన్నస్య స్మితస్య ప్రభవముపచిత ప్రేమ విక్షిప్తశఙ్కాం**

**పృచ్ఛన్తీం సత్యభామామకరవ మయథా భూతవస్తూపలంభామ్.**

**(ప్రకాశమ్) ఆర్య అయం స భగవానన్యమాత్రమనుగృహ్ణనో**

**హైమమధ్యాస్తే శిలాతలమ్. ఉపసర్పావస్తావదేనమ్**

(సు.ధ.పు. 87)

వివాహానంతరం సుభద్ర అపహరింపబడడంవలన ఆమెను రక్షించడానికి లోకపావని అయిన కాత్యాయని దేవి ద్రౌపది రూపంలో వచ్చి సుభద్రను అర్జునుడికి అప్పగించడం మొదలైన సన్నివేశాల్ని ఆద్యంతం ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

ఇద్దరు ద్రౌపతులను చూసి అర్జునుడు, సుభద్ర మొదలైనవారు ఆశ్చర్యానికి గురౌతారు.

బలరాముడు కాంచన ఉద్యానవనానికి వెళ్ళడం కాత్యాయనిదేవి మాయ చేత ద్రౌపది రూపంలో రావడమనే విభావాల వలన అద్భుతరసం అభివ్యక్తమయింది. బలరాముడు ఔరా అనే అనుభావం చేత రౌద్రరసాభినయం చేశాడు. నాటకంలో మాత్రమే అద్భుత రసం ఉంది. కావ్యంలో అద్భుతరసం లేదు.

**4.3.7 భక్తిరసం :**

కావ్యంలో సుభద్రా ధనంజయులు వివాహానంతరం శ్రీకృష్ణ రుక్మిణీలకు నమస్కరించిన సందర్భంలో భక్తిరసం కన్పిస్తుంది.

**"అపుడు సుభద్రయు – నా యర్జునుండు**
**ఆ రామకృష్ణులకు – నతి భక్తి మ్రొక్క**
**మ్రొక్కిన యిరవుర – మొగి లేవనెత్తి**
**విజయుడవు గమ్మంచు – వేడ్క దీవించ**
**విజయు దంతట వారి – వేడె బూజించె**
**సంతోషచిత్తులై – చనిరి ద్వారకకు"**

(సు.క.పు. 48)

బలరామకృష్ణులు భక్తి రసానికి ఆలంబన విభావాలు.

**నాటకంలో భక్తిరసం :**

నాటకంలో వివాహానంతరం సుభద్రను అలంబసుడనే రాక్షసుడు అపహరించుకుపోయినపుడు కాత్యాయని దేవి సుభద్రను రక్షించి అర్జునుడికి అప్పగించినప్పుడు అర్జునుడు కాత్యాయనిని కృతజ్ఞతా పూర్వకంగా స్తుతిస్తాడు.

**"అఙ్ఘ్రిభ్యామమ్బ ! పీఠీకృత మహిషశిరోమండలాభ్యా మమూభ్యా**
**మష్టాభ్యః శ్లిష్టమౌర్వీవయ ఝణ ఝణానిక్వణే భ్యో భుజేభ్యః ।**
**కోటీరేభ్యశ్చ పశ్చాత్కృత కలశిఖావిభ్రమేభ్యో నమస్తే**
**మూర్ధన్యుగ్ధేన్దులేఖా కుటిల తనుగలచ్చ న్ద్రికాశేఖ రేభ్యః ॥**

(సు.ధ.పు. 127)

మహిషాసుర శిరస్సును పీఠంగా ఉపయోగించిన నీ పాదాలకు నమస్కారం అంబ, జగదంబ, ఈశ్వరీ అంటూ ఆ ఆదిశక్తిని కీర్తిస్తాడు అర్జునుడు. అర్జునుడు అడగకుండానే కాత్యాయని దేవి సుభద్రను రక్షించింది. కోరకనే లభించిన సహాయానికి అర్జునుడు ఎంతగానో పొంగిపోతాడు. నాటకంలో కాత్యాయనిదేవి, శ్రీకృష్ణుడు ఆలంబన విభావాలు. అర్జునుడు వీరిని స్తుతించడమనే విభావం వలన భక్తిరసం అభివ్యక్తమయింది.

నాటకం చివరలో భరతవాక్యంలో కూడా అర్జునుడు తన వివాహానికి సూత్రధారి, కర్త, క్రియ అయిన శ్రీకృష్ణుడిని స్తుతిస్తాడు. భరతవాక్యం కూడా భక్తిరసంతో నిండిపోయింది.

**4.3.8 వత్సలరసం :**

కావ్యంలో శ్రీకృష్ణుడు తనకు ప్రియమైన చెల్లెలు వివాహం అర్జునుడితో చెయ్యాలనే ఉద్దేశ్యంతో సుభద్రను కపటయతి వేషంలో వున్న అర్జునుడి సేవకు నియోగిస్తాడు. సుభద్ర తన అంతఃపురములో వుంటుంది. శ్రీ కృష్ణుడు ఆమెను పిలుస్తూ –

**అమ్మరా ముద్దుల – గుమ్మ రా వేగ**
**కొమ్మ రా నవకంపు – బొమ్మ రావమ్మ**
**ముత్యాలసరమ రా – ముద్దరాలా రా**
**చిత్తజుబాణమా – చెలియ రావమ్మ**
**చిలుకల కొలికి రా – శృంగారకన్య**

**తొలకరిమెఱుప రా - తోయజగంధి**
**పండువెన్నెల రావె - భాగీర్తిరావె**
**గండుగోవెల రావె - కమలాక్షి రావె**
**మచ్చకంటీ రావె - మాధవళి రావె**
**అమృతంపుతెప్ప రా - అరవిరిమొగ్గ**
**బంగారుపెట్టెరా - భాగ్యాలబరణి**
**వెలయు ముజ్జగముల - వింత యై నట్టి**
**శ్రీకలా బిరుదుల - చెలియ రావమ్మ**

(సు.క.పు. 22)

కమలాక్షి, భాగ్యాల బరణి, తోయజగంధి అని రకరకాలుగా సంభోదిస్తూ ఆమెను అనునయించడంలో వత్సలరసం అభివ్యక్తమయింది.

సుభద్ర అర్జునుడి మీద ఫిర్యాదు చేసినపుడు శ్రీ కృష్ణుడు ఆమెను సముదాయిస్తూ -

**భద్రేభగమన సు - భద్ర రమ్మనుచు**
**తోయజాక్షుడు తన - తొడపైన నునిచె**
**నీలాలవంటివా - నెలత నెఱికురులు**
**వాలారు కొన గోళ్ల - వడిచిక్కు దీసే**
**శ్రీకృష్ణుడావేళ - చెల్లెలికి నపుడు**
**నేనకొప్పటు బెట్టి - చెలువమ్ముతోను**
**చుబుకంబు పైకెత్తి - చూచి యోదార్చి**
**మక్కువ నలరించె - మగువ నెమ్మోము**
**చుబుకంబు పైకెత్తి - చూచి యోదార్చి**
**మక్కువ నలరించె - మగువ నెమ్మోము**
**..............................................**
**..............................................**
**యిట్టె బంధించెద - నిపుడె కొట్టెదను**
**అని బుజ్జగించి చె - ల్లెను గారవించి**
**చెలునమ్ముగా బలికె - శ్రీకృష్ణ డెలమి**

(సు.క.పు. 23)

తనతొడపై కూర్చోబెట్టుకొని సుభద్ర కురులు చిక్కుతీసి కొప్పువేసి అర్జునుడిని వెంటనే దండిస్తానని తనకు చెల్లెలుపై ఉన్న వాత్సల్యాన్ని చాటుకొన్నాడు. వత్సల రసంలో శ్రీకృష్ణుడికి సోదరి అయిన సుభద్ర ఆలంబన విభావం. తొడపై కూర్చోబెట్టుకోవడం, చిక్కు తీయడమనేవి అనుభావాలు.

మనస్సులో అర్జునుడినే తలచుకుంటూ విరహవేదనను అనుభవిస్తూ ముసుగుపెట్టి పడుకున్న సుభద్రను రుక్మిణి బుజ్జగిస్తున్నప్పుడు కూడా కావ్యంలో వత్సల రసం అభివ్యక్తమయింది. వత్సల రసం నాటకంలో లేదు.

### 4.4 వర్ణనలు

#### 4.4.1 కావ్యంలో వర్ణనలు

##### 4.4.1.1 తినుబండారాల వర్ణన :

రైవత పర్వతానికి వెళ్ళేవారు తమకు కావల్సిన తినుబండారాలు తీసుకు వెళ్ళే సందర్భంలో తిమ్మక్క అనేక పిండివంటలను వర్ణించింది.

**పప్పు బూరెలు నెయ్యి – పాయసాన్నములు**
**కాయగూరలు పెక్కు – కలవంటకాలు**
**ఊరుగాయలు నెయ్యి – బొబ్బట్లు వడలు**
**గారెలు బూరెలు – కండమండిగెలు**
**అరటి పండులును రా – జాన్న రాసులును**
**పిండికూరలు మొదల్ – పెద్ద కుడుములును**
**గరిగలఘటముల – గంపల నునిచి**

(సు.క.పు. 14)

##### 4.4.1.2 ప్రయాణ వర్ణన :

రైవత పర్వతానికి వెళ్ళేటప్పుడు శ్రీకృష్ణుడు, యాదవుల ప్రయాణాన్ని వర్ణించింది తిమ్మక్క.

**పడుచులు పెద్దలు – బాలింతరాండ్లు**
**కొడుకులు కోడండ్లు – కూతు లల్లుండ్లు**
**తోతొక్కులాడుచు – ద్రోవ కిక్కిరిసి**
**చనిరి యాదవులంత – సంభ్రమమునను**
**అంతంత చతురంత – యానంబు లెక్కి**

(సు.క.పు. 15)

**4.4.1.3 సుభద్ర వర్ణన :**

అర్జునుడు రైవత పర్వతానికి నమస్కరించడానికి వచ్చిన సుభద్రను చూసి తన మనస్సులో-

**'ఇంతిమోముకు చంద్రు - డీడైన నేమి**
**కుంతలాలాకలిమి - కొదమతుమ్మెదలు**
**బాలకనుబొమ్మలకు - ప్రతియౌను విల్లు**
**పాలించు ముత్యముల - పణతిచిర్నగవు**
**సతినాస తిలపుష్ప - సమయైన దేమి**
**అతవ మ-ధ్యమ్ము సింహమునకు సరియె"** (సు.క.పు. 16)

సుభద్ర ముఖం చంద్రుడితో సరిపోలినదని, ఆమె కనుబొమ్మలు విల్లులా ఒంపు తిరిగి ఉన్నాయని అర్జునుడు తలపోస్తాడు. ఈ వర్ణన సుభద్ర సౌందర్యాన్ని, సుభద్ర మీద అర్జునుడికి గల ప్రేమను తెలియజేస్తుంది. కవయిత్రి సుభద్రను వర్ణించడం ద్వారా అర్జునుడికి ఉద్దీపన విభావాన్ని కలిగించింది.

**4.4.1.4 బొమ్మలపెండ్లి వర్ణన :**

తిమ్మక్క స్త్రీలకు వినోదాన్ని కలిగించే బొమ్మల పెండ్లిని చక్కగా వర్ణించింది.

**"పాలుపై రత్నాల - బొమ్మరింటికిని**
**తళుకైనపగడాల - దారబందములు**
**పచ్చల తలుపులు - పన్నారు గురుగు**
**లచ్చంపు దంతాన - నమరు బొమ్మలను**
**చెఱుగుల యంచుల - జీనివ్రాతలును**
**చిరుత పప్పుళ్లమతి - చెంద్రకావులును**
**బంగారు బొమ్మలకు - బాగుగా కట్టె"**

(సు.క.పు. 18)

"నన్నెచోడుడు 'కుమార సంభవము'లో పార్వతి బాల్యదశ నే విధముగా వర్ణించాడు. పార్వతి మట్టితో, కఱ్ఱతో, దంతముతో బొమ్మలను చేసి, బొమ్మరిల్లుకట్టి, బొమ్మ పెండ్లిండ్లు చేసేదని, గుజ్జనగూళ్లు వుండేవనీ" [7]

---

7. *ఆంధ్రదేశము - స్త్రీలు, పు. 10*

**4.4.1.5 పుష్పాల వర్ణన :**

అలంకరణలో పుష్పాలకున్న ప్రాముఖ్యత మరి దేనికిలేదు. అందులోనూ స్త్రీల అలంకరణలో పుష్పాలకు ఉన్న స్థానం ముఖ్యమైనది.

**మల్లెలు మొల్లలు - మందారములును**
**చల్లని జాజులు - సంపంగి విరులు**
**పారిజాతమ్ములు - బాగుగా తీర్చి**
**యొయ్యెనె మఱియె నా - యుత్పల గంధి**

(సు.క.పు. 27)

**4.4.1.6 ఆభరణాల వర్ణన :**

యతిరూపంలో ఉన్న అర్జునుడికి పరిచర్యలు చెయ్యడానికి వెళ్ళేటప్పుడు సుభద్ర తను అలంకరించుకొన్న సందర్భంలో, శోభనానికి ముందు ద్రౌపది సుభద్రను అలంకరించే సందర్భంలో నగల వర్ణన ఈ విధంగా ఉంది-

**"నటన గుమ్మిడి గింజ - నామమ్ము తీర్చె**
**బసిడి ముత్యాల నొ - ప్పగ పూర్ణచంద్రు**
**రవమించు చెవుల తా - టంకాలు చేర్చె**
**మొగపు తీగెకు చెంత - ముత్యంపు కొలికి**
**జిగిమణుల్ మిగులు మం - జిడి తాళి జేసె**
**పుంజాల దండ దా - పున నేవళమ్ము**
**రంజిల్లు భన్నస - రమ్ము క్రీడించ**
**యిన్ని సొమ్ములకును - వన్నె బెట్టినట్టు**
**మూడువేల్ వెలసేయు - ముక్కఱబెట్టె**

(సు.క.పు. 27)

పై వర్ణనలో సుభద్ర పెట్టుకొన్న బొట్టును కూడ వర్ణించింది తిమ్మక్క. "చెరగు విడిచికట్టుట, గుమ్మిడిగింజ నామము తీర్చుట వైష్ణవ స్త్రీల యలంకరణను తెల్పుచున్నది" [8]

---

*8. ద్విపద వాఙ్మయము, పు.512*

"సుభద్రా కల్యాణము"న గుమ్మడిగింజ యాకారముగా నుండెడు తిలకమని యర్థము పింగళి సూరన కూడ యగిసెయాకు బొట్టు, పూర్ణచంద్ర తిలకము, నెలవంక నామము దడవెను".[9]

ఈ క్రింది విధంగా వుంది.

**ఒడ్డాణమును బెట్టె – నూగాడు మొలను**
**బిళ్లల మొలనూళ్లు – బిగిసి మ్రోయగను**
**ఘంటల మొలనూళ్ళు – ఘల్లున మొరయ**
**కంఠహారమ్ములు – కౌస్తుభమణులు**
**కాలి పండెముగూర్చె – ఘనతతోడుతను**
**అందెల దిద్దె నా – యతివ సుభద్ర**
**తళుకు మించిన సంది – దండల పైని**
**నెలవంక తాయితల్ – నెఱి వుట్ట గట్టె**
**శ్రీకారములతోడ – చెలగాడు చెవుల**
**కమలాక్షి పంజుల – కమ్మలె పెట్టె**
**సొమ్ము లిన్నిటి మీద – శోభిల్లు నట్టి**
**మూడు వేలుం జేయు – ముక్కఱ పెట్టె**

(సు.క.పు. 51)

పై రెండు సందర్భాలలో తిమ్మక్క ముక్కెరకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది. మిగిలిన ఆభరణాలన్నీ ఒక ఎత్తు. ముక్కెర ఒక్కటి ఒక ఎత్తు అని చెప్పకనే చెప్పింది. ఇక్కడ కూడ తిమ్మక్క నాయకుడిలో రతిని ఉద్దీపనం చేయడానికి నాయిక ఆభరణాలు వర్ణించింది. ఈ వర్ణన కూడ శృంగార రసాభివ్యక్తికి ఉపయోగపడింది.

### 4.4.1.7 అర్జునుడి వర్ణన :

కపట యతి వేషంలో వున్న అర్జునుడిని సుభద్ర తన మేనత్త కొడుకు పాండు మధ్యముడు మీకు ఎక్కడైనా కన్పించాడా అని అడిగినప్పుడు కపట యతి అర్జునుడి రూపురేఖలు చెప్పే సందర్భంలో తిమ్మక్క కిరీటిని వర్ణించిన తీరిది –

---

9. *తెలుగు జానపదగేయ సాహిత్యము, పు.78*

"ఎగు భుజమ్ముల వాడు - మృగరాజునడుము
నడచి పుచ్చుకొనునె - న్నడుముగలవాడు
గరగరనివాడు చ - క్కని వాడు నతడు
గొప్ప కన్నులవాడు - కోదండగుణికి
ణాంకంబు లౌబాహు - లమరినవాడు
వెన్నున మచ్చగల - విభవంబువాడు
బవిరి గడ్డము వాడు - పన్నిదం బిడిన
వెన్ను పగడసాల - వెస నాడవచ్చు
చిగురొత్తు చెంద్రిక - చెలగు పాదములు
నని విధం బెతిగింప - నంతట నరుడు" (సు.క.పు. 34)

తిమ్మక్క కపట యతి చేత అర్జునుడిని వర్ణింపచేసి సుభద్రకు రత్యానందాన్ని కలుగజేసింది. శృంగారరసాన్ని ఆవిష్కరించింది. సుభద్రకు అర్జునుడు ఆలంబన విభావం. అర్జునుడి నడుము, కన్నులు, బాహువులు, గెడ్డము సహజోద్దీపనాలు. అర్జునుని గుణగణాల శ్రవణమనే విభావంచేత కావ్యంలో శృంగారరసం అభివ్యక్తమయింది. చేమకూర వేంకటకవి తన విజయ విలాసం ప్రబంధంలో తిమ్మక్కను అనుసరించి అర్జునుడి వర్ణన కిందివిధంగా చేశాడు.

"ఎగుభుజంబుల వాఁడు, మృగరాజు మధ్యంబుఁ
బుడికి పుచ్చుకొను నెన్నెడుమువాఁడు
నెఱి వెండ్రుకలవాఁడు నీలంపు నికరంపు
మెఱుఁగుఁ, జామన చాయ మేని వాఁడు
గొప్ప కన్నులవాఁడు, కోదండగుణ కిణాం
కములైన ముంజేతు లమరువాఁడు
బవిరి గడ్డము వాఁడు, పన్నిదం బిడి డాఁగ
వచ్చు నందంపు వెన్నుమచ్చవాడు
గరగరని వాఁడు, నవ్వు మొగంబువాఁడు
చూడఁ గలవాఁడు, మేలైన సొబగువాఁడు
వావి మేనత్త కొడుకు కావలయు నాకు,
నర్జునుండ పరాక్ర మోపార్జునుండు".[10]

*10. విజయవిలాసము, పు. 110*

**4.4.1.8 రుక్మిణి వర్ణన :**

సుభద్ర విరహవేదన అనుభవిస్తూ ముసుగుపెట్టి పడుకొన్నప్పుడు ఆమె అవస్థను గమనించిన రుక్మిణి శ్రీకృష్ణుడికి ఆమె సంగతి చెప్పడానికి వెళుతున్న రుక్మిణిని తిమ్మక్క వర్ణించిన తీరిది.

**"ఆ యింతి పెట్టె నా - యాసొమ్ము లన్ని**
**తాటంకముల కాంతి - ధవళింపగాను**
**మొలనూళ్ల ఘంటలు - మొల్లముగ మ్రోయ**
**నొయ్యనె తననడు - మూగాడగాను**
**ఇంతి పయ్యెదలోన - నెకా తమునను**
**ఆచక్రవాకములు - జతివ హారములు**
**కొమరార కొప్పులో - గొజ్జంగి దండ**
**నటనతో వీపున - నాట్య మాడగను**
**జాఱుపయ్యెద కొంగు - చక్కద్రోయుచును**
**ఉరిది ముత్యపు సరులు - నుయ్యాల లూగ"**

(సు.క.పు. 39)

రుక్మిణి కృష్ణుడి దగ్గరకి నడుస్తూ వెళ్తోంది. నడుస్తూ ఉన్నప్పుడు ఆమె ఆలంకరించుకొన్న ఆభరణాల స్థితిని వర్ణిస్తోంది తిమ్మక్క. ఆమె కదలుతూ ఉంటే ఆ మొలన ధరించిన ఆభరణం గంటలు మోగుతున్నాయి. కొప్పులో పెట్టుకొన్న గొజ్జంగి దండ వీపుమీద నాట్యమాడుతోంది. ఆమె నడవడం వల్ల జారిపోతున్న కొంగును ఆమె సరిచేసుకుంటోందని తిమ్మక్క రుక్మిణిని మనముందు సాక్షాత్కరింపజేసింది.

**4.4.1.9 వధూవరుల అలంకరణ వర్ణన :**

సుభద్రార్జునుల వివాహం సమయంలో అరుంధతి, శచీదేవి, రుక్మిణీ, సత్యభామలు వధూవరులను అలంకరించిన ఈ విధంగా ఉంది.

**"ఆ వధూవరులకు - నతివ లందఱును**
**సంపంగి తైలము - చక్కగా నంటి**
**జలక మిద్దతికిని - సరగున దీర్చి**
**దివ్యవస్త్రమ్ములు - దివ్యగంధములు**

దివ్యమాల్యమ్ములు - దివ్యభూషలును
ధరియించి రవుడు వా - దృధ్వనులెసగ"

(సు.క.పు. 41)

వివాహ సమయంలో వధూవరులను మంగళ స్నానాలు చేయించడం సంప్రదాయం తిమ్మక్క అరుంధతి మొదలైన ముత్తైదువులచే సుభద్రార్జునులకు మంగళ స్నానాలు చేయించింది.

**4.4.1.10 శయ్యాగృహ వర్ణన :**

వివాహానంతరం సుభద్రా ధనంజయులు ఇంద్రప్రస్థానికి వెళ్ళినప్పుడు ధర్మరాజు ద్రౌపదిని సుభద్రా ధనంజయులకి శోభనం ఏర్పాటు చేయమని చెప్పినపుడు ద్రౌపది శయ్యాగృహాన్ని అలంకరించిన విధమిది.

వేవేల యత్నముల - విందు తగజేసె
నొప్పైన బంగారు - టుప్పరిగలోను
కప్పురవాసనల్ - గ్రమ్ముకొనంగ
సాంబ్రాణిధూమముల్ - సఖి తానువేసి
చిత్రముల్ నిర్మించె - చెలియ యంతటను
దిక్కుల మాణిక్య - దీపముల్ వెలుగ
నిలువుటద్దమ్ముల - నెలత చెక్కించె
వెయ్యి దీపమ్ములు - వెలుగంగ నందు
గవుసెనల్ దీయించె - గాజుకంబముల
బంగారు తరికోళ్ల - పట్టెమంచమ్ము
అంగన వెలయించి - యమరించె సజ్జ
సన్నవిరిమల్లెలు - జాజిమల్లెలును
బొందు మల్లెలు చాల - నిండ బరవించి"

(సు.క.పు. 50)

తిమ్మక్క శయ్యాగృహాన్ని వర్ణించిన తరువాత శయ్యాగృహంలో ఉంచే తినుబండారాలను వర్ణించింది.

**చాలపప్పు గసగ - సా లానవాలు**
**శ్రీసుగంధమ్ములు - చిటిబెల్లములును**
**చెఱకు బిళ్లలు మంచి - చిఱుదిండి సరకు**
**పసిడిమామిడిపండ్ల - రసములు పిసికి**
**పసిపచ్చ గిన్నెల - పాలు నే నినిచి**
**పలువన్నె గిండ్లతో - పన్నీరు నించి**
**బంగారు చెంబుల - పానక మునిచి**
**బుంగల దింపించి - గంగోదకములు**

(సు.క.పు. 51)

పండరసాలు, పానకం, చిటిబెల్లం మొదలైన వస్తువులను వర్ణించింది తిమ్మక్క.

**4.4.1.11 తాంబూల వర్ణన :**

తిమ్మక్క తాంబూలాన్ని పలుచోట్ల వర్ణించింది. ఈ కావ్యంలో సుభద్ర కపట యతిగా వచ్చినది అర్జునుడే అని గ్రహించి అలంకరించుకొని చివరగా తాంబూలం వేసుకుంటుంది. ఆ సందర్భంలో-

**"పచ్చి పోకలతోడ - పండుటాకులతొ**
**గమ్మక కపుర వీ - డెమ్ము గావించె"**

(సు.క.పు. 28)

ఈ సందర్భంలో సుభద్ర ఎన్ని అలంకరణలు చేసుకొన్నా తాంబూలం వేసుకొంటే గానీ ఆమె అలంకరణ పరిపూర్ణం కాలేదు.

ఇంద్రప్రస్థంలో సుభద్ర శోభనం గదిలోకి వెళ్ళే ముందు కూడా తిమ్మక్క తాంబూలాన్ని వర్ణించింది.

**పచ్చివౌ పోకల - పండుటాకులను**
**వెచ్చగా కప్పుర - వీడెమ్ము జేసె**

(సు.క.పు. 52)

**4.4.2 నాటకంలో వర్ణనలు**

**4.4.2.1 అర్జునుడి వర్ణన :**

వృద్ధ తాపసుడు మధ్యాహ్న సమయంలో ప్రభాసతీర్థానికి వెళ్ళుతూ వుండగా అక్కడ అర్జునుడిని చూసి వర్ణిస్తాడు.

**పాదౌ చక్రప్రతికృత శుభావస్య మూర్ధా కిరీటీ**
**నేత్రే మాత్రాభ్యధిక మరుణే ద్రాఘిమాణం దధాతే ।**
**లోహస్థేయాను పచిత కిణశ్చాపమౌర్వ్వీ విమర్దైః**
**పూర్వాబన్ధస్తదయమపరో వాసుభద్రావతారః**

(సు.ధ.పు. 76)

పాదపద్మాలలో శుభాన్ని చేకూర్చే చక్రరేఖలు ప్రకాశిస్తున్నాయి. చక్కగా ఉన్న కిరీటంతో శిరస్సు ప్రకాశిస్తున్నది. విశాలంగా ఉన్న రెండు కళ్ళు ఎర్రగా రక్తవర్ణంలో ప్రకాశిస్తున్నాయి. విల్లుపట్టుకోవడం చేత ఆ ఘర్షణకు కాయలు కాచిన ముంచేతులు లోహంలా గట్టిగా ఉన్నాయి. అలాంటి ఇతడు శ్రీకృష్ణుడికి సమానమైన అవతార పురుషుడు. వర్ణన ద్వారా అర్జునుడి వీరత్వాన్ని తెలియజేసి వీరరసాన్ని పోషించాడు నాటక రచయిత.

**4.4.2.2 ఆశ్రమ ప్రాంగణ వర్ణన :**

అర్జునుడు ప్రభాస తీర్థంలో గల ఆశ్రమాన్ని వర్ణించిన సందర్భం ఇది.

**శిఖిని శలభో జ్వాలాచక్రైర్న విక్రియతె పతన్**
**పిబతి బహుశః శార్దూలీనాం స్తనం మృగశాబకః ।**
**స్పృశతి కలభః సైంహీం దంష్ట్రాం మృణాలధియా ముహు**
**ర్నయతి నకులం నిద్రాతంద్రీం లిహన్నహి పోతకః ॥**

(సు.ధ.పు. 77)

అగ్నిలో పడి ఆ అగ్ని కీలలు తన చుట్టూ ఆవరించి ఉన్నప్పటికీ ఎక్కడి నుండి పారిపోవడానికి ప్రయత్నించవు మిడతలు. ఆడపులులు లేడి పిల్లలకు అనేక పర్యాయాలు తమ పాలను తాగిస్తున్నాయి. సింహాల కోరలను తామర తూడులనే భ్రమతో తాకుతున్న ఏనుగు పిల్లలు. ఆకలితో ఉన్న ముంగిసలను నాకుతున్న పాము పిల్లలు ఆశ్రమ ప్రాంతంలో ఉన్నాయి.

ఆశ్రమంలో తాపసులు చేసే తపస్సు ప్రభావం వలన జంతువులు జాతివైరాన్ని మర్చిపోయి ప్రవర్తిస్తున్నాయి. అర్జునుడు తీర్థయాత్రా సమయంలో ఆశ్రమ ప్రాంతాన్ని చూసి అప్పటి వరకు తన అన్నతమ్ములను, బంధు జనాన్ని విడిచి పట్టినందువలన కలిగిన బాధనుండి ఉపశమనం పొంది మార్గమధ్యంలో కలిగిన అలసటను తీర్చుకుంటాడు. ఇక్కడ ఆశ్రమ ప్రాంతాన్ని వర్ణించడం వల్ల శాంత రసం అభివ్యక్తమయింది.

**4.4.2.3 సుభద్ర వర్ణన :**

సుభద్రను రాక్షసుడు అపహరించుకొని పోతూవుండగా అర్జునుడు ఆమెను రక్షిస్తాడు. సుభద్ర అదృశ్యమైనప్పుడు విదూషకుడు సుభద్ర సౌందర్యం వివరించమని కోరగా అర్జునుడు సుభద్రను వర్ణించిన సందర్భం ఇది –

> **"సౌన్దర్యం సుకుమారతా మధురతా కాన్తిర్మనోహారితా**
> **శ్రీమత్తా మహిమేతి సర్గవిభవాన్ నిశ్శేషనారీగుణాన్ ।**
> **ఏతస్యాముపయుజ్య దుర్విధతయాదీనః పరామాత్మభూః**
> **వాస్రష్టుం చేత్ కరోతు పునశ్చప్రభృతివ భిక్షాటనమ్ ॥"**

(సు.ధ.పు. 81)

మాధుర్యం, చక్కటి రంగు, గొప్పదనం, కోమలత్వం, ఆకర్షణశక్తి, అందం, లాలిత్యం, చక్కటి లక్ష్మీకళ ఉన్న వర్చస్సు మొదలైన సకల సృష్టికి అనుకూలమైన స్త్రీ గుణాలన్నింటిని పూర్తిగా తెచ్చి ఒక చోట పోసి సుభద్రను తయారు చేయడానికి ఖర్చు చేశాడు బ్రహ్మ. వేరొక స్త్రీని తయారు చేయాలంటే కావాల్సిన గుణాలను బ్రహ్మ దగ్గర లేవు. ఆ బ్రహ్మ ఈమె దగ్గరకు వచ్చి "దేహి భిక్షాః భవతి" అని యాచించక తప్పదు అని వర్ణించాడు అర్జునుడు.

అర్జునుడు రాక్షసుని బారినుండి తన చేత రక్షింపబడిన స్త్రీని ఇంత మనోహరంగా వర్ణించడం చేత అర్జునుడి మనస్సులో సుభద్ర రూపం చిత్రింపబడి మన్మథుడు అర్జునుడిని ప్రేరేపించడానికి అవకాశం దొరికింది. సుభద్ర రూపాన్ని వర్ణించడంవల్ల అర్జునుడికి రతి కలిగింది. తద్వారా శృంగార రసం అభివ్యక్తమైంది.

**4.4.2.4 సూర్యాస్తమయ వర్ణన :**

అర్జునుడు సుభద్రను వివాహం చేసుకోవడానికి ద్వారకాపురికి వెళ్ళే సమయంలో బలరామాదుల కళ్ళు కప్పడానికి సన్యాసి వేషం –

> **అపరగిరి నిషణ్ణం వాసరం వాసరశ్రీ**
> **రభిమతమభిసర్తుం ప్రాణనాథం ప్రదోషే ।**
> **స్వతను మతనురాగా సంవృణోతీవ సాక్షా**
> **దసిత జలదనీలే నాన్ధకారాంశుకేన ॥**

(సు.ధ.పు. 84)

సూర్యుని భార్య పగటి కాంత. పగటి కాంతయైన వెలుతురు అనురాగంలో తేలి సాయంకాల సమయం ఆసన్నమవగా, పడమటి కొండెక్కి ఉన్న తన ప్రియుని, ప్రాణనాధుడైన సూర్యుడిని అభిసారకాంతలా ఇష్టంగా కౌగిలించుకోవడానికి మేఘం అనే నల్లని వస్త్రాన్ని కప్పుకొని వెళ్తోందా అన్నట్లు చీకటి (రాత్రి కాంత) అలుముకున్నది.

**4.4.2.5 వసంత ఋతువు వర్ణన :**

అర్జునుడికి నివాసంగా సుభద్ర అంతఃపురాన్ని నియోగించిన పిదప ధనంజయుడు ప్రమదావనాన్ని ప్రవేశించి వసంత ఋతువును వర్ణించిన సందర్భంలోనిది.

> **"విశ్లిష్య ద్దలమాలయా ప్రవిరలైః పృధ్వీరుహామాసవై**
> **రన్త ర్భద్ధకలఙ్కయా కలికయా ప్రస్తూయతే మంజరీ ।**
> **గాయన్తో గలరాగ మంకురసైశ్చూతస్య చంచుక్షతే**
> **శ్చ్యేతద్భిః శిశిరోపరోధశిథిలం పుష్ణన్తి పుంస్కోకిలాః ॥"**
> (సు.ధ.పు. 88)

వసంత ఋతువు రావడం చేత మొక్కలు ఆకుల దండలను విడిచిపెట్టి అప్పుడప్పుడు కొంచెం కొంచెం తేనెను తయారు చేసుకుంటున్న మొగ్గలు అందంగా ఉన్నాయి. చిగుళ్ళతో కనిపించే ఈ చెట్లలో మగ కోకిలలు తమ ముక్కులతో మామిడి రసాలు తాగుతూ వేడుకతో పాటలు పాడుతున్నాయి.

వసంత ఋతువు శృంగార రసానికి ప్రతీక. అర్జునుడి నివాసంగా సుభద్ర అంతఃపురాన్ని కేటాయించడం. వసంత ఋతువుని వర్ణించడం వలన సుభద్రార్జునులకు గల అనురాగం వారి విప్రలంభ శృంగారాన్ని సూచన ప్రాయంగా తెలియజేసింది ఈ వసంత ఋతువు వర్ణన.

**4.4.2.6 ఉద్యానవన వర్ణన :**

బలరామకృష్ణులు అర్జునుడు ఉండే ఉద్యానవనాన్ని సమీపించి దానిని బలరాముడు వర్ణించిన సందర్భంలోనిది –

> **"సాన్ద్రైః కృతాన్య లికులాని హిరణ్మయాని**
> **హేమ ప్రసూనమకరన్ద రజోవితానైః ।**

**ఆనీయతే పరిణతోऽపి మహీరుహాణాం**

**ఛాయాభిరాభిరతిశైశవ మాతపోऽయమ్ ॥"**

(సు.ధ.పు. 86)

అతి సామాన్యమైన తపస్సు చేకూర్చిన కాంతి మూలంగా ఈ వనమంతా బంగారు మయంగా పరిణమించింది. బంగారుమయమైన వనంలో దట్టమైన బంగారు పుష్ప సమూహంలోని పుప్పొడిని, తేనెను స్వీకరించడానికి వచ్చి ఈ వనంలోని చెట్ల నీడలందు తుమ్మెదల సమూహం తిరుగుతుంటాయి.. తపస్సుల ప్రభావం వల్ల వనమంతా బంగారుమయమై పోయింది. ఇటువంటి తపస్సుల ఆశ్రమంలో ఉన్న అర్జునుడు ఎంతో గొప్పవాడో తెలుసుకోవడానికి కవి బలరాముడి చేత ఈ వర్ణన చేయించాడు.

**4.4.2.7 సూర్యుడి తీవ్రత వర్ణన:**

రాక్షసుడి బారి నుండి రక్షింపబడిన స్త్రీయే సుభద్ర అని అర్జునుడు చెప్పడం వలన తెలుసుకొన్న విదూషకుడు మధ్యాహ్న సమయం ఆసన్నమైంది. స్నానం చేద్దామన్నప్పుడు ధనంజయుడు సూర్యుడి ప్రచండ ప్రభావాన్ని వర్ణించిన సందర్భంలోనిది.

**"వాప్యామాప్యాయి తాస్యః కమలమధు జలైర్జాలపాదో విషీద**

**న్నార్ద్రీకృత్యోపయుంక్తే రవికిరణపరిక్లిష్టమిష్టం మృణాలమ్ ।**

**వీజన్ విక్షేపవత్యా సుఖయతి దయితాం వామయా చక్రవాక-**

**శ్ఛత్రీకృత్య ప్రయచ్ఛన్ ప్రణయపరవశో దక్షిణాం పక్షపాలీమ్ ॥"**

(సు.క.పు. 96)

సూర్యతాపాన్ని భరించలేక పక్షి దిగుడుబావి నీటిలోకి ముఖాన్ని ముంచింది. హంస తనకిష్టమైన తామరకాడను ఎండిపోకుండా నీటితో తడుపుతోంది. చక్రవాకం తన ప్రియురాలికి ఎండతగలకుండా తన రెక్కలను గొడుగులా పడుతోంది. సూర్యుడి తీవ్రతకు పక్షులు ఏ విధమైన చర్యలు తీసుకున్నాయో కవి ఈ శ్లోకంలో వర్ణించాడు.

**4.4.2.8 సుభద్ర అలంకరణ వర్ణన :**

సుభద్రార్జునుల వివాహ సమయంలో సుభద్రను అప్సరసలు అలంకరించిన విధానం వర్ణించిన సందర్భంలోనిది.

**"మాణిక్యోన్మిషితాం బధాన జఘనే త్వం మేనకే ! మేఖలాం**
**కేశాన్ మిశ్రయమిశ్రకేశి! కుటిలాన్ మన్దార మాలాగుణైః**
**రంభే ! లమ్భయ పత్రభంగ రచనామస్యాః కపోలస్థలీ**
**ముర్వీమూర్వశి! కల్పయ స్తనతటీ మాముక్త ముక్తావలీమ్"**

(సు.ధ.పు. 108)

మేనకా ! నువ్వు మాణిక్యాలు పొదిగిన వడ్డాణాన్ని సుభద్ర నడుముకి అలంకరించు. మిశ్రకేశా! నువ్వు వంకరగా ఉన్న కేశాలను మందార మాలను జోడించి అల్లు. ఓ రంభా ! నువ్వు కపోలములపై పత్రభంగ రచన చెయ్యి. ఊర్వశీ ! నువ్వు ఆమె వక్షంపై ముత్యాల హారాన్ని అలంకరించు.

సుభద్ర అలంకరణ ఉద్దీపన విభావము. నాయకుడి రతిని ఉద్దేపింపచేసేదిగా సుభద్ర అలంకరణ ఉంది. ఈ వర్ణన శృంగార రసాన్ని నాయకుడిలో కలిగించింది.

సుభద్రార్జునుల వివాహానికి దేవతలు తమ సమ్మతిని తెలియజేసి వధూవరులను దీవించారని ఈ వర్ణన వల్ల తెలుస్తోంది.

### 4.4.2.9 సుభద్ర సారథ్యం వర్ణన :

సుభద్రార్జునుల వివాహానంతరం సుభద్రను అర్జునుడు ఇంద్రప్రస్థానికి తీసుకువెళ్ళుతూ వుండగా యాదవ వీరులు అడ్డగించినప్పుడు అర్జునుడు యాదవ వీరులతో యుద్ధం చేసే సమయంలో సుభద్ర రథాన్ని నడుపుతుంది. సుభద్ర సారథ్య శిక్షాకౌశలాన్ని అర్జునుడు మెచ్చుకుంటూ ఈ విధంగా వర్ణిస్తాడు.

**"లక్ష్యః క్షేపః ఖురాణాః న వియతి న భువి వ్యాయతాన్ నూనమఙ్ఘ్రీ**
**నశ్వా నావక్షిపన్తి క్షపితవిచలితా నాప్యమూనుత్ క్షిపన్తి ।**
**యావత్ సమ్పర్కమేతా విదధతి పతితైశ్చాక్షుషైర్నః కరాగ్రై**
**స్తావద్ దూరాపయాతా నఖలు తరులతా బుద్ధిముత్పాదయన్తి॥"**

(సు.ధ.పు. 115)

ఈ అశ్వాలు తమ కాలిగిట్టలను భూమి మీద ఉంచడం లేదు. ఆకాశంలో కూడ ఉంచడం లేదు. కాళ్ళను పొడవుగా చాపి దూకుతున్నాయి. ఈ చెట్లు తీగలు కంటికి చేరువైనంతలోనే దూరమైపోతున్నాయని గుర్రాల వేగాన్ని కవి వర్ణించాడు.

కేవలం సుభద్ర అంతఃపుర కాంతే కాదు ఆమెకు రథసారధ్యం కూడ తెలుసునని ఈ వర్ణన తెలియజేస్తోంది.

**4.4.2.10 పట్టణ అలంకరణ వర్ణన :**

సుభద్రార్జునులు వివాహం చేసుకొని శ్రీకృష్ణుడితో సహా ఇంద్రప్రస్థానికి వస్తున్నారని తెలిసి యుధిష్ఠరుడు పట్టణాన్ని అలంకరించినప్పుడు వర్ణించిన వర్ణన ఇది.

> **"కార్యా పిష్టాతకౌఘైః పిహితరవికరై ర్ధూసరా వాసరశ్రీ**
> **ర్ధూపైర్ధూమ్రీక్రియన్తాం బహలపరిమలైర్దూరమాశాముఖాని ।**
> **ఉచ్చైస్తుచ్ఛీకురుధ్వం ధ్వజపటపటలైః పావనం మార్గమేతాః**
> **పూర్యన్తాం పుష్పపూరైర్మధుకరశబలైః సర్వతో రాజవీథ్యః॥"**

(సు.ధ.పు. 120)

ఉదయాన్నే సూర్యకిరణాల సూర్యకాంతులతో పాటుగా రంగురంగుల ముగ్గులతో రాజవీధులను అలంకరించాలి. మంచి పరిమళాన్ని నలుదిక్కులా వెదజల్లే ధూపాలు ఏర్పాటు చెయ్యాలి. వీధులన్నింటిలో ఉన్నతములైన జండాలు ఎగిరేటట్లు చెయ్యాలి. తుమ్మెదలు మూగిన పూలన్నింటితో వీధులన్నింటిని నింపెయ్యమని ధర్మరాజు తన పరివారంతో చెబుతాడు.

**ముగింపు :**

నాటకంలో అలంబసుడు, గాత్రిక కల్పనలు ఉంటే కావ్యంలో చిలుక కల్పన ఉంది. కావ్యంలో కన్నా నాటకంలో అర్జునుడి పాత్ర ఉదాత్తంగా పోషింపబడింది. నాటకంలో కంటే కావ్యంలో సుభద్ర తెలివైనది, చాకచక్యం కలది. కావ్య నాటకాలు రెండింటిలోనూ శ్రీకృష్ణుడు సుభద్రార్జునుల వివాహం జరగడానికి ముఖ్య కారకుడు. కావ్యంలో రుక్మిణి సుభద్రార్జునుల వివాహానికి తోడ్పడి సుభద్ర అత్తవారింట ఏ విధంగా మెలగాలో సలహా ఇస్తుంది. నాటకంలో రుక్మిణి పాత్రలేదు. కావ్యంలో ద్రౌపది సుభద్రతో తన భర్తను పంచుకుంటున్నందుకు బాధపడుతుంది. నాటకంలో ద్రౌపది సుభద్ర క్షేమాన్ని కోరుకుంటుంది. నాటకంలో విదూషకుడు అర్జునుడికి చేదోడువాదోడుగా ఉండి అవసరమైన సమయంలో తగిన సలహాలు ఇస్తాడు. విదూషకుడి లాంటి పాత్ర కావ్యంలో లేదు. కావ్యనాటకాలు రెండింటిలోనూ అభిలాష విప్రలంభం, సంభోగ శృంగారాలు ఉంటే నాటకంలో విరహ విప్రలంభం కూడ పోషింపబడింది. శృంగార, హాస్య, రౌద్ర, వీర, భక్తి రసాలు కావ్యనాటకాలు రెండింటిలోనూ ఉన్నాయి. వత్సల రసం కావ్యంలోనే ఉంది. కరుణ, అద్భుత రసాలు నాటకంలోనే ఉన్నాయి.

5వ అధ్యాయం

# ఛత్రపతి సామ్రాజ్యమ్ - శ్రీ శివభారతము నాటక కావ్యాల పరిశీలన

5వ అధ్యాయం

# ఛత్రపతి సామ్రాజ్యమ్ - శ్రీ శివభారతము నాటక కావ్యాల పరిశీలన

## 5.0 కవి పరిచయం :

### గడియారం వేంకట శేషశాస్త్రి :

శ్రీ శివభారతం కృతికర్త గడియారం వేంకట శేషశాస్త్రి. ఈయన 15-2-1901వ తేదీన కడపజిల్లా జమ్మలమడుగు తాలూకా నెమళ్ళదిన్నె గ్రామంలో జన్మించారు. (మధునాపంతుల వారి 'ఆంధ్ర రచయితలు' అనే గ్రంథంలో వీరు 3-4-1897న జన్మించారని ఉంది) వీరి తల్లిదండ్రులు నరసమాంబ, రామయ్యలు. ప్రొద్దుటూరు శ్రీరూపావతారం శేషశాస్త్రుల సన్నిధిలో కావ్యనాటకాలంకార సాహిత్యం, తర్కవ్యాకరణ శాస్త్రనైపుణ్యం సంపాదించారు. తరువాత షడ్దర్శనం వాసుదేహవధానుల్ని సేవించి యజుస్సంహితామూలం, యజురారణ్యకోపనిషత్తులతో సప్రయోగ స్మార్త మంత్రపాఠాన్ని అధ్యయనం చేశారు.

ప్రొద్దుటూరులో కన్యకా పరమేశ్వరి పాఠశాలలో సంస్కృత అధ్యాపకులుగా (1930-32) పని చేశారు. వయోజన విద్యాకేంద్రంలోనూ, మునిసిపల్ హైస్కూలులోనూ తెలుగు పండితులుగా (1932-57) పనిచేశారు. 1959 నుండి 1968 దాకా శాసనమండలి సభ్యులుగా ఉన్నారు. 'బ్రహ్మానందినీ' పత్రికకు కొంతకాలం సహాయ సంపాదకులుగా పనిచేశారు. అనేక పరిషత్తులలో సత్కారాలు పొందారు. శ్రీ దుర్భాక రాజశేఖర శతావధానితో కలసి అష్టావధాన, ద్విగుణిత అష్టావధాన, శతావధానాలు చేశారు. వీరిరువురు కలిసి చెప్పిన పద్యాలు "అవధానసారము" అనే పేరుతో ప్రచురితమయ్యాయి. ఉయ్యాలవాడలో ఈయనకు 'అవధాని పంచానన' అనే బిరుదును ఇచ్చారు.

అభినవ తిక్కన, మహాకవి, కవిసింహ, కవివతంస, సాహిత్య భాస్కర, శతావధాని మొదలైన బిరుదులు లభించాయి. అవధాన సారము, శివభారతము (1943), శ్రీ రఘునాధీయము (1973), దాసబోధ, పుష్పబాణ విలాసము, వీరమతి, కీచకవధ, గోవర్ధన సప్తశతి, దుర్గామాతృ సందేశము, దుర్గాస్తోత్రము, అనర్ఘరాఘవము (నాటకము), కిరాతార్జునీయము, కంకంటి తిక్కనల ఉత్తర రామాయణ కావ్యసృష్టి, మల్లికా మారుతము, మురారి, వాల్మీకి చరిత్ర, వాస్తు జంత్రి, శరన్నవరాత్రి పద్యావళి శ్రీనాథ కవితా సామ్రాజ్యము, సీతాపహరణము, శ్రీకృష్ణదేవరాయ చరిత్రము మొదలైనవి వీరి రచనలు.

గడియారం వారి కృతులలో శివభారతం మహాకావ్యం. దీనిలో ఎనిమిది ఆశ్వాసాలున్నాయి. సుమారు 2500 పద్యాలున్నాయి.

**మూలశంకర మాణిక్‌లాల్**

భారతదేశంలో అత్యంత మేధావులకు, దేశోద్ధారకులకు నిలయమైన గుజరాత్‌లో నడియాద నగరంలో అతిలక్ష్మి, మాణిక్‌లాల్ దంపతులకు క్రీ.శ. 1886 జనవరి 31న మూలశంకర మాణిక్‌లాల్ యాజ్ఞిక్ జన్మించారు. వీరి విద్యాభ్యాసం నడియాద నగరంలో సాగింది. ప్రసిద్ధ బడౌదా కాలేజీలో ఉన్నత విద్యను అభ్యసించారు. 1907లో డిగ్రీ పట్టా పొందారు. ఈయన ప్రజ్ఞాపాటవాల్ని చూసి బరోడా మహారాజు సయాజీరావు తన రాజ్యంలోని శిక్షావిభాగంలో కొలువిచ్చారు. 1915లో కొత్తగా ప్రారంభించిన శాసకీయ పాఠశాలలో మొట్టమొదటి ప్రధానాచార్యులుగా పనిచేశారు. మూలశంకర్ గారు 1926-1931 మధ్య ఐదు సంవత్సరాల కాలంలో లఘుకళాఖండాలైన మూడు సంస్కృత నాటకాలను రచించారు. 1. సంయోగితా స్వయంవరం (1928) 2. ఛత్రపతి సామ్రాజ్యమ్ (1929), 3. ప్రతాప విజయం (1931) ఈ మూడు నాటకాల రచనలతో వీరు కళాజయిా అనే బిరుదుతో ఎనలేని యశస్సు పొందారు. (1) సత్యధర్మ ప్రకాశం (1912), (2) శృతి-స్మృతీ వచనాలకు టీకాలు రచించారు. ప్రాశ్చవిద్యా మందిరం బడోదరా సయాజీరావు వచనమాలా శ్రేణిలో వీరు "తులనాత్మక విచారణ" మరియు 'ప్రాచీన-శాసన పద్ధతి' అనే రెండు గ్రంథాలను రచించారు. సూర్యవంశ, రాజుల వంశ చరిత్ర, చంద్రవంశ రాజుల చరిత్ర, జంభూద్వీప, సప్త ద్వీప నక్షలు (1930), మానచిత్రాలు వంటి గ్రంథాలను రాశారు. నైషధ చరితం, మహాత్మాగాంధి చరిత్ర రచించారు. గీతకావ్యం, మేవాడ్ ప్రతిష్ఠా, నరసింహ నినాదం మరియు హర్ష దిగ్విజయ నాటకం మొదలైనవెన్నో నాటకాలకు రూపకల్పన చేశారు.

సంస్కృత భాషలో పండిత గోపాలాచార్య ఉద్గేకర్ గారితో కలసి విష్ణుపురాణ కథలను (1917) సరళ గద్యలలో రచించారు. పండిత బదరీనాథ్‌శాస్త్రి గారితో కలసి తర్కపంచానన, సప్తర్షి దృష్టి వేద సర్వస్వం అనే భాష్య గ్రంథాల్ని రచించారు. వీరి గ్రంథ శీర్షికలను బట్టి వీరు వేదవేదాంగ పారంగతులనీ, సకలశాస్త్రాలు, సాహిత్య సరస్వతాలు తెలిసినవారనీ, సకల శాస్త్రాలు, సాహిత్య సరస్వతాలు తెలిసిన వారనీ, సంగీత, అర్ధ, ఆయుర్వేద గ్రంథాలన్నింటిని ఔపోసనపట్టారని అవగతమౌతున్నది. వీరి సంస్కృత నాటకాలలో సృజనాత్మకతకు వారణాసి విద్వత్‌మండలి వారు సాహిత్యమణి అనే బిరుదు ప్రదానం చేశారు. ఎస్.ఎన్.డి.టి. బాలికల కళాశాలలో సంస్కృత

సాహిత్యం బోధిస్తూ నడియాద నగరంలో శేష జీవితాన్ని సార్థకం చేసికొంటూ 1965 నవంబర్ 13న ఈశ్వర సాయుజ్యం పొందారు.

**5.1.0 ఇతివృత్త పరిచయం :**

అహ్మద్ నగరాన్ని పాలించే నిజామ్ రాజ్యంలో లుకజీ సుల్తాన్‌గా, ఇతని అల్లుడు షాజీ దండనాథుడుగా ఉంటారు. షాజీ, జిజియాలకు మొదటి సంతానం శంభాజి. నిజామ్ రాజ్యంలో ప్రధానుడైన మాలిక్ అంబర్ మరణించడంతో మొఘలు నిజామ్ కొలువులో వారికి లాభాలు చూపి తమవైపు తిప్పుకోవాలని ప్రయత్నాలు చేస్తారు. ఈ పరిస్థితులలో మొఘలులకి వ్యతిరేకంగా ఎదురు నిలబడలేమని మొఘలుల పక్షం వహించడం మంచిదని లుకజీ నిర్ణయించుకొని అల్లుడిని కూడ తనతో రమ్మంటాడు. కానీ షాజీకి మొఘలుల పక్షం వహించడం ఇష్టంలేదు. షాజీ అహ్మద్‌నగరంలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవుటచే అహ్మద్ నగరాన్ని విడిచివచ్చేస్తాడు.

షాజీ శ్రీనివాసరావును కలిసి దాదోజీ ఖాండదేవుడి దగ్గరకి గర్భవతిగా ఉన్న జీజియ చేర్చమంటాడు. లుకజీ అల్లుడు తనకు అనుకూలంగా లేడని నానా దుర్భాషలాడతాడు. జీజియ తండ్రికి తగిన విధంగా సమాధానం చెపుతుంది. లుకజీ తన తప్పును తెలుసుకుంటాడు. జీజియ దాదోజితో శివనేరు చేరుతుంది. శివనేరులో శివాజీ జన్మిస్తాడు. లుకజీని నిజామ్ హత్య చేయిస్తాడు. షాజీ ప్రతీకారం తీర్చుకోవాలని సైన్య సహకారం కోసం బాజీమోహితే చెల్లెల్ని పెళ్లి చేసుకొని సైన్యాన్ని సమకూర్చుకుంటాడు. బీజాపూర్ రాజ్యంలో కొన్ని దుర్గాల్ని ఆక్రమించుకుంటాడు. మాలిక్ అంబర్ మరణించడం కొడుకు ఫతేఖాన్ అసమర్థుడు కావడం వల్ల మొఘలులు మళ్ళీ విజృంభిస్తారు. జీజియ ఉన్న శివనేరుకోటను మొఘలుల సైన్యం చుట్టుముడతారు. జీజియ శివాజీని కాపాడుకుంటుంది.

బీజాపూర్ మంత్రి మురారిపంత్ షాజీని ప్రోత్సహించి పాదుషాకి వ్యతిరేకంగా పోరాటం చేయమంటాడు. హోరాహోరీగా పోరుసాగిన పిమ్మట ఇరువురికి సంధి కుదురుతుంది. సంధి ప్రకారం మహారాష్ట్ర ప్రాంతాన్ని నిజామ్, షాజీలు ఇద్దరూ పరిపాలిస్తారు. వీరు గోవులను హింసించేవారు, స్త్రీలను చెరబట్టేవారు, హైందవ మతాన్ని అణగదొక్కేవారు. ఇదే సమయంలో శివాజీ పెద్దవాడౌతుంటాడు. జీజియ శివాజీకి రామాయణ, భారత, భాగవత కథల్ని చెప్పేది. వీర పురుషుల జీవిత చరిత్రను నూరిపోసేది. ఒక రోజు జీజియ కన్నీరు పెట్టుకొని షాజీ నిజామ్‌ను ఆశ్రయించడంవల్ల తాను ఎన్నో కష్టాలు పడ్డానని తెలియజేస్తుంది. శివాజీ తల్లిని ఊరడించి హైందవాన్ని ఉద్ధరిస్తానంటాడు.

షాజీ శివాజీకి కూడా నిజామ్ కొలువులో ఉద్యోగం ఇప్పించాలనే ఉద్దేశ్యంతో శివాజీని, దాదోజీని, జీజియాని పూనా నగరానికి రప్పిస్తాడు. పూనా పట్టణంలో శివాజీకి వివాహం జరిపిస్తాడు. శివాజీ తండ్రి కోరిక మీదట నిజామ్ దగ్గరికి వెళ్తాడు. కానీ సముచితరీతిలో సలామ్ చెయ్యడు. శివాజీ భావాలవల్ల తన దగ్గరే ఉంటే శివాజీ ప్రమాదం కలుగవచ్చుని షాజీ శివాజీని అక్కడ నుండి పంపించేస్తాడు.

శివాజీ దాదోజీ దగ్గర విద్యలు, రాజనీతి మొదలైన విషయాల్ని నేర్చుకుంటాడు. శివాజీ మావళీ వీరుల్ని కలుసుకొని వాళ్ళతో సైన్యాన్ని నిర్మించుకుంటాడు. దాదోజి మాత్రం సైన్య సముపార్జన ఎందుకు మీ తండ్రినే అనుసరించు అంటాడు. మహారాష్ట్రులు కూడు, గూడు కోసం దేశం అల్లాడిపోతూవుంటే ఊరికే చూస్తూ కూర్చోవడం తనవల్ల కాదంటాడు శివాజీ. జీజియ కూడా శివాజీ అభిప్రాయాన్నే బలపరిచి దీవిస్తుంది.

దుర్గాలన్నింటిలోకి దుర్భేధ్యమైన తోరణాదుర్గాన్ని శివాజీ స్వాధీన పరచుకుంటాడు. ఈ దుర్గంలోనే శివాజీకి నిధి దొరుకుతుంది. శివాజీ రాజ్యాన్ని విస్తరిస్తూవున్న సమయంలో అతడిని అదుపు చేయమని షాజీ దాదోజీకి ఉత్తరాన్ని రాస్తాడు. కానీ దాదోజీకి అవసానదశ సమీపించి స్వర్గస్థుడౌతాడు. శివాజీ చాకణు, సుపా, సింహగడ్, పురందర కోటలను జయిస్తాడు. కాల్బలాన్ని, తురగ బలాన్ని, ఆయుధ సామాగ్రిని అమర్చుకొంటాడు. శివాజీ తుకారాముడి గురించి విని కానుకలు పంపిస్తాడు. తుకారాముడు ఆ కానుకలు స్వీకరించక సమర్థరామదాస స్వామిని ఆశ్రయించమని చెబుతాడు. శివాజీ సమర్థరామదాసస్వామి దగ్గర తన సందేహాలను నివృత్తి చేసుకొని కర్తవ్య దీక్షకు పూనుకొంటాడు. శివాజీ కళ్యాణ ప్రాంతాన్ని కూడ ఆక్రమిస్తాడు.

శివాజీ పరాక్రమాన్ని, విజయాల్ని బీజాపూర్ నవాబు చూసి షాజీయే శివాజీకి సహాయం చేస్తున్నాడని భావించి షాజీని బంధించమని ఆజ్ఞాపిస్తాడు. శివాజీకి ఈ విషయాన్ని లేఖ ద్వారా తెలియజేసి శివాజీని తన కొలువులో చేరమని లేకపోతే తండ్రికి జీవసమాధి కడతానంటాడు. శివాజీ తండ్రిని విడిపించే మార్గం కోసం మంత్రులతో, తల్లితో, భార్యతో ఆలోచించి చివరికి భవాని దేవిని ప్రార్థిస్తాడు. ఈ విషయాన్ని ఢిల్లీ పాదుషాకి ఉత్తరం ద్వారా తెలియజేసి తండ్రిని విడిపించుకుంటాడు.

శివాజీ హీరదాస, వాడి ప్రాంతాలను ఆక్రమిస్తాడు. ఔరంగజేబు బీజాపూర్ దండయాత్ర చేస్తాడు. శివాజీపైకి దాడి చేయబోతుండగా తండ్రి మరణించాడని వార్త విని రాజ్యాన్ని సంపాదించుకోవాలని ఢిల్లీ వెళ్ళిపోతాడు. శివాజీ ఔరంగజేబు విజయాన్ని ప్రశంసిస్తూ లేఖ రాస్తాడు. అతడికి సహాయంగా గుర్రపు దళాన్ని పంపిస్తాడు.

ఔరంగజేబు దండయాత్రల వలన బీజాపూర్ చాల బలహీనపడింది. పైగా మహారాష్ట్ర నాయకుడైన శివాజీ బీజాపూర్ రాజ్యంలో ప్రధానమైన ప్రాంతాన్ని ఆక్రమిస్తాడు. బీజాపూర్ నవాబైన మహ్మద్ ఆదిల్షా మరణిస్తాడు. అతని కుమారుడైన ఆలీషా చిన్నవాడు. ఆదిల్షా భార్య చాలగట్టిది. శివాజీపై డాడి చెయ్యడానికి ఎవరినైనా పంపాలనుకుంటుంది. అఫ్జల్ఖాన్ లేచి శివాజీని ప్రాణాలతో బంధించి తెస్తానని ప్రగల్భాలు పలుకుతాడు. పదివేల కాల్బలము, ఐదువేల గుర్రపుదళం, నమ్మిన సర్దారులు వెంటరాగా అఫ్జల్ఖాన్ శివాజీపై పోరుకి బయలుదేరతాడు. అఫ్జల్ఖాన్ దారిలో పంటపొలాలను, దేవాలయాలను నాశనం చేసి స్త్రీలను చెరపట్టి, గోమాతలను హింసించి ప్రతాప్గడ్కు చేరతాడు. మంచితనంతో సంధికి పిలిచి శివాజీని బంధించాలని ఖాన్ ఆశపడతాడు. చారుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న శివాజీ ఖాన్కు తను బయపడుతున్నట్టుగా ప్రచారం చేయిస్తాడు. పంతోజీ గోపినాథ్ను తన ప్రతినిధిగా ఖాన్ దగ్గరికి పంపి ప్రతాప్గడ్ కోట క్రింద సైన్యం లేకుండ సంధికి తనను కలుసుకొనే ఏర్పాటు చేయమంటాడు. ఖాన్ శివాజీని నమ్మి శివాజీ పిరికివాడనుకుంటాడు.

శివాజీ ఖాన్ను చంపడానికి శిరస్త్రాణం, కవచం, పులిగోళ్ళు, బాకు, కరవాలంతో ఖాన్ దగ్గరకు వెళ్తాడు. పరస్పరం కౌగిలించుకున్న సందర్భంలో శివాజీ పులిగోళ్ళతో ఖాన్ ఉదరాన్ని చీల్చి చంపుతాడు.

పన్హాళ, జింజి, వసంతగడ్, పావనగడ్, రాంగణ, ఖేల, విశాలగడ్, ఇలా శివాజీ ఒక్కొక్క కోటను శివాజీ ఆక్రమిస్తుండగా సలబత్ఖాన్, అఫ్జల్ఖాన్ కొడుకు ఫజల్ఖాన్ను, ఇంగ్లీషు వర్తకులను కూడ కలుపుకొని పన్హాళ దుర్గాన్ని ముట్టడిస్తాడు. మూడు వైపులా ముట్టడించిన బీజాపుర సైన్యాన్ని చూసి శివాజీ తన మంత్రులందరిని అన్ని చోట్లకి పంపిస్తాడు. శివాజీ పన్హాళ దుర్గంలో ఉండకూడదని బాజీ ప్రభువును తీసుకొని రాంగణాగడ చేరుకోవాలని ప్రయాణమౌతాడు. వెనుక బీజాపూర్ సైనికులు అతనిని అనుసరిస్తారు. బాజీ ప్రభువు శివాజీని వెళ్ళమని హెచ్చరించి బీజాపూర్ సైన్యంతో పోరాడి వీరమరణం పొందుతాడు.

షాజీ తన నిర్భందానికి కారకుడైన బాజీ ఘోరపటుడిని సంహరించమని శివాజీకి ఉత్తరం రాస్తాడు. తండ్రి కోరిక మేరకు శివాజీ అతడిని వధిస్తాడు. శివాజీ పరాక్రమాన్ని తట్టుకోలేక అబిస్థీనియ, పోర్చుగీస్ వారు సంధి చేసుకుంటారు. శివాజికి అన్నింట అనుకూలంగా ఉన్న సమయంలో శివాజీని ఎదిరించడం మంచిది కాదని ఆలీషా నిర్ణయించుకొని శివాజి దగ్గరకి రాయబారంగా షాజీని

పంపిస్తాడు. శివాజీ ఆలీషా సంధికి సమ్మతించి తండ్రి ఆజ్ఞమేరకు రాయగడ్‌ను రాజధానిగా చేసి పరిపాలిస్తాడు.

శివాజీ పైకి దాడి చేయడానికి ఔరంగజేబు మేనమామ స్థయిస్తఖాన్ రంగమహల్‌లో వేచి ఉంటాడు. శివాజి తన సైన్యాన్ని, మొఘల్ సైన్యంతో కలిపి స్థయిస్తఖాన్‌పై దాడి చేసి అతడి చేతివేలిని ఖండిస్తాడు. శివాజీ తను ఆక్రమించిన కోటల్ని రక్షించడానికి కావల్సిన ధనాన్ని పూనాలోని వర్తకుల దగ్గర తీసుకుంటాడు. ఆ సమయంలోనే షాజీ మరణిస్తాడు. మొఘల్ పాదుషా శివాజీ పైకి జయసింగ్‌ను పంపిస్తాడు. ఇరువురి సేనల మధ్య భీకరమైన పోరాటం జరుగుతుంది. శివాజీ ఓటమి తప్పదనుకున్నప్పుడు తెలివిగా రఘునాథ పండితుడిని సంధికి పంపిస్తాడు. జయసింగ్ ఈ విషయాన్ని ఔరంగజేబుకు లేఖ ద్వారా తెలియజేస్తాడు. ఔరంగజేబు షరతులతో సంధికి అంగీకరించి శివాజీని ఆగ్రాకి ఆహ్వానిస్తాడు.

శివాజీ అంగీకరించి ఔరంగజేబు దర్బార్‌కి వెళ్తే శివాజీకి తగిన గౌరవం ఇవ్వడు. శివాజీకి విడిదిగా ఇచ్చిన భవనం చుట్టూ తన సైన్యాన్ని కాపలాగా పెడతాడు. విషయాన్ని గ్రహించిన శివాజీ కొంతకాలం మౌనంగా ఉండి పండ్లబుట్టలలో దూరి తప్పించుకొంటాడు. శివాజీ పారిపోవడానికి జయసింగ్ కారణమని ఔరంగజేబు అతడిని పదవి నుంచి తప్పిస్తాడు. తన కుమారుడైన ముజంను శివాజిపైకి దండెత్తమంటాడు. శివాజీ ముజంతో సంధి చేసుకుంటాడు. శివాజీ తోరణ, కొంకణ, పూనా, నుపా ప్రాంతాలన్నిటిని దక్కించుకుంటాడు. రాజ్యాన్ని విస్తరించి అష్టప్రధానులతో పరిపాలిస్తూ ఉండగా ఇది వరకు సంధిలో కోల్పోయిన సింహగడ్‌ను జయించాలని జీజియ ఆదేశిస్తుంది. జీజియ కోరిక మేరకు శివాజీ, తానాజీని వెళ్లి సింహగడ్‌ను జయించమంటాడు. సింహగడ్ చేతికి వస్తుంది. కానీ తానాజీ ప్రాణాలు పోతాయి.

పట్టాభిషేకం చేసుకోకపోతే ఎంతబలమున్నా, ఎంత రాజ్యం సంపాదించినా, సామంత రాజులను చూసినట్లు కూడ చూడరు సాటి రాజులు అందువల్ల శివాజి పట్టాభిషేకం చేసుకొని రాజు అవ్వాలని మంత్రులు పేర్కొంటారు. శివాజీ పట్టాభిషేక విషయాన్ని తల్లికి, సమర్ధ రామదాస స్వామికి తెలియజేస్తాడు. గాంగభట్టు ఆనందనామ సంవత్సరం జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి బుధవారం పట్టాభిషేకానికి ముహూర్తం పెడతాడు. అనుకున్న ముహూర్తానికి శివాజీ పట్టాభిషిక్తుడై తల్లి, గురువు, బంధువుల ఆశీస్సులు తీసుకుంటాడు.

### 5.1.1 నాటకంలో సంఘటనలు

1. శివాజీ కావ్యంలో యవనులపైనే కత్తికడతాడు. కానీ నాటకంలో వంచనాపరులైన స్వదేశీయులైన క్షత్రియులపైన దాడిచేస్తాడు. శ్యామరాజు అనే క్షత్రియుడు శివాజీ ఖడ్గానికి బలౌతాడు.

2. బాజీ ప్రభువు తన ప్రాణాన్ని రక్షించుకోవడం కోసం వేరొక మతాన్ని స్వీకరించినట్టు, మళ్ళీ అతడు స్వమతాన్ని స్వీకరించాడని రాజమాత సంభాషణ ద్వారా తెలుస్తుంది.

3. నాటకంలో శివాజీకి తోరణాదుర్గ సమీపంలోని జీర్ణ దేవాలయంలో నిధి దొరుకుతుంది. నిధి దొరకగానే కంసాలిని తీసుకువచ్చి నిధి ఎంత విలువైనదో లెక్క కట్టిస్తాడు.

### 5.1.2 నాటకంలో సంఘటనల ఔచిత్యం :

మూలశంర మణిక్‌లాల్ నాటకానికి ఛత్రపతి సామ్రాజ్యం అనే పేరుని పెట్టారు. పేరుకు తగ్గట్టుగానే కేవలం శివాజీ సామ్రాజ్యాన్ని ఏ విధంగా స్థాపించాడో మాత్రమే ఈ నాటకంలో ఉంది. శివాజీ బాల్యం, విద్యాభ్యాసం ఆనాటి మహారాష్ట్ర ప్రజల స్థితిగతులు మొదలైన విషయాలు ఈ నాటకంలో లేవు.

నాటకంలో శివాజీ కేవలం యవనుల దురాగతాల్ని అరికట్టడమే కాదు. స్వతంత్ర సామ్రాజ్యాన్ని స్థాపించడానికి అడ్డుగాఉన్న స్వదేశ రాజులను కూడ శివాజీ సంహరిస్తాడు. యవనులకి సహకరిస్తున్న కుటులుడైన శ్యామరాజు అనే క్షత్రియుడిని కూడ శివాజీ నాటకంలో సంహరించినట్టు ఉంది. స్వతంత్ర సామ్రాజ్యాన్ని స్థాపించడానికి శివాజీ అడ్డుగా ఉన్న ఎవరైనా యవనులైనా, సాటి క్షత్రియులైనా తొలగించడం ఔచిత్యవంతం ఉంది.

నాటకంలో తోరణాదుర్గం సమీపంలోని జీర్ణదేవాలయంలో శివాజీకి నిధి దొరుకుతుంది. శివాజీ ఈ నిధిని సామ్రాజ్యాన్ని విస్తరించడానికి అవసరమైన ఆయుధాలు కొనుగోలు చెయ్యడానికి నిధిని ఉపయోగిస్తాడు. కావ్యంలో సామ్రాజ్యాన్ని విస్తరించడానికి అవసరమైన ధనాన్ని సూరత్‌పై దండయాత్ర చేసి వర్తకుల దగ్గర తీసుకుంటాడు. కానీ నాటకంలో తోరణాదుర్గంలో శివాజీ ప్రయత్నం లేకుండానే నిధి దొరికింది. కోరకనే లభించిన సహాయం భగవదనుగ్రహానికి చిహ్నం. పరదేవతా అనుగ్రహానికి చిహ్నమైన నిధి దొరకడం ఔచిత్యవంతంగా ఉంది. ఈ సంఘటనలు శివాజీ సామ్రాజ్య స్థాపనకు ఉపకరించాయి.

**5.1.3 కావ్యంలో సంఘటనలు**

1. లుకజీ, షాజీల వంశాల విషయాలు.
2. బీజాపూర్‌లో మాలిక్ అంబర్ కాలం చెయ్యడం.
3. లుకజీ, షాజీల మధ్య భేదాభిప్రాయాలు.
4. షాజీ అహ్మద్‌నగర్‌ను విడిచిపెట్టడం.
5. జీజియ లుకజీ మధ్య వాదోపవాదాలు.
6. లుకజీని నిజామ్ హత్య చేయించడం.
7. లుకజీ మరణించడం వల్ల జిజియ బాధపడడం.
8. జీజియ రెండవసారి గర్భవతి అవ్వడం.
9. షాజి రెండవ వివాహం చేసుకోవడం.
10. షాజీ తండ్రి మాలోజీ భవానిదేవి కలలో కన్పించి మీ వంశంలో గొప్ప ఘనుడు పుడతాడని వరం ఇవ్వడం.
11. షాజీ కూడ కలలో ఒక యోగి కన్పించి పండును ప్రసాదించడం. జీజియ, షాజీలు దానిని స్వీకరించడం.
12. దాదాజీ శివాజీ జన్మవృత్తాంతాన్ని షాజీకి తెలియజేయటం.
13. మొఘలులు దాడి చేయగా జీజియ ప్రాణభయంతో చిన్నపిల్లవాడుగా ఉన్న శివాజీని తీసుకొని రక్షణకోసం వివిధ కోటలకు వెళ్ళడం.
14. జీజియ శివాజీకి వీరోచిత పురుషుల గాథలు చెప్పడం.
15. జీజియ శివాజీకి తాను అనుభవించిన బాధల్ని తెలియజేయడం.
16. శివాజీ జీజియాని ఓదార్చి హైందవ మతోద్ధరణకు పాటుపడతానని చెప్పడం.
17. మహారాష్ట్ర స్వభావం, వృత్తులను కవి వర్ణించడం.
18. శివాజీ గోహింసను అరికట్టి గోరక్షణను చేపట్టినందువల్ల జిజియా ఎంతో సంతోషించడం.
19. బీజాపూర్ కొలువులో శివాజీకి ఉద్యోగం ఇప్పించాలని షాజీ శివాజీని పూనా రమ్మనడం.

20. శివాజీ, జీజియ, దాదోజి పూనా వెళ్ళడం.

21. శివాజీ నిజామ్ కొలువులో నిజామ్‌కు ముస్లిం పద్ధతిలో నమస్కరించకపోవడం.

22. శివాజీకి పూనాలో వివాహం చెయ్యడం.

23. రాయబారిగా వచ్చిన షాజీ శివాజీ గొప్పతనాన్ని చూసి జీజియ శివాజీని ఎంతో బాగా పెంచిందని జీజియాని కీర్తిస్తాడు.

24. షాజీ, దాదోజీలు మరణించడం.

25. దుర్గాల్ని రక్షించడానికి శివాజీ సూరత్ వెళ్ళి వర్తకుల దగ్గర ధనాన్ని తీసుకోవడం.

26. ఔరంగజేబు తన కుమారుడైన ముజంను శివాజీపై దాడి చేయమని పంపించడం.

27. పట్టాభిషేక మహోత్సవానికి శివాజీ క్షత్రియుడా? కాదా? అనే చర్చ జరగడం.

28. షాజీకి సహాయంగా యుద్ధానికి వెళ్ళిన శంభాజీ మరణించడం.

29. షాజీ శివాజీతో బాజీఘోరపటుడిని వధించమని చెప్పడం శివాజీ వధించడం.

30. సింహగడ జయించడానికి వెళ్ళేటప్పుడు తానాజీ ప్రతిజ్ఞ చేయడం.

31. శివాజీ అఫ్జల్‌ఖాన్‌ను సంహరించిన తరువాత శివాజీకి జీజియ దిష్టితీసి దేవతా పూజలు చేయడం..

32. శివాజీ విజయం సాధించడానికి సహాయపడిన వారందరికి కానుకలు ఇవ్వడం.

**5.1.4 కావ్యంలో సంఘటనల ఔచిత్యం :**

శ్రీ శివభారతం చారిత్రక ఇతివృత్తం గల కావ్యం. నాయకుడు శివాజీ చారిత్రక పురుషుడు. కావ్యకర్త శాస్త్రిగారు శివాజీ జీవిత చరిత్రకు సంబంధించిన అనేక గ్రంథాలు చదివి శ్రీ శివభారత కావ్యాన్ని రచించారు. చారిత్రక విషయాలను కావ్యంగా మలచేటప్పుడు కావ్య ప్రయోజనానికి ఉపకరించని, కావ్య నాయకుడి వ్యక్తిత్వానికి భంగం కలిగించే విషయాలను శాస్త్రిగారు పరిహరించారని ఎస్. పద్మావతి గారు "శివభారతం పరిశీలన" అనే పరిశోధనా గ్రంథంలో పేర్కొని కొన్ని ఉదాహరణలు చూపారు.

జీజియ తన యౌవనంతో పాటు భర్తృ ప్రేమను కూడ కోల్పోయిందని ఆమె కంటె యౌవనవతి, రూపవతి అయిన తుకాబాయిని షాజీ వివాహం చేసుకొన్నాడని చరిత్రకారులు

తెలియజేశారు. కానీ షాజీ పాత్రకి పుష్టిని చేకూర్చడానికి శాస్త్రిగారు ఈ విషయాన్ని మార్చి షాజీ ద్వితీయ వివాహానికి రాజకీయ ప్రయోజనం, జీజియ అంగీకారాన్ని కూడ చేర్చారు. బాజీమోహితే బలగాన్ని రాజకీయ ప్రయోజనానికి ఉపయోగించుకోవడానికి షాజీ తుకాబాయిని వివాహం చేసుకోమని షాజీ చెలికాడు శ్రీనివాసరావు అభ్యర్థనపై షాజీ రెండవ వివాహం చేసుకోవడానికి అంగీకరించినట్లు శాస్త్రిగారు చిత్రించారు.

శివాజీ హైందవ మతోద్ధరణకు అతడు అవలంభించిన విధానం ఉత్తమంగా లేదని చరిత్రకారులు పేర్కొన్నారు. నీలకంఠరావు మరణానంతరం పిలాజీ, శంకరజీల మధ్య చెలరేగిన కలహానికి మధ్యవర్తిగా శివాజీని ఆహ్వానిస్తే శివాజీ వారినిద్దరిని బంధించి పురందర దుర్గాన్ని హస్తగతం చేసుకున్నాడని చరిత్ర కారులు పేర్కొన్నారు. శాస్త్రిగారు శివాజీ కీర్తికి భంగం వాటిల్లకూడదని శాస్త్రిగారు ఈ విషయాన్ని కావ్యంలో ప్రస్తావించలేదు.

శివాజీ దేశకాల పరిస్థితులకి అనుగుణంగా తన సహచరులను ఆదేశించుటలో నియంతవంటి వాడని చరిత్ర వెల్లడిస్తోంది. అష్టప్రదానులను నియమించినప్పటికీ ముఖ్యమైన నిర్ణయాలు వారిని సంప్రదించకుండానే తీసుకొన్నట్లు కనపడుతోంది. శాస్త్రిగారు "అష్టప్రధాన సైన్యాధీశులాదిగా నుద్యోగులను, వారి యుచిత విధులు" నియోగించెనని శివాజీని ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా శాస్త్రిగారు తీర్చిదిద్దారు.

శివాజీ వ్యక్తిగత సంసారిక జీవితాన్ని శాస్త్రిగారు ఈ కావ్యంలో చిత్రించలేదు. చరిత్రలో శివాజీ ఏడుగురు స్త్రీలను వివాహం చేసుకున్నాడని చరిత్రకారులు పేర్కొన్నారు. శివాజీ ఏడుగురి స్త్రీలను వివాహం చేసుకొన్న విషయం శాస్త్రిగారు ప్రస్తావించలేదు. పేర్కొన్న సయీబాయి పాత్రకు కూడ తృప్తికరంగా పోషించలేదు. దీనికి కారణం శాస్త్రి గారి దృష్టి శివాజీని ధర్మవీర వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించడమేనని శివభారతం పరిశీలనలో పద్మావతిగారు పేర్కొన్నారు.

జీజియ తాను పడిన కష్టాలను శివాజీకి తెలియజేసి శివాజీని ఆదర్శపురుషుడిగా తీర్చిదిద్ది భర్త అయిన షాజీ చేత మనలను పొందింది. జీజియాకి భారతభూమి ఋణపడి ఉందని షాజీ చెప్పడంతో జీజియ పాత్రకి మరింత వన్నె వచ్చింది.

దాదోజీ శివాజీకి తండ్రి లేనిలోటు తెలియకుండ, రాజనీతి విద్యలు చెప్పి తండ్రిని మించిన తనయుడిగా శివాజీని తీర్చిదిద్దాడు. శివాజీ స్వతంత్ర సామ్రాజ్య స్థాపన అనే లక్ష్యాన్ని సాధించడానికి దాదోజీ పాత్ర ఎంతో ఉపకరించింది. శివాజీ అభ్యున్నతికి కొన ఊపిరి వరకు కృషిచేసిన వ్యక్తిగా దాదోజీ పాత్ర చిత్రించబడింది.

షాజీ, శివాజీ, జీజియాల్ని పూనా రమ్మనడం, శివాజీకి తన చేతుల మీదగా వివాహం చెయ్యడం, ఆదిల్షా తరుపున రాయబారిగా శివాజీ దగ్గరికి వెళ్ళి శివాజీని రాయగడ్‌ను రాజధానిగా చేసుకొని పరిపాలించమని చెప్పడం వంటి సంఘటనలు షాజీ వాత్సల్యాన్ని తెలియజేస్తాయి.

లుకజీ మరణానికి షాజీ, జీజియాలు పరితపించడం, దాదోజీ, షాజీలు మరణించినప్పుడు శివాజీ జీజియాలు వ్యధ చెందడం వలన కావ్యం కరుణరసాత్మకంగా సాగింది. శాస్త్రిగారు శివాజీ, షాజీ, జీజియ, దాదోజీల పాత్రలను తీర్చిదిద్దిన తీరు ఔచిత్యంగా ఉంది.

### 5.1.5 కావ్య నాటకాలు రెండింటిలోనూ ఉన్న సంఘటనల తేడాలు

1. నాటకంలో తోరణదుర్గపాలుడు తీర్థయాత్రలకి వెళుతున్న కారణంగా అతడే స్వయంగా వచ్చి తోరణ దుర్గాన్ని శివాజీకి అప్పగించినట్టుంది. కానీ కావ్యంలో గట్టి సంరక్షణ లేని కోటని శివాజీయే వెళ్ళి ఆక్రమించుకుంటాడు.

2. నాటకంలో భవానీ దేవాలయం ఎదురుగా వున్న జీర్ణ దేవాలయంలో నిధి దొరికినట్టు ఉంది. కానీ కావ్యంలో తోరణ దుర్గంలోనే నిధి దొరికింది.

3. నాటకంలో శివాజీయే తనంతట తానే రాయగడను రాజధానిగా చేసుకుని పరిపాలిస్తాడు. కానీ కావ్యంలో రాయబారిగా వచ్చిన షాజీ రాయగడ రాజధానిగా చేసుకొని పరిపాలించమని సలహాయిస్తాడు.

4. నవాబ్ షాజీని నిర్బంధించినప్పుడు షాజీని విడుదల చేయడానికి ఢిల్లి పాదుషాని ఆశ్రయించమని శివాజీకి తానాజీ సలహా ఇచ్చినట్టు నాటకంలో ఉంది. కానీ కావ్యంలో శివాజీకే భవానీ దేవిని ప్రార్థించడం వల్ల ఢిల్లీ పాదుషాకి వర్తమానం పంపి తండ్రిని విడిపించుకోవాలనే ఆలోచన వచ్చింది.

5. శివాజీని పట్టుకోవడానికి అఫ్జల్‌ఖాన్‌నే స్వయంగా వచ్చినట్టు నాటకంలో ఉంది. కానీ కావ్యంలో అదిల్షా చనిపోవడం వల్ల అతని కొడుకు చిన్నవాడు కావడం చేత అదిల్షా భార్య ఎలాగైనా శివాజీని ఎదిరించి ప్రాణాలతో బంధించి తీసుకురాగల వీరులు ఎవరైనా ఉంటే చెప్పమని ప్రకటన చేస్తుంది. అక్కడే ఉన్న అఫ్జల్‌ఖాన్ లేచి శివాజీపై దాడి చేస్తానని బయలుదేరతాడు.

6. నాటకంలో సమర్థ రామదాస స్వామియే శివాజీ ఆస్థానానికి వచ్చినట్టు ఉంది. కానీ కావ్యంలో తుకారాముడి దగ్గర శివాజి సమర్థ రామదాస స్వామి గురించి వింటాడు. వేటకై అరణ్యానికి

వెళ్ళినప్పుడు అక్కడ వృక్షాల ఆకులపై రాసిన శ్లోకాలను చూసి శివాజీ సమర్థ రామదాస స్వామిని కలుసుకుంటాడు.

7. నాటకంలో సింహగడను పొందినప్పటికీ శివాజీకి సంతోషం కలుగలేదని, సింహగడ కోసం వెళ్ళిన తానాజీ ప్రాణాలు పోయాయని ప్రథమ, ద్వితీయ ద్వారపాలకుల సంభాషణ ద్వారా తెలుస్తుంది. కానీ కావ్యంలో జీజియ అభీష్టం మేరకు సింహగడను ఆక్రమించమని శివాజీ, తానాజీని పంపిస్తాడు.

## 5.2 పాత్ర పోషణ

### 5.2.1 శివాజీ :

శివాజీ షాజీ, జీజియాల కొడుకు. మాలోజీ మనవడు. లుకజీ దహోత్రుడు. భోన్సలే వంశం వాడు. మహారాష్ట్రలో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించినవాడు. హైందవ మతాన్ని ఉద్ధరించాడు. శివాజీ ఆదిశంకరాచార్యులు జన్మించిన రోజున పుట్టాడు. శివాజీని శివాంశగా భావిస్తారు. శివాజీ తాతగారికి కలలో భవానిదేవి కనపడి ఈ వంశంలో ఒక ఘనుడు పుడతాడు అతడు స్వతంత్ర రాజ్యాన్ని ప్రతిష్టించి ధర్మాన్ని నిలబెడతాడని చెబుతుంది. శివాజీ ఆ కలను నిజం చేస్తాడు. షాజీకి కూడ కలలో ఒక యోగి కన్పించి ఒక ఫలం ఇస్తాడు. షాజీ, జీజియాలు ఆ పండు స్వీకరిస్తారు. తరువాత శివాజీ జన్మిస్తాడు. శివాజీ కారణజన్ముడు. బృహత్తర కార్యాన్ని సాధించడానికి జన్మించినవాడు.

**కులీనత :**

శివాజీ వంశాన్ని గురించి, తండ్రి తాతల గురించి వివరించే పద్యం ఇది

**పదియు నేడవ శతాబ్దముపుట్టి, యప్పుడ**
**ప్పుడె తప్పటడుగుల నడుచుచుండ,**
**నైజామహమ్మదునగర రాజ్యమున మ**
**హారాష్ట్ర వీరద్వయంబు వెలసె;**
**వారిలో నొకఁడు దేవగిరి యాదవరాజ**
**కులజుండు, పేర లుఖూజి, "సింధు**
**ఖేడు" పరగణాకుఁ గీర్తిత దేశము**
**ఖుండునై, పదివేల గుఱ్ఱములకుఁ**

**బెద్దదొరయౌచు, సులతాను పేర్మిఁగాంచి**
**తన మహాశక్తి రాజ్యతంత్రములు నడిపె;**
**మొగలులు దండురా వెనుముట్టి తఱిమె**
**నల్లునిన్గూడి, నర్మదయవలి కరుగ ॥**

(శ్రీ.శి.భా.పు. 7)

**ఉ॥ ఆ యసమాన వీరమణి కల్లుఁడె రెండవవాఁడు, భోన్సలా**
**ఖ్యాయుత వంశవర్ధనుఁ డఖండ పరాక్రమ ధూర్వహుండు, షా**
**జీ; యపు డాతఁడచ్చట వసించె - నిజామువిభుత్వలక్ష్మికిన్**
**బాయనికోట లట్లు తన బాహువు లొడ్డిన దండనాథుఁడై ॥**

(శ్రీ.శి.భా.పు.8)

17 శతాబ్దంలో నైజామ్ పాలించే అహ్మద్‌నగర రాజ్యంలో మహారాష్ట్ర వీరులు ఇద్దరు ఉన్నారు. వారిలో ఒకడు దేవగిరి యాదవరాజు పేరు లుకజీ. సింధుఖేడు పరగణాకు దేశముఖుడిగా ఉండి పదివేల గుర్రపు రౌతులకు అధికారిగా వున్నాడు. సుల్తాను అనే పేరు సంపాదించి మొఘలుల దండుని తరిమికొట్టాడు. అతనికి అల్లుడే రెండవ వీరుడు భోన్సలే వంశమువాడు షాజీ. అఖండ పరాక్రమం కలవాడు. నిజామ్ రాజ్యానికి దండనాధుడై తన బాహువులతో రాజ్యాన్ని రక్షిస్తున్నాడు. ఈ షాజీ కుమారుడే మన శివాజీ.

**2. ఉజ్జ్వలత :**

స్ఫురద్రూపం కలిగివుండుట. శివాజీ ఉత్తమ కులంలో జన్మించటమే కాదు. చక్కటి రూపం కూడ అతని సొంతం. షాజీ కుమారుడి గురించి దాదోజిని ప్రశ్నించగా దాదోజి -

**ఉ॥ ఏయెదరున్ దపోబలము నెట్లలమున్ సుఖముండె జీజియా**
**బాయి; కుమారుఁడున్నత శివంకరలక్షణ లక్షితుండు; రా**
**జా ! యవిజయ్యతేజమున కాస్పద మామఖమండలంబు ని**
**ధ్యేయమ; యిట్టిమూర్తి గలదే జగమందని నాకుఁదోఁచెదున్ !**

**ఉ॥ మూఁడవకన్ను నెన్నుదుట, ముమ్మెనవాలు కరమ్మునందు, రే**
**ఱేఁడు శిరమ్మునందుఁ జిగిరింపక, నాఁ దనసూయయింటఁ బా**

**రాడినపాపఁడే ! మనగృహమ్మున నేఁ డుదయించెనేమొ ! తే**
**కాడిన వానిచాయ లవి యట్టివి; ధన్యుఁడ వీవు భూవరా !**

(శ్రీ.శి.భా.పు. 32)

శివాజీ ఉన్నతమైన లక్షణాలతో పుట్టాడని, సాక్షాత్తు శివస్వరూపుడని జగత్తులో ఇటువంటి వాడిని నేను ఎక్కడ చూడలేదని ఇతడు పుట్టడం వల్ల నీవు ధన్యుడవయ్యావని దాదోజీ షాజీతో అంటాడు.

**3. ఔదార్యం :**

ఔదార్యం అనగా దానశీలం. శివాజీ వేటకి అడవికి వెళ్ళే మార్గంలో వృక్షాల ఆకులమీద దేశాభిమానం పుట్టించే కొన్ని శ్లోకాలు చూస్తాడు. ఈ శ్లోకాలు రాసిన మహానుభావుణ్ణి దర్శించాలని శివాజీ సమర్థరామదాసస్వామిని కలిసి ఆయన దగ్గర తన సందేహాలు నివృత్తి చేసుకుంటాడు.

**తమయాజ్ఞన్ శిరసావహింపుచు నుదాత్త క్షాత్రధర్మంబు కృ**
**త్యముగాఁ దీర్చెదఁ-బాపపుణ్య విచికిత్సల్ వోవ నాకేల? రా**
**జ్యము నెల్లన్ గురుదక్షిణాత్మకముగా నర్పించితిన్ మీకుఁ, బూ**
**జ్యముగా నేలుఁడు; గైకొనుండు ననుహస్తాలంబ దండంబుగన్**

(శ్రీ.శి.భా.పు. 171)

రామదాసస్వామి చెప్పిన విషయాలు విన్న తరువాత శివాజీ పాపపుణ్యాల శంక పెట్టుకోకుండ రాజ్యాన్ని గురుదక్షిణగా సమర్పిస్తాడు. శివాజీకి రాజ్యం తండ్రి తాతల నుంచి వచ్చినది కాదు. స్వతంగా సైన్యాన్ని సమకూర్చుకొని రాజ్యాన్ని సంపాదిస్తాడు. మరి అటువంటి రాజ్యాన్ని తన గురువైన రామదాసస్వామి ఇచ్చేస్తానంటాడు. దీనికి ఎంత ధైర్యం ఉండాలి. ఎంత గురుభక్తి ఉండాలి. గురుభక్తిలో, దానం చేయడంలో శివాజీకి శివాజీయే సాటి.

**4. ధర్మాకలనం :**

ధర్మం చేయాలని మనస్సు కలిగివుండుట ధార్మికత్వం. శివాజీకి జీవితంలో ఎదురైన ఎన్నో సంకట పరిస్థితులలో కూడ ధర్మం ఎన్నడూ తప్పలేదు. తన కళ్లఎదుట గోహింస జరుగుతుంటే ఎదిరించి గోవులను రక్షిస్తాడు. కల్యాణి ప్రాంతపు రాణివాసపు స్త్రీని తీసుకువచ్చి శివాజీకి ఇస్తే ఆమెను పూజించి ఆమె నింటికి చేర్చుతాడు. అఫ్జల్‌ఖాన్ మరణించినప్పుడు అతడి సైన్యాన్ని క్షమించి విడిచిపెడతాడు. షాజీ చిన్నప్పటి నుండి తనతో లేకపోయిన, శత్రుపక్షం వహించిన అతడు ఖైదు

చేయబడ్డప్పుడు అతనిని విడిపించడానికి తగిన కార్యాచరణ చేస్తాడు. షాజీ బీజాపూర్ నాయకుడు తరుపున రాయబారిగా వస్తే కేవలం తండ్రి వచ్చినందువల్లనే శివాజీ సంధికి ఒప్పుకుంటాడు. చివరికి రాజ్యం సంపాదించి పట్టాభిషేకం చేసుకోవాలనుకున్న సమయంలో, క్షత్రియుడే పట్టాభిషేకం చేసుకోవాలన్న ప్రశ్న ఎదురైనప్పుడు –

**అనుమాటల్ శివభూవుఁడందికొని కార్యజ్ఞత మేపార ని**
**ట్లనె, "మీ రింతలు నిగ్గుదేల్చుటిది యోగ్యంబంచు భావింతు; ధ**
**ర్మ నిరోధంబగు నింద్రభోగమయినన్ మన్నింప నేనొల్లఁ; బా**
**వన మస్మత్కుల కీర్తి పెద్దలు వచింపన్ వింటి నేనీగతిన్.**

(శ్రీ.శి.భా.పు. 460)

శివాజీ క్షత్రియుడు అన్నది నిగ్గు తేల్చాకే పట్టాభిషేకం చేసుకుంటానని ధర్మానికి హాని కలిగించే ఇంద్రపదవి అయినా తనకు తృణప్రాయమే అంటాడు. శివాజీ సింహాసనానికంటే ధర్మానికే పెద్ద పీట వేస్తాడు.

**5. వైదగ్ధ్యం :**

"కృత్యవస్తుషు చాతుర్యం వైదగ్ధ్యం పరికీర్త్యతే "[1] చేయవలసిన కార్యాలలో నేర్పుచూపుట వైదగ్ధ్యం. శివాజీ లక్ష్యం. స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించి హైందవ మతాన్ని ఉద్ధరించటం కోసం శివాజీ మొదట తోరణా దుర్గాన్ని ఆక్రమిస్తాడు. ఈ కోటకి కట్టుదిట్టమైన భద్రత లేదు. అందువల్ల సైన్యాన్ని నష్టపోకుండ కోట సొంతం అవుతుంది. చాకణు దుర్గాపతి తనకుతానే శివాజీ దుర్గాన్ని అప్పగిస్తాడు. ఈ విధంగా శివాజీ సునాయాసంగా దుర్గాలను దక్కించుకుంటాడు. కానీ అఫ్జల్‌ఖాన్ సైన్యంతో వచ్చి శివాజీపైకి దాడి చేయాలనుకుంటాడు. కానీ శివాజీ బహిరంగంగా అఫ్జల్‌ఖాన్‌తో యుద్ధం చేస్తే సైన్యాన్ని నష్టపోయే ప్రమాదం ఉన్నందువల్ల అందువల్ల అఫ్జల్‌ఖాన్‌ను సంధికి రమ్మని సంహరిస్తాడు. ఇదే విధంగా జయసింగ్‌తో కూడ సంధి చేసుకొని మహారాష్ట్ర సైన్యం నష్టపోకుండ చూసుకుంటాడు.

ఔరంగజేబు శివాజీని నిర్బంధించినప్పుడు శివాజీ నేర్పుతో అక్కడ నుండి తప్పించుకొంటాడు.

**తనవంటివాఁడు నచ్చినబంటు 'హీరోజి'**
**యనువానిఁ దనతల్పమునకుఁ జేర్చి,**

---

1. *ప్రతాపరుద్రీయ, పు. 10*

**తన ముద్దుటుంగ్రమాలీన వ్రేలఁ గనిపింప**
**నిలువెల్లఁ దనసాల్వు నెఱయఁగప్పి,**
**యౌషధం బుపచార మరయఁగా నొకబంటు**
**వాఁకిటియందుఁ గావలిగఁ బెట్టి,**
**"యాజమానుఁ డిపుడెక న్నఱమోడ్చె, నెవ్వరే**
**నరుగరా" దనునట్టు లాజ్ఞసేసి,**
**పండ్ల బుట్టల నొకట సాంభాజి నునిచి,**
**మఱియొకటఁ దా నొదిఁగె పండ్ల మాటుపఱచి,**
**ఫలములు మిటాయి రక్షకుల్ పంచుకొనెడు**
**సంబరము నెంచి శివరాజు సైగఁ జేసె"**

(శ్రీ.శి.భా.పు. 398)

శివాజీ తనలాగే ఉన్న హిరోజీ అనే బంటుని తన ఆసనం మీద పడుకోబెట్టి తన ఉంగరాన్ని అతనికి పెట్టి పైనుండి క్రిందదాక తన శాలువ కప్పి ఔషధాన్ని సేవించి ఇప్పుడే పడుకొన్నాడని ఎవ్వరూ రాకూడదని ఒక బంటుని బయట కాపలాగ పెట్టి ఒక పండ్ల బుట్టలో శంభాజీని మరొక దానిలో శివాజీ ఉండి రక్షకులు ఫలాలు పంచుకొంటూ ఉండగా శివాజీ యుక్తిగా ఔరంగజేబు నుండి బయటపడతాడు.

**మహావిశాలత :**

జగత్తుని ప్రకాశింపజేయుట శివాజీ భారతమాతని దాస్యం నుండి విముక్తి చేసి, గోవులను రక్షించి, స్త్రీల మాన, ధనాల్ని కాపాడి, హైందవమతాన్ని పునరుద్ధరించి సర్వమానవాళికి శ్రేయస్సుని కలిగిస్తాడు.

**ప్రజయుఁ బ్రభుత్వ మొండొకనిప్రాపునఁ జేవఁ జిగిర్చి రెండునున్**
**విజయము నందుచుండ నని పెద్దలు రాజొక యాత్మగాఁ - బ్రజా**
**ప్రజమొక మేనుగాఁ దెలియఁ బల్కిరి; నిక్క మ చూడు మిందు భూ**
**భుజుఁ డిరువైపు ధర్మ పథమున్ నడుపన్ దగువాఁడు దానగున్"**

(శ్రీ.శి.భా.పు. 478)

శివాజీ ప్రజల్ని వేరుగా తనను వేరుగా చూడక రాజధర్మాన్ని నిర్వర్తిస్తాడు.

**నాటకంలో శివాజీ :**

నాటకంలో కూడ శివాజీ తన ధర్మాలను నిర్వర్తించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు.

**దుర్వృత్తే నృపతౌ తు మన్త్రి సచివాస్త్యక్త్వాయ నియోగం నిజం**
**స్వచ్ఛన్దం విహరన్తి కామవశగా ఉద్వేజయన్తః ప్రజాః ।**
**రాష్ట్రోపప్లవశఙ్కయాన్యనుపతిం సద్యః శ్రయన్తే జనాః**
**కాలేనాపచయేన కోశబలయో రాష్ట్రం తతో నశ్యతి ॥**

(ఛ.సా.పు. 94)

**తద్యయస్యాః !**

**ఉద్ధర్తుమేనాం పరిపీడితాం భువం**
**ధర్మచ్యుతైరున్మద రాజసంఘైః ।**
**సామ్రాజ్య సంస్థాపనమన్తరేణ**
**నవర్తతేఽన్యాఽర్థకారీ ప్రతిక్రియా ॥**

(ఛ.సా.పు. 95)

కేవలం యవనులే కాదు రాష్ట్రద్రోహం చేసే శత్రువులు కూడ ఉన్నారు. ప్రజలు కూడ కామానికి గురౌతున్నారు. ఉద్వేగంతో ప్రవర్తిస్తున్నారు. పరపీడితమైన ఈ భూమిని ఉద్ధరించాలంటే సామ్రాజ్యాన్ని స్థాపించాలనుకుంటాడు.

శివాజీ అనేక దుర్గాల్ని ఆక్రమిస్తాడు. తోరణ దుర్గంలో నిధి దొరుకుతుంది. దానిని ఆయుధాలు కొనడానికి ఖర్చుచేస్తాడు. జయించిన దుర్గాలన్నింటికి కట్టుదిట్టమైన రక్షణను ఏర్పాటు చేస్తాడు. రామదాసస్వామి, దాదోజీల దగ్గర రాజనీతి ధర్మాలు తెలుసుకుంటాడు. తననే నమ్ముకున్న వాళ్ళకి మంచి పదవుల్ని ఇచ్చి పరిపాలనను సుస్థిరం చేస్తాడు. పర స్త్రీలను గౌరవిస్తాడు. అఫ్జల్‌ఖాన్‌ను మట్టుపెడతాడు. కేవలం యవనులనే కాదు, కుటిలులైన క్షత్రియులను కూడ విడిచిపెట్టడు. క్షత్రియుడైనా, కుటిలుడైన శ్యామరాజును సంహరిస్తాడు.

తనపై దాడి చేయడానికి వచ్చిన జయసింగ్‌తో సంధి చేసుకొని యుద్ధాన్ని నివారిస్తాడు. ఔరంగజేబు నుండి చాకచక్యంతో తప్పించుకుంటాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ స్వతంత్ర సామ్రాజ్యాన్ని స్థాపిస్తాడు. కావ్యంలో కేవలం యవనుల మీదే దృష్టిపెడతాడు. నాటకంలో స్వదేశీయులైన, వంచనాపరులైన క్షత్రియులను

కూడ విడిచిపెట్టడు. నాటకంలో కంటే కావ్యంలో శివాజీ పాత్రకు నిడివి తక్కువ. కావ్యం శివాజీ పుట్టక ముందు నుంచి శివాజీ పట్టాభిషేకం వరకు ఉంటుంది. కానీ నాటకం శివాజీ పెరిగి పెద్దవాడై రాజ్యాన్ని ఏర్పరచుకోవడంతో మొదలౌతుంది. శివాజీ సామ్రాజ్యాన్ని నిర్మించడం మొదలు పెట్టినప్పటినుండి కావ్య నాటకాలు రెండింటిలోనూ సంఘటనలు ఒకేలాగ ఉన్నాయి. కావ్యంలో శివాజీ తన రాజ్యం మొత్తాన్ని రామదాసస్వామికి దానంగా ఇస్తాడు. కానీ నాటకంలో రాజ్యాన్ని దానం ఇవ్వలేదు. రామదాసస్వామి గురించి శివాజీ తుకారాముడి దగ్గర వింటాడు. ఇది నాటకంలో లేదు. షాజీ, దాదోజీల మరణానికి శివాజీ ఎంతో బాధపడతాడు. ఈ సంఘటనలు కూడ నాటకంలో లేవు.

శివాజీ తన తల్లికి ఇచ్చిన మాట ప్రకారం హిందూ రాజ్యాన్ని స్థాపిస్తాడు. షాజీ శివాజీ గురించి పట్టించుకోకపోయినా శివాజీ తన తండ్రి చెరనుండి విడిపించి తండ్రి పట్ల కొడుకుగా తనధర్మం నిర్వర్తిస్తాడు. ఆపద సమయంలో భార్యను సలహా అడిగి ఆమె గౌరవాన్ని నిలబెడతాడు. రాజధర్మ ప్రకారం ప్రజల మానధన ప్రాణాలను కాపాడతాడు. శివాజీ తనకున్న అన్ని బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ఛత్రపతి బిరుదు పొందాడు.

### 5.2.2 జీజియ :

లుకజీ కూతురు. షాజీ భార్య. శివాజీకి తల్లి. జీజియ ధీరవనిత. జీజియ అనుకున్నది సాధించే మనస్తత్వం కలది. "శివభారతమున జీజియ భారతమాతకు ప్రతీక"[2] నిజామ్ తన తండ్రిని చంపడం, మొఘలులు తన భర్తపై దాడి చెయ్యడం వంటి యవనుల దురాగతాలు ఆమె హృదయాన్ని చాలా బాదిస్తాయి. ఎలాగైనా సరే శివాజీ స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించి, హిందూ మతాన్ని పునరుద్ధరించాలని ఆమె కోరిక. అందుకే చిన్నప్పటి నుండి శివాజీకి వీర పురుష జీవిత గాథలు చెప్పి శివాజీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది.

మొఘలుల వల్ల మహారాష్ట్ర ప్రజలు ఎన్ని బాధలు పడ్డారో వివరిస్తుంది.

**అన్నా ! దక్షిణ భారతోర్విని జనం బాబాలగోపాలమున్**
**గన్నారన్ నిదురించిరే? పిడికెఁ డన్నంబైన నిశ్చింతగాఁ**
**దిన్నారే? 'యెపు డెట్లుపైఁబడునొ యుద్వృత్తిన్ మెగల్దండు' లం**
**చున్నా రాఁపునుదాఁపు లేనిప్రజలై యుత్సాహముం బాయుచున్**

(శి.భా., పు.73)

---

2. *సాహిత్య తత్త్వము, శివభారత దర్శనము, పు. 190*

ఈ పద్యంలోని శాస్త్రిగారి రచనా విధానం తెనాలి రామకృష్ణుని శైలిని తపింపచేయును. నిగమశర్మ అక్క తన సోదరుడికి నచ్చచెప్పే సమయంలో–

> **"ప్రారంభించిన వేదపాఠమునకున్ బ్రత్యూహ మౌనంచునో**
> **యేరా తమ్ముఁడ! నన్నుఁజూడఁ జనుదే, వెన్నాళ్లనోయుండి చ**
> **క్షూ రాజీవయుగంబు వాచె నినుఁ గన్గోకున్కి, మీ బావయున్**
> **నీరాకల్ మదిఁగోరుఁజంద్రు పొడపున్ నీరాకరంబున్ బలెన్".**[3]

అంటూ పలుకుతుంది. నిగమశర్మ సోదరిని మించి లోకజ్ఞత వెల్లడిస్తూ జీజియ శివాజీతో మహారాష్ట్రుల పరిస్థితిని వెల్లడించింది.

జీజియ పట్టుదల గల మనిషి. షాజీ మొఘలుల పక్షం లేదని లుకజీ నిష్ఠూరాలు పలికినప్పుడు లుకజీని ఎదిరించి తన భర్త ప్రతిష్ఠ నిలబెడుతుంది. కానీ లుకజీ చనిపోయాడని తెలియగానే ఎంతో కుమిలిపోతుంది.

షాజీ రెండవ వివాహం చేసుకొని వెళ్ళిపోయినా కూడ షాజీ నిర్బంధించబడ్డాడని విని జీజియ ఎంతో బాధపడుతుంది. షాజీని విడిపించమని శివాజీకి చెబుతుంది. ఎన్ని కష్టాలు ఎదురైనా శివాజీని తీర్చిదిద్ది జీజియ అనుకున్న లక్ష్యాన్ని సాధించి షాజీచే గౌరవింపబడుతుంది. షాజీయే జీజియాని ప్రశంసించిన విధం ఇది.

**ఉ॥ ధన్యవు ! జిజియా ! యవితథంబుగ, భారత వీరమాతృ మూ**
**ర్ధన్యవు; నీ యుదార చరితంబున భోన్సలవంశకీర్తి స**
**మ్మాన్యతఁ గాంచె; నీ చనినమార్గము భారత భాగ్యసాధనా**
**ధన్యులు తల్లులెల్ల నడువన్ దగి మించు పరీమళించెడున్ ॥**

**సీ॥ తనయ వాత్సల్యంబు ధవుప్రేమ దేశ భ**
**క్తియుఁ దూఁచి, సమత సాధించినావు,**
**వానిలో నొకఁడైన వాడిపోవనియట్టు**
**లెదిగించి, దోహద మిచ్చినావు,**
**దవకీలవోలె వెన్దవులునాపద లాఁపు**
**వెదవుమై దేహ మర్పించినావు,**

---

3. *పాండురంగ మహాత్మ్యము, పు. 111*

**కొలువోవకుండ రూపటివోవకుండ న**
**న్నిట నిండుఫలము పండించినావు**
**మనసు మాట చేఁతయుఁ దొనంకని విధానఁ**
**గఠినదీక్షఁ దపస్సిద్ధిఁ గాంచినావు,**
**నిజము : జీజియా ! భరతోర్వి నీదుసేవ**
**కప్పవడినది సకలభాగ్యముల తోడ**

(శ్రీ.శి.భా.పు. 365)

జీజియ నీవు ధన్యత సాధించినావు. నీ వలన భోన్సలే వంశకీర్తి గాంచినది. నీ మార్గంలోనే భారతదేశంలో ఉన్న తల్లులందరూ నడవదగినది. తనయుడికి దేశభక్తి నేర్పావు, పెద్ద పెద్ద ఆపదలెన్నో తప్పించుకొన్నావు. అన్నింటిలోనూ మంచి ఫలితాన్ని సాధించావు. అన్న మాట నిలబెట్టుకొన్నావు. నీకు భారతభూమి ఋణపడింది అని షాజీ జీజియాని కీర్తించాడు.

శివాజీ మొఘలుల నుంచి తప్పించుకొన్నాడని విని ఎంతో ఆనందించి పూజలు, అన్నదానాలు చేస్తుంది. సింహగడ్ మీద మళ్ళీ మహారాష్ట్ర జెండా రెపరెపలాడాలని కోరుకుంటుంది. శివాజీ పట్టాభిషిక్తుడై రాజైనప్పుడు రాజమాతగా గౌరవాన్ని పొందుతుంది.

**నాటకంలో జీజియ :**

నాటకంలో జీజియ తన కుటుంబం గురించే కాకుండ, రాచకార్యాలు కూడ ఎక్కువ చేపడుతుంది.

బాజీ ప్రభువు ప్రాణంపోయే సమయంలో వేరొక మతం స్వీకరించాడని అతడిప్పుడు స్వమతం స్వీకరించాడని అతని కుమారుడికి నీ కుమార్తెను ఇచ్చి వివాహం చేయమని శివాజీకి సలహాయిస్తుంది. అఫ్జల్‌ఖాన్‌ను వధించడానికి వెళ్ళేటప్పుడు జీజియ శివాజీకి తోడుగా తానాజీని వెళ్ళమంటుంది. శివాజీ ఔరంగజేబు దగ్గర బందీగా ఉన్నప్పుడు జీజియ శివాజీ స్థానంలో రాచకార్యాలు నడిపిస్తుంది.

**కఞ్చుకీ : ఏషరాజకార్యవ్యాకులః ప్రధానమన్త్రీ ద్వారి తిష్ఠతి.**

**రాజమాతా : (ప్రవేశయైనమ్).**

**కఞ్చుకీ : తథా.**

**(ఇతి నిష్క్రాన్తః)**

**ప్రధానమన్త్రీ :** **అమ్బ త్వదాదేశానురోధేన మయాత్మ సాత్కృతాః పఞ్చషాః సహ్యాదుర్గాః**

**రాజమాతా :** **మన్త్రివర్య, అభినన్దామి తవ యుద్ధపాటవమ్. అథోపలబ్ధా కావ్యభినవా ప్రవృత్తిర్వత్సస్య** (ఛ.సా.పు.167)

ఈ విధంగా శివాజీ దర్బార్‌లో లేని సమయంలో జీజియ కొంతకాలంపాటు శివాజీ స్థానాన్ని భర్తీ చేస్తుంది. తానాజీ సింహగడ్‌ను జయించడానికి వెళ్ళినపుడు తానాజీ కుమారుడి వివాహ మహోత్సవాన్ని స్వయంగా జీజియాయే పర్యవేక్షిస్తుంది.

నాటకంలో కంటే కూడ కావ్యంలో జీజియ పాత్రకు విస్తృతి ఎక్కువ. జీజియ అనుకున్నది సాధించే పట్టుదలగల మనిషి. కావ్యంలో జీజియా ప్రజ్ఞాపాటవాలు కుటుంబానికి శివాజీని తీర్చిదిద్దడానికి ఉపయోగపడతాయి. కానీ నాటకంలో జీజియ శివాజీకి బదులుగా రాచకార్యాలు కూడా నిర్వహిస్తుంది. జీజియ శివాజీ తల్లిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

### 5.2.3 దాదోజి :

షాజీ అనుచరుడు. శివాజీకి గురువు. గర్భవతిగా ఉన్న జీజియబాయిని షాజీ శివనేరు పంపిస్తాడు. దాదాజీ జీజియతో భయపడకు నా కూతురులాగానే నిన్ను భావిస్తాను అంటాడు. షాజీ కూడ జీజియ వెంట దాదోజీ వున్నాడని నిశ్చింతగా ఉంటాడు. శివాజీ పుట్టగానే ఆ విషయాన్ని దాదోజీ షాజీకి తెలియజేసి షాజీకి ఆనందాన్ని కలుగజేస్తాడు. షాజీ రెండవ వివాహం చేసుకొని పూనాలోనే స్థిరపడినప్పుడు జీజియకు తోడు దాదోజీ ఆమె దగ్గరే ఉంటాడు. షాజీ జీజియాని, శివాజీని పూనా రమ్మన్నప్పుడు జీజియ తన భావాలను దాదోజీతో పంచుకుంటుంది –

**"దాదా ! నామది నిండిపోయె; నిదియుత్సాహంబొ ! శోకంబొ ! ని**
**ర్వేదంబో ! త్వరపాటొ! నేనెఱుఁగ; దండ్రీ! సర్వసన్నాహ మా**
**పాదింప న్నియమింపు; మీ విపుదుపప్లావ్యంబునన్ బాండవ**
**శ్రీ దర్శింపగఁ బోవు కృష్ణుఁడవు; భ్రాతృత్వంబు నీదేసుమీ!"**

(శ్రీ.శి.భా.పు.167)

ఈ పద్యంలో జీజియ దాదోజిని తండ్రి అని సంబోధిస్తుంది. ఇన్నాళ్ళకి తన భర్తను మళ్ళీ కలుసుకోబోతోంది. ఉపపాండవులు, పాండవుల దగ్గరికి వెళ్ళుతున్నారు. దాదోజీని నువ్వే కృష్ణుడవు అని సంబోధిస్తుంది.

దాదాజీ శివాజీకి వివిధ దృష్టాంతాలతో రాజనీతి, ధర్మశాస్త్రాలు నేర్పుతాడు. వ్యూహ రచన, సమర సన్నాహం, ఆయుధ విశేష నైపుణ్యం మొదలైన నలభైనాలుగు విద్యలను నేర్పిస్తాడు.

**ప్రత్యూష పవనముల్ పొరాడఁ జలువలూ**
**రిన వాలుకా వితర్థికలయందు,**
**ఫలి తోపవన వాటికల శీతలచ్ఛాయ**
**లలమిన హరిత శాద్వలములందుఁ,**
**బరువంపు వెన్నెలల్ వాటి చుక్కలు దేలు**
**పఱపైన మేడయుప్పరి గలందుఁ,**
**బొగఁ జోపి చిఱువత్తు లెగఁద్రోసి చమురుదీ**
**పాలిడ్డవీధి సోఫాలయందు,**

**శిష్యగణముతో శివారాజుఁ జేర్చికొనుచు,**
**భారతాదుల భావసంపదలఁ దెలిపి,**
**ఘనుఁడు దాదోజి తన విమర్శనము లిచ్చి**
**నవ్య సాహిత్య యోధసంతతుల నడిపె ॥**

(శ్రీ. శి. భా. పు. 102)

దాదోజీ, శివాజీకి, ఇసుక తిన్నెల మీద, లేత పచ్చిక మీద వీధి సోఫానాల మీద తక్కిన శిష్యులతో శివాజీని కలిపి రాజనీతి శాస్త్రాలు బోధిస్తాడు. ఈ పద్యం పెద్దన్న మనుచరిత్రలో రచించిన–

**"ప్రత్యూషపవన నాంకరములు పైకొనువేళ**
**వామనస్తుతి పరత్వమున లేచి**
**సచ్ఛాత్తుఁ దగుచు నిచ్చలు నేఁగి యయ్యేట**
**నఘమర్షణ స్నాన మాచరించి"[4]**

పద్యాన్ని స్ఫురింప చేస్తుంది.

శివాజీ తన సొంత సైన్యాన్ని తయారుచేసుకోవడం, వివిధ ప్రాంతాలను ఆక్రమించుకోవడంతో దాదోజీ శివాజీని మందలిస్తాడు. మనం ఆదిల్షా నవాబుగారి ఆజ్ఞకు లోబడి ఉండడం మంచిదని అనవసరంగా కష్టాలు తెచ్చుకోవద్దని హితబోధ చేస్తాడు.

---

*4. వసుచరిత్ర, ఆ – 1, ప. 54*

దాదోజి చరమదశలో శివాజీ దాదోజి గురించి అన్న మాటలివి.

**కన్న గురుత్వ మొక్కటియగా హషజీవిభుఁడందెఁ; 'దండ్రిగా'**
**రన్న గురుత్వమున్ విలిచినట్టి మహాత్ముఁడ వీవ గాదె! నా**
**యున్నతిఁగోరి జీవకళయొడ్డిన నీ హృదయానుభూతి కే**
**మున్నది మారుతూఁచఁగ, గురూ! యొక యశ్రుకణంబు దక్కఁగన్?**

(శ్రీ.శి.భా.పు.131)

కన్నది షాజీయే అయినా తండ్రిగా, గురువుగా నీవే బాధ్యత నెరవేర్చావు. నా ఉన్నతికోసం ఎప్పుడూ తపించే నీ హృదయానికి సమానమైనది ఏముంది? నీ కోసం నేను ఒక అశ్రుకణాన్ని రాల్చడం తప్ప అని శివాజీచే ప్రశంసింపబడతాడు దాదోజీ.

లుకజీ లేని లోటును జీజియాకి, తండ్రి దగ్గరలేదన్న లోటును శివాజీకి తీర్చాడు. శివాజీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో జీజియకు ఏమాత్రం తీసిపోడు దాదోజి. శివాజీ పుట్టింది మొదలు దాదోజి మరణించే వరకు దాదోజి శివాజీ వెన్నంటి ఉండి అతడికి అనేక విధాల సలహాలు ఇస్తూ ఉంటాడు.

**నాటకంలో దాదోజీ :**

నాటకంలో కూడ దాదోజీ శివాజీకి రాజనీతి విషయాలు బోధిస్తాడు. శివాజీ ధర్మరాజ్యాన్ని స్థాపిస్తానన్నప్పుడు దాదోజి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాలనే సాహసం చేయకని మందలిస్తాడు. ఇంకా విధంగా చెబుతాడు.

**దాదోజి : వత్స శివరాజ, సమ్యగవధారితయవనేశ స్వభావ మద్య త్వామవరోద్ధుం నోత్సహే. తచ్ఛృణుమే పరమం నయవచనం యదా శ్రయణేన నిష్ప్రత్యూహా భవిష్యన్తి తవాభిమతార్థ సిద్ధయః త్వం తావత్.**

**అన్యోऽన్యేర్ష్యా కలుషితధియః సంప్రయుఞ్జన్నృపాలాన్**
**ప్రీత్యుద్రే కాద్వనచరపతీన్ ప్రీణయన్ సిద్ధ లక్ష్యాన్ ।**
**దానైర్మానై ర్మధుర వచనై రఞ్జయన్ లోకవీరాన్**
**లీలాయుద్ధైర్జయ జనపదాన్ దుర్జయాంశ్చాద్రిదుర్గాన్ ॥**

(ఛ.సా.పు.100)

దాదోజి : 'వత్సా ! శివాజీ రాజా ఆ యవనుల స్వభావాన్ని బాగా అర్థం చేసుకున్నటువంటి నిన్ను ఆపడానికి నేను ఇష్టపడడం లేదు. నేను చెప్పే నీతి వచనం విను. ఎవర్ని ఆశ్రయించినట్లయితే ఎటువంటి అడ్డంకి లేకుండా నీవు కోరుకున్న సిద్ధి కలుగుతుందో ఆ విషయం నీకు నేను చెబుతాను విను. పరస్పరం ఈర్ష్య, కలుషితమైన రాజులందర్ని కలుపు. వనచరులందర్ని సంతోష పెట్టు. సాధారణ ప్రజలందరిలో కూడ వీరులు ఉంటారు. వాళ్లనందర్ని దానంవల్లగానీ, గౌరవించడంవల్ల కానీ, మాట్లాడడం వల్ల కానీ సంతోషపెట్టి జనపదాలు, కొండ దుర్గాల్ని ముందు జయించు'. అని శివాజీకి దాదోజి రాజనీతి ధర్మాల్ని బోధిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ దాదోజి పాత్రను పరిశీలించినట్లైతే నాటకంలో కంటే కావ్యంలో దాదోజి పాత్రకు నిడివి ఎక్కువ. నాటకంలో కేవలం ప్రథమాంకంలోనే దాదోజి పాత్ర ప్రవేశ నిష్క్రమణలు ఉంటాయి. మళ్లీ దాదోజి కన్పించడు. కావ్యంలో శివాజీకి అన్నీ తానై చూసుకొని తుది శ్వాసవరకు శివాజీతోనే ఉంటాడు.

**5.2.4 సయీబాయి :**

శివాజీ భార్య. షాజీ కోడలు. నిజామ్ షాజీని నిర్బంధించి శివాజీ తన కొలువులో ఉద్యోగం చేస్తానంటేనే షాజీని విడిచిపెడతానని లేకపోతే షాజీకి సజీవ సమాధి కడతానని లేఖను పంపిస్తాడు. శివాజీ సంకటంలో పడతాడు. ఆ సమయంలో శివాజీ సయీబాయిని సలహా అడుగుతాడు. సయీబాయి శివాజీతో మామగారి కష్టం తీర్చడం ముఖ్యమని సలహా ఇస్తుంది.

**"తలఁప సలుపఁగా మనము కర్తలమెయైనఁ,**
**గనులకందని బ్రహ్మాండ గర్భగోళ**
**మెనసి యూఁ కొట్టు సర్వభోక్తను దలంపుఁ**
**దతని మే లంద భావికార్యమునఁ జనుఁడు"**

(శ్రీ.శి.భా.పు. 196)

ఆలోచిస్తే ప్రతీ పనికి మనం కర్తలుగా అన్పిస్తాం కానీ వెనుకాల ఉండి నడిపంచే దైవం ఒక్కటి ఉంటుంది అని చెప్తుంది. శివాజీ వెంటనే భవాని ప్రార్థించి పరిష్కార మార్గాన్ని కనుగొంటాడు. అత్తమామల, భర్త క్షేమాన్ని కాంక్షించి వారి మన్ననలు పొందిన వనిత సయీబాయి.

**నాటకంలో సయీబాయి :**

నాటకంలో కూడ సయీబాయి శివాజీని అనుసరిస్తుంది. శివాజీ క్షేమమే తన క్షేమంగా భావిస్తుంది. భర్తని ఎల్లప్పుడూ సంతోషంగా ఉంచుతుంది.

రాజ్ఞీ : **ఆర్యపుత్ర, అద్యఖలు**
**లోక ప్రకాశన మరాతి తమోఽపహారి**
**సంతర్పణం నయనమానస యోర్వపుస్తే ।**
**ఏతన్నవోపచితయౌవన రాజ్యలక్ష్మ్యా**
**తేజోద్వయస్య యుగపత్సుషమాం దధాతి ॥**

శివరాజః : **దేవి త్వమేవాసి మమ సకల మఙ్గలానా మేకాయతనమ్. యత్త్వం**
**ప్రోత్సాహనేన సమరాఙ్గణతత్పరస్య**
**ప్రత్యాగతస్య చ పరాక్రమణానుయోగైః ।**
**ఉద్వేజితస్య నయమార్గ వికల్పనైశ్చ**
**శ్రాన్తస్య నర్మవచసా తనుషే సుఖం మే ॥**

(ఛ.సా.పు. 122)

రాణి : శత్రువు అనే చీకటిని పోగొట్టే నీ శరీరం మా కన్నుల మనస్సుకి తృప్తిని కలిగిస్తోంది. యవ్వనంతో కూడిన రాజ్యలక్ష్మి చేత నూతనంగా కలిగిన రాజ్యలక్ష్మి చేత, నూతనంగా కలిగిన రాజ్యలక్ష్మి చేత ఒకసారి రెండు తేజస్సుల కాంతి ఎంలా ఉంటుందో అలావుంది నీ శరీరం.

శివాజీ : ఎప్పుడూ యుద్ధం చేయాలనే కోరికతో ఉన్నటువంటి, దుర్గాలన్నీ ఆక్రమించుకొని తిరిగి వచ్చిన నీతి మార్గానికి సంబంధించిన ఆలోచనతో, ప్రోత్సాహం చేత, నర్మగర్భమైన మాటలతో ప్రోత్సాహించే నువ్వు నాకు ఆనందాన్ని కలుగజేస్తున్నావు అంటాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ సయీబాయి భర్తనే దైవంగా భావించి సేవిస్తుంది. పట్టాభిషేక సమయంలో శివాజీ పక్కన పట్టపురాణిగా అలరారుతుంది.

**5.2.5 బాజీ ప్రభువు :**

శివాజీ అనుచరుడు. ప్రమాదాన్ని ముందుగానే ఊహించి అత్యంత నేర్పుతో నిర్ణయాలు తీసుకొనే వ్యక్తి. మూడు వైపులా పన్హాళ దుర్గాన్ని శత్రువులు ఆక్రమించినప్పుడు శివాజీ ఇక కోటలో ఉండడం మంచిది కాదని శివాజీతోపాటు రాంగణాగడ్ చేరుకోవాలనుకొంటాడు. అయితే శత్రువులు తరుముకు వస్తున్న సమయంలో శివాజీ ముందుగా రాంగణాగడ్‌కు పంపిస్తాడు. బాజీ ప్రభువు సైన్యం కేవలం మూడువందలు మాత్రమే అయినా బాజీ పదిహేనువేల బీజాపూర్ సేనతో పోట్లాడతాడు. బాజీ ప్రభువు వీరోచిత పోరాటం తీరిది.

**కొఱవిఁదిప్పినయట్లు మెఱుఁగు లేచినయట్లు**
**కరవాలు మిసమిసల్ గ్రమ్ముకొనఁగ,**
**మునుమెత్తి రిపుమధ్యమును జీల్చి చొరఁ బాఱి,**
**నలువైపు సేనల నఱకురాడి,**
**పెనుగాలి తాటిపండ్లను రాల్చు చందానఁ-**
**గొడవండ్లఁ బైరులు గోసినట్లు-**
**చెఱకుగడల్ నిల్వు నఱికివై చెడురీతిఁ**
**జిగురాకు దూసిపోసిన విధానఁ,**

**దలలు మొండెముల్ పాణి పాదములు కండ**
**లింతలింతలు తునియలై, యిందునందుఁ**
**బ్రోవులై, రాసులై, రణభూమి మిత్తి**
**వంట యిల్లనఁ బీనుఁగు పెంట జేసె ॥**

(శ్రీ.శి.భా.పు. 277)

కొరివి తిప్పినట్లు, మెరుగు లేచినయట్లు కత్తితిప్పాడు. అన్నివైపుల నుండి వచ్చే శత్రువులను నరికి, గాలి తాటిపళ్ళు ఎలా రాలిపోతాయో, కొడవళ్ళతో పైరులు ఎలా కోస్తారో చెరుకు గడలను నరికిన తీరుగా, చిగురు ఆకులను దూసిపోసినట్లుగా తలలు, మొండాలు, చేతులు, కాళ్ళు తరిగిన ముక్కలుగా రాశులై, ప్రోవులై యుద్ధరంగమంతా పీనుగులతో నిండిపోయింది. అయితే శివాజీ రాంగణాగడ్ చేరినట్లు ఫిరంగి మ్రోత వినబడగానే బాజీ ప్రభువు స్వామి సేవలో కృతార్థత పొందానని

భావిస్తాడు. బాజీ ప్రభువు శత్రువుల చేతిలో హతుడైనప్పటికీ శివాజీ హృదయంలో శాశ్వత స్థానం సంపాదించుకున్నాడు. అందుకే శివాజీ బాజీ ప్రభువుని స్మరిస్తూ....

> **"పచ్చినెత్తురు కాల్వలఁ చాఁగట్టి**
> **సంగరక్షోణీ శౌర్య బీజములఁ జల్లి**
> **స్వామిభక్తి పండించి విశ్వమునఁ బంచు**
> **త్యాగధన! శాశ్వతామృతస్థాయి మగుము !"**

(శ్రీ.శి.భా.పు.286)

శత్రువులను చీల్చి చెండాడి స్వామిభక్తిలో ఉన్నత స్థానంలో నిలిచిన త్యాగధనుడివి నువ్వు. శాశ్వతమైన ఆమృతస్థాయిని సంపాదించావు అంటాడు.

**నాటకంలో బాజీ ప్రభువు :**

నాటకంలో కూడ బాజీ ప్రభువు శత్రు సంహారం చేసి మరణిస్తాడు. శివాజీని రక్షించడానికి తన ప్రాణాలను పణంగా పెడతాడు.

**బాజీ : దేవ నాయమవసరో యుక్తాయుక్త విచారస్య**
**త్వదన్నపానాది వివర్థితోఽయం**
**భస్మీ భవేచ్ఛేదవనే తవైవ ।**
**తదాస్య చర్మాస్థివినిర్మితస్య**
**దేహస్య మన్యే కృత కృత్యతాం పరామ్ ॥**

(ఛ.సా.పు. 140)

దేవ యుక్తాయుక్తాలు ఆలోచించడానికి ఇది సమయంకాదు. మీరు పెట్టిన అన్నంతో, నీళ్ళతోటి నేను వృద్ధి చెందిన వాడిని మిమ్మల్ని రక్షించడంలోనే ఈ శరీరం భస్మం అయిపోయినా సరే పర్వాలేదు. ఒకవేళ నేను మరణించినట్లయితే నా చర్మం ఎముకలుతో నిర్మింపబడిన దేహం ధన్యమైందని భావిస్తానంటాడు.

నాటకంలో కూడ దేశం కోసం ప్రాణాలు అర్పించిన బాజీ ప్రభువుని శివాజీ శ్లాఘిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ బాజి ప్రభువు స్వామిభక్తి పరాయణుడు. శివాజీ కోసం ప్రాణాలు అర్పించిన ధీరుడు. భారతమాత కోసం అసువులు బాసిన అమరుడు.

**5.2.6 సమర్థరామదాస స్వామి :**

శివాజీకి ఆధ్యాత్మిక గురువు. శివాజీకి మార్గనిర్దేశం చేసినవ్యక్తి. శివాజీ కూడ అనేక సంశయాల్ని రామదాసస్వామి దగ్గర నివృత్తి చేసుకుంటాడు. భారతంలో అర్జునుడు పలు శంకలతో యుద్ధం చేయలేనప్పుడు శ్రీ కృష్ణుడు గీతోపదేశం చేసి అర్జునుడు యుద్ధం చేసేలా ప్రేరేపించినట్లు రామదాసస్వామి శివాజీని ప్రేరేపిస్తాడు. రామదాసస్వామి బోధనలవల్ల శివాజీ తన కర్తవ్యాన్ని తెలుసుకొని మరింత శ్రద్ధగా నిర్వహిస్తాడు. 'రాజు శత్రు సంహారం చేసినప్పుడు అతనికి పాపాలు అంటవా' అని శివాజీ రామదాసస్వామి అడిగితే సమాధానంగా రామదాసస్వామి –

**గుడిసెలోఁ గన్నుమూసి, పైఁ దొడరు భూత**
**ములకు మేనిచ్చి, లోని శత్రులనె యడఁచి**
**జగము నంటని ముని తపశ్చర్య స్వార్థ;**
**మట్లుపోని రాజర్షి పరార్థపరుఁడు॥**

**తన్నుఁ బోలిన సకల భూతములు దనియఁ,**
**దాను మురియుటే మానవత్వంపుగఱుతు:**
**దాని సాధించుటే పరార్థమగు, నందు**
**దెరువులివి, రాజసంబు –సాత్త్విక మనంగ ॥**

(శ్రీ.శి.భా.పు. 164)

'కళ్ళు మూసుకొని తపస్సు చేసుకొనే ముని కంటే తన కర్తవ్యాన్ని నిర్వహించే రాజే మేలు. సకల జీవరాశుల క్షేమం కోరుకోవడమే సాత్త్విక గుణం' అని రామదాస స్వామి హితబోధ చేస్తాడు.

**నాటకంలో సమర్థ రామదాస స్వామి :**

నాటకంలో కూడ సమర్థరామదాస స్వామి శివాజీకి క్షత్రియ ధర్మాలను ఉపదేశిస్తాడు.

**వృత్తం యథా ధర్మభయేన రక్ష్యతే**
**నృభిస్తథా నైవ నరేన్ద్రశాసనాత్ ।**
**ధర్మాన్ సదాచారపరానతో నృపః**
**ప్రజాహితజ్ఞో నియమేన పాలయేత్ ॥**

(ఛ.సా.పు.125)

**ఏవం ప్రవర్తమానస్య తవ సర్వధాఽనుకూలా భవిష్యతి జగన్నియన్త్రీ పరదేవతా ।**

ధర్మభయం వలన నడవడిక ఎలా రక్షింపబడుతుందో అలాగే నరేంద్రుడి శాసనం ద్వారా శిక్షింపబడుతుంది. సదాచారులైన వారిని రాజు తప్పనిసరిగా రక్షించాలి. ఈ విధంగా నువ్వు ప్రవర్తించినట్లయితే జగత్తు అంతటినీ నియంత్రించే పరదేవత నీకు అనుకూలంగా ఉండగలదని శివాజీకి బోధిస్తాడు..

కావ్య నాటకాలు రెండింటిలోనూ రామదాసస్వామి శివాజీకి కలిగిన ధర్మ సందేహాల్ని తీర్చుతూ శివాజీకి కర్తవ్యాన్ని బోధిస్తాడు.

**5.2.7 షాజీ :**

మాలోజీ కొడుకు. నిజామ్ రాజ్యంలో దండనాధుడు. లుకజీ అల్లుడు. జీజియ భర్త. శివాజీకి తండ్రి. షాజీ తను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండే వ్యక్తి. మావగారైన లుకజీ మొఘలుల పక్షం వహించి షాజీని కూడ తనతో రమ్మంటాడు. కానీ షాజీ మొదటినుంచి ఆశ్రయించిన నిజామ్ పక్షమే ఉంటాడు. లుకజీతో విభేదం వచ్చినా అతడు మరణించాడని తెలిసి ఎంతో బాధపడతాడు. నిజామ్‌పై ప్రతీకారం తీర్చుకోవడానికి బాజీమోహితే సహాయం కోరతాడు. ఈ సమయంలో రెండవసారి గర్భవతిగా ఉన్న జీజియాకు తోడుగా దాదోజిని పంపిస్తాడు. శివాజీ పుట్టాడని విని ఆనందించి తన తండ్రికి భవానిదేవి యిచ్చిన వరాన్ని గుర్తు చేసుకుంటాడు. శివాజీకి నిజామ్ కొలువులో ఉద్యోగం ఇప్పించాలనుకుంటాడు.

నిజామ్ శివాజీ ఉన్నతిని సహించలేక షాజీని నిర్బంధించాడు. షాజీ శివాజీ సహాయంతో విడుదల చేయబడతాడు. శివాజీ గొప్పవాడు అవ్వడంవల్ల శివాజీతో వైరం పెట్టుకోవడం ఇష్టంలేక అదిల్షా కొడుకు శివాజీ దగ్గరకు షాజీని రాయబారానికి పంపిస్తాడు. షాజీ రాకకు శివాజీ ఎంతో సంతోషిస్తాడు. నిజామ్ షాజీని నిర్బందించినా కూడ షాజీ నిజామ్‌ను విడిచిపెట్టక నిజామ్ తరుపున శివాజీ దగ్గరికి సంధికి వస్తాడు. స్వామి భక్తికి షాజీ పెట్టిందిపేరు. కానీ కొడుకు ఉన్నతిని చూసి ఎంతో సంతోషించి రాయగడ్‌ను రాజధానిగా చేసుకొని పరిపాలించమని కొడుక్కి సలహా ఇస్తాడు.

**నాటకంలో షాజీ :**

నాటకంలో షాజీకి పాత్రగా ప్రవేశం లేదు. కేవలం గూఢాచారుల ద్వారా షాజీ బంధింపబడ్డాడని శివాజీ తెలుసుకొని శివాజీ తండ్రిని విడిపించే ప్రయత్నం చేస్తాడు.

కావ్యంలో షాజీ పాత్రకి విస్తృతి ఎక్కువ. కానీ నాటకంలో శివాజీ, మంత్రి, గూఢచారి, జీజియాల సంభాషణ ద్వారా షాజీ ప్రస్తావన వస్తుంది. కావ్యంలో షాజీ నిజామ్ దగ్గర దండనాథుడిగా ఉండి నిజామ్ ప్రభుత్వం కోసమే తన మొదటి భార్య జీజియ, శివాజీ పట్ల అశ్రద్ధ వహిస్తాడు. కానీ నిజామ్ షాజీని బంధించి జీవ సమాధి చెయ్యడానికి సిద్ధపడతాడు. అయినా షాజీ జీవించివున్నంత వరకూ నిజామ్ సేవలోనే ఉంటాడు.

**5.2.8 తానాజీ :**

శివాజీ అనుచరులలో ముఖ్యమైనవాడు తానాజి. స్వామిభక్తి పరాయణుడు. అఫ్జల్‌ఖాన్ ఎదిరించే సమయంలో శివాజీ అంగరక్షకుడిగా తానాజియే ఉంటాడు. సింహగడ్ మీద మహారాష్ట్ర జెండా రెపరెపలాడాలని జీజియ కోరిక నెరవేర్చడానికి తన ప్రాణాలను కూడా పణంగా కూడ పెడతాడు. మర్నాడు జరిగే తన కుమారుడి వివాహాన్ని కూడ లక్ష్యపెట్టక శివాజీ కబురు పంపగానే వచ్చేస్తాడు. సింహగడ్‌ను ఎలాగైనా దక్కించుకోవాలని ప్రతిజ్ఞచేసి వీరోచితంగా పోరాటం చేస్తాడు.

**అతని భుజావిజృంభణము నాఁపఁగలేక, భయాతిరేక దు**
**స్థితి మొగవిచ్చు సైనికులదీనతఁ గన్గొని దుర్గనాథుఁ డు**
**ద్ధతి మునుదూఁకి "యోడకుఁడు, దర్పమునన్ జెలరేఁగి శాత్రవ**
**వ్రతతులఁ గూల్ప నా వెనుక రం" డనుచున్ బురికొల్పె సేనలన్.**

(శ్రీ.శి.భా.పు.424)

తానాజీ పరాక్రమానికి తట్టుకోలేక మొఘలుల సైనికులు భయపడతారు. దుర్గనాథుడైన ఉదయభానుడు సైనికులను తన వెనుక నడిపిస్తాడు. తానాజీ శక్తి వంచన లేకుండ యుద్ధం చేసి వీర మరణాన్ని పొందుతాడు. తానాజీ మరణానికి శివాజీ ఎంతో చింతిస్తాడు. తన కుడి భుజం పోయిందని విచారిస్తాడు.

**నాటకంలో తానాజీ :**

నాటకంలో కూడ తానాజి శివాజీకి మంత్రిగా ఉంటాడు. అవసరమైనప్పుడు శివాజీకి సలహాలు ఇస్తూ ఉంటాడు. యుద్ధ వ్యూహాలను తెలియజేస్తాడు. షాజీని నిర్బంధించినప్పుడు ఢిల్లీ పాదుషాగారికి ఉత్తరం రాసి షాజీని విడుదల చేయించవచ్చని శివాజీకి సలహా ఇస్తాడు.అఫ్జల్‌ఖాన్‌ని ఎదుర్కొనే సమయంలో శివాజీతోనే ఉంటాడు. కర్తవ్య నిర్వహణలో ప్రాణాలు అర్పిస్తాడు. అందుకే శివాజీ తానాజీని కీర్తిస్తాడు.

**అహో ధన్యోఽసి మను ప్రధానవీర ! అద్యఖలు**
**తృణాయ మత్వాత్మజ కౌతుక క్రియాం**
**రాష్ట్రైకభక్త్యోద్వహతా ధురం రణే ।**
**ఏకాన్తతో మాతృనిదేశవర్తి నా**
**సంపాదితం దాశరథేర్ధశస్త్వయా ॥**

(ఛ.సా.పు.171)

నా ప్రధాన వీరుడా ! నేను ధన్యుడనయ్యాను. నీ కుమారుడి వివాహాన్నిక్కడ గడ్డిపరకలాగా తీసేసి రాష్ట్రం మీద ఉండే భక్తితోటి యుద్ధభారాన్ని స్వీకరించే నీకు రాముడిలా కీర్తి వస్తుంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ తానాజి స్వామి భక్తి పరాయణుడిగా, దేశంకోసం ప్రాణాలు అర్పించిన వీరయోధుడిగా చరిత్రలో నిలిచిపోయాడు.

### 5.3 కావ్య నాటకాలలో రసపరిశీలన :

#### 5.3.1 శృంగార రసం :

శ్రీ శివభారతం కావ్యంలో శృంగార రసం లేదు. "శివభారతమును అసంఖ్యాక Stereotype ప్రబంధములలో ఒకదానిగా కాకుండ చేసినది శృంగార రసాభావము".[5] "ఏకైక లక్ష్య సాధనమునకు జీవితము అంకితము చేసికొనిన శివాజి ఏక లక్షణ లక్షితునిగ చిత్రింపబడటం కవి ఆశించిన ప్రయోజనమునకు విరుద్ధము కాకపోయినను, సయీబాయి పాత్రకు మరింత జవము, జీవము నొసంగి శివాజీ యందలి శృంగార రసమును గూడ ప్రదర్శించి ఆ పాత్రకు సమగ్రత చేకూరెడిది" శృంగార రసం లేకపోయినా శ్రీశివభారతం కావ్యంలో ఎక్కడా లోటు కన్పించదు. శివాజీని చారిత్రక వీరుపురుషుడిగానే తీర్చిదిద్దడం రచయిత ఉద్దేశ్యం కావచ్చు.

కాని కావ్యంలో లాగే నాటకంలో కూడా శృంగారరసం లేదు. కాని ఔరంగజేబు దర్బార్‌లో ఒక గాయని పాట పాడుతుంది. ఆ పాటలో శ్రీకృష్ణుడు రావడం ఆలస్యమవడంవల్ల రాధ పొందిన అవస్థను తెలియజేస్తుంది.

**వీణినౌ – (వీణావాద్యేన గాయతః)**
**(కర్ణాటరాగేణ ఝంపాతాలేన గీయతే)**

**లతాకుఞ్జలీనా ॥**
**తృణాఙ్కే శయానా స్వబాహూ పధానా ।**

---

*5. సాహిత్య తత్వము, శివభారత దర్శనము, పు.194*

*6. శివభారతం – పరిశీలన, పు.95*

**స్వయం వీతమానా ప్రియే సావధానా ।**
**శుచావిహ్వలా తే నవీనా నిలీనా ॥ ॥ లతాం ॥ ॥1॥**

**పదం తేలపన్తీ వియోగే తపన్తీ ।**
**ముఖం స్నాపయన్తీ తనుం గ్లాపయన్తీ ।**
**రుజా క్షీయతే కాన్తహీనా నిలీనా ॥ ॥ లతాం ॥ ॥2॥**

**అవస్థానమన్తే ప్రియాయా వరంతే ।**
**విలమ్బే శుభం తే నుతాపో దురన్తే ।**
**క్షణం యాచతే నాథ దీనా నిలీనా ॥ ॥ లతాం ॥ ॥3॥**

(ఛ.సా.పు. 159)

శివరాజ :

**(రామసింహేన సహ ప్రవిశ్య సంగీత మాకర్ణ్య స్వగతమ్) అహో మద్వియోగేన దురవస్థామను భవతి మమ మహారాష్ట్ర భూమిరితి సూచితమనేన గేయపదేన ।**

(ఛ.సా.పు. 160)

రాధ పంపిన దూతిక కృష్ణుడితో అన్నమాట ఇది. రాధ పొదరిల్లులో ఉంది. చెయ్యే తలగడగా పెట్టుకొని గడ్డిమీద పడుకొని ఉంది. స్వయంగా తన గర్వాన్ని విడిచిపెట్టింది. ప్రియుడి పట్ల సావధానంగా ఉంది. శోకంతో చాలా వివశురాలై ఉంది. నూతనమైన శోకంతో మునిగిపోయినది. నీ మాటలనే మాట్లాడుతోంది నీ వియోగం చేత బాధపడుతున్నది దుఃఖంతో మోహాన్ని కదుక్కుంటోంది. ఆమెలో ఉన్న ఈ వ్యాధి చేత క్షీణించిపోతోంది. నువ్వు ఆలస్యం చేసే కొలది ఆవిడ భరించరాని అనుతాపాన్ని పొందుతోంది.

మహారాష్ట్ర భూమి తను లేకపోవడం చేత బాధపడుతోందని ఈ గానం సూచిస్తోందని శివాజీ భావిస్తాడు.

నాటకంలో శృంగారరసం నాయకుడిని ఆశ్రయించి లేదుగానీ రాధాకృష్ణుల ప్రణయం రూపంలో కన్పిస్తోంది.

నాటకంలో ఔరంగజేబు దర్బార్‌లోని గాయని శ్రీకృష్ణుడు రావడం ఆలస్యమవడం వలన రాధ పొందిన విరహవేదనని పాటలో తెలియజేస్తుంది. రాధకి శ్రీకృష్ణుడు ఆలంభన విభావము. శ్రీకృష్ణుడి యౌవన చేష్టలు ఉద్దీపన విభావాలు. శివాజీ ఔరంగజేబు దగ్గరే ఉండి మహారాష్ట్ర వెళ్ళడం

ఆలస్యం అవడం చేత మహారాష్ట్రభూమి కూడ రాధ శ్రీకృష్ణుడి కోసం తపించినట్టు తన కోసం తపిస్తోందని భావిస్తాడు. మహారాష్ట్ర భూమికి శివాజీ ఆలంబన విభావం. శివాజీ శౌర్య, ధైర్యాలు ఉద్దీపన విభావాలు.

**5.3.2 కరుణ రసం :**

శివభారతం కావ్యంలో కరుణ రసంగా అనేక ఘట్టాలలో పోషించబడింది. గోమాత హింసకు గురైనప్పుడు, లుకజీ, దాదోజీలు మరణించినప్పుడు బాజీ, తానాజీలు వీర మరణం పొందినప్పుడు కరుణ రసం అభివ్యక్తమయింది.

యవనులు గోమాతను కసాయివాళ్ళకు అమ్ముకుంటున్నప్పుడు శివాజీ –

**యమకింకరులు వోలె నదిమి పైబండి కూంత**
**క్రోవి నొక్కదు ఘాతుకులను జూచి,**
**బలివెట్టగా నొడ్డి జళిపించుచోc దళ**
**త్తళలీను వారి కత్తులను జూచి,**
**యూపిరి బిగcబట్ట, నుబికిన కడుపు డొ**
**క్కలు దన్నుకొను గుదికాళ్ళc జూచి**
**ప్రాణభయంబునన్ బదరు నెమ్మేను నీ**
**రౌలయించు తేలకన్నులను జూచి,**

**అదుకు లదుకులుగాcగ "నంబా" యటంచు**
**సుడిసికొను కూయితో మోము చొక్కc జూచి,**
**చుట్టు ముసురుచుc బ్రేవులు ప్రుక్కిపోవ**
**నఱచు లేcగను జూచి, మైమఱచె శివుcదు ॥**

(శ్రీ.శి.భా.పు.90)

**"ఇదియే ధర్మపథంబు? మానవులుగారే? జాలి లేదయ్యెనే**
**మది? మీకొండొకముల్లుc గ్రుచ్చుకొన 'నమ్మా' యంచు వాపోదురే**
**గద? మీ బిడ్డల నెవ్వcడైనc జెనకంగా వాదుకుం బోదురే**
**గద? యేదిక్కునులేని జంతువనియేగా కత్తులన్ దూయుటల్?"**

(శ్రీ.శి.భా.పు.90)

శివాజీ యమకింకరులుగా గోవుల గొంతు నులుమే ఘాతుకులను చూసి, బలి ఇవ్వడానికి పదునుపెట్టి కత్తులును చూసి, ఊపిరి బిగపెట్టి డొక్కలను, తన్నుకొనే కాళ్ళను చూసి, ప్రాణ భయంతో బెదిరే తేనెకన్నులను చూసి, అంబా అని అరిచే మొహాలను చూసి, కడుపులోని ప్రేగులు సుక్కిపోయే విధంగా అరిచే లేగదూడలను చూసి తనని తానే మర్చిపోతాడు. ఇదే నా ధర్మం. మీరు మానవులు కారా? జాలి లేదా మీకు ఒక ముల్లు గుచ్చుకొంటే అమ్మా అని అరుస్తారు. మీ బిడ్డలను ఎవరైనా ఏదైనా అంటే వాదించడానికి వెళ్తారు అలాంటి దిక్కు లేని జంతువులనే గోవుల మీద కత్తులు దూస్తున్నారని ప్రశ్నిస్తాడు.

**జీజియ దీనస్థితి :**

షాజీ నిజామ్ పక్షం వహించినప్పుడు మొఘలులు షాజీని వెతికే క్రమంలో జీజియ ఉన్న శివనేరుకి వస్తారు. అప్పుడు చిన్నపిల్లాడైన శివాజీతో ఒంటరిగా ఉన్న జీజియ పరిస్థితి వర్ణనాతీతం.

**ఉదరమ్మునంట నిన్ బొదివి, మర్కటివోలెఁ**
**బ్రతిదుర్గమున కెగఁబ్రాఁకలేక,**
**బావురుగాని యాపదఁ బాప, రాచిల్క**
**వలెఁ బంజరమున ని న్నిలుపలేక,**
**కంసు కటారిసోఁకఁగ నీక, వసుదేవు**
**వలెఁ గోకులముఁ జేర్చువాడు లేక,**
**పులివాతఁబడు గోవువలె లేఁగదరిఁ జేరి**
**దికుకలేని తనంబు దెలుపలేక,**

**యలసిపోతిఁ 'దోడులేనైతి' ననుచుఁ**
**గుమిలిపోయితి; మొగలు కక్కుతితి నెదిరి**
**ధిక్కరించితి; నీతికై తెంపుసేయ**
**నొకఁడు లేఁడయ్యెనే యంచు నుడికిపోతి ॥**

(శ్రీ.శి.భా.పు.73)

కోతిలాగా నిన్ను ఒళ్ళో పెట్టుకొని ప్రతీ దుర్గానికి వెళ్ళలేక, చిలుకవలె పంజరంలో నీకు రక్షణ కల్పించలేక, కంసుడిని నుంచి శ్రీకృష్ణుడిని రక్షించినట్టుగా నిన్ను రక్షించే వసుదేవుడు లేక, పులివాత పడిన ఆవులాగా దిక్కులేనితనాన్ని ఎవరికి చెప్పుకోలేక అలిసిపోయాను. తోడు లేక

కుమిలిపోయాను. మొఘలులను ఎదిరించి నీతికోసం పాకులాడేవాడు ఒక్కడూ లేడని ఎంతో వ్యధచెందానని శివాజీకి జీజియ చెబుతుంది.

**దాదోజీ మరణం :**

శివాజీని తండ్రివలె రక్షించి, గురువులాగా విద్యాబుద్ధులు చెప్పిన దాదోజి ఖాండదేవుడు మరణించినప్పుడు శివాజీ ఎంతో ఆవేదనకు గురై కన్నీరు కారుస్తాడు.

> **"అదురు బెదురును లేని నెమ్మదులఁ బొదిలి**
> **హైందవజగమ్ము నీకుఁ దోడౌనుగాక !**
> **భరతమాత దీవనపూలు గురియుఁ గాక !**
> **గెలువుమీ వత్స ! నే నింక సెలవుఁ గొందు !"**
>
> **అను తుదిమాట లొండొకటియై, కనుఁగొల్కుల నీటిబుగ్గతో**
> **మును కొనుజాఱుచుండ, శివు మో మెడఁబాయని నిల్వుచూపుతోఁ**
> **గనుఁగవ మూసె నస్తమయకాల రవింబలె ఖాండదేవుఁ; డా**
> **ఘనుఁ దలపోసి రెల్లరును గన్గవదోయిట నర్ఘ్య మెత్తుచున్**
>
> (శ్రీ.శి.భా.పు. 136)

చివరి శ్వాసవరకు శివాజీని మేలు కోరుకుంటున్న దాదోజి మరణించగానే శివాజీ కన్నుల వెంట కన్నీరు పెట్టుకుంటాడు. దాదోజీ రెండు కళ్ళు శివాజీ మూసేసి అస్తమించిన రవిబింబంలాగా దాదోజీ ఉన్నాడని భావించి అందరూ కన్నీరు తుడుచుకొంటారు.

**లుకజీ మరణం :**

లుకజీని నిజామ్ వధించాడని తెలియగానే జీజియ ఎంతో పరితపిస్తుంది. లుకజీ చూపించిన వాత్సల్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటుంది. లుకజీ చనిపోయేటప్పటికి జీజియ రెండవసారి గర్భవతిగా ఉంటుంది. గర్భవతిగా ఉన్న స్త్రీకి పుట్టింటిపైనే ధ్యాస ఎక్కువగా ఉంటుంది. పుట్టింటికి వెళ్ళి పురుడు పోసుకోవాలనుకుంటుంది జీజియ. కానీ ఆ సమయంలోనే జీజియ తండ్రి చనిపోతాడు.

> **మొన్న మొన్ననే గదా జననిఁ బంపుదు నంచుఁ**
> **బోతివే - యెటు మాయమైతి తండ్రి !**
> **పసుపుకుంకుముకల్మి నెసఁగు మహాలక్ష్మి**

తల్లి కీకడప్రాఁత తప్పదయ్యె !

"నే నంటిఁగాదె యక్కా ! నీకు భయమేమి"

యంటివే – యన్న ! యెందుంటివయ్య !

పూలుగందము వెట్టి పూజించునిలువేల్పు

లొకరైన వచ్చి యాదుకొనరైరె !

తొలఁగితివె నన్ను ! నీ ప్రేమ నిలయమునకుఁ

దలుపు మూసితివే తండ్రి ! తరలిపోతె !

కన్న సంతాన మిటు బైలుగాలిఁ దోలి

కన్నుఁగవ మూసికొంటివే ! కన్నతండ్రి ! ॥

(శ్రీ.శి.భా.పు.39)

మొన్న మొన్ననే గదా నా పురుటికి తల్లిని పంపిస్తానని చెప్పావు. ఎక్కడికి వెళ్ళిపోయావు? పసుపు, కుంకుమతో కళకళలాడె తల్లికి వైధవ్యం తప్పలేదే ! నేను ఉన్నాను గదా నీకు భయం ఎందుకు అన్నావు. ఎందరో దేవతల్ని పువ్వులతో పూజించావు. ఏ ఒక్కరూ నిన్ను రక్షించలేదు. నా ప్రేమ నిలయానికి తలుపు మూసేశావు. కన్నపిల్లల్ని ఇలా గాలికి వదిలి వేస్తారా అని అనంతలోకాలకి వెళ్ళిపోయిన తండ్రిని జీజియ ప్రశ్నిస్తుంది.

**బాజీ ప్రభువు మరణం :**

శివాజీ దాదోజీ, షాజీల మరణాల కంటే శివాజీని ఎక్కువ బాధించింది బాజీ ప్రభువు మరణం.

"ఎంతలో నెంతలయిపోయె ! నిపుడగాదె

సెలవుఁ గొంటివి – మరల దర్శింపలేని

సెలవు ! బాజీ ప్రభూ ! కనుల్ సెదర మెఱసి

మెఱుఁగులో తెప్పమఱుఁగులో సురిఁగి పోతె?" ॥

(శ్రీ.శి.భా.పు.284)

ఇంతలోనే ఎంతపని జరిగిపోయింది. ఇప్పుడె కద సెలవు తీసుకొన్నావు. ఇది మరలా దర్శింపలేని సెలవా? అంటూ శివాజీ మిక్కిలి దుఃఖానికి లోనవ్వడం గడియారం వేంకటశేషశాస్త్రి గారు తొమ్మిది తేటగీతి పద్యాలలో వర్ణించారు.

**తానాజీ మరణం :**

జీజియ సింహగడ్ జయించాలని కోరినప్పుడు తానాజీ వెళ్ళి మొఘలులతో పోరాడి వీర మరణం పొందుతాడు. అప్పుడు శివాజీ –

**"అంతటి ధీరమూర్తి విటులై కనుమూసితివయ్య ! తానజీ !**
**యెంతలు సేసి దైవ మెలయించె ననున్ – నినుమ్రింగ ! నీవు నా**
**కింతటిలోనె దూరమగు టే నెఱుఁగన్ గద ! బర్వుదించి ని**
**శ్చింతుండవైన యట్లు వికసించితివో ! యిఁక నాకుఁ బల్కవో !"**

(శ్రీ.శి.భా.పు.431)

ఎంతో ధీరమూర్తివి ఎలా మరణించావు. నిన్ను చంపడానికి దైవానికి ఎలా మనసొప్పింది. నాకు నువ్వు ఇంతలోనే దూరమౌతావనే సంగతి తెలియదు. ఇంక ఎప్పుడూ పిలిచినా పల్కవా అని దూరమైన తానాజీ గురించి శివాజీ విలపిస్తాడు. ఈ విధంగా కావ్యంలో అడుగడుగునా కరుణ రసం కన్పిస్తోంది.

గోవధ, జీజియ పూర్వ వైభవాన్ని కోల్పోయి భయంతో మొఘలుల నుండి శివాజీని రక్షించడం, లుకజీ, దాదోజీ, బాజీ, తానాజీల మరణాలు (ఇష్ట జనుల వియోగం) అనే విభావాల చేత కావ్యంలో కరుణరసం అభివ్యక్తమయింది.

**నాటకంలో కరుణ రసం :**

నాటకంలో శివాజీ బాజీ మరణించాడని వినగానే నిట్టూర్చి బాజీ కీర్తిని శ్లాఘిస్తాడు. బాజీ ప్రభువువంటి స్వామి భక్తులు చాలా తక్కువమంది ఉంటారంటాడు.

**(నిఃశ్వస్య) క్షత్రైకవీర, విరలాహి త్వాదృశాః స్వామి భక్తాః.**

**ప్రారబ్ధకర్మవశగాః క్రమశో వికారాన్**
**సర్వేఽనుభూయ ననుకాలవశం ప్రయాన్తి ।**
**నూనం స ఏవ నిజదేశ నరేశ భక్తో**
**ధన్యోఽస్తి యస్య నిధనం జ్వలితం యశోభిః॥**

(ఛ.సా.పు.142)

లోకంలో పుట్టినవాళ్ళు తమ ప్రారబ్దకర్మ వశంచేత క్రమక్రమంగా అనేక వికారాలు పొందుతూ,

బాల్యం, యౌవనం, వృద్ధాప్యం, రోగాలు పొందుతూ చనిపోతారు. కానీ ఎవడైతే తమ దేశం పట్ల, తమ రాజుపట్ల భక్తి గలవారై ఉంటాడో అతని మరణం యశస్సు చేత వెలిగిపోతూ ఉంటుంది.

సింహగడ్ కోసం వెళ్ళిన తానాజీ మరణించినప్పుడు కూడా శివాజీ ఉద్వేగానికి గురౌతాడు. సింహగడ్ పొందినప్పటికీ తానాజీ ప్రాణాలు పోవడంవల్ల శివాజీకి ఆనందం కలుగలేదు.

**"ద్వితీయః : - భద్ర తథాపి సింహగడ దుర్గజయేన నాసీద్దేవస్య పరమః పరితోషః**

**ప్రథమః : - అయే కథం విజయేఽప్యపరితోష ఇత్యుచ్యతే.**

**ద్వితీయః : - తద్దుర్గ జయాయ ప్రేషితస్య తానాజీ వీరస్య**
**ప్రాణాన్త సంకటేనోద్వేజితో దేవః."**

(ఛ.సా.పు. 174)

తానాజీ వీర మరణం పొందడంవల్ల శివాజీ చాలా ఉద్వేగానికి గురయ్యాడు. శివాజీకి అత్యంత విశ్వాసపాత్రులైన బాజీ, తానాజీల మరణమనే విభావాల వలన నాటకంలో కరుణరసం అభివ్యక్తమయింది.

కావ్యంలో కన్నా నాటకంలో కరుణరసం తక్కువగా పోషింపబడింది. ఎందువల్లనంటే లుకజీ, షాజీ, దాదోజీ మరణాలు కరుణ రసాన్ని కావ్యంలో ఎక్కువగా ఆవిష్కరించడానికి ఉపయోగపడ్డాయి. కావ్య నాటకాలు రెండింటిలో బాజీ ప్రభువు, తానాజీ మరణాలకి శివాజీ బాధపడడంలో కరుణ రసం అభివ్యక్తమయింది.

### 5.3.3 రౌద్రరసం :

ఔరంగజేబు శివాజీపైకి జయసింగును పంపించినప్పుడు మహారాష్ట్ర సైనికులు మొఘలులకు మధ్య హోరాహోరి పోరుసాగుతుంది.

**క్రిందునుమీఁదు జూడక తెగించి పయింబడి, యీటె పోటులన్**
**గొందలు ద్రవ్వి, బల్లెముగ్రుచ్చి, కటారులద్రవ్చి, బాకులన్**
**జందెపు వ్రేటునన్ దిగిచి, శౌర్యధనుల్ శివరాజ సైనికుల్**
**చిందులుద్రొక్కి రౌద్రవివశీకృతులై విహరించి రయ్యనిన్**

(శ్రీ.శి.భా.పు. 344)

శివాజీ సైనికులు క్రిందకిగానీ, పైకి గానీ చూడక ఏకాగ్రతతో ప్రాణాలకు తెగించి బళ్లేలతో, బాకులతో, కటాలతో గుచ్చి రౌద్రంతో యుద్ధం చేశారు.

**నాటకంలో రౌద్ర రసం :**

నాటకంలో శివాజీ అఫ్జల్‌ఖాన్‌ను వధించినప్పుడు, స్థయిస్థఖాన్‌పై దాడిచేసి అతని చేతివేలిని నరికిన సందర్భంలో రౌద్రరసం కన్పిస్తోంది.

**ద్వితీయ : "ఆలిఙ్గనమి షీణాసౌ జౌల్మోదేవం కక్షాన్తరే సంపీడ్య యావదసిప్రహారేణస్య శిరో భేత్తు ముదయుజ్ఞ తావదేవ దేవేన వ్యాఘ్రనఖైర్విపాటితమస్య బృహత్తున్దమ్. దేవస్య శిరస్త్రాణేన చ విఫలీకృతోఽస్య నిస్త్రింశ ప్రహారః. అత్రాన్తరే సాహాయ్యార్థమాక్రోశతస్తస్య పూర్వకాయో విఛ్చిన్న శ్చణ్డవి క్రమైకరసేన ధర్మావతారేణ దేవేన. తదానీమేవ దేవం ప్రహర్తుముద్యతస్తస్యాఙ్గరక్షకో యమసదనం ప్రేషితస్తానాజీవీరేణ. తతశ్చ సంకేతానురోక్రమ్య పరాస్తం బీజాపురేశసైన్య మస్మత్సేనాపతినా నేతాజీవీరేణ.** (ఛ.సా.పు.138)

ద్వితీయ : అఫ్జల్‌ఖాన్ శివాజీని కౌగిలించుకోవాలనే వంకతోటి ఖడ్గం పుచ్చుకొని చంపుదామనుకొన్నాడు. అతడు చంపేలోగానే శివాజీ తన పులిగోళ్ళతోటి అతడి కన్ను చీల్చాడు. అతడు ఖడ్గం చేత కొట్టబోతూవుంటే ఇతడు శిరస్త్రాణం ధరించడం చేత అతడి దెబ్బను అడ్డుకొన్నాడు. వాడు సహాయం కోసం అరుస్తూ ఉంటే అతని తల నరికేశాడు. అతడి అంగరక్షకుడు శివాజీ మీదికి వస్తూ వుంటే తానాజీ ఆ అంగరక్షకుడిని చంపేశాడు.

కావ్యనాటకాలు రెండింటిలోనూ రౌద్రరసం కన్పిస్తోంది. కావ్యంలో మహారాష్ట్ర సైనికులు ఆయుధాలతో మొఘలులపై దాడి చెయ్యడమనే విభావం వలన రౌద్రరసం అభివ్యక్తమయింది. శివాజి గోళ్ళతో అఫ్జల్‌ఖాన్‌ను చీల్చడం, ఖడ్గంతో తల నరకడమనే విభావాల వలన నాటకంలో రౌద్రరసం వ్యక్తమయింది.

**5.3.4 వీరరసం :**

కావ్య నాటకాలు రెండింటిలోనూ వీరం ప్రధాన రసం. మిగిలిన రసాలు అంగి రసాలుగా పోషింపబడ్డాయి. వీరరసంలో అంతర్భాగాలైన దాన, దయ, ధర్మ, యుద్ధ వీరాలు కూడా పోషింపబడ్డాయి.

నాటకంలో కావ్య, నాటకాలు రెండింటిలోనూ నాయకుడు శివాజీ చారిత్రక యుగపురుషుడు. చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొన్నాడు. తన తండ్రి నవాబుల పక్షం, తాత మొఘలుల

పక్షం వహించినా, తను నమ్ముకున్న సిద్ధాంతానికి, తల్లికి ఇచ్చిన మాటకి కొన ఊపిరిదాకా కట్టుబడి ఉంటాడు శివాజీ. శివాజీ వీరత్వానికి ప్రతీక.

శివాజీ క్షత్రియుడు. క్షత్రియుడు తన బాహువుల మీద ఆధారపడి జీవిస్తాడు. శివాజీ గోరక్షణ, హైందవమత పునరుద్ధరణకు పూనుకొంటాడు. అఫ్జల్‌ఖాన్ శివాజీపై దాడి చేయడానికి వస్తూ దారిలో పంటపొలాల్ని నాశనం చేస్తాడు. గోవులను, స్త్రీలను హింసిస్తాడు. షాజీ మొఘలులతో యుద్ధం చేస్తున్న సమయంలో షాజీకి సహాయం చేయకుండ శంభాజి మరణానికి కారణమౌతాడు. షాజీ చెరసాలలో మ్రగ్గిపోవడానికి కారణం కూడా అఫ్జల్‌ఖానే. జీజియకూడ ఖాన్‌ను వధించమని ఆదేశిస్తుంది. అందువల్ల అఫ్జల్‌ఖాన్‌ను శివాజీ చాలా క్రూరంగా చంపుతాడు.

**బిగువౌ సందిట నొక్కి, గొంతు నెడచే బిట్టూఁది, ఖా నుండదా**
**టుగ వాలున్‌గొని వ్రేయగా, శివవిభుండున్ మోసమౌటెంచి, బ**
**ల్పగు పూన్కిన్ జమకించి పట్టుబికి వాయన్ దూసి, డా కేలునన్**
**మొగచాటా పులిగోళ్ళ ఖానునుదరంబున్ జీల్చె నుగ్రాకృతిన్ ॥**

(శ్రీ. శి. భా. పు. 258)

**జందెపు వ్రేటునన్ జొనిపి, సవ్య భుజంబుననుండి కుక్షికిన్**
**గ్రిందుగ దూయఁగాఁ దిగిచి, ప్రేవులు నెత్తురుఁ బాఱఁ జీల్చి శ**
**త్రుందునిమెన్ శివప్రభుడు; రోఁజుచు ఖానుగతాసుఁడయ్యె; నీ**
**నందడి నింతలో నెఱిగి సయ్యదుబందు కృపాణపాణియై ॥**

(శ్రీ. శి. భా. పు. 259)

ఖాన్, శివాజీ ఒకరినొకరు కౌగిలించుకుంటూ ఉండగా ఖాన్ శివాజీ గొంతు నొక్కుతాడు. ఈలోగా శివాజీయే చాకచక్యంగా ఖాన్‌ను చేతితో గట్టిగా పట్టుకొని పులిగోళ్ళతో ఖాన్ ఉదరాన్ని చీల్చుతాడు. మెడక్రింద భాగం నుంచి చీల్చి ప్రేగులు, నెత్తురు బయటికి వచ్చేటట్టు చంపుతాడు.

షాజీ తనకు అన్యాయం చేసిన బాజీ ఘోరపటుని చంపమని శివాజీకి ఉత్తరం రాస్తాడు. షాజీ ఆజ్ఞమేరకు శివాజీ ముధోళ్పురం వెళ్ళి బాజీ ఘోరపడుడి ఇంటిని చుట్టిముట్టి అతడిని చంపుతాడు.

**విశ్రుత విక్రమక్రముడు వీరవరుం డతఁ డొంటిచేతి భూ**
**రిశ్రయుఁడయ్యు దయ్య కెదిరింపుచు, దాపలికేలి వాలుతో**

**నశ్రమధాటిఁ బైపడె; దురాగ్రహుఁడై శివరాజు శాతఖ**

**డ్గాశ్రిఁ దదీయ మస్తకము నంబర వీధికిఁ జిమ్మె నార్చుచున్ ॥**

(శ్రీ.శి.భా.పు. 293)

వీరుడైన శివాజీ ఒంటి చేతితో బాజీ ఘోరపటుడిని ఎదిరిస్తూ కోపంతో ఉగ్రుడై శివరాజు ఖడ్గంతో శత్రువు మస్తకాన్ని ఖండిస్తాడు. ఇంకా శివాజీ స్థయిస్తఖాన్‌పై దాడి చెయ్యడం అతడి చేతి వేలిని నరకడం వంటి విషయాలు శివాజీ వీరత్వానికి ప్రతీకలు.

**దయావీరం :**

శివాజీ కత్తి పట్టుకొని తలను నరకడమే కాదు శరణు కోరిన శత్రువును కూడ క్షమించగల ధీరుడు.

గోవులను హింసిస్తున్న వారిపై శివాజీ దాడి చేస్తున్న సందర్భంలో వారు –

**"మము మన్నింపుము; పొట్టకూటికిది యే మార్గమ్ముగా నమ్మియుం**

**టిమి; పాపమ్ములఁ జేసియుంటిమి; కడున్నీచమ్ముగా నిందు విం**

**టిమి, మీయాన భరింపనుంటి" మనుచున్ దెందమ్ములన్ విప్పి దీ**

**నముగా వేఁడ శివుండు వారిమది నాంతర్యంబు మన్నించుచున్" ॥**

(శ్రీ.శి.భా.పు. 91)

పొట్టకూటికోసమే గోవులను హింసిస్తున్నాం మేము పాపం చేశామని ఒప్పుకొంటే శివాజీ వాళ్ళని క్షమించి విడిచిపెడతాడు.

పోర్చుగీసువారు అబిస్థీనియ వారు శివాజీతో యుద్ధం చేయగా శివాజీ విజయం సాధిస్తాడు. పోర్చుగీసు, అబిస్థినీయ సైనికులు శరణు వేడగా –

**ప్రేసిన రాము బాణమున వీఁగి జగత్రయిఁ బర్వులెత్తు కా**

**కాసురునట్లు వారు జగమంతయుఁ గ్రుమ్మరి, దాఁపులేక సం**

**త్రానము నొంది కుంది శివరాజుపదద్వయి ముట్టి భక్తి వి**

**న్యాసముఁ జూపి; రాతఁడు దయామయుడై శరణంబొసంగుచున్ ॥**

(శ్రీ.శి.భా.పు. 295)

**ఎవరి రాజ్యము వారికిచ్చి యవ్వారి రా**
**బడిలో సగంబు కప్పమిదునట్లు**
**మూడువేల తురంగముల సేనతో యుద్ధ**
**ములఁ దోడుపడి తన్నుఁ గొలుచునట్లు**

(శ్రీ.శి.భా.పు.295)

శివాజీని శరణు వేడగానే శివాజీ ఎవరి రాజ్యం వారికి ఇచ్చి మూడువేల గుఱ్ఱపు సేనతో తనకు తోడుగా యుద్ధానికి రమ్మంటాడు. ఈ విధంగా శివాజీ అందర్ని కలుపుకుంటాడు.

**యుద్ధవీరం :**

శివాజీకి అఫ్జల్‌ఖాన్‌తో శతృత్వం ఉంది. అఫ్జల్‌ఖాన్ సైనికులపై కాదు. అందువల్ల అఫ్జల్ ఖాన్ సైనికులను క్షమించి విడిచిపెడతాడు.

**శివపతి యింతయున్ దెలిసి సేనల కీగతి నాజ్ఞచేసె "నా**
**హవమునఁ బాఱువాని, శరణాగతు, శస్త్రమువీడువాని వె**
**న్దవిలి వధింపరా, దకరుణంబుగ నెత్తురు వార్పరాదు; వా**
**రి వివిధ సాధనంబుల హరింపుచు, నూరక సాగనంపుడీ!"**

(శ్రీ.శి.భా.పు.261)

అఫ్జల్‌ఖాన్ మరణించిన కారణంగా అతని సైన్యాన్ని శివాజీ ఏ మాత్రం శిక్షించక వాహనం లేని వారిని, శస్త్రాన్ని వీడినవారిని వధించక వదిలిపెట్టి వారి ఆయుధాలు తీసుకొని పంపించమంటాడు. ఈ సంఘటన శివాజీ యుద్ధ వీరానికి మచ్చుతునక.

**ధర్మవీరం :**

శివాజీ ఎంత వీరుడైనా ధర్మాన్ని ఎప్పుడూ తప్పడు. స్త్రీల పట్ల గోవుల పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తాడు. శివాజీ సేన కల్యాణ ప్రాంతాన్ని అక్కడ లభించిన ధనకనకాల్ని శివాజీకి సమర్పిస్తారు. కల్యాణ ప్రాంతానికి చెందిన రాణివాసపు స్త్రీ కూడ తీసుకువచ్చి శివాజీకి సమర్పిస్తారు. శివాజీ ఈ చర్యకి కోపోద్రిక్తుడౌతాడు.

**"ఆ – యేమీ? యొక రాణివాసమును బుణ్యావాసమున్ దెచ్చి నా**
**వా? యే హైందవుఁడైన నీ గతి నమర్యాదన్ బ్రవర్తించునే?**

**మా యాజ్ఞన్ గమనింపవో? జయ మదోన్మాదంబునన్ రేఁగి, నీ**
**యాముస్స్వత్రములీవ(త్రుంచుకొనెదో? యౌద్ధత్యమోర్వన్ జుమీ"**

(శ్రీ.శి.భా.పు.154)

**శివరా జంతట మేల్మొసుంగుఁ దెరలో - స్నిగ్ధాంబుద చ్ఛాయలో**
**నవ సౌదామినిఁ బోలు నా యవనకాంతా రత్నమున్ భక్తి గౌ**
**రవముల్ వాఱఁగఁ జూచి పల్కె "వనితారత్నంబు లీ భవయ హైం**
**దవభూ జంగమ పుణ్య దేవతలు; మతా ! తప్పు సైరింపుమీ !**

(శ్రీ.శి.భా.పు.155)

రాణివాసంలో ఉన్న పుణ్యంగా భావించే స్త్రీలను తీసుకువస్తావా, హైందవులు ఈ విధంగా ప్రవర్తిస్తారా? జయం పొందామని ముదంతో మెలగవచ్చా నీ ఆయువుని నీవే తీసుకొనే ప్రయత్నం చేస్తున్నావని మందలిస్తాడు. మేలిమి ముసుగులో ఉన్న ఆ స్త్రీ రత్నాన్ని చూసి భక్తి, గౌరవాలతో స్త్రీలు హైందవభూమిపై ఉన్న పుణ్యదేవతలు తమ తప్పు క్షమించమని శివాజీ స్వయంగా తానే క్షమాపణ చెబుతాడు. ఆమెను భద్రంగా ఇంటికి చేర్చి తన ధర్మవీరాన్ని చాటుకుంటాడు.

**దానవీరం :**

శివాజీ తన గురువైన సమర్థరామదాసుడికి తన రాజ్యాన్ని తృణ ప్రాయంగా దానం ఇచ్చేస్తాడు. దీనికి ఉదాహరణగా శివాజీ పాత్రపోషణలో ధర్మాకలనంలో "తమయాజ్ఞన్.... దండంబుగన్ అనే పద్యాన్ని ఉదాహరణగా ఇచ్చాను.

శివాజీ అఫ్జల్‌ఖాను సంహరించే సమయంలో చూపిన పరాక్రమం, శత్రువులను కూడ క్షమించి విడిచిపెట్టగల ఔదార్యం, పరస్త్రీలను పరదేవతగా కొలిచే నీతి రాజ్యాన్ని సమర్ధ రామదాస స్వామికి దానంగా ఇచ్చే త్యాగమనే విభావ, అనుభవాల వలన కావ్యంలో వీరరసం అభివ్యక్తమయింది.

**నాటకంలో వీరరసం :**

నాటకంలో కూడ ప్రధాన రసం వీరమే. నాటకంలో కూడా అఫ్జల్‌ఖాన్ వధించడంలోనూ, స్థయిస్తఖాన్‌ను ఎదురించడంలో శివాజీ వీరత్వం ప్రదర్శింపబడుతుంది. వీరం అంతర్భాగాలైన దయా, యుద్ధ వీరాలు కూడా నాటకంలో కనబడతాయి.

కావ్యంలో శివాజీ ఒక్కడే వీరుడు కాదు. మొఘలులకు వ్యతిరేకంగా పోరాటం చేసి షాజీ, శివాజీ కోసం ప్రాణాలు అర్పించిన బాజీ ప్రభువు, సింహగడ్ జయించడానికి వెళ్ళిన తానాజీలు

కూడ వీరులే. షాజీ, బాజీ ప్రభువు, తానాజీల పాత్రలలో కూడ వీర రసం మిక్కుటంగా కన్పిస్తోంది. అనేకమంది వీరుల కలయికయే ఛత్రపతి సామ్రాజ్యం.

నాటకం ప్రథమాంకంలో శివాజీ ధర్మ రాజ్యాన్ని స్థాపించడమే తన లక్ష్యమని పేర్కొంటాడు.

**తద్వయస్యాః !**<br>
**ఉద్ధర్తుమేనాం పరిపీడితాం భువం**<br>
**ధర్మచ్యుతైరున్మాద రాజ సంఘైః ।**<br>
**సామ్రాజ్య సంస్థాపన మన్తరేణ**<br>
**నవర్తతేఽన్యాఽర్థకారీ ప్రతిక్రియా ॥**

**అపి చాతతాయిభ్యః స్వప్రజానిర్విశేషం ప్రజానాం పరిపాలనమేవ సర్వత్ర రాజ్ఞాం పరమోధర్మః అతోధర్మరాజ్య సంస్థాప నోద్యతస్యమమ.**

**దుర్వృత్త భృత్యాహిత రాజ్య భారాః**<br>
**ప్రజాద్రుహశ్చార్థపరాః కుశీలాః ।**<br>
**క్షత్రీశ్వరా వా యవనేశ్వరా వా**<br>
**సద్యో భవిష్యన్తి కృపాణగోచరాః ॥**

(ఛ.సా.పు. 95)

పరపీడితమైనటువంటి ఈ భూమిని ఉద్ధరించాలంటే సామ్రాజ్యాన్ని స్థాపించాలి. ఎవరైనా శత్రువులు హాని చేస్తే ప్రజలను రక్షించడమే రాజు కర్తవ్యం. నేను ధర్మ రాజ్యాన్ని స్థాపించాలని నేననుకుంటున్నాను. కాబట్టి ఇటు రాజులు అటు యవనులు నా కత్తికి బలౌతారని శివాజీ ప్రతిజ్ఞ చేస్తాడు.

ధర్మమార్గంలో లేని క్షత్రియుల్ని, యవనుల్ని తన కత్తితో సంహరిస్తానంటాడు. అన్నట్టుగానే శివాజీ హైందవ ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించిన శ్యామరాజు అనే క్షత్రియుడిని, అఫ్జల్‌ఖాన్‌ని సంహరిస్తాడు.

**విక్రీయ దేశకులధర్మయశోఽభిమానం**<br>
**మ్లేచ్ఛాధిపాయ నమనాగపి లజ్జసేత్వమ్ ।**<br>
**ఆక్రమ్య లుబ్ధక గణైరపి పాశబద్ధః**<br>
**కింవాశ్వవృత్తిమభినన్దతి సింహశావః ॥**

**ఇతి । పరంతు ప్రత్యాసన్న మరణేన తేన సర్వథా ప్రత్యాక్షిప్తం దేవస్య మన్త్రితమ్. తతశ్చ సమిద్ధమన్యునా దేవేనాసౌ క్షత్రకులాపసదః క్షిప్రమేవ యమాలయం ప్రేషితః**

(ఛ.సా.పు. 123-124)

స్వదేశానికి, స్వవంశానికి, స్వధర్మానికి సంబంధించినటువంటి యశస్సుని, అభిమానాన్ని అమ్మేసుకొని మ్లేచ్ఛాధిపుని ఆశ్రయాన్ని పొందడానికి నీకు సిగ్గులేదా? కిరాతకులచేత బంధింపబడిన సింహపు పిల్లని కుక్క అభినందించగలుగుతుందా? ఈ విధంగా శివాజీ సందేశాన్ని పంపించినప్పటికీ ఆ క్షత్రియుడికి మరణకాలం సమీపించడం వల్ల శివాజీ సలహాని లెక్కపెట్టక తిరస్కరిస్తాడు. రాజుకి కోపం పెరిగి అతడిని వధిస్తాడు.

అఫ్జల్‌ఖాన్‌ను కూడ సంహరించడం వల్ల శివాజీ లోకోత్తరమైన కీర్తి కల్గింది. అలాగే అఫ్జల్‌ఖాన్ సైన్యం శరణుకోరితే వారిని కరుణించి తన సైన్యంలోకి చేర్చుకోవడం యుద్ధవీరంగా కల్యాణీ ప్రాంతపు రాణీవాసపు స్త్రీ పరదేవతగా భావించడం ధర్మవీరంగా చెప్పవచ్చు.

కళ్యాణి ప్రాంతాన్ని స్వాధీనపరచుకొని ఆ పాలకుడిని బంధించి ఏం చెయ్యాలి అని శివాజీని సేవకులు అడిగినపుడు శివాజీ చెప్పిన సమాధానం ఇది.

**"సద్యస్తం కారాగృహాద్విముచ్య యథార్హోపచారైశ్చ సంభావ్య విసర్జయ".**

(ఛ.సా.పు. 115)

ఆ కళ్యాణ ప్రాంతపు పాలకుడు వెంటనే కారాగారం నుండి విడిచిపెట్టి తగిన ఉపచారాలు చెయ్యండి. శివాజీ మానవతా దృష్టితో ఆలోచించి శత్రువుని కూడా మిత్రుడిలా చూస్తాడు. ఇదే శివాజీ కరుణ వీరం.

తన ప్రాణాలు పణంగా పెట్టి రాజ్యాన్ని, శివాజీని రక్షించిన బాజీ ప్రభువు పట్ల కృతజ్ఞతగా శివాజీ **"ఆయే దుర్గపాల భవతు రాజోపచారేణ మమ వీరస్యాన్త్యక్రియా. అద్యైవాహం తస్య రాజభక్తస్య సప్తపుత్రాన్ మమాఙ్గరక్షకపదేనియుఞ్జ."** (ఛ.సా.పు. 142)

బాజీ ప్రభువుకి రాజలాంఛనాలతో అంత్యక్రియలు చేసి అతడి ఏడుగురి కుమారుల్ని తన అంగరక్షకులుగా నియమించి వాళ్ళకి ఆశ్రయం ఇచ్చి బాజీ ప్రభువు ఋణం తీర్చుకొని తన దయావీరాన్ని చాటుకుంటాడు.

శివాజీ స్థయిస్తఖాన్‌ను ఎదిరించడంలోనూ శ్యామరాజుని చంపడంలోనూ, అఫ్జల్‌ఖాన్‌ను సంహరించడంలోనూ చూపిన పరాక్రమం, కల్యాణ ప్రాంతాన్ని పాలించే పాలకుడిని ఉపచారాలు

చేయించడం, బాజీ ప్రభువు కుమారుల్ని అంగరక్షకులుగా నియమించుకోవడంలో నీతి అనే విభావ అనుభావాల వలన నాటకంలో వీరరసం పుట్టింది.

కావ్యనాటకాలు రెండింటిలో శివాజీ యుద్ధవీరానికి, ధర్మ వీరానికి ప్రతీకగా నిలుస్తాడు. కానీ రామదాసుకి రాజ్యం దానం చేసినట్టు నాటకంలో లేదు. నాటకంలో కూడ బాజీ ప్రభువు, తానాజీ వీరులు త్యాగాలు వీరరసాన్ని తార స్థాయికి తీసుకెళ్ళతాయి.

**5.3.5 బీభత్స రసం :**

బీభత్సానికి స్థాయి భావం జుగుప్స. సింహ్‌గడ్ సాధించడానికి వెళ్ళిన తానాజీ వైరులతో యుద్ధం చేసిన తీరు బీభత్స రసభరితంగా ఉంది.

**గుమికొన్న రిపులపైఁ గుప్పించి పిడిబాకు**
**పదనూరఁ దెగువార గుదిమి గుదిమి,**
**పయిదూఁకురిపులు చేద్వడ వేఁటకొడవంట**
**నలిరేఁగి మునుమెత్తి నఱికి నఱికి,**
**కవిసినరిపుకోటి ఖడ్గముల్ కంఠముల్**
**చివ్వి మిన్నంటఁగా జిమ్మి జిమ్మి,**
**పెనువీకఁమైఁ ద్రోసికొనివచ్చు నరిసేన**
**గదులుగట్టఁగ నీఁటెఁ గ్రుచ్చిఁ గ్రుచ్చి,**
**తెఱిపిగొని వింట శరపరంపరలు గురిసి,**
**విరియు మొనఁ జాపకట్టుగా సురుఁగఁ గొట్టి**
**వెలుఁగు చీకట్లపొత్తులో నులిమి పులిమి**
**పిడిచి వడిఁగట్టి తానాజి వేఁటలాడె ॥**

(శ్రీ.శి.భా.పు.423)

తానాజీ శత్రువులపై పిడిబాకు గుదిమి, వేటకొడవళ్ళతో నరికి, ఖడ్గంతో కంఠాలు ఆకాశాన్ని అంటే చిమ్మి శత్రువులు సేన కదలకుండ ఈటెను గ్రుచ్చి, ఆగకుండ బాణాలు ప్రయోగించి తానాజి శత్రువులందర్ని సంహరించాడు. ఈ విధంగా శత్రువులను చంపడం జుగుప్సను కలిగిస్తోంది.

అనిష్టములైన (అనిష్ట శ్రవణ దర్శన కీర్తనాదిభః) శత్రువు సంహారమనే విభావం వలన కావ్యంలో బీభత్సరసం అభివ్యక్తమయింది. నాటక లక్షణాలను అనుసరించి నాటకంలో యుద్ధాన్ని వర్ణించకూడదు. అందువలన నాటకంలో బీభత్సరసం లేదు.

**5.3.6 అద్భుతరసం :**

అద్భుత రసానికి స్థాయి భావం విస్మయం. శివాజీ తన అభీష్టం మేరకు గోరక్షణ చేసినప్పుడు జీజియ ఎంతో ఆనందిస్తుంది.

**"ఆఱని చెమ్మరింత యుదుకాఱియు నాఱని మేనc దోcప, వి**
**ప్పారిన కంటితో నడుగులంటిన పుత్రకు నెత్తి, జీజియా**
**యూఱట లేని యాతురత నొగ్గి, శివుండు వచింపcగా సమా**
**చార మెఱింగి, విస్మయ రసంబునc దోcగుచు నిట్లు వాకొనన్"**

**"కొమరారున్ దగుధర్మమౌచుc దనయా! గోదేవతా ప్రాణదా**
**నము; కౌలీన ముదాత్త లక్షణము నూత్నస్ఫూర్తి నీయందు రూ**
**పమరెన్; ధూర్వహు లెందఱో ధరణి లేరా ! నీకుcగా నిల్పి రు**
**త్తమపుణ్యంబిది; సంతరించితివి పెద్దల్ పిన్నలున్ మెచ్చcగన్**

(శ్రీ.శి.భా.పు.92)

గోవులను రక్షించాలనే ఉదాత్తమైన లక్షణాలు నీలో ఉన్నాయి ఎందరో రాజులు భూమి మీద ఉన్నారు. నీకు వారందరికి లేని పుణ్యం నీకు వచ్చింది. అందరూ మెచ్చుకొనే విధంగా గొప్పపని చేశావని ఆశ్చర్యానికి గురౌతుంది.

నాటకంలో కూడ అద్భుతరసం కన్పిస్తోంది. శివాజీ ఔరంగజేబు నుండి బయటపడిన తరువాత యతివేషంలో ఉన్న శివాజీని చూసి జీజియ విస్మయం చెందుతుంది. ఇదే ఉదాహరణ వత్సల రసానికి ఉదాహరణగా ఇచ్చాను. ఇక్కడ అద్భుతరసానికి స్థాయీ భావం అయిన విస్మయం కన్పిస్తోంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ అద్భుతరసం కన్పిస్తోంది. జీజియాకి హైందవ ధర్మాన్ని కాపాడడం ఇష్టం. జీజియాకి ఇష్టమైన గోరక్షణ (ఈప్సిత మనోరథాప్తి) అద్భుతరసానికి విభావం. జీజియ కన్నీరు, రోమాంచం అద్భుతరసానికి భావాలు. నాటకంలో ఔరంగజేబు నుండి తప్పించుకొని సన్యాసి రూపంలో వచ్చిన శివాజీని చూసి జీజియ ఆశ్చర్యానికి లోనౌతుంది. కుమారుడు శత్రువుల నుండి బయటపడి స్వదేశానికి రావడమనే కోరిక జీజియాకి తీరడం అద్భుతరసానికి విభావం. ఈ విభావ అనుభావాల వలన కావ్య నాటకాలలో అద్భుతరసం అభివ్యక్తమయింది.

**5.3.7 శాంతరసం :**

**అథ శాన్తో నామ శమస్థాయిభావాత్మకః మోక్షప్రవర్తకః స తు తత్త్వజ్ఞాన వైరాగ్య - ఆశయశుద్ధ్యాదిభిః విభావైః సముత్పద్యతే. తస్య యమ - నియమ - ఆధ్యాత్మ ధ్యాన-ధారణ-ఉపాసన - సర్వభూతదయా - లిఙ్గగ్రహణాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః వ్యభిచారిణాశ్చాస్య నిర్వేద - స్మృతి - ధృతి - సర్వాశ్రమ - శౌచ - స్తమ్భ - రోమాఞ్చాదయః."[7]**

శమం స్థాయి భావంగా గల శాంతరసం మోక్షమార్గంలో ప్రవర్తింపచేస్తుంది. అది తత్వజ్ఞానం, వైరాగ్యం, అంతఃకరణశుద్ధి మొదలైన విభావాలచేత పుడుతుంది. యమ - నియమ - ఆత్మతత్త్వ ధ్యాన - ధారణ - ఉపాసనములు, సర్వభూతములపట్ల దయ, లింగగ్రహణము అనగా వైరాగ్య చిహ్నాలైన కాషాయవస్త్రాదుల గ్రహణం మొదలైన విభావాల చేత శాంతరసాభినయం ప్రయోగించాలి. నిర్వేదం, స్మృతి, ధృతి, సర్వాశ్రమ, శుచిత్వము, స్తంభము. (అన్ని ఆశ్రమాలలోను శుచిత్వం) రోమాంచం మొదలైనవి దీని వ్యభిచారిభావాలు.

శివాజీ చిన్నప్పుడే తండ్రికి దూరం అవుతాడు. తండ్రిలా చూసుకొనే దాదోజీ మరణిస్తాడు. అటువంటి పరిస్థితులలో శివాజీకి ఎన్నో సందేహాలు, శంకలతో సతమతమౌతాడు.

**అది యగునేని రాచతికమం చొకబంధ మిదేల? యెవ్వరే**
**నొదుఁగుచు రాజకల్పిత నియోగములన్ జనుటేల? యిట్టి సం**
**పద యెటగల్గె రాజునకు? బాపము లాతని కంటివో? బలో**
**న్మదమున రేఁగి పైకొనెదు మానవులెల్లరు రాజు లౌదురో?**

(శ్రీ.శి.భా.పు.163)

రాజుకి పాపాలు అంటవా? బలోన్మాదంతో ప్రవర్తించే మానవులందరూ రాజులౌతారా అని శివాజీ రామదాసస్వామిని ప్రశ్నిస్తాడు.

**ఇది దరిలేనిసాగర - మహింసయు హింసయు నిర్ణయింప, నె**
**య్యదనునఁ బ్రాణకోటి కహితా చరణం బదిహింస; యైన స్వా**
**భ్యుదయముఁగోరిగాక జగదున్నితికై యొనరించు కార్యమం**
**దొదవిన హింసయున్ ఫలశతోన్నతమౌచు నహింస నాఁబడున్.**

(శ్రీ.శి.భా.పు.167)

---

7. *నాట్యశాస్త్రమ్ ఆంధ్రభాషావ్యాఖ్య, పు. 235*

స్వార్థంతో కాకుండ జగాన్ని ఉద్ధరించడానికీ చేసేహింస అహింస అనబడుతుందని రామదాసు వివరిస్తాడు. రామదాసు దగ్గర శివాజీ అనేక ప్రశ్నలకు సమాధానాలు విని స్వాంతన పొందుతాడు. తన మనస్సును శాంతి పరచుకుంటాడు. కావున ఇది శాంతిరసంగా చెప్పుకోవచ్చు.

**నాటకంలో శాంతరసం :**

నాటకంలో కూడ శివాజీ రామదాసుల మధ్య సంభాషణలో శాంతరసం కన్పిస్తోంది.

**శివరాజ : (ఉత్థాయ) ప్రతిగృహితాశీః సనిర్వేదం భగవన్ అథ మయా యావజ్జీవం కిమేవమేవ హింసా ప్రధానో ధర్మో నుష్ఠేయః.**

శ్రీరామదాసః :

**లోకసంగ్రహపరైర్జితాత్మభిః**
**కర్మయోగనిరతైర్నృపోత్తమైః ।**
**పాప్మనాం ప్రమథనే ప్రకల్పితో**
**ధర్మతన్త్రమపిబాధతే నయః ॥**

పరంతు

**ధర్మ ప్రవృత్తాః పరిపన్థినస్త్వయా**
**సామ్నైవ రాజన్ స్వవశం విధేయాః ।**
**నధర్మ గుప్తే హి నయప్రయోగాః**
**కదాచిదప్యర్థపరా భవన్తి ॥**

**ఏవం ధర్మనయ ప్రతిష్ఠితేన చత్వయం నానాధర్మాః ప్రజాః సమబుద్ధైః పాలనేయాః యతః**

(ఛ.సా.పు. 124-125)

శివాజీ రాజైనవాడు జీవించి ఉన్నంతకాలం హింస చేస్తూనే ఉండాలా అని ప్రశ్నించగా దీనికి సమాధానంగా రామదాసు లోకకల్యాణం కోసం పనిచేసేవారు, జితేంద్రియులైనవారు, ఫలాపేక్ష లేకుండా పనులు చేసేవారు, అటువంటి ఉత్తమ రాజులచేత పాపాత్ములను చంపడానికి అవలంభించే నీతిమార్గం ధర్మాన్ని కూడ బాధిస్తుంది. కానీ ధర్మ ప్రవృత్తిలో ఉన్న శత్రురాజుల విషయంలో ఈ హింస లేకుండా సామోపాయంతో వాళ్ళని దారిలోకి తెచ్చుకోవాలి. ధర్మ మార్గంలో నడుస్తున్న నువ్వు అనేక ధర్మాలు ఆచరించే ప్రజలందర్ని సమానదృష్టితో చూడాలని చెప్పాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ అనేక శంకలతో, సతమతమౌతున్న శివాజీ మనస్సు రామదాసుని వచనాల ద్వారా స్వాంతన పొందుతుంది. రామదాసుని ఉపదేశాల ద్వారా శివాజీ మరింత ఉత్సాహంతో శివాజీ కర్తవ్య నిర్వహణకు పూనుకొంటాడు.

శివాజీ రాజ్యస్థాపన చేయడానికి శత్రువులను సంహరించాలి. శివాజీకి హింసామార్గం ఇష్టం ఉండదు. ఈ సమయంలో శివాజీకి వైరాగ్యం కలుగుతుంది. ఈ వైరాగ్యమనే విభావం వలన కావ్యనాటకాలలో శాంతరసం అభివ్యక్తమయింది.

**5.3.8 వత్సల రసం :**

జీజియ నిజామ్‌వల్ల, మొఘలుల వల్ల అనేకపాట్లు పడింది. తన తండ్రి మరణించాడు. భర్త తనకు దూరమయ్యాడని చింతిస్తూ ఉండగా శివాజీ ఆమెకు ధైర్యాన్ని నూరిపోస్తాడు. భోన్సలే కులంలో పుట్టిన వీరుడు స్వతంత్ర రాజ్యాన్ని స్థాపిస్తాడని మా తాత గారికి భవానిదేవి వరం ఇచ్చింది కదా నువ్వు ఎందుకు దిగులుపడతావు అంటూ తల్లికి ధైర్యాన్ని చెబుతాడు.

> **"అనుటన్ దానమృతాభిషేకమునయట్లై జీజియాబాయి పు**
> **త్రునిఁ జేయారఁ గవుగలించుకొని, ముద్దుంగొంచు, "నా తండ్రి! నీ**
> **వనుమాటల్ గొను కార్యముల్ గెలిచి, దీర్ఘాయుర్యశో వీర్య వ**
> **ర్ధనత న్మించుము; వజ్రవర్మ మవుగాత న్నీకు నాదీవనల్"**
>
> (శ్రీ.శి.భా.పు.75)

శివాజీ మాటలు విన్న జీజియ ఎంతో సంతోషంతో పుత్రుడిని కౌగిలించుకొని ముద్దుపెట్టుకొని నీవన్న మాటలు నిజం అవ్వాలి. నీవే ఆ కార్యాన్ని సాధించి సామ్రాజ్యాన్ని నిర్మించమని దీవెనలు ఇస్తుంది.

**నాటకంలో వత్సల రసం :**

నాటకంలో కూడ వత్సల రసం కన్పిస్తోంది. ఔరంగజేబు మందిరంలో బందీగా ఉన్న శివాజీ చాలా రోజుల తరువాత బయటపడి యతి వేషంలో తల్లి దగ్గరికి వస్తాడు.

**ప్రధానయతిః :- అమ్బ నాతిదూరం వర్తతే తవాత్మజః. (ఇతి యతివేష మపనీయ) ఏష సుఖ ప్రత్యాగతః శివరాజోఽభివాదయతే. (ఇతి పాదయోః పతతి)**

**రాజమాతాః :- (సవిస్మయమ్) అహోః వత్స శివరాజః. నఖలు మయాఽభిజ్ఞాతోఽసి (సానన్దాశ్రు హస్తయోర్గృహీత్వా) వత్స ఉత్తిష్ఠ । దిష్ట్యాద్యోజ్జీవితాస్మి**

**ముక్తస్య దుష్టయ వనాధిపపాశ బన్ధాత్.**
**ప్రత్యాగతస్య పురతో మమ సంస్థితస్య ।**
**ఏతత్తవానన ముపోధనవ ప్రసాదం**
**మాం తర్పయత్యతితరాం తరుణేన్దుకాన్తమ్ ॥**

(ఛ.సా.పు. 168)

ప్రధానమంత్రి : అమ్మా మీ కుమారుడు మీకు దగ్గరలోనే ఉన్నాడు. సుఖంగా తిరిగివచ్చిన శివరాజు మీకు నమస్కరిస్తున్నాడు.

రాజమాతా :- కుమారా శివరాజ నేను నిన్ను గుర్తుపట్టలేకపోయానని ఆనంద భాష్పాలతో అతనిని చేతిలోకి తీసుకొని దైవవశాత్తు మళ్లీ నేను బతికాననంటుంది.

దుష్టుడైన యవనరాజు పాశబంధం నుండి బయటపడ్డటువంటి, తిరిగివచ్చి ఎదురుగా ఉన్నటువంటి నూతనమైన ప్రసన్నత కలిగిన అప్పుడే ఉదయించిన చంద్రుని వలె ప్రకాశిస్తూ ఉన్నటువంటి నీ ముఖం నన్ను మిక్కిలి ఆనందపరుస్తోంది. శివాజీ యవనుల నుండి తిరిగి రావడం జీజియ పునర్జన్మ ఎత్తినట్టు భావిస్తుంది. అతడిని ఆనందంతో దగ్గరికి తీసుకొని పొంగిపోయి తన వాత్సల్యాన్ని వ్యక్తపరుస్తుంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వత్సలరసం కన్పిస్తోంది. జీజియాకి పుత్రుడైన శివాజీ ఆలంభనం. శివాజీ శౌర్యం ఉద్దీపన విభావం. జీజియ శివాజీని ఆలింగనం చేసుకోవడం ముద్దాడడం వత్సల రసానికి అనుభావాలు. ఈ విభావ, అనుభావాల వలన కావ్య నాటకాలలో వత్సలరసం అభివ్యక్తమయింది. అయితే కావ్యంలో శివాజీ స్వతంత్ర రాజ్యాన్ని స్థాపిస్థానన్న సందర్భంలో జీజియ శివాజీపట్ల వాత్సల్యాన్ని ప్రదర్శిస్తే, నాటకంలో శివాజీ ఔరంగజేబు చెర నుండి తప్పించుకొని మహారాష్ట్ర చేరుకొను సందర్భంలో జీజియ శివాజీని చూసి వాత్సల్యాన్ని కనబరుస్తుంది.

### 5.3.9 భక్తిరసం :

శివాజీ తండ్రి షాజిని నిజామ్ బంధించి షరతులు విధించినప్పుడు శివాజీ సంకటంలో పడతాడు. ఒక పక్క హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించాలి. మరొకపక్క తండ్రిని రక్షించాలి. రోజులు గడిచే కొద్ది షాజీకి ఘోరి పెరుగుతూ ఉంటుంది. శివాజీకి ఏం చెయ్యాలో తోచక భవానిదేవిని ప్రార్థిస్తాడు.

**తఱిపిపాంౘిలో గొసరు తత్తరము తరిచి;**

**ధర్మజిజ్ఞాసలో నిరుత్తరతఁ గఱచి,**

**యాత్మశక్తిని మఱచి యిట్లైతినేమొ !**

**దారి చూపుము తల్లి ! చిత్తమున వెలిఁగి ॥**

(శ్రీ. శి. భా. పు. 198)

ధర్మ సంకటంలో పడ్డాను. ఆత్మశక్తిని కోల్పోయాను. ఏదో ఒక ఉపాయం చూపించి దారి చూపమంటూ ప్రార్థన చేశాడు. తనలో వివేకం మేల్కొనాలని తండ్రిని విడిపించే మార్గం దొరకాలని కోరుకుంటాడు.

**"అణువు మొదలుగా సర్వ సర్వాంతరములఁ**

**గార్య కారణ కర్తృ తాఖండమూర్తి**

**వెలుగుచున్న తేజోమయ విశ్వశక్తి**

**మేలుకొలుపుము ! నా యందు మేలుకొనుము!"**

(శ్రీ. శి. భా. పు. 199)

అణువు నుండి ప్రపంచం మొత్తానికి కార్య, కారణ కర్తృత్వం వహించే విశ్వశక్తివి మేలుకో. నాలో మేలుకో అంటూ శివాజీ భవానిదేవిని పన్నెండు తేటగీతి వృత్తాలలో ప్రార్థిస్తాడు.

**నాటకంలో భక్తిరసం :**

నాటకంలో కూడ భక్తి రసం కన్పిస్తుంది. నేతాజీ శివాజీతో సామ్రాజ్యం సిద్ధించాలంటే పరదేవతను పూజించాలని చెబుతాడు.

**అనన్య భావః పరదేవతాయాం**

**మనః సమాధాయ లభస్వవాంఛితమ్ ।**

**కిమాశ్రితః కల్పతరుం కదాచి -**

**న్నివర్తతే కోఽప్యనవాప్త కామః ॥**

(ఛ. సా. పు. 106)

ఏకాగ్ర మనస్సుతో పరదేవతను ప్రార్థిస్తే నీ కోరిక సిద్ధిస్తుంది. కల్పవృక్షాన్ని ఆశ్రయించిన వాడి కోరిక తీరకుండా పోతుందా? అని చెబితే శివాజీ భవాని మందిరానికి వెళ్ళి పరదేవతను ఆరాధిస్తాడు.

**శివరాజః (మన్దిరం ప్రవిశ్య సాశ్రు సాష్టాఙ్గం ప్రణివిత్యస్తోతి)**

**(కర్ణాటరాగీణ త్రిలూలేన గీయతే.)**

**తారయ తవ సుతమమ్బ భవాని**
**ప్రబలయవనరిపు గలిత విభావమ్ ।**
**ప్రలయ పయోనిధి విలులిత నావమ్**
**పాలయ పరమమృడాని ॥ తారయ ॥**

(ఛ.సా.పు. 107)

అంటూ శివాజీ పరదేవతను ప్రార్థిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ భవాని దేవిని స్తుతించడంలో భక్తిరసం కన్పిస్తోంది. కావ్యంలో షాజీని విడిపించే మార్గం కోసం శివాజీ భవానిదేవిని పూజిస్తే నాటకంలో స్వతంత్ర సామ్రాజ్యాన్ని స్థాపించడానికి పరదేవతను ఆరాధిస్తాడు. భక్తి రసానికి భవానిదేవి ఆలంబన విభావం. శివాజీ భవానిదేవిని స్తుతించడం విభావం. ఈ ఆలంబన విభావాల వలన కావ్య నాటకాలలో భక్తిరసం అభివ్యక్తమయింది.

**5.4 వర్ణనలు :**

**5.4.1 కావ్యంలో వర్ణనలు**

**5.4.1.1. షాజీ అహ్మద్ నగరాన్ని విడిచి వెళ్ళేటప్పటి వర్ణన :**

షాజీ తన మామగారైన లుకజీతో భేదాభిప్రాయాలు వచ్చిన సందర్భంలో అహ్మద్ నగరం విడిచి వెళ్ళేటప్పుడు చూసిన దృశ్యాలను కవి వర్ణించాడు.

**తల్లి పొత్తిలి వీఁగి, తప్పితాటియు, దోఁగి**
**యాడిన రమ్యహర్మ్యములఁ జూచి,**
**చిఱుతనాఁ డీడు బాలురఁ గుమియాడిన**
**సమతల క్రీడాంగణములఁ జూచి,**
**పరిణయోత్సవవేళఁ బట్టపేనుఁగు నెక్కి**
**వలగొన్న రాచబాటలను జూచి,**
**నిఖిల ప్రభుత్వ సన్నిధి దండనాథప**

**ట్టముఁ గొన్న కొల్వుకూటమ్ము జూచి**

**చూచుచూపుల నూరిఁ యంచులకుఁ బారి**
**మగిడి, కనుతెప్ప తుదలంటి, మంచుదొరయు**
**నుడుకుఁ గన్నీటి నడఁచి, "నిన్ విడుతు"నంచు**
**నదరుఁ చెదవుల షాజీ ప్రయాణమయ్యె"**

(శ్రీ.శి.భా.పు. 18)

తల్లి పొత్తిలి విడిచి, చిన్ననాడు ఆడిన రమ్యములైన మేడలని, క్రీడా ప్రాంగణాలని, వివాహ సమయంలో పట్టపు ఏనుగును ఎక్కి విహరించిన రాచబాటలని, దండనాథపదవిని చేపట్టినప్పటి కొల్వు కూటమిని చూసి, పొంగుకు వస్తున్న కన్నీటిని అణుచుకొని కన్నతల్లి లాంటి ఊరు విడుస్తున్నానని దుఃఖిస్తూ అదిరే పదవులతో షాజీ ప్రయాణమౌతాడు.

**5.4.1.2 షాజీ యుద్ధానికి వెళ్ళేటప్పటి వర్ణన :**

తన మామగారైన లుకజీ మరణించడానికి నిజామ్ కారణం అని తెలుసుకొని నిజామ్‌పై ప్రతీకారం తీర్చుకోవడానికి షాజీ వెళ్ళేటప్పటి వర్ణన –

**ఒఱపాడు తరంగతంపరవోలె గుఱ్ఱపుఁ**
**బౌఁజులు మున్ముందు పరుగు వాఱఁ,**
**దళతళలాడు నీఁటెల బారులనుదీరి**
**వీరపదాతులు వెంట నడువఁ,**
**బెనఁకువఁ గాఁక దీరిన మరాటా వీరు**
**లంగరక్షకులౌచు ననుసరింప**
**శంఖచక్రములట్లు చక్రరక్షకులౌచు**
**మఱఁదియు మిత్రుండు నురవడింపఁ**

**నుత్తమాశ్వంబుపై మధ్యమోర్వి నిలిచి**
**పెండ్లియుడుపుల నిన్నటిపెండ్లికొడుకు**
**నేఁడు వీరవిహారసందీప్తుఁ డగుచు**
**నఱిమి షాజివిభుండు సైన్యములఁ దఱిమె ॥**

(శ్రీ.శి.భా.పు. 46)

తరంగాలాగ షాజీ గుర్రాలు ముందుకు పరిగెడుతూవున్నాయి. తళతళ మెరిసి ఈటెలు ధరించిన వీరులు వెంట వస్తున్నారు. ధైర్యమే ఊపిరికాగల మరాట వీరులు వెంట రాగా, శంఖ, చక్రంలాగా రక్షకులైన బావమరిది, మిత్రుడు వెంట వస్తూ ఉండగా ఉత్తమమైన అశ్వంపై పెళ్ళిచేసుకొన్న నిన్నటి పెళ్ళికొడుకు వీర విహారంతో సైన్యాలను నడిపిస్తున్నాడు.

**5.4.1.3 మహారాష్ట్రుల వర్ణన :**

మహారాష్ట్రుల స్వభావాన్ని వర్ణించిన పద్యం ఇది.

**విడువని దైవభక్తి, తమపెద్దలనాటి పవిత్ర ధర్మముల్**
**నడిపెడు జాతిరక్తి, యొరు నమ్మక సేగి దమించి జీవికన్**
**గడుపు స్వతంత్రశక్తి, కొఱగాములనోర్చి మతంబు దేశమున్**
**బుడుకు నురుంప్రసక్తి యివి పుట్టుక తోడనె పుట్టి వారికిన్**

(శ్రీ.శి.భా.పు.61)

స్థిరంగా ఉండే దైవభక్తి, పెద్దలనుండి వచ్చిన పవిత్ర ధర్మాల్ని నడిపించే జాతి, ఎవరి మీద ఆధారపడకుండా ఉండే స్వతంత్రంగా జీవించే శక్తి, ఎన్ని అడ్డంకులు వచ్చినా, తమ మతాన్ని, దేశాన్ని నిలబెట్టుకొనేశక్తి పుట్టుకతోనే మహారాష్ట్రులకు ఉంది.

**5.4.1.4 పూనా పట్టణ వర్ణన :**

శివాజీకి నిజామ్ కొలువులో ఉద్యోగం ఇప్పించాలనే ఉద్దేశ్యంతో షాజీ శివాజీని పూనా రమ్మంటాడు. శివాజీ పూనా వెళ్ళేటప్పుడు కవి పూనాను వర్ణించిన తీరిది.

**పునహా పట్టణ సౌధరాజి కనుచూపుం దాయ, నుత్తుంగ కే**
**తనముల్, గోపుర చంద్రశాలిక, లభేద్యంబైన ప్రాకారముల్,**
**వనముల్, పచ్చిక నేల, లంతికమునన్ బారాడు "మ్యూటా"**
**స్వనదూర్ముల్ గనుపట్టఁ, బల్లకి పురద్వారంబు దాయన్ జనెన్**

(శ్రీ.శి.భా.పు.81)

ఆ పూనా పట్టణములోని మేడల సమూహాలు కనుచూపుకి అందనంత ఎత్తున ఉన్నాయి. ఎత్తైన గోపురాలతో చంద్రశాలలు (పై మేడలు) దుర్భేధ్యమైన ప్రహరీ గోడలతో కూడి ఉన్నాయి. ఉద్యానవనాలు, పచ్చిక బయళ్ళు, సమీపంలో ప్రవహించే మ్యూటానదీ తరంగ ధ్వనులు వినిపిస్తుండగా పల్లకి ఆ పుర ద్వారాన్ని సమీపించింది. పూనా పట్టణ వైభవాన్ని ఈ వర్ణన తెలియజేస్తోంది.

**5.1.1.5 సూర్యోదయ వర్ణన :**

శివాజీ, జీజియ, దాదోజీలతో వేకువజామున పూనా పట్టణానికి ప్రయాణమైనప్పుడు కవి సూర్యోదయాన్ని వర్ణించాడు.

**కలకలఁ్రమోయు పక్షుల మంగళస్వర**
**ములు, స్వరమ్ములవెంట మలయుగాలి,**
**గాలితున్కలఁ దలల్ గదలించు తీరువులు,**
**తరుల నీరాడించు నరుణకాంతి,**
**యరుణకాంతుల మెఱుఁగారు శస్త్రాస్త్రంబు**
**లస్త్రముల్ గయిసేయు నాశ్విక తతి,**
**యాశ్విక తతివెంట నంగరక్షకబల,**
**మ్మంగరక్షకులతో నందలంబు,**
**అందలము దాపుగా జీజియా వధూటి,**
**జీజియా వెంట శివుడు-షాజీ విభుండు,**
**నండగాచుచు దాదోజి యనుసరింప,**
**బ్రాత రారంభమునఁ బుర ప్రాంత మలరె ॥**

(శ్రీ.శి.భా.పు.97)

కలకలమనే పక్షుల మంగళ స్వరాలు, ఆ స్వరాల వెంట వీచేగాలి, ఆ గాలికి కదలాడే చెట్లు, ఆ చెట్లను వెంబడించే అరుణకాంతి, ఆ అరుణకాంతి వెంట అస్త్రశస్త్రాలు పట్టుకొన్న అశ్వికులు, అశ్వికుల వెంట అంగరక్షకులు, అంగరక్షకుల వెంట జీజియ, జీజియ వెంట శివాజీ, షాజీ నడుస్తుండగా దాదోజి వారిని అనుసరిస్తూ ఉండగా తెల్లవారి జామున పుర ప్రాంతము శోభిల్లింది.

**5.4.1.6 సంధి భవనం వర్ణన :**

శివాజీ, అఫ్జల్ఖాన్ కలుసుకోవడానికి సంధి భవనాన్ని ఏర్పాటు చేస్తారు. ఆ సంధి భవనాన్ని వర్ణించిన తీరిది.

**కోటకు దిగువగాఁ 'గోయనా' లోయ తే**
**రమున నీరంధ్ర వృక్షముల నటికి,**
**సమ చతురస్రమై చదునైన యానేల**

**రమ్యమౌ నొక గుడారంబు గట్టి,**

**చలువ చాందిని – ముత్తెముల జాలరులు – వ్రేలు**

**రతనాల గుత్తులు రాణగొలిపి,**

**పరువము కొలది నందఱుఁ గూరుచుండఁ బీ**

**ఠములఁ దివాసీలఁ గొమరుగూర్చి,**

**నడుమ నాస్థానవేదిక నవ్య రాజ**

**లాంఛనమ్ములు వెలయ నలంకరించి,**

**యతుల సామ్రాజ్య వైభవోన్నతులు దొరయ**

**సంధి భవనము నచ్చోట సంతరించె ॥**

(శ్రీ.శి.భా.పు. 249)

కోటకు దిగువగా కోయన లోయ తీరంలో నీరంధ్రవృక్షాలను నరికి ఎత్తుపల్లాలు లేకుండ సమంగా ఉండేటట్టు నేలను చదును చేసి అక్కడ అందమైన గుడారాలను వేశారు. ముత్యాలు, రత్నాలతో అలంకరించారు. అందరూ కూర్చోడానికి పీఠలు, తివాచీలు వేసి మధ్యలో వేదికను అలంకరించి సంధి భవనాన్ని నిర్మించారు.

**5.4.1.7 శివాజీ ఖాన్‌ను వధించడానికి వెళ్ళేటప్పటి వర్ణన :**

శివాజీ అఫ్జల్‌ఖాన్‌ను సంహరించాడినికి వెళ్ళేటప్పటి వర్ణన ఇది –

**శిరము నిండుగ నుక్కుఁ దెర శిరస్త్రాణంబుఁ**

**గట్టి, పైఁబట్టుపాగా ధరించి,**

**మై నిండుగా నయోమయమైన కవచంబు**

**నూని, పై నిల్పుటంగీనిఁ దొడిగి,**

**యెడమచేఁ బులిగోళ్ళఁ గుడిచేతఁ బిడిబాకు**

**నంగీమఱుంగులో నమరఁ జొనిపి,**

**నిడుపైన కరవాలు నడుముపట్టిక నంటి**

**యొరసి వ్రేలాడ బంధురముఁ జేసి,**

**భావ గంభీర సువిశాల ఫాలమందు**

**సర్వరక్ష గుంకుమరేఖ సంతరించి,**

**యుబుకు నెమ్మది - యుప్పొంగు నొడలు దోఁపఁ,**

**దల్లికడకేఁగి పాదవందనము సలిపె ॥**

(శ్రీ.శి.భా.పు.253-254)

శిరస్సు నిండుగా శిరస్త్రాణము ధరించి అది అన్పించకుండ తలపాగా ధరించి శరీరం పై భాగంలో కవచాన్ని ధరించి దానిపై నిలిచే విధంగా అంగీని ధరించి ఎడమ చేతిలో పులిగోళ్ళు ధరించి కుడిచేతిలో పిడిబాకును ధరించి ఈ రెండూ కన్పించకుండ అంగీ జేబులో పట్టే పదునైన కత్తిని నడుంపై వరలో పెట్టుకొని నుదుట కుంకుమ ధరించి తల్లి దగ్గరకు వెళ్ళి పాదాభివందనము చేశాడు. ఖాన్‌ను వధించడానికి శివాజీ వెళ్ళేటప్పుడు శివాజీ ఆహార్యాన్ని తెలియజేస్తోంది ఈ వర్ణన.

### 5.4.1.8 వర్షాకాల వర్ణన :

బాజీ ప్రభువు మరణానికి శివాజీ ఎంతో వ్యధ చెందుతాడు. శత్రువులకు తగిన గుణపాఠం చెప్పాలనే ఉద్దేశ్యంతో యుద్ధానికి సన్నద్ధమౌతాడు. వర్షఋతువు కారణంగా యుద్ధం కొన్నాళ్లు వాయిదా వేయవలసి వస్తుంది. ఆ సందర్భంలో కవి వర్షఋతువుని వర్ణిస్తాడు.

**పెళపెళ దార్భటిన్ గగనవీథిఁ బగిల్చి, తళత్తళత్తటి**

**ద్వలనము లార్చి, నీలితెఱవైచి, వడిన్ జెరలాడు గాలిఁత్రో**

**పుల విడఁబాఱి, కార్మొగులు ముమ్మరమై వడగండ్ల వానలన్**

**దళకొని, కుండపోఁతలవు ధారతో జడివట్టె నెల్లెడన్ ॥**

(శ్రీ.శి.భా.పు.286)

పెళపెళ శబ్దంతో గగనవీధిని పగలగొట్టి, తళతళ ధ్వనితో, నీలి మబ్బులను వేసి వేగంతో వీచే గాలితో, కారుమబ్బులు ముమ్మరమైన వడగండ్ల వానతో, కుండపోత ధారలతో ప్రతీచోట వర్షం పడుతోంది.

### 5.4.1.9 ఔరంగజేబు దర్బార్‌కి వెళ్ళేటప్పటి శివాజీ వర్ణన :

శివాజీ ఔరంగజేబుతో సంధి చేసుకోవడానికి ఆగ్రాలోని ఔరంగజేబు దర్బార్‌కి వెళ్ళినప్పుడు శివాజీ ఠీవిని కవి వర్ణించాడు.

**సామంతభూ కాంత చతురంగ సంకుల**

**ద్వారాదేశమున సేవకుల నిలిపి,**

**తురగ దంతావళోద్ధుర వీరభటరాజి**
**రక్షిత కక్ష్యాంతరములఁ గడచిఁ,**
**యధికార తారతమ్యక్రమ స్థాన గౌ**
**రవ యుతోద్యోగివర్గముల దాఁటి,**
**పార్శ్వద్వయోపాంతభాగ భద్రాసనో**
**త్తంసి తాయాత్య సత్తములఁ దటిసి,**
**సింహగమనముతో రామసింగు వెంట**
**ధీర గంభీర ముద్ర నేతెంచుచున్న**
**శివపతినిఁ జూచి యౌరంగజేబు "రమ్ము**
**రమ్ము శివరాజ"యని యాదరమ్ము జూపె"**

(శ్రీ.శి.భా.పు.384)

ద్వారం వద్ద సేవకులను నిలిపి, రక్షక భటులను దాటి, అధికారంలో ఉన్నత స్థానంలో ఉన్న ఉద్యోగులను దాటి సింహంలాగా రామసింగు వెంట గంభీరంగా వస్తున్న శివాజీని ఔరంగజేబు రమ్మని ఆహ్వానించి ఆదరాన్ని చూపాడు. శివాజీ దర్పాన్ని, ఆత్మవిశ్వాసాన్ని తెలియజేస్తోంది ఈ వర్ణన.

ఇంకా శ్రీ శివభారతం కావ్యంలో వివాహ వర్ణన, కుమారోదయోత్సవ వర్ణన, మంత్రాంగవర్ణన, దౌత్యవర్ణన, ప్రయాణవర్ణన మొదలైన వర్ణనలు ఉన్నాయి.

### 5.4.2 నాటకంలో వర్ణనలు

#### 5.4.2.1 శివాజీ వర్ణన :

అఫ్జల్‌ఖాన్‌ను వధించడానికి ముందుగా నేతాజీ వెళ్తాడు. తరువాతి శివాజీ వెళ్తాడు. అక్కడికి వస్తున్న శివాజీని నేతాజీ వర్ణిస్తాడు.

**ప్రజవతురగ కల్పితాసనోఽయం**
**కవచధరః కరవాలకున్తనద్ధః ।**
**అరుణితనయనో రుషా మహోగ్రః**
**సరభసమేత్యభితో ద్విషాంకృతాన్తః ॥**

(ఛ.సా.పు.135)

వేగంగా గుర్రం మీద వచ్చినటువంటివాడై కవచం ధరించినటువంటివాడు, చేతులతో బరిసెను ధరించినవాడు కోపంతో ఎర్రబడిన నేత్రాలతో ఎలా ఉన్నాడంటే శత్రువుల పట్ల యముడిలా ఉన్నాడు. శివాజీ పరాక్రమాన్ని, వీరత్వాన్ని ఈ వర్ణన తెలియజేస్తోంది.

**5.4.2.2 విశాలగడ వర్ణన :**

బాజీ ప్రభువు విశాలగడ చేరుకున్నాక విశాలగడను వర్ణిస్తాడు.

**"విశాల వప్రోన్నత గణ్డ భిత్తిః -**
**దురాక్రమో హస్తమితాగ్రమార్గః ।**
**దుర్గోత్తమోయం పరిణద్ధ పార్శ్వో**
**మహేన్ద్రమాతఙ్గనిభో విభాతి ॥"**

**తత్సత్వర మేనమధిరోహతు భారతేన్ద్రః**

(ఛ.సా.పు. 139)

మహేంద్రుడు ఐరావతం అనే ఏనుగులాగా విశాలగడ దుర్గం ప్రకాశిస్తోంది. విశాలమైన ఏనుగు గండస్థలంలాగా విశాలదుర్గ ప్రాకారం ఆక్రమించడానికి సఖ్యం కానిది. చేతికి అందుబాటులో ఉన్నటువంటి ఈ దుర్గ మార్గం పరిణతి చెందిన పార్శ్వభాగం కలిగినటువంటి ఏనుగులాగా ఉంది.

**5.4.2.3 వర్ష ఋతు వర్ణన :**

బాజీ ప్రభువు మరణానంతరం శివాజీ మొఘలులపై ప్రతీకారం తీర్చుకోవడానికి వర్షాకాలం యుద్ధానికి అనుకూలం కాదని అనుకుంటాడు. ఆ సమయంలో రచయిత వర్షాకాల వర్ణన చేస్తాడు.

**లులితపథికనేత్రే పూరయిత్వా రజోభి -**
**ర్వ్యసనమపహరన్తో లుణ్ఠకాశ్చక్రవాతాః ।**
**జనపదపురమార్గే సంభ్రమన్తో యథేచ్ఛం**
**వియదభి ఘనభీతా ఉత్ప్లవన్తే సమన్తాత్ ॥**

(ఛ.సా.పు. 143)

వీస్తున్న సుడిగాలులు ఏం చేస్తున్నాయంటే మార్గంలో వెళ్ళేవారి కళ్ళల్లో దుమ్మును కొడుతున్నాయి. వారు కట్టుకున్న వస్త్రాలు ఎగిరిపోతున్నాయి. ఈ సుడిగాలులు ఆకాశంలో ఉన్నటువంటి మేఘాలకు భయపడి గుండ్రంగా తిరుగుతూ ఉన్నాయి. ఈ వర్షఋతువు కావ్య నాటకాలు రెండింటిలోనూ ఉంది.

**5.4.2.4 పురంధర దుర్గ వర్ణన :**

మొఘలుల చేత ఆక్రమింపబడిన పురంధర దుర్గం ఎలావుందో శివాజీ వర్ణిస్తున్నాడు.

**ఆచ్ఛాద్యేవోష్ణరశ్మిం నిజఘనతతిభిర్ధ్వానమాపాదయద్భిః -**
**హృన్మర్మోద్భేదినాదైః స్తనితపటహజైర్గర్వమాఘోషయద్భిః ।**
**ధారాసంపాతభగ్నప్రతిభటవిటపివ్యాకులోపత్యకాన్త**
**ఆక్రాన్తో మ్లేచ్ఛసైన్యైర్జలధరనివహై ర్దుర్గరాజః సమన్తాత్ ॥**

(ఛ.సా.పు. 151)

మేఘాల చేత ఆకాశం ఏ విధంగా కప్పబడి ఉందో ఈ పురంధర దుర్గం మ్లేచ్ఛ సైనికుల చేత ఆక్రమింపబడింది. సూర్యుడిని కప్పేసిన చీకటిలాగా పురంధర దుర్గం సైనికులచే కప్పబడివుంది. సైనికుల అరుపులు మేఘాల గర్జనలలాగ ఉన్నాయి. వర్షంచేత చెట్ల కొమ్మలు విరిగిపోయి అతలాకుతలంగా ఉన్న పురంధర దుర్గం మొఘలుల చేత ఆక్రమింపబడి ఉంది.

**5.4.2.5 రాజగడ దుర్గ వర్ణన :**

పట్టాభిషేక మహోత్సవంలో జరిగే రాయగడ దుర్గాన్ని కవి వర్ణించాడు.

**ధ్వజవసనపతాకామణ్డితా రాజమార్గాః**
**కుసుమముకులమాలారఞ్జితాః కుట్టిమాశ్చ ।**
**నవవిరచితరాగాలేఖ్య చిత్రాస్తరాణి**
**దధతి పరమశోభాం ధూపితాన్యఙ్గనాని ॥**

(ఛ.సా.పు. 175)

ఈ దుర్గం అంతకుముందెన్నడూ చూడనటువంటి నూతనమైన శోభను పొందింది. రాజమార్గాల ధ్వజస్తంభాలు వాటికి జెండాలు అలంకరింపబడ్డాయి. పై భాగాలన్నీ కూడ పూలమొగ్గల మాలలతోటి అలంకరింపబడ్డాయి. భవనాలు కొత్తగా వేయబడిన రంగులతోటి, బొమ్మలతో ఉన్నాయి. ప్రాంగణాలన్నీ కూడ గొప్ప శోభను సంతరించుకున్నాయి.

**ముక్తావిద్రుమ తోరణాఙ్కితపురో ద్వారాణితూర్యస్వనై -**
**శ్చీత్కారైః కరిణాం మృదఙ్గనినదైరాతన్వతే మఙ్గలమ్ ।**
**కాఞ్చీనూపురకిఙ్కిణీక్వణితకై రమ్యైర్యశో గీతికాం**
**గాయన్తి ప్రమదా మహోత్సవ ముదామోదాశృపూర్ణాననాః ॥**

(ఛ.సా.పు. 175)

ముత్యాలు, పగడాలు, తోరణాలు గల నగరం ద్వారాలు మంగళవాద్య ధ్వనులు, ఏనుగుల ఘీత్కారాలు, మృదంగ ధ్వనుల చేత సౌభాగ్యం అనేది విస్తరిస్తోంది బంగారంతో తయారుచేయబడిన నూపురాలు, వాటి గంటలు, పట్టీల మువ్వలు ధరించిన స్త్రీలు శివాజీ కీర్తిని గానం చేస్తున్నారు.

**5.4.2.6 పట్టాభిషేక మహోత్సవం నాటి శివాజీ వర్ణన :**

పట్టాభిషేకం మహోత్సవంలో శివాజీ ప్రాభవాన్ని కవి వర్ణించిన తీరిది.

**బాహుప్రతాప సముపాత్త దిగన్త కీర్తిః**
**సామన్తమౌలి మణిరఞ్చిత పాదపీఠః ।**
**రాజన్యమన్త్రి సచివైః సముపాసితస్త్వం**
**సామ్రాజ్యవైభవయుతోఽతితరాం విభాసి ॥**

(ఛ.సా.పు.178)

తన బాహువుల ప్రభావం చేత దిగంతాలకు వ్యాపించిన కీర్తిగలవాడు. సామంతులు నమస్కారం చెయ్యడం చేత వాళ్ళ శిరస్సు మీద ఉన్న కిరీటాలలో పొదిగిన మణుల కాంతులు ప్రతిబింబించే పాదపీఠంతో సామ్రాజ్య వైభవంతో శివాజీ మిక్కిలి ప్రకాశిస్తున్నాడు.

**ముగింపు**

నాటకంలో కంటే కావ్యంలో శివాజీ పాత్ర ఉదాత్తంగా చిత్రింపబడింది. నాటకంలో కన్నా కావ్యంలో జీజియ పాత్రకు నిడివి ఎక్కువ. నాటకంలో కంటే కావ్యంలో దాదోజీ పాత్రకు విస్తృతి ఎక్కువ. కావ్య నాటకాలు రెండింటిలోనూ సయీబాయి పాత్రకి ప్రాముఖ్యత లేదు. కావ్యంలో షాజీ నిజామ్ పక్షం వహించి శివాజీ పట్ల తండ్రిగా తన బాధ్యతను నెరవేర్చడు. నాటకంలో షాజీ పాత్రలేదు. కావ్యనాటకాలు రెండింటిలోనూ బాజీ ప్రభువు, తానాజీ వీరమరణాలు పొందారు. కావ్య నాటకాలు రెండింటిలోనూ వీరరసం ప్రధానంగా ఉంది. కావ్యంలో దాన, దయా, యుద్ధ, ధర్మ, వీర రసాలు పోషింపబడ్డాయి. నాటకంలో దయా, యుద్ధ వీరాలు మాత్రమే ఉన్నాయి. నాటకంలో కంటే కావ్యంలో కరుణరసం ఎక్కువగా అభివ్యక్తమయింది. కావ్య నాటకాలు రెండింటిలోనూ రౌద్ర, వీర, అద్భుత, వత్సల రసాలు ఉన్నాయి. కావ్యంలో మాత్రమే బీభత్సరసం ఉంది. కావ్య నాటకాలు రెండింటిలోనూ శృంగారరసం లేదు. నాటకంలో కేవలం ఒక గీతంలో మాత్రమే సూచన ప్రాయంగా శృంగార రసం కనిపిస్తోంది.

# సింహావలోకనం

"తెలుగు కావ్యాలుగా రూపొందిన సంస్కృత నాటకాలు" అనే అంశంపై పరిశోధించి ఫలితాంశాలను అధ్యాయాల వారిగా ఈ కింద తెలియ జేశాను.

**మొదటి అధ్యాయం "నాటక కావ్య లక్షణాలు – పరిచయం"లో నాటక ఆవిర్భావ వికాసాలు,** నాటకానికి ఆలంకారికులు, పాశ్చాత్య విమర్శకులు ఇచ్చిన నిర్వచనాలను, నాటకాల వర్గీకరణ, నాటక లక్షణాలను తెలియజేశాను. ప్రబంధ శబ్ద ప్రస్తావన, ప్రబంధ లక్షణాలు, నాటక, ప్రబంధ బేధ సాదృశ్యాలు వివరించాను. తులనాత్మక విమర్శలో అనువాదాల పాత్ర పేర్కొన్నాను.

**రెండవ అధ్యాయం "చండకౌశికమ్ – హరిశ్చంద్రోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన"** చండకౌశికమ్ నాటకం మార్కండేయ పురాణం ఆధారంగా క్షేమీశ్వరుడు రచించాడు. క్షేమీశ్వరుని కల్పనలు కౌశిక, హరిశ్చంద్ర పాత్రలకి ఔన్నత్యాన్ని సంతరించాయి. ఈ నాటకంలోని కల్పనలు మరే ఇతర నాటకాలలోనూ కన్పించవు. హరిశ్చంద్రోపాఖ్యానము కావ్యం స్కాంద పురాణం ఆధారంగా గౌరన రచించాడు. గౌరన కల్పనలు పాత్రపోషణకి, రసపోషణకి దోహదం చేశాయి. గౌరన కల్పించిన కల్పనలను తరువాత కవులు తమతమ కావ్యాలలో ప్రయోగించారు.

నాటకంలో కన్నా కావ్యంలో హరిశ్చంద్రుడు అనేక కష్టాలు అనుభవించాడు. నాటకంలో హరిశ్చంద్రుడు విద్యాత్రయాన్ని రక్షించినందువల్ల కౌశికుడి కోపానికి గురయ్యాడు. కావ్యంలో విశ్వామిత్రుడు వశిష్ఠముని దగ్గర చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చుకోవడానికి హరిశ్చంద్రుడి మీద కోపంతో రాజ్యాన్ని తీసుకుంటాడు. కావ్యంలో విశ్వామిత్రుడి కోపానికి ప్రత్యక్షంగా హరిశ్చంద్రుడు కారణం కాదు. కావ్య నాటకాలు రెండింటిలోనూ హరిశ్చంద్రుడు తనకు ఎదురైన కష్టాలను తట్టుకొని తన సత్యనిష్ఠతో పార్వతీపరమేశ్వరులను మెప్పిస్తాడు.

నాటకం కన్నా కావ్యంలో చంద్రమతి పాత్ర ఉదాత్తంగా ఉంది. కావ్యంలో చంద్రమతి తన తెలివితో భర్తను ఆపదల నుండి కాపాడుతుంది. తన పాతివ్రత్యంతో భర్తను రక్షిస్తుంది. కాలకౌశికుడు, కలహకంఠుల వలన అనేక బాధలు పడుతుంది. భర్త చేతిలో మరణించడం సుకృతంగా భావిస్తుంది. తన పతిభక్తితో పార్వతీ పరమేశ్వరులను మెప్పించి తనమీద పడ్డ నిందని పోగొట్టుకుంటుంది.

నాటకంలో విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడి కారణంగా తనకు వశం కావల్సిన విద్యలు చేజారిపోయాయని హరిశ్చంద్రుడి మీద కోపాన్ని వహిస్తాడు. కావ్యంలో తన పంతం నెగ్గించుకోవడానికి

హరిశ్చంద్రుడిని మాట తప్పించడానికి అనేక కష్టాలపాలు చేస్తాడు. నాటకంలో కన్నా కావ్యంలో విశ్వామిత్రుడు మిక్కిలి క్రూరుడు, కుటిలుడు.

కావ్యంలో మాత్రమే నక్షత్రపాత్ర ఉంది. నక్షత్రకుడు చంద్రమతి హరిశ్చంద్రులు అడవిలో అనేక కష్టాలు పడడానికి, హరిశ్చంద్రుడు భార్యాపుత్రుల్ని అమ్ముకోవడానికి కారణం అవుతాడు. కాలకౌశికుడు, కలహకంఠి పాత్రలు చంద్రమతిని అనేక కష్టాలు పెట్టడంవల్ల కావ్యం కరుణ రసాత్మకంగా సాగింది.

నాటకంలో శృంగార రసం శైబ్య హరిశ్చంద్రుల మధ్య పోషింపబడింది. కావ్యంలో శృంగార రసాభాస హరిశ్చంద్రుడు, మాతంగ కన్యల మధ్య వ్యక్తమయింది.

నాటకంలో హాస్యరసం లేదు. కావ్యంలో కాలకౌశికుడి వికృత రూపాన్ని వర్ణించే సందర్భంలో, వటువు కాలకౌశికుడికి, కలహకంఠికి తగాదా పెట్టిన సందర్భంలో హాస్యరసం కన్పిస్తోంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ కరుణరసం ఉంది. హరిశ్చంద్రుడు భార్యాపుత్రులను అమ్ముకోవడం, కుమారుడు మృత్యువాత పడడం మొదలైన ఘట్టాలలో కరుణరసం ఉంది. నాటకంలో కన్నా కావ్యంలో కరుణరసం ఎక్కువగా ఉంది.

కావ్య నాటకాలు రెండింటిలో విశ్వామిత్రుని యందు రౌద్రరసం కన్పిస్తోంది. నాటకంలో కన్నా కావ్యంలో విశ్వామిత్రుడు మిక్కిలి క్రోధవంతుడు. అందువల్ల నాటకంలో కన్నా కావ్యంలో రౌద్రరసం పాళ్లు ఎక్కువ.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వీరరసం ప్రధాన రసంగా ఉంది. అందులోనూ హరిశ్చంద్రుడిలో సత్యవీరం ప్రస్ఫుటమైంది. నాటకంలో విద్యాత్రయాన్ని రక్షించడం, పంటపొలాల్ని నాశనం చేస్తున్న వరాహాన్ని ఎదర్కొనడం వంటి కల్పనలు హరిశ్చంద్రుడి వీరత్వాన్ని తెలియజేస్తాయి. కావ్యంలో భూతాలను, పిశాచాలను ఎదుర్కొనడం విశ్వామిత్రుడి మాయలు ఛేదించడంలో హరిశ్చంద్రుడి వీరత్వం ప్రదర్శితమైంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ హరిశ్చంద్రుడు నివసించే శ్మశాన వర్ణనలో బీభత్సరసం కన్పిస్తోంది. కావ్యంలో వీరబాహుడి గృహవర్ణనలో కూడ బీభత్సరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ భక్తిరసం వ్యక్తమయింది. కావ్యంలో హరిశ్చంద్రుడు కాశీలో విశ్వనాథుని స్తుతించడంలో భక్తిరసం కన్పిస్తే నాటకంలో హరిశ్చంద్రుడు వీరబాహుడు శ్మశానంలో చండికమ్మ స్తుతించడంలో భక్తిరసం కన్పిస్తోంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వత్సలరసం కన్పిస్తోంది. కావ్యంలో చంద్రమతి మహాగ్నినుండి బయటపడిన తరువాత లోహితుడిని దగ్గరికి తీసుకోవడంలో వత్సలరసం కన్పిస్తే, నాటకంలో హరిశ్చంద్రుడు భార్యాపుత్రులను విక్రయించిన తరువాత వటువు రోహితుడిని కిందకి తోసినప్పుడు హరిశ్చంద్రుడు రోహితుడిని ముద్దాడిన సందర్భంలో వత్సలరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వర్ణనలు రసాభివ్యక్తి ఉపయోగపడుతున్నాయి. హరిశ్చంద్ర, ఆశ్రమ, శ్మశాన, సూర్యాస్తమయ వర్ణనలు కావ్య నాటకాలు రెండింటిలోనూ ఉన్నాయి. కావ్యంలో ప్రబంధ లక్షణాలకు అనుగుణంగా వర్ణనలు ఎక్కువగా ఉన్నాయి. నాటకంలో వర్ణనలు నాటక లక్షణాలకు అనుగుణంగా పరిమితంగా ఉన్నాయి.

**మూడవ అధ్యాయం "తపతీ సంవరణం – తపతీ సంవరణోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన"**లో 'తపతీ సంవరణమ్' నాటకం ఔచిత్యవంతమైన కల్పనలతో అలరారుతోంది. రచయిత నారదుడు, కర్ణపూరం, తపతి పాదవిన్యాసం, సంవరుణుడు మన్మథ సందేశాన్ని తెలిపే పద్యాక్షరాల్ని పూరించడం మొదలైన కల్పనల ద్వారా నాయికా నాయకుల మధ్య అభిలాష విప్రలంభాన్ని కలిగించాడు. కావ్యంలో కేవలం చిలుక ద్వారానే గంగాధరకవి నాయికా నాయకుల మధ్య ప్రణయ రాయబారాన్ని నడిపాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ తపతి చెలికత్తెలుగా రంభా, మేనకలు తపతి వివాహం సంవరుణుడితో జరగడానికి తపతికి అన్ని విధాల సహకరిస్తారు. నాటకంలో తపతికోసం తమ ప్రాణాలు కూడ త్యాగం చేయడానికి సిద్ధపడతారు.

నాటకంలో తపతీ సంవరుణులకు సమాగమానంతరం సూర్యుడి వలన ఎడబాటు కలుగుతుంది. ఈ ఎడబాటు వలన నాటకలో కరుణరసం పోషింపబడింది. తపతి మేనక రూపం ధరించడం, రాక్షసి రంభ రూపం ధరించడంలో అద్భుతరసం, కురుపుత్రుడి పరాక్రమంలో వీరరసం పోషింపబడి నాటకం రసాత్మకంగా సాగింది.

కావ్యంలో సంవరుణుడు అనుకూల నాయకుడు. నాటకంలో సంవరుణుడు దక్షిణనాయకుడు. నాటకంలో సంవరుణుడికి ప్రథమ భార్య దేవి వలన సంతానం లేకపోవడం వలన సంతానార్థం ప్రార్థిస్తాడు. అశరీరవాణి ఆజ్ఞ మేరకు తపతిని వివాహం చేసుకుంటాడు. కావ్యంలో సంవరుణుడికి తపతి గురించి చిలుక చెప్పడం ద్వారా తపతిని వివాహం చేసుకుంటాడు. కావ్యనాటకాలు రెండింటిలోనూ సంవరుణుడి వివాహానికి ముందు అభిలాష విప్రలంభం వ్యక్తమయింది.

వివాహానంతరం సంభోగ శృంగారం అభివ్యక్తమయింది. నాటకంలో వివాహానంతరం వియోగ విప్రలంభాన్ని కూడ సంవరుణుడు ద్వారా వ్యక్తమయింది. కావ్యంలో తపతీ సంవరుణుల ప్రేమ కన్నా నాటకంలో తపతి సంవరుణుల ప్రేమ గొప్పది. నాటకంలో సంవరుణుడు తపతికోసం ప్రాణత్యాగానికి కూడ సిద్ధపడతాడు.

కావ్యంలో తపతి చిలుక ద్వారా సంవరుణుడి గురించి తెలుసుకుంటుంది. నాటకంలో నారదుడి ద్వారా సంవరుణుడి గురించి తెలుసుకుంటుంది. కావ్యంలో చిలుక చెప్పిన సంవరుణుడి అందచందాల వర్ణన వినడం ద్వారా తపతి అభిలాష విప్రలంభాన్ని తద్వారా విప్రలంభంగా వ్యక్తమయింది. నాటకంలో తపతి సంవరుణుడి అందచందాలను కార్తికేయ మందిరంలో అదృశ్యంగా ఉండి వీక్షించడం ద్వారా అభిలాష విప్రలంభాన్ని అనుభవిస్తుంది. నాటకంలో తపతి రాజ్యక్షేమం కోసం తన భర్తకి, లోకకల్యాణంకోసం కుమారుడికి కొంతకాలం దూరంగా ఉంటుంది. సంవరుణుడి కోసం తన ప్రాణాలను ఇవ్వడానికి కూడ వెనుకాడదు. కావ్య నాటకాలు రెండింటిలోనూ తపతి తండ్రి మాట జవదాటదు. కావ్యంలో కన్నా నాటకంలో తపతి పాత్ర ఉదాత్తంగా చిత్రింపబడింది.

నాటకంలో తపతికి వివాహం చెయ్యాలని సూర్యుడు వరాన్వేషణ చేస్తాడు. కావ్యంలో చిలుక తపతికి వరాన్వేషణ చేస్తుంది. చిలుక తన మాటలతో సంవరుణుడిని ఆకట్టుకొని తపతి రూపరేఖల్ని వర్ణించి సంవరుణుడిని విరహవేదనకు గురిచేస్తుంది. తపతికి కూడ సంవరుణుడి అందచందాలను వర్ణించి చెప్పి నాయికా నాయకుల ప్రణయగాధకి చిలుక కర్త, కర్మ, క్రియ ఔతుంది. నాటకంలో సూర్యుడు, నారదుడు, కర్ణపూరం, మన్మథ సందేశం చేసిన కార్యాన్ని కావ్యంలో చిలుక ఒక్కటే సాధించింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వశిష్ఠుడు సంవరుణుడి తపస్సుకి మెచ్చి సూర్యమండలానికి వెళ్ళి సూర్యుడిని తన కుమార్తె అయిన తపతిని సంవరుణుడికి ఇవ్వమని అడుగుతాడు. తపతిని తీసుకువచ్చి సంవరుణుడితో వివాహం జరిపిస్తాడు. కావ్యంలో సంవరుణుడు తపతితో సుఖిస్తూ రాజధర్మాన్ని విస్మరించినపుడు వశిష్ఠుడు సంవరుణుడికి కర్తవ్య బోధ చేస్తాడు. నాటకంలో సంవరుణుడికి రాజ్యంలో క్షామం సంభవించినదని చెప్పి అమాత్యుడు రాజ్యానికి తీసుకువస్తాడు. నాటకంలో వశిష్ఠుడు కురుపుత్రుడిని తీసుకువచ్చి సంవరుణుడికి అప్పగించి కురుపుత్రుడి జన్మ వృత్తాంతాన్ని తపతి సంవరుణులకు వివరంగా తెలియజేస్తాడు.

కావ్యంలో అరుంధతి వశిష్ఠుడితో పాటుగా తపతీ సంవరుణులకి దగ్గరుండి వివాహం చేస్తుంది. నాటకంలో అరుంధతి పాత్ర లేదు.

కావ్యంలో సూర్యుడు వశిష్ఠుడు వచ్చి సంవరుణుడి కోసం తపతిని యివ్వమనగానే వశిష్ఠుడితో తపతిని పంపి చేతులు దులుపుకుంటాడు. నాటకంలో సూర్యుడు తపతికి తగిన వరుడెవ్వరని నారదమహర్షిని అడిగి సంవరుణుడి గురించి తెలుసుకుంటాడు. సంవరుణుడు రాజ ధర్మాన్ని నిర్లక్ష్యం చేసినప్పుడు సూర్యుడు సంవరుణుడి నుండి తపతిని వేరు చేస్తాడు. సంవరుణుడు త్వరగా రాజ్యం చేరుకోవడానికి రథాన్ని, సారథిని పంపిస్తాడు. తపతికి పుత్రవియోగ దుఃఖం కలగకుండ ఆమెను మోహపెడతాడు. తపతికి తెలియకుండ కురుపుత్రుడిని పురిటిలోనే దివ్య ఆహారాలతో పోషించడానికి తీసుకువెళ్తాడు. కావ్యంలో కన్నా నాటకంలో సూర్యుడు పాత్ర ఉదాత్తంగా పోషింపబడింది. నాటకంలో సూర్యుడు తండ్రిగా, మావగారిగా, తాతగా కృతకృత్యుడయ్యాడు.

నాటకంలో విదూషకుడు సంవరుణుడికి అన్ని విధాల చేదోడు వాదోడుగా ఉంటాడు. సంవరుణుడు తపతి వలన విరహ వేదన అనుభవిస్తున్నప్పుడు అతడిని ఊరడిస్తాడు. తపతి కన్పించక ఆవేదన చెందుతూ ఉన్నప్పుడు సంవరుణుడికి ఉపశాంతి కలిగిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ అభిలాష విప్రలంభం, సంభోగ శృంగారం వర్ణింపబడ్డాయి. నాటకంలో విరహ విప్రలంభం వర్ణించబడింది. కావ్య నాటకాలు రెండింటిలోనూ సంవరుణుడు ధీరోదాత్తుడే కావున వీరరసం పోషింపబడింది. నాటకంలో కురుపుత్రుడు రాక్షసిని ధైర్యంగా ఎదుర్కొనడం వలన కురుపుత్రుడిలో కూడ వీరరసం అభివ్యక్తమయింది. నాటకంలో సంవరుణుడికి ముందు సంతానం లేదు. తపతి వలన సంతానం కలుగుతుంది. కురుపుత్రుడు జన్మించడం వలన సంవరుణుడితో వత్సల రసం కన్పిస్తోంది. నాటకంలో వివాహానంతరం తపతీ సంవరుణులకు ఎడబాటు కలగడం వలన కరుణరసం పోషింపబడింది. విదూషకుడి ఆకారచేష్టల వలన హాస్యరసం వ్యక్తమయింది. కావ్య నాటకాలు రెండింటిలోనూ అద్భుతరసం పోషింపబడింది. కావ్యంలో మలయగిరి వర్ణనలో అద్భుతరసం కన్పిస్తోంది. నాటకంలో స్ఫటిక సభా మండపం, సూర్యుడు తపతిని మోహపెట్టడం తపతీ సంవరుణులు తమకు కుమారుడు ఉన్నాడని వశిష్ఠుని ద్వారా తెలుసుకోవడం మొదలైన కల్పనలు అద్భుతరస ప్రధానమైనవే. కావ్య నాటకాలు రెండింటిలోనూ సంవరుణుడి రాజ్యాన్ని అనావృష్టి బాధించడంలో బీభత్సరసం కన్పిస్తోంది. కావ్య నాటకాలు రెండింటిలోనూ సంవరుణుడు తపతికోసం సూర్యుడికోసం తపస్సు చేయడంలో భక్తిరసం కన్పిస్తోంది.

కావ్యనాటకాలు రెండింటిలోనూ శృంగారరసమే ప్రధానరసంగా ఉంది. కావ్యంలో అంగరసాలు వీరం, అద్భుత, బీభత్సరసాలు ఉన్నాయి. నాటకంలో అంగరసాలుగా వీరం, అద్భుత, బీభత్స, కరుణ, హాస్య, వత్సల రసాలు ఉన్నాయి. కావ్యంలో హాస్య, వత్సల, కరుణ రసాలు లేవు.

కావ్యంలో అష్టాదశ వర్ణనలైన నగర, గిరి, వన, ఋతు, చంద్రోదయ, విరహ, జలక్రీడ మొదలైన వర్ణనలు ఎక్కువగా ఉపకరిస్తున్నాయి. నాటకంలో వర్ణనలు చాలా తక్కువగా సందర్భానుగుణంగా ఉండి రసాభివ్యక్తికి ఎక్కువగా తోడ్పడం లేదు.

**నాల్గవ అధ్యాయంలో "సుభద్రా ధనుంజయం – సుభద్రాల్యాణము నాట కావ్యాల పరిశీలన"**లో సుభద్రాధనంజయం నాటకం ఔచిత్యవంతమైన కల్పనలతో అలరారుతోంది. అలంబసుడనే రాక్షసుడు, గాత్రిక, గాత్రిక మీద అర్జునుడి పది పేర్లు ఉండడం మొదలైన కల్పనలు నాటకంలో సుభద్రార్జునులకు అభిలాష విప్రలంభాన్ని కలిగించాయి. కావ్యంలో శ్రీకృష్ణుడి మాటల వలన సుభద్ర కపటయతి రూపంలో వచ్చినది అర్జునుడేనని గ్రహించి అర్జునుడి పట్ల అభిలాష విప్రలంభాన్ని పొందుతుంది.

కావ్యంలో తిమ్మక్క సుభద్రల్యాణ కథకి సుందోపసుందుల వృత్తాంతాన్ని ఆటంకంగా భావించి సుందోపసుందుల కథని సంక్షేపించింది. ధర్మరాజు, అర్జునుల భాతృప్రేమని తెలియజేసింది తిమ్మక్క అర్జునుడి గురించి తెలుసుకోవడం, యతి అర్జునుడి గురించి చెప్పడం వంటి కల్పనలు సుభద్రార్జునుల అనురాగం బలపడడానికి కారణం అయ్యాయి. సుభద్ర అర్జునుడితో మాట్లాడడానికి సిగ్గుపడుతుందని భావించిన తిమ్మక్క మొదట అర్జునుడితో చిలుక చేత మాట్లాడించింది. శ్రీకృష్ణుడిని దివ్యపురుషుడిలా కాకుండా సామాన్య మానవుడిలాగా చిత్రించింది. వదినా మరదళ్ళ వేళాకోళాలు, బావ బావమరుదుల సరదాలతో, తెలుగు నుడికారంతో తిమ్మక్క కావ్యాన్ని రచించింది.

కావ్యంలో కన్నా నాటకంలో అర్జునుడి పాత్ర ఉదాత్తంగా పోషింపబడింది. నాటకంలో సుభద్ర కోసం మరణించాలనుకోవడం, ద్రౌపదికి సపత్నీమత్సరం కలుగుకుండ సుభద్రను గోపాలికా వేషంలో ఇంద్రప్రస్థానికి తీసుకువెళ్లడంలో అర్జునుడి ముందుచూపు, సుభద్ర పట్ల అర్జునుడి ప్రేమ వ్యక్తం అవుతున్నాయి.

నాటకంలో కన్నా కావ్యంలో సుభద్ర తెలివైనది. నాటకంలో సుభద్ర ముగ్గురు పురుషుల్ని ఒకేసారి ప్రేమించానని కులస్త్రీకి ఇది నిషిద్ధం అని ఆత్మ త్యాగానికి సిద్ధపడుతుంది. ఈ ముగ్గురూ ఒక్కరే అనే విషయాన్ని గ్రహించదు. కానీ కావ్యంలో తనతో నర్మగర్భంగా మాట్లాడిన కపటయతి మాటల్ని బట్టి వచ్చినది అర్జునుడేనని తిమ్మక్క సుభద్ర గ్రహిస్తుంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శ్రీకృష్ణుడు సుభద్రార్జునుల వివాహానికి ముఖ్య కారకుడు. కావ్యంలో కపటయతి ఆగడాలు సుభద్ర శ్రీకృష్ణుడికి తెలియజేసిన సందర్భంలో కృష్ణుడు ఆమెను సముదాయిస్తాడు. సుభద్రతో జాగ్రత్తగా వ్యవహరించమని అర్జునుడిని ఆదేశిస్తాడు. నాటకంలో బలరాముడిని శాంతపరచడంలో అత్యంత నేర్పుని ప్రదర్శిస్తాడు.

కావ్యంలో రుక్మిణి సుభద్రార్జునుల వివాహానికి ఎంతగానో తోడ్పడింది. సుభద్ర విరహవేదనను అనుభవిస్తోందని శ్రీకృష్ణుడికి చెప్పడం, సుభద్రను పెళ్ళి కూతుర్ని చెయ్యడం, సుభద్ర అత్తవారింట ఏ విధంగా మెలగాలో తెలియజేస్తుంది. నాటకంలో రుక్మిణి పాత్ర లేదు. కేవలం నాటకంలో సంభాషణలలోనే రుక్మిణి ప్రస్తావన వస్తుంది.

కావ్యంలో ద్రౌపది సుభద్రతో తన భర్తని పంచుకుంటునందుకు బాధపడుతుంది. మళ్ళీ సుభద్ర శ్రీకృష్ణుడి చెల్లెలు కాబట్టి సర్దుకుపోవాలనుకుంటుంది. నాటకంలో ద్రౌపది సుభద్ర క్షేమాన్ని కోరుకుంటుంది.

విదూషకుడి పాత్ర కేవలం నాటకంలోనే ఉంది. విదూషకుడు తన స్నేహితుడైన అర్జునుడికి అడుగడుగునా సహాయం చేస్తాడు. అవసరమైనప్పుడు తగిన సలహాలు ఇచ్చి, అర్జునుడిలో ధైర్యాన్ని నింపి, కార్యోన్ముఖుడిని చేస్తాడు. అర్జునుడు సుభద్ర వివాహం చేసుకోవడానికి విదూషకుడు ఎంతో ఉపయోగపడతాడు. విదూషకుడి ద్వారా నాటకంలో హాస్యరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ బలరాముడికి సుభద్రాధనంజయం వివాహం ఇష్టం ఉండదు. కావ్యంలో కన్నా నాటకంలో బలరాముడు మిక్కిలి క్రోధవంతుడు.

కావ్య నాటాలు రెండింటిలోనూ శృంగారరసం ప్రధానరసంగా, మిగిలిన రసాలు అంగరసాలుగా ఉన్నాయి. కావ్య నాటకాలు రెండింటిలోనూ సుభద్రార్జునులు వివాహానికి ముందు విరహవేదన అనుభవించడం వలన అభిలాష విప్రలంభం, వివాహానంతరం సంభోగ శృంగారం పోషింపబడింది. నాటకంలో సుభద్ర అపహరించడం వలన అర్జునుడు ఆవేదన చెందడం వలన నాటకంలో విరహ విప్రలంభం కూడ పోషింపబడింది.

నాటకంలో విదూషకుడు స్త్రీలు ధరించే ఆభరణాలను ధరించడంలో హాస్యరసం వ్యక్తమైంది. కావ్యంలో కృష్ణుడు అర్జునుడిని ఆటపట్టించడం వలన హాస్యరసం వ్యక్తమైంది. నాటకంలో సుభద్రని

రాక్షసుడు అపహరించడం వలన కరుణరసం అభివ్యక్తమైంది. కావ్యంలో కరుణరసం లేదు. కావ్య నాటకాలు రెండింటిలోనూ అర్జునుడు యాదవ వీరులను ఎదుర్కొనే సందర్భంలో రౌద్రరసం వ్యక్తమైంది. నాటకంలో అర్జునుడు రాక్షసుడిని ఎదిరించాలనుకోవడంలో కూడ రౌద్రరసం పోషింపబడింది. కావ్యంలో అర్జునుడి ప్రతాపాన్ని శ్రీకృష్ణుడు, విదూషకుడు కీర్తించడం వలన వీరరసం పోషింపబడింది. కావ్యంలో సుభద్ర పట్ల చూపే సోదరప్రేమలో వత్సల రసం అభివ్యక్తమైంది. నాటకకంలో వత్సల రసం లేదు. కావ్యంలో అర్జునుడు వివాహానంతరం రుక్మిణి, శ్రీకృష్ణులను స్తుతించే సందర్భంలో భక్తిరసం కన్పిస్తోంది. నాటకంలో అపహరింపబడిన సుభద్ర కాత్యాయనిదేవి రక్షించిన సందర్భంలో అర్జునుడు భక్తితో కాత్యాయనిదేవిని స్తుతించడంలో భక్తిరసం అభివ్యక్తమైంది.

శృంగార, హాస్య, రౌద్ర, వీర, భక్తి రసాలు కావ్య నాటకాలు రెండింటిలోనూ ఉన్నాయి. వత్సల రసం కావ్యంలో మాత్రమే ఉంది. కరుణ, అద్భుత రసాలు నాటకంలో మాత్రమే ఉన్నాయి.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వర్ణనలు రసాభివ్యక్తి ఉపయోగపడుతున్నాయి. సుభద్రార్జునుల వర్ణనలు కావ్య నాటకాలు రెండింటిలోనూ ఉన్నాయి. కావ్యంలో వర్ణనలు విస్తృతంగా ఉన్నాయి. నాటకంలో వర్ణనలు సందర్భానుగుణంగా పరిమితంగా ఉన్నాయి.

**ఐదవ అధ్యాయం ఛత్రపతి సామ్రాజ్యమ్ – శ్రీ శివభారతము నాటక కావ్యాల పరిశీలన"లో,** గడియారం వేంకట శేషశాస్త్రి గారు శ్రీ శివభారతము కావ్య రచన చేసే సమయంలో శివాజీ జీవిత చరిత్రలోని శివాజీ ప్రతిష్ఠకి భంగం కలిగించే అంశాలను పరిహరించి శివాజీని ఉత్తమ చారిత్రక పౌరుడిగా తీర్చిదిద్దారు. మూలశంకర మాణిక్‌లాల్ కూడ ఛత్రపతి సామ్రాజ్యం నాటకంలో శివాజీ సామ్రాజ్యాన్ని స్థాపించడానికి అవసరమైన సంఘటనలతో నాటకాన్ని రాశారు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ వీరు పురుషుడు. కావ్యంలో శివాజీలో దాన, ధర్మ వీరాలు కూడ పోషింపబడ్డాయి. సమర్థ రామదాస స్వామికి రాజ్యాన్ని దానంగా ఇవ్వడంలో దానవీరం, శత్రువులను కూడ కరుణించి విడిచి పెట్టడంలో యుద్ధవీరం కన్పిస్తోంది. నాటకంలో కన్నా కావ్యంలో శివాజీ ఉదాత్తంగా చిత్రింపబడ్డాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ జీజియ ధీరవనిత. నాటకంలో కన్నా కావ్యంలో జీజియ పాత్రకి నిడివి ఎక్కువ. కావ్యంలో జీజియ శివాజీని తీర్చిదిద్ది తను అనుకున్నది సాధించింది. కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ రాజ్యంలో లేని సమయంలో రాచకార్యాలను కూడా జీజియ చక్కబెడుతుంది.

నాటకంలో కంటె కావ్యంలో దాదోజీ పాత్రకి విస్తృతి ఎక్కువ. షాజీ దగ్గరలేని సమయంలో జీజియాకి అండగా నిలుస్తాడు. శివాజీ జన్మించిన విషయాన్ని షాజీకి తెలియజేస్తాడు. శివాజీకి రాజనీతి విద్యలను నేర్పి సకల విద్యాపారంగతుడిని చేస్తాడు. నాటకంలో దాదోజీ శివాజీకి కేవలం రాజనీతి విషయాలు మాత్రమే బోధిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ సయీబాయి పాత్రకి నిడివి తక్కువ. శివాజీ మనసెరిగి ఈమె ప్రవర్తిస్తుంది. కావ్యంలో షాజీని నవాబ్ నిర్బంధించినప్పుడు శివాజీకి ఏం చెయ్యాలో తోచని సమయంలో పరిష్కారం కోసం భవానిదేవిని ప్రార్థించమని సలహా ఇస్తుంది.

కావ్యంలో షాజీ నిజామ్ పక్షం వహిస్తాడు. చివరికి ఆ నిజామ్ చేతిలో బందీ అవుతాడు. అయినా కూడ నిజామ్‌ని విడువడు. శివాజీ కీర్తి ప్రతిష్ఠలు చూసి ఆనందిస్తాడు. శివాజీ తీర్చిదిద్దిన జీజియాని ప్రశంసిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ బాజీ ప్రభువు వీరుడు. పదిహేనువేల బీజాపూర్ సేనతో వీచోచితంగా పోరాడి వీరమరణం పొందిన ధీరుడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ మంత్రిగా తానాజీ ఉంటాడు. కావ్యంలో తానాజీ తన కుమారుడి వివాహాన్ని కూడా లెక్కచేయక సింహగడ్‌ను జయించడానికి వెళ్ళి వీరమరణం పొందుతాడు. నాటకంలో షాజీని నవాబ్ బంధించినప్పుడు సహాయం కోసం ఢిల్లీ పాదుషాకి లేఖ రాయమని శివాజీకి సలహాయిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వీరరసం ప్రధానరసంగా ఉంది. కావ్యంలో దాన, దయ, యుద్ధ, ధర్మాలు వీరాలు పోషింపబడ్డాయి. నాటకంలో దయా, యుద్ధ వీరాలు మాత్రమే పోషింపబడ్డాయి.

నాటకంలో కన్నా కావ్యంలో కరుణరసం మిక్కుటముగా పోషింపబడింది. కావ్యంలో లుకజీ, దాదోజీ, షాజీ, తానాజీ, బాజీ ప్రభువు మరణాలవల్ల కావ్యంలో కరుణరసం ఎక్కువగా పోషింపబడింది. తానాజీ, బాజీ ప్రభువుల వీర మరణాలు పొందడంలో నాటకంలో కరుణరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ భక్తి రసం కన్పిస్తోంది. కావ్యంలో తండ్రిని విడిపించే మార్గం కోసం శివాజీ భవానిదేవిని ప్రార్థిస్తే నాటకంలో సామ్రాజ్య స్థాపనకోసం శివాజీ భవానిదేవిని ప్రార్థిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ జీజియాలో వత్సలరసం కన్పిస్తోంది. కావ్యంలో శివాజీ స్వతంత్ర సామ్రాజ్యాన్ని స్థాపిస్తానన్న సమయంలో జీజియ శివాజీ పట్ల వాత్సల్యాన్ని కనబరుస్తుంది. నాటకంలో శివాజీ ఔరంగజేబు బందీ నుండి తప్పించుకొని తిరిగి రాజ్యానికి వచ్చినప్పుడు శివాజీ పట్ల వాత్సల్యాన్ని వ్యక్తం చేస్తుంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ అద్భుతరసం కన్పిస్తోంది. కావ్యంలో శివాజీ గోవులను రక్షించినప్పుడు జీజియ ఆనందంతో విస్మయానికి లోనౌతుంది. నాటకంలో రాజ్యానికి తిరిగి వచ్చిన కుమారుడికి చూసి ఆశ్చర్యానికి లోనౌతుంది.

కావ్యంలో సింహగడ్‌ను జయించడానికి వెళ్ళిన తానాజీ శత్రువులతో యుద్ధం చేసిన తీరులో బీభత్సరసం అభివ్యక్తమయింది. నాటకంలో బీభత్సరసం లేదు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ రౌద్రరసం కన్పిస్తోంది. శివాజీ అఫ్జల్‌ఖాన్‌ను వధించే సమయంలో రౌద్రరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శృంగారరసం లేదు. నాటకంలో కేవలం ఒక గీతంలో మాత్రమే సూచన ప్రాయంగా శృంగారరసం కన్పిస్తోంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ శౌర్య, ప్రతాపాల వర్ణనల వలన వీరరసం పోషింపబడింది. కావ్యంలో విస్తృత వర్ణనలు ఆనాటి మహారాష్ట్రుల స్థితిగతులు, మంత్రాంగం, వీరులు యుద్ధానికి వెళ్ళేటప్పుడు అలంకరించే తీరు మొదలైన విషయాలు తెలియజేశాయి. నాటకంలో వర్ణనలు చాలా తక్కువగా ఉన్నాయి. శివాజీ వర్ణన, దుర్గాల వర్ణనలు నాటకంలో ఉన్నాయి.

పై అధ్యాయాలలో పేర్కొన్న నాల్గు నాటకాలను, కావ్యాలను పరిశీలించినప్పుడు సంస్కృత నాటకాల్ని చూసి తెలుగు కావ్యాలు రచించారు అని చెప్పడానికి ఆధారాలు ఎక్కడా లేవు. చండకౌశికమ్, హరిశ్చంద్రోపాఖ్యానములను తులనాత్మక పరిశోధన చేసినప్పుడు చండకౌశికమ్ కంటే హరిశ్చంద్రోపాఖ్యానము పాత్రపోషణలోనూ, రసపోషణలోనూ, వర్ణనలలోనూ మిక్కిలి ఆస్వాదయోగ్యంగా ఉంది. తపతీసంవరణం, తపతీసంవరణోపాఖ్యానములను పోల్చి చూసినప్పుడు కావ్యం కంటే నాటకం అనేక కల్పనలతో ప్రేక్షకుల మన్ననలను పొందింది. సుభద్రాధనంజయం, సుభద్రాకల్యాణములను పరిశీలించినప్పుడు నాటకంలో కల్పనలు ఎక్కువగా ఉంటే కావ్యంలో

రసపోషణ ఎక్కువగా కావ్యనాటకాలు రెండూ ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి. ఛత్రపతి సామ్రాజ్యమ్, శ్రీశివభారతము పరిశీలించగా నాటకంలో కేవలం శివాజీ సామ్రాజ్యాన్ని ఏ విధంగా స్థాపించాడో మాత్రమే ఉంది. కావ్యంలో శివాజీ జన్మించడానికి పూర్వం ఉన్న పరిస్థితుల దగ్గర నుండి శివాజీ సామ్రాజ్య స్థాపన చెయ్యడం వరకు ఉంది. కావ్యం రసనిర్వహణ, పాత్రచిత్రణ, వర్ణనలలో అనేకమంది పాఠకుల మన్ననలను పొందింది.

## ఉపయుక్త గ్రంథ సూచిక (Bibliography)


- అచ్యుత రామారావు, చావలి. ***తాళ్ళపాక తిమ్మక్క – సుభద్రా కల్యాణము – ఒక పరిశీలన.*** ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం, (అ.సి.గ్రం), ఆంధ్రవిశ్వకళాపరిషత్, వాల్తేరు: 1997.
- అజీజ్ మిర్జా మహ్మద్. ***సంస్కృత నాటకము.*** హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ, 1978.
- ఆనందమూర్తి, వి. ***సంస్కృతము నందు అనిదితమైన తెలుగు ప్రబంధములు.*** పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైద్రాబాద్ : 1984.
- అప్పారావు పి.యస్., పోణంగి. (అనువాదము), ***నాట్యశాస్త్రము.*** హైదరాబాదు : నాట్యమాల ప్రచురణ, 1982.
- ఆరుద్ర, ***సమగ్ర ఆంధ్ర సాహిత్యం.*** మొదటి, రెండు, మూడు, నాలుగు సంపుటములు. హైదరాబాద్ : తెలుగు అకాడమి, 2002.
- కృష్ణకుమారి, నాయని. (సంపాదకత్వం) ***శృంగార శాకుంతలము.*** హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1967.
- కృష్ణబాబు, జోశ్యుల. ***తెలుగులో హరిశ్చంద్ర నాటకాలు తులనాత్మక పరిశీలన.*** పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం, (అ.సి.గ్రం), తెలుగు విశ్వవిద్యాలయం,1995.
- కృష్ణమాచార్య, ఎక్కిరాల. ***సుభద్ర.*** మద్రాసు : కాంతి ప్రెస్, 2000.
- గోపాలరెడ్డి, సుజాతారెడ్డి, ముదిగంటి. ***సంస్కృత సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము ప్రచురణ, 1986.
- తిమ్మక్క, తాళ్ళపాక. ***సుభద్రా కల్యాణము.*** ప్రభాకరశాస్త్రి వేటూరి (పరిష్కరణ)
- తిరుమలరావు, సర్దేశాయి. ***సాహిత్యతత్త్వము శివభారత దర్శనము.*** అనంతపురము : శారదా ప్రింటింగ్ ప్రెస్, 1971.
- ***తెలుగు సాహిత్య కోశం, ప్రాచీన సాహిత్యం*** (సంకలనం), హైదరాబాదు : తెలుగు అకాడమి ద్వితీయ ముద్రణ, 2005.
- దుర్గయ్య, పల్లా. ***ప్రబంధ వాఙ్మయ వికాసము*** మొదటి సంపుటి, హైదరాబాదు : ఆంధ్ర రచయితల సహకార సంఘ ముద్రణాలయము, 1985.

# సింహావలోకనం

"తెలుగు కావ్యాలుగా రూపొందిన సంస్కృత నాటకాలు" అనే అంశంపై పరిశోధించి ఫలితాంశాలను అధ్యాయాల వారిగా ఈ కింద తెలియ జేశాను.

**మొదటి అధ్యాయం "నాటక కావ్య లక్షణాలు – పరిచయం"లో నాటక ఆవిర్భావ వికాసాలు,** నాటకానికి ఆలంకారికులు, పాశ్చాత్య విమర్శకులు ఇచ్చిన నిర్వచనాలను, నాటకాల వర్గీకరణ, నాటక లక్షణాలను తెలియజేశాను. ప్రబంధ శబ్ద ప్రస్తావన, ప్రబంధ లక్షణాలు, నాటక, ప్రబంధ బేధ సాదృశ్యాలు వివరించాను. తులనాత్మక విమర్శలో అనువాదాల పాత్ర పేర్కొన్నాను.

**రెండవ అధ్యాయం "చండకౌశికమ్ – హరిశ్చంద్రోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన"** చండకౌశికమ్ నాటకం మార్కండేయ పురాణం ఆధారంగా క్షేమీశ్వరుడు రచించాడు. క్షేమీశ్వరుని కల్పనలు కౌశిక, హరిశ్చంద్ర పాత్రలకి ఔన్నత్యాన్ని సంతరించాయి. ఈ నాటకంలోని కల్పనలు మరే ఇతర నాటకాలలోనూ కన్పించవు. హరిశ్చంద్రోపాఖ్యానము కావ్యం స్కాంద పురాణం ఆధారంగా గౌరన రచించాడు. గౌరన కల్పనలు పాత్రపోషణకి, రసపోషణకి దోహదం చేశాయి. గౌరన కల్పించిన కల్పనలను తరువాత కవులు తమతమ కావ్యాలలో ప్రయోగించారు.

నాటకంలో కన్నా కావ్యంలో హరిశ్చంద్రుడు అనేక కష్టాలు అనుభవించాడు. నాటకంలో హరిశ్చంద్రుడు విద్యాత్రయాన్ని రక్షించినందువల్ల కౌశికుడి కోపానికి గురయ్యాడు. కావ్యంలో విశ్వామిత్రుడు వశిష్ఠముని దగ్గర చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చుకోవడానికి హరిశ్చంద్రుడి మీద కోపంతో రాజ్యాన్ని తీసుకుంటాడు. కావ్యంలో విశ్వామిత్రుడి కోపానికి ప్రత్యక్షంగా హరిశ్చంద్రుడు కారణం కాదు. కావ్య నాటకాలు రెండింటిలోనూ హరిశ్చంద్రుడు తనకు ఎదురైన కష్టాలను తట్టుకొని తన సత్యనిష్ఠతో పార్వతీపరమేశ్వరులను మెప్పిస్తాడు.

నాటకం కన్నా కావ్యంలో చంద్రమతి పాత్ర ఉదాత్తంగా ఉంది. కావ్యంలో చంద్రమతి తన తెలివితో భర్తను ఆపదల నుండి కాపాడుతుంది. తన పాతివ్రత్యంతో భర్తను రక్షిస్తుంది. కాలకౌశికుడు, కలహకంఠుల వలన అనేక బాధలు పడుతుంది. భర్త చేతిలో మరణించడం సుకృతంగా భావిస్తుంది. తన పతిభక్తితో పార్వతీ పరమేశ్వరులను మెప్పించి తనమీద పడ్డ నిందని పోగొట్టుకుంటుంది.

నాటకంలో విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడి కారణంగా తనకు వశం కావల్సిన విద్యలు చేజారిపోయాయని హరిశ్చంద్రుడి మీద కోపాన్ని వహిస్తాడు. కావ్యంలో తన పంతం నెగ్గించుకోవడానికి

హరిశ్చంద్రుడిని మాట తప్పించడానికి అనేక కష్టాలపాలు చేస్తాడు. నాటకంలో కన్నా కావ్యంలో విశ్వామిత్రుడు మిక్కిలి క్రూరుడు, కుటిలుడు.

కావ్యంలో మాత్రమే నక్షత్రపాత్ర ఉంది. నక్షత్రకుడు చంద్రమతి హరిశ్చంద్రులు అడవిలో అనేక కష్టాలు పడడానికి, హరిశ్చంద్రుడు భార్యాపుత్రుల్ని అమ్ముకోవడానికి కారణం అవుతాడు. కాలకౌశికుడు, కలహకంఠి పాత్రలు చంద్రమతిని అనేక కష్టాలు పెట్టడంవల్ల కావ్యం కరుణ రసాత్మకంగా సాగింది.

నాటకంలో శృంగార రసం శైబ్య హరిశ్చంద్రుల మధ్య పోషింపబడింది. కావ్యంలో శృంగార రసాభాస హరిశ్చంద్రుడు, మాతంగ కన్యల మధ్య వ్యక్తమయింది.

నాటకంలో హాస్యరసం లేదు. కావ్యంలో కాలకౌశికుడి వికృత రూపాన్ని వర్ణించే సందర్భంలో, వటువు కాలకౌశికుడికి, కలహకంఠికి తగాదా పెట్టిన సందర్భంలో హాస్యరసం కన్పిస్తోంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ కరుణరసం ఉంది. హరిశ్చంద్రుడు భార్యాపుత్రులను అమ్ముకోవడం, కుమారుడు మృత్యువాత పడడం మొదలైన ఘట్టాలలో కరుణరసం ఉంది. నాటకంలో కన్నా కావ్యంలో కరుణరసం ఎక్కువగా ఉంది.

కావ్య నాటకాలు రెండింటిలో విశ్వామిత్రుని యందు రౌద్రరసం కన్పిస్తోంది. నాటకంలో కన్నా కావ్యంలో విశ్వామిత్రుడు మిక్కిలి క్రోధవంతుడు. అందువల్ల నాటకంలో కన్నా కావ్యంలో రౌద్రరసం పాళ్లు ఎక్కువ.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వీరరసం ప్రధాన రసంగా ఉంది. అందులోనూ హరిశ్చంద్రుడిలో సత్యవీరం ప్రస్ఫుటమైంది. నాటకంలో విద్యాత్రయాన్ని రక్షించడం, పంటపొలాల్ని నాశనం చేస్తున్న వరాహాన్ని ఎదర్కొనడం వంటి కల్పనలు హరిశ్చంద్రుడి వీరత్వాన్ని తెలియజేస్తాయి. కావ్యంలో భూతాలను, పిశాచాలను ఎదుర్కొనడం విశ్వామిత్రుడి మాయలు ఛేదించడంలో హరిశ్చంద్రుడి వీరత్వం ప్రదర్శితమైంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ హరిశ్చంద్రుడు నివసించే శ్మశాన వర్ణనలో బీభత్సరసం కన్పిస్తోంది. కావ్యంలో వీరబాహుడి గృహవర్ణనలో కూడ బీభత్సరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ భక్తిరసం వ్యక్తమయింది. కావ్యంలో హరిశ్చంద్రుడు కాశీలో విశ్వనాథుని స్తుతించడంలో భక్తిరసం కన్పిస్తే నాటకంలో హరిశ్చంద్రుడు వీరబాహుడు శ్మశానంలో చండికమ్మ స్తుతించడంలో భక్తిరసం కన్పిస్తోంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వత్సలరసం కన్పిస్తోంది. కావ్యంలో చంద్రమతి మహాగ్నినుండి బయటపడిన తరువాత లోహితుడిని దగ్గరికి తీసుకోవడంలో వత్సలరసం కన్పిస్తే, నాటకంలో హరిశ్చంద్రుడు భార్యాపుత్రులను విక్రయించిన తరువాత వటువు రోహితుడిని కిందకి తోసినప్పుడు హరిశ్చంద్రుడు రోహితుడిని ముద్దాడిన సందర్భంలో వత్సలరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వర్ణనలు రసాభివ్యక్తి ఉపయోగపడుతున్నాయి. హరిశ్చంద్ర, ఆశ్రమ, శ్మశాన, సూర్యాస్తమయ వర్ణనలు కావ్య నాటకాలు రెండింటిలోనూ ఉన్నాయి. కావ్యంలో ప్రబంధ లక్షణాలకు అనుగుణంగా వర్ణనలు ఎక్కువగా ఉన్నాయి. నాటకంలో వర్ణనలు నాటక లక్షణాలకు అనుగుణంగా పరిమితంగా ఉన్నాయి.

**మూడవ అధ్యాయం "తపతీ సంవరణం – తపతీ సంవరణోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన"**లో 'తపతీ సంవరణమ్' నాటకం ఔచిత్యవంతమైన కల్పనలతో అలరారుతోంది. రచయిత నారదుడు, కర్ణపూరం, తపతి పాదవిన్యాసం, సంవరుణుడు మన్మథ సందేశాన్ని తెలిపే పద్యాక్షరాల్ని పూరించడం మొదలైన కల్పనల ద్వారా నాయికా నాయకుల మధ్య అభిలాష విప్రలంభాన్ని కలిగించాడు. కావ్యంలో కేవలం చిలుక ద్వారానే గంగాధరకవి నాయికా నాయకుల మధ్య ప్రణయ రాయబారాన్ని నడిపాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ తపతి చెలికత్తెలుగా రంభా, మేనకలు తపతి వివాహం సంవరుణుడితో జరగడానికి తపతికి అన్ని విధాల సహకరిస్తారు. నాటకంలో తపతికోసం తమ ప్రాణాలు కూడ త్యాగం చేయడానికి సిద్ధపడతారు.

నాటకంలో తపతీ సంవరుణులకు సమాగమానంతరం సూర్యుడి వలన ఎడబాటు కలుగుతుంది. ఈ ఎడబాటు వలన నాటకలో కరుణరసం పోషింపబడింది. తపతి మేనక రూపం ధరించడం, రాక్షసి రంభ రూపం ధరించడంలో అద్భుతరసం, కురుపుత్రుడి పరాక్రమంలో వీరరసం పోషింపబడి నాటకం రసాత్మకంగా సాగింది.

కావ్యంలో సంవరుణుడు అనుకూల నాయకుడు. నాటకంలో సంవరుణుడు దక్షిణనాయకుడు. నాటకంలో సంవరుణుడికి ప్రథమ భార్య దేవి వలన సంతానం లేకపోవడం వలన సంతానార్థం ప్రార్థిస్తాడు. అశరీరవాణి ఆజ్ఞ మేరకు తపతిని వివాహం చేసుకుంటాడు. కావ్యంలో సంవరుణుడికి తపతి గురించి చిలుక చెప్పడం ద్వారా తపతిని వివాహం చేసుకుంటాడు. కావ్యనాటకాలు రెండింటిలోనూ సంవరుణుడి వివాహానికి ముందు అభిలాష విప్రలంభం వ్యక్తమయింది.

వివాహానంతరం సంభోగ శృంగారం అభివ్యక్తమయింది. నాటకంలో వివాహానంతరం వియోగ విప్రలంభాన్ని కూడ సంవరుణుడు ద్వారా వ్యక్తమయింది. కావ్యంలో తపతీ సంవరుణుల ప్రేమ కన్నా నాటకంలో తపతి సంవరుణుల ప్రేమ గొప్పది. నాటకంలో సంవరుణుడు తపతికోసం ప్రాణత్యాగానికి కూడ సిద్ధపడతాడు.

కావ్యంలో తపతి చిలుక ద్వారా సంవరుణుడి గురించి తెలుసుకుంటుంది. నాటకంలో నారదుడి ద్వారా సంవరుణుడి గురించి తెలుసుకుంటుంది. కావ్యంలో చిలుక చెప్పిన సంవరుణుడి అందచందాల వర్ణన వినడం ద్వారా తపతి అభిలాష విప్రలంభాన్ని తద్వారా విప్రలంభంగా వ్యక్తమయింది. నాటకంలో తపతి సంవరుణుడి అందచందాలను కార్తికేయ మందిరంలో అదృశ్యంగా ఉండి వీక్షించడం ద్వారా అభిలాష విప్రలంభాన్ని అనుభవిస్తుంది. నాటకంలో తపతి రాజ్యక్షేమం కోసం తన భర్తకి, లోకకల్యాణంకోసం కుమారుడికి కొంతకాలం దూరంగా ఉంటుంది. సంవరుణుడి కోసం తన ప్రాణాలను ఇవ్వడానికి కూడ వెనుకాడదు. కావ్య నాటకాలు రెండింటిలోనూ తపతి తండ్రి మాట జవదాటదు. కావ్యంలో కన్నా నాటకంలో తపతి పాత్ర ఉదాత్తంగా చిత్రింపబడింది.

నాటకంలో తపతికి వివాహం చెయ్యాలని సూర్యుడు వరాన్వేషణ చేస్తాడు. కావ్యంలో చిలుక తపతికి వరాన్వేషణ చేస్తుంది. చిలుక తన మాటలతో సంవరుణుడిని ఆకట్టుకొని తపతి రూపరేఖల్ని వర్ణించి సంవరుణుడిని విరహవేదనకు గురిచేస్తుంది. తపతికి కూడ సంవరుణుడి అందచందాలను వర్ణించి చెప్పి నాయికా నాయకుల ప్రణయగాధకి చిలుక కర్త, కర్మ, క్రియ ఔతుంది. నాటకంలో సూర్యుడు, నారదుడు, కర్ణపూరం, మన్మథ సందేశం చేసిన కార్యాన్ని కావ్యంలో చిలుక ఒక్కటే సాధించింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వశిష్ఠుడు సంవరుణుడి తపస్సుకి మెచ్చి సూర్యమండలానికి వెళ్ళి సూర్యుడిని తన కుమార్తె అయిన తపతిని సంవరుణుడికి ఇవ్వమని అడుగుతాడు. తపతిని తీసుకువచ్చి సంవరుణుడితో వివాహం జరిపిస్తాడు. కావ్యంలో సంవరుణుడు తపతితో సుఖిస్తూ రాజధర్మాన్ని విస్మరించినపుడు వశిష్ఠుడు సంవరుణుడికి కర్తవ్య బోధ చేస్తాడు. నాటకంలో సంవరుణుడికి రాజ్యంలో క్షామం సంభవించినదని చెప్పి అమాత్యుడు రాజ్యానికి తీసుకువస్తాడు. నాటకంలో వశిష్ఠుడు కురుపుత్రుడిని తీసుకువచ్చి సంవరుణుడికి అప్పగించి కురుపుత్రుడి జన్మ వృత్తాంతాన్ని తపతి సంవరుణులకు వివరంగా తెలియజేస్తాడు.

కావ్యంలో అరుంధతి వశిష్ఠుడితో పాటుగా తపతీ సంవరుణులకి దగ్గరుండి వివాహం చేస్తుంది. నాటకంలో అరుంధతి పాత్ర లేదు.

కావ్యంలో సూర్యుడు వశిష్ఠుడు వచ్చి సంవరుణుడి కోసం తపతిని యివ్వమనగానే వశిష్ఠుడితో తపతిని పంపి చేతులు దులుపుకుంటాడు. నాటకంలో సూర్యుడు తపతికి తగిన వరుడెవ్వరని నారదమహర్షిని అడిగి సంవరుణుడి గురించి తెలుసుకుంటాడు. సంవరుణుడు రాజ ధర్మాన్ని నిర్లక్ష్యం చేసినప్పుడు సూర్యుడు సంవరుణుడి నుండి తపతిని వేరు చేస్తాడు. సంవరుణుడు త్వరగా రాజ్యం చేరుకోవడానికి రథాన్ని, సారథిని పంపిస్తాడు. తపతికి పుత్రవియోగ దుఃఖం కలగకుండ ఆమెను మోహపెడతాడు. తపతికి తెలియకుండ కురుపుత్రుడిని పురిటిలోనే దివ్య ఆహారాలతో పోషించడానికి తీసుకువెళ్తాడు. కావ్యంలో కన్నా నాటకంలో సూర్యుడు పాత్ర ఉదాత్తంగా పోషింపబడింది. నాటకంలో సూర్యుడు తండ్రిగా, మావగారిగా, తాతగా కృతకృత్యుడయ్యాడు.

నాటకంలో విదూషకుడు సంవరుణుడికి అన్ని విధాల చేదోడు వాదోడుగా ఉంటాడు. సంవరుణుడు తపతి వలన విరహ వేదన అనుభవిస్తున్నప్పుడు అతడిని ఊరడిస్తాడు. తపతి కన్పించక ఆవేదన చెందుతూ ఉన్నప్పుడు సంవరుణుడికి ఉపశాంతి కలిగిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ అభిలాష విప్రలంభం, సంభోగ శృంగారం వర్ణింపబడ్డాయి. నాటకంలో విరహ విప్రలంభం వర్ణించబడింది. కావ్య నాటకాలు రెండింటిలోనూ సంవరుణుడు ధీరోదాత్తుడే కావున వీరరసం పోషింపబడింది. నాటకంలో కురుపుత్రుడు రాక్షసిని ధైర్యంగా ఎదుర్కొనడం వలన కురుపుత్రుడిలో కూడ వీరరసం అభివ్యక్తమయింది. నాటకంలో సంవరుణుడికి ముందు సంతానం లేదు. తపతి వలన సంతానం కలుగుతుంది. కురుపుత్రుడు జన్మించడం వలన సంవరుణుడితో వత్సల రసం కన్పిస్తోంది. నాటకంలో వివాహానంతరం తపతీ సంవరుణులకు ఎడబాటు కలగడం వలన కరుణరసం పోషింపబడింది. విదూషకుడి ఆకారచేష్టల వలన హాస్యరసం వ్యక్తమయింది. కావ్య నాటకాలు రెండింటిలోనూ అద్భుతరసం పోషింపబడింది. కావ్యంలో మలయగిరి వర్ణనలో అద్భుతరసం కన్పిస్తోంది. నాటకంలో స్ఫటిక సభా మండపం, సూర్యుడు తపతిని మోహపెట్టడం తపతీ సంవరుణులు తమకు కుమారుడు ఉన్నాడని వశిష్ఠుని ద్వారా తెలుసుకోవడం మొదలైన కల్పనలు అద్భుతరస ప్రధానమైనవే. కావ్య నాటకాలు రెండింటిలోనూ సంవరుణుడి రాజ్యాన్ని అనావృష్టి బాధించడంలో బీభత్సరసం కన్పిస్తోంది. కావ్య నాటకాలు రెండింటిలోనూ సంవరుణుడు తపతికోసం సూర్యుడికోసం తపస్సు చేయడంలో భక్తిరసం కన్పిస్తోంది.

కావ్యనాటకాలు రెండింటిలోనూ శృంగారరసమే ప్రధానరసంగా ఉంది. కావ్యంలో అంగరసాలు వీరం, అద్భుత, బీభత్సరసాలు ఉన్నాయి. నాటకంలో అంగరసాలుగా వీరం, అద్భుత, బీభత్స, కరుణ, హాస్య, వత్సల రసాలు ఉన్నాయి. కావ్యంలో హాస్య, వత్సల, కరుణ రసాలు లేవు.

కావ్యంలో అష్టాదశ వర్ణనలైన నగర, గిరి, వన, ఋతు, చంద్రోదయ, విరహ, జలక్రీడ మొదలైన వర్ణనలు ఎక్కువగా ఉపకరిస్తున్నాయి. నాటకంలో వర్ణనలు చాలా తక్కువగా సందర్భానుగుణంగా ఉండి రసాభివ్యక్తికి ఎక్కువగా తోడ్పడం లేదు.

**నాల్గవ అధ్యాయంలో "సుభద్రా ధనుంజయం – సుభద్రాల్యాణము నాట కావ్యాల పరిశీలన"**లో సుభద్రాధనంజయం నాటకం ఔచిత్యవంతమైన కల్పనలతో అలరారుతోంది. అలంబసుడనే రాక్షసుడు, గాత్రిక, గాత్రిక మీద అర్జునుడి పది పేర్లు ఉండడం మొదలైన కల్పనలు నాటకంలో సుభద్రార్జునులకు అభిలాష విప్రలంభాన్ని కలిగించాయి. కావ్యంలో శ్రీకృష్ణుడి మాటల వలన సుభద్ర కపటయతి రూపంలో వచ్చినది అర్జునుడేనని గ్రహించి అర్జునుడి పట్ల అభిలాష విప్రలంభాన్ని పొందుతుంది.

కావ్యంలో తిమ్మక్క సుభద్రల్యాణ కథకి సుందోపసుందుల వృత్తాంతాన్ని ఆటంకంగా భావించి సుందోపసుందుల కథని సంక్షేపించింది. ధర్మరాజు, అర్జునుల భాతృప్రేమని తెలియజేసింది తిమ్మక్క అర్జునుడి గురించి తెలుసుకోవడం, యతి అర్జునుడి గురించి చెప్పడం వంటి కల్పనలు సుభద్రార్జునుల అనురాగం బలపడడానికి కారణం అయ్యాయి. సుభద్ర అర్జునుడితో మాట్లాడడానికి సిగ్గుపడుతుందని భావించిన తిమ్మక్క మొదట అర్జునుడితో చిలుక చేత మాట్లాడించింది. శ్రీకృష్ణుడిని దివ్యపురుషుడిలా కాకుండా సామాన్య మానవుడిలాగా చిత్రించింది. వదినా మరదళ్ళ వేళాకోళాలు, బావ బావమరుదుల సరదాలతో, తెలుగు నుడికారంతో తిమ్మక్క కావ్యాన్ని రచించింది.

కావ్యంలో కన్నా నాటకంలో అర్జునుడి పాత్ర ఉదాత్తంగా పోషింపబడింది. నాటకంలో సుభద్ర కోసం మరణించాలనుకోవడం, ద్రౌపదికి సపత్నీమత్సరం కలుగుకుండ సుభద్రను గోపాలికా వేషంలో ఇంద్రప్రస్థానికి తీసుకువెళ్లడంలో అర్జునుడి ముందుచూపు, సుభద్ర పట్ల అర్జునుడి ప్రేమ వ్యక్తం అవుతున్నాయి.

నాటకంలో కన్నా కావ్యంలో సుభద్ర తెలివైనది. నాటకంలో సుభద్ర ముగ్గురు పురుషుల్ని ఒకేసారి ప్రేమించానని కులస్త్రీకి ఇది నిషిద్ధం అని ఆత్మ త్యాగానికి సిద్ధపడుతుంది. ఈ ముగ్గురూ ఒక్కరే అనే విషయాన్ని గ్రహించదు. కానీ కావ్యంలో తనతో నర్మగర్భంగా మాట్లాడిన కపటయతి మాటల్ని బట్టి వచ్చినది అర్జునుడేనని తిమ్మక్క సుభద్ర గ్రహిస్తుంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శ్రీకృష్ణుడు సుభద్రార్జునుల వివాహానికి ముఖ్య కారకుడు. కావ్యంలో కపటయతి ఆగడాలు సుభద్ర శ్రీకృష్ణుడికి తెలియజేసిన సందర్భంలో కృష్ణుడు ఆమెను సముదాయిస్తాడు. సుభద్రతో జాగ్రత్తగా వ్యవహరించమని అర్జునుడిని ఆదేశిస్తాడు. నాటకంలో బలరాముడిని శాంతపరచడంలో అత్యంత నేర్పుని ప్రదర్శిస్తాడు.

కావ్యంలో రుక్మిణి సుభద్రార్జునుల వివాహానికి ఎంతగానో తోడ్పడింది. సుభద్ర విరహవేదనను అనుభవిస్తోందని శ్రీకృష్ణుడికి చెప్పడం, సుభద్రను పెళ్ళి కూతుర్ని చెయ్యడం, సుభద్ర అత్తవారింట ఏ విధంగా మెలగాలో తెలియజేస్తుంది. నాటకంలో రుక్మిణి పాత్ర లేదు. కేవలం నాటకంలో సంభాషణలలోనే రుక్మిణి ప్రస్తావన వస్తుంది.

కావ్యంలో ద్రౌపది సుభద్రతో తన భర్తని పంచుకుంటునందుకు బాధపడుతుంది. మళ్ళీ సుభద్ర శ్రీకృష్ణుడి చెల్లెలు కాబట్టి సర్దుకుపోవాలనుకుంటుంది. నాటకంలో ద్రౌపది సుభద్ర క్షేమాన్ని కోరుకుంటుంది.

విదూషకుడి పాత్ర కేవలం నాటకంలోనే ఉంది. విదూషకుడు తన స్నేహితుడైన అర్జునుడికి అడుగడుగునా సహాయం చేస్తాడు. అవసరమైనప్పుడు తగిన సలహాలు ఇచ్చి, అర్జునుడిలో ధైర్యాన్ని నింపి, కార్యోన్ముఖుడిని చేస్తాడు. అర్జునుడు సుభద్ర వివాహం చేసుకోవడానికి విదూషకుడు ఎంతో ఉపయోగపడతాడు. విదూషకుడి ద్వారా నాటకంలో హాస్యరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ బలరాముడికి సుభద్రాధనంజయం వివాహం ఇష్టం ఉండదు. కావ్యంలో కన్నా నాటకంలో బలరాముడు మిక్కిలి క్రోధవంతుడు.

కావ్య నాటాలు రెండింటిలోనూ శృంగారరసం ప్రధానరసంగా, మిగిలిన రసాలు అంగరసాలుగా ఉన్నాయి. కావ్య నాటకాలు రెండింటిలోనూ సుభద్రార్జునులు వివాహానికి ముందు విరహవేదన అనుభవించడం వలన అభిలాష విప్రలంభం, వివాహానంతరం సంభోగ శృంగారం పోషింపబడింది. నాటకంలో సుభద్ర అపహరించడం వలన అర్జునుడు ఆవేదన చెందడం వలన నాటకంలో విరహ విప్రలంభం కూడ పోషింపబడింది.

నాటకంలో విదూషకుడు స్త్రీలు ధరించే ఆభరణాలను ధరించడంలో హాస్యరసం వ్యక్తమైంది. కావ్యంలో కృష్ణుడు అర్జునుడిని ఆటపట్టించడం వలన హాస్యరసం వ్యక్తమైంది. నాటకంలో సుభద్రని

రాక్షసుడు అపహరించడం వలన కరుణరసం అభివ్యక్తమైంది. కావ్యంలో కరుణరసం లేదు. కావ్య నాటకాలు రెండింటిలోనూ అర్జునుడు యాదవ వీరులను ఎదుర్కొనే సందర్భంలో రౌద్రరసం వ్యక్తమైంది. నాటకంలో అర్జునుడు రాక్షసుడిని ఎదిరించాలనుకోవడంలో కూడ రౌద్రరసం పోషింపబడింది. కావ్యంలో అర్జునుడి ప్రతాపాన్ని శ్రీకృష్ణుడు, విదూషకుడు కీర్తించడం వలన వీరరసం పోషింపబడింది. కావ్యంలో సుభద్ర పట్ల చూపే సోదరప్రేమలో వత్సల రసం అభివ్యక్తమైంది. నాటకకంలో వత్సల రసం లేదు. కావ్యంలో అర్జునుడు వివాహానంతరం రుక్మిణి, శ్రీకృష్ణులను స్తుతించే సందర్భంలో భక్తిరసం కన్పిస్తోంది. నాటకంలో అపహరింపబడిన సుభద్ర కాత్యాయనిదేవి రక్షించిన సందర్భంలో అర్జునుడు భక్తితో కాత్యాయనిదేవిని స్తుతించడంలో భక్తిరసం అభివ్యక్తమైంది.

శృంగార, హాస్య, రౌద్ర, వీర, భక్తి రసాలు కావ్య నాటకాలు రెండింటిలోనూ ఉన్నాయి. వత్సల రసం కావ్యంలో మాత్రమే ఉంది. కరుణ, అద్భుత రసాలు నాటకంలో మాత్రమే ఉన్నాయి.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వర్ణనలు రసాభివ్యక్తి ఉపయోగపడుతున్నాయి. సుభద్రార్జునుల వర్ణనలు కావ్య నాటకాలు రెండింటిలోనూ ఉన్నాయి. కావ్యంలో వర్ణనలు విస్తృతంగా ఉన్నాయి. నాటకంలో వర్ణనలు సందర్భానుగుణంగా పరిమితంగా ఉన్నాయి.

**ఐదవ అధ్యాయం ఛత్రపతి సామ్రాజ్యమ్ – శ్రీ శివభారతము నాటక కావ్యాల పరిశీలన"లో,** గడియారం వేంకట శేషశాస్త్రి గారు శ్రీ శివభారతము కావ్య రచన చేసే సమయంలో శివాజీ జీవిత చరిత్రలోని శివాజీ ప్రతిష్ఠకి భంగం కలిగించే అంశాలను పరిహరించి శివాజీని ఉత్తమ చారిత్రక పౌరుడిగా తీర్చిదిద్దారు. మూలశంకర మాణిక్‌లాల్ కూడ ఛత్రపతి సామ్రాజ్యం నాటకంలో శివాజీ సామ్రాజ్యాన్ని స్థాపించడానికి అవసరమైన సంఘటనలతో నాటకాన్ని రాశారు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ వీరు పురుషుడు. కావ్యంలో శివాజీలో దాన, ధర్మ వీరాలు కూడ పోషింపబడ్డాయి. సమర్థ రామదాస స్వామికి రాజ్యాన్ని దానంగా ఇవ్వడంలో దానవీరం, శత్రువులను కూడ కరుణించి విడిచి పెట్టడంలో యుద్ధవీరం కన్పిస్తోంది. నాటకంలో కన్నా కావ్యంలో శివాజీ ఉదాత్తంగా చిత్రింపబడ్డాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ జీజియ ధీరవనిత. నాటకంలో కన్నా కావ్యంలో జీజియ పాత్రకి నిడివి ఎక్కువ. కావ్యంలో జీజియ శివాజీని తీర్చిదిద్ది తను అనుకున్నది సాధించింది. కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ రాజ్యంలో లేని సమయంలో రాచకార్యాలను కూడా జీజియ చక్కబెడుతుంది.

నాటకంలో కంటె కావ్యంలో దాదోజీ పాత్రకి విస్తృతి ఎక్కువ. షాజీ దగ్గరలేని సమయంలో జీజియాకి అండగా నిలుస్తాడు. శివాజీ జన్మించిన విషయాన్ని షాజీకి తెలియజేస్తాడు. శివాజీకి రాజనీతి విద్యలను నేర్పి సకల విద్యాపారంగతుడిని చేస్తాడు. నాటకంలో దాదోజీ శివాజీకి కేవలం రాజనీతి విషయాలు మాత్రమే బోధిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ సయీబాయి పాత్రకి నిడివి తక్కువ. శివాజీ మనసెరిగి ఈమె ప్రవర్తిస్తుంది. కావ్యంలో షాజీని నవాబ్ నిర్బంధించినప్పుడు శివాజీకి ఏం చెయ్యాలో తోచని సమయంలో పరిష్కారం కోసం భవానిదేవిని ప్రార్థించమని సలహా ఇస్తుంది.

కావ్యంలో షాజీ నిజామ్ పక్షం వహిస్తాడు. చివరికి ఆ నిజామ్ చేతిలో బందీ అవుతాడు. అయినా కూడ నిజామ్‌ని విడువడు. శివాజీ కీర్తి ప్రతిష్ఠలు చూసి ఆనందిస్తాడు. శివాజీ తీర్చిదిద్దిన జీజియాని ప్రశంసిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ బాజీ ప్రభువు వీరుడు. పదిహేనువేల బీజాపూర్ సేనతో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన ధీరుడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ మంత్రిగా తానాజీ ఉంటాడు. కావ్యంలో తానాజీ తన కుమారుడి వివాహాన్ని కూడా లెక్కచేయక సింహగడ్‌ను జయించడానికి వెళ్ళి వీరమరణం పొందుతాడు. నాటకంలో షాజీని నవాబ్ బంధించినప్పుడు సహాయం కోసం ఢిల్లీ పాదుషాకి లేఖ రాయమని శివాజీకి సలహాయిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వీరరసం ప్రధానరసంగా ఉంది. కావ్యంలో దాన, దయ, యుద్ధ, ధర్మాలు వీరాలు పోషింపబడ్డాయి. నాటకంలో దయా, యుద్ధ వీరాలు మాత్రమే పోషింపబడ్డాయి.

నాటకంలో కన్నా కావ్యంలో కరుణరసం మిక్కుటముగా పోషింపబడింది. కావ్యంలో లుకజీ, దాదోజీ, షాజీ, తానాజీ, బాజీ ప్రభువు మరణాలవల్ల కావ్యంలో కరుణరసం ఎక్కువగా పోషింపబడింది. తానాజీ, బాజీ ప్రభువుల వీర మరణాలు పొందడంలో నాటకంలో కరుణరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ భక్తి రసం కన్పిస్తోంది. కావ్యంలో తండ్రిని విడిపించే మార్గం కోసం శివాజీ భవానిదేవిని ప్రార్థిస్తే నాటకంలో సామ్రాజ్య స్థాపనకోసం శివాజీ భవానిదేవిని ప్రార్థిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ జీజియాలో వత్సలరసం కన్పిస్తోంది. కావ్యంలో శివాజీ స్వతంత్ర సామ్రాజ్యాన్ని స్థాపిస్తానన్న సమయంలో జీజియ శివాజీ పట్ల వాత్సల్యాన్ని కనబరుస్తుంది. నాటకంలో శివాజీ ఔరంగజేబు బందీ నుండి తప్పించుకొని తిరిగి రాజ్యానికి వచ్చినప్పుడు శివాజీ పట్ల వాత్సల్యాన్ని వ్యక్తం చేస్తుంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ అద్భుతరసం కన్పిస్తోంది. కావ్యంలో శివాజీ గోవులను రక్షించినప్పుడు జీజియ ఆనందంతో విస్మయానికి లోనౌతుంది. నాటకంలో రాజ్యానికి తిరిగి వచ్చిన కుమారుడికి చూసి ఆశ్చర్యానికి లోనౌతుంది.

కావ్యంలో సింహగడ్‌ను జయించడానికి వెళ్ళిన తానాజీ శత్రువులతో యుద్ధం చేసిన తీరులో బీభత్సరసం అభివ్యక్తమయింది. నాటకంలో బీభత్సరసం లేదు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ రౌద్రరసం కన్పిస్తోంది. శివాజీ అఫ్జల్‌ఖాన్‌ను వధించే సమయంలో రౌద్రరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శృంగారరసం లేదు. నాటకంలో కేవలం ఒక గీతంలో మాత్రమే సూచన ప్రాయంగా శృంగారరసం కన్పిస్తోంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ శౌర్య, ప్రతాపాల వర్ణనల వలన వీరరసం పోషింపబడింది. కావ్యంలో విస్తృత వర్ణనలు ఆనాటి మహారాష్ట్రుల స్థితిగతులు, మంత్రాంగం, వీరులు యుద్ధానికి వెళ్ళేటప్పుడు అలంకరించే తీరు మొదలైన విషయాలు తెలియజేశాయి. నాటకంలో వర్ణనలు చాలా తక్కువగా ఉన్నాయి. శివాజీ వర్ణన, దుర్గాల వర్ణనలు నాటకంలో ఉన్నాయి.

పై అధ్యాయాలలో పేర్కొన్న నాల్గు నాటకాలను, కావ్యాలను పరిశీలించినప్పుడు సంస్కృత నాటకాల్ని చూసి తెలుగు కావ్యాలు రచించారు అని చెప్పడానికి ఆధారాలు ఎక్కడా లేవు. చండకౌశికమ్, హరిశ్చంద్రోపాఖ్యానములను తులనాత్మక పరిశోధన చేసినప్పుడు చండకౌశికమ్ కంటే హరిశ్చంద్రోపాఖ్యానము పాత్రపోషణలోనూ, రసపోషణలోనూ, వర్ణనలలోనూ మిక్కిలి ఆస్వాదయోగ్యంగా ఉంది. తపతీసంవరణం, తపతీసంవరణోపాఖ్యానములను పోల్చి చూసినప్పుడు కావ్యం కంటే నాటకం అనేక కల్పనలతో ప్రేక్షకుల మన్ననలను పొందింది. సుభద్రాధనంజయం, సుభద్రాకల్యాణములను పరిశీలించినప్పుడు నాటకంలో కల్పనలు ఎక్కువగా ఉంటే కావ్యంలో

రసపోషణ ఎక్కువగా కావ్యనాటకాలు రెండూ ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి. ఛత్రపతి సామ్రాజ్యమ్, శ్రీశివభారతము పరిశీలించగా నాటకంలో కేవలం శివాజీ సామ్రాజ్యాన్ని ఏ విధంగా స్థాపించాడో మాత్రమే ఉంది. కావ్యంలో శివాజీ జన్మించడానికి పూర్వం ఉన్న పరిస్థితుల దగ్గర నుండి శివాజీ సామ్రాజ్య స్థాపన చెయ్యడం వరకు ఉంది. కావ్యం రసనిర్వహణ, పాత్రచిత్రణ, వర్ణనలలో అనేకమంది పాఠకుల మన్ననలను పొందింది.

# ఉపయుక్త గ్రంథ సూచిక (Bibliography)


- అచ్యుత రామారావు, చావలి. ***తాళ్ళపాక తిమ్మక్క – సుభద్రా కల్యాణము – ఒక పరిశీలన.*** ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం, (అ.సి.గ్రం), ఆంధ్రవిశ్వకళాపరిషత్, వాల్తేరు: 1997.
- అజీజ్ మిర్జా మహ్మద్. ***సంస్కృత నాటకము.*** హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ, 1978.
- ఆనందమూర్తి, వి. ***సంస్కృతము నందు అనిదితమైన తెలుగు ప్రబంధములు.*** పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైద్రాబాద్ : 1984.
- అప్పారావు పి.యస్., పోణంగి. (అనువాదము), ***నాట్యశాస్త్రము.*** హైదరాబాదు : నాట్యమాల ప్రచురణ, 1982.
- ఆరుద్ర, ***సమగ్ర ఆంధ్ర సాహిత్యం.*** మొదటి, రెండు, మూడు, నాలుగు సంపుటములు. హైదరాబాద్ : తెలుగు అకాడమి, 2002.
- కృష్ణకుమారి, నాయని. (సంపాదకత్వం) ***శృంగార శాకుంతలము.*** హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1967.
- కృష్ణబాబు, జోశ్యుల. ***తెలుగులో హరిశ్చంద్ర నాటకాలు తులనాత్మక పరిశీలన.*** పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం, (అ.సి.గ్రం), తెలుగు విశ్వవిద్యాలయం,1995.
- కృష్ణమాచార్య, ఎక్కిరాల. ***సుభద్ర.*** మద్రాసు : కాంతి ప్రెస్, 2000.
- గోపాలరెడ్డి, సుజాతారెడ్డి, ముదిగంటి. ***సంస్కృత సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము ప్రచురణ, 1986.
- తిమ్మక్క, తాళ్ళపాక. ***సుభద్రా కల్యాణము.*** ప్రభాకరశాస్త్రి వేటూరి (పరిష్కరణ)
- తిరుమలరావు, సర్దేశాయి. ***సాహిత్యతత్త్వము శివభారత దర్శనము.*** అనంతపురము : శారదా ప్రింటింగ్ ప్రెస్, 1971.
- ***తెలుగు సాహిత్య కోశం, ప్రాచీన సాహిత్యం*** (సంకలనం), హైదరాబాదు : తెలుగు అకాడమి ద్వితీయ ముద్రణ, 2005.
- దుర్గయ్య, పల్లా. ***ప్రబంధ వాఙ్మయ వికాసము*** మొదటి సంపుటి, హైదరాబాదు : ఆంధ్ర రచయితల సహకార సంఘ ముద్రణాలయము, 1985.

- దొరస్వామిశర్మ, రావూరి. (పరిష్కరణ) ***వసుచరిత్ర.*** విజయవాడ : ఎమెస్కోబుక్స్, 2013.
- నరసింహం, అంతటి. ***ప్రబంధములలో ప్రకృతి వర్ణనలు.*** హైదరాబాదు : సమతా సహితి ప్రచురణ, 1979.
- నాగభూషణశర్మ, మొదలి. ***నాటకశిల్పం.*** హైదరాబాద్ : క్రియేటివ్‌లింక్స్ పబ్లికేషన్స్, 2013.
- నాగయ్య, జి. ***తెలుగు సాహిత్య సమీక్ష.*** మొదటి సంపుటి, ఐదవ ముద్రణ, తిరుపతి : నవ్యపరిశోధక ప్రచురణ, 2004.
- ***నాటక విజ్ఞాన సర్వస్వం.*** ఎనిమిదవ సంపుటి, హైదరాబాదు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2008.
- నిత్యానందరావు, వెలుదండ. ***విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన.*** హైదరాబాద్ : 1987.
- పద్మావతి, ఎస్. ***శివభారతం పరిశీలన*** ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం, (అ.సి.గ్రం), ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ : 1978.
- పాపయ్యశాస్త్రి, జంధ్యాల. (సంపాదకత్వం) ***భాగవతం.*** తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానము ప్రచురణ, 2010.
- పెరుమాళ్ళయ్య, తేవప్ప. ***హరిశ్చంద్రోపాఖ్యానము.*** తంజావూరు : ఆనందముద్రా యంత్రాలయం, 1911.
- ప్రభావతి, వాసా. ***ఆంధ్ర సాహిత్యంలో హరిశ్చంద్రో పాఖ్యానము.*** హైదరాబాదు : స్నేహలతా ప్రింటర్స్, 1987.
- పెద్దన్న, విన్నకోట. **కావ్యాలంకార చూడామణి** చెన్నపురి : జ్యోతిష్మతీ ముద్రాక్షరశాల, 1909.
- బాలగంగాధర రావు, యార్లగడ్డ. (వ్యాఖ్యానం) **రాధికా సాంత్వనము.** విజయవాడ : నిర్మలా పబ్లికేషన్సు, 2011.
- బాలగంగాధరరావు, యార్లగడ్డ. (వ్యాఖ్యానం), ***హరవిలాసము.*** విజయవాడ : నిర్మలా పబ్లికేషన్స్, 2015.

- మల్లికార్జునరావు, కప్పగంతుల. ***వ్యాసమాలిక.*** రాజమండ్రి : క.గా.కా.కౌ, ప్రచురణలు, 1983.
- మురళీకృష్ణ, దేవరకొండ. ***షట్చక్రవర్తులు.*** విజయవాడ : శ్రీ మహాలక్ష్మి బుక్ కార్పోరేషన్, 2012.
- మృత్యుంజయరావు, జొన్నలగడ్డ, ***కుమారసంభవము.*** హైదరాబాద్ : మొదటి సంపుటి, రెండవ ముద్రణ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, 2006.
- రాజగోపాలనాయుడు, పి. ***ఛత్రపతి శివాజీ.*** హైదరాబాద్ : ఎమెస్కో బుక్స్, 2011.
- రాజేశ్వరి, సి. ***ఆంధ్రమున ప్రబంధ రూపము నొందిన సంస్కృత నాటకములు.*** హైదరాబాద్: మాధవీబుక్ సెంటర్, 1982.
- రంగాచార్యులు, చెలమచెర్ల. (అనువాదం). ***ఆంధ్రప్రతాపరుద్ర యశోభూషణము.*** చతుర్థముద్రణ, సికింద్రాబాదు : శివాజీ ప్రెస్, 1972.
- రామకృష్ణమాచార్య, నందూరి. (వ్యాఖ్యానం) ***శ్రీమదాంధ్ర మహాభారతము.*** మూడవ సంపుటి, తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానము ముద్రణ, 2008.
- రామస్వామి శాస్త్రులు, వావిళ్ళ. (ప్రకటితం) ***మనుచరిత్ర.*** చెన్నై : 2001.
- లక్ష్మీ కాన్తమ్మ, ఊటుకూరి. ***ఆంధ్ర కవయిత్రులు.*** 1980
- వారిజారాణి, పి. ***తెలుగు సంస్కృత కావ్యాలలో ప్రక్రియా భేదంతో వచ్చిన ఒకే ఇతివృత్త కావ్యాల అధ్యయనం.*** పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, (అ.సి.గ్రం), హైదరాబాద్: 2003.
- వెంకటనారాయణ, స్వర్ణ. ***పూర్వగాథాలహరి.*** చతుర్థముద్రణ, విజయవాడ : విక్టరీ పబ్లిషర్స్, 2014.
- వెంకట పద్మాకరరెడ్డి, ఆకేపాటి. ***తెలుగులో హరిశ్చంద్రకథ.*** హైదరాబాద్ : నవయుగ ప్రచురణలు, 2007.
- వెంకట రామనరసింహం, కాకర్ల. ***ఆంధ్ర ప్రబంధము అవతరణ వికాసములు.*** వాల్తేరు: ఆంధ్రయూనివర్సిటి ముద్రణ, 1965.

- వెంకట రామ నరసింహం, కాకర్ల. ***సాహిత్య దర్శనము.*** విజయవాడ : గంగాధర పబ్లికేషన్స్, 1985.
- వెంకటరామశాస్త్రి, పి. ***తెలుగులో చారిత్రక నాటకాలు.*** రెండవభాగం, హైదరాబాద్ : జాతీయ సాహిత్య పరిషత్ ప్రచురణ, 2006.
- వెంకటరామశాస్త్రి, వేదం. (వ్యాఖ్యానం) ***శృంగారనైషధం.*** హైదరాబాద్ : ఎమెస్కోబుక్, 2012.
- వెంకటరామశాస్త్రి, వేదం. (టిప్పణి) ***హరిశ్చంద్ర ద్విపద.*** జ్యోతిష్మతీ ముద్రాక్షరశాల, 1912.
- వెంకట సత్యనారాయణమూర్తి, బులసు. (వ్యాఖ్యానము). ***చంద్రాలోకము.*** రాజమండ్రి : రోహిణి పబ్లికేషన్స్, 2005.
- వెంకట సుబ్బయ్య, అప్పజోడు. (వ్యాఖ్యానము) ***శ్రీమదాంధ్ర మహాభారతము.*** ఆదిపర్వము, రెండవభాగము, తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానము, 2000
- వెంకటావధాని, దివాకర్ల. ***ఆంధ్రవాఙ్మయ చరిత్రము.*** హైదరాబాద్ : ఆంధ్రవాఙ్మయ చరిత్రము, 1979.
- వేంకటకవి, చేమకూర. ***విజయవిలాసము.*** విజయవాడ : ఎమెస్కోబుక్స్, 2009.
- వేంకట నరసింహాచార్య, ఉత్పల. (పరిష్కరణ) ***కవికర్ణరసాయనము.*** చెన్నపురి : వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ ప్రచురణ, 1916.
- వేంకటశాస్త్రి, గడియారము. ***శ్రీశివభారతము.*** నాల్గవ ముద్రణ, ప్రొద్దుటూరు :1965.
- వేంకటావధాని, దివాకర్ల. ***సాహిత్య సోపానములు.*** హైదరాబాదు : ఆంధ్ర సారస్వత పరిషత్తు, 2003.
- వేదవ్యాస, ఎక్కిరాల. ***ఛత్రపతి శివాజీ.*** మొదటి, రెండు సంపుటాలు, హైదరాబాద్ : యోగమిత్ర మండలి, 2006.
- శ్రీరామచంద్రుడు, పుల్లెల. (వ్యాఖ్యానం) ***నాట్యశాస్త్రమ్.*** హైదరాబాద్ : 2014.
- శ్రీరామచంద్రుడు, పుల్లెల. (వ్యాఖ్యానం) ***ధ్వన్యాలోకము.*** హైదరాబాద్ : శ్రీజయలక్ష్మి పబ్లికేషన్స్, 1998.

- శ్రీరామమూర్తి, కొర్లపాటి. ***తెలుగు సాహిత్య చరిత్ర.*** తృతీయ భాగము, విశాఖపట్టణము : రమణశ్రీ ప్రచురణ, 1994.
- శేషగిరిరావు, ఆంధ్ర. ***ఆంధ్ర విదుషీమణులు.*** ముక్కామల, ఆంధ్రభూమి బుక్‌డిపో, 1975.
- సత్యనారాయణ, ఎం.వి. (సంపాదకులు). **కావ్య సమీక్షలు.** వాల్తేరు : ఆంధ్రవిశ్వవిద్యాలయం, 1983.
- సీతాకల్యాణి, వి. ***తెలుగులో చారిత్రక కావ్యములు.***
- సీతారామాచార్యులు, బహుజనపల్లి. ***శబ్దరత్నాకరము.*** ఎనిమిదవ ముద్రణ, విజయవాడ : శ్రీ వెంకటేశ్వర బుక్‌డిపో, 2012.
- సుబ్బరాయకవి, వడ్డాది. ***చండకౌశికము.*** రాజమహేంద్రవరము : శ్రీవిద్యానిలయము ముద్రాక్షరశాల, 1920.
- సుబ్రహ్మణ్యం, జి.వి. (వ్యాఖ్యానం) ***హరిశ్చంద్రోపాఖ్యానము.*** హైదరాబాదు : శ్రీ కిరణ్ ప్రింటింగ్ ప్రెస్, 1971.
- సుబ్రహ్మణ్యశాస్త్రి, పోతుకుచ్చి. (అనువాదం) ***తపతీ సంవరణము.*** తెనాలి : 1975.
- సుబ్రహ్మణ్యశాస్త్రి, పోతుకుచ్చి. (అనువాదం) ***సుభద్రాధనంజయము.*** తెనాలి :1970.
- సూర్యనారాయణశాస్త్రి, శిరోమణి సన్నిధానము. (వివరణకర్త), ***నరస భూపాలీయము.*** ద్వితీయ ముద్రణ, హైదరాబాద్ : ఎమెస్కో బుక్స్, 2013.
- సోమనాథుడు, పాల్కురికి. ***పండితారాధ్య చరిత్ర.*** హైదరాబాదు : తెలుగు విశ్వవిద్యాలయము, 1990.
- **సంస్కృత గ్రంథాలు**
- ఉన్ని, ఎన్.పి. & బ్రూస్ ఎమ్. సుల్లివాన్ (అనువాదం) ***తపతీ – సంవరణమ్.*** ఢిల్లీ : నాగ్ పబ్లిషర్స్, 1995.
- ఉన్ని, ఎన్.పి. & బ్రూస్ ఎమ్. సుల్లివాన్ (అనువాదం) ***సుభద్రా ధనంజయ.*** మొదటి సంపుటి, ఢిల్లీ : నాగ్ పబ్లిషర్స్, 2001.
- కుమారస్వామి, రత్నాపన. (వ్యాఖ్యానం), ***ప్రతాపరుద్రీయ.*** మద్రాస్ : సంస్కృత ఎడ్యుకేషన్ సొసైటీ, 1987.

- సిబానిదాస్ గుప్త (ముద్రణ), ***ద చండకౌశిక.*** కలకత్తా : ఏషియాటిక్ సొసైటీ, 1962.
- మాణిక్‌లాల్, మూలశంకర. ***ఛత్రపతి సామ్రాజ్యమ్.*** https://archive.org
- రాజేంద్ర, నాణావటీ. ***మూలశంకర నాట్యత్రయీ.*** న్యూఢిల్లీ : కులసచివ మానిత విశ్వవిద్యాలయ ముద్రణ, 2010.

**వ్యాసాలు**

- సుబ్రహ్మణ్యశాస్త్రి, వేదుల. ***సుబ్రహ్మణ్య భారతి.*** విశాఖపట్నం : ఆంధ్రాయూనివర్సిటి, 2002.
- ***సంస్కృత నాటకోపన్యాసములు.*** యు.జి.సి. సెమినార్‌లో ప్రముఖులు సమర్పించిన ప్రసంగ వ్యాస సమాహారము, ఎస్.వి. ప్రభుత్వ ఓరియంటల్ కళాశాల, హైదరాబాద్ : ఎస్.పి. గ్రాఫిక్స్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, 1999.
- సుబ్రహ్మణ్యం, జి.వి. ***సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు.*** ద్వితీయ ముద్రణ, హైదరాబాదు: తెలుగు అకాడమి, 2002.

**నిఘంటువులు (Dictionary)**

- ***తెలుగు – తెలుగు నిఘంటువు.*** హైదరాబాద్ : తెలుగు అకాడమి, 2011.
- ***బ్రౌణ్య తెలుగు – ఇంగ్లీషు నిఘంటు.*** రెండవ ముద్రణ, హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము, 2007.
- ***శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు.*** చతుర్థ సంపుటము, హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1979
- ***శ్రీ సూర్యనారాయణ నిఘంటువు.*** (అయిదవ సంపుటము), హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1982.

శ్రీహరి, రవ్వా. ***శ్రీహరి నిఘంటువు.*** హైదరాబాద్ : శ్రీ గోపాల్ పబ్లికేషన్స్, 2004.

# Synopsis for
# Telugu Kavayaluga Roopondina Samskrutha Natakalu - Pariseelana

A Thesis submitted to the
University of Hyderabad in partial fulfillment of the
Degree of
Doctor of Philosophy
in
Telugu

By

**Satya Gayatri Janamanchi**
**Roll No. 09HTPH08**

Supervisor
**Prof. Remilla Venkata Ramakrishna Sastry**

Department of Telugu,
School of Humanities
University of Hyderabad
Hyderabad-500 046
**TELANGANA, INDIA**
June, 2018

# తెలుగు కావ్యాలుగా రూపొందిన సంస్కృత నాటకాలు - పరిశీలన

పిహెచ్.డి. పట్టాకోసం

హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు సమర్పించిన

సిద్ధాంత గ్రంథసార సంగ్రహం


పరిశోధన

**సత్య గాయత్రి జనమంచి**

**Roll No. 09HTPH08**

పర్యవేక్షణ

**ప్రొ. రేమిల్ల వెంకట రామకృష్ణశాస్త్రి**

**తెలుగుశాఖ**

మానవీయ శాస్త్ర విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500 046


జూన్, 2018

# తెలుగు కావ్యాలుగా రూపొందిన సంస్కృత నాటకాలు - పరిశీలన

**పరిచయం (Introduction) :**

'తెలుగు కావ్యాలుగా రూపొందిన సంస్కృత నాటకాలు – పరిశీలన' అనేది నా పరిశోధనాంశం. నిర్వచనం రీత్యా నాటకం కూడా కావ్యమే అయినప్పటికీ బ్రాహ్మణ వశిష్ఠ న్యాయంగా ఇక్కడ కావ్య శబ్దాన్ని శ్రవ్యకావ్యంగా భావించి కావ్య, నాటకాలు అని వేరు వేరుగా వ్యవహరించాను. సంస్కృత నాటకాలను చూసే తెలుగు కావ్యాలు రచించారు అనడానికి తగినన్ని ప్రమాణాలు లేవు. అయినప్పటికీ ఒకే కథని తీసుకొని కవులు కావ్యనాటకాలను రచించడం వల్ల ఛాయామాత్రంగా ప్రభావం ఉండి ఉండవచ్చునని భావించి ఈ అంశాన్ని తీసుకొని పరిశోధించడం జరిగింది.

ఒకే ఇతివృత్తాన్ని కావ్యంగా మలచినపుడు కవికి తాను చెప్పదలచుకున్న విషయాన్ని స్వేచ్ఛగా ప్రకటించడానికి అవకాశం ఉంటుంది. పాత్రపోషణ, రసము, వర్ణనలు మొదలైన విషయాలలో కావ్యకర్తకి స్వతంత్ర ఉంటుంది. కానీ నాటకకర్తకి ఆ స్వేచ్ఛ ఉండదు. నాటక లక్షణాలకు అనుగుణంగా ఇతివృత్తాన్ని మలచవలసి ఉంటుంది. ఒకే ఇతివృత్తంతో వచ్చిన కావ్యనాటకాలలో పాత్రపోషణ, రసపోషణ, వర్ణనలు, ఇతివృత్తంలో మార్పులు, చేర్పులు ఏ విధంగా ఉన్నాయో తెలియజేయడం ఈ పరిశోధన ముఖ్య ఉద్దేశ్యం.

**పరిశోధన లక్ష్యాలు (Aims of Research) :**

1. కావ్యనాటకాల ఇతివృత్త కల్పనలలోని తేడాలు ఏ విధంగా ఉన్నాయో చెప్పడం.
2. ఈ కల్పనలు ఔచిత్యాన్ని తెలియజేయడం.
3. పాత్రలలోని తేడాలు, పాత్రపోషణలో భేద సాదృశ్యాలను తెలియజేయడం.
4. కావ్యనాటకాలలోని ఏయే రసాలు పోషింపబడ్డాయి. వాటి భేద సాదృశ్యాలను తెలియజేయడం.
5. కావ్య నాటకాలలో వర్ణనలు ఏ విధంగా ఉన్నాయని తెలియజేయడం.

**పరిశోధనా పద్ధతి (Research Methodology) :**

ముందుగా నేను తెలుగు సాహిత్య చరిత్రలు తీసుకొని కావ్యాల జాబితా తయారు చేసుకొన్నాను. అలాగే సంస్కృత సాహిత్య చరిత్రల నుండి నాటకాల జాబితా తయారు చేశాను. ఈ రెండు

జాబితాలలోంచి ఒకే ఇతివృత్త పరంగా ఉన్న కావ్య నాటకాలను ఎంపిక చేసుకున్నాను. ఎంపిక చేసుకున్న కావ్య నాటకాలనుండి పూర్వ పరిశోధకులు చేసిన కావ్య నాటకాలను విడిచిపెట్టి తక్కిన వాటిలో నా పరిశోధనకు నాలుగు కావ్య నాటకాలను విశ్లేషణాత్మక పద్ధతిలో పరిశోధన చేశాను.

**పరిశోధనా పరిధి (Scope of Research) :**

క్రింది కావ్య నాటకాలను నేను నా పరిశోధనకు ప్రధాన ఆకరాలుగా పరిధిని నిర్ణయించుకున్నాను.

| | **తెలుగు** | | **సంస్కృతం** |
|---|---|---|---|
| 1. | సుభద్రాకల్యాణము<br>– తాళ్ళపాక తిమ్మక్క | 1. | సుభద్రాధనంజయం<br>– కులశేఖర కవి |
| 2. | తపతీ సంవరణోపాఖ్యానము<br>– అద్దంకి గంగాధరుడు | 2. | తపతీ సంవరణం<br>– కులశేఖరకవి |
| 3. | హరిశ్చంద్రోపాఖ్యానము<br>– గౌరన | 3. | చండకౌశికమ్<br>– క్షేమీశ్వరుడు |
| 4. | శ్రీ శివభారతము<br>– గడియారం వెంకట శేషశాస్త్రి | 4. | ఛత్రపతి సామ్రాజ్యమ్<br>మూలశంకర మాణిక్‌లాల్ |

**పూర్వ పరిశోధన సమీక్ష (Review of Research) :**

**"ఆంధ్రమున ప్రబంధ రూపమునొందిన సంస్కృత నాటకములు"** అనే పరిశోధనా గ్రంథాన్ని డా. సి. రాజేశ్వరిగారు బెంగుళూరు విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. పట్టా కోసం సమర్పించారు. వీరు పరిశోధించిన కావ్య నాటకాలు.

| | **తెలుగు** | | **సంస్కృతం** |
|---|---|---|---|
| 1. | కేయూరబాహు చరిత్ర | 1. | విద్ధసాల భంజిక |
| 2. | క్రీడాభిరామము | 2. | ప్రేమాభిరామము |
| 3. | శృంగార శాకుంతలము | 3. | అభిజ్ఞాన శాకుంతలము |

| | | | |
|---|---|---|---|
| 4. | ప్రబోధ చంద్రోదయము | 4. | ప్రబోధ చంద్రోదయము |
| 5. | ప్రసన్న రాఘవము | 5. | ప్రసన్న రాఘవము |
| 6. | అనర్ఘ రాఘవము | 6. | అనర్ఘ రాఘవము |

డా. పి. వారిజారాణిగారు **"తెలుగు సంస్కృత కావ్యాల్లో ప్రక్రియా భేదంతో వచ్చిన ఒకే ఇతివృత్త కావ్యాల అధ్యయనం"** అనే పరిశోధనా గ్రంథాన్ని 2003లో హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. వ్యాసాన్ని సమర్పించారు. వీరు పరిశోధించిన కావ్యనాటకాలు.

| | **తెలుగు** | | **సంస్కృతం** |
|---|---|---|---|
| 1. | ప్రభావతీ ప్రద్యుమ్నము | 1. | ప్రద్యుమ్నాభ్యుదయం |
| 2. | యయాతి చరిత్ర | 2. | యయాతి చరితమ్ |
| 3. | ఉత్తర రామాయణం | 3. | ఉత్తర రామచరితమ్ |
| 4. | వాసవదత్తావత్సరాజము | 4. | ప్రతిజ్ఞా యౌగంధరాయణం |

**ద్వితీయ ఆకరాలు (Secondary Sources) :**

నేను పరిశోధనకు తీసుకొన్న కావ్య నాటకాలపై వివిధ విశ్వవిద్యాలయాలలో వచ్చిన పరిశోధనా వ్యాసాలు.

1. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో **"ఆంధ్ర సాహిత్యములో హరిశ్చంద్రోపాఖ్యానము"** అనే అంశంపై 1978లో వాసా ప్రభావతి గారు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తమ సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.
2. **"తెలుగులో హరిశ్చంద్ర నాటకాలు తులనాత్మక పరిశీలన"** అనే అంశంపై 1995లో జె. కృష్ణబాబు తెలుగు విశ్వవిద్యాలయానికి తమ సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.
3. **"తపతీ సంవరణము - కావ్యానుశీలన"** అనే అంశంపై 1991లో టి. రాధాబాయిగారు నాగార్జున విశ్వవిద్యాలయానికి లఘు సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.
4. **"తపతీ సంవరణోపాఖ్యానం - పరిశీలన"** అనే అంశంపై 1992లో పి.వి. ఉమాశశి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి లఘు సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.
5. **"తెలుగులో హరిశ్చంద్ర కథ"** అనే అంశంపై 1997లో ఎ.వి. పద్మాకరరెడ్డి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.

6. **“శివ భారతం పరిశీలన”** అనే అంశంపై 1978లో ఎస్.పద్మావతి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి లఘు సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.

7. **“సాహిత్య తత్వము శివభారత దర్శనము”** అనే విమర్శనా గ్రంథాన్ని 1971లో సర్దేశాయి తిరుమలరావు గారు వెలువరించారు.

అయితే పై పరిశోధనా గ్రంథాలన్నీ ఆయా కావ్యాలు లేదా నాటకాల విశేషాలను వివరించాయి.

నా పరిశోధనలో తెలుగు కావ్యాలకి, సంస్కృత నాటకాలకి ఉన్న భేద సాదృశ్యాలను తెలియజేయడమే నా పరిశోధన లక్ష్యం. పరిశోధనకు తీసుకున్న నాట్యకావ్యాలను కాలాన్ని చూసినప్పుడు ముందుగా సంస్కృత నాటకాలు వచ్చాయి. ఈ నాటకాలను కాలక్రమాన్ని బట్టి చండకౌశికమ్, తపతీసంవరణం, సుభద్రా ధనంజయం, ఛత్రపతి సామ్రాజ్యమ్ నాటకాలు వరుస క్రమంలో ఉన్నాయి. అందువల్ల నా పరిశోధనలో ఈ వరుసనే పాటించి అధ్యాయాలుగా విభజించాను.

**పరిశోధన అధ్యాయాల విభజన**

నా పరిశోధనా వ్యాసాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించాను.

**మొదటి అధ్యాయం :** కావ్యనాటక లక్షణాలు – పరిచయం

**రెండవ అధ్యాయం :** చండకౌశికమ్ – హరిశ్చంద్రోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన

**మూడవ అధ్యాయం :** తపతీ సంవరణం – తపతీ సంవరణోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన.

**నాల్గవ అధ్యాయం :** సుభద్రా ధనంజయం – సుభద్రా కల్యాణము నాటక కావ్యాల పరిశీలన

**ఐదవ అధ్యాయం :** ఛత్రపతి సామ్రాజ్యమ్ – శ్రీ శివభారతము నాటక కావ్యాల పరిశీలన

నాటక కావ్య లక్షణాలు – పరిచయం అధ్యాయంలలో నాటక శబ్దానికి ఉన్న అర్థాల్ని పేర్కొన్నాను. నాటక ఆవిర్భావ వికాసాలు, నాటకానికి ఆలంకారికులు, పాశ్చాత్య విమర్శకులు ఇచ్చిన నిర్వచనాలను తెలియజేశాను. నాటకాల వర్గీకరణను తెలియజేసి పరిశోధనకు తీసుకున్న నాటకాలను ఆయా వర్గీకరణలో చేర్చాను. నాటక లక్షణాలను తెలియజేసి నాటకం కావ్యం కంటే ఎందుకు విశిష్టమైనో వివరించాను. ప్రబంధ శబ్దానికి నిఘంటువులు ఇచ్చిన అర్థాన్ని పేర్కొని ప్రబంధ శబ్దం ప్రస్తావన ఏయే కావ్యాలలో ఉందో తెలియజేశాను. ప్రబంధ నిర్వచనాలు, ప్రబంధ లక్షణాలు తెలియజేసి నాటకానికి, ప్రబంధానికి ఉన్న భేదసాదృశ్యాలను వివరించాను. తులనాత్మక విమర్శలో అనువాదాల పాత్ర, ఏక, భిన్న ప్రక్రియానువాదాల్ని పేర్కొన్నాను.

మిగిలిన నాల్గు అధ్యాయాలలో కావ్యనాటక కర్తలైన కవుల్ని పరిచయం చేశాను. క్లుప్తంగా కావ్య నాటకాలలో ప్రధానంగా ఉన్న ఇతివృత్తాన్ని పరిచయం చేశాను. ఐదవ అధ్యాయంలో మాత్రం శ్రీ శివభారతంలోని ఇతివృత్తం చారిత్రం కాబట్టి వివిధ పాత్రలను, సంఘటనలను అర్థం చేసుకోవడానికి వీలుగా ఇతివృత్తాన్ని కొంచెం వివరంగా తెలియజేశాను.

కావ్య నాటకాలలోని ఇతివృత్తాన్ని పోల్చి చూసి కేవలం నాటకంలో మాత్రమే ఉన్న కల్పనలు, కేవలం కావ్యంలో మాత్రమే కల్పనలు తెలియజేశాను. ఈ కల్పనల వల్ల నాటక, కావ్యాలకి చేకూరిన ప్రయోజనాన్ని, ఔచిత్యాన్ని తెలియజేశాను.

కావ్య నాటకాలలోని కల్పనలను మూలంతో పోల్చిచూసి మూలంలో ఈ కల్పనలు ఉన్నాయా లేదా ఉంటే ఏ విధంగా ఉన్నాయో తెలియజేశాను. మూలంలో లేని కావ్యనాటకాలు రెండింటిలోనూ ఉన్న కల్పనలలోని భేదాలను వివరించాను.

పాత్ర పోషణలో ఏ పాత్రలు కావ్యనాటకాలలో ఉన్నాయి. ఏ పాత్రలు కావ్య నాటకాలలో లేవు అనే విషయాన్ని తెలియజేశాను. ఆ పాత్ర ద్వారా కవి సాధించిన ప్రయోజనం ఏమిటి? లేకపోతే జరిగిన నష్టం ఏమిటి తెలియజేశాను. ఒక పాత్ర కావ్యంలో ఉదాత్తంగా ఉందా? నాటకంలో ఉదాత్తంగా ఉందా? అనే విషయాన్ని చర్చించాను. ఒక పాత్ర కావ్యంలో ఏ ప్రయోజనాన్ని సాధించింది. అదే పాత్ర నాటకంలో ఏ ప్రయోజనాన్ని సాధించింది అనే విషయాన్ని వివరించాను.

రసపోషణలో కావ్య నాటకాలలో రసపోషణ ఏ విధంగా ఉందో వివరించాను. ఏ సన్నివేశాలలో ఏ రసాలు పోషింపబడ్డాయి, ఏ రసాలు పోషింపబడలేదో తెలియజేశాను. ఆలంకారిక సంప్రదాయం ప్రకారం ఏ విభావ అనుభావాల వల్ల ఏ రసాలు కావ్య నాటకాలలో అభివ్యక్తమయ్యాయో తెలియజేసి వాటి ఆలంబన, ఉద్దీపన విభావాలను కూడ పేర్కొన్నాను.

కావ్య నాటకాలలో ఏ సందర్భాలలో ఏయే వర్ణనలు ఉన్నాయి. అవి రసోద్దీపనకు ఏ విధంగా సహకరించాయో తెలియజేశాను.

చివరగా సింహావలోకనంలో పరిశోధనా ఫలితాలు చెప్పి తెలుగు కావ్యం కన్నా నాటకం ఆస్వాదయోగ్యంగా ఉందా? సంస్కృత నాటకం కన్నా తెలుగు కావ్యం ఆస్వాదయోగ్యంగా ఉందా? అనే విషయాన్ని నా పరిశోధనలో అంచనా వేసే ప్రయత్నం చేశాను.

**పరిశోధనా ఫలితాలు (Findings) :**

**మొదటి అధ్యాయం "నాటక కావ్య లక్షణాలు – పరిచయం"లో నాటక ఆవిర్భావ వికాసాలు,** నాటకానికి ఆలంకారికులు, పాశ్చాత్య విమర్శకులు ఇచ్చిన నిర్వచనాలను, నాటకాల వర్గీకరణ, నాటక లక్షణాలను తెలియజేశాను. ప్రబంధ శబ్ద ప్రస్తావన, ప్రబంధ లక్షణాలు, నాటక, ప్రబంధ భేద సాదృశ్యాలు వివరించాను. తులనాత్మక విమర్శలో అనువాదాల పాత్ర పేర్కొన్నాను.

**రెండవ అధ్యాయం "చండకౌశికమ్ – హరిశ్చంద్రోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన"** చండకౌశికమ్ నాటకం మార్కండేయ పురాణం ఆధారంగా క్షేమీశ్వరుడు రచించాడు. క్షేమీశ్వరుని కల్పనలు కౌశిక, హరిశ్చంద్ర పాత్రలకి ఔన్నత్యాన్ని సంతరించాయి. ఈ నాటకంలోని కల్పనలు మరే ఇతర నాటకాలలోనూ కన్పించవు. హరిశ్చంద్రోపాఖ్యానము కావ్యం స్కాంద పురాణం ఆధారంగా గౌరన రచించాడు. గౌరన కల్పనలు పాత్రపోషణకి, రసపోషణకి దోహదం చేశాయి. గౌరన కల్పించిన కల్పనలను తరువాత కవులు తమతమ కావ్యాలలో ప్రయోగించారు.

నాటకంలో కన్నా కావ్యంలో హరిశ్చంద్రుడు అనేక కష్టాలు అనుభవించాడు. నాటకంలో హరిశ్చంద్రుడు విద్యాత్రయాన్ని రక్షించినందువల్ల కౌశికుడి కోపానికి గురయ్యాడు. కావ్యంలో విశ్వామిత్రుడు వశిష్ఠముని దగ్గర చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చుకోవడానికి హరిశ్చంద్రుడి మీద కోపంతో రాజ్యాన్ని తీసుకుంటాడు. కావ్యంలో విశ్వామిత్రుడి కోపానికి ప్రత్యక్షంగా హరిశ్చంద్రుడు కారణం కాదు. కావ్య నాటకాలు రెండింటిలోనూ హరిశ్చంద్రుడు తనకు ఎదురైన కష్టాలను తట్టుకొని తన సత్యనిష్ఠతో పార్వతీపరమేశ్వరులను మెప్పిస్తాడు.

నాటకం కన్నా కావ్యంలో చంద్రమతి పాత్ర ఉదాత్తంగా ఉంది. కావ్యంలో చంద్రమతి తన తెలివితో భర్తను ఆపదల నుండి కాపాడుతుంది. తన పాతివ్రత్యంతో భర్తను రక్షిస్తుంది. కాలకౌశికుడు, కలహకంఠిల వలన అనేక బాధలు పడుతుంది. భర్త చేతిలో మరణించడం సుకృతంగా భావిస్తుంది. తన పతిభక్తితో పార్వతీ పరమేశ్వరులను మెప్పించి తనమీద పడ్డ నిందని పోగొట్టుకుంటుంది.

నాటకంలో విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడి కారణంగా తనకు వశం కావల్సిన విద్యలు చేజారిపోయాయని హరిశ్చంద్రుడి మీద కోపాన్ని వహిస్తాడు. కావ్యంలో తన పంతం నెగ్గించుకోవడానికి హరిశ్చంద్రుడిని మాట తప్పించడానికి అనేక కష్టాలపాలు చేస్తాడు. నాటకంలో కన్నా కావ్యంలో విశ్వామిత్రుడు మిక్కిలి క్రూరుడు, కుటిలుడు.

కావ్యంలో మాత్రమే నక్షత్రపాత్ర ఉంది. నక్షత్రకుడు చంద్రమతి హరిశ్చంద్రులు అడవిలో అనేక కష్టాలు పడడానికి, హరిశ్చంద్రుడు భార్యాపుత్రుల్ని అమ్ముకోవడానికి కారణం అవుతాడు. కాలకౌశికుడు, కలహకంఠి పాత్రలు చంద్రమతిని అనేక కష్టాలు పెట్టడంవల్ల కావ్యం కరుణ రసాత్మకంగా సాగింది.

నాటకంలో శృంగార రసం శైబ్య హరిశ్చంద్రుల మధ్య పోషింపబడింది. కావ్యంలో శృంగార రసాభాస హరిశ్చంద్రుడు, మాతంగ కన్యల మధ్య వ్యక్తమయింది.

నాటకంలో హాస్యరసం లేదు. కావ్యంలో కాలకౌశికుడి వికృత రూపాన్ని వర్ణించే సందర్భంలో, వటువు కాలకౌశికుడికి, కలహకంఠికి తగాదా పెట్టిన సందర్భంలో హాస్యరసం కన్పిస్తోంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ కరుణరసం ఉంది. హరిశ్చంద్రుడు భార్యాపుత్రులను అమ్ముకోవడం, కుమారుడు మృత్యువాత పడడం మొదలైన ఘట్టాలలో కరుణరసం ఉంది. నాటకంలో కన్నా కావ్యంలో కరుణరసం ఎక్కువగా ఉంది.

కావ్య నాటకాలు రెండింటిలో విశ్వామిత్రుని యందు రౌద్రరసం కన్పిస్తోంది. నాటకంలో కన్నా కావ్యంలో విశ్వామిత్రుడు మిక్కిలి క్రోధవంతుడు. అందువల్ల నాటకంలో కన్నా కావ్యంలో రౌద్రరసం పాళ్లు ఎక్కువ.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వీరరసం ప్రధాన రసంగా ఉంది. అందులోనూ హరిశ్చంద్రుడిలో సత్యవీరం ప్రస్ఫుటమైంది. నాటకంలో విద్యాత్రయాన్ని రక్షించడం, పంటపొలాల్ని నాశనం చేస్తున్న వరాహాన్ని ఎదర్కొనడం వంటి కల్పనలు హరిశ్చంద్రుడి వీరత్వాన్ని తెలియజేస్తాయి. కావ్యంలో భూతాలను, పిశాచాలను ఎదుర్కొనడం విశ్వామిత్రుడి మాయలు ఛేదించడంలో హరిశ్చంద్రుడి వీరత్వం ప్రదర్శితమైంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ హరిశ్చంద్రుడు నివసించే శ్మశాన వర్ణనలో బీభత్సరసం కన్పిస్తోంది. కావ్యంలో వీరబాహుడి గృహవర్ణనలో కూడ బీభత్సరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ భక్తిరసం వ్యక్తమయింది. కావ్యంలో హరిశ్చంద్రుడు కాశీలో విశ్వనాథుని స్తుతించడంలో భక్తిరసం కన్పిస్తే నాటకంలో హరిశ్చంద్రుడు వీరబాహుడు శ్మశానంలో చండికమ్మ స్తుతించడంలో భక్తిరసం కన్పిస్తోంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వత్సలరసం కన్పిస్తోంది. కావ్యంలో చంద్రమతి మహాగ్నినుండి బయటపడిన తరువాత లోహితుడిని దగ్గరికి తీసుకోవడంలో వత్సలరసం కన్పిస్తే, నాటకంలో హరిశ్చంద్రుడు భార్యాపుత్రులను విక్రయించిన తరువాత వటువు రోహితుడిని కిందకి తోసినప్పుడు హరిశ్చంద్రుడు రోహితుడిని ముద్దాడిన సందర్భంలో వత్సలరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వర్ణనలు రసాభివ్యక్తి ఉపయోగపడుతున్నాయి. హరిశ్చంద్ర, ఆశ్రమ, శ్మశాన, సూర్యాస్తమయ వర్ణనలు కావ్య నాటకాలు రెండింటిలోనూ ఉన్నాయి. కావ్యంలో ప్రబంధ లక్షణాలకు అనుగుణంగా వర్ణనలు ఎక్కువగా ఉన్నాయి. నాటకంలో వర్ణనలు నాటక లక్షణాలకు అనుగుణంగా పరిమితంగా ఉన్నాయి.

**మూడవ అధ్యాయం "తపతీ సంవరణం – తపతీ సంవరణోపాఖ్యానము నాటక కావ్యాల పరిశీలన"**లో 'తపతీ సంవరణమ్' నాటకం ఔచిత్యవంతమైన కల్పనలతో అలరారుతోంది. రచయిత నారదుడు, కర్ణపూరం, తపతి పాదవిన్యాసం, సంవరుణుడు మన్మథ సందేశాన్ని తెలిపే పద్యాక్షరాల్ని పూరించడం మొదలైన కల్పనల ద్వారా నాయికా నాయకుల మధ్య అభిలాష విప్రలంభాన్ని కలిగించాడు. కావ్యంలో కేవలం చిలుక ద్వారానే గంగాధరకవి నాయికా నాయకుల మధ్య ప్రణయ రాయబారాన్ని నడిపాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ తపతి చెలికత్తెలుగా రంభా, మేనకలు తపతి వివాహం సంవరుణుడితో జరగడానికి తపతికి అన్ని విధాల సహకరిస్తారు. నాటకంలో తపతికోసం తమ ప్రాణాలు కూడ త్యాగం చేయడానికి సిద్ధపడతారు.

నాటకంలో తపతీ సంవరుణులకు సమాగమానంతరం సూర్యుడి వలన ఎడబాటు కలుగుతుంది. ఈ ఎడబాటు వలన నాటకలో కరుణరసం పోషింపబడింది. తపతి మేనక రూపం ధరించడం, రాక్షసి రంభ రూపం ధరించడంలో అద్భుతరసం, కురుపుత్రుడి పరాక్రమంలో వీరరసం పోషింపబడి నాటకం రసాత్మకంగా సాగింది.

కావ్యంలో సంవరుణుడు అనుకూల నాయకుడు. నాటకంలో సంవరుణుడు దక్షిణనాయకుడు. నాటకంలో సంవరుణుడికి ప్రథమ భార్య దేవి వలన సంతానం లేకపోవడం వలన సంతానార్థం ప్రార్థిస్తాడు. అశరీరవాణి ఆజ్ఞ మేరకు తపతిని వివాహం చేసుకుంటాడు. కావ్యంలో సంవరుణుడికి తపతి గురించి చిలుక చెప్పడం ద్వారా తపతిని వివాహం చేసుకుంటాడు. కావ్యనాటకాలు రెండింటిలోనూ సంవరుణుడి వివాహానికి ముందు అభిలాష విప్రలంభం వ్యక్తమయింది.

వివాహానంతరం సంభోగ శృంగారం అభివ్యక్తమయింది. నాటకంలో వివాహానంతరం వియోగ విప్రలంభాన్ని కూడ సంవరుణుడు ద్వారా వ్యక్తమయింది. కావ్యంలో తపతీ సంవరుణుల ప్రేమ కన్నా నాటకంలో తపతి సంవరుణుల ప్రేమ గొప్పది. నాటకంలో సంవరుణుడు తపతికోసం ప్రాణత్యాగానికి కూడ సిద్ధపడతాడు.

కావ్యంలో తపతి చిలుక ద్వారా సంవరుణుడి గురించి తెలుసుకుంటుంది. నాటకంలో నారదుడి ద్వారా సంవరుణుడి గురించి తెలుసుకుంటుంది. కావ్యంలో చిలుక చెప్పిన సంవరుణుడి అందచందాల వర్ణన వినడం ద్వారా తపతి అభిలాష విప్రలంభాన్ని తద్వారా విప్రలంభంగా వ్యక్తమయింది. నాటకంలో తపతి సంవరుణుడి అందచందాలను కార్తికేయ మందిరంలో అదృశ్యంగా ఉండి వీక్షించడం ద్వారా అభిలాష విప్రలంభాన్ని అనుభవిస్తుంది. నాటకంలో తపతి రాజ్యక్షేమం కోసం తన భర్తకి, లోకకల్యాణంకోసం కుమారుడికి కొంతకాలం దూరంగా ఉంటుంది. సంవరుణుడి కోసం తన ప్రాణాలను ఇవ్వడానికి కూడ వెనుకాడదు. కావ్య నాటకాలు రెండింటిలోనూ తపతి తండ్రి మాట జవదాటదు. కావ్యంలో కన్నా నాటకంలో తపతి పాత్ర ఉదాత్తంగా చిత్రింపబడింది.

నాటకంలో తపతికి వివాహం చెయ్యాలని సూర్యుడు వరాన్వేషణ చేస్తాడు. కావ్యంలో చిలుక తపతికి వరాన్వేషణ చేస్తుంది. చిలుక తన మాటలతో సంవరుణుడిని ఆకట్టుకొని తపతి రూపరేఖల్ని వర్ణించి సంవరుణుడిని విరహవేదనకు గురిచేస్తుంది. తపతికి కూడ సంవరుణుడి అందచందాలను వర్ణించి చెప్పి నాయికా నాయకుల ప్రణయగాధకి చిలుక కర్త, కర్మ, క్రియ ఔతుంది. నాటకంలో సూర్యుడు, నారదుడు, కర్ణపూరం, మన్మథ సందేశం చేసిన కార్యాన్ని కావ్యంలో చిలుక ఒక్కటే సాధించింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వశిష్ఠుడు సంవరుణుడి తపస్సుకి మెచ్చి సూర్యమండలానికి వెళ్ళి సూర్యుడిని తన కుమార్తె అయిన తపతిని సంవరుణుడికి ఇవ్వమని అడుగుతాడు. తపతిని తీసుకువచ్చి సంవరుణుడితో వివాహం జరిపిస్తాడు. కావ్యంలో సంవరుణుడు తపతితో సుఖిస్తూ రాజధర్మాన్ని విస్మరించినపుడు వశిష్ఠుడు సంవరుణుడికి కర్తవ్య బోధ చేస్తాడు. నాటకంలో సంవరుణుడికి రాజ్యంలో క్షామం సంభవించినదని చెప్పి అమాత్యుడు రాజ్యానికి తీసుకువస్తాడు. నాటకంలో వశిష్ఠుడు కురుపుత్రుడిని తీసుకువచ్చి సంవరుణుడికి అప్పగించి కురుపుత్రుడి జన్మ వృత్తాంతాన్ని తపతి సంవరుణులకు వివరంగా తెలియజేస్తాడు.

కావ్యంలో అరుంధతి వశిష్ఠుడితో పాటుగా తపతీ సంవరుణులకి దగ్గరుండి వివాహం చేస్తుంది. నాటకంలో అరుంధతి పాత్ర లేదు.

కావ్యంలో సూర్యుడు వశిష్ఠుడు వచ్చి సంవరుణుడి కోసం తపతిని యివ్వమనగానే వశిష్ఠుడితో తపతిని పంపి చేతులు దులుపుకుంటాడు. నాటకంలో సూర్యుడు తపతికి తగిన వరుదెవ్వరని నారదమహర్షిని అడిగి సంవరుణుడి గురించి తెలుసుకుంటాడు. సంవరుణుడు రాజ ధర్మాన్ని నిర్లక్ష్యం చేసినప్పుడు సూర్యుడు సంవరుణుడి నుండి తపతిని వేరు చేస్తాడు. సంవరుణుడు త్వరగా రాజ్యం చేరుకోవడానికి రథాన్ని, సారథిని పంపిస్తాడు. తపతికి పుత్రవియోగ దుఃఖం కలగకుండ ఆమెను మోహపెడతాడు. తపతికి తెలియకుండ కురుపుత్రుడిని పురిటిలోనే దివ్య ఆహారాలతో పోషించడానికి తీసుకువెళ్తాడు. కావ్యంలో కన్నా నాటకంలో సూర్యుడు పాత్ర ఉదాత్తంగా పోషింపబడింది. నాటకంలో సూర్యుడు తండ్రిగా, మావగారిగా, తాతగా కృతకృత్యుడయ్యాడు.

నాటకంలో విదూషకుడు సంవరుణుడికి అన్ని విధాల చేదోడు వాదోడుగా ఉంటాడు. సంవరుణుడు తపతి వలన విరహ వేదన అనుభవిస్తున్నప్పుడు అతడిని ఊరడిస్తాడు. తపతి కన్పించక ఆవేదన చెందుతూ ఉన్నప్పుడు సంవరుణుడికి ఉపశాంతి కలిగిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ అభిలాష విప్రలంభం, సంభోగ శృంగారం వర్ణింపబడ్డాయి. నాటకంలో విరహ విప్రలంభం వర్ణించబడింది. కావ్య నాటకాలు రెండింటిలోనూ సంవరుణుడు ధీరోదాత్తుడే కావున వీరరసం పోషింపబడింది. నాటకంలో కురుపుత్రుడు రాక్షసిని ధైర్యంగా ఎదుర్కొనడం వలన కురుపుత్రుడిలో కూడ వీరరసం అభివ్యక్తమయింది. నాటకంలో సంవరుణుడికి ముందు సంతానం లేదు. తపతి వలన సంతానం కలుగుతుంది. కురుపుత్రుడు జన్మించడం వలన సంవరుణుడితో వత్సల రసం కన్పిస్తోంది. నాటకంలో వివాహానంతరం తపతీ సంవరుణులకు ఎడబాటు కలగడం వలన కరుణరసం పోషింపబడింది. విదూషకుడి ఆకారచేష్టల వలన హాస్యరసం వ్యక్తమయింది. కావ్య నాటకాలు రెండింటిలోనూ అద్భుతరసం పోషింపబడింది. కావ్యంలో మలయగిరి వర్ణనలో అద్భుతరసం కన్పిస్తోంది. నాటకంలో స్ఫటిక సభా మండపం, సూర్యుడు తపతిని మోహపెట్టడం తపతీ సంవరుణులు తమకు కుమారుడు ఉన్నాడని వశిష్ఠుని ద్వారా తెలుసుకోవడం మొదలైన కల్పనలు అద్భుతరస ప్రధానమైనవే. కావ్య నాటకాలు రెండింటిలోనూ సంవరుణుడి రాజ్యాన్ని అనావృష్టి బాధించడంలో బీభత్సరసం కన్పిస్తోంది. కావ్య నాటకాలు రెండింటిలోనూ సంవరుణుడు తపతికోసం సూర్యుడికోసం తపస్సు చేయడంలో భక్తిరసం కన్పిస్తోంది.

కావ్యనాటకాలు రెండింటిలోనూ శృంగారరసమే ప్రధానరసంగా ఉంది. కావ్యంలో అంగరసాలు వీరం, అద్భుత, బీభత్సరసాలు ఉన్నాయి. నాటకంలో అంగరసాలుగా వీరం, అద్భుత, బీభత్స, కరుణ, హాస్య, వత్సల రసాలు ఉన్నాయి. కావ్యంలో హాస్య, వత్సల, కరుణ రసాలు లేవు.

కావ్యంలో అష్టాదశ వర్ణనలైన నగర, గిరి, వన, ఋతు, చంద్రోదయ, విరహ, జలక్రీడ మొదలైన వర్ణనలు ఎక్కువగా ఉపకరిస్తున్నాయి. నాటకంలో వర్ణనలు చాలా తక్కువగా సందర్భానుగుణంగా ఉండి రసాభివ్యక్తికి ఎక్కువగా తోడ్పడం లేదు.

**నాల్గవ అధ్యాయంలో "సుభద్రా ధనుంజయం – సుభద్రాల్యాణము నాట కావ్యాల పరిశీలన"**లో సుభద్రాధనంజయం నాటకం ఔచిత్యవంతమైన కల్పనలతో అలరారుతోంది. అలంబసుడనే రాక్షసుడు, గాత్రిక, గాత్రిక మీద అర్జునుడి పది పేర్లు ఉండడం మొదలైన కల్పనలు నాటకంలో సుభద్రార్జునులకు అభిలాష విప్రలంభాన్ని కలిగించాయి. కావ్యంలో శ్రీకృష్ణుడి మాటల వలన సుభద్ర కపటయతి రూపంలో వచ్చినది అర్జునుడేనని గ్రహించి అర్జునుడి పట్ల అభిలాష విప్రలంభాన్ని పొందుతుంది.

కావ్యంలో తిమ్మక్క సుభద్రల్యాణ కథకి సుందోపసుందుల వృత్తాంతాన్ని ఆటంకంగా భావించి సుందోపసుందుల కథని సంక్షేపించింది. ధర్మరాజు, అర్జునుల భాతృప్రేమని తెలియజేసింది తిమ్మక్క అర్జునుడి గురించి తెలుసుకోవడం, యతి అర్జునుడి గురించి చెప్పడం వంటి కల్పనలు సుభద్రార్జునుల అనురాగం బలపడడానికి కారణం అయ్యాయి. సుభద్ర అర్జునుడితో మాట్లాడడానికి సిగ్గుపడుతుందని భావించిన తిమ్మక్క మొదట అర్జునుడితో చిలుక చేత మాట్లాడించింది. శ్రీకృష్ణుడిని దివ్యపురుషుడిలా కాకుండా సామాన్య మానవుడిలాగా చిత్రించింది. వదినా మరదళ్ళ వేళాకోళాలు, బావ బావమరుదుల సరదాలతో, తెలుగు నుడికారంతో తిమ్మక్క కావ్యాన్ని రచించింది.

కావ్యంలో కన్నా నాటకంలో అర్జునుడి పాత్ర ఉదాత్తంగా పోషింపబడింది. నాటకంలో సుభద్ర కోసం మరణించాలనుకోవడం, ద్రౌపదికి సపత్నీమత్సరం కలుగుకుండ సుభద్రను గోపాలికా వేషంలో ఇంద్రప్రస్థానికి తీసుకువెళ్లడంలో అర్జునుడి ముందుచూపు, సుభద్ర పట్ల అర్జునుడి ప్రేమ వ్యక్తం అవుతున్నాయి.

నాటకంలో కన్నా కావ్యంలో సుభద్ర తెలివైనది. నాటకంలో సుభద్ర ముగ్గురు పురుషుల్ని ఒకేసారి ప్రేమించానని కులస్త్రీకి ఇది నిషిద్ధం అని ఆత్మ త్యాగానికి సిద్ధపడుతుంది. ఈ ముగ్గురూ ఒక్కరే అనే విషయాన్ని గ్రహించదు. కానీ కావ్యంలో తనతో నర్మగర్భంగా మాట్లాడిన కపటయతి మాటల్ని బట్టి వచ్చినది అర్జునుడేనని తిమ్మక్క సుభద్ర గ్రహిస్తుంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శ్రీకృష్ణుడు సుభద్రార్జునుల వివాహానికి ముఖ్య కారకుడు. కావ్యంలో కపటయతి ఆగడాలు సుభద్ర శ్రీకృష్ణుడికి తెలియజేసిన సందర్భంలో కృష్ణుడు ఆమెను సముదాయిస్తాడు. సుభద్రతో జాగ్రత్తగా వ్యవహరించమని అర్జునుడిని ఆదేశిస్తాడు. నాటకంలో బలరాముడిని శాంతపరచడంలో అత్యంత నేర్పుని ప్రదర్శిస్తాడు.

కావ్యంలో రుక్మిణి సుభద్రార్జునుల వివాహానికి ఎంతగానో తోడ్పడింది. సుభద్ర విరహవేదనను అనుభవిస్తోందని శ్రీకృష్ణుడికి చెప్పడం, సుభద్రను పెళ్ళి కూతుర్ని చెయ్యడం, సుభద్ర అత్తవారింట ఏ విధంగా మెలగాలో తెలియజేస్తుంది. నాటకంలో రుక్మిణి పాత్ర లేదు. కేవలం నాటకంలో సంభాషణలలోనే రుక్మిణి ప్రస్తావన వస్తుంది.

కావ్యంలో ద్రౌపది సుభద్రతో తన భర్తని పంచుకుంటునందుకు బాధపడుతుంది. మళ్ళీ సుభద్ర శ్రీకృష్ణుడి చెల్లెలు కాబట్టి సర్దుకుపోవాలనుకుంటుంది. నాటకంలో ద్రౌపది సుభద్ర క్షేమాన్ని కోరుకుంటుంది.

విదూషకుడి పాత్ర కేవలం నాటకంలోనే ఉంది. విదూషకుడు తన స్నేహితుడైన అర్జునుడికి అడుగడుగునా సహాయం చేస్తాడు. అవసరమైనప్పుడు తగిన సలహాలు ఇచ్చి, అర్జునుడిలో ధైర్యాన్ని నింపి, కార్యోన్ముఖుడిని చేస్తాడు. అర్జునుడు సుభద్ర వివాహం చేసుకోవడానికి విదూషకుడు ఎంతో ఉపయోగపడతాడు. విదూషకుడి ద్వారా నాటకంలో హాస్యరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ బలరాముడికి సుభద్రాధనంజయం వివాహం ఇష్టం ఉండదు. కావ్యంలో కన్నా నాటకంలో బలరాముడు మిక్కిలి క్రోధవంతుడు.

కావ్య నాటాలు రెండింటిలోనూ శృంగారరసం ప్రధానరసంగా, మిగిలిన రసాలు అంగరసాలుగా ఉన్నాయి. కావ్య నాటకాలు రెండింటిలోనూ సుభద్రార్జునులు వివాహానికి ముందు విరహవేదన అనుభవించడం వలన అభిలాష విప్రలంభం, వివాహానంతరం సంభోగ శృంగారం పోషింపబడింది. నాటకంలో సుభద్ర అపహరించడం వలన అర్జునుడు ఆవేదన చెందడం వలన నాటకంలో విరహ విప్రలంభం కూడ పోషింపబడింది.

నాటకంలో విదూషకుడు స్త్రీలు ధరించే ఆభరణాలను ధరించడంలో హాస్యరసం వ్యక్తమైంది. కావ్యంలో కృష్ణుడు అర్జునుడిని ఆటపట్టించడం వలన హాస్యరసం వ్యక్తమైంది. నాటకంలో సుభద్రని రాక్షసుడు అపహరించడం వలన కరుణరసం అభివ్యక్తమైంది. కావ్యంలో కరుణరసం లేదు. కావ్య నాటకాలు రెండింటిలోనూ అర్జునుడు యాదవ వీరులను ఎదుర్కొనే సందర్భంలో రౌద్రరసం వ్యక్తమైంది.

నాటకంలో అర్జునుడు రాక్షసుడిని ఎదిరించాలనుకోవడంలో కూడ రౌద్రరసం పోషింపబడింది. కావ్యంలో అర్జునుడి ప్రతాపాన్ని శ్రీకృష్ణుడు, విదూషకుడు కీర్తించడం వలన వీరరసం పోషింపబడింది. కావ్యంలో సుభద్ర పట్ల చూపే సోదరప్రేమలో వత్సల రసం అభివ్యక్తమైంది. నాటకకంలో వత్సల రసం లేదు. కావ్యంలో అర్జునుడు వివాహానంతరం రుక్మిణి, శ్రీకృష్ణులను స్తుతించే సందర్భంలో భక్తిరసం కన్పిస్తోంది. నాటకంలో అపహరింపబడిన సుభద్ర కాత్యాయనిదేవి రక్షించిన సందర్భంలో అర్జునుడు భక్తితో కాత్యాయనిదేవిని స్తుతించడంలో భక్తిరసం అభివ్యక్తమైంది.

శృంగార, హాస్య, రౌద్ర, వీర, భక్తి రసాలు కావ్య నాటకాలు రెండింటిలోనూ ఉన్నాయి. వత్సల రసం కావ్యంలో మాత్రమే ఉంది. కరుణ, అద్భుత రసాలు నాటకంలో మాత్రమే ఉన్నాయి.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వర్ణనలు రసాభివ్యక్తి ఉపయోగపడుతున్నాయి. సుభద్రార్జునుల వర్ణనలు కావ్య నాటకాలు రెండింటిలోనూ ఉన్నాయి. కావ్యంలో వర్ణనలు విస్తృతంగా ఉన్నాయి. నాటకంలో వర్ణనలు సందర్భానుగుణంగా పరిమితంగా ఉన్నాయి.

**ఐదవ అధ్యాయం ఛత్రపతి సామ్రాజ్యమ్ – శ్రీ శివభారతము నాటక కావ్యాల పరిశీలన"**లో, గడియారం వేంకట శేషశాస్త్రి గారు శ్రీ శివభారతము కావ్య రచన చేసే సమయంలో శివాజీ జీవిత చరిత్రలోని శివాజీ ప్రతిష్ఠకి భంగం కలిగించే అంశాలను పరిహరించి శివాజీని ఉత్తమ చారిత్రక పౌరుడిగా తీర్చిదిద్దారు. మూలశంకర మాణిక్‌లాల్ కూడ ఛత్రపతి సామ్రాజ్యం నాటకంలో శివాజీ సామ్రాజ్యాన్ని స్థాపించడానికి అవసరమైన సంఘటనలతో నాటకాన్ని రాశారు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ వీరు పురుషుడు. కావ్యంలో శివాజీలో దాన, ధర్మ వీరాలు కూడ పోషింపబడ్డాయి. సమర్థ రామదాస స్వామికి రాజ్యాన్ని దానంగా ఇవ్వండంలో దానవీరం, శత్రువులను కూడ కరుణించి విడిచి పెట్టడంలో యుద్ధవీరం కన్పిస్తోంది. నాటకంలో కన్నా కావ్యంలో శివాజీ ఉదాత్తంగా చిత్రింపబడ్డాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ జీజియ ధీరవనిత. నాటకంలో కన్నా కావ్యంలో జీజియ పాత్రకి నిడివి ఎక్కువ. కావ్యంలో జీజియ శివాజీని తీర్చిదిద్ది తను అనుకున్నది సాధించింది. కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ రాజ్యంలో లేని సమయంలో రాచకార్యాలను కూడా జీజియ చక్కబెడుతుంది.

నాటకంలో కంటె కావ్యంలో దాదోజీ పాత్రకి విస్తృతి ఎక్కువ. షాజీ దగ్గరలేని సమయంలో జీజియాకి అండగా నిలుస్తాడు. శివాజీ జన్మించిన విషయాన్ని షాజీకి తెలియజేస్తాడు. శివాజీకి

రాజనీతి విద్యలను నేర్పి సకల విద్యాపారంగతుడిని చేస్తాడు. నాటకంలో దాదోజీ శివాజీకి కేవలం రాజనీతి విషయాలు మాత్రమే బోధిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ సయీబాయి పాత్రకి నిడివి తక్కువ. శివాజీ మనసెరిగి ఈమె ప్రవర్తిస్తుంది. కావ్యంలో షాజీని నవాబ్ నిర్బంధించినప్పుడు శివాజీకి ఏం చెయ్యాలో తోచని సమయంలో పరిష్కారం కోసం భవానిదేవిని ప్రార్థించమని సలహా ఇస్తుంది.

కావ్యంలో షాజీ నిజామ్ పక్షం వహిస్తాడు. చివరికి ఆ నిజామ్ చేతిలో బందీ అవుతాడు. అయినా కూడ నిజామ్‌ని విడువడు. శివాజీ కీర్తి ప్రతిష్ఠలు చూసి ఆనందిస్తాడు. శివాజీ తీర్చిదిద్దిన జీజియాని ప్రశంసిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ బాజీ ప్రభువు వీరుడు. పదిహేనువేల బీజాపూర్ సేనతో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన ధీరుడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ మంత్రిగా తానాజీ ఉంటాడు. కావ్యంలో తానాజీ తన కుమారుడి వివాహాన్ని కూడా లెక్కచేయక సింహగడ్‌ను జయించడానికి వెళ్ళి వీరమరణం పొందుతాడు. నాటకంలో షాజీని నవాబ్ బంధించినప్పుడు సహాయం కోసం ఢిల్లీ పాదుషాకి లేఖ రాయమని శివాజీకి సలహాయిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ వీరరసం ప్రధానరసంగా ఉంది. కావ్యంలో దాన, దయ, యుద్ధ, ధర్మాలు వీరాలు పోషింపబడ్డాయి. నాటకంలో దయా, యుద్ధ వీరాలు మాత్రమే పోషింపబడ్డాయి.

నాటకంలో కన్నా కావ్యంలో కరుణరసం మిక్కుటముగా పోషింపబడింది. కావ్యంలో లుకజీ, దాదోజీ, షాజీ, తానాజీ, బాజీ ప్రభువు మరణాలవల్ల కావ్యంలో కరుణరసం ఎక్కువగా పోషింపబడింది. తానాజీ, బాజీ ప్రభువుల వీర మరణాలు పొందడంలో నాటకంలో కరుణరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ భక్తి రసం కన్పిస్తోంది. కావ్యంలో తండ్రిని విడిపించే మార్గం కోసం శివాజీ భవానిదేవిని ప్రార్థిస్తే నాటకంలో సామ్రాజ్య స్థాపనకోసం శివాజీ భవానిదేవిని ప్రార్థిస్తాడు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ జీజియాలో వత్సలరసం కన్పిస్తోంది. కావ్యంలో శివాజీ స్వతంత్ర సామ్రాజ్యాన్ని స్థాపిస్తానన్న సమయంలో జీజియ శివాజీ పట్ల వాత్సల్యాన్ని కనబరుస్తుంది.

నాటకంలో శివాజీ ఔరంగజేబు బందీ నుండి తప్పించుకొని తిరిగి రాజ్యానికి వచ్చినప్పుడు శివాజీ పట్ల వాత్సల్యాన్ని వ్యక్తం చేస్తుంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ అద్భుతరసం కన్పిస్తోంది. కావ్యంలో శివాజీ గోవులను రక్షించినప్పుడు జీజియ ఆనందంతో విస్మయానికి లోనౌతుంది. నాటకంలో రాజ్యానికి తిరిగి వచ్చిన కుమారుడికి చూసి ఆశ్చర్యానికి లోనౌతుంది.

కావ్యంలో సింహగడ్‌ను జయించడానికి వెళ్ళిన తానాజీ శత్రువులతో యుద్ధం చేసిన తీరులో బీభత్సరసం అభివ్యక్తమయింది. నాటకంలో బీభత్సరసం లేదు.

కావ్య నాటకాలు రెండింటిలోనూ రౌద్రరసం కన్పిస్తోంది. శివాజీ అఫ్జల్‌ఖాన్‌ను వధించే సమయంలో రౌద్రరసం అభివ్యక్తమయింది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శృంగారరసం లేదు. నాటకంలో కేవలం ఒక గీతంలో మాత్రమే సూచన ప్రాయంగా శృంగారరసం కన్పిస్తోంది.

కావ్య నాటకాలు రెండింటిలోనూ శివాజీ శౌర్య, ప్రతాపాల వర్ణనల వలన వీరరసం పోషింపబడింది. కావ్యంలో విస్తృత వర్ణనలు ఆనాటి మహారాష్ట్రుల స్థితిగతులు, మంత్రాంగం, వీరులు యుద్ధానికి వెళ్ళేటప్పుడు అలంకరించే తీరు మొదలైన విషయాలు తెలియజేశాయి. నాటకంలో వర్ణనలు చాలా తక్కువగా ఉన్నాయి. శివాజీ వర్ణన, దుర్గాల వర్ణనలు నాటకంలో ఉన్నాయి.

పై అధ్యాయాలలో పేర్కొన్న నాల్గు నాటకాలను, కావ్యాలను పరిశీలించినప్పుడు సంస్కృత నాటకాల్ని చూసి తెలుగు కావ్యాలు రచించారు అని చెప్పడానికి ఆధారాలు ఎక్కడా లేవు. చండకౌశికమ్, హరిశ్చంద్రోపాఖ్యానములను తులనాత్మక పరిశోధన చేసినప్పుడు చండకౌశికమ్ కంటే హరిశ్చంద్రోపాఖ్యానము పాత్రపోషణలోనూ, రసపోషణలోనూ, వర్ణనలలోనూ మిక్కిలి ఆస్వాదయోగ్యంగా ఉంది. తపతీసంవరణం, తపతీసంవరణోపాఖ్యానములను పోల్చి చూసినప్పుడు కావ్యం కంటే నాటకం అనేక కల్పనలతో ప్రేక్షకుల మన్ననలను పొందింది. సుభద్రాధనంజయం, సుభద్రాకల్యాణములను పరిశీలించినప్పుడు నాటకంలో కల్పనలు ఎక్కువగా ఉంటే కావ్యంలో రసపోషణ ఎక్కువగా కావ్యనాటకాలు రెండూ ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి. ఛత్రపతి సామ్రాజ్యమ్, శ్రీశివభారతము పరిశీలించగా నాటకంలో కేవలం శివాజీ సామ్రాజ్యాన్ని ఏ విధంగా

స్థాపించాడో మాత్రమే ఉంది. కావ్యంలో శివాజీ జన్మించడానికి పూర్వం ఉన్న పరిస్థితుల దగ్గర నుండి శివాజీ సామ్రాజ్య స్థాపన చెయ్యడం వరకు ఉంది. కావ్యం రసనిర్వహణ, పాత్రచిత్రణ, వర్ణనలలో అనేకమంది పాఠకుల మన్ననలను పొందింది.

**ఉపయుక్త గ్రంథసూచి (సంక్షిప్తంగా) (Selected Bibliography) :**


- అప్పారావు పి.యస్., పోణంగి. (అనువాదము), ***నాట్యశాస్త్రము.*** హైదరాబాదు : నాట్యమాల ప్రచురణ, 1982.
- కృష్ణబాబు, జోశ్యుల. ***తెలుగులో హరిశ్చంద్ర నాటకాలు తులనాత్మక పరిశీలన.*** పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం, (అ.సి.గ్రం), తెలుగు విశ్వవిద్యాలయం,1995.
- గోపాలరెడ్డి, సుజాతారెడ్డి, ముదిగంటి. ***సంస్కృత సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము ప్రచురణ, 1986.
- తిమ్మక్క, తాళ్ళపాక. ***సుభద్రా కల్యాణము.*** ప్రభాకరశాస్త్రి వేటూరి (పరిష్కరణ)
- పద్మావతి, ఎస్. ***శివభారతం పరిశీలన*** ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం, (అ.సి.గ్రం), ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ : 1978.
- పెరుమాళ్ళయ్య, తేవప్ప. ***హరిశ్చంద్రోపాఖ్యానము.*** తంజావూరు : ఆనందముద్రా యంత్రాలయం, 1911.
- ప్రభావతి, వాసా. ***ఆంధ్ర సాహిత్యంలో హరిశ్చంద్రో పాఖ్యానము.*** హైదరాబాదు : స్నేహలతా ప్రింటర్స్, 1987.
- రాజేశ్వరి, సి. ***ఆంధ్రమున ప్రబంధ రూపము నొందిన సంస్కృత నాటకములు.*** హైదరాబాద్: మాధవీబుక్ సెంటర్, 1982.
- వారిజారాణి, పి. ***తెలుగు సంస్కృత కావ్యాలలో ప్రక్రియా భేదంతో వచ్చిన ఒకే ఇతివృత్త కావ్యాల అధ్యయనం.*** పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, (అ.సి.గ్రం), హైదరాబాద్: 2003.
- వెంకటరామశాస్త్రి, వేదం. (టిప్పణి) ***హరిశ్చంద్ర ద్విపద.*** జ్యోతిష్మతీ ముద్రాక్షరశాల, 1912.
- వేంకటశాస్త్రి, గడియారము. ***శ్రీశివభారతము.*** నాల్గవ ముద్రణ, ప్రొద్దుటూరు :1965.

- శ్రీరామచంద్రుడు, పుల్లెల. (వ్యాఖ్యానం) ***నాట్యశాస్త్రమ్.*** హైదరాబాద్ : 2014.
- **సంస్కృత గ్రంథాలు**
- ఉన్ని, ఎన్.పి. & బ్రూస్ ఎమ్. సుల్లివాన్ (అనువాదం) ***తపతీ – సంవరణమ్.*** ఢిల్లీ : నాగ్ పబ్లిషర్స్, 1995.
- ఉన్ని, ఎన్.పి. & బ్రూస్ ఎమ్. సుల్లివాన్ (అనువాదం) ***సుభద్రా ధనంజయ.*** మొదటి సంపుటి, ఢిల్లీ : నాగ్ పబ్లిషర్స్, 2001.
- సిబానిదాస్ గుప్త (ముద్రణ), ***ద చండకౌశిక.*** కలకత్తా : ఏషియాటిక్ సొసైటీ, 1962.


Signature of the Supervisor
(Prof. R.V.R.K. Sastry)

Signature of the Researcher
(Satya Gayatri Janamanchi)